# హదీసు మకరందం (బులూఘుల్ మరామ్) - 1

[ తెలుగు ]

# بـــلـــوغ المـــرام - 1

[اللغة التلغو ]


**రబువ జాలియాత్**

**الجاليات بالربوة**

**ఇబ్నె హజర్**

**ابن هجر**

**అనువాదం : - అజీజుర్రహ్మాన్**

**ترجمة: - عزيز الرحمان**

**పునర్విమర్శ : ముహమ్మద్ కరీముల్లాహ్**

**مراجعة: محمد كريم الله**



**రబువ జాలియాత్ - రియాద్**

**المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة بمدينة الرياض**

**2009 –1430**

islamhouse.com

بسم الله الرحمن الرحيم

# హదీసు మకరందం

## బులూఘుల్ మరామ్

### మొదటి భాగం

సంకలనం

**అబుల్ ఫజల్ షిహాబుద్దీన్ అహ్మద్ ఇబ్నె హజర్ అస్ఖలానీ**

వ్యాఖ్యానం

**మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి**

తెలుగు అనువాదం

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్**

**హైదరాబాద్-59.**

# Hadeesu Makarandam - **Part-1**

## Bulugh Al-Maram (Telugu)

*Compiled by* : **Al-Hafiz Ibn Hajar Al-Asqalani**

*Commentary* : **Maulana Safi-ur-Rahman Mubarakpoori**

Translation in Telugu : **Muhammed Azeez-ur-Rahman**

***All Rights Reserved with Publishers***

*First Edition* : May, 2002

Copies : 2000

***Price*** **: Rs.250**

*Publishers* : **AL HAQ TELUGU PUBLICATIONS**
**Eidgah Compound, Akbar Bagh**
**Sayeedabad, Hyderabad - 500 059.**
**Phone : 4550007**

*Typeset at* : Golden Graphics
Chatta Bazar, Hyderabad.
Phone : 6700401

*Printed at* : Kala Jyoti Process Ltd.
Hyderabad.

# అంకితం

అహరహం ఏదో చేయాలనే ఆరాటంతో అనుక్షణం శ్రమిస్తూ,
అడుగడుగునా అనుచరులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ,
తాను చేపట్టిన బృహత్తర పథకాలన్నింటికీ దైవగ్రంథాన్నే ప్రాతిపదికగా చేసి,
తెలుగులో ఇస్లామీయ సాహిత్యాన్ని ఉన్నత స్థాయిలో వెలువరించాలని పరితపిస్తూ,
ప్రవేశ పరీక్షల ద్వారా పల్లెసీమల్లో ప్రతిభా వ్యుత్పత్తులను అన్వేషిస్తూ,
అరకొర సౌకర్యాలతోనే అద్భుత ఫలితాలను సాధిస్తూ,
అంతిమ దైవసందేశహరులు (సఅసం) పంచిన ప్రేమపరిమళ ధారను
తెలుగునాట నలుమూలలా వ్యాపింపజేయాలని ఉవ్విళ్ళూరుతూ,
తన స్వప్నం సాకారమవుతుండగానే మనందరినీ వీడి,
ఆశలకు అభిలాషలకు అతీతమైన ఊర్ధ్వలోకాలకు ప్రస్థానం చేసిన
**అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్** వ్యవస్థాపకులు,
గురువర్యులు హాఫిజ్, ఖారీ **మౌలానా ముహమ్మద్ తఖీయుద్దీన్** (రహ్మ.లై) గార్కి
అంకితం ఈ గ్రంథం.

**అజీజుర్రహ్మాన్**
**డైరెక్టర్, అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్**

# ఆకాంక్ష!

విశ్వవిఖ్యాత హదీసు గ్రంథం **"బులూఘ్-అల్-మరామ్"** ను అల్ హఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలోని **'అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్'** తెలుగులో ప్రచురించటం శుభసూచకం. అంతిమ దైవ సందేశహరులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనల సుగంధ పరిమళాన్ని తెలుగునాట గుబాళించే ప్రయత్నంలో ఈ పుస్తక ముద్రణ కూడా ఓ ప్రధాన ఘట్టమని మా అభిప్రాయం. ఇంతకు ముందు **అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్** ప్రచురించిన **"అల్లూలూ వల్ మరజాన్"** (మహాప్రవక్త-స-మహితోక్తులు) హదీసు గ్రంథానికి తెలుగు పాఠకుల నుండి లభిస్తున్న ఆదరణ మరుపురానిది. ఇప్పుడు మీ ముందున్న ఈ **'హదీసు మకరందం'** కూడా మనందరి ధర్మావగాహనలో దోహదకారి కాగలదని భావిస్తున్నాము.

దైవచిత్తమయితే హదీసు, సీరత్‌లపై తెలుగులో మరెన్నో అమూల్యమైన గ్రంథాలను మీ ముందుకు తీసుకురావాలన్నది మా ఆకాంక్ష. కరుణామయుడైన అల్లాహ్ కటాక్షిస్తే, పాఠకులైన మీరంతా ఆదరువుగా నిలిస్తే ఈ ఆకాంక్ష నెరవేరటం అసంభవమేమీ కాదు. ఈ పుస్తక ముద్రణలో తోడ్పడిన శ్రేయోభిలాషులందరికీ దైవం ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థన (ఆమీన్).

**షేఖ్ అబ్దుల్లాహ్ సిద్దీఖీ అల్ అమూది**
**ప్రెసిడెంట్,**
**అల్ హఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, హైదరాబాద్.**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | **తొలిపలుకులు** | ix |
| **1.** | **శుచీ శుభ్రతల పుస్తకం** | **1** |
| | 1వ అధ్యాయం : నీళ్ళ రకాలు | 1 |
| | 2వ అధ్యాయం : వంటపాత్రలు | 15 |
| | 3వ అధ్యాయం : మాలిన్యం, దాన్ని దూరం చేసే విధము | 20 |
| | 4వ అధ్యాయం : వుజూ | 27 |
| | 5వ అధ్యాయం : మేజోళ్ళపై మసహ్ చేయటం | 43 |
| | 6వ అధ్యాయం : వుజూను భంగపరిచే విషయాలు | 49 |
| | 7వ అధ్యాయం : కాలకృత్యాలు తీర్చుకునే పద్ధతి | 62 |
| | 8వ అధ్యాయం : గుసుల్ మరియు జనాబత్ | 72 |
| | 9వ అధ్యాయం : తయమ్ముమ్ | 83 |
| | 10వ అధ్యాయం : రుతుస్రావానికి సంబంధించిన ఆదేశాలు | 91 |
| **2.** | **నమాజ్ పుస్తకం** | **102** |
| | 1వ అధ్యాయం : నమాజ్ వేళలు | 102 |
| | 2వ అధ్యాయం : అజాన్ | 115 |
| | 3వ అధ్యాయం : నమాజ్కై షరతులు | 129 |
| | 4వ అధ్యాయం : సుత్రా (తెర లేక అడ్డు) | 142 |
| | 5వ అధ్యాయం : నమాజ్లో అశక్తత, అణకువ | 147 |
| | 6వ అధ్యాయం : మస్జిద్ వ్యవస్థ | 153 |
| | 7వ అధ్యాయం : నమాజ్ చేసే విధానం | 161 |
| | 8వ అధ్యాయం : సహూ సజ్దాలు | 209 |
| | 9వ అధ్యాయం : నఫిల్ నమాజులు | 224 |
| | 10వ అధ్యాయం : సామూహిక నమాజ్ మరియు ఇమామత్ | 246 |
| | 11వ అధ్యాయం : ప్రయాణీకుల, వ్యాధిగ్రస్తుల నమాజ్ | 267 |
| | 12వ అధ్యాయం : జుమా నమాజ్ | 275 |

13వ అధ్యాయం : భయస్థితిలో నమాజ్ (సలాతుల్ ఖౌఫ్) 292
14వ అధ్యాయం : పండుగల నమాజ్ 297
15వ అధ్యాయం : గ్రహణ సమయాలలో నమాజ్ (సలాతుల్ కుసూఫ్) 306
16వ అధ్యాయం : వర్షం కొరకు నమాజ్ (సలాతుల్ ఇస్తిస్ఖా) 313
17వ అధ్యాయం : వస్త్రధారణ 323

**3. అంత్యక్రియల పుస్తకం 328**

**4. జకాత్ పుస్తకం 366**

1వ అధ్యాయం : సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రాదానం) 383
2వ అధ్యాయం : స్వచ్ఛంద దాన ధర్మాలు 385
3వ అధ్యాయం : దానధర్మాల పంపిణీ 394

**5. ఉపవాసాల పుస్తకం 401**

ఉపవాస నియమాలు 401
1వ అధ్యాయం : నఫిల్ ఉపవాసాలు మరియు నిషిద్ధ ఉపవాసాలు 417
2వ అధ్యాయం : ఏతెకాఫ్ - ఖియామె రమజాన్ 424

**6. హజ్జ్ పుస్తకం 429**

1వ అధ్యాయం : హజ్జ్ మహత్తు 429
2వ అధ్యాయం : మీఖాత్ (ఇహ్రామ్ పూనవలసిన ప్రదేశాలు) 436
3వ అధ్యాయం : ఇహ్రామ్ రకాలు - వాటి గుణాలు 438
4వ అధ్యాయం : ఇహ్రామ్ - తత్సంబంధిత విషయాలు 439
5వ అధ్యాయం : హజ్జ్ తీరు - మక్కాలో ప్రవేశించే విధము 448
6వ అధ్యాయం : హజ్జ్‌ను కోల్పోయినవారు, ఆపబడినవారు 469

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# తొలి పలుకులు

**సు**ప్రసిద్ధ హదీసు గ్రంథం **"బులూఘుల్ మరామ్"** కు తెలుగు అనువాదం ఈ కృతి. తెలుగు పాఠకుల ప్రయోజనార్థం ఈ అనువాదం సమర్పించబడుతోంది. ధర్మాదేశాలతో కూడుకున్న ఈ హదీసుల అనువాదంతోపాటు సంక్షిప్త వ్యాఖ్యానం కూడా ఇవ్వబడింది. క్లుప్తంగా హదీసు ఉల్లేఖకుల పరిచయం కూడా చేయబడింది. తెలుగు అనువాదం కోసం ఎంపిక చేయబడిన మూలం ఎంతో విశిష్ఠమయింది. మూలగ్రంథమైన **"బులూఘుల్ మరామ్"**కు అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. కొన్ని వ్యాఖ్యానాలయితే అనేక సంపుటాలుగా వెలువడ్డాయి. అయితే మీ ముందున్న తెలుగు అనువాదం కోసం భారత దేశ ప్రఖ్యాత విద్వాంసులు మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి గారి వ్యాఖ్యాన ప్రతిని ఎన్నుకోవటం జరిగింది. ఎంతో సంక్షిప్తంగా, సరళంగా ఉన్న ఈ వ్యాఖ్యానాన్ని తెలుగు నాట ప్రాచుర్యంలోకి తీసుకు వస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి గారికి హదీసు, సీరత్‌లపై మంచి పట్టు ఉంది. మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవితచరిత్రపై ఆయన వ్రాసిన ఒక పుస్తకానికి మక్కా ముకర్రమాలోని "రాబిత ఆలమె ఇస్లామీ" సంస్థ తరపున ప్రథమ బహుమతి లభించింది. దీన్నిబట్టి ఆయన ఏ స్థాయికి చెందిన విద్వాంసులో ఊహించవచ్చు.

"హదీసు" అనే అంశంపై రెండు రకాల పుస్తకాలు సాధారణంగా మన దృష్టికి వస్తాయి. మొదటి రకం: హదీసు మాతృగ్రంథాలు. ఉదాహరణకు సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం మొదలగునవి. ఈ గ్రంథాలలో హదీసుతోపాటు దాని పుట్టుపూర్వోత్తరాలు, దాన్ని అందజేసిన వారి పరంపర కూడా పేర్కొనబడుతుంది. రెండవ రకం: ఇందులో హదీసు సంకలనాలుంటాయి. ఉదాహరణకు 'మిష్కాత్', 'బులూగుల్ మరామ్' ఇత్యాదివి. ఇస్లామీయ ధర్మవేత్తలు, హదీసు వేత్తలు తమ తమ అభిరుచికి అనుగుణంగా హదీసు మూల గ్రంథాలనుంచి ఎంచుకున్న వివిధ హదీసుల క్రోడీకరణే రెండవ రకం హదీసు పుస్తకాలు. మొదటి రకం హదీసు గ్రంథాలను పండితులు, హదీసు అవగాహన

ఉన్న వారే అర్థం చేసుకోగలుగుతారు. అయితే రెండవ రకం హదీసు పుస్తకాలు సామాన్య జనులకు ఎక్కువగా ఉపయోగపడేవిగా ఉంటాయి. ఎందుకంటే వీటి శైలి సరళంగా ఉంటుంది. ఒకే అధ్యాయంలో అనేక మూలగ్రంథాల సారం లభిస్తుంది. అందుకే ధార్మిక విద్యాపీఠాలలో కూడా - ప్రాథమిక తరగతుల్లో ఇలాంటి "హదీసు సంకలనాలే" బోధించబడతాయి. పై తరగతులలో, పరిశోధనా విభాగాలలో చదివే విద్యార్థులకు మాత్రమే సహీహ్ బుఖారీ వంటి మూలగ్రంథాలు బోధింపబడతాయి.

ఇటువంటి హదీసు సంకలనాలనేకముండగా కొన్నింటికి మాత్రమే అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. వాటిలో "బులూఘుల్ మరామ్" కూడా ఒకటి. హదీసు గనులలో **"బులూఘుల్ మరామ్"**కు లభించిన కీర్తికి కారణాలు రెండు. పుస్తకం కొరకు ఎన్నుకున్న హదీసులు, వాటి కూర్పు ఒక కారణమైతే, వీటి సంకలనకర్త హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై) వ్యక్తిత్వం మరో కారణం.

## అల్లామా హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మాలై) గురించి

అబుల్ ఫజల్ అహ్మద్ బిన్ అలీ బిన్ ముహమ్మద్ బిన్ హజర్ అస్ఖలానీ హిజ్రీ శకం 773 షాబాన్ నెలలో ఈజిప్టులో జన్మించారు. ఆయన వంశస్థులంతా ధార్మికులు. ధార్మిక విద్యాభ్యాసం కోసం ఈయన్ని ఒక ప్రాథమిక దీనీ మదర్సాలో చేర్పించారు. తొమ్మిదేళ్ల వయస్సులో ఈయన దివ్య ఖుర్ఆన్‌ను కంఠస్థం చేశారు. ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయిన తరువాత, ధార్మిక శిక్షణ నిమిత్తం ఈయన హిజాజ్, బైతుల్ మఖ్దిస్, డెమాస్కస్, యమన్ తదితర ప్రాంతా లలో పర్యటించి ఆ కాలంనాటి విశ్వవిఖ్యాత విద్వాంసులందరినీ కలుసుకున్నారు. వారి సాన్నిధ్యంలో గడిపి ఖుర్ఆన్, హదీసు, ఫికహ్ విద్య మరియు అరబీ సాహిత్యంపై పట్టును సంపాయించారు. ముఖ్యంగా హదీసుపట్ల ఆయనలో ఎంతో ఆసక్తి, జిజ్ఞాస కలిగాయి. హదీసు విద్యలో అపారమయిన పాండిత్యాన్ని సంపాదించి తన కాలపు ఇమామ్‌గా పిలువబడ్డారు. ఈ కారణంగానే ఆయన పేరుతో పాటు 'హాఫిజ్' అనే పదం లిఖించబడుతుంది. ఆయన ఒక్క ఖుర్ఆన్‌కు మాత్రమే కాదు, హదీసుకు కూడా హాఫిజ్‌గానే భావించబడేవారు. దాదాపు 150 రచనలు చేశారు. వాటిల్లో చాలా వరకు హదీసు విద్యకు సంబంధించిన రచనలే. అందులో కొన్ని రచనలు పరిశోధనాత్మక గ్రంథాలుగా ఖ్యాతి చెందాయి. ప్రఖ్యాత పండితులు, ధర్మశాస్త్ర కోవిదులు

ఈ రచనల రెఫరెన్సు ఇచ్చేవారు. నేటికీ ఈయన రచనలు ధార్మిక విజ్ఞాన జగత్తులో ప్రామాణిక గ్రంథాలుగా పరిగణించబడతాయి.

ఆయన ఈజిప్టులో ధార్మిక అధ్యాపకునిగా, ఉపన్యాసకునిగా, ముఫ్తీగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండేవారు. అనంతరం ఖాజియుల్ ఖుజాత్ (ప్రధాన న్యాయమూర్తి) హోదా వరించింది. సహచరుల ప్రోద్బలంపై అతి కష్టమ్మీద ఆయన ఈ పదవికి అంగీకరించారు. ఆ కాలంలో షరీయత్ పట్ల, పరిస్థితుల స్వరూపం పట్ల పూర్తి అవగాహన ఉన్న వారికి మాత్రమే ఈ పదవి ఇవ్వబడేది. జీవిత కాలమంతా ధార్మిక సేవలో వెచ్చించిన హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ హి.శ. 852 జిల్ హజ్జ్ నెలలో పరలోకానికి ప్రస్థానం చేశారు.

గ్రంథ రచయిత ధర్మాదేశాలను, దైనందిన జీవితంలో ఒక మనిషికి ఎదురయ్యే ధర్మ సందేహాలకు సంబంధించిన హదీసులను ఈ పుస్తకంలో క్రోడీకరించారు. ప్రతివ్యక్తీ వీటిని తెలుసుకోవటం ఎంతైనా అవసరం. హదీసుకు సంబంధించిన ఈ గ్రంథం సంక్షిప్తమైనదైనప్పటికీ ఎన్నో పెద్ద పెద్ద గ్రంథాలలోని సారాంశమంతా చక్కగా సమకూర్చటం జరిగింది. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు అల్లామా అస్ఖలానీ హదీసు విభాగంలో గొప్ప ఇమామ్‌గా ఎంచబడేవారు. ఇంత పెద్ద హదీసు జ్ఞాని క్రోడీకరించిన హదీసు సంకలనం కూడా అతని పాండితీ ప్రకర్షకు ప్రతీకగా ఉండి తీరుతుంది. అందువల్లనే ఆయనగారి ఈ రచన (బులూగుల్ మరామ్) ప్రపంచంలోని అనేక ధార్మిక విద్యాలయాల, యూనివర్సిటీల పాఠ్యాంశాలలో చేర్చబడింది. ఆఖరికి సవూదీ అరేబియాకు చెందిన మదీనా మునవ్వరా ఇస్లామీయ విశ్వవిద్యాలయం (అల్ జామియతుల్ ఇస్లామీయ)లోని కొన్ని విభాగాలలో కూడా ఇది పాఠ్యాంశంగా ఉంది.

అల్ హమ్దులిల్లాహ్ ఇంతటి ఘనకీర్తిగల ఈ పుస్తకాన్ని తెలుగులో మా మిత్రులు అజీజుర్రహ్మాన్ అనువదించటం సంతోషకరం. ఈయన ఇంతకు ముందు అనువదించిన ఎన్నో ధార్మిక పుస్తకాలు ఆంధ్రావనిలో ఆదరణ పొందాయి. మీ ముందున్న ఈ అనువాదం కూడా భాషాపరంగా, శైలిరీత్యా పాఠకులను ఆకట్టుకోగలదని ఆశిస్తున్నాను. తెలుగు భాష దక్షిణ భారతంలో కోట్లాది ప్రజల భాష. ఈ భాషలో మరెంతో ధార్మిక సాహిత్యం ప్రచురించబడవలసిన ఆవశ్యకత ఉంది. విద్వాంసుల, శ్రేయోభిలాషుల ఆసక్తి, చొరవవల్ల ఈ అవసరం నెమ్మదిగా తీరుతుంది - ఇన్‌షా అల్లాహ్!

## హదీసు - హదీసు విద్య గురించి....

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనాలు, ఆదర్శాలు, ఆయన సహచరుల ఆచరణ, ఆయన (సఅసం) దృష్టికి వచ్చిన మీదట ఆయన (సఅసం) మౌనం వహించిన దృష్టాంతాలు "హదీసు" అనబడతాయి. దీనినే సున్నత్‌గా కూడా వ్యవహరిస్తారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను అల్లాహ్ సమస్త జనుల కోసం ప్రవక్తగా చేసి పంపాడు. ఆయనకు విధేయత చూపటం ప్రతి ముస్లింకు అవశ్యం, ఆయన (సఅసం)కు మనం చూపే విధేయతే అల్లాహ్‌పై విశ్వాసానికి, ఆయనపై గల ప్రేమకు ప్రబల తార్కాణం.

قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ
وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿٣١﴾

ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా తెలుపు: "మీకు నిజంగానే అల్లాహ్‌పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడూను."
(ఆలి ఇమ్రాన్ - 31)

وَمَا أَرْسَلْنَا مِن رَّسُولٍ إِلَّا لِيُطَاعَ بِإِذْنِ اللَّهِ ۚ
وَلَوْ أَنَّهُمْ إِذ ظَّلَمُوا أَنفُسَهُمْ جَاءُوكَ فَاسْتَغْفَرُوا اللَّهَ
وَاسْتَغْفَرَ لَهُمُ الرَّسُولُ لَوَجَدُوا اللَّهَ تَوَّابًا رَّحِيمًا ﴿٦٤﴾

(ఓ ప్రవక్తా! వారికి ఇలా తెలుపు) "మేము ఏ ప్రవక్తను పంపినా అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం అతనికి విధేయత చూపాలనే పంపాము. వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న తరువాత వారి కొరకు ఉత్తమమయిన పద్ధతి ఏమిటంటే, వారు నీ వద్దకు వచ్చి ఉండ వలసింది; క్షమించు అని అల్లాహ్‌ను అర్థించి ఉండవలసింది, ఇంకా ప్రవక్త కూడా వారి కొరకు మన్నింపునకై విజ్ఞాపన చేసి ఉండేవాడు. అప్పుడు

వారు నిశ్చయంగా అల్లాహ్‌ను క్షమించేవాడుగా, కరుణించేవాడుగా కనుగొని ఉండేవారు."

(అన్ నిసా - 64)

مَنْ يُّطِعِ الرَّسُوْلَ فَقَدْ اَطَاعَ اللّٰهَ ۚ وَمَنْ تَوَلّٰى فَمَآ اَرْسَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ۝

"ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవంగా అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. కాని ఎవరయితే విముఖులయ్యారో అటువంటి వారిపై మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు." (అన్ నిసా - 80)

దైవప్రవక్త స్థానం అత్యంత ముఖ్యమైనది, బాధ్యతాయుతమైనది. అందుచేత ఆయన ధర్మానికి, షరీయత్‌కి సంబంధించి ఏది చెప్పినా, మరేది చేసినా తన మనోభిరామం ప్రకారం చెయ్యడు. దైవాదేశానుసారమే ఆయన మసలుకుంటాడు.

وَمَا يَنْطِقُ عَنِ الْهَوٰى ۝ اِنْ هُوَ اِلَّا وَحْيٌ يُّوْحٰى ۝

"అతడు తన మనోవాంఛలను అనుసరించి ఏదీ చెప్పటం లేదు. ఇది అతనిపై అవతరింపజేయబడే ఒక వహీ (దివ్యావిష్కృతి)." (అన్ నజ్మ్ - 3,4)

ఈ విధంగా దైవప్రవక్త (సఅసం) ఆదేశాల, ఉపదేశాల స్థాయి కూడా ఖుర్ఆన్ ఆదేశాల వంటిదే. వాటిని విశ్వసించటం, శిరసావహించటం ఒక ముస్లింకు అనివార్యం. ఒకవేళ ఎవరయినా దివ్య ఖుర్ఆన్‌ని విశ్వసించి దైవప్రవక్త (సఅసం) ప్రవచనాలను, దైవప్రవక్త విధానాలను నిరాకరిస్తే అతడు ముస్లిమే కాజాలడు. అయితే అతడు హదీసును గురించి పరిశోధించవచ్చు. ఒక హదీసు గురించి, అది దైవప్రవక్త (స) చెప్పినదేనా? కాదా? ఆ హదీసు ప్రమాణబద్ధమైన ఆధారాల ద్వారానే అందిందా? లేదా? అన్న అంశాలను గురించి అతడు యోచన చెయ్యవచ్చు. అది నిజమైనదని తెలిసిన మీదట మాత్రం దానిని శిరసావహించటం, తదనుగుణంగా ఆచరించటం తప్పనిసరి అవుతుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లో చెప్పబడినట్లు -

وَمَآ اٰتٰىكُمُ الرَّسُوْلُ فَخُذُوْهُ ۚ وَمَا نَهٰىكُمْ عَنْهُ فَانْتَهُوْا ۚ

"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని తీసుకోండి. ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికి పోకండి." (అల్ హష్ర్ - 7)

ఇస్లాంను అర్థం చేసుకోవడానికీ, ఇస్లామీయ ఆదేశాలను అనుసరించడానికీ రెండు మౌలిక అంశాలపై ఆధారపడవలసి ఉంటుంది - (1) దివ్య ఖుర్‌ఆన్ (2) హదీసు. అల్లాహ్ ఈ రెండు మూల వస్తువులను ప్రళయదినం వరకూ చెక్కు చెదరకుండా - సురక్షితంగా ఉండేలా - కట్టుదిట్టమయిన ఏర్పాట్లు చేశాడు. మహాప్రవక్త (సఅసం) జీవించి వున్న కాలంలో చాలామంది సహచరులు దివ్య ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసుకున్నారు. ఆయన (స) పర్యవేక్షణలోనే దీనిని లిఖించటం కూడా జరిగింది. ఆయన (స) తదనంతరం ధర్మ ఖలీఫాలు ఈ మూల ప్రతి ఆధారంగా అనేక ప్రతులను తయారు చేసి వివిధ ప్రాంతాలకు పంపించారు.

దివ్య ఖుర్‌ఆన్‌ను లిఖిస్తున్న కాలంలో హదీసులను కూడా గ్రంథస్థం చేయడాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. ఖుర్‌ఆన్‌తో పాటు ఇది కలగాపులగం కారాదన్న ఉద్దేశ్యంతోనే దైవప్రవక్త (స) ఈ మేరకు ఆదేశించారు. అయితే ప్రవక్త ప్రియ సహచరులు (ర.అన్హుం) హదీసులను జ్ఞాపకముంచుకోవటమే గాక వాటిని ఒండొకరికి వినిపించేవారు. ఖుర్‌ఆన్ శైలిని, దాని భాషను సహచరులు బాగా జీర్ణించుకున్న తర్వాత హదీసులను కూడా లిఖించేందుకు ఆయన (సఅసం) అనుమతి ఇచ్చారు. వ్రాయటం వచ్చిన సహాబా తమ వంతు బాధ్యతగా గ్రంథస్థం చేయసాగారు. సహాబా తరువాత తాబయీన్లు కూడా ఈ బృహత్తర కార్యంపై శ్రద్ధ వహించారు. ఈ పరంపర నిరాఘాటంగా కొనసాగింది. ఇక హదీసువేత్తల, ఇమాముల కాలంలోనయితే హదీసు విద్యపై అపూర్వమయిన, అద్వితీయమైన కృషి జరిగింది. హదీసులను పరి రక్షించే ఈ పని ఎంత పకడ్బందీగా జరిగిందంటే 14 వందల సంవత్సరాలు గడచిపోయినప్పటికీ దైవప్రవక్త (సఅసం) ఆదేశాలు, ఉపదేశాలు భద్రంగా - యధాతథంగా - ఉన్నాయి. ఎవరయినా

వాటిని తెలుసుకోదలిస్తే ఆ సంఘటనలు నేడు మన మధ్య జరుగుతున్నట్లే, ప్రవక్త సహచరులు మనతో ముచ్చటిస్తున్నట్లే అనిపిస్తుంది. ఒక్కో హదీసు ప్రామాణికతను, దాని పరంపరను నిర్ధారించటానికి మహాప్రవక్త (స) అనుయాయులు తీసుకున్న జాగ్రత్తలు అటువంటివి మరి! ఒక్క మహనీయ ముహమ్మద్ (సఅసం) తప్ప మరే ప్రవక్త ఉపదేశాలూ ఇంత పకడ్బందీగా గ్రంథస్థం చెయ్య బడలేదు.

స్వచ్ఛమైన హదీసులను కాపాడటానికీ, ప్రజలు కల్పించే మనో కల్పిత విషయాలను వాటినుండి వేరుపరచటానికి హదీసువేత్తలు సలిపిన కృషి శ్లాఘనీయం. ఒక విద్యను రక్షించటానికై అంతకు ముందు ఎన్నడూ చరిత్రలో కనీవినీ ఎరుగని ఒరవడిని హదీసువేత్తలు సృష్టించారు. ఇల్మె రిజాల్, తబఖాత్, జరహ్, తాదీల్ వంటి గ్రంథాలు ఇందుకు కొన్ని దృష్టాంతాలు మాత్రమే. వీటి ద్వారా వేలాది మంది హదీసు ఉల్లేఖకుల జీవితాలు, స్థితిగతులు భద్రపరచబడ్డాయి. తద్వారా హదీసు ప్రామాణికత, హదీసు ఉల్లేఖకుని చరిత్ర తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడ్డాయి. ఉదాహరణకు హదీసును అందజేసిన వారెవరు? ఎక్కడుండేవారు? ఎలాంటివారు? వారి గుణగణాలు ఎటువంటివి? - ఇత్యాది విషయాలను క్షుణ్ణంగా పరికించి, వాటి ఆధారంగా హదిసు ప్రామాణికతను బేరీజు వేయటం జరిగింది. ఈ విధంగా దైవప్రవక్త (స) వారి ప్రవచనాలలో ఎవరూ హెచ్చుతగ్గులు చేయకుండా, అబద్ధాలు ఆపాదించకుండా ఉండేలా గట్టి ఏర్పాట్లు చేయబడ్డాయి. హదీసు విద్యకు సంబంధించి మన పూర్వీకులు తీసుకున్న ఈ జాగ్రత్తలను పరిశీలించిన విమర్శకులు ఆశ్చర్యచకితులయ్యారు. ఈ ఏర్పాట్లు ముస్లింలు హదీసు విద్యపై గర్వపడేలా ఉన్నాయనీ, ఇంతకు ముందు ఎవరూ మహనీయుల ప్రవచనాలను భద్రపరచేందుకు ఇంత పకడ్బందీగా ప్రయత్నం చెయ్యలేదనీ వారు కొనియాడారు. ఒకవేళ ఎవరికయినా ఫలానా హదీసు మహాప్రవక్త (సఅసం) ప్రవచించినదేనా? కాదా? అన్న సందేహం కలిగితే వారు హదీసు సూత్రాన్ననుసరించి పరిశోధన జరిపి చాలా సులువుగా దాన్ని కనుగొనవచ్చు. ఎందుకంటే హదీసు అవగాహనకు సంబంధించిన మూల సూత్రాలు ఉనికిలోకి వచ్చాయి. వాటి ఆధారంగా ఒక హదీసు ప్రామాణికమైనదో, లేక బలహీనమైనదో, హదీసు పరంపరలో ఎక్కడ లింకు తెగిందో ఇట్టే పసిగట్టవచ్చు. తద్వారా ముస్లింలకు ప్రమాణ బద్ధమైన ఆదేశాలను పరిగణనలోనికి తీసుకుని ధర్మాన్ని, షరీయత్‌ను అవలంబించడానికి మార్గం సుగమం అవుతుంది. ఏ కాలంలోనయినాసరే

ప్రజలు ఖుర్‌ఆన్ హదీసులను మార్గదర్శిగా తీసుకుని జీవన యాత్ర సాగించటంలోనే వారి శ్రేయో సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా రూఢీ అయిన అంశాలను మాత్రమే అనుసరణీయంగా భావించి, వాటికి విరుద్ధంగా ఉన్న అంశాలను నిస్సంకోచంగా త్యజించాలి.

కారుణ్య ప్రభువు ఈ కృషిని స్వీకరించాలనీ, ఈ బృహత్తర కార్యంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన వారందరికీ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలనీ మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. మహనీయ ముహమ్మద్ (సఅసం) విధానానికనుగుణంగా జీవితం గడిపే సద్బుద్ధిని మనందరికీ ప్రసాదించాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్సమీవుల్ అలీమ్.**

**- ముహమ్మద్ అబ్దుల్ హాది**

తేది : 30-7-2001 (8, జమాదివుల్ అవ్వల్ హి. 1422)

(అధ్యక్షులు, మజ్లిసుల్ ఖజా అల్ ఇస్లామీ, బ్రిటన్)

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 1. శుచీ శుభ్రతల పుస్తకం

# كتاب الطَّهارة

మొదటి అధ్యాయం

## నీళ్ల రకాలు

## ١ - بابُ المِيَاه

**(వివిధ మార్గాల ద్వారా లభ్యమయ్యే నీటి వివరాలు)**

(١) عَن أَبي هُرَيرَةَ رَضِيَ اللّهُ تَعَالَى عَنْهُ قَالَ: قال رسولُ اللهِ ﷺ في البَحْرِ: «**هُوَ الطَّهُورُ مَاؤُهُ والحِلُّ مَيْتَتُهُ**». أَخْرَجَهُ الأَرْبَعَةُ وَابْنُ أَبي شَيْبَةَ وَاللَّفْظُ لَهُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ والتِّرْمِذِيُّ، وَرَوَاهُ مَالِكٌ وَالشَّافِعِيُّ وَأَحْمَدُ.

1. హ్రజత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం (ఒక వ్యక్తి వెలిబుచ్చిన సందేహానికి సమాధానంగా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సముద్రపు నీటి గురించి ఇలా వివరించారు: "దాని నీరు పరిశుభ్రమైనది. అందులో చని పోయినవి ధర్మ సమ్మతమైనవి" (ఈ హదీసును అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ, ఇబ్నె అబీ షైబాలు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ మరియు తిర్మిజీలు దీన్ని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఇమామ్ మాలిక్, షాఫయి, అహ్మద్ కూడా ఈ ఉల్లేఖనాన్ని ఉల్లేఖించారు).

**సారాంశం**

ఈ హదీసు వాస్తవానికి ఒక పృచ్ఛకుని ప్రశ్నకు సమాధానంగా ఉద్బోధించబడింది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) తదితరులు ఉటంకించిన దాని ప్రకారం ఒక వ్యక్తి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సన్నిధికి వచ్చి, 'ఓ దైవప్రవక్తా! మేము సముద్రయానం చేస్తూ ఉంటాము. మా వెంట మంచినీరు కొద్దిగానే ఉంటుంది. ఈ నీటితో గనక మేము 'వుజూ' చేస్తూపోతే దాహంతో చచ్చిపోతాము. కాబట్టి మేము సముద్రపు నీటితో 'వుజూ' చేయవచ్చా?' అని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా "ఆ నీరు పరిశుద్ధమైనదే" అని మహాప్రవక్త (సఅసం) ప్రవచించారు.

సముద్రపు నీరు ముమ్మాటికీ పరిశుద్ధమైనదనటానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. మరో గమనార్హ మైన విషయం ఏమిటంటే సముద్రంలోని చరాలు - అవి కుక్క, పందిని పోలినవి అయినాసరే- హలాల్ (ధర్మ సమ్మతం) గానే పరిగణించబడతాయి. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)ల అభిప్రాయం కూడా ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం కేవలం సముద్రపు చేపలనే ధర్మసమ్మతంగా భావించారు.

మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు సముద్రపు నీటితో పాటు సముద్రంలో సహజంగా మరణించిన జంతువులను కూడా ధర్మసమ్మతమైన వాటి జాబితాలో చేర్చారు. ప్రశ్నించే వ్యక్తి అడగక పోయినప్పటికీ మహాప్రవక్త (సఅసం) ఈ సందేహ నివృత్తి చేశారు. ఎందుకంటే సముద్రపు నీరు ధర్మ సమ్మతమో కాదో అన్న సందేహం కలిగిన వ్యక్తి, సముద్రంలో చనిపోయిన చరాలు ధర్మ సమ్మతమా? కాదా? అన్న విషయమై కూడా తీవ్రమయిన సందేహానికి, మీమాంసకు లోనయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దివ్య ఖుర్ఆన్లో చనిపోయిన వాటిని తినరాదన్న ఆదేశం వచ్చిందిగాని వాటికి సంబంధించిన తప్సీళ్లు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో సముద్ర ప్రయాణాలు చేసే వ్యక్తి చనిపోయిన జలచరాల విషయంలో సందిగ్ధానికి లోనుకావచ్చు. ఈ విధంగా చూసినపుడు మహాప్రవక్త (సఅసం) గారి సమాధానం యుక్తితో, నేర్పుతో, వాత్సల్యంతో కూడుకున్నదిగా కనిపిస్తుంది.

ఇంతకీ ఈ పృచ్ఛకుడు ఎవరు? అనే విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. అతని పేరు అబ్దుల్లా అల్ ముద్లజీ (రజి) అయి ఉండవచ్చుననీ, అబ్దుల్ అర్కీ (రజ) కూడా కావచ్చుననీ ఒక వాదన ఉంది. ఉబైద్ - అల్ అర్కీ అనేది కూడా నిజం కావచ్చునని కొంతమంది వాదించారు. సముద్రం లేక నదులలో పడవ నడిపేవారిని అరబీలో 'అర్కీ' గా వ్యవహరిస్తారు.

సముద్రపు నీరు పరిశుద్ధమైనదనీ, దాంతో వుజూ చేయటం, దానిని (ట్రీట్చేసి) మన ఉపయోగం లోకి తీసుకురావటం సబబేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అలాగే సముద్రంలో ఉండే జంతువులు (సముద్రం బయట జీవించి ఉండలేనివి) అన్నీ - అవి సముద్రంలో చనిపోయినా లేక వాటిని పట్టుకున్న తరువాత అవి ప్రాణం విడిచినా - వాటిని తినటం సమ్మతమే. అలాగే సముద్రంలో ప్రయాణం చేయటం కూడా ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హజ్రత్ అబూహురైర (రజి) అగ్రశ్రేణి ప్రవక్త సహచరులలో ఒకరు. ఈయనగారి ద్వారా అందరికన్నా ఎక్కువ హదీసులు మనకు అందాయి. సంకలనకర్త అభిప్రాయం ప్రకారం ఈయనగారి అసలు పేరు అబ్దుల్లాహ్ లేక అబ్దుర్రహ్మాన్ అయి ఉంటుంది. ఈయన దౌస్ తెగకు చెందినవారు. హిజ్రీ శకం 6వ యేట ఇస్లాం స్వీకరించారు. 78 ఏళ్ల ప్రాయంలో - హిజ్రీ 59లో- అశాశ్వితమయిన ఈ లోకాన్ని విడిచిపోయారు. మదీనాలోని "బఖీ" అనే ఖననవాటికలో ఖననం చేయబడ్డారు. హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో ముఫ్తీగా నియమితులయ్యారు. ఈయనగారి చేత ఇంచుమించు 5384 హదీసులు ఉల్లేఖించబడినాయి. ఖచ్చితంగా హదీసుల సంఖ్య అల్లాహ్కే తెలుసు.

(٢) وعَنْ أَبِيْ سَعِيدٍ الخُدْرِيِّ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ، قَالَ: قال رسول الله ﷺ: «**إنَّ المَاءَ طَهُورٌ لاَ يُنَجِّسُهُ شَيْءٌ**». أَخرَجَهُ الثَّلاَثَةُ وَصَحَّحَهُ أَحْمَدُ.

2. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నీరు పరిశుద్ధమైనది. ఏ వస్తువూ దానిని అశుద్ధపరచదు." (ఈ ఉల్లేఖనాన్ని అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్నెమాజ ఉల్లేఖించారు. దీని ప్రామాణికతను అహ్మద్ ధృవీకరించారు)

## సారాంశం

హదీసు సారాంశమేమిటంటే నీరు స్వచ్ఛమైనది, పరిశుద్ధమైనదై ఉంటుంది. కేవలం అందులో మాలిన్యం ఉన్నంత మాత్రాన - అది తక్కువ మోతాదులో ఉన్నా, ఎక్కువ మోతాదులో ఉన్నాసరే- అది అపవిత్రం, అశుద్ధం అయిపోదు. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), జవాహిర్ మరియు ఇమామ్ అహ్మద్ (రహ్మలై) ల అభిప్రాయం కూడా ఇదే. ఇమామ్ మాలిక్ (రహ్మలై) కొన్ని షరతులతో ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) చేత ఉల్లేఖించబడిన ఈ హదీసుతో ఒక ప్రత్యేక సంఘటన ముడిపడి ఉంది. అదేమంటే;

'మేము 'బీరె బుజాఅ' నీటితో వుజూ చేయవచ్చా?' అని కొంతమంది సహచరులు దైవప్రవక్త (సఅసం)ను ప్రశ్నించారు (అదొక పాత బావి. అందులో బహిష్టు బట్టలు (ముట్లు), కుక్క మాంసపు ముక్కలు, దుర్వాసనతో కూడిన వస్తువులు పారవేయబడేవి). దీనికి సమాధానంగా ఆయన (సఅసం) "నీరు మాత్రం పరిశుద్ధమైనది" అని చెప్పారు. ప్రశ్నించిన వారి దృష్టిలో 'బీరె బుజాఅ' నీరు ఉంది. ఆ బావి వెడల్పు ఆరు గజాలుంటుంది. ఆ బావిలో మహా అయితే నాభి వరకు లేక అంతకన్నా కొంచెం ఎక్కువ లోతు నీరుంటుంది. లేదంటే నాభికన్నా కొంచెం తక్కువ లోతు ఉంటుంది. అబూ దావూద్ తన సునన్‌లో కూడా దీన్ని గురించి ఇలాగే ప్రస్తావించారు.

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే నీరు ఇంత ఎక్కువ మోతాదులో ఉన్నప్పుడు అందులో మలినం పడినంత మాత్రాన అది అశుద్ధమైపోదు. అయితే నీరు తక్కువగా ఉన్నప్పుడు మాలిన్యం పడినట్లయితే అప్పుడది అశుద్ధమైపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన వారు అబూ సయీద్ ఖుదరీ (రజి). అబూ సయీద్ అనేది మరో పేరు.అసలు పేరు సాద్ బిన్ మాలిక్ బిన్ సునాన్. అన్సార్లకు చెందిన 'ఖజ్‌రజ్' తెగవారు. పెద్ద సహాబీలలో ఒకరుగా పరిగణించబడ్డారు. ఖుద్ర అనేది ఒక అన్సారీ తెగ. ఆ తెగ పేరున ఈయన ఖుదరీగా పిలువబడ్డారు. దాదాపు 86 సంవత్సరాలు జీవించారు. హిజ్రీ శకం 74వ ఏట మరణించారు. ఈయన గారి ద్వారా కూడా మనకు చాలా హదీసులు అందాయి.

(٣) وعَنْ أَبِي أُمامَةَ البَاهِلِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ الله ﷺ: «إِنَّ المَاءَ لاَ يُنَجِّسُهُ شَيْءٌ إِلاَّ مَا غَلَبَ عَلَى رِيحِهِ وَطَعْمِهِ وَلَوْنِهِ». أَخْرَجَهُ ابْنُ مَاجَه، وَضَعَّفَهُ أَبُو حَاتِمٍ، وَلِلْبَيْهَقِيِّ: الماءُ طَهُورٌ إِلاَّ إِن تَغَيَّرَ رِيْحُه أو طَعْمُه أو لَونُه بَنَجاسَةٍ تَحدُثُ فِيْهِ.

3. హజ్రత్ అబూ ఉమామ అల్ బాహిలీ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు- "నిశ్చయంగా నీళ్ళను ఏ వస్తువూ అపవిత్రంగానీ, మలినంగానీ చేయ జాలదు - నీళ్ళపై ఆ అశుద్ధ వస్తువు తీవ్ర ప్రభావం చూపి దాని రుచి, రంగు, వాసనలో మార్పువస్తే తప్ప!" (ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖించారు. అబూ హాతిమ్ దీనిని బలహీన హదీసుగా ఖరారు చేశారు). బైహఖీలో హదీసు వాక్యం ఈ విధంగా ఉంది: నీరు పరిశుద్ధమైనది (పరిశుద్ధపరచేది కూడాను). కాకపోతే నీటిలో పడిన ఆ అశుద్ధ వస్తువు నీటి వాసనను, రుచినీ, రంగును మార్చి వేస్తే అప్పుడది అశుద్ధమైపోతుంది."

### సారాంశం

కేవలం మలినం పడినంత మాత్రానికే నీరు అశుద్ధం అయిపోదు. నీరు ఎక్కువ పరిమాణంలో- అంటే రెండు పెద్ద తొట్టెలకు సమానంగా ఉన్నప్పుడు అశుద్ధతా ప్రభావం ఏర్పడదు. ఒకవేళ మలినం పడటం మూలంగా ఆ నీటి వాసన, రుచి, రంగు వంటి మూడు గుణాలలో ఏ ఒక్క గుణం మారినా ఆ నీరు అశుద్ధం అయిపోతుంది. అటువంటి నీరు అధిక పరిమాణంలో ఉన్నా, అల్ప పరిమాణంలో ఉన్నా అది అశుద్ధంగానే పరిగణించబడుతుంది.

ఈ హదీసు ప్రామాణికత రీత్యా బలహీనంగా ఉన్నప్పటికీ భావార్థం రీత్యా సరైనదే అన్న విషయంలో మాత్రం ఏకాభిప్రాయం ఉంది. నీరు కొద్దిగా ఉన్నా, ఎక్కువ మోతాదులో ఉన్నా - మలినం పడిన కారణంగా దాని మూడు గుణాలలో ఏ ఒక్క గుణం మారినా అది అశుద్ధమైపోతుందన్న పండితుల ఏకాభిప్రాయాన్ని ఇమామ్ షాఫయి (రహ్మ.లై), బైహఖీ (రహ్మ.లై), ఇబ్నె ముంజిర్ (రహ్మ.లై)లు నకలు చేశారు.

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యే మరో విషయం ఏమిటంటే నీరు అధిక పరిమాణంలో - అంటే రెండు పెద్ద తొట్టెలకు సమానంగా లేక అంతకు మించి ఉంటే ఏ వస్తువూ దానిని అశుద్ధ పరచదు. కాని మలినం మూలంగా నీటి రంగు, రుచి, వాసనలలో మార్పువస్తే మటుకు అది అశుద్ధమైపోయినట్లే.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించినవారు అబూ ఉమామ అల్ బాహిలీ (రజి). అబూ ఉమామ

అనేది మారు పేరు. బాహిల అనే తెగకు చెందిన వారవటం చేత బాహిలీగా వ్యవహరించబడ్డారు. ఈయన అసలు పేరు సుదై బిన్ అజ్లాన్. సుప్రసిద్ధ సహాబీలలో ఒకరు. ఈయన ద్వారా ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. ఈజిప్టులో కొంతకాలం స్థిరపడి, ఆ తరువాత 'హిమ్స్'కు తరలి వెళ్ళారు. ఈయన మరణం హి.శ. 81 లేదా 86లో సంభవించింది. సిరియాలో తనువు చాలించిన చిట్టచివరి సహాబీ ఈయనే.

(٤) وعَنْ عَبدِاللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: قَالَ رسولُ الله ﷺ: «إِذَا كَانَ المَآءُ قُلَّتَيْنِ لَمْ يَحمِلِ الخَبَثَ». وفي لَفْظٍ: «لَمْ يَنْجُسْ» أَخْرَجَهُ الأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

4. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు: "నీటి పరిమాణం రెండు పెద్ద కడవలకు సమానంగా ఉన్నప్పుడు అది మాలిన్యాన్ని గ్రహించదు." వేరొక ఉల్లేఖనంలోని వాక్యం ఇలా ఉంది: "నీరు అశుద్ధం కాదు." (దీనిని అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమా, ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్‌లు దీని ప్రామాణికతను ధృవీకరించారు).

## సారాంశం

పై హదీసులో ప్రస్తావించబడిన కడవల సైజుకు సంబంధించి కొంత అభిప్రాయభేదం ఉంది. అయితే అరబ్బులోని రాతి తొట్టెలు సుప్రసిద్ధమైనవి. అక్కడి కవులు తమ కవితల్లో తరచూ ఈ తొట్టె లను ప్రస్తావిస్తూ ఉండేవారు. వాటి ఉపమానాలు కూడా ఇచ్చేవారు. హదీసులో ప్రస్తావనకు వచ్చిన తొట్టెలు (లేదా కడవలు) ఈ రాతి తొట్టెలే అయి ఉంటాయి. ఆ తొట్టెలలో 250 రతల్‌ల నీరు పడు తుంది. రెండు పెద్ద తొట్టెలలో సుమారు 500 రతల్‌ల నీరు పడుతుంది. నేటి ఆధునిక కొలమానం ప్రకారం ఇది 227 కిలో గ్రాములకు సమానం. ఈ పరిమాణంలో ఉన్న నీరు సాధారణంగా మలినాన్ని స్వీకరించదు. కొద్దిపాటి మాలిన్యం ఒకవేళ అందులో పడినా అది అశుద్ధమైపోదు.

ఈ హదీసు నీటి యొక్క అధిక - అల్ప పరిమాణాలను నిర్ధారించే విషయంలో కొలబద్ద వంటిది. నీళ్ళకు సంబంధించిన ఈ హదీసులన్నింటి ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే నీటి పరిమాణం రెండు పెద్ద తొట్టెలకన్నా తక్కువ ఉన్నప్పుడు - అందులో మలినం పడితే అప్పుడది అశుద్ధమైపోతుంది. నీటి రంగు, రుచి, వాసనలో మార్పు పొడసూపినా, పొడసూపకపోయినా అది అశుద్ధమైపోయిందనటంలో సందేహానికి ఆస్కారం లేదు. అయితే నీరు రెండు తొట్టెలకు సమానంగా లేక అంతకన్నా ఎక్కువగా ఉన్నప్పుడు మలినం పడిన కారణంగా ఆ నీరు అశుద్ధం అవదు. పైగా ఆ నీరు పరిశుద్ధంగా ఉంటుంది. ఇతర వస్తువులను పరిశుద్ధపరచే శక్తి కలిగి ఉంటుంది. కాని

మలినం మూలంగా దాని మూడు గుణాలలో (రంగు, రుచి, వాసన) ఏ ఒక్క గుణం మారినా అప్పుడు అది అశుద్ధ నీరుగానే భావించ బడుతుంది.

ఇంతకు ముందు మీరు చదివిన హదీసు (బావికి సంబంధించిన హదీసు)లో నీరు రెండు పెద్ద తొట్టెలకన్నా అధికంగా ఉంది. ఆ హదీసును హదీసువేత్తల ఓ పెద్ద సమూహం ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించింది. ఆ కోవకు చెందిన వారిలో ప్రముఖులు : ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అబూ ఉబైద్ (రహ్మ.లై), అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై), యహ్యా బిన్ మొయిన్ (రహ్మ.లై), ఇబ్నె ఖుజైమ (రహ్మ.లై), తహావీ (రహ్మ.లై), ఇబ్నె హిబ్బాన్ (రహ్మ.లై), దారెఖుత్నీ (రహ్మ.లై), ఇబ్నె ముంద (రహ్మ.లై), హాకిమ్ (రహ్మ.లై), ఖతాబీ (రహ్మ.లై), బైహఖీ (రహ్మ.లై) ఇబ్నె హజమ్ (రహ్మ.లై) మొదలగువారు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) జ్ఞాన సంపన్నులు. గొప్ప ప్రజ్ఞాశాలి. పిన్న వయస్సులోనే ఇస్లాం స్వీకరించారు. మక్కా నుండి మదీనాకు ప్రస్థానం కూడా చేశారు. తొలిసారిగా కందక యుద్ధంలో పాల్గొన్నారు. హిజ్రీ 75 వ సంవత్సరంలో పవిత్ర మక్కాలో మరణించారు. 'జీతువా' స్థలంలో ఈయన అంత్యక్రియలు జరిగాయి.

(٥)وَعَنْ أَبِي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ اللهِ ﷺ: «لا يَغْتَسِلْ أَحَدُكُمْ فِي المَاءِ الدَّائِمِ وَهُوَ جُنُبٌ». أخرجه مسلم. وللبخاري: «لاَ يَبُولَنَّ أَحَدُكُمْ فِي الْمآءِ الدَّائِمِ الَّذي لاَ يَجْرِي، ثُمَّ يَغْتَسِلُ فِيْهِ». ولِمُسْلِمٍ «منه» وَلأَبِي دَاوُد «وَلاَ يَغْتَسِلُ فِيْهِ مِنَ الجَنَابَةِ».

5. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయితే అశుద్ధావస్థకు లోనై ఉన్నారో వారు నిలిచి ఉన్న నీటిలో స్నానం చేయ రాదు" (ముస్లిం). బుఖారీలోని పదాలు ఈ విధంగా ఉన్నాయి: "మీలో ఎవరూ నిలిచి ఉన్న నీటిలో మూత్ర విసర్జన చేయటంగానీ, స్నానం చేయటంగానీ చేయరాదు." సహీహ్ ముస్లింలోని పదం 'ఫీహి' బదులు 'మిన్‌హు' అని ఉంది. అంటే దానిలోని కొంత నీరును తీసు కుని స్నానం చేయరాదు. అబూదావూద్ లోని వాక్యం ఇలా ఉంది : "వలా యగ్‌తసిల్ ఫీహి మినల్ జనాబతి" - అంటే - లైంగిక అశుద్ధావస్థకు లోనైన పరిస్థితిలో అందులో స్నానం చేయ రాదు."

## సారాంశం

హదీసులో 'జనాబత్' అని ఉంది. సంభోగం వల్ల మరియు వీర్య స్ఖలనం వల్ల ఏర్పడే అశుద్ధావస్థను, 'జనాబత్' అంటారు.

ముస్లింలోని ఉల్లేఖనంలో 'ఫీహి' అనే బదులు 'మిన్హు' అనే పదం ప్రయోగించబడింది. ఒకవేళ 'ఫీహి' అని ఉంటే, 'ఆ నీటిలో ప్రవేశించటం మరియు మునగటం నిషిద్ధం' అని అర్థం వస్తుంది. 'మిన్హు' అని గనక ఉంటే అందులో నుంచి కొంత నీరును తీసుకుని వేరుగా స్నానం చేయటం అని కూడా రాదు.

మొత్తం మీద 'ముస్లిం' ఉల్లేఖనంలో కేవలం స్నానం చేయటం నిషిద్ధం అన్న అర్థం మాత్రమే వస్తుంది. బుఖారీ ఉల్లేఖనంలోనయితే అందులో మూత్ర విసర్జన చేయటం, స్నానం చేయటం - రెండూ వారించబడ్డాయి. అబూ దావూద్ ఉల్లేఖనం దృష్ట్యా చూస్తే అందులో మూత్ర విసర్జన చేయటం, మునిగి స్నానం చేయటం, లేక అందులో నుంచి కొంత నీరును తీసుకుని వేరుగా స్నానం చేయటం - అన్నీ వారించబడ్డాయి. మొత్తానికి ఈ ఉల్లేఖనాలన్నింటి ద్వారా అవగతమయ్యేదేమిటంటే రెండు పనులూ నిషిద్ధమే. ఎందుకంటే నిలిచి ఉన్న నీరు తక్కువ పరిమాణంలో ఉంటే అది అపవిత్రం అయిపోతుంది. ఒకవేళ నిలిచి ఉన్న నీరు ఎక్కువ పరిమాణంలో ఉన్నప్పటికీ నిరంతరం అందులో మూత్ర విసర్జన చేస్తూ, స్నానాలు కూడా చేస్తున్నందున క్రమక్రమంగా అది కలుషితమై నీటి గుణాలలో మార్పు వచ్చేస్తుంది.

(٦) وعَنْ رَجُلٍ صَحِبَ النَّبِيَّ ﷺ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ تَغْتَسِلَ الْمَرأَةُ بِفَضْلِ الرَّجُلِ، أَوِ الرَّجُلُ بِفَضْلِ الْمَرْأَةِ، وَلْيَغْتَرِفَا جَمِيْعاً. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَإِسْنَادُهُ صَحِيْحٌ.

6. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచర్యంలో ఉండి ధార్మిక లబ్ది పొందిన ఒక వ్యక్తి కథనం : "పురుషుడు స్నానం చేయగా మిగిలి ఉన్న నీటితో స్త్రీ స్నానం చేయటాన్ని, స్త్రీ స్నానం చేయగా మిగిలి ఉన్న నీళ్ళతో పురుషుడు స్నానమాడటాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. ఒకవేళ ఇద్దరూ ఒకే సమయంలో దోసిట్లో నీళ్ళు తీసు కుని స్నాన మాడితే (అందులో అభ్యం తరం ఏమీ లేదు). (అబూ దావూద్, నసాయి. ఈ హదీసు అందజేయబడిన తీరు ప్రామాణికమైనది).

## సారాంశం

ఈ హదీసును ఉల్లేఖించిన సహచరుని పేరు వెల్లడి కానంత మాత్రాన హదీసుకు కలిగిన అనర్థం ఏమీ లేదు. ఎందుకంటే హదీసుల అభివ్యక్తిలో ప్రవక్త ప్రియ సహచరులంతా

నిష్పాక్షికంగా, న్యాయంగా వ్యవహరిస్తారన్న విషయమై హదీసువేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉంది.

ఈ హదీసులో వచ్చిన 'వారింపు' (నహీ) హరామ్‌కు సంబంధించినది కాదు. అంటే అది నిషిద్ధం అని కాదు. అది'నహీయె తన్జీహి'-అంటే అవాంఛనీయమైనది, అయిష్టకరమైనదన్న భావంలో తీసుకోబడింది. రాబోయే హదీసులో దీని వివరణ ఉంది. కనుక స్త్రీ స్నానం చేయగా మిగిలి ఉన్న నీళ్లతో పురుషుడు స్నానం చేస్తే ఏదో ఘోరం జరిగిపోయినట్లుగా భావించవలసిన అవసరంలేదు.

ఇక - ఏకకాలంలో స్త్రీ పురుషులిద్దరూ దోసిట్లో నీళ్లు తీసుకోవటం వల్ల ఒకరి ప్రభావం మరొకరిపై పడవచ్చు. ఆ విధంగా ఒకరు ఇంకొకరికి చెల్లు అవుతారు. ఇందులో కూడా ఆక్షేపణీయమైన విషయం ఏమీ లేదు. అందుచేత ఇందుకు అనుమతించబడింది.

ఒకవేళ భార్యా భర్తలిరువురూ ఒకే పాత్రలో నుంచి నీళ్లు తీసుకుని స్నానం చేస్తే అది ధర్మసమ్మతమే. అయితే కేవలం భర్త లేక కేవలం భార్య - పరిశుద్ధతను పొందే సంకల్పంతో చేసే - స్నానం తరువాత మిగిలి ఉన్న నీళ్లను తమ కొరకు ఉపయోగించటం సమ్మతం కాదు. ఇరువురి మనస్సులలో లేశమయినా శంక మిగిలి ఉండరాదన్న ఉద్దేశ్యంతో ఈవిధంగా సెలవీయబడింది.

(٧) وعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَغْتَسِلُ بِفَضْلِ مَيْمُونَةَ رَضِي الله تعالى عنها. أخرجه مسلم. ولِأَصْحابِ السُّنَنِ: اغْتَسَلَ بَعْضُ أَزْوَاجِ النَّبِيِّ ﷺ فِي جَفْنَةٍ، فَجَاءَ النَّبِيُّ ﷺ لِيَغْتَسِلَ مِنها، فَقَالَتْ له: إِنِّي كُنْتُ جُنُباً، فَقَالَ: «إِنَّ الْمَاءَ لاَ يَجْنُبُ». وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

7. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణి అయిన మైమూన (ర.అన్హా) స్నానం చేయగా మిగిలివున్న నీళ్లతో స్నానం చేసేవారు (ముస్లిం). అస్‌హాబె సునన్‌లోని ఉల్లేఖనంలో ఇలా ఉంది: ప్రవక్త సతీమణులలో ఒకామె తొట్టెలాంటి ఒక పాత్రలో స్నానం చేసిన మీదట, తాను కూడా స్నానం చేసే ఉద్దేశ్యంతో దైవప్రవక్త (సఅసం) ఏతెంచారు. నేను ఇందులో అశుద్ధావస్థను దూరం చేసే స్నానం చేశాను కదా అని ఆమె విన్నవించుకోగా, "నీరు అశుద్ధమైనది కాదు కదా!" అని ఆయన (స) పలికారు. (ఈ ఉల్లేఖనాన్ని తిర్మిజీ, ఇబ్నె ఖుజైమాలు ప్రామాణిక మైనదిగా ధృవీకరించారు).

### సారాంశం

"అస్‌హాబె సునన్" అంటే అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్నె మాజ, అలాగే దారిమి, దారె ఖుత్నీ, ఇబ్నె ఖుజైమ మరియు హాకిమ్‌లు అని భావించాలి.

ఈ హదీసు ఇంతకుముందు వచ్చిన హదీసుకు విరుద్ధమైనదే! అన్న సందేహం రావచ్చుగాని సందేహానికి తావు నివ్వవలసిన అవసరం లేదు. వాస్తవానికి ఉమ్మత్ (ముస్లిం అనుచర సమాజం) యొక్క సౌలభ్యం నిమిత్తం ఆయన (స) ఇలా ప్రవచించారు. అదీగాక, ఆయన స్వయంగా దీనిని ఆచరించి చూపారు. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ రెండు హదీసులూ వాటి కోణాలనుండి సరైనవే నన్నదానికి ఇదొక నిదర్శనం. గమనార్హమయిన మరో ముఖ్య విషయం ఏమంటే ఇందులోని 'వారింపు' 'నిషిద్ధం'తో సమానం కాదు. ఇది కేవలం 'అయిష్టకరమయినది' మాత్రమే. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ధర్మ పత్ని మైమూన (ర.అ) స్నానం చేసిన మీదట మిగిలివున్న నీళ్లతో తాను కూడా స్నానం చేసేవారు. దీని భావం ఏమిటంటే హజ్రత్ మైమూన (ర.అ) మరియు మహాప్రవక్త (స) - ఇరువురూ ఒకే పాత్రలో నుంచి నీరు తీసుకుని స్నానం చేసేవారు. సహీహ్ ముస్లింకు చెందిన ఇదే హదీసులోని రెండవ ఉల్లేఖనం కూడా ఈ విషయాన్ని సూచిస్తోంది.

'అస్హాబె సునన్'ల ఉల్లేఖనం ప్రామాణికత రీత్యా బలహీనమైనది. అందుచేత ప్రాధాన్యత నివ్వవలసిన అంశం ఏమిటంటే, భార్యాభర్తలిరువురూ కలసి ఒకే పాత్ర నుండి నీళ్లు తీసుకుని స్నానం చేయటం సమంజసమేగాని, వేర్వేరుగా స్నానం చేసినపుడు ఒకరు స్నానం చేయగా మిగిలి ఉన్న నీళ్లతో ఇంకొకరు స్నానం చేయటం సమంజసం కాదు.

## హదీసు ఉల్లేఖకులు

1. ఉల్లేఖకుని పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర.అన్హు). ముస్లిం సమాజంలో ఆయన 'జ్ఞాన సాగరం'గా వినుతికెక్కారు.ధార్మిక వ్యవహారాలలో గొప్ప కౌశల్యం ప్రదర్శించేవారు. ఆయన పాండితీ ప్రకర్ష గురించి ఆనాడు ఎవరికీ ఎలాంటి సందేహం ఉండేది కాదు. ఎందుకంటే ఆయనకు జ్ఞానంలో, యుక్తిలో, అవగాహనలో, అన్వయింపులో వృద్ధి నొసగమని దైవప్రవక్త (సఅసం) ప్రార్థించి ఉన్నారు. ఈయన హిజ్రీ 3వ సంవత్సరంలో జన్మించారు. హిజ్రీ 67లో తాయఫ్‌లో మరణించారు.

2. హజ్రత్ మైమూన (ర.అన్హా) : ఈమె పూర్తి వంశపరంపర ఇలా వుంది - మైమూనా బిన్తె హారిస్ అల్ హిలాలియ. దైవ ప్రవక్త (స) హిజ్రీ 7వ సంవత్సరం ఈమెను వివాహమాడారు. హిజ్రీ 61 లేక 51 లేక 66లో ఈమె మరణించారు.

(٨) وعَنْ أَبِي هُرَيرةَ رضي اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ الله ﷺ: طُهُورُ إِنَاءِ أَحَدِكُمْ إِذَا وَلَغَ فِيهِ الكَلْبُ أَنْ يَغْسِلَهُ سَبْعَ مَرَّاتٍ، أُولاَهُنَّ بِالتُّرَابِ أَخرَجَهُ مُسْلِمٌ، وَفِي

8. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీలోని ఎవరి పాత్రలోనయినా కుక్క ఎంగిలి చేస్తే దాన్ని ఏడుసార్లు కడగాలి. అన్నిటి కన్నా ముందు మన్నుతో తోమి (పరి శుభ్రం చేయాలి)." (ముస్లిం) 'ఫల్ యురిఖ్' అనీ, అంటే దాన్ని పడ

لَفْظٍ لَهُ «فَلْيُرِقْهُ». وَلِلتِّرمِذِيِّ: «أُخْرَاهُنَّ أَوْ أُولَاهُنَّ بِالتُّرابِ».

వేయాలని 'ముస్లిం'లో నకలు చేయబడింది. మొదటిసారి లేదా ఆఖరిసారి మన్నుతో శుభ్రపరచాలన్న పదాలు 'తిర్మిజీ'లో పొందుపరచబడి ఉన్నాయి."

### సారాంశం

"తొలిసారి లేదా ఆఖరిసారి" అన్న అనుమానం బహుశా ఉల్లేఖకునిలో కలిగి ఉంటుంది. తొలిసారి మట్టితో కడిగినా, ఆఖరిలో మట్టితో కడిగినా అది కడిగేవాని ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండాలి. "మొదటిసారి" అనే పదం అనేక ఉల్లేఖనాలలో ఉండటం వల్ల, బుఖారీ మరియు ముస్లింలలో కూడా ఈ విధంగానే పేర్కొనబడటం మూలంగా "మొదటిసారి మన్నుతో తోమి శుభ్రపరచాల"న్న దానికే ప్రాధాన్యత నివ్వబడుతున్నది.

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యేదేమిటంటే, కుక్క నోరు, దాని చొంగ, ఎంగిలి అశుద్ధం. ఈ కారణంగానే దాని శరీరమంతా అశుద్ధంగా పరిగణించబడుతుంది. అది మూతి పెట్టిన పాత్రను ఏడుసార్లు కడగటం తప్పనిసరి అనటాన్ని బట్టి అది ఎంత అపవిత్రమైన జంతువో వ్యక్తమవుతోంది. పరిశోధకుల అభిప్రాయం కూడా ఇదే. ఏడుసార్లు కడిగి, ఒకసారి మన్నుతో తోమి శుభ్రపరచటం అభిలషణీయమేగాని అనివార్యం కాదని మరి కొంతమంది భావించారు. మూడుసార్లు కడిగితే చాలని ఇంకొంతమంది వాదించారు. కాని వాస్తవమేమిటంటే హదీసులోని ఆధారం ఈ రెండు వాదాలనూ సమర్థించదు. ఏడుసార్లు తప్పనిసరిగా కడగాలని హదీసులో చెప్పబడిందంటే అందులో ఎన్నో మర్మాలు, పరమార్థాలు ఇమిడి ఉంటాయి.

సాధారణంగా కుక్క ప్రేగుల్లో చిన్న చిన్న సూక్ష్మక్రిములు చాలా ఉంటాయని వర్తమాన కాలపు వైద్యులు స్పష్టపరుస్తున్నారు. అవి నాలుగు మిల్లీ మీటర్ల దాకా పొడవుంటాయి. కుక్క మల విసర్జన చేసినపుడు ఆ మలంతోపాటు అసంఖ్యాకమయిన అండాలు కూడా బయటకు వస్తాయి. మల విసర్జన భాగంలో (పిరుదుల వద్ద) వెంట్రుకలకు అతుక్కుపోతాయి. మల విసర్జన తరువాత కుక్క నాలుకతో తనను తాను పరిశుభ్రపరచుకుంటుంది. ఆ సమయంలో అండాలు దాని మూతికి తగులుతాయి. నోటి లోనికి ప్రవేశిస్తాయి. అనంతరం ఆ కుక్క నీళ్ల పాత్రలో మూతిపెట్టినా, నీరు త్రాగినా, లేక ఎవరయినా పాశ్చాత్యుల తరహాలో ఆ కుక్క మూతిని ముద్దు పెట్టుకున్నా ఆ అండాలు తక్షణం అంటుకుంటాయి. ఆ విధంగా అవి జీర్ణకోశంలోకి ప్రవేశిస్తాయి. ఆ అండాలలోంచి సూక్ష్మ క్రిములు జనించి జీర్ణకోశాన్ని చీల్చుకుని రక్త నాళాలలోకి ప్రవేశిస్తాయి. తత్కారణంగా హృద్రోగాలు, మెదడు వ్యాధులు రావటం, ఊపిరితిత్తులు చెడిపోవటం సంభవిస్తుంది. ఈ పరిణామాలన్నింటినీ పాశ్చాత్య వైద్యులు ఖుద్దుగా నిర్ధారించారు. ఈ సూక్ష్మక్రిములు గల కుక్కలను గుర్తించటం చాలా కష్టం.

షరీయత్ పరంగా కుక్కను అపవిత్ర, అశుద్ధ జంతువుగా ఖరారు చేయటం వెనుక ఇలాంటి పరమార్థాలు ఎన్నో ఉన్నాయి. అది ఎంగిలి చేసిన పాత్రను ఏడుసార్లు కడగాలనడంలోని మర్మం ఇదే. తద్వారా ఆ పాత్ర వీలయినంత అధికంగా పరిశుభ్రం కావాలన్నది అసలు ఉద్దేశ్యం. యదార్థ జ్ఞానం మాత్రం అల్లాహ్‌కే తెలుసు.

తినే, త్రాగే పదార్థాన్ని గనక కుక్క ఎంగిలి చేస్తే దాన్ని ఉపయోగించేబదులు పారవేయాలి. హదీసు బోధన ప్రకారం దాన్ని ఏడుతూర్లు కడగాలి. దీన్నిబట్టి కుక్క స్వతహాగా అపవిత్రమైనదేగాక, అది మూతిపెట్టిన వస్తువు సయితం అపవిత్రం అయిపోతుంది. ఒకవేళ మన వినియోగంలో వున్న పాత్ర అయితే దాన్ని ఏడుసార్లు కడగాలి. ముస్లింలోని ఉల్లేఖనంలో ఏడోసారి బదులు ఎనిమిదోసారి మన్నుతో తోమాలని ఉంది. అంటే మొదటిసారి మన్నుతో తోమి, ఆ తరువాత ఏడుసార్లు నీళ్లతో కడగాలి. ఇలా చేయటం వల్ల వీలైనంత ఎక్కువ పరిశుద్ధత ప్రాప్తమయి, సందేహానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా పోతుంది. మూడుసార్లు కడిగినా పరిశుభ్రమైపోతుందని హనఫీలు భావిస్తున్నారు. వాళ్లు తమ ఈ అభిప్రాయానికి ఆధారంగా దారెఖుత్నిలో పేర్కొనబడిన హజ్రత్ అబూహురైర (రజి) 'ఫత్వా'ను ఉదాహరిస్తున్నారు. కుక్క ఎంగిలిచేసిన పాత్రను మూడుసార్లు కడగాలని అందులో ఉంది. మరి చూడబోతే ఈయనగారు ఇచ్చిన మరో ప్రామాణిక ఫత్వాలో, అలాంటి పాత్రను 'ఏడుసార్లు కడగాలి' అన్న పలుకు కూడా ఉంది. ఇలాంటి ద్వంద్వాభి ప్రాయాలు ముందుకు వచ్చినపుడు మూల హదీసుకు అనుకూలంగానున్న ఫత్వాను తీసుకోవటం అభిలషణీయం. ప్రమాణబద్ధంగా చూసినా 'ఏడుసార్లు కడగాలి' అన్న ఫత్వా (తీర్పు) ఎక్కువ సరైనదిగా తోస్తున్నది (ఫత్‌హుల్ బారీ - సం-1, పేజీ - 277).

(٩) وعن أَبِي قَتَادة رضي الله تعالى عنه أَنَّ رَسولُ الله ﷺ قَالَ في الهِرَّة: «إِنَّهَا لَيسَتْ بِنَجَس، إِنَّمَا هِيَ مِنَ الطَّوَّافِينَ عَلَيْكُمْ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

9. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పిల్లి గురించి ఇలా ప్రవచించారని హజ్రత్ అబూ ఖతాద (రజి) వివరించారు: "అది అపవిత్రమైనది కాదు. ఎందుకంటే అది ఎల్లవేళలా వస్తూ పోతూ ఉండే పెంపుడు జంతువు." (దీనిని అబూ దావూద్, నసాయి, తిర్మిజీ, ఇబ్నెమాజాలు నలుగురూ ఉల్లేఖించారు. తిర్మిజీ మరియు ఇబ్నె ఖుజైమాలు దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీకరించారు).

## సారాంశం

హదీసు పూర్వరంగం ఏమిటంటే హజ్రత్ అబూ ఖతాద (రజి) వుజూ చేసే నీళ్ళ పాత్రను ఒకచోట ఉంచారు. అంతలో ఒక పిల్లి వచ్చి అందులో మూతిపెట్టి నీరు త్రాగసాగింది. దాని అవస్థను గమనించిన హజ్రత్ అబూ ఖతాద (రజి), పిల్లికి సౌలభ్యం కలిగించే ఉద్దేశ్యంతో ఆ పాత్రను వెంటనే ఒక ప్రక్కకు వంచారు. మీరెందుకిలా చేస్తున్నారు? అని జనులు ప్రశ్నించగా హజ్రత్ అబూ ఖతాద (రజి) ఇలా వివరించారు: "పిల్లి అశుద్ధమైనది కాదు" అని దైవప్రవక్త (స) ప్రవచించగా నేను విన్నాను.

పిల్లి ఎంగిలి అశుద్ధమైనది కాదని ఈ ఉల్లేఖనం ద్వారా రూఢీ అవుతోంది. అయితే అది ఏ పదార్థాన్నయినా ఎంగిలి చేసినపుడు దాని మూతికి అశుద్ధ వస్తువు తగిలి ఉండకూడదన్నది షరతు.

## హదీసు ఉల్లేఖకులు

'అబూ ఖతాద' మారు పేరు. అసలు పేరు హారిస్ బిన్ రిబయి. సుప్రసిద్ధ ప్రవక్త సహచరులలో ఒకరు. 'దైవప్రవక్త (స) గారి అశ్వం'గా బిరుదు లభించింది. అన్సార్లకు చెందిన వారవటంచేత అన్సారీగా కూడా వ్యవహరించబడేవారు. ఈయన ఉహుద్ యుద్ధంలో పాల్గొన్నారు. ఈయన మరణకాలం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. హిజ్రీ 40లో మరణించారని కొంతమంది, హిజ్రీ 54వ యేట పరమపదించారని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. రెండవ అభిప్రాయమే బలమైనది, సుప్రసిద్ధమైనది.

10. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒక పల్లెటూరి బైతు వచ్చి మస్జిదు మూలన మూత్ర విసర్జన చేస్తుండగా ప్రజలతనికి చీవాట్లు పెట్టసాగారు. అయితే దైవప్రవక్త (సఅసం) చీవాట్లు పెట్టరాదని వారించారు. ఆ వ్యక్తి తాపీగా మూత్ర విసర్జన చేసిన పిమ్మట దైవప్రవక్త (సఅసం) ఒక బొక్కెన నీరు తెప్పించి, ఆ (అశుద్ధ) స్థలంలో పారపోశారు." (బుఖారీ, ముస్లిం)

(١٠) وعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رضي الله تعالى عنه قال: جَاءَ أعرابِيٌّ، فَبَالَ في طَآئِفَةِ الْمَسْجِدِ، فَزَجَرَهُ النَّاسُ، فَنَهَاهُمْ رسولُ الله ﷺ، فلما قَضَى بَولَهُ أَمَرَ النَّبِيُّ ﷺ بِذَنُوبٍ من مَآءٍ فَأُهْرِيقَ عَلَيْه. مُتَّفَقٌ عَلَيْهِ.

## సారాంశం

ఇంతకీ ఆ పల్లెటూరి వ్యక్తి ఎవరు? ఆయన పేరు జుల్ ఖువైసర యమానీ అనీ, ఆయన పెద్ద బొజ్జ కలవారనీ చెప్పబడుతోంది. మస్జిద్ మూల ప్రదేశంలో మూత్రం పోయటం చూసి జనం ఆయన్ని ఈసడించుకుంది. తీవ్రంగా మందలించింది. అంతలో ఆ దృశ్యం చూసిన దైవప్రవక్త (సఅసం) మందలిస్తున్న వారినే మందలించి, మూత్ర విసర్జనను మధ్యలో అడ్డుకొనకుండా ఉండేలా ప్రయత్నిం చారు. ఎందుకంటే మూత్ర విసర్జనను మధ్యలో ఆపటం వల్ల పురుషుని పురుషాంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలా చేయటం వల్ల ఒక్కోసారి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం కూడా ఉంది. అదీగాక మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తిని మధ్యలో హడావిడి చేసి ఆపినట్లయితే, అతను అక్కడినుండి లేచి మరోచోటకు వెళతాడు. ఆ కంగారులో మూత్రపు బొట్లు అతని లుంగీపై పడవచ్చు, లేదా మూత్రం ధారాపాతంగా ప్రవహించి మస్జిదులోని ఇతరచోట్ల కూడా అశుద్ధత వ్యాపించవచ్చు. అందుకే మహాప్రవక్త (సఅసం) ఆ సమయంలో సమయోచితంగా స్పందించి గొడవ చేసే జనులను తొలుత శాంతింపజేశారు. ఆ తర్వాత బొక్కెన నీరు తెప్పించి మూత్రం పోయబడిన అశుద్ధ స్థలంపై కుమ్మరించారు. దాంతో ఆ అశుద్ధత కాస్తా దూరమైపోయింది.

'తిర్మిజీ'లో కూడా ఈ హదీసు హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ద్వారా సరిగ్గా ఇలాగే విశదీకరించబడింది. తిర్మిజీలో దీని నిజ నిర్ధారణ కూడా జరిగింది. ఈ హదీసు ద్వారా మనిషి మూత్రం అశుద్ధమైనదని రూఢీ అవుతోంది. ఈ విషయంపై ముస్లిం సమాజంలో ఏకాభిప్రాయం ఉంది. నేల ఒకవేళ అశుద్ధమైనదయితే నీళ్ల ద్వారా అది పరిశుభ్రమవుతుందని కూడా ఈ అంశాన్నిబట్టి వెల్లడవుతోంది. ఈ హదీసు ద్వారా వెల్లడయ్యే మరికొన్ని ముఖ్యాంశాలు : మస్జిద్ ఔన్నత్యాన్ని కాపాడటం, అవివేకి అయిన వ్యక్తిపట్ల మృదువుగా వ్యవహరించటం, కరకుగా వ్యవహరించకపోవటం, సమయోచితంగా వ్యవహరించి దైవప్రవక్త (స) సమస్యను ఉత్తమ రీతిలో పరిష్కరించటం - ఇత్యాది విషయాలు అనుసరణీయమైనవి.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ అనస్ (రజి) దైవప్రవక్త (సఅసం) గారి ప్రత్యేక సేవకులు. ఆయన తల్లి ఉమ్మె సులైమ్ ఆయన్ని బాల్యంలోనే దైవప్రవక్త (స) గారి సేవకై అంకితం చేశారు. చివరి క్షణాల వరకూ ఈయన దైవప్రవక్త (స) సేవలో నిమగ్నులై ఉన్నారు. అబూ హమ్జా (రజి) ఈయనకు గల మరో పేరు. ఖజ్రజ్ తెగకు చెందిన 'నజ్జార్' వర్గానికి చెందినవారు. ఈ కారణంగా ఈయన నజ్జారీ ఖజ్రజీ అని కూడా పిలువబడేవారు. హి॥ 91లో పరమపదించారు. బస్రాలో ఈయన అంత్యక్రియలు జరిగాయి.

(١١) وعن ابن عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رسولُ الله ﷺ: «**أُحِلَّتْ لَنَا مَيْتَتَانِ وَدَمَانِ، فَأَمَّا المَيْتَتَانِ فَالجَرَادُ وَالحُوتُ، وَأَمَّا الدَّمَانِ فَالكَبِدُ وَالطِّحَالُ**». أَخْرَجَهُ أَحْمَدُ وابْنُ مَاجَهْ، وَفِيهِ ضَعْفٌ.

11. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "రెండు రకాల మృత వస్తువులు (జంతువులు) మరియు రెండు రక్తాలు మన కొరకు హలాల్ (ధర్మ సమ్మతం) గావించబడ్డాయి. (జిబహ్ చేయబడని) ఆ రెండు వస్తువులలో ఒకటి: మిడుత, రెండవది: చేప. మిగిలిన రెండు రక్తాలలో ఒకటి : కాలేయం, రెండవది: గుల్మము" (అహ్మద్, ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖిం చారు. ఇందులో కొంత బలహీనత కానవస్తుంది).

## సారాంశం

'మిడుత' ఎట్టి పరిస్థితిలోనూ హలాల్ (ధర్మ సమ్మతం) అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అది సహజ మరణం పొందినా లేక వేరితర కారణంగా మరణించినా దానిని తినటంలో ఎలాంటి ఆక్షేపణ లేదు. మిడుతను మనిషి వేటాడటం వల్ల గానీ, తల తెగటం వల్లగానీ మరణిస్తే హలాల్ అవుతుందనీ, ఇతరత్రా కారణాల వల్ల మరణిస్తే హలాల్ కాజాలదని ఇమామ్ మాలిక్

(రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. చేప విషయంలోనూ అంతే. దాన్ని పట్టుకునే సమయంలో అది మరణించినా, సముద్రపు అలల తాకిడికి తట్టుకోలేక బయటపడి మరణించినా - రెండు పరిస్థితులలోనూ అది ధర్మసమ్మతమే. హనఫీ శాస్త్రం ప్రకారం పై రెండు పరిస్థితుల్లోను చేప ధర్మ సమ్మతమే గానీ, ఒకవేళ చేప దానంతట అదే మరణిస్తే లేక ఏదైనా జంతువు వాతన పడి మరణిస్తే మట్టుకు ధర్మ సమ్మతం కాదు, అది నిషిద్ధం.

(١٢) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ اللهِ ﷺ: «إِذَا وَقَعَ الذُّبَابُ فِي شَرَابِ أَحَدِكُمْ فَلْيَغْمِسْهُ، ثُمَّ لِيَنْزِعْهُ فَإِنَّ فِي أَحَدِ جَنَاحَيْهِ دَاءً، وَفِي الآخَرِ شِفَاءً». أَخْرَجَهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ، وَزَادَ: «وَإِنَّهُ يَتَّقِي بِجَنَاحِهِ الَّذِي فِيهِ الدَّاءُ».

12. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీరు త్రాగే పానీయాలలో ఎప్పుడయినా ఈగ గనక పడితే దాన్ని అందులో ముంచి మరీ తీయాలి. ఎందుకంటే దానికి చెందిన ఒక రెక్కలో రోగం (రోగ క్రిములు) ఉండగా రెండవ రెక్కలో రోగ నివారణ ఉంది" (దీనిని బుఖారీ, అబూ దావూద్‌లు ఉల్లేఖించారు). అబూ దావూద్‌లోని ఉల్లేఖనంలో ఒక వాక్యం అదనంగా ఉంది. అది : "ఈగ పానీయంపై వాలినపుడు వ్యాధిక్రిములు వున్న రెక్కనే అందులో ముంచుతుంది."

## సారాంశం

అంటే ఈగ తనను సురక్షితంగా ఉంచుకునే ఉద్దేశ్యంతో వ్యాధి నివారణతో కూడుకున్న రెక్కను నీళ్లలో ముంచకుండా జాగ్రత్తపడుతుంది. ఇమామ్ అహ్మద్ (రజి), ఇబ్నె మాజ (రహ్మ.లై)ల అభిప్రాయంలో ఈగ తన విషపూరితమయిన రెక్కను ముందు వైపు, వ్యాధి నివారణకు ఉద్దేశించిన రెక్కను వెనుకవైపు ఉంచుతుంది. ఈగను ఆ పానీయంలో ముంచి తీయటం వల్ల అది రోగానికి విరుగుడు అవుతుంది. మొదటి రెక్క ద్వారా సోకిన విషపూరిత క్రిములు రెండవ రెక్క యొక్క చికిత్స ద్వారా నిర్వీర్యమవుతాయి.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఇంకొక విషయం ఏమిటంటే ఈగ గనక ఏదైనా ద్రవపదార్థంలో పడి చచ్చిపోయినంత మాత్రాన అది అశుద్ధం కాబోదు. దీనిద్వారా మరో ఆదేశం కూడా వెలికి తీయబడింది. అదేమంటే ప్రసరించే రక్తమే లేని కీటకాలు, ఉదాహరణకు : తేనెటీగ, గండు చీమ, వాటిని పోలిన ఇతరత్రా కీటకాలు గనక పానీయాలలోనూ, ప్రవహించే వాటిలోనూ పడి చచ్చిపోతే ఆ మాత్రానికే అది అశుద్ధమైపోదు. ఎందుకంటే ఇటువంటి వాటి శరీరంలో రక్తం ఉండదు. ఏదైనా వస్తువు అశుద్ధం అవడానికి రక్తస్రావం ప్రధాన కారణం అయి ఉంటుంది.

ఈ హదీసు వల్ల తేటతెల్లమయ్యే మరొక విషయం ఏమిటంటే, నష్టాన్ని నివారించే ఉద్దేశ్యంతో

ఈగను చంపటం సమ్మతమే. అంతేగాని తగు కారణం ఏదీ లేకుండా చంపటం వాంఛనీయం ఎంతమాత్రం కాదు. సాధారణంగా ఈగ వేడి ద్రవపదార్థంలో పడగానే చచ్చిపోతుంది. ఒక్కోసారి చల్లని పానీయాలలో ముంచినా అది చనిపోతుంది. మనం త్రాగే ఏ పదార్థంలో ఈగ పడిపోయినా అది అపవిత్రం, అశుద్ధం కాజాలదు. అట్టి పరిస్థితిలో మనం దానిని ఆ పదార్థంలో ముంచి మరీ బయట పారవేయాలి.

(١٣) وعَنْ أَبِي واقِدٍ اللَّيثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ الله ﷺ: «مَا قُطِعَ مِنَ البَهِيمَةِ، وَهِيَ حَيَّةٌ، فَهُوَ مَيِّتٌ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَاللَّفْظُ لَهُ.

13. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (రజి) తెలిపారు : ''బ్రతికి ఉన్న పశువులలో నుంచి ఏ భాగం కోసుకున్నా అది మృత భాగమే అవుతుంది.'' (దీనిని అబూ దావూద్, తిర్మిజీలు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు).

**సారాంశం**

పూర్వం అజ్ఞానం ఆవరించిన అరబ్బులు బ్రతికి ఉన్న పశువులలో నుంచి కొంత మాంసాన్ని కోసుకుని తినేవారు. ఈ హదీసు క్రూరాతిక్రూరమైన ఆ చేష్టను ఖండిస్తూ, అది మృత పశువు మాంసంతో సమానమని చెప్పింది. మృత పశువు మాంసం హరామ్ (నిషిద్ధం) అన్నది గమనార్హం.

**హదీసు ఉల్లేఖకులు**

ఈ హదీసును ఉల్లేఖించిన వారు అబూ వాఖిద్ లైసీ. అబూ వాఖిద్ మారు పేరు. అసలు పేరు హారిస్ బిన్ ఔఫ్. బనీ ఆమిర్ బిన్ లైస్‌కు చెందిన వారవటం చేత లైసీగా పిలువబడేవారు. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. మదీనా వాసులు. కాని తన చివరి కాలంలో మక్కాలో స్థిరపడ్డారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారని భావించబడుతోంది. హి॥ 65 లేక 67వ యేట మరణించారు.

**రెండవ అధ్యాయం**

## వంటపాత్రలు

## ٢ - بَابُ الآنِيَةِ

(١٤) عَنْ حُذَيْفَةَ بْنِ اليَمَانِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رسولُ الله ﷺ: «لاَ تَشْرَبُوا فِي آنِيَةِ الذَّهَبِ وَالفِضَّةِ وَلاَ تَأْكُلُوا

14. హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ''బంగారు, వెండి పాత్రలలో తినడంగానీ, త్రాగటంగానీ చేయకండి. ప్రాపం

فِي صِحَافِهَا، فَإِنَّهَا لَهُمْ فِي الدُّنْيَا وَلَكُمْ فِي الْآخِرَةِ». مُتَّفَقٌ عَلَيْهِ.

చిక జీవితంలో ఇవి అవిశ్వాసుల కొరకు ఉద్దేశించినవి. పరలోకంలో మాత్రం కేవలం మీకే ప్రత్యేకం."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

బంగారు, వెండి పాత్రలలో తినటం, త్రాగటం నిషిద్ధమనీ, అటువంటి పాత్రలను వుజూ కొరకు ఉపయోగించటం కూడా వాంఛనీయం కాదనీ ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. అయితే వజ్ర వైఢూర్యాలు, పగడాలు పొదగబడిన పాత్రలలో తినటం, త్రాగటం, వాటిని వుజూ కొరకు ఉపయో గించటం ధర్మసమ్మతమే. కాని బంగారు, వెండి నీరు (పూత) పట్టించిన పాత్రల్ని ఉపయోగించే విషయంపై అభిప్రాయ భేదం ఉంది. ఇలాంటి అనుమానాస్పద అంశాలలో సయితం జాగ్రత్తపడటం మంచిది.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ హుజైఫా (రజి) గారి మరో పేరు అబూ అబ్దుల్లాహ్. సుప్రసిద్ధ సహాబీ. దైవప్రవక్త (సఅసం)కు ఎంతో సన్నిహితులు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతినొందిన నలభై రోజులకు ఈయన గారు మదయన్‌లో - హిజ్రీ 36వ సంవత్సరంలో మరణించారు.

(١٥) وعن أُمِّ سَلَمَةَ رَضِيَ اللّٰهُ تَعالَى عَنها قالت: قَالَ رسولُ الله ﷺ: «الَّذِي يَشْرَبُ فِي إِنَاءِ الفِضَّةِ إِنَّمَا يُجَرْجِرُ فِي بَطْنِهِ نَارَ جَهَنَّمَ». مُتَّفَقٌ عَلَيْهِ.

15. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "వెండి పాత్రలలో (తినే) త్రాగేవాడు తన పొట్టను నరకాగ్నితో నింపుకుం టాడు."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసులో కూడా బంగారు, వెండి పాత్రలను ఉపయోగించడంపై వారింపు ఉంది. ఈ వారింపును ఖాతరు చేయని వారికి పట్టే గతి ఏమిటో కూడా స్పష్టపరచబడింది.

## హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె సలమా (ర.అ) గారి అసలు పేరు 'హింద్ బిన్తె అబూ ఉమయ్య.' అబూ సలమా అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ అస్వద్ మఖ్జూమీ గారి సతీమణి. అబిసీనియా (నేటి ఇథియోపియా)కు మొదట హిజ్రత్ చేసిన అనుయాయులలో ఈమె కూడా ఉన్నారు. ఉహుద్ సంగ్రామంలో కలిగిన గాయం వల్ల అబూ సలమా మరణించారు. ఆయన మరణానంతరం హిజ్రీ 4వ సంవత్సరం షవ్వాల్ నెలలో మహాప్రవక్త (సఅసం) ఉమ్మె సలమాను తన దాంపత్యంలోకి తెచ్చుకున్నారు. హిజ్రీ 59 లేక 62లో ఈమె మరణించారు. అప్పటికి ఆమెకు 84 ఏళ్లు. జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(١٦) وعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رسولُ الله ﷺ: «**إِذَا دُبِغَ الإِهَابُ فَقَدْ طَهُرَ**». أَخْرَجَهُ مُسْلِمٌ، وَعِنْدَ الأَرْبَعَةِ «**أَيُّمَا إِهَابٍ دُبِغَ**».

16. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) వివరించారు: "ముడి చర్మాన్ని లవణాలతో రంగరిస్తే (రసాయనిక ప్రక్రియలో పెడితే) అది పరిశుభ్రమైపోతుంది" (ముస్లిం). సుననె అరబాలో ఈ పదాలు కూడా ఉన్నాయి - "ఏ చర్మమైనా సరే దాన్ని రంగరించవచ్చు)."

**సారాంశం**

అన్ని రకాల చర్మాలు, అన్ని కోవలకు చెందిన జంతువుల చర్మాలు ఇందులోకి వస్తాయని హదీసు ద్వారా అర్థం వస్తోంది. అయితే పంది చర్మం మాత్రం దీనికి వర్తించదు. చాలామంది ధర్మవేత్తల దృష్టిలో కుక్క చర్మం కూడా ఈ వినాయింపులోనికి వస్తుంది. ఏ ఏ జంతువుల, మృగాల మాంసం తినకూడదో ఆ చర్మాలు సయితం ఉపయోగంలోనికి తేవచ్చునని పరిశోధన జరిపిన పండితులు నిర్ధారించారు.

హలాల్ జంతువు అయినా, హరామ్ జంతువు అయినా, జిబహ్ చేయబడిన జంతువు అయినా, సహజ మరణం పొందిన జంతువు అయినా రసాయనిక ప్రక్రియ అనంతరం అది పరిశుభ్రమైపోతుందని పై హదీసు ద్వారా స్పష్టంగా అవగతమవుతున్నది. ఈ సాధారణ సూత్రాన్ని అన్వయించిన మీదట కూడా కొన్ని రకాల జంతు చర్మాలు ఉప్పు పట్టించిన తరువాత పరిశుభ్రం మరియు ధర్మ సమ్మతం కాజాలవు. ఉదాహరణకు : పంది. అది 'నజసె ఐన్' (పరమ అశుద్ధం) కావటం మూలంగా దాని చర్మం సయితం అశుద్ధంగానే భావించబడుతోంది. అలాగే మానవ చర్మం కూడా దానికున్న వైశిష్ట్యం, ఔన్నత్యం కారణంగా ఉపయోగంలోకి తేవటం నిషేధించబడింది. తక్బీర్ పలికి కోయబడిన పక్షంలో కుక్క, పంది చర్మాలను కూడా ఉపయోగించవచ్చునని కొంతమంది అభిప్రాయపడ్డారు. కాని ఈ అభిప్రాయం సరైనది కాదు. అలాగే రసాయనిక ప్రక్రియ అనంతరం కుక్క చర్మాన్ని కూడా పరిశుభ్రమైనది (సమ్మతమైనది)గా కొంతమంది ధర్మవేత్తలు భావించటం కూడా సముచితం అనిపించదు.

ఏ ఏ జంతువుల చర్మాలు రసాయనిక ప్రక్రియ అనంతరం పరిశుద్ధమవుతాయో వాటి కొమ్ములు, వెంట్రుకలు, దంతాలు, ఎముకలను కూడా ఉపయోగంలోకి తీసుకురావచ్చు. వాటి క్రయ విక్రయాలు జరపవచ్చు.

(١٧) وعن سَلَمَةَ بْنِ الْمُحَبِّقِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قال رسولُ الله ﷺ:

17. హజ్రత్ సలమ బిన్ ముహబ్బిఖ్ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "మృత జంతువుల చర్మాలను (ఉప్పు తదితర

«دِبَاغُ جُلُودِ المَيْتَةِ طَهُورُهَا». صَحَّحَهُ ابْنُ حِبَّانَ.

పదార్థాలతో) రంగరించటమే వాటి శుచీ శుభ్రత." (ఇబ్నె మాజ దీని ప్రామాణికతను ధృవీకరించారు).

### హదీసు ఉల్లేఖకులు

సలమగారి వేరొక పేరు అబూ సుఫ్యాన్. బస్రీ సహబీలలో ఒకరుగా పరిగణించబడతారు. ఆయన హునైన్ యుద్ధంలో నిమగ్నులై ఉండగా, ఆయనకు ఆయన పుత్రుడు 'సినాన్' పుట్టాడన్న శుభవార్త ఇవ్వబడింది. ఆ సమయంలో ఆయన ఇలా పలికారు : "ఈ శుభవార్త వల్ల కలిగిన ఆనందం దైవప్రవక్త (సఅసం) కు రక్షాకవచంగా నిలిచి నేను బాణం ప్రయోగించినపుడు కలిగిన ఆనందం కన్నా ఎక్కువేమీ కాదు."

(١٨) وعَنْ مَيْمُونَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مَرَّ النَّبِيُّ ﷺ بِشَاةٍ يَجُرُّونَهَا، فَقَالَ: «لَوْ أَخَذْتُمْ إِهَابَهَا» فَقَالُوا: إِنَّهَا مَيْتَةٌ، فَقَالَ: «يُطَهِّرُهَا المَاءُ والقَرَظُ». أَخْرَجَه أَبُو دَاوُدَ وَالنَّسَائِيّ.

18. హజ్రత్ మైమూన (ర.అన్హా) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సాగిపోతున్న దారిలో కొంత మంది చనిపోయిన మేకను ఈడ్చుకుంటూ వెళ్ళడం గమనించారు. ఆయన (స) వాళ్ళ నుద్దేశ్యించి, "మీరు దీని చర్మాన్ని వలచుకున్నా బావుండేదే!" అని అన్నారు. 'ఇది చచ్చి పోయింది కదా!' అని వాళ్ళు సందేహ పడ్డారు. "(చచ్చిపోతే మాత్రం ఏమయింది?) దీనిని నీరు మరియు తుమ్మ బెరడు పరిశుభ్రపరుస్తాయి కదా!" అని ఆయన (స) సమాధానమిచ్చారు." (అబూ దావూద్, నసాయి)

### సారాంశం

మృత జంతువుల చర్మాలు రసాయనిక ప్రక్రియ ద్వారా శుభ్రమవుతాయనీ, అటువంటి చర్మాలతో తయారుచేయబడిన వస్తువులు, పాత్రలతో 'వుజూ' సయితం చేయవచ్చుననీ ఈ హదీసు ద్వారానూ, ఇంతకు ముందు వచ్చిన రెండు హదీసుల ద్వారానూ బోధపడుతోంది.

చనిపోయిన చతుష్పాదాల చర్మం వలచి రంగరించినట్లయితే అవి పరిశుభ్రంగా తయారవుతాయి. అటువంటి చర్మాలతో నీళ్లు తోడవచ్చు. నీళ్ళ తిత్తి కూడా తయారుచేయవచ్చు. ఇతరత్రా కూడా వాటిని ఉపయోగించవచ్చు.

(١٩) وعَنْ أَبِي ثَعْلَبَةَ الْخُشَنِيِّ رَضِيَ

19. హజ్రత్ అబూ సాలబ ఖుష్నీ (రజి) కథనం: 'ఓ దైవ ప్రవక్తా (సఅసం)!

اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللّٰهِ إِنَّا بِأَرْضِ قَوْمٍ أَهْلِ كِتَابٍ، أَفَنَأْكُلُ فِي آنِيَتِهِمْ؟ قَالَ: «لاَ تَأْكُلُوا فِيهَا إِلاَّ أَنْ لاَ تَجِدُوا غَيْرَهَا، فَاغْسِلُوهَا، وَكُلُوا فِيهَا». مُتَّفَقٌ عَلَيْهِ.

మేము గ్రంథవహుల ప్రాంతంలో ఉంటాము. వారు ఉపయోగించే పాత్రలలో మేము భోజనం చేయవచ్చా?' అని నేను ప్రశ్నించాను. దీనికి సమాధానంగా ఆయన (స) ఇలా ప్రబోధించారు: "వారి పాత్రలలో తినకండి. అయితే ఒకవేళ వారి పాత్రలు తప్ప అసలు పాత్రలే లేనపుడు వాటిని శుభ్రంగా కడిగి వాటిలో తినవచ్చు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

గ్రంథవహులు - అంటే యూదులు, క్రైస్తవులు - ఉపయోగించే పాత్రలలో తినటం, త్రాగటం, వుజూ చేయడం ధర్మసమ్మతం కాదని ఈ హదీసు సూచిస్తోంది. కారణం సుస్పష్టమే. వాళ్లు ధర్మ సమ్మతం కాని మాంసాహారాలు అందులో వండుతారు. తింటారు. గ్రంథవహుల పాత్రలలో తినటం, త్రాగటమే ధర్మ సమ్మతం కానపుడు ఇతర మతాల వారు, నాస్తికులు ఉపయోగించే పాత్రలలో తినటం, త్రాగటం కూడా ధర్మసమ్మతం కాజాలదు.

**హదీసు ఉల్లేఖకులు**

అబూ సాలబ ఖుష్నీ 'బైతె రిజ్వాన్' సహచర బృందంలో ఒకరు. ఆయన తన తెగవారి వైపునకు పంపబడగా వారంతా ఇస్లాం స్వీకరించారు. సిరియాలో స్థిరపడ్డారు. హి.శ. 75వ యేట పరమపదించారు. ఆయన నమాజ్ చేస్తూ ఉండగా - సజ్దాలో ఉండగా - ఆత్మ ఊర్ధ్వలోకాలకు ప్రస్థానం చేసింది. ఈయనగారి అసలు పేరు గురించి తీవ్రమయిన భేదాభిప్రాయం ఉంది. మారు పేరుతోనే వినుతికెక్కారు.

(٢٠) وعَنْ عِمْرانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللّٰه تعالى عَنْهُمَا: أَنَّ النَّبِيَّ ﷺ وأَصْحابَه تَوَضَّؤُوا مِن مَزادَةِ امْرَأَةٍ مُشْرِكَةٍ مُتَّفَقٌ عَلَيْهِ في حَدِيْثٍ طَوِيْلٍ.

20. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహచరులు (ర.అన్హుం) ఒక ముష్రిక్కు స్త్రీ నీళ్ల తిత్తి నుండి నీరు తీసుకుని 'వుజూ' చేశారు." (బుఖారీ, ముస్లిం - ఇదొక సుదీర్ఘ హదీసులోని భాగం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా గ్రంథవహుల పాత్రలేగాక, బహుదైవారాధకుల వినియోగంలోనున్న పాత్రలు సయితం పరిశుద్ధమైనవన్న సంగతి విదితమవుతోంది. మృత జంతువు యొక్క చర్మం

రసాయనిక ప్రక్రియ అనంతరం పరిశుద్ధమైపోతుందన్న సంగతి కూడా మరోసారి ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఎందుకంటే ఆయన (స) తీసుకున్న నీళ్లతిత్తి ఒక అవిశ్వాస స్త్రీ అధీనంలోనిది. అవిశ్వాసులు కోసిన జంతువు నుండి తీసిన చర్మంతో ఆ తోలు తిత్తి తయారుచేయబడింది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే అవిశ్వాసులు ఉపయోగించే పాత్రలలో - నిషిద్ధ వస్తువులు లేవని నిర్ధారణ అయినపుడు - నిస్సంకోచంగా వాటిని వాడుకోవచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) అగ్రశ్రేణి సహాబాలో ఒకరుగా పేర్కొనబడతారు. ఈయనకు గల మరో పేరు అబూ నుజీద్. ఖైబర్ యుద్ధకాలంలో ఇస్లాంలో చేరారు. బస్రాలో స్థిరపడ్డారు. బస్రాలోనే హి.శ. 52 లేక 53లో మరణించారు.

(٢١) وعن أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ الله تعالى عنه: أَنَّ قَدَحَ النَّبِيِّ ﷺ انْكَسَرَ فَاتَّخَذَ مَكَانَ الشَّعْبِ سِلْسِلَةً مِنْ فِضَّةٍ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

21. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం) గారి స్వంత పాత్ర ఒకటి విరిగిపోగా, విరిగిన చోట ఆయన (స) వెండి తారుతో కుట్టి అతుకు వేశారు." (బుఖారీ)

### సారాంశం

విరిగిపోయిన, తెగిపోయిన, చినిగిపోయిన వస్తువులను జోడించే నిమిత్తం కొద్దిపాటి వెండి తారును ఉపయోగించటంలో తప్పులేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అదే విధంగా తినే, త్రాగే పాత్రలలో అక్కడక్కడా - కొద్దిగా -వెండి బంగారు నగిషీ ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించవచ్చు. వుజూ, గుసుల్ కోసం కూడా ఆ పాత్రలను నిస్సంకోచంగా వాడుకోవచ్చు. అయితే అధిక మోతాదులో లేక పూర్తిగా బంగారు, వెండి ఉన్న పాత్రలను ఉపయోగించకూడదు. అలా ఉపయోగించటంవల్ల గర్వం, డాబు, దర్పం వ్యక్తమవుతాయి. ఇలాంటి డాబుసరిని, బడాయితనాన్ని సృష్టికర్త ఇష్టపడడు. అందుకే వాటి వాడకం అధర్మంగా ఖరారు చేయబడింది. కాకపోతే విరిగిపోయిన, తెగిపోయిన వాటిని జోడించే, కుట్లువేసే ఉద్దేశ్యంతో తారు ఉపయోగిస్తే అది అభ్యంతరకరం కాదు. అలా చేయటంలో గర్వం, బడాయి వ్యక్తం కావు.

### మూడవ అధ్యాయం

## మాలిన్యం, దాన్ని దూరం చేసే విధము

## ٣ - بَابُ إِزَالَةِ النَّجَاسَةِ وَبَيَانِهَا

(٢٢) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ رضي الله عنه قَالَ: سُئِلَ رَسُولُ الله ﷺ عَنِ الخَمْرِ تُتَّخَذُ

22. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) వివరించారు : "సారాయిని పులియబెట్టి 'కాడి' (సిర్కా)ని తయారు చేయటం గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి

خَلاًّ؟ قال: «لاَ». أَخْرَجَهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَقَالَ حَدِيثٌ حَسَنٌ صَحِيحٌ

వ సల్లం)ను దర్యాప్తు చేయగా ఇలా చేయరాదు అని ఆయన (స) నొక్కి పలి కారు.'' (ముస్లిం, తిర్మిజీ. దీన్ని ప్రామాణికమైనదిగా తిర్మిజీ ధృవీకరించారు).

**సారాంశం**

మద్యం (షరాబు, సారాయి) ద్వారా తయారుచేసే 'సిర్కా' లేక కాడి నిషిద్ధం (హరామ్) అన్నదానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. అయితే ఈ విషయమై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. వాస్తవానికి ఒక వస్తువు తన యథాస్థితిని కోల్పోతే దానికి సంబంధించిన ఆదేశాలు కూడా మారతాయి. మద్యం గనక తన నిజస్థితిని కోల్పోయి సిర్కాగా మారిపోతే అప్పుడు కూడా నిషిద్ధంగానే పరిగణించబడుతుందా? అన్న విషయంపై ఒక నిర్దిష్టమయిన అభిప్రాయం లేదు. అయితే మద్యాన్ని 'సిర్కా'గా మార్చటాన్ని మాత్రం వారించటం జరిగింది.

ఈ హదీసు యొక్క పూర్వాపరాలు ఇలా ఉన్నాయి - హజ్రత్ అబూ తల్హా (రజి) దగ్గర అనాథల మద్యం అప్పగింతగా ఉండేది. మద్యపానం నిషేధించబడిందన్న దైవాజ్ఞ రాగానే పాపం ఆ అనాథలకు తీవ్రమయిన నష్టం కలుగుతుందికదా! అని ఆయనకు జాలి కలిగింది. ఈ నష్టాన్ని నివారించే ఉద్దేశ్యంతోనే ఆయన దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, మద్యాన్ని సిర్కాగా మార్చేందుకు అనుమతి కోరారు. కాని అలా చేయరాదని దైవప్రవక్త (స) తాకీదు చేశారు. ఇంత స్పష్టంగా వారించిన మీదట కూడా ఎవరయినా మద్యం ద్వారా సిర్కాను తయారుచేయవచ్చని తీర్పు (ఫత్వా) ఇస్తే అతడు ధర్మోపదేశాన్ని ఉల్లంఘించినట్లే లెక్క. ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే మద్యానికి సంబంధించిన ఏ రకాన్ని వినియోగించినా, మద్యం నుండి ఎలాంటి ద్రవపదార్థాన్ని వడబోసి తీసినా అది అధర్మమే అవుతుంది.

(٢٣) وعَنْهُ قَالَ: لَمَّا كَانَ يَومُ خَيْبَرَ أَمَرَ رَسُولُ الله ﷺ أَبَا طَلْحَةَ فَنَادَى: أَنَّ اللَّهَ وَرَسُولَهُ يَنْهَيَانِكُمْ عَنْ لُحومِ الْحُمُرِ الأَهْلِيَّةِ، فإِنَّها رِجْسٌ. مُتَّفَقٌ عَلَيْه.

23. హజ్రత్ అనస్ (రజిఅన్) కథనం : ''ఖైబర్ యుద్ధం జరిగిన రోజున దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశానుసారం అబూ తల్హా (రజి) బిగ్గరగా ప్రకటన గావించారు - ''పెంపుడు గాడిదల మాంసాన్ని మీరు తినడాన్ని దైవం మరియు దైవప్రవక్త (సఅసం) వారిస్తున్నారు. ఎందుకంటే అవి అశుద్ధమైనవి.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

గాడిద మాంసం హరామ్ (నిషిద్ధం) అనే విషయంలో ఏకాభిప్రాయం ఉంది. కేవలం ఇబ్నె

అబ్బాస్ మాత్రమే దీనిని ధర్మసమ్మతంగా భావిస్తున్నారు. గాడిద ఎంగిలి నలుగురు ఇమాముల దృష్టిలోనూ పరిశుద్ధమైనదే. కొద్దిమంది ధర్మశాస్త్రవేత్తలు మాత్రమే దీనిని అశుద్ధంగా తలపోస్తున్నారు. ఉదాహరణకు : ఇమామ్ హసన్ బస్రీ (రహ్మ.లై), ఇమామ్ ఔజాయి (రహ్మ.లై) ప్రభృతులు. ఈ వ్యవహారంలో నలుగురు ఇమాముల అభిప్రాయం ఎక్కువ ప్రాధాన్యతతో కూడుకున్నది, అనుసరణీయమైనది.

## హదీసు ఉల్లేఖకులు

పెంపుడు గాడిద మాంసం నిషేధం గురించి ఎలుగెత్తి ప్రకటించిన ప్రవక్త సహచరుడు అబూ తల్హా (రజి). పెద్ద సహాబాల్లో ఒకరు. అబూ తల్హా (రజి) మారు పేరు. అసలు పేరు జైద్ బిన్ సహ్ల్ బిన్ అస్వద్ బిన్ హరామ్ అన్సారీ. అఖబాలో బైత్ (ప్రమాణం) చేసిన వారిలో ఈయన కూడా ఉన్నారు. ముఖ్యమయిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఉహుద్ సంగ్రామంలో దైవప్రవక్త (సఅసం) కు రక్షణగా నిలిచిన సమయంలో చేతికి తీవ్రమయిన గాయం అయింది. హునైన్ యుద్ధంలో 20 మంది శత్రు సైనికులను సంహరించారు. హి.శ. 34లో మరణించారని కొందరూ, 54లో పరమపదించారని మరికొందరూ వాదిస్తున్నారు.

(٢٤) وعن عَمْرِو بْنِ خَارِجَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: خَطَبَنَا رَسولُ الله ﷺ بِمِنًى وَهُوَ عَلَى رَاحِلَتِهِ، وَلُعَابُهَا يَسِيْلُ عَلَى كَتِفِي. أَخرَجَهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ وَصَحَّحَهُ.

24. హజ్రత్ అమ్ర్ బిన్ ఖారిజ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన వాహనంపై కూర్చుని 'మినా' ప్రదేశంలో మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగించారు. ఆ సమయంలో ఆ ఒంట నెమరువేయగా దాని నోటి నురుగు నా భుజాలపై పడి ప్రవహించింది.'' (అహ్మద్, తిర్మిజీ - తిర్మిజీ దీని సత్యతను ధృవీకరించారు)

## సారాంశం

ఏ పశువుల మాంసం తినటం ధర్మసమ్మతమో వాటి నోటి నురుగు కూడా పరిశుద్ధమైనదేననీ, అది శరీరంపై పడినంత మాత్రాన అశుద్ధత ఏర్పడదని ఈ హదీసువల్ల విశదమవుతోంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన అమ్ర్ బిన్ ఖారిజ బిన్ మున్తఫిఖ్ అసదీ అన్సారీ వర్గీయులు. అబూ సుఫ్యాన్‌కు మద్దతుదారులు. అసదీ తెగకు చెందినవారని కూడా ప్రతీతి. ప్రముఖ సహాబీలలో ఒకరు. సిరియాలో స్థిర నివాసమేర్పరచుకున్నారు.

(٢٥) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رسولُ الله ﷺ يَغْسِلُ المَنِيَّ

25. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు : ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన లుంగీకి అంటు

ثُمَّ يَخْرُجُ إِلَى الصَّلاَةِ فِي ذَلِكَ الثَّوبِ وَأَنَا أَنْظُرُ إِلَى أَثَرِ الغَسْلِ فِيهِ. متفق عليه. ولمسلم: «لَقَدْ كُنْتُ أَفْرُكُه مِنْ ثَوبِ رَسولِ اللهِ ﷺ فَرْكاً، فَيُصلِّيَ فِيهِ. وَفِي لفظٍ لَهُ: «لَقَد كُنْتُ أَحُكُّهُ يَابِساً بِظُفُرِي مِنْ ثَوْبِهِ».

కుని వున్న వీర్యపు మరకను కడిగేవారు. ఆ వస్త్రాన్నే శుభ్రంగా ఉతికి దాంతో నమాజ్ చేసేవారు. కడిగిన ఆ గుర్తులను, వాటి ప్రభావాన్ని నేను (నా కళ్ళారా) స్పష్టంగా చూసేదానిని."

(బుఖారీ, ముస్లిం)

"నేను దైవప్రవక్త (సఅసం) వస్త్రంపై వున్న వీర్యపు మరకను గీకివేసేదాన్ని. ఆయన ఆ వస్త్రంతోనే నమాజ్ సలిపేవారు" అని ముస్లింలో ఉంది.

ముస్లింలోని మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "వీర్యపు మరక ఆరిపోయిన మీదట నేను ఆ వస్త్రాన్ని నా గోళ్ళతో గీకి తొలగించేదానిని."

**సారాంశం**

రేతస్సు లేక వీర్యపు మరకలను తొలగించడానికి బట్టలను ఉతకటం అనివార్యం కాదని, ఇతరత్రా విధానాల ద్వారా కూడా ఈ మలినాన్ని తొలగించవచ్చుననీ దీనిద్వారా అవగతమవుతోంది. ముఖ్యంగా అది ఆరిపోయినపుడు దాన్ని గీకివేసినా, డ్రైక్లీనింగ్ చేసినా, వేరితర గుడ్డతో తుడిచివేసినా, గరకు గడ్డితో లేక బద్దతో గీకి పారద్రోలినా సరిపోతుంది. ఈ హదీసు వెలుగులో వీర్యపు మరకలను కొంతమంది పండితులు పరిశుద్ధమైనవిగా తలపోశారు. కాని అవి పరిశుద్ధమైనవనడానికి ప్రబల నిదర్శనాలేమీ లేవు. వీర్యపు మరకలను కడిగి, ఉతికి, పిండి, నలిపి పారద్రోలిన ఆధారాలున్నాయని ఆచార్య షౌకానీ (రహ్మ.లై) "నైలుల్ ఔతార్"లో పేర్కొన్నారు. కనుక అత్యధిక హదీసువేత్తల అభిప్రాయం ప్రకారం వీర్యం (రేతస్సు) అశుద్ధమైనదని భావించటమే సరైనది. దానిని తొలగించడానికి పైన సూచించిన పద్ధతులలో ఏదైనా ఒక పద్ధతిని అవలంబించాల్సిందే. అయితే ఆచార్య షౌకానీ (రహ్మలై) మాత్రం వీర్యాన్ని పరిశుద్ధమైనదిగా ఖరారు చేయటం విశేషం! ఇది అశుద్ధం అనడానికి మూలాధారం ఏదీ లేదంటారాయన. మొత్తానికి ఈ విషయంలో ఈయన అభిప్రాయం విభిన్నంగా ఉంది.

ఇకపోతే ఈ జిగటుపదార్థం పరిశుభ్రమైనదా లేక అపరిశుభ్రమైనదా? అన్న విషయంలో ఎలాగూ అభిప్రాయభేదం ఏర్పడింది. పురుషాంగం నుండి వెలువడిన జిగటు పదార్థం కూడా నోటి చొంగ మాదిరిగా పరిశుద్ధమైనదేనని ఒక వర్గం వాదించింది. ఈ దృక్పథాన్ని కలిగివున్న వారిలో ఇమామ్ షాఫయి (రహ్మలై), దావూద్ జాహిరీ (రహ్మలై), ఇమామ్ అహ్మద్ (రహ్మలై) ముఖ్యులు. ప్రవక్త సహచరులలో హజ్రత్ అలీ (రజి), హజ్రత్ సాద్ బిన్ వఖాస్ (రజి), హజ్రత్

ఇబ్నె ఉమర్ (రజి), ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (ర.అన్హా)ల దృక్పథం కూడా ఇదే. రెండవ దృక్పథం కలిగి ఉన్న వారిలో ఇమామ్ మాలిక్ (రహ్మలై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) ముఖ్యులు. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) దృష్టిలో ఆరిపోయిన వీర్యపు మరకను గీకివేసినట్లయితే అది పరిశుభ్రమైపోతుంది, నీళ్లతోనే కడగవలసిన అవసరం లేదు. ఇరుపక్షాల వారూ తమ తమ దృక్పథాల కనుగుణంగా ప్రబల నిదర్శనాలను చూపుతున్నారు.

వీర్యాన్ని పరిశుద్ధమైనదిగా భావించేవారు చూపే ఆధారం ఇది : "సదరు హదీసులో గీకివేసిన తరువాత వస్త్రాన్ని కడిగినట్లుగా లేదు. అందుచేత ఇది పరిశుద్ధమైనది. ఒకవేళ అది గనక అశుద్ధ మైనదైతే గీకిన తరువాత తప్పక దాన్ని ఉతికి ఆరేసేవారు."

వీర్యాన్ని అశుద్ధమైనదిగా భావించిన వారి ఆధారం చూడండి: "వీర్యంతో కలుషితమైన చోటును నీళ్లతో కడగటమే సమంజసం. ఒకవేళ అదే గనక పరిశుద్ధమై ఉంటే దానిని తొలగించే ప్రస్తావనే వచ్చేది కాదు కదా!"

హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ 'బదాయిల్ ఫవాయిద్' (పేజీ 119 - 126)లో దీన్ని క్షుణ్ణంగా చర్చించారు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన వారు హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా). మహాప్రవక్త (స) మదీనాకు వలసపోక రెండు సంవత్సరాల క్రితమే ఆమెను వివాహమాడారు. హిజ్రీ 1లో ఆమెను తన ఇంటికి పిలిపించుకున్నారు. అప్పటికి ఆమె వయస్సు 9 సంవత్సరాలు. ఆమె ప్రజ్ఞాపాటవాల గురించి వేరుగా చెప్పనవసరం లేదు. హిజ్రీ 58వ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీన మరణించారు. హజ్రత్ అబూ హురైర(రజి) ఆమె జనాజా నమాజ్‌కు సారథ్యం వహించారు. జన్నతుల్ బఖీలో అంత్య క్రియలు జరిగాయి. గొప్ప విద్వాంసురాలు. భారీ సంఖ్యలో హదీసులను ఉల్లేఖించారు. అరబీ కవనంలో మంచి ప్రవేశం ఉండేది. ఆమె పాతివ్రత్యం గురించి ఆకాశం నుండి ప్రకటన గావించబడింది. దివ్య ఖుర్ఆన్‌లోని నూర్ సూరాలో ఈ వృత్తాంతం ఉంది. దైవప్రవక్త (సఅసం) ఈమెగారి కుటీరంలోనే ఖననం చేయబడ్డారు.

(٢٦) وعَنْ أَبِي السَّمْحِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ اللهِ ﷺ: «يُغْسَلُ مِنْ بَوْلِ الجَارِيَةِ، وَيُرَشُّ مِنْ بَوْلِ الغُلَامِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسائِيُّ، وَصَحَّحَه الْحَاكِمُ.

26. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉద్బోధించారని హజ్రత్ అబూ అస్సమహ్ (రజి) చెప్పారు : "ఆడ పిల్ల మూత్రం పోస్తే ఆ వస్త్రాన్ని కడగాలి. మగ పిల్లవాడు మూత్రంపోస్తే నీళ్లు చిలకరించినా చాలు." (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీని ప్రామాణికతను గురించి ధృవీకరించారు).

## సారాంశం

ఆడ శిశువు మూత్రం, మగ శిశువు మూత్రం షరీయత్‌పరంగా వేర్వేరు ఆదేశాలు కలిగి ఉన్నాయని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఆడపిల్ల మూత్రం పోసిన వస్త్రాన్ని కడగటమైనా, మగపిల్లవాడు మూత్రం పోసిన వస్త్రంపై నీళ్లు చిలకరించటమైనా - వారిద్దరూ కేవలం పాలు త్రాగినంత కాలమే ఈ వేర్వేరు ఆదేశాలు వర్తిస్తాయి. పాలతోపాటు వేరితర ఆహారపదార్థాన్ని తిన్న రోజు నుండే వారిరువురి మూత్రం ఒకే రకమయిన మలినంగా భావించబడుతుంది. ఆ రోజు నుండీ వారిరువురికీ ఒకే ఆదేశం వర్తిస్తుంది. మగ పిల్లవాని మూత్రంపై నీళ్లు చిలకరించిన కారణంగా ఆ మూత్రం 'పరిశుద్ధమైనద'ని భావం ఎంతమాత్రం కాదు. కాకపోతే హదీసులో మగపిల్లవాని మూత్రాన్ని పారద్రోలే విషయంలో కొంత సడలింపుల వైఖరి కనబరచబడిందంతే.

హదీసు వల్ల తేటతెల్లమయ్యే దేమిటంటే ఆడ శిశువు - మగ శిశువుల మూత్రంలో కించిత్ వ్యత్యాసం ఉంది. పాలు త్రాగే వయస్సులో ఆడపిల్ల మూత్రం మగపిల్లవాని మూత్రంకన్నా ఎక్కువ అశుద్ధమైనదిగా పరిగణించబడింది. ఈ క్షీర గడువు తరువాత వారిరువురిలో ఎలాంటి వ్యత్యాసం లేదు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇబ్నె వహబ్ (రహ్మ.లై), హ|జత్ అలీ (రజి), హసన్ బస్రీ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే (రహ్మ.లై)ల దృష్టిలో మగపిల్లవాని మూత్రంపై నీళ్లు చిలకరిస్తే సరిపోతుంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మూత్రం కడగటం అవసరమని భావించారు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ అస్సమహ్ మారు పేరనీ, అసలు పేరు ఇయ్యాద్ అనీ భావించబడుతోంది. ఈయన దైవ ప్రవక్త (స) చేత స్వాతంత్ర్యం పొందిన బానిస. దైవప్రవక్త (స) సేవకునిగా ఉన్నారు. అనంతరం ఆయన ఎవరికీ కనబడకుండా పోయారనీ, ఇబ్నె అబ్దుల్ బిర్ చెప్పారు. అందుచేత ఆయన ఎక్కడ, ఎప్పుడు మరణించారో తెలియదు. ఈ ఒక్క హదీసు మాత్రమే ఆయనచేత ఉల్లేఖించబడినది.

(٢٧) وعَنْ أَسْمَاءَ بِنْتِ أَبِي بَكْرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي دَمِ الْحَيْضِ يُصِيبُ الثَّوْبَ: «تَحُتُّهُ، ثُمَّ تَقْرُصُهُ بِالْمَاءِ، ثُمَّ تَنْضَحُهُ، ثُمَّ تُصَلِّي فِيهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

27. బట్టలకు అంటుకున్న బహిష్టు రక్తం గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతూ, "మొదట దాన్ని గీకి శుభ్రం చేయండి. తర్వాత నీళ్ళలో (నాన బెట్టి) కడగండి. ఆ తర్వాత దానిపై బాగా నీరు పోయండి. అనంతరం ఆ వస్త్రాన్ని కట్టుకుని నమాజ్ చేయండి" అని అన్నారని హ|జత్ అస్మా బిన్తె అబూబకర్ (ర.అన్‌హా) ఉల్లేఖించారు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

గీకటం ద్వారా, నీళ్లలో నానబెట్టడం ద్వారా ఆ వస్త్రం రక్తపు మరకలున్నచోట నీరు బాగా పీల్చు కుంటుంది. ఆ తరువాత ఉతికి ఆరేస్తే మలినం తొందరగా దూరమై వస్త్రం పరిశుభ్రమవు తుంది. కేవలం నీళ్ళలో ముంచి తీయటం వల్ల రక్త ప్రభావం తొలగిపోదు.

ఒకవేళ నీళ్ళలో నానబెట్టి బాగా ఉతికిన మీదట కూడా బహిష్టు రక్తపు మరకలు తొలగకపోతే, అందులో చింతించవలసిన విషయం ఏమీ లేదు. అటువంటి వస్త్రం తొడిగి నమాజ్ చేయటంలో షరీయత్‌పరంగా దోషం ఏమీ లేదు.

### హదీసు ఉల్లేఖకులు

అస్మా బిన్తె అబూ బకర్ (ర.అన్హా) దైవప్రవక్త (స) గారి ధర్మపత్ని అయిన హజ్రత్ ఆయిషా (ర.అన్హా)కు అక్క అవుతారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి)కు తల్లిగారు. మక్కాలో విశ్వసించి ఇస్లాం స్వీకరించిన తొలి ముస్లింలలో ఈమె ఒకరు. అనంతరం మదీనాకు వలస వచ్చారు. హిజ్రీ 73లో తన కుమారుడు అబ్దుల్లాహ్ హత్య గావించబడిన నెల రోజులకు - మక్కా నగరంలో - మరణించారు. అప్పటికి ఆమెకు నూరేళ్లు నిండాయి. ఇంతటి వార్ధక్యం పొందినప్పటికీ ఆమె పళ్లు ఊడిపోవటంగానీ, బుద్ధీ వివేకాలలో కించిత్ మార్పు రావటంగానీ జరగకపోవటం విశేషం!

(٢٨) وعَنْ أَبِيْ هَرِيْرَةَ رضي الله تعالى عنه قال: قَالَتْ خَولَةُ: يَا رَسُولَ اللهِ! فَإِن لَمْ يَذْهَبِ الدَّمُ؟ قَالَ: «يَكْفِيكِ الْمَاءُ، وَلاَ يَضُرُّكِ أَثَرُهُ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَسَنَدُهُ ضَعِيفٌ.

28. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: “ఓ దైవప్రవక్తా (సల్లల్లాహు అలైహి వ సల్లం)! (రక్తం పీల్చిన గుడ్డను బాగా నలిపి ఉతికిన పిదప కూడా) రక్తపు మరక చెరగకపోతే ఏం చేయాలి?” అని ఖౌలా (ర.అన్హా) విన్నవించుకోగా ఆయన(స) ఇలా బదులిచ్చారు: “చేసేదే ముందీ, బాగా నీరు పొయ్యి. (నీటిలో బాగా జాడించు) అంతే చాలు. ఆ మరకలు నీకు ఎలాంటి హాని కలుగ జెయ్యవు.” (ఇమామ్ తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. ప్రామాణికత రీత్యా ఈ హదీసు బలహీనమైనది)

### సారాంశం

మలినాన్ని దూరం చేయడానికి ఉద్దేశ్యించిన విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తే చాలు అది పరిశుద్ధమై పోతుందనీ, ఇంతచేసిన తరువాత కూడా మలిన ప్రభావం కానవస్తే షరీయత్‌పరంగా అందులో ఎలాంటి లొసుగూ లేదని పై హదీసు ద్వారా వ్యక్తమవుతోంది. ఈ హదీసు ముస్లిం అనుచర సమాజానికి అందిన తీరునుబట్టి ధర్మ శాస్త్రవేత్తలు దీనిని ‘బలహీనమైన హదీసు’గా

ఖరారు చేశారు. అయితే హదీసులో ప్రస్తావించబడిన అంశంలో మాత్రం ఎలాంటి బలహీనత లేదు.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో దైవప్రవక్త ముందు ధర్మ సందేహం వెలిబుచ్చిన ఖౌలా (ర.అ) పూర్తి పేరు ఖౌలా బిన్తె యసార్. ఈమె సుప్రసిద్ధ సహాబియ. అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ గారు ఈమె ఆధారంగా ఈ హదీసును ఉటంకించారు. బహుశా ఈ హదీసును వివరించిన వారు ఖౌలా బిన్తె యమాన్ అయి ఉండవచ్చునని ఇబ్నె అబ్దుల్ బిర్ అనుమానం వ్యక్తపరిచారు. అయితే సంకలనకర్త దీనిని త్రోసిపుచ్చారు.

### 4వ అధ్యాయం

## ٤ - بَابُ الْوُضُوءِ

## వుజూ

(٢٩) عَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه عن رسول اللهِ ﷺ أَنَّهُ قَالَ: «لَوْلاَ أَنْ أَشُقَّ عَلَى أُمَّتِي لأَمَرْتُهُمْ بِالسِّوَاكِ مَعَ كُلِّ وُضُوءٍ». أَخْرَجَهُ مَالِكٌ وَأَحْمَدُ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ، وَذَكَرَهُ الْبُخَارِيُّ تَعْلِيقاً.

29. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "నా అనుచర సమాజం గనక కష్టాల్లో పడిపోతుందన్న సంశయం నాకు లేకుండినట్లయితే ప్రతి వుజూ సమయంలో 'మిస్వాక్' చేయాలని ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి" (మాలిక్, అహ్మద్, నసాయి దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీని ప్రామాణికతను ధృవీకరించారు. బుఖారీ దీనిని నకలు చేశారు).

### సారాంశం

ఎప్పుడు వుజూ చేసినా మిస్వాక్ చేయటం (పల్లు తోముకోవటం) అభిలషణీయమనీ, ప్రవక్త సంప్రదాయమనీ పై హదీసు చెప్పకనే చెబుతోంది. మిస్వాక్ చేయటం అంటే నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవటం మరియు తమ ప్రభువు ప్రసన్నతను చూరగొనటమేనని 'ముస్లిం' లోనూ, 'అబూ దావూద్'లోనూ లిఖించబడింది. మరో గమనార్హమయిన విషయం ఏమిటంటే మిస్వాక్ చేయటం దైవప్రవక్తలందరి సంప్రదాయం. ముస్నదె ఇమామ్ అహ్మద్, ఇబ్నె ఖుజైమ, హాకిమ్, దారెఖుత్నీలలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ద్వారా ఈ విధంగా ఉల్లేఖించబడినట్లు ఉంది - "ఏ నమాజ్ అయితే మిస్వాక్ చేసి మరీ చేయబడిందో దాని పుణ్యం మిస్వాక్ చేయబడని నమాజ్ కన్నా డెబ్బయి రెట్లు అధికం." కాని ఈ ఉల్లేఖనం బలహీనమైనది. ఒకవేళ ముందునుంచీ 'వుజూ' ఉంటే, నమాజ్‌కు ముందు మిస్వాక్ చేసుకోవటం మంచిది. తద్వారా ప్రవక్త విధానాన్ని అనుసరించినట్లవుతుంది.

(٣٠) وعَنْ حُمْرَانَ مَوْلَى عُثْمَانَ رضي الله تعالى عنه: أَنَّ عُثْمَانَ دَعَا بِوَضُوءٍ فَغَسَلَ كَفَّيْهِ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ تَمَضْمَضَ وَاسْتَنْشَقَ وَاسْتَنْثَرَ، ثُمَّ غَسَلَ وَجْهَهُ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ غَسَلَ يَدَهُ الْيُمْنَى إِلَى الْمِرْفَقِ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ الْيُسْرَى مِثْلَ ذَلِكَ، ثُمَّ مَسَحَ بِرَأْسِهِ، ثُمَّ غَسَلَ رِجْلَهُ الْيُمْنَى إِلَى الْكَعْبَيْنِ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ الْيُسْرَى مِثْلَ ذَلِكَ، ثُمَّ قَالَ: رَأَيْتُ رَسُولَ الله ﷺ تَوَضَّأَ نَحْوَ وُضُوئِي هَذَا. مُتَّفَقٌ عَلَيْهِ.

30. హజ్రత్ హుమ్రాన్ మౌలా (రజి) కథనం : "హజ్రత్ ఉస్మాన్ (రజి) వుజూ చేయడానికి నీరు తెప్పించారు. మొదట ఆయన తన అరచేతులను మూడుసార్లు కడిగారు. తరువాత మూడు సార్లు నీరు పుక్కిలించారు. ఆ తరువాత ముక్కు లోనికి నీరు పోనిచ్చి, ముక్కు చీది మరీ శుభ్రం చేశారు. పిదప మూడుసార్లు ముఖం కడుక్కున్నారు. అనంతరం తన కుడిచేతిని మోచేతుల వరకు మూడు సార్లు కడిగారు. అలాగే మూడుసార్లు ఎడమ చేతినీ కడిగారు. తరువాత నీళ్లతో తన తలను తుడుచుకున్నారు. (మసహ్ చేశారు). ఆ తరువాత తన కుడి కాలును, ఎడమ కాలును మడమల వరకూ మూడేసి సార్లు కడిగారు. ఆపైన ఆయన ఇలా అన్నారు - 'నేనిప్పుడు ఏ విధంగా వుజూ చేశానో సరిగ్గా అదే విధంగా దైవప్రవక్త (సఅసం) వుజూ చేస్తుండగా చూసివున్నాను."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

సంబంధిత శరీరావయవాలను మూడేసిసార్లు కడగాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. మరో ఉల్లేఖనంలో రెండుసార్లు అని ఉంది. మరికొన్ని ఉల్లేఖనాలలో ఒక్కోసారి కడగాలని ఉంది. ఈ ఉల్లేఖనాలన్నింటినీ క్రోడీకరించిన మీదట హదీసువేత్తలు, ధర్మశాస్త్రవేత్తలు ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. దీనిప్రకారం ప్రతి అవయవాన్ని ఒకసారి కడగటం తప్పనిసరి (వాజిబ్). మూడేసి సార్లు కడగటం సంప్రదాయం (మస్నూన్). రెండేసిసార్లు కడిగినా సరిపోతుంది. ఈ అంశంపై ఇమామ్ నవవీ (రహ్మ.లై) అత్యధికుల అభిప్రాయాలను ఉటంకిస్తూ 'ఒకసారి కడగటం వాజిబ్ (తప్పనిసరి)'అని వ్రాశారు.

## హదీసు ఉల్లేఖకుల గురించి

1. ఈ హదీసును ఉల్లేఖించిన హుమ్రాన్ (రజి) పూర్తి పేరు హుమ్రాన్ బిన్ అబాన్. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) పరిపాలనా కాలంలో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఈయన్ని ఒక

యుద్ధఖైదీగా పట్టుకున్నారు. ఆ తరువాత ఈయన ముసైబ్ బిన్ నజబా వాటాలోకి వచ్చారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈయన్ని ముసైబ్ నుండి కొని స్వేచ్ఛనొసగారు. హిజ్రీ 75లో మరణించారు. మరి కొంతమంది హి.శ. 76 అనీ, ఇంకొంతమంది హి.శ. 71 అని కూడా అభిప్రాయపడ్డారు.

2. హదీసు ఉల్లేఖకులలో రెండవ వారు హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి). తృతీయ ధర్మ ఖలీఫా. ఇస్లాంను స్వీకరించిన తొల్దొలి సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) గారి ఇద్దరు ముద్దుల కూతుళ్లు (రుఖియ్యా, ఉమ్మె కుల్సూమ్)-ఒకరి తరువాత మరొకరు - ఈయన వైవాహిక జీవితంలోకి వచ్చారు. అందుకే 'జున్నూరైన్' అనే బిరుదుతో కూడా పిలువబడేవారు. శుక్రవారం నాడు వీర మరణం పొందారు. అది హిజ్రీ 35వ సంవత్సరం జిల్ హజ్జ్ 18వ తేదీన జరిగిన సంఘటన! ఇస్లామీయ చరిత్రలో అత్యంత విషాదకరమయిన సంఘటన!!

(٣١) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِيْ صِفَةِ وُضُوءِ النَّبِيِّ ﷺ – قَالَ: وَمَسَحَ بِرَأْسِهِ وَاحِدَةً. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَأَخْرَجَهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ بِإِسْنَادٍ صَحِيحٍ، بَلْ قَالَ التِّرْمِذِيُّ: إِنَّهُ أَصَحُّ شَيْءٍ فِي الْبَابِ.

31. హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి వుజూ చేసే విధానాన్ని వివరిస్తూ ఇలా అన్నారు: "ఆయన (స) తన తలను ఒకేసారి మసహ్ చేశారు (తడి చేతులతో తలను తుడుచుకున్నారు)." (అబూ దావూద్, నసాయి, తిర్మిజీలు దీని ప్రామాణికతను ధృవీకరిస్తూ మరీ ఉల్లేఖించారు. ఈ అధ్యాయం క్రింద పేర్కొనబడిన హదీసులలో ఇది అన్నిటికన్నా ఎక్కువ ప్రామాణికమైనదని తిర్మిజీ వ్యాఖ్యానించారు).

## సారాంశం

ఒక్కసారి తలను మసహ్ చేయటమే ఫర్జ్ (విధి) అని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ముస్లిం సమాజానికి చెందిన పండితులందరి అభిమతం కూడా ఇదే. ఒక్క ఇమామ్ షాఫయి (రహ్మ.లై) మాత్రం భిన్నాభిప్రాయం వ్యక్తపరిచారు. ఇతర అవయవాల మాదిరిగా తలను కూడా మూడుసార్లు మసహ్ చేయాలంటారీయన. అబూ దావూద్‌లోని ఒక ఉల్లేఖనాన్ని ఆసరాగా తీసుకుని ఈయన ఈ నిర్ధారణకు వచ్చారు. అయితే సహీహైన్ మరియు సునన్‌లో పేర్కొనబడిన అనేక హదీసుల వెలుగులో ఒకసారి తలను మసహ్ చేయడమే సరైనది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) నాల్గవ ధర్మ ఖలీఫాగా పరిపాలన చేశారు. హజ్రత్ హసన్ (రజి), హుసైన్ (రజి)ల పితామహులు. దైవప్రవక్త (సఅసం) అల్లుడు. బంధుత్వం రీత్యా దైవప్రవక్త గారి పెత్తండ్రి కుమారుడు కూడా అవుతారు. ఒక్క తబూక్

యుద్ధంలో తప్ప దైవప్రవక్త (స) పాల్గొన్న యుద్ధాలన్నింటిలో ఈయన కూడా పాల్గొన్నారు. హి.శ. 35వ సంవత్సరం జిల్ హజ్జ్ 18వ తేదీన ఖిలాఫత్ బాధ్యతలను స్వీకరించారు. హిజ్రీ 40వ యేట రమజాన్ నెల 17వ తేదీన శుక్రవారం ఉదయం కూఫాలో కర్కశుడైన అబ్దుర్రహ్మాన్ బిన్ ముల్జమ్ ఈయనపై దాడిచేసి దారుణంగా హత్య చేశాడు.

(٣٢) وعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدِ بْنِ عَاصِمٍ رضي الله تعالى عنه – فِيْ صِفَةِ الْوُضُوءِ – قَالَ: وَمَسَحَ رَسُولُ اللهِ ﷺ بِرَأْسِهِ فَأَقْبَلَ بِيَدَيْهِ وَأَدْبَرَ. مُتَّفَقٌ عَلَيْهِ.

32. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్ (రజి) 'వుజూ'కు సంబంధించి ఇలా వివరించారు: "దైవప్రవక్త (స) తలకు మసహ్ చేస్తూ తన రెండు చేతులనూ తల ముందు భాగం నుంచి వెనుక భాగం వరకు తీసుకుపోయారు. తిరిగి వెనుక వైపు నుంచి ముందు వైపునకు తీసుకువచ్చారు. (బుఖారీ, ముస్లిం)

وَفِيْ لَفْظٍ لَهُمَا: بَدَأَ بِمُقَدَّمِ رَأْسِهِ حَتَّى ذَهَبَ بِهِمَا إِلَى قَفَاهُ، ثُمَّ رَدَّهُمَا حَتَّى رَجَعَ إِلَى الْمَكَانِ الَّذِيْ بَدَأَ مِنْهُ.

బుఖారీ, ముస్లింలు పొందుపరచిన మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది : "ఆయన తల ముందు భాగం నుంచి (మసహ్‌ను) ప్రారంభించి చేతులను తల వెనుక భాగం చివరి వరకు - అంటే మెడ వరకూ తీసుకువెళ్ళారు. అలాగే రెండు చేతులనూ తల వెంట్రుకలకు స్పృశిస్తూ మసహ్ ప్రారంభించిన చోటికి వాపసు తీసుకువచ్చారు."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే, తలకు చేసే మసహ్ తల ముందు భాగం నుంచి మొదలెట్టాలి. నలుగురు ఇమాముల (ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ షాఫయి) తో పాటు ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే అభిమతం కూడా ఇదే. అయితే తిర్మిజీలో పొందుపరచబడిన ఒక ఉల్లేఖనం ప్రకారం, తలకు చేసే మసహ్‌ను తల వెనుక భాగం నుంచి ప్రారంభించటం కూడా ధర్మసమ్మతమేనని తెలుస్తోంది. దీని ఆధారంగా కూఫా వాసులు చాలా మంది ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు. వకీ బిన్ జరాహ్ కూడా వారిలో ఒకరు. అయితే అత్యధికమంది ఇమాములు మరియు హదీసువేత్తలు ఈ ఉల్లేఖనాన్ని ప్రమాణబద్ధమైనదిగా పరిగణించటం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్ (రజి) అన్సార్ వర్గానికి చెందినవారు. అన్సార్‌కు చెందిన తెగ బనీ మాజిన్ బిన్ నజార్ సభ్యులు. ఉహుద్ యుద్ధంలో పాల్గొన్నారు. యమామ పోరాటంలో వహ్షీతో కలసి బూటకపు ప్రవక్తగా అవతరించిన ముసైలమాను సంహరించారు. హిజ్రీ 63లో ఒక యుద్ధంలో అమరగతినొందారు. అబ్దుల్లాహ్ బిన్ జైద్, అంటే స్వప్నంలో అజాన్ పలుకులు విన్న సహాబీ అన్న సందేహం కలుగవచ్చు. కాని ఈయన ఆయన కాదు. ఈయన పేరు అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్. ఆయన పేరు అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దె రబ్బిహీ. అంటే వీరిద్దరి తాతలు వేర్వేరు వ్యక్తులు అని మరువరాదు. ఇబ్నె అబ్దె రబ్బిహీ ప్రస్తావన అజాన్ సందర్భంగా వస్తుంది (ఇన్‌షాఅల్లాహ్).

33. వుజూ గురించి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) వివరిస్తూ ఇలా అన్నారు: "ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన తలను మసహ్ చేశారు. అనంతరం తన రెండు చేతుల చూపుడు వ్రేళ్లను చెవులలోనికి జొప్పించారు, ఆపైన బొటన వ్రేళ్లతో చెవుల పై భాగాలను స్పృశించారు." (దీనిని అబూ దావూద్ మరియు నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీన్ని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు).

(٣٣) وعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو رضي الله تعالى عنهما، فِيْ صِفَةِ الْوُضُوْءِ قَالَ: ثُمَّ مَسَحَ ﷺ بِرَأْسِهِ وَأَدْخَلَ إِصْبَعَيْهِ السَّبَّاحَتَيْنِ فِيْ أُذُنَيْهِ، وَمَسَحَ بِإِبْهَامَيْهِ عَلَى ظَاهِرِ أُذُنَيْه. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحه ابْنُ خُزَيْمَةَ.

## సారాంశం

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెవుల లోపలి భాగాలను, ఉపరి భాగాలను కూడా తడి చేతులతో స్పృశించారని ఈ హదీసు ద్వారా రుజువు లభిస్తోంది.

## హదీసు ఉల్లేఖకులు

హదీసును ఉల్లేఖించిన సహాబీ పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ బిన్ వాయల్ సహ్మీ ఖురైషీ (రజి). ఆయన తన తండ్రికన్నా ముందే ఇస్లాం స్వీకరించారు. తన తండ్రికన్నా కేవలం 13 ఏండ్ల చిన్నవారు. అగ్రశ్రేణి విద్వాంసులలో ఒకరు. హదీసు సంస్కర్త. నికార్సయిన దైవదాసుడు. పెద్ద సంఖ్యలో ప్రవక్త ప్రవచనాలను ఉల్లేఖించారు. మహాప్రవక్త (స) ఉపదేశాలను ఈయన ఎప్పటికప్పుడు లిఖించేవారు. హిజ్రీ 63 లేదా 70లో పరమపదించారు. అంత్యక్రియలు జరిగిన స్థలం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. మక్కా అని కొందరు, తాయఫ్ అని కొందరు, ఈజిప్ట్ అని కొందరు అభిప్రాయపడ్డారు.

(٣٤) وعَنْ أَبِيْ هُرَيْرَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا اسْتَيْقَظَ أَحَدُكُمْ مِنْ مَنَامِهِ فَلْيَسْتَنْثِرْ ثَلاَثاً، فَإِنَّ الشَّيْطَانَ يَبِيتُ عَلَى خَيْشُومِهِ». مُتَّفَقٌ عَلَيْه.

34. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరు నిద్ర మేల్కొన్నా మూడుసార్లు ముక్కు చీది శుభ్రం చేయాలి. ఎందుకంటే షైతాన్ ముక్కు పుటాలపై రాత్రి పూట సైరు చేస్తాడు." (బుఖారీ, ముస్లిం)

(٣٥) وعَنْهُ: «إِذَا اسْتَيْقَظَ أَحَدُكُمْ مِنْ نَوْمِهِ فَلاَ يَغْمِسْ يَدَهُ فِي الْإِنَاءِ حَتَّى يَغْسِلَهَا ثَلاَثاً، فَإِنَّهُ لاَ يَدْرِي أَيْنَ بَاتَتْ يَدُهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَهَذَا لَفْظُ مُسْلِمٍ.

35. హజ్రత్ అబూ హురైర (రజి) ద్వారానే ఈ విధంగా కూడా ఉల్లేఖించబడింది: "మీలో ఎవరు నిద్రనుండి మేల్కొన్నా మూడుసార్లు కడిగేదాకా తమ చేతులను నీళ్ల పాత్రలో ముంచరాదు. ఎందుకంటే రాత్రిపూట చేయి ఎక్కడెక్కడ సంచరించిందో (ఏ ఏ శరీర భాగాలను స్పృశించిందో, ముట్టు కుందో) అతనికి తెలియదు." (బుఖారీ, ముస్లిం- పై హదీసులోని వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి).

**సారాంశం**

ఎవరు రేయింబవళ్ళలో గాఢనిద్ర నుంచి లేచినా వారు నీళ్ల పాత్రలో చేతులను ముంచే ముందు మూడుసార్లు శుభ్రంగా కడుక్కోవటం అభిలషణీయమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఏ సైజు నీళ్ల పాత్ర అయినా సరే ఈ సూత్రమే వర్తిస్తుంది. అయితే కాలువ లేక సరస్సు లాంటి వాటి విషయంలో ఈ సూత్రం వర్తించదు. వాటిలో చేయి ముంచటం ధర్మసమ్మతమే. అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై) కూడా 'ఫత్‌హుల్ బారీ'లో ఈ అభిప్రాయాన్నే వెల్లడించారు.

(٣٦) وعَنْ لَقِيْطِ بْنِ صَبِرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَسْبِغِ الوُضُوءَ، وَخَلِّلْ بَيْنَ الأَصَابِعِ، وَبَالِغْ فِي الاسْتِنْشَاقِ إِلاَّ أَنْ تَكُونَ صَائِماً». أَخْرَجَهُ

36. హజ్రత్ లఖీత్ బిన్ సబ్ర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రబోధించారు : "వుజూ సవ్యంగా పూర్తి చేయండి. వ్రేళ్ల మధ్య భాగాలను తడపండి. ముక్కులోనికి సరిగా నీరు ఎక్కించండి. అయితే ఉప

الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ. وَلِأَبِي دَاوُدَ فِي رِوَايَةٍ: «إِذَا تَوَضَّأْتَ فَمَضْمِضْ».

వాస స్థితిలో మాత్రం ఇలా చేయకండి." (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీని ప్రామాణికతను ధృవీకరించారు). అబూదావూద్‌లోని ఉల్లేఖనంలో ఒక వాక్యం ఈ విధంగా ఉంది: "నీవు వుజూ చేసినపుడు పుక్కిలించు."

**సారాంశం**

పై హదీసులో 'ఖిలాల్' అనే పదం వచ్చింది. ఖిలాల్ చేయటం అంటే వుజూ చేస్తున్న సమయంలో చేతుల మరియు కాలి వ్రేళ్ల మధ్య గల భాగాలు తడిసేలా వ్రేళ్లను జొప్పించి మరీ కడగటం అని అర్థం. ఉపవాసమున్నపుడు ముక్కులోనికి చాలా జాగ్రత్తగా నీరు పోనివ్వాలి. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ముక్కుద్వారా నీరు శరీరంలోనికి పోయి ఉపవాసం భంగమయ్యే ప్రమాదముంది.

**హదీసు ఉల్లేఖకులు**

హదీసు ఉల్లేఖకులైన లఖీత్ బిన్ సబ్ర (రజి) పూర్తి పేరు లఖీత్ బిన్ సబ్ర బిన్ అబ్దుల్లాహ్ బిన్ ముస్తఫిఖ్ బిన్ ఆమిర్ అల్ ఆమిరీ (రజి). బనీ ముస్తఫిఖ్ బృందానికి సారథిగా ఉన్నారని అనబడుతోంది.

(٣٧) وَعَنْ عُثْمَانَ رضي الله تعالى عنه: أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يُخَلِّلُ لِحْيَتَهُ فِي الْوُضُوءِ. أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

37. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇలా వివరించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'వుజూ' చేసే సమయంలో తన గడ్డం (లోపలికి చేతి వ్రేళ్లను జొప్పించి) ఖిలాల్ చేసేవారు." (తిర్మిజీ- ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు).

**సారాంశం**

మహాప్రవక్త (సఅసం) స్వయంగా గడ్డాన్ని ఖిలాల్ చేసినట్లు ఆధారముంది గనక దీనిని పాటించటం సంప్రదాయం (మస్నూన్). అయితే ఇలా చేయటం తప్పనిసరి (వాజిబ్) మాత్రం కాదు.

(٣٨) وَعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: أَنَّ النَّبِيَّ ﷺ أُتِيَ بِثُلُثَيْ مُدٍّ فَجَعَلَ

38. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో రెండొం

يَدْلُكُ ذِرَاعَيْهِ. أَخْرَجَهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

తుల 'ముద్' నీరు సమర్పించబడగా, ఆయన(స) చేతులను నలుపుతూ వుజూ కోసం ఉపక్రమించారు" (అహ్మద్ దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణిక హదీసుగా ధృవీకరించారు).

**సారాంశం**

'ముద్' అనెది ఆనాటి ఒక కొలమానం. నేటి ఆధునిక పరిభాషలో అది ఆరువందల గ్రాముల బరువుకు సమానం. రెండు వంతుల ముద్ నీటితో మహాప్రవక్త (స) వుజూ చేసినట్లు బుఖారీ, ముస్లింల లోని హదీసులో కూడా ఉంది. వేరొక ఉల్లేఖనంలో ఒక ముద్ నీరు ఉపయోగించినట్లు ఉంది. వుజూ కోసం అనవసరంగా ఎక్కువ నీరు ఉపయోగించరాదనీ, వీలైనంత పొదుపరితనాన్ని పాటించాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

(٣٩) وعَنْهُ: أَنَّهُ رَأَى النَّبِيَّ ﷺ يَأْخُذُ لِأُذُنَيْهِ مَاءً خِلَافَ الْمَاءِ الَّذِيْ أَخَذَهُ لِرَأْسِهِ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ، وَقَالَ: إِسْنَادُهُ صَحِيْحٌ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ أَيْضاً.

39. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) వుజూ చేస్తుండగా ఈయన గమనించారు - ఆయన (స)తలను మసహ్ చేయ డానికి తీసుకున్న నీరునుగాక, చెవుల మసహ్ కోసం వేరుగా తీసుకునే వారు. (బైహఖీ దీనిని ఉల్లేఖించడమే గాక, దీని ప్రామాణికతను ధృవీకరించారు. తిర్మిజీ కూడా దీనిని ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించారు).

وَهُوَ عِنْدَ مُسْلِمٍ مِنْ هَذَا الْوَجْهِ بِلَفْظِ: وَمَسَحَ بِرَأْسِهِ بِمَاءٍ غَيْرِ فَضْلِ يَدَيْهِ. وَهُوَ الْمَحْفُوظُ.

ముస్లింలోని ఉల్లేఖనంలో వాక్యం ఇలా ఉంది: "ఆయన (స) తలను మసహ్ చేశారు. కాని ఆ చేతుల్లో నీరు మిగిలి లేదు -" అంటే కొత్తగా నీరు తీసుకుని ఉపయోగించారు. ముస్లింలోని ఈ ఉల్లేఖనమే సురక్షితమైనది."

**సారాంశం**

ఇమామ్ షాఫయి (రహ్మ.లై) కూడా చెవుల మసహ్ కోసం వేరుగా నీళ్లు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), సుఫియాన్ సౌరీ (రహ్మ.లై)ల

అభిప్రాయం తద్భిన్నంగా ఉంది - "చెవులు కూడా తలకు అనుకునే ఉన్నాయి గనక వాటి 'మసహ్' కోసం మలి సారి నీరు తీసుకోవలసిన అవసరం లేదనీ, మొదటిసారి తీసుకున్న నీరే సరిపోతుంద"నీ వీరిరువురూ భావించారు. అత్యధిక సహీహ్ హదీసులు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి.

(٤٠) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِنَّ أُمَّتِي يَأْتُونَ يَوْمَ الْقِيَامَةِ غُرًّا مُحَجَّلِينَ مِنْ أَثَرِ الْوُضُوءِ، فَمَنِ اسْتَطَاعَ مِنْكُمْ أَنْ يُطِيلَ غُرَّتَهُ فَلْيَفْعَلْ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

40. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైర (రజి) వివరించారు: "ప్రళయ దినాన నా ఉమ్మత్ (అనుచర సమాజం) ప్రజలు వుజూ కారణంగా తమ కాళ్లు చేతులు మెరిసిపోతున్న స్థితిలో హాజరవుతారు. (కనుక) మీలో ఎవరు ఎంతగా ఈ మెరుపును, వెలుగును పెంచగలుగుతారో అంతగా తప్పక పెంచుకోవాలి సుమా! (బుఖారీ, ముస్లిం - పదాలు మాత్రం ముస్లిం లోనివి).

### సారాంశం

ఈ హదీసు మతలబులు అనేకం కావచ్చు. వాటిలో ఒకటేమంటే, వుజూలోని శరీర భాగాలను నిర్ధారిత హద్దులకు మించి కడగటం. ఉదాహరణకు : చేతులను భుజాల వరకూ, కాళ్లను మోకాళ్ల వరకూ కడగటం. హదీసును ఉల్లేఖించిన అబూ హురైర (రజి) గారు కూడా ఈ మతలబునే గ్రహించి, తదనుగుణంగా ఆచరించేవారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)లు కూడా దీనినే ముస్తహబ్ (అభిలషణీయం)గా భావిస్తున్నారు. కాని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) దీనిని అభిలషణీయంగా భావించటం లేదు. వుజూలో ఏ శరీర భాగాలు ఎక్కడి వరకు కడగాలో నిర్ధారితమై ఉండటంచేత అంతకు మించిపోవలసిన అవసరం లేదంటారాయన.

వుజూలోని ప్రతి శరీర భాగాన్ని మూడేసిసార్లు కడగటం మంచిదన్నది మరో మతలబు కావచ్చు. మనిషి వుజూతో ఉండి కూడా పుణ్యార్జన ఉద్దేశ్యంతో తాజాగా వుజూ చేసుకుని ప్రార్థన చేయటం వాంఛనీయం అన్నది ఇంకొక మతలబు అయి ఉండవచ్చు. ఎల్లవేళలా వుజూతో ఉండటం మంచిదన్నది కూడా వేరొక మతలబు కావచ్చు. అయితే ఇవన్నీ అంచనాపై మాత్రమే ఆధారపడి ఉన్నాయని గమనించాలి.

(٤١) وعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ تعالى عنها قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعْجِبُهُ التَّيَمُّنُ فِي تَنَعُّلِهِ وَتَرَجُّلِهِ وَطَهُورِهِ، وَفِيْ شَأْنِهِ كُلِّهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

41. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పులు తొడిగినా, తల దువ్వుకున్నా, వుజూ చేసినా - ఏ పని చేసినాసరే (కుడి వైపునుంచి మొదలెట్టడాన్ని) ఇష్టపడేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ప్రతి మంచి పనినీ కుడివైపు నుంచి ప్రారంభించడాన్ని ఇష్టపడేవారు. ఉదాహరణకు : మస్జిద్‌లో అడుగుపెట్టాలన్నా, నమాజ్ ముగించిన తరువాత సలాం చేయాలన్నా, వుజూ చేసే సమయంలో వివిధ శరీరావయవాలను కడగటమైనా, కరచాలనం చేయాలన్నా, భోజనం చేయాలన్నా, పాలు పితకాలన్నా, చొక్కా ధరించాలన్నా, కళ్ళల్లో సుర్మా పూసుకునేటప్పుడైనా, మిస్వాక్ చేసేటప్పుడయినా - కుడి చేత్తో చేయటం, కుడివైపు నుంచి మొదలెట్టడం ఆయన (స) సంప్రదాయం అయి ఉండేది. కాని నేటి ఆధునిక యుగపు ముస్లిం ఎంతో విలువైన ఈ విషయాలను విస్మరించి అన్యులను అనుకరిస్తున్నాడు. పాశ్చాత్యుల ప్రభావానికి లోనై కుడి బదులు ఎడమ వైపునకు మొగ్గు చూపుతున్నాడు. ఇదెంతో శోచనీయం.

(٤٢) وعَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا تَوَضَّأْتُمْ فَابْدَءُوا بِمَيَامِنِكُمْ**». أَخْرَجَهُ الْأَرْبَعَةُ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

42. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీరు వుజూ చేయడానికి ఉపక్రమించినపుడు కుడి వైపు నుంచి మొదలెట్టండి." (దీనిని అబూ దావూద్, నసాయి, తిర్మిజీ మరియు ఇబ్నె మాజాలు నలుగురూ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రమాణబద్ధమైనదని ఖరారు చేశారు).

**సారాంశం**

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యే దేమిటంటే, ఆయన(స)కు కుడివైపే అత్యంత ఇష్టకరమయినది, ప్రియమైనది. ఆయన (స) స్వయంగా దీనిని ఆచరించటమేగాక, తన అనుచర సమాజాన్ని కూడా కుడి వైపునుంచి ఆరంభించండని ఆదేశించారు.

(٤٣) وعَنِ الْمُغِيرَةِ بْنِ شُعْبَةَ رضي الله تعالى عنه، أَنَّ النَّبِيَّ ﷺ تَوَضَّأَ فَمَسَحَ بِنَاصِيَتِهِ

43. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వుజూ చేసినపుడు తన నుదుటి జుత్తుపై, తల పాగాపై, మేజోళ్లపై

وَعلَى الْعِمَامَةِ وَالْخُفَّيْنِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

మసహ్ చేశారని హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) తెలిపారు. (ముస్లిం)

### సారాంశం

కేవలం నుదుటిపై మసహ్ చేయటం వల్ల తల భాగపు మసహ్ సంపూర్ణం కాజాలదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. కేవలం తల పాగాపై మసహ్ చేసినా సరిపోదని చాలామంది ఇమాములు అభిప్రాయపడ్డారు. అయితే అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ "జుల్‌మిఆద్" లో ఇలా విశదీకరించారు: "ఆయన (స) ఒక్కొక్కప్పుడు కేవలం నగ్న తలపై మసహ్ చేసేవారు. ఒక్కోసారి తలపాగాపై మసహ్ చేసేవారు. ఒక్కోసారి తలపాగా మరియు నుదురు - రెంటిపై మసహ్ చేసేవారు. ఆయన (స) కేవలం నుదుటిపై మసహ్ చేసినట్లు ఏ ఆధారమూ లేదు.

మేజోళ్లపై మసహ్ చేయటం ధర్మసమ్మతమని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. తలపాగాపై మసహ్ చేయటం కూడా సరైనదేనని తెలియవస్తోంది. ఇది రెండు విధాలుగా సరైనది కావచ్చు. ఒకటి: కొంత మసహ్ తలపై చేసి మరికొంత తలపాగాపై చేయాలి. ఇందులో భేదాభిప్రాయం లేదు. రెండు: కేవలం తలపాగాపై మసహ్ చేయటం. తిర్మిజీలోని ఒక సహీహ్ హదీసు ద్వారా కూడా ఇది రూఢీ అవుతోంది. ప్రవక్త సహచరులలోని కొందరు ప్రముఖులు, ఇమాములు కూడా ఈ విధానాన్ని సమర్థించినట్లు తెలుస్తోంది. అలాంటివారిలో కొందరు ప్రముఖులు : హజ్రత్ అబూబకర్ (రజి), ఉమర్ (రజి), అనస్ (రజి), ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ.లై), హసన్ బస్రీ (రహ్మ.లై), మక్‌హూల్ (రహ్మ.లై), అబూసూర్ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఔజాయి (రహ్మ.లై), ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే (రహ్మ.లై), వకీ (రహ్మ.లై) మొదలగువారు. మిగిలిన ప్రముఖ ఇమాములు, కేవలం తలపాగాపై మసహ్ చేస్తే సరిపోదని భావిస్తున్నారు.

### హదీసు ఉల్లేఖకులు

ఈయన (ముగీరా బిన్ షూబ - రజి) కు గల మరో పేరు అబూ అబ్దుల్లాహ్ లేక అబూ ఈసా. వంశవృక్షం ప్రకారం ముగీరా బిన్ షూబ బిన్ మస్‌వూద్ సఖఫీ అనబడతారు. సుప్రసిద్ధ సహబీలలో ఒకరు. కందక యుద్ధం జరిగే రోజుల్లో ఇస్లాం స్వీకరించారు. హిజ్రత్ చేసి మదీనా వచ్చారు. హుదైబియా ఒప్పందంలో పాల్గొన్నారు. ఆయన పాల్గొన్న మొదటి యుద్ధం అదే. అమీర్ ముఆవియ (రజి) తరఫున కూఫా గవర్నర్‌గా నియమితులయ్యారు. హిజ్రీ 50వ సంవత్సరంలో కూఫాలోనే కన్నుమూశారు.

(٤٤) وعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رضي الله تعالى عنهما - فِيْ صِفَةِ حَجِّ النَّبِيِّ ﷺ - قَالَ ﷺ: «اِبْدَءُوا بِمَا بَدَأَ اللّٰهُ بِهِ». أَخْرَجَهُ

44. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) గారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి హజ్ విధానాన్ని వివరిస్తూ చెప్పారు - దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు : "అల్లాహ్ ఆరంభించినట్లుగానే ఆరంభించండి."

النَّسَائِيُّ هَكَذا بِلَفْظِ الْأَمْرِ، وَهُوَ عِنْدَ مُسْلِمٍ بِلَفْظِ الْخَبَرِ.

(నసాయి 'ఆరంభించండి' అని ఉల్లేఖించారు. కాగా, ఇమామ్ ముస్లిం 'మేము ఆరంభిస్తున్నాం' అని పేర్కొన్నారు).

### సారాంశం

రచయిత ఈ హదీసును 'వుజూ' అధ్యాయంలో తీసుకొని వుజూ పరిధిలోనికి వచ్చే శరీరావయవాలను కడిగేటప్పుడు కూడా క్రమపద్ధతిని అవలంబించాలని చెప్పదలిచారు. ఏ శరీర భాగాన్ని మొదట కడగాలని ఖుర్ఆన్‌లో ఆదేశించబడిందో ఆ శరీర భాగాన్నే మొదట కడగాలి. దివ్యఖుర్ఆన్ హజ్ ఆచారాలను గురించి చెబుతూ 'ఇన్నస్సఫా వల్ మర్వత' అని అన్నది. అంటే హజ్‌లో ఒక ముఖ్య అంశమైన 'సయీ' సఫా పర్వతం వద్ద నుంచి మొదలెట్టాలని భావం.

అలాగే వుజూకు సంబంధించిన ఖుర్ఆన్ వాక్యంలో తొలుత ముఖం కడగాలని ఉంది. ఆ తరువాత ఇతర శరీర భాగాల ప్రస్తావన వస్తుంది. కాబట్టి 'వుజూ' కూడా దైవాదేశానికనుగుణంగా - సూచించబడిన క్రమ పద్ధతి ప్రకారం - చేయాలని హదీసు చెబుతోంది.

(మొదట ముఖం కడగటంతో వుజూ ప్రారంభించాలన్న వాక్యం చదివి సందేహానికి లోను కావలసిన అవసరం లేదు. వుజూలోని 'ఫరాయజ్‌ల' ప్రస్తావన మాత్రమే ఇక్కడ వచ్చిందిసుమా!)
- అనువాదకుడు

### హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) గారి మరో పేరు అబూ అబ్దుల్లాహ్. అన్సార్‌కు చెందిన 'సులమ్' అనే తెగకు చెందిన వారవటంచేత 'అన్సారీ సులమీ' గా వ్యవహరించబడ్డారు. ప్రముఖ సహచరులలో ఒకరుగా పేరు మోసారు. వార్ధక్యంలో కంటిచూపు పోయింది. హిజ్రీ 75లో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 94. ఈయన మదీనా మునవ్వరాలో పరమపదించిన ఆఖరి సహాబి అని అనబడుతోంది.

(٤٥) وعَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا تَوَضَّأَ أَدَارَ الْمَاءَ عَلَى مِرْفَقَيْهِ. أَخْرَجَهُ الدَّارَقُطْنِي بِإِسْنَادٍ ضَعِيفٍ.

45. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వుజూ చేస్తున్నపుడు తమ మోచేతులపై బాగా నీరు పోసేవారు. (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. ఈ హదీసు ప్రామాణికత రీత్యా బలహీనమైనది).

(٤٦) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ وُضُوءَ

46. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "వుజూ ఆరంభి

لِمَنْ لَمْ يَذْكُرِ اسْمَ اللّٰهِ عَلَيْهِ». أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَه بِإِسْنَادٍ ضَعِيْفٍ. وَالتِّرْمِذِيُّ عَنْ سَعِيْدِ بْنِ زَيْدٍ وَأَبِي سَعِيْدٍ نَحْوَهُ. وَقَالَ أَحْمَدُ: لَا يَثْبُتُ فِيْهِ شَيْءٌ.

స్తున్న సమయంలో 'బిస్మిల్లాహ్' పఠించని వాని వుజూ కాదు." (ఈ హదీసును అహ్మద్, అబూ దావూద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. కాని దీన్ని వివరించిన తీరు మాత్రం బలహీనమైనది. తిర్మిజీ గారు ఈ హదీసును సయీద్ బిన్ జైద్ నుండి సంగ్రహించారు. అబూ సయీద్ నుండి కూడా ఇదేవిధంగా సేకరించారు. దీని గురించి ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ.లై) ఇలా పలికారు: "ఈ విషయమై ఏదీ రుజువు కాలేదు").

### సారాంశం

ముగ్గురు ఇమాముల దృష్టిలో వుజూ చేసేముందు "బిస్మిల్లాహ్" పఠించటం మస్నూన్ (సంప్రదాయం). ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ.లై), దావూద్ జాహిరీల అభిప్రాయంలో వుజూకు ముందు 'బిస్మిల్లాహ్' చదవటం వాజిబ్ (తప్పనిసరి). ఉద్దేశ్యపూర్వకంగా బిస్మిల్లాహ్‌ను విడనాడిన వ్యక్తి వుజూ చేసినా అది వుజూ కాదు అని ఇస్హాఖ్ బిన్ రాహ్వే నొక్కి వక్కాణించారు.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందించిన సయీద్ బిన్ జైద్ (రజి) పూర్తి పేరు - సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నఫీల్ అల్ అద్వి అల్ ఖురైషీ. అబుల్ ఆవర్ మరో పేరు. దైవప్రవక్త (సఅసం) నోట ప్రపంచంలోనే స్వర్గలోకపు శుభ వార్తను విన్న పదిమంది ప్రియసహచరులలో ఈయన ఒకరు. ఇస్లాంను స్వీకరించిన ప్రథమశ్రేణి సహచరులలో ఈయన కూడా ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) గారి తోబుట్టువు ఫాతిమ బిన్తె ఖత్తాబ్ (ర.అన్హా) ఈయన సతీమణి. ఈ దంపతులు హజ్రత్ ఉమర్ (రజి)ను ఇస్లాం వైపునకు మరల్చటంలో కీలక పాత్ర పోషించారు. బద్ర్ సంగ్రామంతోపాటు, దైవప్రవక్త (స) పాల్గొన్న మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. హిజ్రీ 51లో మరణించారు. జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

(٤٧) وعَنْ طَلْحَةَ بْنِ مُصَرِّفٍ عَنْ أَبِيْهِ عَنْ جَدِّهِ قَالَ: رَأَيْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَفْصِلُ

47. హజ్రత్ తల్హా బిన్ ముసర్రిఫ్ (రహ్మ.లై) తన తండ్రి గారి నుండి, ఆయన తన తాత గారినుండి ఉటంకించారు : "నేను దైవప్రవక్త (సఅసం) గారిని నా కళ్లారా చూశాను. ఆయన (స) పుక్కిలించడం కోసం, ముక్కులోనికి నీరు ప్రవేశింపజేయటం కోసం వేర్వే

بَيْنَ الْمَضْمَضَةِ وَالِاسْتِنْشَاقِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ ضَعِيفٍ.

రుగా నీరు తీసుకునేవారు." (ఈ ఉల్లేఖనాన్ని అబూదావూద్ బలహీనమైన ఆధారాలతో పొందుపరిచారు).

**సారాంశం**

ఈ హదీసు ద్వారా పుక్కిలించటం కోసం, ముక్కు కోసం వేర్వేరుగా నీరు తీసుకోవచ్చని వెల్లడవుతోంది. ప్రామాణికత రీత్యా రచయిత ఈ హదీసును బలహీనమైనదిగా ఖరారు చేశారు. దీనికి భిన్నంగా బుఖారీ, ముస్లింలలో వచ్చిన హదీసులలో దైవప్రవక్త (సఅసం) ఒకేసారి చేతిలో నీళ్లు తీసుకుని పుక్కిలించటం, ముక్కులోనికి నీరు ఎక్కించటం చేసేవారు. రాబోయే హదీసులలో ఈ ప్రస్తావనను గమనించగలరు.

**హదీసు ఉల్లేఖకులు**

తల్హా బిన్ ముసర్రిఫ్ (రహ్మ.లై) గారి మరోపేరు అబూ ముహమ్మద్. ప్రవక్తగారి ప్రశిష్యుల (తాబయీల)లోనివారు. మేధావి వర్గానికి చెందినవారు. మధురాతి మధురంగా ఖుర్ఆన్ను పఠించేవారు. జ్ఞాని. హిజ్రీ 112లో కన్నుమూశారు.

(٤٨) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ - فِي صِفَةِ الْوُضُوءِ -: ثُمَّ تَمَضْمَضَ ﷺ وَاسْتَنْثَرَ ثَلَاثًا، يُمَضْمِضُ وَيَنْثُرُ مِنَ الكَفِّ الَّذِيْ يَأْخُذُ مِنْهُ المَاءَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

48. హజ్రత్ అలీ (రజి) గారిచే వుజూ గురించి వివరించబడిన హదీసు : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడుసార్లు పుక్కిలించారు. ముక్కు లోనికి నీరు ఎక్కించారు. ఆయన (స) ఏ చేత్తో నీరు తీసుకున్నారో ఆ చేత్తోటే పుక్కిలించటం, ముక్కులోనికి నీరు పోయటం చేశారు." (అబూదావూద్, నసాయి).

**సారాంశం**

ఒకేసారి చేత్తో తీసుకున్న నీరును పుక్కిలించడానికి, ముక్కులోనికి పోయడానికీ ఉపయోగించవచ్చునని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఈ పనిని దైవప్రవక్త (స) మూడుసార్లు చేసేవారని కూడా తెలుస్తోంది. కుడిచేత్తో నోటిలో, ముక్కులో నీరు పోసేవారనీ, ఎడమచేత్తో ముక్కును పట్టి చీదేవారని నసాయిలో క్షుణ్ణంగా వివరించబడింది.

(٤٩) وعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ رضي الله تعالى عنه - فِيْ صِفَةِ الْوُضُوءِ -: ثُمَّ أَدْخَلَ

49. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) వుజూ గురించి ఇలా వివరించారు : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతిలో నీరు తీసుకున్నారు. తరువాత పుక్కిలించారు, ఆ తరువాత

ﷺ يَدَهُ فَمَضْمَضَ وَاسْتَنْشَقَ مِنْ كَفٍّ وَاحِدٍ، يَفْعَلُ ذَلِكَ ثَلَاثاً. مُتَّفَقٌ عَلَيْهِ.

ముక్కు లోనికి నీరు ఎక్కించారు. ఒకే చేతిలో ఉన్న నీటితో ఆయన మూడు సార్లు ఈ విధంగా ఆచరించారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పై రెండు హదీసులు కూడా పుక్కిలించడానికీ, ముక్కులోకి నీరు పోయడానికి ఒకేసారి చేత్తో తీసుకున్న నీరు సరిపోతుందని వెల్లడిస్తున్నాయి. పైగా ఇది అత్యంత పాదుపుతో కూడుకున్న విధానం కూడా. అయితే తల్హా బిన్ ముసర్రిఫ్ పేర్కొన్న హదీసు వేర్వేరుగా నీరు తీసుకోవాలని కోరుతున్నది. కాని అది వివరించబడిన తీరునుబట్టి బలహీనమైన హదీసుగా ఖరారు చేయబడింది. ఈ నేపథ్యంలో విజ్ఞులైన పండితులు వెల్లడించిన అభిప్రాయం ప్రకారం రెండింటిలో ఏ విధానాన్ని అనుసరించినా అది మస్నూన్ (ప్రవక్త విధానం) గానే పరిగణించబడుతుంది. అయితే "ఒకేసారి తీసుకున్న నీటితో పుక్కిలించటం, ముక్కులోనికి నీరు ఎక్కించటం" అన్న హదీసు ఎక్కువ ప్రామాణికమైనది. ప్రామాణిక మైన హదీసుకు ప్రాధాన్యత నివ్వటం సమంజసం కూడా.

(٥٠) وَعَنْ أَنَسٍ رضي الله تعالى عنه قَالَ: رَأَى النَّبِيُّ ﷺ رَجُلاً وَفِي قَدَمِهِ مِثْلَ الظُّفُرِ لَمْ يُصِبْهُ الْمَاءُ، فَقَالَ: «**اِرْجِعْ فَأَحْسِنْ وُضُوءَكَ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

50. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి దృష్టి ఒక వ్యక్తిపై పడింది. అతని కాలిపై గోరంత భాగం నీటితో తడవ లేదు. ఆయన (స) ఆ వ్యక్తినుద్దేశ్యించి, "వెళ్లి ఉత్తమ రీతిలో వుజూ చేసి రా" అని ఆదేశించారు. (అబూ దావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు).

**సారాంశం**

నిర్ణీత కాళ్ల భాగాన్ని పూర్తిగా తడిసేలా కడగాలని ఈ హదీసు స్పష్టం చేస్తున్నది. కాలిపై ఎంతభాగం తడవలేదో అంతవరకూ అది అగ్నికి ఆహుతి అవుతుందని ముస్లిం ఉల్లేఖించిన మరో హదీసులో హెచ్చరించబడింది. అబూ దావూద్‌లో ఖాలిద్ బిన్ మాదాన్ (రజి) చేత ఉల్లేఖించబడిన ఒక హదీసులో దాదాపు ఇదే భావం వ్యక్తమవుతుంది. ఆ హదీసు ప్రకారం; ఒక వ్యక్తి నమాజ్ చేస్తుండగా అతనిపై ప్రవక్త (స) గారి దృష్టిపడింది. అతని అడుగు వెనుక భాగాన నీటితో తడవని కొద్ది భాగం స్పష్టంగా - ఒక మచ్చలాగా - కనిపించింది. 'తాజాగా వుజూచేసి, ఆ తర్వాత నమాజ్ చేయి' అని దైవప్రవక్త ఆ వ్యక్తిని ఆజ్ఞాపించారు. ఈ హదీసు ద్వారానూ, ఈ శీర్షిక క్రిందికి వచ్చే ఇతర హదీసుల ద్వారాను అవగతమయ్యేదేమిటంటే, వుజూలో కాళ్లను కడగటం విధి (ఫర్జ్). కేవలం మసహ్ చేస్తే సరిపోదు. ఈ హదీసుల వెలుగులోనే నలుగురు ఇమాములు మరియు ధర్మశాస్త్రవేత్తలు కాళ్లను విధిగా కడగాల్సిందేనన్న విషయంపై ఏకాభిప్రాయం వెలిబుచ్చారు.

(٥١) وعَنْهُ قَالَ: كَانَ رَسُولَ اللهِ ﷺ يَتَوَضَّأُ بِالمُدِّ، وَيغْتَسِلُ بِالصَّاعِ إِلَى خَمْسَةِ أَمْدَادٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

51. హజ్రత్ అనస్ (రజి) గారి చేతనే ఉల్లేఖించబడిన మరో హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక 'ముద్' నీటితో వుజూ చేసేవారు. ఒక 'సా'-అంటే నాలుగైదు ముద్‌ల నీటి తో స్నానం చేసేవారు.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

వుజూ కోసమయినా, స్నానం (గుసుల్) కోసమయినా వీలయినంత తక్కువగా నీరును ఉపయోగించాలనీ, నీటిని దుర్వినియోగం చేయరాదనీ ఈ హదీసు ద్వారా బోధపడుతోంది. అనవసరంగా నీటిని పారబోయటం షరీయత్ దృష్టిలో వాంఛనీయం కాదు.

హదీసులో ప్రస్తావించబడిన 'సా' అంటే నేటి ఆధునిక పరిభాషలో అది సుమారు రెండున్నర కిలో గ్రాములకు సరిసమానమవుతుంది.

ముస్లింలోని హదీసులో ఒక 'ఫర్ఖ్' నీళ్లతో దైవప్రవక్త (స) స్నానం ముగించేవారని ఉంది. 'ఫర్ఖ్' ఆనాడు ఉపయోగంలో వున్న ఒక పాత్ర. అందులో సుమారు 9 సేర్ల నీరు పడుతుంది. ఒక 'ఫర్ఖ్' నీళ్లను దైవప్రవక్త మరియు హజ్రత్ ఆయిషా (ర.అ) - ఇద్దరూ స్నానం కోసం సరిబెట్టుకునేవారని వేరొక ఉల్లేఖనం ద్వారా విదితమవుతుంది.

ఈ హదీసుల వెలుగులో నీటి పరిమాణాన్ని నిర్ధారించటం అసలు ఉద్దేశ్యం కాదనీ, దైవప్రవక్త (స) వారు ఇన్ని నీళ్లతో స్నానం ముగించేవారని తెలియజెప్పటమే అసలు ఉద్దేశ్యమనీ ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) వ్యాఖ్యానించారు.

(٥٢) وعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا مِنْكُمْ مِنْ أَحَدٍ يَتَوَضَّأُ فَيُسْبِغُ الوُضُوءَ، ثُمَّ يَقُولُ: أَشْهَدُ أَنْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ لاَ شَرِيكَ لَهُ، وأَشْهَدُ أَنَّ مُحَمَّداً عَبْدُهُ وَرَسُولُهُ، إِلاَّ فُتِحَتْ لَهُ أَبْوَابُ الجَنَّةِ». أَخْرَجَهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَزَادَ: «اللَّهُمَّ اجْعَلْنِي مِنَ التَّوَّابِينَ وَاجْعَلْنِي مِنَ الْمُتَطَهِّرِينَ».

52. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు : ''మీలో ఎవరు వుజూ చేస్తాడో మరియు ఉత్తమ రీతిలో వుజూ చేసి -'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడనీ, ఆయన అద్వితీయుడనీ, ఆయనకు సహవర్తులెవరూ లేరనీ, నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్ (సఅసం) ఆయన దాసులనీ, ప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను' అని పలుకుతాడో అతని కొరకు స్వర్గం యొక్క ఎనిమిది ద్వారాలూ తెరువబడ

తాయి. ఇక అతను ఏ ద్వారం గుండా నయినా స్వర్గంలోనికి ప్రవేశించవచ్చు." (ముస్లిం, తిర్మిజీ). తిర్మిజీలో "ఓ దేవా! నన్ను పశ్చాత్తాపం చెందేవారిలో, పరిశుభ్రంగా ఉండేవారిలో చేర్చు" అన్న వాక్యం అదనంగా ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉమర్ (రజి) గారి పూర్తి పేరు - ఉమర్ బిన్ ఖత్తాబ్ బిన్ నఫీల్ బిన్ అబ్దుల్ ఉజ్జా (రజి). 'అబూ హాఫస్' అనేది మరోపేరు. ఈయనది విశిష్టమైన వ్యక్తిత్వం. రెండవ ధర్మ ఖలీఫాగా పరిపాలన చేశారు. భూమండలాన్ని న్యాయం, ధర్మం, విజయాలతో పులకింపజేశారు. అజ్ఞానకాలంలో ఖురైష్ తెగకు ప్రతినిధిగా ఉండేవారు. దైవదౌత్యం అందిన 6వ యేట దైవప్రవక్త (స) చేతుల మీదుగా ప్రమాణం చేసి ఇస్లాం స్వీకరించారు. ఈయన ఇస్లాం స్వీకారంలో, ఈయన బావగారైన సయీద్ (రజి), సోదరి అయిన ఫాతిమా బిన్తె ఖత్తాబ్ (ర.అన్హా) కీలకపాత్ర వహించారు. ఒక్క తబూక్ పోరాటం తప్ప మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఈయన ఖిలాఫత్ కాలంలో ఇస్లాం విజయపరంపర కొనసాగింది. ఇరాక్, ఈరాన్, సిరియా, ఈజిప్టు తదితర ప్రాంతాలు ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చేశాయి. ముగీరా బిన్ షూబ (రజి) గారి బానిస అయిన అబూ లూలూ దాడి చేసి ఆయన్ని తీవ్రంగా గాయపరిచాడు. ఆ బాధతోనే ఆయన అమరగతినొందారు.ఈ సంఘటన హిజ్రీ 24వ సంవత్సరం ముహర్రం నెలలో జరిగింది.

### 5వ అధ్యాయం

## మేజోళ్ళపై మసహ్ చేయటం

## ٥ - بَابُ الْمَسْحِ عَلَى الْخُفَّيْنِ

53. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) తెలిపారు : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంట ఉన్నాను. ఆయన (స) వుజూ కోసం ఉపక్రమించగానే నేను ఆయన మేజోళ్లను తీయడానికి ముందుకొచ్చాను. అప్పుడాయన (స) ఇలా పలికారు : "వదులు. నేను మేజోళ్లు తొడిగినప్పుడు వుజూతో ఉన్నాను." ఆ తరువాత ఆయన (సఅసం) వాటిపై మసహ్ చేశారు.

(బుఖారీ, ముస్లిం)

(٥٣) عَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَتَوَضَّأَ فَأَهْوَيْتُ لِأَنْزِعَ خُفَّيْهِ، فَقَالَ: «دَعْهُمَا فَإِنِّي أَدْخَلْتُهُمَا طَاهِرَتَيْنِ» فَمَسَحَ عَلَيْهِمَا. مُتَّفَقٌ عَلَيْهِ.

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే వుజూ చేసివున్న స్థితిలో మేజోళ్లు తొడిగి ఉంటేనే వాటిపై మసహ్ చేయటం ధర్మసమ్మతం అవుతుంది. ఈ సంఘటన తబూక్ యుద్ధ సందర్భంగా ఫజ్ర్ నమాజ్ సమయంలో ఎదురయిందని అబూ దావూద్ మరియు ముఅత్తా ఇమామ్ మాలిక్‌లలో వివరించబడింది.

(٥٤) وللأَرْبَعَةِ عَنْهُ إِلاَّ النَّسَائِيَّ: أَنَّ النَّبِيَّ ﷺ مَسَحَ أَعْلَى الْخُفِّ وَأَسْفَلَهُ. وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

54. 'నసాయి' లోనే గాకుండా మిగిలిన సునన్ యొక్క నాలుగు గ్రంథాలలో కూడా ముగీరా బిన్ షూబ (రజి) గారి చేతనే ఈ విధంగా ఉల్లేఖించబడింది : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేజోళ్లపైనా, క్రింద - రెండు వైపులా మసహ్ చేశారు." (ఈ ఉల్లేఖనం అంతగా ప్రామాణికమైనది కాదు).

**సారాంశం**

మేజోళ్ల పైనా, క్రింద - రెండు వైపులా మసహ్ చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. అయితే ఈ ఉల్లేఖనం బలహీనమైనది. రాబోయే ప్రామాణికమైన హదీసుకు ఇది విరుద్ధంగా ఉన్నది.

(٥٥) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَوْ كَانَ الدِّينُ بِالرَّأْيِ لَكَانَ أَسْفَلُ الخُفِّ أَوْلَى بِالْمَسْحِ مِنْ أَعْلاَهُ، وَقَدْ رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَمْسَحُ عَلَى ظَاهِرِ خُفَّيْهِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

55. హజ్రత్ అలీ (రజి) ఉల్లేఖించారు : "ఒకవేళ ధర్మం పునాదే గనక అభిప్రాయాలపై, హేతువుపై ఆధారపడి ఉంటే మేజోళ్ల పైభాగానికి బదులు క్రింది భాగానికి మసహ్ చేయటం ఎక్కువ సమంజసంగా భావించబడేది. అయితే దైవప్రవక్త (సఅసం) తన మేజోళ్ల పైభాగాన మసహ్ చేయటం నేను ఖుద్దుగా చూశాను." (అబూ దావూద్ దీనిని ప్రామాణికమైన రీతిలో ఉల్లేఖించారు).

**సారాంశం**

దీనిభావం ఏమిటంటే ధర్మాదేశాలు దైవ సంకేతంపై ఆధారపడి ఉంటాయిగాని బుద్ధీ వివేకాలపై కావు. బుద్ధిపై, హేతువుపై గనక ఇవి ఆధారపడి ఉన్నట్లయితే మేజోళ్ల పైభాగాన

మసహ్ చేయాలని ఎన్నటికీ ఆజ్ఞాపించబడేది కాదు. మేజోళ్ల అడుగు భాగాన మాత్రమే మసహ్ చేయాలని ఆదేశించబడేది. ఎందుకంటే అడుగు భాగమే అశుద్ధతకు, మలినానికి లోనై ఉంటుంది. కాని హదీసు హేతువుకు విరుద్ధంగా ఉంది. మూలాంశం స్పష్టంగా ఉన్నప్పుడు మనిషి హేతువు కాంతిలో ఆలోచించకూడదు. అయితే గియితే అంటూ తన స్వంత అభిప్రాయాలను అన్వయింపజేసే ప్రయత్నాలు చేయకూడదు.

(٥٦) وَعَنْ صَفْوَانَ بْنِ عَسَّالٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَأْمُرُنا إِذَا كُنَّا سَفراً أَن لاَّ نَنْزِعَ خِفَافَنَا ثَلاَثَةَ أَيَّامٍ ولَيَالِيَهُنَّ إِلاَّ مِنْ جَنَابَةٍ، وَلَكِنْ مِنْ غَائِطٍ وَبُولٍ وَنَوْمٍ. أَخْرَجَهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَاللَّفْظُ لَهُ، وَابْنُ خُزَيْمَةَ وَصَحَّحَاهُ.

56. హజ్రత్ సఫ్వాన్ బిన్ అస్సాల్ (రజి) వివరించారు : మేము ప్రయాణంలో ఉండగా - అశుద్ధావస్థకు లోనైతే తప్ప- మూడు పగళ్ళూ, మూడు రాత్రుల దాకా మేజోళ్లు విడువనవసరం లేదని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఆజ్ఞాపించేవారు. అయితే మలమూత్రాల విసర్జన దృష్ట్యా, నిద్ర కారణంగా వాటిని విడువవలసిన అవసరం లేదు." (నసాయి, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం తిర్మిజీ నుండి తీసుకోబడ్డాయి. తిర్మిజీ, ఇబ్నె ఖుజైమాలిరువురూ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ధృవీకరించారు).

**సారాంశం**

మేజోళ్లపై మసహ్ చేసే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేదు. ఈ అంశాన్ని గురించి ఉల్లేఖించిన సహాబీల సంఖ్య 80కు చేరింది. స్వర్గలోక శుభవార్త పొందిన సహాబీలు కూడా వీరిలో ఉన్నారు.

అయితే మేజోళ్ల గడువు ప్రయాణీకులకు, స్థానికులకు వేర్వేరుగా నిర్ధారించబడి ఉంది. ప్రయాణీకులయితే మూడు రేయింబవళ్ల వరకూ మేజోళ్లు ధరించి ఉండవచ్చు. స్థానికులయితే ఒక పగలూ ఒక రేయి వరకూ తొడగవచ్చు. వుజూ భంగమయిన క్షణం నుంచీ గడువు మొదలవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి జుహ్ర్ నమాజ్ సమయంలో వుజూ చేసి మేజోళ్లు తొడిగాడు, అతని వుజూ సాయంత్రం భంగమైందనుకోండి, అతని గడువు సాయంత్రం నుండే మొదలవుతుంది. మనిషి అశుద్ధతకు లోనైన (తప్పనిసరిగా స్నానం చేయవలసిన అగత్యం ఏర్పడిన) కారణంగా మేజోళ్లు తీసినట్లయితే మసహ్ భంగమైనట్లే. అలాగే గడువు ముగిసిన మరుక్షణం నుంచే మసహ్ భంగమైపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈయన పూర్తి పేరు సఫ్వాన్ బిన్ అస్సాల్ మురాదీ అల్ జమలీ. ప్రముఖ సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో జరిగిన 12 యుద్ధాలలో ఈయన పాల్గొన్నారు. కూఫాలో స్థిరనివాస మేర్పరచుకున్నారు.

(٥٧) وعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: جَعَلَ النَّبِيُّ ﷺ ثَلَاثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ لِلْمُسَافِرِ، وَيَوماً وَلَيْلَةً لِلْمُقِيمِ، يَعْنِيْ فِي الْمَسْحِ عَلَى الْخُفَّيْنِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

57. హజ్రత్ అలీ (రజి) గారిచే ఇలా ఉల్లేఖించబడింది : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణీకుని కోసం మేజోళ్లపై మసహ్కై మూడు రేయింబవళ్ళను, స్థిర నివాసమున్న వానికై ఒక పగలూ రేయిని గడువుగా నిర్ధారించారు." (ముస్లిం)

(٥٨) وعَنْ ثَوْبَانَ رضي الله تعالى عنه قَالَ: بَعَثَ رَسُولُ اللهِ ﷺ سَرِيَّةً فَأَمَرَهُمْ أَنْ يَمْسَحُوا عَلَى العَصَائِبِ، يَعْنِي العَمَائِمَ، وَالتَّسَاخِيْنَ، يَعْنِي الخِفَافَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

58. హజ్రత్ సౌబాన్ (రజి) ఉల్లేఖించారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక సైనిక దళాన్ని పంపిస్తూ, తల పాగాలపై, మేజోళ్లపై 'మసహ్' చేయవలసిందిగా వారిని ఆదేశించారు." (అహ్మద్, అబూదావూద్‌లు దీనిని ఉల్లేఖించారు- హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

## సారాంశం

హదీసులో ప్రయోగించబడిన అరబీ పదాలకు మేజోళ్ళ బదులు 'కట్లు, 'పట్టీలు' అన్న అర్థాలు వస్తాయి. కాళ్లను చలి తీవ్రత నుండి కాపాడటానికి ఉపయోగించే వస్తువు అన్నభావం కూడా వస్తుంది. అవి మేజోళ్లూ కావచ్చు, లేక మరే కట్లు అయినా కావచ్చు. కాళ్లకు తగిలిన గాయాలపై కట్టే పట్టీ (బ్యాండేజి) కూడా కావచ్చు.

సైనిక బృందాన్ని యుద్ధానికి పంపిస్తూ దైవప్రవక్త (స) ఈ రకమయిన ఆజ్ఞలు జారీ చేశారంటే; క్షతగాత్రులైన యోధులు వుజూ భాగాలను మాటిమాటికీ కడిగేబదులు గాయాలపై కట్టబడి వున్న పట్టీలపై మసహ్ చేస్తే సరిపోతుంది అన్న భావం అయి ఉంటుంది.

## హదీసు ఉల్లేఖకులు

సౌబాన్ (రజి) గారి పూర్తి పేరు సౌబాన్ బిన్ బుజ్దద్ బిన్ జహ్దర్. మారుపేరు అబూ అబ్దుల్లాహ్. ఈయన 'సురాత్' కు చెందిన వారు. అది మక్కా-మదీనాల మధ్య ఉన్న ఒక స్థలం. హుమైర్ తెగకు చెందినవారన్న వాదన కూడా ఉంది. ప్రయాణావస్థలోనూ, సాధారణ

సమయాలలోనూ ఈయన - జీవితాంతం - దైవప్రవక్త (సఅసం)కు వెన్నంటి ఉండేవారు. అన్ని రకాల సేవలు అందించేవారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని కొని బానిసత్వం నుండి విముక్తి కలిగించారు. దైవప్రవక్త (స) మరణించిన పిదప ఈయన సిరియాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. కొన్నాళ్ల తర్వాత హిమ్స్ వైపునకు పయన మయ్యారు. హి॥జ్రీ 54లో కన్నుమూశారు.

(٥٩) وعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مَوْقُوفاً، وأنسٍ مَرْفوعاً: «إِذَا تَوَضَّأَ أَحَدُكُمْ وَلَبِسَ خُفَّيْهِ فَلْيَمْسَحْ عَلَيْهِمَا، وَلْيُصَلِّ فِيهِمَا، وَلاَ يَخْلَعْهُمَا إِنْ شَاءَ إِلاَّ مِنْ جَنَابَةٍ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ وَصَحَّحَهُ.

59. హ॥జ్రత్ ఉమర్ (రజి) చే గుర్తింపు పొందనిది (మౌఖూఫ్) గానూ, హ॥జ్రత్ అనస్ (రజి)చే గుర్తింపు పొందినది (మర్ఫూ)గానూ ఉల్లేఖించబడిన హదీసు లో ఇలా అనబడింది:

“మీలో ఎవరయినా మేజోళ్లు ధరించి ‘వుజూ’ చేస్తే వాటిపై మసహ్ చేసుకో వచ్చు. వాటిని ధరించి వున్న స్థితిలోనే నమాజ్ చేయవచ్చు. విధిగా స్నానం చేయవలసిన స్థితికి లోనైతే తప్ప వాటిని తీయవలసిన అవసరం లేదు.” దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీని ప్రామాణికతను ధృవీకరించారు).

(٦٠) وعَنْ أَبِي بَكْرَةَ رَضِي الله تَعالى عنه عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ رَخَّصَ لِلْمُسَافِرِ ثَلاَثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ، وَلِلْمُقِيمِ يَوْماً ولَيْلَةً، إِذَا تَطَهَّرَ فَلَبِسَ خُفَّيْهِ، أَنْ يَمْسَحَ عَلَيْهِمَا. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

60. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించినట్లు హ॥జ్రత్ అబూ బక్ర (రజి) వివరించారు - ఆయన (స) బాటసారి కోసం (మసహ్ నిమిత్తం) మూడు రేయింబవళ్ల సౌకర్యం ఇచ్చారు. బాటసారి కాని వారికి ఒక పగలూ, ఒక రాత్రి సౌలభ్యం ఇచ్చారు. అయితే వుజూ చేసి వున్న స్థితిలో మేజోళ్లు తొడిగితేనే ఇలా మసహ్ చేయవచ్చు.” (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ఖరారు చేశారు).

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన అబూ బక్ర (రజి) అసలు పేరు నుఫై బిన్ హారిస్. ఈయన తాయఫ్ కోట నుంచి కొంతమంది యువకులతో బయటకు వచ్చి ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (సఅసం) ఈయనకు స్వేచ్ఛనొసగారు. బుద్ధిజీవులలో ఒకరుగా పరిగణించబడ్డారు. హిజ్రీ 51 లేదా హిజ్రీ 52లో బస్రాలో కన్నుమూశారు. అధిక సంతానం కలవారు.

(٦١) وعَنْ أُبَيِّ بْنِ عِمَارَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللهِ! أَمْسَحُ عَلَى الخُفَّيْنِ؟ قَالَ: نَعَمْ، قَالَ: يَوْماً؟ قَالَ: نَعَمْ، قَالَ: وَيَوْمَيْنِ؟ قَالَ: نَعَمْ، قَالَ: وثَلاَثَةَ أَيَّامٍ؟ قَالَ: نَعَمْ، وَمَا شِئْتَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَقَالَ: لَيْسَ بِالْقَوِيِّ.

61. హజ్రత్ ఉబై బిన్ ఇమార (రజి) వివరించారు : 'ఓ దైవ ప్రవక్తా! నేను మేజోళ్ల పై మసహ్ చేయగలనా?' అని ప్రశ్నించాను. "అవును, చేసుకోవచ్చు" అని ఆయన (స) జవాబిచ్చారు. 'ఒక రోజా?' అని నేను అడగ్గా "అవును, ఒక రోజు" అని ఆయన (స) బదులిచ్చారు. 'రెండు రోజులు?'అని విన్నవించుకోగా, "అవును, రెండు రోజులు" అని సెలవిచ్చారు. 'మూడు రోజులు కూడానా?' అని నేను ప్రశ్నించగా "అవును, మూడు రోజులు. నీ కిష్టమొచ్చినంత కాలం" అని ఆయన (స) పలికారు. (అబూ దావూద్ ఈ హదీసును ఉల్లేఖించారు. అయితే ఇది దృఢమైనది కాదు అని ఆయన అభిప్రాయపడ్డారు).

## సారాంశం

ఈ హదీసు బలహీనమైనది. పైగా ఇది ఇంతకు ముందు గడువును సూచించిన రెండు ప్రామాణికమైన హదీసులకు విరుద్ధంగా ఉంది. బాటసారి కోసం మూడు రేయింబవళ్లు, బాటసారి కాని వ్యక్తికి ఒక పగలు రేయి మసహ్ చేసే గడువుగా లోగడ వచ్చిన ప్రామాణిక హదీసులలో నిర్ధారించబడింది. దృఢమైన, ప్రామాణికమైన హదీసుల ముందు బలహీనమైన హదీసు ఉపేక్షించబడుతుంది. ఈ హదీసు చాలా బలహీనమైందన్న విషయంపై హదీసువేత్తలంతా ఏకీభవించినట్లు ఇమామ్ నవవీ (రహ్మాలై) 'షర్హుల్ ముహజ్జిబ్' లో పేర్కొన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

ఉబై బిన్ ఇమార (రజి) మదీనాకు చెందిన అన్సార్లలో సుప్రసిద్ధులు. ఈజిప్టులో స్థిరపడ్డారు.

రెండు ఖిబ్లాల (బైతుల్ మఖ్దిస్, బైతుల్లాహ్)కు అభిముఖమై నమాజ్ చేసిన భాగ్యం పొందిన వారిలో ఈయన కూడా ఉన్నారని ఇబ్నె హిబ్బాన్ పలికారు. అయితే ఈ హదీసుపై, దీని ప్రామాణికతపై తనకు నమ్మకం లేదని కూడా అయన నొక్కి పలికారు.

**6వ అధ్యాయం**

## ٦ - بَابُ نَوَاقِضِ الْوُضُوءِ

## వుజూను భంగపరిచే విషయాలు

(٦٢) عَنْ أَنَسٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ أَصْحَابُ رَسُولِ الله ﷺ عَلَى عَهْدِهِ يَنْتَظِرُونَ الْعِشَاءَ. حَتَّى تَخْفِقَ رُءُوسُهُم، ثُمَّ يُصَلُّونَ وَلاَ يَتَوَضَّئُونَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَصَحَّحَهُ الدَّارَقُطْنِيُّ. وَأَصْلُهُ فِي مُسْلِمٍ.

62. హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాక కోసం సహచరులు ఇషా నమాజ్‌లో తీవ్రంగా నిరీక్షించేవారు. నిద్రమత్తుతో ఒక్కోసారి వారి తలలు వాలిపోయేవి (కునుకు వచ్చేది). కాని వారు సరికొత్తగా వుజూ చేయకుండానే నమాజ్ చేసేవారు. (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. దారె ఖుత్నీ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. దీని మూలం మాత్రం 'ముస్లిం'లో ఉంది).

**సారాంశం**

మనిషి గాఢ నిద్రకు లోనయ్యే వరకూ అతని వుజూ భంగం కాజాలదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అదీగాక ఏ నిద్రవల్ల వుజూకు భంగం కలుగుతుందో, మరే నిద్రవల్ల వుజూ భంగం కాదో ప్రవక్త ప్రియ సహచరులకు తెలుసు. దీని గురించి వివరాల్లోకి పోనవసరం లేదు. ఒక విషయం మాత్రం గమనార్హం. దేనికయినా అనుకుని లేదా తలగడను ఆశ్రయించి నిద్రించటం వల్ల వుజూ ప్రమాదంలో పడవచ్చు. వేరితర పరిస్థితుల్లో వచ్చే నిద్రవల్ల, కునుకు వల్ల వుజూకు వాటిల్లే నష్టం ఏమీలేదు. అనుకుని నిద్రించటం వల్లనూ, తలగడ ఆసరా పొందటంవల్లనూ మానవ శరీరం అతని అదుపులో ఉండదు. పైగా ఆ స్థితిలో కడుపులో నుంచి వాయువులు విసర్జితమయ్యే అవకాశాలు హెచ్చు. ఈ కారణంగా జాగ్రత్త కోసం సరికొత్తగా వుజూ చేసుకోవాలని ఆజ్ఞాపించబడింది.

(٦٣) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: جَاءَتْ فَاطِمَةُ بِنْتُ أَبِي حُبَيْشٍ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنِّي امْرَأَةٌ أُسْتَحَاضُ فَلاَ أَطْهُرُ، أَفَأَدَعُ الصَّلاَةَ؟ قَالَ:

63. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: ఫాతిమా బిన్తె అబూ హుబైష్ (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు- "దైవప్రవక్తా (స)! నేను ఎల్లకాలం 'ఇస్తెహాజా (సుదీర్ఘ

«لاَ، إِنَّمَا ذَلِكِ عِرْقٌ وَلَيْسَ بِحَيْضٍ، فَإِذَا أَقْبَلَتْ حَيْضَتُكِ فَدَعِي الصَّلاَةَ، وإِذَا أَدْبَرَتْ فَاغْسِلِي عَنْكِ الدَّمَ ثُمَّ صَلِّي». مُتَّفَقٌ عَلَيْهِ.

కాలంపాటు జరిగే) రక్త స్రావానికి లోనై ఉంటాను. పరిశుద్ధతను పొందే భాగ్యమే దక్కదు. మరి నేనీ స్థితిలో నమాజ్‌ను మానెయ్యాలా?'' దీనికాయన (స) ''లేదు. అదొక విధమైన నరం (అది తెగి పోవటం వల్ల రక్తం స్రవిస్తుంది). అంతే గాని అది బహిష్టు రక్తం కాదు. అయితే బహిష్టు కాలపు రక్తస్రావం జరుగుతున్నప్పుడు నమాజ్‌ను మానెయ్యి. ఈ కాలం పూర్తయిన తరువాత రక్తాన్ని కడిగేసుకుని నమాజ్ చెయ్యి'' అని బోధించారు. (బుఖారీ, ముస్లిం)

وَلِلْبُخَارِيِّ: «ثُمَّ تَوَضَّئِي لِكُلِّ صَلاَةٍ». وَأَشَارَ مُسْلِمٌ إِلَى أَنَّهُ حَذَفَهَا عَمْداً.

''మరి ప్రతి నమాజ్‌కు ముందు వుజూ చేస్తుండాలి'' అన్న వాక్యం బుఖారీలో అదనంగా ఉంది. 'ముస్లిం' ఉద్దేశ్య పూర్వకంగా దీనిని విడిచిపెట్టినట్లు తెలిపారు.

## సారాంశం

స్త్రీ మూడు రకాల రక్త స్రావాలకు గురికావలసి వస్తుంది. 1. బహిష్టు రక్తం. స్త్రీ రజస్వల అయినప్పటినుంచి వృద్ధాప్యానికి చేరుకునే వరకూ సాధారణంగా ప్రతి నెలా ఈ రక్తస్రావం మూడు నుండి ఏడు రోజుల వరకూ జరుగుతూ ఉంటుంది. అయితే గర్భధారణ జరిగినపుడు ఈ రక్తం స్రవించదు. ఈ రక్తం చిక్కగా, కాస్త నలుపుగా ఉంటుంది.

రెండవది పురిటి రక్తస్రావం : ఇది స్త్రీ ప్రసవించిన రోజునుంచి 40 రోజుల దాకా లేక అంతకన్నా తక్కువ రోజులు స్రవిస్తుంది. 40 కన్నా ఎక్కువ రోజులు కూడా కనబడవచ్చు.

మూడవది 'ఇస్తెహాజా' రక్తం. ఇది ఇంతకు ముందు పేర్కొనబడిన రెండు రకాల రక్తం కంటే భిన్నమైనది. ఇది గర్భసంచితో ముడిపడివున్న ఒక నరం చిట్లటం వల్ల (ఇన్‌ఫెక్షన్ అవటం వల్ల) స్రవిస్తుంది. ఈ బ్లీడింగ్ ఎర్రగా ఉంటుంది. క్రమక్రమంగా ఇది గైనిక్ ప్రాబ్లమ్‌గా, ఫైబ్రాయిడ్ యుటరస్‌గా రూపొందుతుంది. ఏ క్షణంలో ఈ రక్తం స్రవిస్తుందో, ఎప్పుడు ఆగుతుందో చెప్పలేము. (తగు చికిత్స జరగకపోతే) మనోపాజ్ దశ వరకూ బ్లీడింగ్ అవుతూ ఉంటుంది. ఒక్కోసారి ఇన్‌ఫెక్షన్‌వల్ల ప్రాణాంతకంగా కూడా పరిణమిస్తుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసు ఉల్లేఖనానికి కారకురాలైన ఫాతిమా బిన్తె అబూ హుబైష్ (ర.అన్హా) సుప్రసిద్ధ సహాబీయ. ఖురైష్ తెగకు చెందిన 'అసద్' అనే ఉప తెగతో ఆమెకు సంబంధముంది. ఈమె

తండ్రి పేరు ఖైస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా బిన్ ఖుసై. ఈమె అబ్దుల్లాహ్ బిన్ జహష్ (రజి) సతీమణి. మర్యాదస్తురాలు, ఈమె దైవమార్గంలో హిజ్రత్ (ప్రస్థానం) కూడా చేశారు.

(٦٤) وعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رضي الله تعالى عنه قَالَ: كُنْتُ رَجُلاً مَذَاءً فَأَمَرْتُ الْمِقْدَادَ أَن يَسْأَلَ النَّبِيَّ ﷺ، فَسَأَلَهُ، فَقَالَ: فِيْهِ الْوُضُوءُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

64. హజ్రత్ అలీ (రజి) ఇలా వివరించారు : నాకు తరచూ (పురుషాంగం నుంచి)జిగటు పదార్థం వెలువడేది (శుక్ర నష్టం జరిగేది). దీనికి సంబంధించిన ఆదేశాలేమిటో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అడిగి తెలుసు కోవలసిందిగా నేను మిఖ్దాద్ (రజి)ను కోరాను. మిఖ్దాద్ (రజి) దైవప్రవక్త (స)ను దీని గురించి కనుక్కున్నారు (దీని కారణంగా వుజూ చేయాలా? లేక విధిగా స్నానం చేయాలా? అని అడిగారు). "ఇలాంటి స్థితిలో వుజూ చేస్తే సరిపోతుంది" అని ఆయన (స) సమాధాన మిచ్చారు. (బుఖారీ, ముస్లిం - అయితే ఈ వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి).

## సారాంశం

అరబీలో 'మజీ' వెలువడుతోంది అని ఉంది. ఏమిటీ 'మజీ'? ఇది తెల్లగా, చిక్కగా, జిగటుగా ఉండే నీరు. భార్యతో సరస సల్లాపాలు చేస్తున్నప్పుడు, ముద్దుపెట్టుకున్నప్పుడు, సంభోగాలోచన కలిగినప్పుడు పురుషాంగం నుంచి శీఘ్రంగా స్ఖలిస్తుంది. హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (సఅసం) కు అల్లుడు కావటం వల్ల, తన బలహీనతను ఆయన ముందు చెప్పుకోవటానికి సిగ్గుపడి, తన స్నేహితులైన మిఖ్దాద్ (రజి) సహాయం పొందారు.

## హదీసు ఉల్లేఖకులు

మిఖ్దాద్ (రజి) పూర్తి పేరు మిఖ్దాద్ బిన్ అమ్ర్ బిన్ సాలబ అల్‌బహ్‌రానీ. అబుల్ అస్వద్ అనేది మరో పేరు. మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి) పేరుతో ప్రసిద్ధిచెందారు. ఇస్లాంను స్వీకరించిన వారిలో 6వ వారు. రెండుసార్లు హిజ్రత్ చేసిన ఘనత ఈయనకు దక్కింది. పండితులు, సద్గుణ సంపన్నులగు సహచరులలో ఈయన కూడా ఒకరని అనబడుతోంది. బద్ర్ యుద్ధం జరిగిన రోజున అశ్వారూఢుల్లో ఈయన ఉన్నారు. ఈజిప్టు విజయంలో భాగస్థులు, హిజ్రీ 33లో మదీనాకు మూడు మైళ్ల దూరంలో వున్న 'జౌఫ్' వద్ద ఈయన మరణించారు. భౌతికకాయం మదీనాకు

తరలించబడింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) జనాజా నమాజ్ చేయించారు. బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి. అప్పటికి ఆయన వయస్సు 70 ఏండ్లు.

(٦٥) وَعَنْ عَائِشَةَ رضي الله تعالى عنها، أَنَّ النَّبِيَّ ﷺ قَبَّلَ بَعْضَ نِسَآئِهِ ثُمَّ خَرَجَ إِلَى الصَّلاَةِ وَلَمْ يَتَوَضَّأْ. أَخْرَجَهُ أَحْمَدُ وَضَعَّفَهُ الْبُخَارِيُّ.

65. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తన సతీమణులలో ఒకామెను ముద్దుపెట్టుకుని, నమాజ్ చేయడానికి వెళ్ళిపోయారు, వుజూ చేయలేదు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. బుఖారీ దీనిని బలహీనమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) నుండి ఇబ్రాహీం తైమీ దీనిని ఉటంకించారు. కాని ఇబ్రాహీం హజ్రత్ ఆయిషా (ర.అ) నుండి ఏమీ వినలేదు. కనుక ఇది బలహీనమైనది. అయితే బుఖారీలోని ఒక హదీసు దీనిని సమర్థిస్తోంది. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) స్వయంగా ఈ విధంగా తెలిపారు: "దైవప్రవక్త (సఅసం) రాత్రి చీకటిలో తహజ్జుద్ నమాజ్ చేసేవారు. నా కాళ్లు ఆయన సజ్దా చేసేచోట అడ్డుతగిలేవి. సజ్దాలోకి వెళ్ళే ముందు ఆయన (స) తన చేత్తో నా పాదాలను స్పృశించేవారు. వెంటనే నేను నా కాళ్ళను దూరంగా జరుపుకునే దానిని. దీని ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే స్త్రీ శరీరావయవాల్లోని ఏ భాగాన్నయినా ముట్టుకున్నంత మాత్రాన వుజూ భంగం కాదు. అలాగే ముద్దుపెట్టుకున్నంత మాత్రాన కూడా వుజూ భంగం కాదు. హజ్రత్ అలీ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కూడా ఇదే విధంగా ఆలోచిస్తున్నారు. ఇమాములలో ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) విధానం కూడా ఇదే. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో స్త్రీని ముట్టుకోవటం వల్ల వుజూ భంగమైపోతుంది.

**(٦٦) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ اللهِ ﷺ: «إِذَا وَجَدَ أَحَدُكُمْ فِي بَطْنِهِ شَيْئاً فَأَشْكَلَ عَلَيْه، أَخرَجَ**

66. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీలో ఎవరయినా మీ కడుపుల్లోంచి వాయువు విసర్జిత మైనట్లు అనిపిస్తే - అలాంటి పరిస్థితిలో నిజంగానే వాయువు విసర్జిత మైందా? లేదా? అన్న సంశయం కలిగి ఒక నిర్ణయానికి రావటం కష్టమయినట్ల యితే-మీరు (వుజూ చేయుడానికి) మస్జిద్నుండి బయటికి పోవలసిన అవ

مِنْهُ شَيْءٌ أَمْ لاَ؟ فَلاَ يَخْرُجَنَّ مِنَ الْمَسْجِدِ، حَتَّى يَسْمَعَ صَوْتاً أَوْ يَجِدَ رِيحاً». أَخْرَجَهُ مُسْلِمٌ.

సరంలేదు. (నిజంగానే) అపానవాయువు వెడలినట్లుగా శబ్దం వస్తే లేక దుర్వాసన వస్తే అప్పుడు (తాజాగా వుజూ కోసం) బయటికిపోవచ్చు.'' (ముస్లిం)

**సారాంశం**

కేవలం అనుమానం వచ్చినంతమాత్రాన వుజూ భంగం కాదని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. ఈ భావాన్ని మరి కాస్త విస్తృతార్థంలో తీసుకుంటే ఒక సూత్రం మన ముందుకు వస్తుంది. అదేమంటే ప్రతి వస్తువూ తనదైన ఒక ఆదేశంపై నెలకొని ఉంది. ఏ పనైనా దానికి విరుద్ధంగా జరిగినట్లు ఖచ్చితంగా స్పష్టం కానంతవరకూ సంశయాలు, అనుమానాలు లెక్కలోకి రావు.

(٦٧) وعَنْ طَلْقِ بْنِ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَجُلٌ: مَسَسْتُ ذَكَرِي، أَوْ قَالَ: الرَّجُلُ يَمَسُّ ذَكَرَهُ فِي الصَّلاَةِ أَعَلَيْهِ وُضُوءٌ؟ فَقَالَ النبي ﷺ: «لاَ إِنَّمَا هُوَ بَضْعَةٌ مِنْكَ». أَخْرَجَهُ الْخَمْسَةُ. وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَقَالَ ابْنُ الْمَدِينِي: هُوَ أَحْسَنُ مِنْ حَدِيثِ بُسْرَةَ.

67. హజ్రత్ తల్ఖ్ బిన్ అలీ (రజి) వివరించారు : 'నేను నా మర్మాంగాన్ని చేత్తో తాకాను' అని ఒక వ్యక్తి అన్నాడు. లేదా ఇలా అన్నాడు : 'ఒకతను నమాజ్‌లో తన మర్మాంగాన్ని చేత్తో ముట్టుకుంటున్నాడు. మరి అతను సరికొత్తగా వుజూ చేయవలసిందేనా?' దానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) "లేదు. అది నీ శరీరంలోని ఒక భాగం'' అని బదులిచ్చారు. (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీని ప్రామాణికతను ధృవీకరించారు. బుస్రా హదీసు కన్నా ఈ హదీసు మెరుగైనదని ఇబ్నె మదీని అభిప్రాయపడ్డారు).

**సారాంశం**

ఇబ్నె మదీనీగా ప్రసిద్ధిచెందిన అలీ బిన్ అబ్దుల్లాహ్ హిజ్రీ 121 లో జన్మించారు. హి.శ. 224లో మరణించారు. ఈయన ఇమామ్ బుఖారీ, అబూ దావూద్‌ల అధ్యాపకులలో ఒకరు. పురుషాంగాన్ని ముట్టుకున్నంత మాత్రాన వుజూ భగ్నం కాదని చాలామంది ప్రవక్త సహచరులు భావించేవారని తిర్మిజీ పేర్కొన్నారు. ఇబ్నె మదీనీ, ఇబ్నె ముబారక్, కూఫా వాసులు కూడా ఈ అభిప్రాయమే కలిగి ఉండేవారు.

కాగా; మరోవైపు అనేకమంది సహాబీలు, తాబయీలు పురుషాంగాన్ని తాకటంవల్ల వుజూ

భంగమైపోతుందని అభిప్రాయపడుతున్నారు. దీనికి ఆధారంగా వారు బుస్రా ఉల్లేఖనాన్ని ఉదాహరిస్తున్నారు. ఈ ఉల్లేఖనం దీని తరువాత రాబోతుంది. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై) కూడా ఈ అభిప్రాయానికే కట్టుబడి ఉన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

తల్ఖ్ బిన్ అలీ (రజి) గారి మరో పేరు అబూ అలీ. వంశపరంపర ప్రకారం ఆయన పేరు - తల్ఖ్ బిన్ అలీ బిన్ తల్ఖ్ బిన్ అమ్ర్ హనఫీ యమామీ. దైవప్రవక్త (సఅసం) మదీనా ఏతెంచినపుడు ఈయన అప్పటికప్పుడే ఆయన (స) సమక్షంలోకి హాజరయ్యారు. మస్జిదె నబవీ నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నారు. ఈయన చేత 14 హదీసులు ఉల్లేఖించబడ్డాయని అనబడుతోంది.

(٦٨) وعَنْ بُسْرَةَ بِنْتِ صَفْوَانَ رضي الله تعالى عنها أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ مَسَّ ذَكَرَهُ فَلْيَتَوَضَّأْ». أَخْرَجَهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ، وَقَالَ الْبُخَارِيُّ: هُوَ أَصَحُّ شَيْءٍ فِي هَذَا الْبَابِ.

68. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని బుస్రా బిన్తె సఫ్వాన్ (ర.అన్హా) ఉల్లేఖించారు : "ఎవరు తన మర్మాంగాన్ని చేత్తో తాకాడో అతను వుజూ చేసుకోవాలి." (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఈ అధ్యాయం క్రింద వచ్చిన వాటిలోకెల్లా ఇది అత్యంత ప్రామాణికమైన హదీసు అని ఇమామ్ బుఖారీ వ్యాఖ్యానించారు).

## సారాంశం

పురుషాంగాన్ని ముట్టుకోవటం వల్ల వుజూ భంగమైపోతుందని ఈ హదీసు స్పష్టంగా చెబుతోంది. ప్రాధాన్యత నివ్వదగిన ప్రవచనం ఇదే. ఎందుకంటే ఈ ప్రవచనంలో నిర్దిష్టమైన ఒక ఆజ్ఞ ఉంది. ఊహాగానాలకు ఇందులో ఎలాంటి ఆస్కారం లేదు. ఇంతకు ముందు వచ్చిన తల్ఖ్ బిన్ అలీ ఉల్లేఖనం కన్నా బుస్రా బిన్తె సఫ్వాన్ ఉల్లేఖనం సూటిగానూ, నిర్దిష్టంగానూ ఉందని దైవభక్తిపరాయణులైన ఇమాములు అనేకమంది అభిప్రాయపడ్డారు. అటువంటి వారిలో కొందరు ప్రముఖులు : ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అబూ జర్అ (రహ్మ.లై), అబూ హాతిమ్ (రహ్మ.లై), దారె ఖుత్నీ (రహ్మ.లై), బైహఖీ (రహ్మ.లై), ఇబ్నె జౌజీ (రహ్మ.లై) మొదలగువారు.

బుస్రా ఉల్లేఖనం కన్నా తల్ఖ్ బిన్ అలీ ఉల్లేఖనం మెరుగైనదన్న ఇబ్నె మదీనీ అభిప్రాయాన్ని ఇమాములు ఆమోదించలేదు. అదీగాక బుస్రా బిన్తె సఫ్వాన్ హదీసుకు సమర్థింపుగా దాదాపు 18 మంది ప్రవక్త సహచరుల ఉల్లేఖనాలు ఉన్నాయి. కనుక ఈ హదీసు మొదటి హదీసుకన్నా ప్రాధాన్యత నివ్వదగినది, అనుసరణీయమైనదీను.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన బుస్రా (ర.అన్హా) పూర్తి పేరు ఇది: బుస్రా బిన్తె సఫ్వాన్ బిన్ నౌఫిల్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా ఖురైషియ అసదియ. ప్రథమశ్రేణి సహచరులలో ఈమె కూడా ఒకరుగా పరిగణించబడతారు. తొలికాలంలో హిజ్రత్ చేసినవారిలో ఈమె కూడా ఉన్నారు. ఈమె అమీర్ ముఆవియ పరిపాలనా కాలం వరకూ జీవించి ఉన్నారు.

(٦٩) وعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: «مَنْ أَصَابَهُ قَيْءٌ أَوْ رُعَافٌ أَوْ قَلَسٌ أَوْ مَذْيٌ، فَلْيَنْصَرِفْ فَلْيَتَوَضَّأْ، ثُمَّ لِيَبْنِ عَلَى صَلَاتِهِ، وَهُوَ فِي ذَلِكَ لَا يَتَكَلَّمُ». أَخْرَجَهُ ابْنُ مَاجه، وَضَعَّفَهُ أَحْمَدُ وَغَيْرُهُ.

69. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు : "ఎవరికయినా నమాజ్‌లో వాంతి అయితే, లేదా ముక్కునుండి రక్తం స్రవిస్తే లేదా కడుపులోని పదార్థమేదైనా నోటిగుండా బయటికి వస్తే లేదా అంగం నుండి జిగటు పదార్థం స్ఖలిస్తే అతను నమాజ్‌ను వదలివెళ్ళి వుజూ చేయాలి. ఎక్కడయితే నమాజ్‌ని వదలిపెట్టాడో అక్కడి నుంచీ మొదలెట్టాలి. అయితే ఈ లోగా అతను సంభాషించకుండా ఉండాలన్నది షరతు." (ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖించారు. అహ్మద్ దీనిని బలహీనమైనదిగా ఖరారు చేశారు).

### సారాంశం

స్ఖలనం జరిగినపక్షంలో తక్షణం వుజూ భంగమైపోతుందని ధర్మశాస్త్రవేత్తలంతా ముక్త కంఠంతో నొక్కిపలికారు. అయితే వాంతి అవటం వల్ల, ముక్కు నుండి రక్తం స్రవించటంవల్ల, కడుపులోని పదార్థమేదైనా నోటి ద్వారా బయటకు రావటం వల్ల వుజూ భంగం అవుతుందని కొందరు, కాదని మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అలాగే నమాజ్‌ను ఎక్కడ వదలిపెట్టడం జరిగిందో అక్కడి నుంచి మొదలెట్టాలన్న విషయంలో కూడా అభిప్రాయభేదం ఏర్పడింది. ఈ హదీసు బలహీన మైనదేగాక, ప్రామాణిక హదీసులలో చెప్పబడిన కొన్ని విషయాలకు వ్యాఘాతంగా పరిణమించింది. అందుచేత ఈ హదీసు ఆధారంగా తుది నిర్ణయానికి రావటం దుర్లభమే.

వుజూ భంగమైన కారణంగా అర్థాంతరంగా ఆగిపోయిన నమాజును, అక్కడినుంచే మొదలెట్టే విషయంలో కూడా ఇమాముల మధ్య అభిప్రాయభేదం ఉంది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఈ అంశానికి అనుకూలంగా ఉండగా, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ప్రతికూలంగా ఉన్నారు. నమాజ్ చేసే వ్యక్తి 'వుజూ' ను కోల్పోయినపుడు, అతని నమాజ్ ఇంకెక్కడ మిగిలివుంటుంది? అంటారు ఇమామ్ షాఫయి (రహ్మ.లై).

70. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) ఉల్లేఖించారు : 'నేను మేక మాంసం తిన్న తరువాత వుజూ చేసుకోవాలా?' అని ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రశ్నించాడు. "నీ మనసు కోరితే చేసుకో" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. 'ఒంటె మాంసం తింటే?' అని ఆ వ్యక్తి మళ్లీ సందేహ పడగా, "ఒంటె మాంసం తిన్న తరువాతైతే వుజూ చేయాల్సిందే" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (ముస్లిం)

(٧٠) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ رَجُلاً سَأَلَ النَّبِيَّ ﷺ: أَتَوَضَّأُ مِنْ لُحُومِ الْغَنَمِ؟ قَالَ: إِنْ شِئْتَ. قَالَ: أَتَوَضَّأُ مِنْ لُحُومِ الإِبِلِ؟ قَالَ: نَعَمْ. أَخْرَجَهُ مُسْلِمٌ.

### సారాంశం

ఒంటె మాంసం తిన్న తరువాత వుజూ చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతోంది. ఈ మాంసం తిన్నంతనే వుజూ ఎందుకు ప్రమాదంలో పడుతుంది? అందలి పరమార్థం ఏమిటీ? అన్న ప్రశ్నలు ఇక్కడ అనవసరం.

ఒంటె మాంసం తినటం వల్ల వుజూ భంగమవుతుందా? అవదా? ఈ విషయంలో ఇమాములలో, ప్రవక్త అనుయాయులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇమామ్ అహ్మద్, ఇస్హాఖ్ బిన్ రాహ్వే, ఇబ్నె ముంజిర్, ఇబ్నె ఖుజైమ తదితర హదీసువేత్తలంతా - ఒంటె మాంసం తిన్న తరువాత వుజూ మిగిలి ఉండదనే అంటున్నారు. బైహఖీ మరియు అహ్లె హదీసు వారు కూడా ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), అనేకమంది సహాబీలు మరియు తాబయీలు మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. హలాల్ (ధర్మసమ్మతం చేయబడిన) జంతువు మాంసం తిన్నప్పుడు 'వుజూ' భంగం కాజాలదని వీరంతా వాదిస్తున్నారు. దీనికి ఆధారంగా వీరు అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాల వ్యాఖ్యను ఉదాహరిస్తున్నారు. ఇక్కడ 'వుజూ' చేయటంలోని అంతరార్థం భోజనానంతరం ముఖం చేతులు కడుక్కోవటం లాంటిదని వీరంతా అభిప్రాయపడుతున్నారు.

### హదీసు ఉల్లేఖకులు

జాబిర్ బిన్ సమురా (రజి) ప్రవక్త సహచరులలో ప్రముఖులు. కూఫాలో స్థిరపడ్డారు. సుమారు 186 హదీసులు ఈయనగారి చేత ఉల్లేఖించబడ్డాయి. హిజ్రీ 73లో మరణించారు.

71. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "మృతునికి స్నానంచేయించిన వాడు స్వయంగా

(٧١) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ النَّبِيُّ ﷺ: «مَنْ غَسَّلَ مَيِّتاً فَلْيَغْتَسِلْ، وَمَنْ حَمَلَهُ فَلْيَتَوَضَّأْ». أَخْرَجَهُ

أَحْمَدُ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَقَالَ أَحْمَدُ: لاَ يَصِحُّ شَيْءٌ فِي هَذَا الْبَابِ.

స్నానం చేయాలి. మృతుని లేపినవాడు (మోసినవాడు) వుజూ చేయాలి." (ఈ హదీసును అహ్మద్, నసాయి, తిర్మిజీలు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'అహ్సన్'గా ఖరారు చేశారు. ఈ అధ్యాయం క్రింద ఏ హదీసూ ప్రామాణికమైనదిగా రుజువు కాలేదని అహ్మద్ వ్యాఖ్యానించారు).

**సారాంశం**

మృతునికి స్నానం చేయించిన వ్యక్తి తాను కూడా స్నానం చేయటం 'మంచి'దన్న భావంలోనే ఇది చెప్పబడిందిగాని 'తప్పనిసరి' అన్న భావంలో మాత్రం కాదు. సుననె దారె ఖుత్నీ, ముస్నద్ అహ్మద్‌లో అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) గారి వివరణ ఇందుకు ప్రబల నిదర్శనం. ఆయన ఇలా అన్నారు : మేము మృతునికి స్నానం చేయించేవాళ్లం. తదుపరి (స్నానం చేయించిన వారిలో) కొంతమంది స్నానం చేసేవారు. మరికొంతమంది స్నానం చేసేవారు కాదు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) ఈ వివరణా తీరును సరైనదిగా ఖరారు చేశారు. బైహఖీ మరియు హాకిమ్‌లో ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం కూడా దీనిని సమర్థిస్తోంది. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), ఇబ్నె ఉమర్ (రజి), ఆయిషా (ర.అన్హా), హసన్ బస్రీ (రహ్మ.లై), ఇబ్రాహీం నఖ్యీ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై) తదితర విద్వాంసులు కూడా ఈ అభిప్రాయానికే కట్టుబడి ఉన్నారు. అయితే కొంతమంది 'స్నానం తప్పనిసరి' అని కూడా అభిప్రాయపడ్డారు. ఇక; జనాజాను మోసేవారు వుజూను తప్పనిసరిగా చేయాలని మాత్రం ఎవరూ భావించటం లేదు.

(٧٢) وعَنْ عَبْدِ اللهِ بنِ أَبِي بَكْرٍ رضي الله تعالىٰ عنهما أَنَّ فِي الْكِتَابِ الَّذي كَتَبَهُ رَسولُ اللهِ ﷺ لِعَمْرِو بْنِ حَزْمٍ: أَنْ لاَ يَمَسَّ الْقُرْآنَ إِلاَّ طَاهِرٌ. رَوَاهُ مَالِكٌ مُرْسَلاً، وَوَصَلَهُ النَّسَائِيُّ وابْنُ حِبَّانَ، وَهُوَ مَعْلُولٌ.

72. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ (రజి) తెలిపారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అమ్ర్ బిన్ హజమ్ (రజి)కు రాసిచ్చిన ఆజ్ఞాపత్రంలో ఇలా పేర్కొన్నారు : "దివ్య ఖుర్‌ఆన్‌ను పరిశుద్ధుడైన మనిషి (వుజూ చేసినవాడు) మాత్రమే ముట్టుకోవాలి." (ఇమామ్ మాలిక్ దీనిని 'ముర్సల్' ఉల్లేఖనంగా తీసుకున్నారు. నసాయి, ఇబ్నెమాజాలు దీనిని 'మౌసూల్'గా పరిగణించారు. వాస్తవానికి ఈ హదీసు "మాలూల్". అంటే లోపభూయిష్ట మైనది).

### సారాంశం

ఈ హదీసులో పరిశుద్ధత అనేది 'తహారత్' అనే అరబీ పదానికి అర్థంగా తీసుకోబడింది. తహారత్ రెండు రకాలు. ఒకటి: హదసె అక్బర్ (పెద్ద తరహా అశుద్ధత). రెండు : హదసె అస్గర్ (చిన్న తరహా అశుద్ధత).

మనిషి హదసె అక్బర్‌కు లోనై ఉంటే - అంటే సంభోగించి ఉంటే, లేదా వీర్య స్ఖలనం జరిగి ఉంటే, లేదా విధిగా స్నానం చేసి పరిశుద్ధత పొందవలసిన అగత్యం ఏర్పడివుంటే - అట్టి స్థితిలో అతను దివ్య ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటం అధర్మం (నిషిద్ధం). కేవలం వుజూ లేని స్థితిలో ముట్టుకోవచ్చా? ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే వుజూ చేసి ముట్టుకోవటం అభిలషణీయం.

### హదీసు ఉల్లేఖకులు

1. అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ (రజి) పూర్తి పేరు: అబ్దుల్లాహ్ బిన్ అబూ బకర్ బిన్ ముహమ్మద్ బిన్ అమ్ర్ హజమ్ అన్సారీ. ప్రముఖ ప్రశిష్యులు (తాబయీ). హిజ్రీ 135లో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 70 సంవత్సరాలు.

2. అమ్ర్ బిన్ హజమ్ (రజి) : ఈయన పరంపర ఇలా ఉంది - అమ్ర్ బిన్ హజమ్ బిన్ యజీద్ ఖజ్‌రజీ నజ్జారీ. అబూ జహాక్ మారు పేరు. కందక పోరాటంలో పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని నజరాన్ ప్రాంతం వైపునకు ధర్మబోధకునిగా నియమించి పంపారు. ప్రజలకు ధర్మాదేశాలను తెలిపి, ఖుర్‌ఆన్ చదివించి శిక్షణ నివ్వమని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈయన పరమపదించారు. మహాప్రవక్త (స) ఈయనకు అందజేసిన సూచనా పత్రంలో ధర్మవిధులు, సున్నత్‌లు, దానధర్మాలు, హద్దులు తదితర అంశాలు లిఖించబడ్డాయి. పై హదీసులో పేర్కొనబడిన 'ఆజ్ఞాపత్రం' ఇదే. హిజ్రీ 50 తరువాత ఈయన మదీనాలో మరణించారు.

(٧٣) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَذْكُرُ اللَّهَ عَلَى كُلِّ أَحْيانِهِ. رَوَاهُ مُسْلِمٌ، وَعَلَّقَهُ الْبُخارِيُّ.

73. "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎల్లవేళలా దైవస్మరణ చేసే వారు" అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు. (దీనిని ముస్లిం ఉల్లేఖించారు. బుఖారీ దీనిని నకలు చేశారు).

### సారాంశం

దీని సారాంశం ఏమిటంటే సంభోగం, మలమూత్ర విసర్జన తదితర అశుద్ధావస్థలలో మినహా మిగిలిన సమయాలలో - సతతం - దైవ నామస్మరణ చేసేందుకు అనుమతి ఉంది. అశుద్ధావస్థకు లోనై ఉన్నప్పుడు తప్ప మిగిలిన వేళల్లో దైవప్రవక్త (సఅసం) దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేసేవారని హదీసుల ద్వారా తెలుస్తోంది. నోరు (నాలుక) పరిశుద్ధమైనది. నోటి ద్వారా ఎల్లవేళలా దైవనామస్మరణ చేయవచ్చు.

(٧٤) وعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: أَنَّ النَّبِيَّ ﷺ احْتَجَمَ وَصَلَّى، وَلَمْ يَتَوَضَّأْ. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ، وَلَيَّنَهُ.

74. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) వివరించారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శరీరం నుండి రక్తం తీసారు. కాని వుజూ చేయకుండానే నమాజ్ చేశారు. (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. దీనిని బలహీనమైన హదీసుగా నిర్ధారించారు).

**సారాంశం**

అసలు హదీసులో "ఇహ్తిజామ్" అనే పదం వచ్చింది. దీని అర్థం శరీరాన్ని గుచ్చటం, ఏదైనా పరికరంతో శరీరంలోని రక్తాన్ని తీయటం అని వస్తుంది. ఆధునిక పరిభాషలో టీకాలు వేయటం, చెడురక్తం, చీము పేరుకుని ఉన్నచోట శస్త్రచికిత్స ద్వారా దాన్ని తొలగించటం అన్న అర్థంలో కూడా తీసుకోవచ్చు.

మలమూత్ర విసర్జనావయవాలు తప్ప శరీరంలోని మిగిలిన భాగాలనుండి రక్తం తీయటం వల్ల వుజూ భంగం కాదు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), ఇబ్నె అబ్బాస్ (రజి) తదితర సహాబీల, తాబయీల ఓ పెద్ద సమూహంతోపాటు ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయీల అభిమతం కూడా ఇదే.

(٧٥) وعَنْ مُعَاوِيَةَ رَضِيَ اللَّهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «العَيْنُ وِكَاءُ السَّهِ، فَإِذَا نَامَتِ العَيْنَانِ اسْتَطْلَقَ الوِكَاءُ». رَوَاهُ أَحْمَدُ وَالطَّبَرَانِيُّ، وَزَادَ: «وَمَنْ نَامَ فَلْيَتَوَضَّأْ».

75. హజ్రత్ ముఆవియా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "కళ్లు తెరచుకుని ఉంటే అవి వాయువు పోకుండా కట్టడి చేస్తాయి. నిద్ర కారణంగా కళ్లు మూసుకుపోతే ఈ కట్టు (బంధనం) సడలిపోతుంది. (ముస్నద్ అహ్మద్, తబ్రానీ). ("ఎవరికయితే నిద్రవస్తుందో వారు సరికొత్తగా వుజూ చేసుకోవాలి" అని తబ్రానీ ఒక వాక్యం పెంచారు).

وَهَذِهِ الزِّيَادَةُ فِي هَذَا الْحَدِيثِ عِنْدَ أَبِي دَاودَ مِنْ حَدِيثِ عَلِيٍّ دُونَ قَوْلِهِ: «اسْتَطْلَقَ

ఈ అదనపు పలుకులు అబూ దావూద్ ఉల్లేఖనంలో కూడా ఉన్నాయి. అయితే ఈయన హజ్రత్ అలీ (రజి) ఆధారంగా

الْوِكَاءُ» وَفِي كَلاَ الإِسْنَادَيْنِ ضَعْفٌ.

దీనిని ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనంలో 'బంధనం సడలిపోతుంది' అన్న వ్రాత లేదు. (ప్రామాణికత రీత్యా ఈ రెండు హదీసులూ బలహీనమైనవే).

وَلأَبِي دَاوُدَ أَيْضاً عَنِ ابْنِ عَبَّاس رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا مَرْفُوعاً: «إِنَّمَا الْوُضُوءُ عَلَى مَنْ نَامَ مُضْطَجِعاً». وفي إسناده ضعف أيضاً.

అబూ దావూద్‌లోనే ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ఇంకొక ఉల్లేఖనంలో ఇలా అన బడింది : "పండుకుని నిద్రించిన వాడే వుజూ చేయవలసి ఉంటుంది." (ప్రామా ణికతరీత్యా ఈ హదీసు కూడా బలహీన మైనదే).

## సారాంశం

ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే నిద్ర స్వతహాగా వుజూను భంగపరచేది కాకపోయినా దానివల్ల వుజూ విషయంలో సందిగ్ధావస్థ నెలకొంటుంది. అయితే ఈ రెండు ఉల్లేఖనాలు కూడా బలహీనమైనవే. ఎందుకంటే వీటిలో హదీసును అందజేసిన 'బఖ్‌య' అనే ఒక ఉల్లేఖకుని విషయంలో హదీసువేత్తలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఇది బలహీనమైనదైనప్పటికీ ముంజరీ, నవవీ లాంటి వారు హజ్రత్ అలీ (రజి) ఉల్లేఖనాన్ని పరిగణనలోకి తీసుకోదగ్గదిగా ఖరారు చేశారు.

పండుకొని నిద్రించటం వల్ల వుజూ భంగమవుతుందని హదీసులో ఉంది. గాఢనిద్రవల్ల వుజూ భంగమైపోతుందని కూడా వేరొక ఉల్లేఖనంలో ఉంది. ఈ రెంటి ద్వారా ఒక విషయం అవగతం అవుతోంది - ఒక ప్రక్కకు ఒరిగి నిద్రించటం వల్ల గాఢనిద్ర వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో శరీరావయవాలు పట్టు సడలిపోతాయి. ఆ సమయంలో అపానవాయువు వెడలే అవకాశాలు హెచ్చు. కాగా; తేలికపాటి నిద్రలో అలా జరగదు.

## హదీసు ఉల్లేఖకులు

పూర్తి పేరు ముఆవియ బిన్ అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ (రజి). మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. ఈయన సోదరుడు యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ మరణానంతరం హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని సిరియా గవర్నర్‌గా నియమించారు. హజ్రత్ అలీ (రజి) ఖిలాఫత్ వరకు ఈయన ఈ హోదాపై ఉన్నారు. హజ్రత్ హసన్ (రజి) ఖిలాఫత్‌తో తెగత్రెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించిన మీదట అనుయాయులు ఆయన సమక్షంలో బైత్ చేశారు. అమీర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇది హిజ్రీ 40 నాటి సంఘటన. హిజ్రీ 60లో ఈయన కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 78 సంవత్సరాలు.

(٧٦) وعَن ابْنِ عَبَّاسٍ رضي الله تعالى عنهما، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **«يَأْتِي أَحَدَكُمُ الشَّيْطَانُ فِي الصَّلاَةِ فَيَنْفُخُ فِي مَقْعَدَتِهِ، فَيُخَيَّلُ إِلَيْهِ أَنَّهُ أَحْدَثَ، وَلَمْ يُحْدِثْ، فَإِذَا وَجَدَ ذَلِكَ فَلاَ يَنْصَرِفْ حَتَّى يَسْمَعَ صَوْتاً أَوْ يَجِدَ رِيحاً»**. أَخْرَجَهُ الْبَزَّارُ.

76. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: "నమాజ్ చేస్తున్నప్పుడు మీలో ఎవరి వద్దకయినా షైతాన్ వస్తాడు. అతని మల విసర్జనా మార్గంలో ఊదుతాడు. వాస్తవానికి అతడు వుజూను కోల్పోకపోయినా అతడు వుజూను కోల్పోతూ ఉన్న అనుమాన బీజాన్ని అతని మస్తిష్కంలో నాటి పోతాడు. కాబట్టి మీలో ఎవరి కయినా ఇలా అనిపిస్తే అపానవాయువు వెడలినట్లుగా శబ్దం వినండి లేదా దుర్వాసన వచ్చేదాకా నమాజ్‌ను వదల కండి." (దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. ఈ హదీసు యొక్క మూలం బుఖారీలో అబ్దుల్లాహ్ బిన్ జైద్ ద్వారా, ముస్లింలో అబూ హురైర (రజి) ద్వారా పొందుపరచ బడి ఉంది).

وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ مِنْ حَدِيثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ.

ముస్లింలో హజ్రత్ అబూ హురైర (రజి) గారి ద్వారా సరిగ్గా ఇలాంటి వాక్యాలే ఉల్లేఖించబడ్డాయి.

وَلِمُسْلِمٍ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ نَحْوُهُ.

హాకిమ్ అబూ సయీద్ ద్వారా సంగ్రహించి ఇలా వివరించారు: "మీలో ఎవరి వద్దకయినా షైతాన్ వచ్చి, నీవు వుజూను కోల్పోయావని మస్తిష్కంలో అనుమానాన్ని నాటితే, 'నీవు చెప్పేది అబద్ధం' అని ఆ వ్యక్తి అతనికి జవాబివ్వాలి. దీనిని ఇబ్నె హిబ్బాన్ ఈవిధంగా పేర్కొన్నారు: "నీవు అబద్ధాల కోరువి" అని ఆ వ్యక్తి తన మనసులో అనుకోవాలి.

وَلِلْحَاكِمِ عَنْ أَبِي سَعِيدٍ مَرْفُوعاً: **«إِذَا جَآءَ أَحَدَكُمُ الشَّيْطَانُ، فَقَالَ: إِنَّكَ قَدْ أَحْدَثْتَ، فَلْيَقُلْ: إِنَّكَ كَذَبْتَ»**. أَخْرَجَهُ ابْنُ حِبَّانَ بِلَفْظِ: **«فَلْيَقُلْ فِي نَفْسِهِ»**.

7వ అధ్యాయం

## ٧ - بَابُ آدَابِ قَضَاءِ الْحَاجَةِ

## కాలకృత్యాలు తీర్చుకునే పద్ధతి

(٧٧) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا دَخَلَ الخَلَاءَ وَضَعَ خَاتَمَهُ. أَخْرَجَهُ الأَرْبَعَةُ، وَهُوَ مَعْلُولٌ.

77. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: "దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం)కాలకృత్యాలు తీర్చుకోవడానికి-బహిర్ ప్రదేశానికి - వెళ్లినపుడు (తన వేలికున్న) ఉంగరాన్ని తీసేసేవారు" (దీనిని అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనం లోపభూయిష్టమైనది).

**సారాంశం**

ఈ ఉల్లేఖనాన్ని అబూదావూద్ మాలూల్ (లోపభూయిష్టమైనది)గా ఖరారు చేశారు. బహిర్ ప్రదేశం, తదితర అపవిత్ర స్థలాలలోకి వెళ్ళేటప్పుడు దైవనామాలు లేదా దివ్య ఖుర్ఆన్ వచనాలు లిఖించి వున్న వస్తువులు తీసుకెళ్ళరాదని హదీసు ద్వారా స్పష్టమవుతోంది. కాగా; హదీసులో దైవప్రవక్త (స) తీసి వేరుగా ఉంచిన ఉంగరంపై 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని చెక్కబడి ఉంది. అందుకే దైవప్రవక్త (స) ఆ ఉంగరాన్ని బహిర్ ప్రదేశంలోకి తీసుకెళ్ళలేదు.

(٧٨) وعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا دَخَلَ الْخَلَاءَ قَالَ: «**اللَّهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنَ الْخُبُثِ وَالْخَبَائِثِ**». أَخْرَجَهُ السَّبْعَةُ.

78. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) గారే ఉల్లేఖించారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన నిమిత్తం మరుగుదొడ్డికి వెళ్ళేటప్పుడు ఈ దుఆ పఠించేవారు: "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ ఖుబుసి వల్ ఖబాయిస్" (ఓ అల్లాహ్! దుష్ట జిన్నుల, దుష్ట జిన్నాతురాళ్ల కీడునుండి నీ శరణు వేడు తున్నాను). (దీనిని ఏడుగురూ - అంటే బుఖారీ, ముస్లిం, అహ్మద్, అబూ దావూద్, నసాయి, ఇబ్నె మాజ మరియు తిర్మిజీ ఉల్లేఖించారు).

**సారాంశం**

అశుద్ధత, మాలిన్యం ఉన్నచోట్ల మాలిన్యాన్ని ఇష్టపడే పైశాచిక శక్తులు, దుష్ట జిన్నులు సంచరిస్తుంటాయి. అందుకే దైవప్రవక్త (సఅసం) మల విసర్జన నిమిత్తం బహిర్ ప్రదేశానికి వెళ్ళేముందు పఠించవలసిన దుఆను నేర్పారు. మానవుని మర్మస్థానాలు కూడా మలమూత్ర విసర్జన సమయంలో మలినభరితమయి ఉంటాయి. అందుచేత మనిషిని వేధించడానికి, ఆవహించి బాధ పెట్టడానికి ఇదే తగిన అవకాశమని పైశాచిక శక్తులు తలపోస్తాయి.

(٧٩) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَدْخُلُ الْخَلَاءَ، فَأَحْمِلُ أَنَا وَغُلَامٌ نَحْوِي إِدَاوَةً مِنْ مَّاءٍ، وَعَنَزَةً فَيَسْتَنْجِي بِالْمَآءِ. مُتَّفَقٌ عَلَيْهِ.

79. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) గారే ఇలా వివరించారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన నిమిత్తం బహిర్ ప్రదేశానికి వెడలినప్పుడు నేను, నా సమ వయస్కుడైన మరో అబ్బాయి నీళ్ల చెంబును, ఒక చిన్న ఈటెను పుచ్చుకుని తోడుగా వెళ్ళేవారం. ఆ నీళ్ళతో ఆయన (స) 'ఇస్తింజా' చేసేవారు. (శుభ్రత పొందేవారు)."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు స్పష్టమవుతున్నాయి. ఉదాహరణకు : పిన్న వయస్కులైన వారిచే పనులు చేయించు కోవటం, తనకన్నా చిన్న స్థాయి కలవారిచేత సేవ చేయించుకోవటం అసమంజసం కాదు. నీటితో ఇస్తింజా చేయటం - అంటే మర్మ స్థానాన్ని మలమూత్ర విసర్జనానంతరం కడగటం శ్రేష్ఠం. మట్టి పెడ్డను, నీటిని కూడా 'ఇస్తింజా' నిమిత్తం ఉపయోగించటం మరింత మంచిదని పండితులు అభిప్రాయపడ్డారు.

(٨٠) وعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: خُذْ الْإِدَاوَةَ، فَانْطَلَقَ حَتّٰى تَوَارَى عَنِّيْ، فَقَضٰى حَاجَتَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

80. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం : "నీళ్ళ చెంబు తీసుకుని (వెంట) రా" అని దైవప్రవక్త (సఅసం) నన్ను ఆదేశించారు. ఆయన (స) మల విసర్జన నిమిత్తం నా కంటికి కానరానంత దూరం వెళ్ళి, అక్కడ కాలకృత్యం తీర్చుకున్నారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) గారి ఈ ఆచరణ ద్వారా మనకు స్పష్టమయ్యే దేమిటంటే బహిర్ ప్రదేశానికి పోయేవారు తెరమరుగు అవ్వాలి లేదా ఎవరికీ కానరాని చోట కూర్చోవాలి. మల

విసర్జనకు బహిరంగ స్థలం తప్ప మరో చోటు లభ్యంకాని పరిస్థితుల్లో ఇసుక లేక మట్టి గుట్టల ఆసరాలోనయినా కూర్చోవాలనీ, ఆ మాత్రం జాగ్రత్త వహించకపోయినట్లయితే షైతాన్ ఆవహించటానికి అదను దొరుకుతుందని మహనీయ ముహమ్మద్ (స) వారి మరో ప్రవచనం ద్వారా తెలుస్తోంది.

(٨١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**اتَّقُوا اللاَّعِنَيْنِ، الَّذِي يَتَخَلَّى فِي طَرِيقِ النَّاسِ، أَوْ فِي ظِلِّهِمْ**». رَوَاه مُسْلِمٌ.

81. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : "శాపానికి కారణభూతమయ్యే రెండు స్థలాలపై మల విసర్జన చేసే చేష్టకు దూరంగా ఉండండి. ఒకటి : జనులు నడిచే దారిలో. రెండు : (జనులు విశ్రాంతి తీసుకునే) నీడనిచ్చే స్థలంలో." (ముస్లిం)

وَزَادَ أَبو دَاوُد عَنْ مُعاذٍ: «وَالْمَوارِدَ». وَلَفْظُه: «**اتَّقُوا الْمَلاعِنَ الثَّلاثَةَ، الْبَرَازَ فِي الْمَوَارِدِ، وَقَارِعَةِ الطَّرِيْقِ، والظِّلِّ**». ولأحمد عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهما: «أَوْ نَقْعِ مَاءٍ». وَفِيْهِمَا ضَعْفٌ.

అబూ దావూద్ హజ్రత్ ముఆజ్ (రజి) ఆధారంగా గ్రహించిన ఉల్లేఖనంలో ఇలా ఉంది - "శాపానికి కారణభూతమయ్యే మూడు అంశాలకు దూరంగా ఉండండి: నీరు ప్రవహించే స్థలాలలో, జనులు వచ్చేపోయే దారిలో, నీడ (నిచ్చే వృక్షం) క్రింద మల విసర్జన చేయటం నుండి" (దూరంగా ఉండండి).

ఇమామ్ అహ్మద్ గారు ఇబ్నె అబ్బాస్ (రజి) ఆధారంగా గ్రహించిన ఉల్లేఖనంలో ఇలా ఉంది : "నీరు నిలిచిఉండే చోట కూడా మల విసర్జన చేయరాదు." (ఈ రెండు ఉల్లేఖనాలు కూడా బలహీనమైనవే).

وَأَخْرَجَ الطَّبْرَانِيُّ: النَّهْيَ عَنْ قَضَاءِ الْحَاجَةِ تَحْتَ الْأَشْجَارِ الْمُثْمِرَةِ وَضَفَّةِ النَّهْرِ الْجَارِي، مِنْ حَدِيْثِ ابْنِ عُمَرَ بِسَنَدٍ ضَعِيْفٍ.

ఇబ్నె ఉమర్ (రజి) ఆధారంగా తబ్రానీ తీసుకున్న ఉల్లేఖనంలోని వాక్యం ఇలా ఉంది: "కాయలు కాసే, నీడనిచ్చే చెట్టు క్రింద, ప్రవహించే కాలువ ప్రక్కన మల విసర్జన చేయరాదు" (దీని వివరణా తీరులో కూడా కొంత అస్పష్టత ఉంది).

## సారాంశం

ఈ హదీసులలో మల విసర్జనకు సంబంధించిన శిక్షణ ఇవ్వబడింది. దానికి సంబంధించిన కొన్ని నియమాలు, మర్యాదలు సూచించబడ్డాయి. ఐదు స్థలాలు, లేక ప్రదేశాలలో మల విసర్జన చేయటం నిషిద్ధం అని స్పష్టం చేయబడింది. అవేమంటే; (1) రహదారిపై (2) నీడనిచ్చే వృక్షాల క్రింద (3) ప్రవహించే నీటిలో (4) పండ్లు ఫలాలనిచ్చే చెట్టు క్రింద (5) ప్రవహించే కాలువల ప్రక్కన. జనులు సంచరించే మార్గంలో మల విసర్జన చేయటం నిషిద్ధం. అయితే జన సంచారం లేని మార్గాలయితే ఫరవాలేదు.

## హదీసు ఉల్లేఖకులు (హజ్రత్ ముఆజ్ -రజి)

ఈయన అన్సార్ వర్గానికి చెందినవారు. ఖజ్రజ్ తెగతో ఈయనకు సంబంధముంది. గొప్ప జ్ఞాని. మర్యాదస్తులు. బైతె అఖబాలోనూ, బద్ర్ సంగ్రామంలోనూ పాల్గొన్నారు. మహాప్రవక్త (సఅసం) ఈయన్ని యమన్‌కు గవర్నర్‌గా నియమించారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని హజ్రత్ అబూ ఉబైద బిన్ జర్రాహ్ (రజి) అనంతరం సిరియా గవర్నర్‌గా నియమించారు. హిజ్రీ 17లో ప్లేగువ్యాధికి గురై మరణించారని అనబడుతోంది. హిజ్రీ 18లో మరణించారని మరొక వాదన. అప్పటికి ఆయన వయస్సు 38.

(٨٢) وعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا تَغَوَّطَ الرَّجُلاَنِ فَلْيَتَوَارَ كُلُّ وَاحِدٍ مِنْهُمَا عَنْ صَاحِبِهِ، وَلاَ يَتَحَدَّثَا، فَإِنَّ اللَّهَ يَمْقُتُ عَلَى ذَلِكَ». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ ابْنُ السَّكَنِ وَابْنُ الْقَطَّانِ، وَهُوَ مَعْلُولٌ.

82. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "ఇద్దరు వ్యక్తులు మల విసర్జనకై బహిర్ ప్రదేశానికి వెళితే వారు ఒకొరికొకరు కనబడని విధంగా - చాటుగా - ఉండాలి. ఆ స్థితిలో వారు పరస్పరం సంభాషించుకోకూడదు. ఎందుకంటే ఇలాంటి చేష్టను అల్లాహ్ (సుతరామూ ఇష్టపడడు) కోపగించుకుంటాడు." (అహ్మద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె సకన్, ఇబ్నె ఖత్తాన్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు. కాని ఈ హదీసులో కొంత లోపం ఉంది).

## సారాంశం

అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మలై) గారు ఈ హదీసును ఇక్రమ బిన్ అమ్మార్ బిన్ యహ్యా బిన్ కసీర్ కారణంగా మాలూల్ (లోపభూయిష్టం) గా ఖరారు చేశారు. ఈ ఉల్లేఖకుడు

ఈయన దృష్టిలో నమ్మకస్థుడు కారు. మరి చూడబోతే ఇక్రమ ఉల్లేఖనాన్ని ఇమామ్ ముస్లిమ్ స్వీకరించారు. ఇమామ్ బుఖారీ సయితం దీనిని ఉల్లేఖించారు.

సతర్ పరిధిలోకి వచ్చే శరీర భాగాలను మరుగుపరచాలని, మల మూత్ర విసర్జన సమయంలో పరస్పరం మాట్లాడుకోవటం నిషిద్ధమనీ ఈ హదీసు రుజువు చేస్తోంది. ఎవరయినా ఈ చేష్టకు ఒడిగడితే అది దేవుని ఆగ్రహానికి, అయిష్టతకు కారణభూతమవుతుందని చెప్పబడింది. కొందరు ప్రముఖులు అభిప్రాయపడినట్లు ఈ చేష్ట కేవలం మక్రూహ్ (అవాంఛనీయం) అయి ఉంటే దేవుని తరఫున ఇంత తీక్షణమైన హెచ్చరిక చేయబడేది కాదు. ఇలాంటి సమయంలో సలాంకు బదులు పలకటం సయితం సమ్మతం కాదని దైవప్రవక్త (స) గారు క్రియాత్మకంగా నిరూపించి ఉన్నారు.

(٨٣) وعَنْ أَبِيْ قَتَادَةَ رَضِيَ اللّٰهُ تَعَالى عَنْهُ قَالَ: قَالَ رسول الله ﷺ: «لاَ يَمَسَّنَّ أَحَدُكُمْ ذَكَرَهُ بِيَمِينِهِ وَهُوَ يَبُولُ، وَلاَ يَتَمَسَّحْ مِنَ الْخَلاَءِ بِيَمِينِهِ، وَلاَ يَتَنَفَّسْ فِي الْإِنَاءِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

83. హజ్రత్ అబూ ఖతాదా(రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా సెలవిచ్చారు - "మీలో ఎవరూ మూత్ర విసర్జన చేసే సమయంలో కుడిచేత్తో పురుషాంగాన్ని పట్టుకోరాదు. మల విసర్జన తరువాత కుడి చేత్తో శుభ్రపరచుకోవడంగానీ, నీరు త్రాగే సమయంలో శ్వాస పీల్చడంగానీ చేయరాదు." (బుఖారీ, ముస్లిం - వాక్యాలు మాత్రం ముస్లింలోనివి).

**సారాంశం**

ఈ హదీసులో రెండు ముఖ్యాంశాలు వివరించబడ్డాయి -

(1) మూత్ర విసర్జన సమయంలో కుడిచేత్తో పురుషాంగాన్ని పట్టుకోవటంగానీ, తాకటంగానీ చేయరాదు. ఇలా చేయటం హరామ్ (నిషిద్ధం). ఈ చేష్ట వికృతమైనది, అనాగరికమైనది.

(2) పానీయం త్రాగేటప్పుడు శ్వాస పీల్చటం (మరియు వదలటం) నిషిద్ధం. ఎందుకంటే దీనిద్వారా వెలువడే సూక్ష్మక్రిములు త్రాగే పానీయంలో కలసిపోయి, తిరిగి జీర్ణకోశంలోకి ప్రవేశిస్తాయి. ఈ సూక్ష్మక్రిములు వైద్యశాస్త్రపరంగా ఆరోగ్యానికి హానికరమైనవి.

(٨٤) وعَنْ سَلْمَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: لَقَدْ نَهَانَا رَسُولُ اللهِ ﷺ أَن نَسْتَقْبِلَ الْقِبْلَةَ بِغَائِطٍ أَوْ بَوْلٍ، أَوْ أَنْ نَسْتَنْجِيَ بِالْيَمِيْنِ، أَوْ أَن نَسْتَنْجِيَ بِأَقَلَّ مِنْ ثَلاَثَةِ أَحْجَارٍ أَوْ أَنْ

84. హజ్రత్ సల్మాన్ (రజి) ఉల్లేఖించారు: మేము మలమూత్ర విసర్జన సమయాల్లో ఖిబ్లా వైపునకు అభిముఖమై ఉండటాన్ని లేదా కుడిచేత్తో కడుక్కోవటాన్ని లేదా మూడుకన్నా తక్కువ పెడ్డలతో ఇస్తింజా చేయటాన్ని లేదా (ఎండిన) పేడతో, లద్దెతో, ఎముక

نَسْتَنْجِيَ بِرَجِيْعٍ أَوْ عَظْمٍ. رَوَاهُ مُسْلِمٌ.

తో ఇస్తింజా చేయటాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు.'' (ముస్లిం)

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన సల్మాన్ (రజి) నామాంతరం అబూ అబ్దుల్లాహ్. వాస్తవానికి ఈయన పారసీక దేశస్థులు. సత్యాన్వేషణలో బయలుదేరారు. మధ్యలో క్రైస్తవమతం కూడా స్వీకరించారు. అనంతరం మదీనా వచ్చారు. మదీనాకు రాగానే దైవప్రవక్త (స) సమక్షంలో ఇస్లాం స్వీకరించారు. సల్మానుల్ ఖైరాన్ అనే బిరుదు పొందారు. ఇస్లాంలోకి ప్రవేశించిన నాటినుంచీ తు.చ. తప్పకుండా దీనిని పాటించారు. ధర్మావలంబనలో ఆయన చిత్తశుద్ధినీ, సంకల్ప నిరతిని చూసి దైవప్రవక్త (సఅసం) ''సల్మాన్ మా ఆప్తులు'' అని కొనియాడేవారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని 'మదాయన్'కు గవర్నర్‌గా నియమించారు. కూలీ నాలీ చేసి సంపాదించిన వేతనాన్ని దైవమార్గంలో దానం చేసేవారు. హిజ్రీ 32లో కన్నుమూశారు.

(٨٥) وَلِلسَّبْعَةِ مِنْ حَدِيْثِ أَبِي أَيُّوبَ: لاَ تَسْتَقْبِلُوا الْقِبْلَةَ بِغَائِطٍ أَوْ بَوْلٍ، وَلاَ تَسْتَدْبِرُوهَا، وَلٰكِنْ شَرِّقُوا أَوْ غَرِّبُوا.

85. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) చే ఉల్లేఖించబడింది: ''మల, మూత్ర విసర్జన సమయంలో ఖిబ్లా వైపునకు తిరిగి కూర్చోవటంగానీ, దాని వైపునకు వీపు నివ్వటంగానీ చేయకండి. తూర్పు లేక పడమర వైపునకు అభిముఖులవండి.'' (దీనిని ఏడుగురూ - అంటే ఇమామ్ బుఖారీ, ముస్లిం, అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజాలు ఉల్లేఖించారు).

## సారాంశం

ఇక్కడొక ముఖ్య విషయాన్ని విస్మరించరాదు. అలనాడు ఈ హితవు మదీనా వాసుల నుద్దేశ్యించి చేయబడింది గనక, 'తూర్పు పడమరల వైపునకు తిరిగి కూర్చోండి' అని ఉంది. మదీనావాసులకు 'ఖిబ్లా' దక్షిణ దిక్కున ఉంటుంది. ఎవరికయితే ఖిబ్లా దక్షిణ లేక ఉత్తర దిక్కున పడుతుందో వారు తూర్పు - పడమరల వైపు తిరిగి కూర్చోవటం సరైనదే. అయితే తూర్పు లేక పడమర దిశల్లో 'ఖిబ్లా' ఉన్న వారు ఉత్తర - దక్షిణ దిశల్లో తిరిగి కూర్చోవలసి ఉంటుంది.

గోడగానీ, లేక మరేదైనా ఆసరాగానీ లేనిపక్షంలో-బహిరంగ మైదానాలలో ఈ పరిస్థితి ఎదురవుతుంది. ఇళ్ల దగ్గర, కార్యాలయాల దగ్గర - మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించబడి ఉంటే - అంటే మనిషికి ఎదురుగా గోడ ఉంటే అప్పుడు ఈ నిబంధన వర్తించదు.

**హదీసు ఉల్లేఖకులు**

అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) సుప్రసిద్ధ సహాబీ. అబూ అయ్యూబ్ మారు పేరు. అసలు పేరు ఖాలిద్ బిన్ జైద్ బిన్ కులైబ్. మదీనా ఏతెంచినప్పుడు దైవప్రవక్త (సఅసం) గారి ఒంటె ఈయన ఇంటి ముంగిటే కూర్చుంది. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. రోము గడ్డపై ధర్మయుద్ధం చేస్తూ (హిజ్రీ 50లో) వీరమరణం పొందారు. ఈయన సమాధి ఇస్తాంబుల్ గోడ ఛాయలో ఉంది.

(٨٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ الله تعالى عنها، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: **مَنْ أَتَى الْغَائِطَ فَلْيَسْتَتِرْ**. رَوَاهُ أَبُو دَاوُدَ.

86. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు : "మల విసర్జన కోసం వెళ్లిన వారు చాటు ప్రదేశంలో కూర్చోవాలి." (అబూదావూద్)

(٨٧) وعَنْهَا رَضِيَ الله عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا خَرَجَ مِنَ الْغَائِطِ قَالَ: «**غُفْرَانَكَ**». أَخْرَجَهُ الخمسة وصححه أَبُو حَاتِم وَالْحَاكِمُ.

87. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి చేతనే మరో ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన చేసి మరుగుదొడ్డి నుండి బయటికి వస్తున్నప్పుడు 'గుఫ్రానక' (దేవా! నీ మన్నింపుకై, ఆచ్ఛాదనకై అర్థిస్తున్నాను) అని పలికేవారు." (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాలు ఐదుగురు ఉల్లేఖించారు. అబూ హాతిమ్ మరియు హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు).

(٨٨) وعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَتَى النَّبِيُّ ﷺ الغَائِطَ، فَأَمَرَنِي أَنْ آتِيَهُ بِثَلاَثَةِ أَحْجَارٍ، فَوَجَدْتُ حَجَرَيْنِ، وَلَمْ

88. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) ఉల్లేఖించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన నిమిత్తం బహిర్ ప్రదేశానికి వెడలినప్పుడు, తన కోసం మూడు మట్టిపెడ్డలు తెమ్మని నన్ను ఆదేశించారు. నాకు రెండు పెడ్డలు దొరికాయి గాని మూడవది దొరకలేదు. (గత్యంతరంలేక) ఎండిన

أَجِدْ ثَالِثاً، فَأَتَيْتُه بِرَوْثَةٍ، فَأَخَذَهُمَا وَأَلْقَى الرَّوْثَةَ، وَقَالَ: «إِنَّها رِكْسٌ». أَخْرَجَهُ الْبُخَارِيُّ. وَزَادَ أَحْمَدُ وَالدَّارَقُطْنِيُّ «ائتِنِي بِغَيْرِها».

పేడ ముక్క నొకదానిని తీసుకొచ్చాను. ఆయన (సఅసం) రెండు మట్టి పెడ్డల నయితే తీసుకున్నారు గాని, పేడ ముక్కను దూరంగా పారవేశారు. 'ఇది స్వయంగా మలినం కదా!' అని పలికారు.'' (బుఖారీ)

అహ్మద్, దారె ఖుత్నీలలో మరొక వాక్యం అదనంగా ఉంది: "దీని బదులు ఇంకొక పెడ్డ తీసుకురా.''

## సారాంశం

స్వతహాగా మలినంతో కూడుకున్న వస్తువు - అది ఎండిపోయినప్పటికీ - దాని ద్వారా పరిశుద్ధత ఒనగూడదని ఈ హదీసు స్పష్టపరుస్తోంది. కాబట్టి అలాంటి వాటిని విడనాడాలి. మల విసర్జన తర్వాత పరిశుద్ధత కోసం కనీసం మూడు మట్టి పెడ్డలను ఉపయోగించాలి. ఒకవేళ మరిన్ని మట్టి పెడ్డలు కావలసి ఉంటే బేసి సంఖ్యలో వాటిని తీసుకోవాలి. (అంటే ఐదు, ఏడు). నేటి ఆధునిక యుగంలో (డ్రై క్లీనింగ్ నిమిత్తం) ఎన్నో వస్తువులు ఆవిష్కరించబడ్డాయి. ఉదాహరణకు టిష్యూ పేపర్లు. ఈ టిష్యూ పేపర్లు కూడా బేసి సంఖ్యలోనే ఉపయోగించాలి.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఇబ్నె మస్ఊద్ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్. బహుముఖ ప్రజ్ఞాశాలి. బుద్ధికుశలురైన సహాబాలలో ఒకరుగా పరిగణించబడ్డారు. బద్ర్ మరియు ఇతర యుద్ధాలలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) గారి అంతరంగిక సహచరులలో ఒకరు. ప్రయాణా లలోనూ, ఇంటి వద్ద కూడా దైవప్రవక్త (స) కు సన్నిహితంగా మెలిగేవారు. ఈయనగారి గుణ విశేషాలను గురించి ఎంత చెప్పినా తక్కువే. హిజ్రీ 32లో మదీనా మునవ్వరాలో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు సుమారు 60 సంవత్సరాలు.

(٨٩) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى أَنْ نَسْتَنْجِيَ بِعَظْمٍ أَوْ رَوْثٍ، وَقَالَ: «إِنَّهُمَا لاَ يُطَهِّرَانِ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَصَحَّحَهُ.

89. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఎముకతో, ఎండిన పేడ (వంట)తో 'ఇస్తింజా' చేయటాన్ని వారిం చారు. దాంతోపాటు ఇలా ఉపదేశిం చారు: "ఇవి రెండూ పరిశుద్ధతను చేకూర్చలేవు.'' (దారె ఖుత్నీ దీనిని ఉల్లే ఖించారు. దీనిని ప్రామాణికమైనదిగా కూడా ఖరారు చేశారు).

**సారాంశం**

పేడ స్వతహాగా మలినం గనక దానివల్ల శుచీ, శుభ్రత లభించే ప్రశ్నే లేదు. కాగా; ఎముక నున్నగా ఉంటుంది. అందులో పీల్చే గుణం ఉండదు. అందుచేత దాంతో పరిశుభ్రపరచటం సాధ్యం కాదు. ఇస్తింజా కోసం వీటిని ఉపయోగించకపోవటంలోని మరో మర్మాన్ని దైవప్రవక్త (స) తెలుపుతూ; అవి జిన్నుల ఆహారమనీ, వాటి పశువుల మేత అనీ అన్నారు.

(٩٠) وعَنْ أَبِي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اسْتَنْزِهُوا مِنَ البَوْلِ، فَإِنَّ عَامَّةَ عَذَابِ القَبْرِ مِنْهُ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَلِلْحَاكِمِ: «أَكْثَرُ عَذَابِ القَبْرِ مِنَ البَوْلِ» وَهُوَ صَحِيحُ الإِسْنَادِ.

90. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మూత్రపు తుంపరల నుండి మిమ్మల్ని కాపాడు కోండి. చాలా వరకు సమాధి యాతన దీనికారణంగానే ఉంటుంది." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు) హాకిమ్ ఉల్లేఖనంలో ఇలా ఉంది: "చాలా వరకు సమాధి యాతన మూత్రపు తుంపరల కారణంగా విధించబడు తుంది." (ఇది అందజేయబడిన తీరు ప్రామాణికమైనది).

**సారాంశం**

మూత్ర విసర్జన సమయంలో అజాగ్రత్త, నిర్లక్ష్య వైఖరి మూలంగా వాటి తుంపరలు శరీరంపై పడతాయి. పైకి ఇది చాలా చిన్న విషయంగా కనిపిస్తున్నప్పటికీ పరిణామం రీత్యా ఎంత భయానకంగా తయారవుతుందో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి మూత్ర విసర్జన సమయంలో శరీరంపై తుంపరలు పడకుండా జాగ్రత్త వహించటం ఎంతో అవసరం.

(٩١) وعَنْ سُرَاقَةَ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: عَلَّمَنَا رَسُولُ اللهِ ﷺ فِي الْخَلاَءِ أَنْ نَقْعُدَ عَلَى الْيُسْرَى وَنَنْصِبَ الْيُمْنَى. رَوَاهُ الْبَيْهَقِيُّ بِسَنَدٍ ضَعِيفٍ.

91. హజ్రత్ సురాఖా బిన్ మాలిక్ (రజి) తెలిపారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు కాలకృత్యాల పద్ధతులను వివరిస్తూ ఇలా అన్నారు: "ఎడమకాలిపై బరువువేసి కూర్చోండి. కుడికాలిపై తక్కువ బరువుపడేలా ఆ కాలిని నిలిపి ఉంచండి." (దీనిని బైహఖీ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

వివేకి ఆజ్ఞాపించిన ఏ ఆజ్ఞ కూడా వివేకరహితంగా ఉండదు. అది ఎవరికి అర్థమయినా కాకపోయినా - అది విజ్ఞతా వివేచనలతో, యుక్తితో నిండి ఉంటుంది. ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) ఎడమ కాలిపై ఎక్కువ భారం పడేలా ఒక ప్రక్కకు వాలి కూర్చోమని చెప్పారు. మనిషి జీర్ణకోశం ఎడమ వైపున ఉంటుంది. ఎడమ కాలిపై బరువు మోపి కూర్చోవటం వల్ల కడుపులోని వ్యర్థాలు సులువుగా విసర్జితమవుతాయి.

### హదీసు ఉల్లేఖకులు

సురాఖా బిన్ మాలిక్ బిన్ జాషమ్ ముద్లజ్ తెగకు చెందినవారు. అందువల్ల ముద్లజీగా కూడా వ్యవహరించబడ్డారు. ఈయన నామాంతరం అబూ సుఫ్యాన్. ప్రముఖ సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) మక్కానుండి మదీనాకు హిజ్రత్ చేస్తున్న సమయంలో అవిశ్వాసులు ప్రకటించిన బహుమానానికి ఆశపడి ఈయన దైవప్రవక్తను వెంటాడారు. కాని తీరా దైవప్రవక్త (స) ను సమీపించాక ఈయన గుఱ్ఱం మోకాళ్ళ వరకూ నేలలో కూరుకుపోయింది. అప్పుడీయన దైవప్రవక్త (స) శరణు కోరారు. దైవప్రవక్త (స) ఈయనకు అభయమిచ్చారు. 'మక్కా విజయం' నాడు ఈయన ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 24లో మరణించారు.

(٩٢) وَعَنْ عِيْسَى بْنِ يَزْدَادَ (بُزْدَادَ) عَنْ أَبِيْهِ قَالَ: قَالَ رسولُ الله ﷺ: «إِذَا بَالَ أَحَدُكُمْ فَلْيَنْتُرْ ذَكَرَهُ ثَلاَثَ مَرَّاتٍ». رَوَاهُ ابْنُ مَاجَهْ بِسَنَدٍ ضَعِيْفٍ.

92. హజ్రత్ ఈసా బిన్ యజ్దాద్ తన తండ్రి ఆధారంగా వివరించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరు ఎప్పుడు మూత్ర విసర్జన చేసినా అంగాన్ని మూడుసార్లు జాడించాలి." (ఇబ్నె మాజా దీనిని అప్రమాణిక ఆధారాలతో ఉల్లేఖించారు).

### సారాంశం

అంగాన్ని మూడుసార్లు జాడించమనటంలోని ఉద్దేశ్యమేమంటే మూత్రపు చుక్క ఏదైనా మార్గమధ్యంలో నిలిచివుంటే అది కూడా విసర్జితమవ్వాలి. మూత్ర విసర్జన పూర్తిగా జరిగిందన్న నమ్మకం మనిషికి కుదరాలి. ఈ ఉల్లేఖనం బలహీనమైనప్పటికీ మూత్రపు బిందువుల నుండి సురక్షితంగా ఉండాలన్న హదీసును సమర్థిస్తోంది. మూత్రపు తుంపరల పట్ల చూపే నిర్లక్ష్యవైఖరి మనిషిని సమాధి యాతనకు గురిచేస్తుందని ఇంతకు ముందు చెప్పుకున్నాం కదా!

### హదీసు ఉల్లేఖకులు (ఈసా బిన్ యజ్దాద్)

ఈ హదీసును ఉల్లేఖించిన తండ్రీ కొడుకులిద్దరూ అపరిచితులని, వారిని గురించి ఎవరికీ ఏమీ తెలియదని ఇబ్నె ముయీన్ తెలిపారు.

(٩٣) وعَن ابْن عَبَّاس رضي الله تعالى عَنْهما، أَنَّ النَّبِيَّ ﷺ سَأَلَ أَهْلَ قُبَاءٍ فَقَالَ: إِنَّ اللَّهَ يُثْنِي عَلَيْكُمْ. فَقَالُوا: إِنَّا نُتبعُ الحِجَارَةَ الماءَ. رَوَاهُ البَزَّارُ بِسَنَدٍ ضَعِيْفٍ. وَأَصْلُه فِي أَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ مِنْ حَدِيْثِ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، بِدُوْنِ ذِكْرِ الْحِجَارَةِ.

93. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఖుబా' వాసులను ద్దేశ్యించి, "అల్లాహ్ మీ (శుచీ, శుభ్రతల) గురించి ఎంతగానో కొనియాడాడు. దీనిక్కారణమేమిటి?" అని అడగ్గా వాళ్లు ఇలా విన్నవించుకున్నారు - 'మేము మట్టిపెడ్డలను ఉపయోగించిన మీదట, మరింత శుచీ, శుభ్రత కోసం నీటిని కూడా ఉపయోగిస్తాము." (బలహీన ఆధారాలతో దీనిని బజ్జార్ ఉల్లేఖిం చారు. దీని మూలాంశం అబూదావూద్, తిర్మిజీలలో ఉంది. ఈ సందర్భంగా ఇబ్నె ఖుజైమగారు అబూహురైర (రజి) ఉల్లే ఖనాన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు. అయితే అందులో మట్టి పెడ్డల ప్రస్తావన లేదు).

**సారాంశం**

'ఖుబా' గ్రామం మదీనాకు దక్షిణాన మూడు మైళ్లదూరంలో ఉంది. హిజ్రత్ సందర్భంగా మహాప్రవక్త (సఅసం) తొలుత ఇక్కడే ఆగారు. ఈ హదీసు ద్వారా, ఇస్తింజా కోసం మట్టి పెడ్డలతో పాటు నీటిని ఉపయోగించటం మంచిదని తెలుస్తోంది.

**8వ అధ్యాయం**

## ٨ - بَابُ الْغُسْلِ وَحُكْمِ الْجُنُبِ

## గుసుల్ మరియు జనాబత్

**(స్నానం చేయటం, లైంగిక అశుద్ధతను పారద్రోలటం)**

(٩٤) عَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسُولُ الله ﷺ:

94. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నీరు విసర్జించబడినపుడే నీరు ఉపయోగించాలి." (అంటే వీర్య స్ఖలనం జరిగే వరకూ గుసుల్ చేయటం తప్పని సరి

«الْمَاءُ مِنَ الْمَاءِ». رَوَاهُ مُسْلِمٌ، وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

కాదు). (దీనిని ముస్లిం ఉల్లేఖించారు. అయితే మూలాంశం మాత్రం బుఖారీలో ఉంది).

**సారాంశం**

ఈ హదీసు 'ఇహ్తెలామ్' (వీర్య స్ఖలనం) కు సంబంధించినదనీ, సంభోగంతో దీనికి సంబంధం లేదని పండితులు వ్యాఖ్యానించారు. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) ఇలా అంటున్నారు: "ఇస్లాం ఆరంభకాలంలో భార్యాభర్తలు రతి క్రీడలో పాల్గొన్నప్పటికీ - స్ఖలనం జరిగేదాకా - స్నానం (గుసుల్) తప్పనిసరి గావించబడలేదు. అయితే ఈ ఆజ్ఞ తరువాత రద్దు పరచబడింది."

ఖాజీ ఇబ్నె అరబీ ఏమంటున్నారో చూడండి: స్త్రీ పురుషులిద్దరి మర్మాంగాలు పరస్పరం కలుసుకుంటే చాలు - వీర్య స్ఖలనం జరిగినా, జరగకపోయినా - స్నానం చేయటం తప్పనిసరి అయి పోతుంది.

(٩٥) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ الله ﷺ: «إِذَا جَلَسَ أَحَدُكُمْ بَيْنَ شُعَبِهَا الأَرْبَعِ ثُمَّ جَهَدَهَا، فَقَدْ وَجَبَ الْغُسْلُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ: «وَإِنْ لَمْ يُنْزِلْ».

95. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయినాసరే స్త్రీ యొక్క నాలుగు శాఖల మధ్య కూర్చుని (అంటే స్త్రీని ఆక్రమించుకుని) ఆ తరువాత సఫల యత్నం చేస్తే స్నానం తప్పనిసరిగా చేయాల్సిందే." (బుఖారీ, ముస్లిం) ముస్లిం తన ఉల్లేఖనంలో "వీర్య స్ఖలనం జరిగినా, జరగకపోయినాసరే" అన్న వాక్యం కూడా పొందుపరచారు.

**సారాంశం**

(1) 'స్త్రీ యొక్క నాలుగు శాఖలు' అంటే రెండు కాళ్లు, రెండు జబ్బలు అని కొంతమందీ, రెండు తొడలు మరియు రెండు పిక్కలని మరికొంతమందీ విశదీకరించారు. ఏ విధంగా అర్థం తీసుకున్నా అది రతి క్రీడకు సంబంధించిన అంశమేనన్న సంగతి మాత్రం మరువరాదు.

(2) పురుషాంగం స్త్రీ యోనిలోకి ప్రవేశిస్తే చాలు - కనీసం శిశ్నం వరకూ ప్రవేశించినా సరే - గుసుల్ (స్నానం) విధిగా చేయవలసిందే. నలుగురు ధర్మ ఖలీఫాల, నలుగురు ఇమాముల, ప్రవక్త శిష్యుల, ప్రశిష్యుల అభిమతం కూడా ఇదే. ఈ హదీసు ఇంతకు ముందు వచ్చిన హదీసును రద్దుపరుస్తోంది.

(٩٦) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ أُمَّ سُلَيْمٍ - وَهِيَ امْرَأَةُ أَبِي طَلْحَةَ - قَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ اللَّهَ لاَ يَسْتَحِيِي مِنَ الْحَقِّ، فَهَلْ عَلَى الْمَرْأَةِ مِنْ غُسْلٍ إِذَا احْتَلَمَتْ؟ قَالَ: «**نَعَمْ، إِذَا رَأَتِ الْمَاءَ**»، الحديث مُتَّفَقٌ عَلَيْه.

96. హ(జత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం: అబూ తల్హా సతీమణి అయిన ఉమ్మె సులైమ్ (ర.అన్హా) దైవప్రవక్త (సఅసం) నుద్దేశ్యించి, 'ఓ దైవప్రవక్తా (సఅసం)! అల్లాహ్ సత్యం చెప్పడానికి సిగ్గుపడడు కదా! కాబట్టి స్త్రీకి స్వప్న స్ఖలనం జరిగితే ఆమె కూడా తప్పని సరిగా స్నానం చేయాల్సిందేనా చెప్పండి?, అని అడిగారు. దానికి ఆయన (స), "అవును. ద్రవ పదార్థం ఆమెకు కనిపిస్తే (స్నానం చేయాల్సిందే)" అని బదులిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

సాధారణంగా స్త్రీలు ఇలాంటి విషయాలను అడిగి తెలుసుకోవటానికి సిగ్గు పడుతుంటారు. స్త్రీలలో అల్లాహ్ పొందుపరచిన లజ్జా గుణమే దీనికి ప్రధాన కారణం. ఈ లజ్జా గుణం వల్ల ధర్మ సందేహాలు వెలిబుచ్చకుండా ఉంటే మహిళావని ధర్మ సందేహాలు కూడా తీరవు. హ(జత్ ఉమ్మె సులైమ్ ఎంతో చాకచక్యంగా దైవప్రవక్త (స) సమక్షంలో తన సందేహాన్ని వెలిబుచ్చి కోట్లాదిమంది మహిళలకు మేలు చేశారు.

### హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె సులైమ్ అసలు పేరు రుమైసా లేక ఘుమైసా బిన్తె మిల్హాన్ అని తెలుస్తోంది. ఈమె హ(జత్ అనస్ బిన్ మాలిక్ (రజి) తల్లి. పండితురాలు. తొలుత ఈమె మాలిక్ బిన్ నసర్‌కు సతీమణిగా ఉన్నారు. ఈమె ఇస్లాం స్వీకరించింది. భర్తను సయితం ఇస్లాం స్వీకరించమని ప్రాధేయపడింది. భర్త ఈమెపై ఆగ్రహించి సిరియా వెళ్ళిపోయాడు. అక్కడే మరణించాడు. మాలిక్ బిన్ నసర్ మరణానంతరం అబూ తల్హా (రజి) ఈమెకు వివాహ సందేశం పంపారు. అప్పటికి అబూ తల్హా (రజి) కూడా ముస్లిం కాలేదు. ఇస్లాం స్వీకరిస్తేనే నికాహ్ చేసుకుంటానని ఈమె షరతు విధించింది. ఈ షరతును శిరసావహిస్తూ అబూ తల్హా (రజి) ఇస్లాం స్వీకరించారు. అనంతరం ఉమ్మె సులైమ్ (ర.అన్హా) ఈయన్ని వివాహ మాడారు. హ(జత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈమె మరణించారు.

(٩٧) **وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ، فِي الْمَرْأَةِ تَرَى فِي**

97. హ(జత్ అనస్ (రజి) కథనం: కలలో యువకుడైన పురుషుడు చూచినదే స్త్రీ కూడా చూస్తే ఆమె స్నానం (గుసుల్) చేయవలసి ఉంటుందని దైవప్రవక్త (సఅసం) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

مَنَامِهَا مَا يَرَى الرَّجُلُ، قال: تَغْتَسِلُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ: «فَقَالَتْ أُمُّ سَلَمَةَ: وَهَلْ يَكُونُ هَذا؟ قَالَ: «نَعَمْ، فَمِنْ أَيْنَ يَكُونُ الشَّبَهُ؟»».

ముస్లిం అదనంగా ఈ వాక్యాలు చేర్చారు: ఉమ్మె సలమా (ర.అన్హా) దైవ ప్రవక్త (సఅసం) సమాధానం విని, 'ఏమిటి, స్త్రీకి కూడా ఇలా అవు తుందా?' అని సందేహపడగా, "అవును, అలా అవని పక్షంలో (పిల్లవాడికి తల్లి) పోలికలు ఎలా వస్తాయనుకున్నావు?" అని పలికారు.

**సారాంశం**

పుట్టిన శిశువులకు తండ్రి పోలికలతో పాటు తల్లి పోలికలు కూడా వస్తుంటాయి. తల్లి తరపు బంధువుల పోలికలు కూడా వస్తాయి. సంభోగం జరుపుతున్నప్పుడు పురుషునితో పాటు స్త్రీలో కూడా స్పందన అధికమై ద్రవాలు ఊరుతాయి. ఇవి పుట్టే శిశువు పోలికలపై ప్రభావం చూపుతాయి.

హజ్రత్ ఉమ్మె సలమా (రజి) తీవ్రంగా సందేహం వెలిబుచ్చడాన్నిబట్టి అర్థమయ్యే మరో విషయమేమిటంటే; స్త్రీలలో స్ఖలనం చాలా అరుదుగా అవుతుంటుంది. పురుషుల మాదిరిగా తరచూ అవదు.

వీర్య స్ఖలనం (స్వప్న స్ఖలనం) జరిగినప్పుడు పురుషులు స్నానం చేయటం ఎలా తప్పనిసరో అలాగే స్త్రీలు కూడా తమకు స్వప్న స్ఖలనం అయినప్పుడు తప్పనిసరిగా స్నానం చేయవలసి ఉంటుంది.

(٩٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَغْتَسِلُ مِنْ أَرْبَعٍ: مِنَ الْجَنَابَةِ، وَيومَ الْجُمُعَةِ، وَمِنَ الحِجَامَةِ، وَمِنْ غُسْلِ الْمَيِّتِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابنُ خُزَيْمَةَ.

98. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాలుగు కారణాలవల్ల గుసుల్ (స్నానం) చేసేవారు - 1. సంభో గించినపుడు. 2. శుక్రవారం వచ్చినపుడు. 3. శరీరం నుండి రక్తం తీసినపుడు. 4. మృతునికి స్నానం చేయించినపుడు. (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

నాలుగు పనుల మూలంగా స్నానం చేయవలసి ఉంటుందని ఈ హదీసులో చెప్పబడింది. (1) సంభోగించిన తరువాత స్నానం చేయటం విధి (ఫర్జ్) అన్న విషయంలో సందేహానికి ఆస్కారమే

లేదు. (2) అయితే శుక్రవారం నాడు స్నానం చేయటం చాలామంది సహాబీల, ఇమాముల దృష్టిలో సంప్రదాయం (మసూన్) మాత్రమేగాని విధి (ఫర్జ్) కాదు. కాని ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్‌లు మాత్రం ఈ స్నానాన్ని విధిగా తలపోస్తున్నారు. (3) శరీరం నుండి (చెడు) రక్తం తీసినపుడు స్నానం చేయటం కూడా మసూన్ మాత్రమే. ఫర్జ్ కాదు. (4) ఇక, మృతునికి స్నానం చేయించిన మీదట స్నానం చేయటం ముస్తహబ్ (అభిలషణీయం) గా భావించబడుతుంది. అంతేగాని తప్పనిసరి కాదు. ఈ విషయంలో అత్యధికుల అభిమతం ఇదే.

(٩٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رضيَ اللّٰهُ تَعَالَى عَنْهُ – فِي قِصَّةِ ثُمَامَةَ بْنِ أُثَالٍ عِنْدَمَا أَسْلَمَ – وَأَمَرَهُ النَّبِيُّ ﷺ أَنْ يَغْتَسِلَ. رَوَاهُ عَبدُ الرَّزَّاقِ، وَأَصْلُهُ مُتَّفَقٌ عَلَيْهِ.

99. సుమామ బిన్ ఉసాల్ (రజి) ఇస్లాం స్వీకారానికి సంబంధించిన వృత్తాంతాన్ని వివరిస్తూ హజ్రత్ అబూ హురైర (రజి) ఇలా తెలిపారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనికి స్నానం చేసి రమ్మని ఆదేశించారు." (అబ్దుర్రజ్జాఖ్ దీనిని ఉల్లేఖించారు. దీని మూలాంశం బుఖారీ, ముస్లింలలో పొందుపరచబడి ఉంది).

### సారాంశం

ఒక ముస్లిమేతరుడు ఇస్లాం స్వీకరణకు సిద్ధమైనప్పుడు తొలుత అతను స్నానం చేయాలి. ఈ స్నానం వాజిబా (తప్పనిసరా?) లేక ముస్తహబా (అభిలషణీయమా?) అన్న విషయమై పండితులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్‌ల దృష్టిలో తప్పనిసరి. ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల దృష్టిలో అభిలషణీయం.

### హదీసు సూత్రధారి

ఈ హదీసుకు సూత్రధారియైన సుమామ బిన్ ఉసాల్ యమామాకు చెందినవారు. బనూ హనీఫా తెగకు సర్దారు. ఉమ్రా చేయడానికి (మక్కాకు) బయలుదేరారు. దైవప్రవక్త (స) నియమించిన గస్తీ దళానికి పట్టుబడ్డారు. అనంతరం మదీనా మునవ్వరాలో - దైవప్రవక్త (స) సమక్షంలో - హాజరుపరచ బడ్డారు. మస్జిదె నబవీలో ఒక స్థంభానికి మూడు రోజులు బంధించి ఉంచారు. మూడు రోజుల అనంతరం దైవప్రవక్త (స) ఈయన యెడల ఉదార వైఖరినవలంబిస్తూ వదలిపెట్టారు. ప్రవక్త వారి కనికరానికి ప్రభావితుడై ఈయన ఇస్లాం స్వీకరించారు. తుది శ్వాస దాకా ఇస్లాంపై స్థిరంగా ఉన్నారు. తన ప్రాంతంలో ప్రజలు ముసైలమా అబద్ధాలకోరు మాయమాటల్లోపడి ధర్మభ్రష్టులైపోతున్న క్లిష్ట సమయంలో సయితం కదలని కొండలా స్థయిర్యం కనబర్చారు.

(١٠٠) وعَن أَبِي سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ:

100. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు:

«غُسْلُ يَوْمِ الجُمُعَةِ وَاجِبٌ عَلَى كُلِّ مُحْتَلِمٍ». أَخْرَجَهُ السَّبْعَةُ.

"శుక్రవారం నాడు స్నానం చేయటం ప్రతి యుక్తవయస్కునికీ తప్పనిసరి." (దీనిని ఏడుగురూ -అంటే-బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ, అహ్మద్ ఉల్లేఖించారు).

**సారాంశం**

శుక్రవారం నాడు స్నానం చేయటం తప్పనిసరి (వాజిబ్) అని వాదించేవారికి ఈ హదీసు ప్రబల ఆధారంగా ఉంది. ఎందుకంటే ఇందులో 'వాజిబ్' అన్న పదం స్పష్టంగా ఉంది. అయితే అధికసంఖ్యాక పండితవర్గం మాత్రం శుక్రవారం నాటి స్నానాన్ని 'మస్నూన్'గా భావిస్తోంది. ఈ హదీసులోని 'వాజిబ్' పదం గట్టిగా నొక్కి చెప్పే ఉద్దేశ్యంతో ఉపయోగించబడిందని వీరంటున్నారు.

(١٠١) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ تَوَضَّأَ يَوْمَ الجُمُعَةِ فَبِهَا وَنِعْمَتْ، وَمَنِ اغْتَسَلَ فَالْغُسْلُ أَفْضَلُ». رَوَاهُ الخَمْسَةُ، وَحَسَّنَهُ التِّرمِذِيُّ.

101. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ సమురః (రజి) తెలిపారు: "శుక్రవారం ఎవరయితే 'వుజూ' చేశాడో అతడు మంచిపని చేశాడు. మరెవరయితే 'గుసుల్' (స్నానం) చేశాడో (అతని) గుసుల్ ఎట్టి పరిస్థితిలోనూ శ్రేష్ఠమయినది, ఉత్తమ మైనది." (దీనిని ఐదుగురు -అంటే- అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

శుక్రవారం నాటి స్నానం తప్పనిసరి (వాజిబ్) కాదని దీనిద్వారా రూఢీ అవుతోంది. ఎందుకంటే 'వాజిబ్' అయిన దానిని 'అఫ్జల్' (శ్రేష్ఠమైనది)గా అభివర్ణించరు. బహుశా ఈ కారణంగానే అత్యధికమంది పండితులు దీనిని 'తప్పనిసరి' అన్న అర్థంలో తీసుకోలేదు. అయితే అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న విషయం ఏమిటంటే ముస్లింలు శుక్రవారం నాడు స్నానం చేయటం మరువరాదు. ఈ స్నానం గురించి గట్టిగా చెప్పబడిందని ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) అన్నారు. వితర్ నమాజు 'వాజిబ్' అన్న అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటున్నప్పుడు శుక్రవారం నాటి స్నానం అంతకన్నా ఎక్కువగానే పరిగణనలోకి తీసుకోదగ్గదవుతుంది.

## హదీసు ఉల్లేఖకులు

పూర్తిపేరు సమురః బిన్ జున్దుబ్. సుప్రసిద్ధ సహాబీ. ఈయన మారు పేరు అబూ అబ్దుల్లాహ్.

ఫజార్ తెగ వారవటంచేత ఫజారీ అని కూడా పిలువబడేవారు. అన్సారులతో మైత్రీ సంబంధాలుండేవి. ఖుర్‌ఆన్ హదీసులలో చాలా భాగం కంఠస్థం చేసుకున్నవారిలో ఈయన ఒకరు. బస్రాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. 'హరూరియ' వర్గంపట్ల చాలా కఠిన మనస్కులై ఉండేవారు. హిజ్రీ 59లో మరణించారు.

(١٠٢) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يُقْرِئُنَا الْقُرْآنَ مَا لَمْ يَكُنْ جُنُباً. رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، وَهَذَا لَفْظُ التِّرْمِذِيِّ، وَحَسَّنَهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

102. హజ్రత్ అలీ (రజి) తెలిపారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లైంగిక అశుద్ధతకు లోనై వున్నప్పుడు తప్ప మిగిలిన ఏ స్థితిలోనయినా మాకు ఖుర్‌ఆన్ చదివించేవారు." (దీనిని ఐదుగురు - అంటే - అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం తిర్మిజీ లోనివి. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు).

**సారాంశం**

లైంగిక అశుద్ధతకు గురైవున్న పురుషుడు దివ్య ఖుర్‌ఆన్‌ను పఠించరాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. గుసుల్ చేసే వరకూ ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటంగానీ, పారాయణం చేయటంగానీ చేయరాదు.

(١٠٣) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا أَتَى أَحَدُكُمْ أَهْلَهُ، ثُمَّ أَرَادَ أَنْ يَعُودَ، فَلْيَتَوَضَّأْ بَيْنَهُمَا وُضُوءًا**». رَوَاهُ مُسْلِمٌ، زَادَ الْحَاكِمُ: «**فَإِنَّهُ أَنْشَطُ لِلْعَوْدِ**».

103. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరయినా మీ భార్య వద్దకు పోతే (సంభోగిస్తే), మరోసారి కూడా ఆనందానుభూతి పొందాలన్న కోర్కె కలిగితే - మధ్యలో 'వుజూ' చేసుకోండి." (ముస్లిం)

وَللأَرْبَعَةِ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى

హాకిమ్ అదనంగా ఈ వాక్యం చేర్చారు: (ఈ వుజూ) మలిసారి సంభోగానికి ఎక్కువ హాయినీ, తాజాదనాన్నిస్తుంది.

عَنْهَا، قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَنَامُ وَهُوَ جُنُبٌ، مِنْ غَيْرِ أَنْ يَمَسَّ مَاءً. وَهُوَ مَعْلُولٌ.

సుననె అరబా (అంటే అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ)లో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారిచే ఇలా ఉల్లేఖించబడింది: "దైవప్రవక్త - (సల్లల్లాహు అలైహి వ సల్లం) -లైంగిక అశుద్ధతకు లోనై వున్న తరుణంలో నీళ్లను తాకకుండానే నిద్రించేవారు." (ఈ ఉల్లేఖనం లోపభూయిష్టమైనది).

## సారాంశం

పై హదీసు వెలుగులో స్పష్టమయ్యేదేమిటంటే అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించిన హదీసులోని 'వుజూ చేయాలన్న ఆదేశం' 'ముస్తహబ్' మాత్రమే గాని 'వాజిబ్' కాదు.

'ముస్లిం' ఉల్లేఖనం ప్రకారం రూఢీ అయ్యేదేమిటంటే, ఆయన (స) అన్న పానీయాల నిమిత్తం, సంభోగం నిమిత్తం మర్మాంగాన్ని కడుక్కొని, వుజూ చేసేవారు. విద్వాంసులలో అధిక సంఖ్యాకులు ఈ వుజూను తప్పనిసరిగా భావించలేదు. అభిలషణీయంగా మాత్రమే తలపోశారు.

(١٠٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ. كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا اغْتَسَلَ مِنَ الْجَنَابَةِ يَبْدَأُ فَيَغْسِلُ يَدَهُ، ثُمَّ يُفْرِغُ بِيَمِينِهِ عَلَى شِمَالِهِ فَيَغْسِلُ فَرْجَهُ، ثُمَّ يَتَوَضَّأُ ثُمَّ يَأْخُذُ الْمَاءَ فَيُدْخِلُ أَصَابِعَهُ فِي أُصُولِ الشَّعْرِ، ثُمَّ حَفَنَ عَلَى رَأْسِهِ ثَلَاثَ حَفَنَاتٍ، ثُمَّ أَفَاضَ عَلَى سَائِرِ جَسَدِهِ، ثُمَّ غَسَلَ رِجْلَيْهِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

104. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లైంగిక అశుద్ధత నుండి పరిశుద్ధత పొందే నిమిత్తం స్నానానికి ఉపక్రమించినపుడు మొదట చేతులు కడుక్కునేవారు. తరువాత కుడిచేత్తో ఎడమచేతిపై నీరు పోసి తన మర్మ స్థానాన్ని కడిగేవారు. ఆ తరువాత వుజూ చేసేవారు. ఆపైన నీళ్లు తీసుకుని తన చేతివ్రేళ్లతో తలవెంట్రుకల వ్రేళ్ల భాగం సయితం తడిసేలా నీరు పోసేవారు. ఆపైన దోసిట్లో నీళ్లు తీసుకుని మూడుసార్లు తలపై నీరు పోసేవారు. ఆపైన శరీరమంతటిపై నీళ్లు పోసుకునేవారు. ఆఖరిలో కాళ్లు కడిగేవారు. (బుఖారీ, ముస్లిం. హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి).

وَلَهُمَا فِي حَدِيْثِ مَيْمُوْنَةَ: «ثُمَّ أَفْرَغَ عَلَى فَرْجِهِ وَغَسَلَهُ بِشِمَالِهِ، ثُمَّ ضَرَبَ بِهَا الأَرْضَ».

బుఖారీ, ముస్లింలలోనే హజ్రత్ మైమూన (ర.అన్హా) ఉల్లేఖనం ఇలా ఉంది: మరి తన మర్మ స్థానంపై నీరు పోసేవారు. తన ఎడమ చేత్తో దాన్ని కడిగేవారు. చేతులను నేలపై కొట్టి మట్టితో బాగా తోముకునేవారు (శుభ్ర పరచుకునేవారు).

وَفِيْ رِوَايَةٍ: «فَمَسَحَهَا بِالتُّرَابِ». وَفِي آخِرِهِ: «ثُمَّ أَتَيْتُهُ بِالْمِنْدِيْلِ فَرَدَّهُ»، وَفِيْهِ: «وجَعَلَ يَنْفُضُ الْمَاءَ بِيَدِهِ».

వేరొక ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: "మరి రెండు చేతులనూ మట్టితో తోమి, బాగా శుభ్రపరచుకునేవారు." ఈ ఉల్లేఖనం ఆఖరిలో ఇలా ఉంది: "నేను ఆయన (సఅసం)సేవలో తువాలు సమర్పించాను. కాని ఆయన (స) దానిని వాపసు చేశారు (శరీరంపై వున్న నీటి బిందువులను) చేత్తోనే తుడిచేశారు."

## సారాంశం

పై హదీసు వెలుగులో కొన్ని విషయాలను ఇక్కడ వివరించటం అవసరం. వివిధ హదీసులను కలిపిన తర్వాత బోధపడేదేమిటంటే గుసుల్‌కు (స్నానానికి) ముందు ఆయన (స) చేతులను కడిగేవారు. ఎన్నిసార్లు కడిగేవారో ప్రస్తావించబడలేదు. ఉమ్ముల్ మోమినీన్ మైమూన (ర.అన్హా) ఉల్లేఖనం ద్వారా రెండు లేక మూడుసార్లు కడిగేవారని తెలుస్తోంది. తరువాత ఆయన (స) తన మర్మస్థానం కడుక్కునేవారు. అటు తరువాత అరచేతులను నేలపై అదిమి, మట్టితో తోమి శుభ్రపరచుకునేవారు. ఆపైన నమాజ్ నిమిత్తం ఎలా గుసుల్ చేసేవారో సరిగ్గా అలాగే గుసుల్ (స్నానం) చేసేవారు. తలపై నీరు పోసుకునేటప్పుడు చేతి వ్రేళ్ళను జుత్తులోనికి జొప్పించి వెంట్రుకలు పూర్తిగా తడిసేలా జాగ్రత్త వహించేవారు. ఆ తర్వాత శరీరమంతటిపై నీరు ప్రవహింపజేసేవారు. ఆఖరిలో కాళ్లు కడుక్కునేవారు. మొదట ఒక ప్రక్కకు జరిగి, పిదప రెండు కాళ్లపై నీరు పోసుకునేవారని హజ్రత్ మైమూన (ర.అన్హా) కథనంలో ఉంది. ఈ గుసుల్‌లో భాగంగా చేసుకున్న వుజూతోనే ఆయన (స) ఉదయం పూట సున్నత్ - రెండు రకతులు, ఫర్జ్ రెండు రకతుల నమాజ్ చేసేవారు. అంటే గుసుల్ తరువాత, వేరుగా వుజూ చేసేవారు కాదు.

ఈ హదీసు ద్వారా విదితమయ్యే ఇంకొక విషయమేమిటంటే గుసుల్ మరియు వుజూ తరువాత ముఖానికి, శరీరానికి, చేతులకు అంటుకున్న నీరును తుడవడానికి రుమాలును ఉపయోగించటం తప్పనిసరి కాదు. అలాగే చేతులతో వుజూ నీటి బిందువులను తుడుచుకోవటం కూడా ఆక్షేపణీయం కాదు. చేత్తో నీటి బిందువులను తొలగించరాదన్న హదీసు బలహీనమైనది. ప్రామాణికమైన హదీసు ముందు బలహీనమైన హదీసుకు ఎలాంటి స్థానం లేదు.

(١٠٥) وعَنْ أُمِّ سَلَمَةَ رضي الله تعالى عنها قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! إِنِّي امْرَأَةٌ أَشُدُّ شَعَرَ رَأْسِي، أَفَأَنْقُضُهُ لِغُسْلِ الجَنَابَةِ؟ وَفِي رِوَايَةٍ: وَلِلْحَيْضَةِ؟ فَقَالَ: لَا، إِنَّمَا يَكْفِيكِ أَنْ تَحْثِي عَلَى رَأْسِكِ ثَلَاثَ حَثَيَاتٍ. رَوَاهُ مُسْلِمٌ.

105. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) తెలిపారు: "ఓ దైవప్రవక్తా (సఅసం)! నేను నా శిరోజాలను గట్టిగా ముడివేస్తాను. సంభోగానంతరం స్నానం చేసేటప్పుడు ముడి విప్పటం అవసరమా?" వేరొక ఉల్లేఖనంలో "రుతుస్రావం తరువాత స్నానం చేసేటప్పుడు" అని ఉంది. దీనికి ఆయన (సఅసం) "లేదు. (ముడి విప్పవలసిన అవసరం లేదు). నువ్వు నీ తలపై మూడు దోసిట్ల నీరు పోస్తే అదే చాలు" అని సమాధానమిచ్చారు. (ముస్లిం)

**సారాంశం**

లైంగిక అశుద్ధతకు లోనైన స్త్రీ లేక రుతుస్రావం అయిన స్త్రీ పరిశుద్ధతను పొందే సంకల్పంతో స్నానం చేసేటప్పుడు ముడి విప్పి శిరోజాలన్నింటినీ తడపవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా అవగతమవుతుంది. అయితే ఆయన (స); శిరోజాలను విప్పవలసిందిగా ఆజ్ఞాపించినట్లు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనంలో ఉంది. అయితే ఈ రెండు ఉల్లేఖనాలూ పరస్పర విరుద్ధమైనవి కూడా కావు. ఎందుకంటే శిరోజాలను విప్పాలన్న ఆజ్ఞ కేవలం 'అభిలషణీయం' అన్న ఉద్దేశ్యంతోనే ఇవ్వబడింది. అంతేగాని సంభోగానంతరం మరియు రుతుస్రావం ఆగిన తరువాత స్నానం చేసే సమయంలో స్త్రీలు ముడిని తప్పనిసరిగా విప్పాల్సిందేనన్న నిబంధన ఏదీ లేదు. తల వెంట్రుకలు మొలిచే మొదళ్లలోకి నీరు ప్రవేశించి, తల చర్మం పూర్తిగా తడిస్తే చాలు.

స్త్రీలు సంభోగం తరువాత, రుతుస్రావం తరువాత స్నానం చేసేటప్పుడు శిరోజాలన్నింటినీ విప్పి మరీ తడపవలసిందిగా హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆజ్ఞాపిస్తున్నారని ఎవరో చెప్పగా విని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఆశ్చర్య చకితులయ్యారు. ఆ సందర్భంగా ఆమె ఇలా స్పందించారు: "శిరోజాలు విప్పమని అబ్దుల్లాహ్ (రజి) స్త్రీలకు ఎలా ఆదేశిస్తున్నారో అర్థం కావటం లేదు. ఇంకా నయం, గుండు చేయించుకోమని చెప్పారు కాదు. నేను మరియు దైవప్రవక్త (స) ఒకే గంగాళం నుంచి నీరు తీసుకుని స్నానం చేసేవాళ్లము. నేను కేవలం మూడుసార్లు తలపై నీరు పోసుకునే దానిని. ముడివిప్పవలసిన అగత్యమే ఏర్పడేది కాదు." (ముస్లిం, ముస్నద్ అహ్మద్)

(١٠٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «إِنِّي لَا

106. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నేను రుతుస్రావానికి గురైవున్న

أُحِلُّ الْمَسْجِدَ لِحَائِضٍ وَلاَ جُنُبٍ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

స్త్రీని, లైంగిక అశుద్ధతకు లోనై వున్న పురుషుడినీ మస్జిద్‌లోకి ప్రవేశించడానికి సమ్మతించను.'' (అంటే అశుద్ధావస్థలో వారిరువురూ మస్జిద్‌లోకి వెళ్ళ లేరు). (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

రుతుస్రావానికి గురై వున్న స్త్రీగానీ, లైంగిక అశుద్ధతకు లోనైవున్న పురుషుడు గానీ మస్జిద్‌లో ఆగటంగానీ, మస్జిద్‌లోకి ప్రవేశించటంగానీ ధర్మసమ్మతం కాదని ఈ హదీసు స్పష్టపరుస్తోంది. అయితే వారిరువురూ సాగిపోవటానికి మస్జిద్ మినహా మరొక మార్గాంతరం లేనపుడు - ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయీల దృష్టిలో - సాగిపోవటం సమ్మతమే. కాని ఇమామ్ అబూ హనీఫా దృష్టిలో ఎట్టి పరిస్థితిలోనూ మస్జిద్ గుండా పోవటం సమ్మతం కాదు. ఈ హదీసు కూడా ఇమామ్ అబూ హనీఫా గారి అభిప్రాయాన్నే బలపరుస్తోంది.

నడచిపోవటం ధరమ్మసమ్మతమే అని భావించేవారు దివ్య ఖుర్‌ఆన్‌లోని వచనాన్ని ఉదాహరిస్తున్నారు. ఆ వచనంలో ఇలా ఉంది: ''లైంగిక అశుద్ధతకు లోనైవున్న వాడు మస్జిద్‌లోకి వెళ్ళరాదు. ఒకవేళ మస్జిద్‌లోనుంచి వెళ్ళటం అనివార్యమైతే - గత్యంతరం లేని స్థితిలో వెళ్ళవచ్చు.''

సదరు హదీసు కూడా మస్జిదులో ఆగరాదనే అంటున్నదిగానీ నడచివెళ్ళరాదని అనటంలేదు. ఏ మనిషైనా మస్జిద్‌లో నిద్రపోయిన తరువాత అతను (స్వప్న స్ఖలనంవల్ల) లైంగిక అశుద్ధతకు లోనైతే తక్షణం మస్జిద్ నుంచి వెడలిపోవాలి.

(١٠٧) وَعَنْهَا رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أَغْتَسِلُ أَنَا وَرَسُولُ اللهِ ﷺ مِنْ إِنَاءٍ وَاحِدٍ، تَخْتَلِفُ أَيْدِينَا فِيهِ، مِنَ الْجَنَابَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ ابْنُ حِبَّانَ: «وَتَلْتَقِي».

107. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి చేతనే ఇలా ఉల్లేఖించబడింది: ''నేను మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇద్దరం ఒకే బానలోనుంచి (నీరు తీసుకుని) లైంగిక అశుద్ధతను దూరంచేసే స్నానం చేసేవాళ్లం. ఆ బానలో మా చేతులు ఒకరి తరువాత ఒకరివి పడేవి. ఒక్కోసారి ఒకరి చేయి మరొకరి చేతికి తగిలేది.''

**సారాంశం**

భార్యాభర్తలిరువురూ ఏక కాలంలో ఒకే పాత్ర నుంచి నీళ్లు ముంచుకుని స్నానం చేయటంలో తప్పులేదని పై హదీసు ద్వారా విదితమవుతున్నది.

(١٠٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**إِنَّ تَحْتَ كُلِّ شَعَرَةٍ جَنَابَةً، فَاغْسِلُوا الشَّعَرَ، وَأَنْقُوا الْبَشَرَ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَضَعَّفَاهُ، وِلأَحْمَدَ عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا نَحْوُه، وَفِيهِ رَاوٍ مَجْهُولٌ.

108. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ప్రతి వెంట్రుక అడుగున (మొదలులో) లైంగిక అశుద్ధతా ప్రభావం ఉంటుంది. కనుక వెంట్రుకలను (బాగా) తడిపి కడగండి. శరీరాన్ని బాగా (తోమి) శుభ్రపరచండి." (అబూ దావూద్, తిర్మిజీ లిరువురూ దీనిని ఉల్లేఖించారు. దాంతోపాటు దీనిని 'బలహీనమైనది'గా కూడా నిర్ధారించారు. ముస్నద్ అహ్మద్‌లో కూడా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ద్వారా ఇదే విధంగా ఉల్లేఖించబడింది. ఈ పరంపరలో ఒక ఉల్లేఖకుడు అపరిచితుడు).

**సారాంశం**

సంభోగించిన మీదట స్నానం చేసినపుడు శరీరంలో వెంట్రుకవాసి భాగం కూడా పొడిగా ఉండకుండా - పూర్తిగా తడపాలని, శరీరాన్ని బాగా తోమి శుభ్రం చేయాలని పై హదీసు వెల్లడిస్తోంది. అయితే పుక్కిలించే, ముక్కులోనికి నీరు ఎక్కించే విషయమై ఫుకహాల (ధర్మవేత్తల) మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. హనఫీ ఫికహ్ ననుసరించి ఇది కూడా ఫర్జ్ (విధి)గా పరిగణించబడుతుంది. ఇమామ్ అహ్మద్ అభిమతం కూడా ఇదే. ఇమామ్ షాఫయి దృష్టిలో మాత్రం ఇది మస్నూన్ (సంప్రదాయం).

మొత్తానికి హదీసు వెలుగులో బోధపడే మౌలికాంశం ఏమిటంటే లైంగిక అశుద్ధతను తొలగించే స్నానం చేసినపుడు శరీరమంతటినీ పూర్తిగా తడిపిమరీ శుభ్రపరచాలి.

**9వ అధ్యాయం**

## ٩ - بَابُ التَّيَمُّمِ

## తయమ్ముమ్

(١٠٩) عَنْ جَابِرِ بْنِ عَبْدِ اللّٰهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**أُعْطِيتُ خَمْسًا لَمْ يُعْطَهُنَّ أَحَدٌ قَبْلِي، نُصِرْتُ بِالرُّعْبِ مَسِيرَةَ شَهْرٍ، وَجُعِلَتْ لِيَ الأَرْضُ**

109. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు: "నాకు పూర్వం ఎవరికీ ఇవ్వబడని ఐదు వస్తువులు నాకు ప్రసాదించబడ్డాయి - నాకు ఒక

مَسْجِداً وَطَهُوراً، فَأَيُّمَا رَجُلٍ أَدْرَكَتْهُ الصَّلاَةُ فَلْيُصَلِّ». وذَكَرَ الحَدِيثَ.

మాసపు ప్రయాణ దూరంతోనే (శత్రువును) హడలించే శక్తి ఇవ్వబడింది. సమస్త భూమండలం నా కొరకు సజ్దా స్థలంగా, శుచీశుభ్రతల సాధనంగా చేయబడింది. ఇక ఎవరికి (ఎక్కడ) నమాజ్ సమయం ఆసన్నమయినా అతడు (అక్కడే) నమాజ్ చేసుకోవాలి." ముందు మొత్తం హదీసు ప్రస్తావించబడుతుంది.

وَفِي حَدِيثِ حُذَيْفَةَ عِنْدَ مُسْلِمٍ: «وَجُعِلَتْ تُرْبَتُهَا لَنَا طَهُوراً إِذَا لَمْ نَجِدِ الْمَاءَ».

ముస్లింలో హజ్రత్ హుజైఫా (రజి) ద్వారా ఇలా ఉల్లేఖించబడింది - "మనకు నీరు లభ్యం కానపుడు నేలలోని మట్టి మన కొరకు పరిశుభ్రతా ప్రాప్తికై పవిత్రం గావించబడింది."

وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ عَنْهُ، عِنْدَ أَحْمَدَ: «وَجُعِلَ التُّرَابُ لِي طَهُوراً».

ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ అలీ (రజి) చే ఇలా తెలుపబడింది-"మట్టి నా కొరకు పరిశుభ్రత నొసగే సాధనంగా చేయబడింది."

## సారాంశం

ఈ హదీసులో నుంచి రచయిత దైవప్రవక్త (స)కు ప్రసాదించబడిన రెండు విశిష్ఠ వరాలను మాత్రమే ప్రస్తావించారు. మిగిలిన మూడు అనుగ్రహాలలో ఒకటి విజయప్రాప్తి; అంటే యుద్ధ సమయాలలో శత్రువుల నుండి ముస్లిం సేనలకు స్వాధీనమైన ధనాన్ని సమస్త ముస్లిం సమాజం కొరకు దేవుడు ధర్మసమ్మతం చేశాడు. అలాగే ప్రళయదినాన మానవాళికి క్షమాభిక్షపెట్టమని దైవ సమక్షంలో సిఫారసు చేసే అవకాశం కూడా మహాప్రవక్తకే ఇవ్వబడుతుంది. ఇంకా దేవుడు ఆయన్ని (స) భూమండలంలోని సమస్త మానవుల కోసం, జిన్నుల కోసం ప్రవక్తగా నియుక్తం చేశాడు. రచయిత ఈ చివరి మూడు విశిష్ఠ అనుగ్రహాలను మినహాయించి తహారత్, నమాజ్‌లకు సంబంధించిన రెండు విశిష్ఠ వరాలనే ప్రస్తావించారు.

నీరు లభ్యం కాని పరిస్థితిలో తయమ్ముమ్ చేసుకునే సౌలభ్యం కల్పించి ఇస్లామీయ షరీయత్ ముస్లిం సమాజంపై ఎంతగానో దయదలిచింది, నేలలోని ఏ భాగంతోనయినా తయమ్ముమ్ చేసుకోవచ్చు. నేలలో నుంచి లభించే ఖనిజాలతో కూడా తయమ్ముమ్ చేయవచ్చు. అయితే వాటిపై దుమ్ము ధూళి పేరుకుని ఉండటం అవసరం.

(١١٠) وَعَنْ عَمَّارِ بْنِ يَاسِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: بَعَثَنِي النَّبِيُّ ﷺ فِي حَاجَةٍ، فَأَجْنَبْتُ، فَلَمْ أَجِدِ الْمَاءَ، فَتَمَرَّغْتُ فِي الصَّعِيدِ، كَمَا تَمَرَّغُ الدَّابَّةُ، ثُمَّ أَتَيْتُ النَّبِيَّ ﷺ، فَذَكَرْتُ لَهُ ذَلِكَ، فَقَالَ: **إِنَّمَا كَانَ يَكْفِيكَ أَنْ تَقُولَ بِيَدَيْكَ هَكَذَا،** ثُمَّ ضَرَبَ بِيَدَيْهِ الأَرْضَ ضَرْبَةً وَاحِدَةً، ثُمَّ مَسَحَ الشِّمَالَ عَلَى الْيَمِينِ وظَاهِرَ كَفَّيْهِ وَوَجْهَهُ. متفق عليه وَاللَّفْظُ لِمُسْلِمٍ.

110. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను ఒక అవసరార్థం పంపించారు: నేను (వీర్య స్ఖలనం వల్ల) అశుద్ధతకు లోనయ్యాను. నాకు నీరు లభించలేదు. అందుచేత నేను క్రిందపడి మట్టిలో ఒక చతుష్పాదం (జంతువు) వలే దొర్లాను. (అవసరం నెరవేరిన) తరువాత నేను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి జరిగినదంతా వివరించాను. "నీవు చేత్తో ఈవిధంగా చేయాల్సింది" అని ఆయన (స) చెప్పారు. తరువాత ఆయన (స) తన రెండు అర చేతులనూ ఒకసారి నేలపై కొట్టారు. ఎడమ చేతిని కుడి చేతిపై రుద్దారు. ఆ తర్వాత చేతుల ఉపరితలాన్ని, ముఖాన్ని తుడుచు కున్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి).

وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ «وَضَرَبَ بِكَفَّيْهِ الأَرْضَ، وَنَفَخَ فِيهِمَا، ثُمَّ مَسَحَ بِهِمَا وَجْهَهُ وَكَفَّيْهِ».

బుఖారీ ఉల్లేఖనంలోని చివరి వాక్యం ఇలా ఉంది: "తన రెండు అరచేతుల్ని నేలపై కొట్టిన పిదప నోటితో ఊది దుమ్ము ధూళిని దూరం చేశారు. తరువాత వాటిని ముఖంపై, చేతులపై రుద్దుకున్నారు."

### సారాంశం

చేతుల్ని ఒకేసారి (పరిశుభ్రమైన) నేలపై కొడితే సరిపోతుందని హదీసుద్వారా స్పష్టంగా రూఢీ అవుతోంది. 'తయమ్ముమ్'లో ఉన్న సౌలభ్యాలలో ఇదీ ఒకటన్నది గమనార్హం. ఒకసారి చేతికి అంటిన ధూళి ముఖం మరియు చేతుల్ని రుద్దుకోవటానికి సరిపోతుంది. ఈ అధ్యాయంలో వచ్చిన హదీసులలో అత్యంత ప్రామాణికమైనది ఇదే. అత్యధికమంది హదీసువేత్తల, ధర్మవేత్తల విధానం కూడా ఇదే. కాగా, చేతుల్ని రెండుసార్లు నేలకు కొట్టాలన్న ఉల్లేఖనం బలహీనమైనది. హనఫీ మరియు షాఫయీ విధానాన్ని అనుసరించేవారు చేతుల్ని రెండుసార్లు నేలకు (ఒకసారి

ముఖం కోసం, మరోసారి చేతుల్ని రుద్దడం కోసం) కొట్టాలని భావిస్తున్నారు. పై హదీసులోని (బుఖారీలో పొందుపరచబడిన) చివరి వాక్యం దీనికి బలం చేకూరుస్తుంది.

ఇక అమ్మార్ బిన్ యాసిర్ గారి ఇజ్తెహాద్ (అన్వయింపు)ను చూద్దాం. నీరు లభ్యం కాకపోవటం వల్ల ఆయన (రజి) తన బుద్ధీ వివేకాలకు పదునుపెట్టి నేలపై దొర్లటం మొదలుపెట్టారు. స్నానం చేసేటప్పుడు నీళ్లతో శరీరమంతా తడుపుతారు గనక, తయమ్ముమ్ దీనికి ప్రత్యామ్నాయం గనక, శరీరమంతటికీ మట్టి తగలటం తప్పనిసరి కాబోలు! అని ఆయన బుద్ధి ఆయనకు మార్గం చూపింది. తదనుగుణంగా ఆయన అలా ఆచరించారు. విషయ పరిజ్ఞానం లేకపోవటం మూలంగా ఆయన అంచనాలపై ఆధారపడ్డారు. అసలు విషయం ముందుకు వచ్చిన మీదట అంచనాలకు ఏపాటి ప్రాముఖ్యమూ ఉండబోదు. కనుక అంచనాలకు, అన్వయింపులకు స్వస్తి పలికి 'అసలు'ను గట్టిగా పట్టుకోవాలి.

దైవప్రవక్త (సఅసం) గారి ఆచరణ వల్ల విదితమయ్యే మరో ముఖ్యాంశం ఏమిటంటే; చేతుల్ని నేలపై కొట్టిన పిదప నోటితో ఊదటం 'మస్నూన్'. నీరు లభ్యం కాని పక్షంలో అశుద్ధతకు లోనైన వ్యక్తి ఈ మాత్రం ప్రయాసపడితే చాలు - అతడు పరిశుద్ధుడైపోతాడు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందజేసిన అమ్మార్ బిన్ యాసిర్ (రజి) తొల్దొలి ప్రవక్త ప్రియ సహచరులలో ఒకరు. ఇస్లాం స్వీకరించిన కారణంగా మక్కాలో ముష్రిక్కులు ఈయన్ని చిత్రహింసలు పెట్టారు. అయినా ఈయనగారి నిలకడ చెక్కుచెదరలేదు. దైవమార్గంలో రెండు హిజ్రత్‌లు (ఒక హిజ్రత్ అబిసీనియా వైపునకు, మరో హిజ్రత్ మదీనా వైపునకు) చేశారు. బద్ర్ యుద్ధంతో సహా ముఖ్య సంగ్రామాలన్నింటిలోనూ పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన గురించి ఇలా చెప్పారు: ''అమ్మార్! విచారకరమయిన విషయం ఏమిటంటే తిరుగుబాటు వర్గం ఒకటి నిన్ను హతమారుస్తుంది.'' హిజ్రీ 36లో సిఫ్ఫీన్ యుద్ధ సందర్భంగా హజ్రత్ ముఆవియ (రజి) మరియు హజ్రత్ అలీ (రజి)ల సైనిక దళాలలోని ఒక తిరుగుబాటు వర్గం ఈయన్ని దారుణంగా హత్య చేసింది. అప్పటికి ఆయన వయస్సు 73 సంవత్సరాలు.

111. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ''తయమ్ముమ్ రెండు సార్లు (నేలకు) కొట్టడం వల్ల పూర్తవుతుంది. ఒక దెబ్బ ముఖం (రుద్దడం) కోసం, మరో దెబ్బ మోచేతుల సమేతంగా రెండు చేతుల (ను రుద్దడం) కోసం.'' (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. ఇతర ఇమాములు ఇది 'మౌఖూఫ్' కావడాన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు).

(١١١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «التَّيَمُّمُ ضَرْبَتَانِ، ضَرْبَةٌ لِلْوَجْهِ، وَضَرْبَةٌ لِلْيَدَيْنِ إِلَى الْمِرْفَقَيْنِ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَ الْأَئِمَّةُ وَقْفَهُ.

**సారాంశం**

ఈ హదీసును అందజేసిన పరంపరలో లోపం ఏర్పడిన కారణంగా హదీసువేత్తలు దీనిని బలహీనమైన హదీసుగా నిర్ధారించారు.

(١١٢) وَعَنْ أَبِيْ هُرَيرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الصَّعِيدُ وَضُوءُ الْمُؤمِنِ الْمُسْلِمِ، وَإِنْ لَمْ يَجِدِ المَاءَ عَشْرَ سِنِينَ، فَإِذَا وَجَدَ المَاءَ فَلْيَتَّقِ اللّٰهَ، وَلْيُمِسَّهُ بَشَرَتَهُ**». رَوَاهُ البَزَّارُ، وَصَحَّحَهُ ابنُ القَطَّانِ، وَلٰكِن صَوَّبَ الدَّارَقُطْنِيُّ إِرسَالَهُ، وَلِلتِّرمِذِيِّ عَنْ أَبِي ذَرٍّ نَحْوُه، وَصَحَّحَهُ وَالْحاكِمُ أَيْضاً.

112. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హ్రజత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మన్ను విశ్వాసి అయిన ముస్లిం పాలిట 'వుజూ' లాంటిది - పదేళ్ళ వరకూ నీరు లభ్యం కాకపోయినాసరే! అయితే నీరు లభ్యమవగానే దైవానికి భయపడాలి. అప్పుడు అతను తన శరీరంపై నీరు పోసుకోవాలి." (దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. ఇబ్నుల్ ఖత్తాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అయితే దారె ఖుత్నీ దీనిని 'ముర్సల్' గా నిర్ధారించారు. తిర్మిజీలో హ్రజత్ అబూజర్ (రజి) చేత కూడా ఇలాగే ఉల్లేఖించబడింది - దీనిని తిర్మిజీ ప్రామాణికమైనదని ధృవీకరించారు. హాకిమ్ సయితం దీనిని 'ప్రామాణికం' అని అన్నారు.

**సారాంశం**

ఈ హదీసులో 'తయమ్ముమ్' వుజూగా ఖరారు చేయబడింది. అంటే 'తయమ్ముమ్' 'వుజూ'కు ప్రత్యామ్నాయం అన్నమాట! ఇది నీరుకు ప్రత్యామ్నాయం అయినపుడు ఆ రెంటికి సంబంధించిన ఆజ్ఞలు కూడా ఒకేవిధంగా ఉంటాయి, ఉండాలి కూడా. అంటే ఒక వుజూతో మనిషి ఎన్ని నమాజులు చేయగలుగుతాడో అన్ని నమాజులు తయమ్ముమ్‌తో కూడా చేయగలడు. అయితే కొంతమంది - ఈ హదీసు ఆధారంగా - తయమ్ముమ్ ద్వారా అశుద్ధత దూరం కాజాలదని అభిప్రాయపడ్డారు. తయమ్ముమ్ ద్వారా తాత్కాలికంగా నమాజ్ చేసేందుకు మార్గం మాత్రం సుగమమవుతుందని వీరంటారు. నమాజ్ ముగియగానే తయమ్ముమ్‌కు పూర్వం వున్న స్థితికే అతను లోనవుతాడని ఈ వర్గం వాదిస్తోంది.

హనఫీ మస్లక్‌ను పాటించేవారు మాత్రం మొదటి పద్ధతికే కట్టుబడి ఉన్నారు - అంటే ఒకసారి చేసిన తయమ్ముమ్‌తో (అది భంగం కాకుండా ఉన్నంతవరకూ) ఎన్ని విధులైనా నిర్వర్తించవచ్చునని హనఫీలు భావిస్తున్నారు. సయీద్ బిన్ ముసైబ్, హసన్ బస్రీ, జహ్రీ, సుఫియాన్ సౌరీల అభిప్రాయం కూడా ఇదే.

అయితే ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్‌ల అభిప్రాయం మరో విధంగా ఉంది. వారి దృష్టిలో తయమ్ముమ్ ద్వారా పూర్తిస్థాయి శుచీ, శుభ్రత ప్రాప్తం కాదు. అది గత్యంతరం లేని స్థితిలో - అవసరం తీరడానికి - అనుసరించే ఒక తాత్కాలిక పద్ధతి మాత్రమేననీ, ఏ విధిని నెరవేర్చే సంకల్పంతో తయమ్ముమ్ చేసుకోవటం జరిగిందో అదొక్కటే దానివల్ల నెరవేరుతుందని ఈ ప్రముఖులు తలపోస్తున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులలో ఒకరైన అబూజర్ (రజి) అసలు పేరు జున్దుబ్ బిన్ జునాదా. దైవభక్తి పరాయణులు, సాత్వికులు. భవబంధాల పట్ల ఆసక్తి లేనివారు. మక్కాలోనే ఇస్లాం స్వీకరించారు. తరువాత తన జాతి వారి వైపునకు వెళ్ళిపోయారు. మదీనాలో తిరిగి దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యారు. 'రబ్జా' అనే చోట స్థిర నివాసమేర్పరచుకున్నారు. హిజ్రీ 32లో కన్నుమూశారు. సదాచార సంపన్నులు. దేవునిపై అచంచలమైన భక్తి విశ్వాసం కలవారు.

(١١٣) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدرِيِّ رَضِيَ اللّٰهُ تَعالَى عَنْهُ، قَالَ: خَرَجَ رَجُلاَن فِي سَفَرٍ، فَحضَرَتِ الصَّلاَةُ، وَلَيْسَ مَعَهُمَا مَاءٌ، فَتَيَمَّمَا صَعِيْداً طَيِّباً، فَصَلَّيَا، ثُمَّ وَجَدَا الْمَاءَ فِي الْوَقْتِ، فَأَعَادَ أَحَدُهُمَا الصَّلاَةَ، وَالوُضُوءَ، وَلَمْ يُعِدِ الأخرُ، ثُمَّ أَتَيَا رَسُولَ اللّٰهِ ﷺ، فَذَكَرا ذَلِكَ لَهُ، فَقَالَ لِلَّذِي لَمْ يُعِدْ: «أَصَبْتَ السُّنَّةَ، وَأَجْزَأَتْكَ صَلاَتُكَ»، وَقَالَ لِلآخَرِ: «لَكَ الأَجْرُ مَرَّتَيْنِ». رَوَاه أَبُو دَاوُدَ وَالنَّسائِيُّ.

113. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలిపారు: ఇద్దరు వ్యక్తులు ప్రయాణానికి బయలుదేరారు. నమాజ్ వేళ అయింది. కాని వారి వద్ద నీరు లేదు. ఇద్దరూ పరిశుభ్రమయిన మట్టితో 'తయమ్ముమ్' చేసి నమాజ్ చేశారు. నమాజ్ వేళ ముగియక ముందే నీరు కూడా వారికి లభ్యమయింది. వారిలో ఒక వ్యక్తి వుజూచేసి నమాజ్ చేయగా రెండవ వ్యక్తి తిరిగి వుజూ చేయటంగానీ, నమాజ్ చేయటం గానీ చేయలేదు. ప్రయాణం నుంచి తిరిగి వచ్చిన మీదట ఇరువురూ దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగిన సంఘటనను వివరించారు. ఆయన రెండవసారి నమాజ్ చేయని వ్యక్తి నుద్దేశ్యించి, "నీవు సున్నత్‌ను అనుసరించావు. నీవు చేసిన (మొదటి) నమాజ్ నీకు సరిపోతుంది"అని అన్నారు. రెండవ సారి నమాజ్‌చేసిన వ్యక్తిని ఉద్దేశ్యించి, "నీకు రెట్టింపు పుణ్యం లభిస్తుంది" అని అన్నారు. (అబూదావూద్, నసాయి)

**సారాంశం**

ఒకసారి తయమ్ముమ్ చేసి నమాజ్ చేసిన మీదట నీరు లభ్యమయితే వుజూ చేసి తిరిగి నమాజ్ చేయవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. నలుగురు ధర్మవేత్తల అభిమతం కూడా ఇదే.

మలిసారి నమాజ్ చేసిన వ్యక్తికి రెట్టింపు పుణ్యఫలం లభించడానికి కారణం ఏమై ఉంటుంది? అంటే అతనికి ఒక పుణ్యం నమాజ్ చేసినందుకు లభించగా, మరో పుణ్యం ఇజ్తెహాద్ చేసినందుకు (ధర్మావలంబనలో విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించినందుకు) లభించింది. అతని ఇజ్తెహాద్ సరైంది కాకపోయినప్పటికీ, అతను చేసిన కృషికిగాను రెట్టింపు పుణ్యం ఇవ్వబడిందన్నమాట!

114. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "వ ఇన్ కున్తుమ్ మరజన్ అవ్ అలా సఫరిన్" అనే దైవసూక్తి గురించి ఈయన్ని దర్యాప్తుచేయగా ఈయన ఇలా సమాధానమిచ్చారు - ఎవడి కయినా దైవ మార్గంలో గాయమైతే, దెబ్బతగిలితే, అదే స్థితిలో అతను లైంగిక అశుద్ధతకు కూడా లోనవుతే, అట్టి స్థితిలో స్నానం చేయటంవల్ల చనిపోయే ప్రమాదం ఉందనిపిస్తే అతడు 'తయమ్ముమ్' చేసుకోవాలి. (ఈ ఉల్లేఖనాన్ని దారె ఖుత్నీ 'మౌఖూఫ్'గా, బజ్జార్ 'మర్ఫూ' గాను, హాకిమ్ 'సహీహ్'గానూ ఖరారు చేశారు).

(١١٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، فِي قَوْلِهِ عَزَّ وَجَلَّ: ﴿وَإِنْ كُنْتُمْ مَرْضَى أَوْ عَلَى سَفَرٍ﴾ قَالَ: إِذَا كَانَتْ بِالرَّجُلِ الجِرَاحَةُ فِي سَبِيلِ اللهِ وَالْقُرُوحُ، فَيُجْنِبُ، فَيَخَافُ أَن يَموتَ إِنِ اغْتَسَلَ، تَيَمَّمَ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ مَوْقُوفاً وَرَفَعَهُ البَزَّارُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَالْحَاكِمُ.

**సారాంశం**

"ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే, లేక ప్రయాణంలో ఉంటే, మరి మీకు నీరు లభ్యం కాకపోతే తయమ్ముమ్ చేసుకోండి."

దీని భావం ఏమిటంటే మీరు నమాజ్ చేయదలచినపుడు నీటితో వుజూ చేయటం వల్లనూ, స్నానం చేయటం వల్లనూ ఏదైనా హాని కలుగుతుందని భయముంటే తయమ్ముమ్ చేసి నమాజ్ చేయాలి. ఈ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన వ్యాధి తేలికపాటి వ్యాధికాదు. తేలికపాటి గాయం, కురుపు, చెమటకాయలు, దురద, ఎలర్జీ వంటివి ఈ కోవలోకి రావు.

అయితే వ్యాధి తీవ్రతకు సంబంధించి - అంటే ఏ స్థాయికి చెందిన వ్యాధిగ్రస్తత వుంటే తయమ్ముమ్ చేయవచ్చు? అనే విషయమై ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. నీళ్లతో వుజూ చేయటం వల్ల ప్రాణం పోతుందనే భయమున్నప్పుడు, వుజూ పరిధిలోకి వచ్చే శరీరావయవాలు పనికిరాకుండా పోయే ప్రమాదముందను కున్నప్పుడు మాత్రమే 'తయమ్ముమ్'

చేయటం సమంజసమని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయంలో; వ్యాధి ముదిరి దీర్ఘకాలిక వ్యాధిగా మారే భయముంటే చాలు - తయమ్ముమ్ ధర్మ సమ్మతమైపోతుంది.

హదీసులో ప్రస్తావించబడిన ఖుర్ఆన్ వాక్యంలో 'ప్రయాణావస్థలో వున్నప్పుడు తయమ్ముమ్ చేసుకోవచ్చ'ని ఉంది. ఇది నమాజ్‌ను ఖసర్ చేసుకునే, ఉపవాసాన్ని వాయిదా వేసుకునే ప్రయాణం కానేకాదు. నీరు లభ్యం కాని ప్రయాణం అని దీని భావం. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)ల అభిమతం కూడా ఇదే.

(١١٥) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعالَى عَنْهُ قَالَ: انْكَسَرَتْ إِحْدَى زَنْدَيَّ، فَسَأَلْتُ رَسولَ اللهِ ﷺ فَأَمَرَنِي أَنْ أَمْسَحَ عَلَى الْجَبَائِرِ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِسَنَدٍ وَاهٍ جِدًّا.

115. హజ్రత్ అలీ (రజి) కథనం: నా 'కట్టు' తెగిపోయింది. అప్పుడు నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను వుజూ గురించి ప్రశ్నించగా "పట్టీలపై మసహ్ చేసుకో" అని ఆయన (స) సమాధానమిచ్చారు.'' (ఇబ్నె మాజా దీనిని అత్యంత బలహీనమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

'కట్టు' అంటే చేయి లేక కాలి ఎముక చిట్లినపుడు, ఎముకను జోడించడానికి బద్దలతో వేసే కట్టు అని భావం. ఎముక అతికే దాకా ఆ బద్దలు ఊతగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితిలో నిర్ణీతభాగాన్ని (కట్లు కట్టిన భాగాన్ని) మసహ్ చేస్తే సరిపోతుంది - నీటితో తడపనవసరం లేదు.

(١١٦) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعالَى عَنْهُ، فِي الرَّجُلِ الَّذِي شُجَّ فَاغْتَسَلَ فَمَاتَ: إِنَّمَا كَانَ يَكْفِيهِ أَن يَّتَيَمَّمَ وَيَعْصِبَ عَلَى جُرْحِهِ خِرْقَةً ثُمَّ يَمْسَحَ عَلَيْهَا، وَيَغْسِلَ سَائِرَ جَسَدِهِ. رَوَاهُ أَبُو دَاوُدَ بِسَنَدٍ فِيهِ ضَعْفٌ، وَفِيهِ اخْتِلَافٌ عَلَى رَاوِيهِ.

116. తలకు గాయమైవున్న స్థితిలోనే స్నానం చేసి మరణించిన వ్యక్తి గురించి హజ్రత్ జాబిర్ (రజి) ఇలా వివరించారు: (అతని గురించి దైవప్రవక్త - సల్లల్లాహు అలైహి వ సల్లం - వ్యాఖ్యానించారు) "అతడు తయమ్ముమ్ చేసుకుంటే సరిపోయేది. తన గాయంపై కట్టుకట్టి మసహ్ చేసుకుంటే, మిగిలిన శరీరాన్ని కడుక్కుంటే (ఈ స్థితి ఏర్పడేది కాదు కదా)". (ఈ ఉల్లేఖనాన్ని బలహీన ఆధారాలతో అబూదావూద్ ఉల్లేఖించారు. హదీసును అందజేసిన పరంపర గురించి కూడా అభిప్రాయభేదం ఉంది).

**సారాంశం**

అబూదావూద్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఆధారంగా వృత్తాంతాన్ని వివరించారు. జాబిర్ (రజి) కథనం ఇలా వుంది: మేము ఒక ప్రయాణానికి బయలుదేరాము. మాలో ఒక వ్యక్తి తలకు రాయి తగిలింది. అతను తీవ్రంగా గాయపడ్డాడు. అదే స్థితిలో అతనికి స్వప్న స్ఖలనం కూడా అయింది. 'నేను తయమ్ముమ్ చేసుకోగలనా?' అని ఆ వ్యక్తి అందరినీ అడిగాడు. నీరు ఉపయోగించగల శక్తి నీలో ఉంటే తయమ్ముమ్ చేసుకోవడమెందుకు? అని అందరూ సలహా ఇచ్చారు. సహచరుల సలహా మేరకు అతడు స్నానం చేశాడు, తరువాత చనిపోయాడు.

ప్రయాణం నుండి తిరిగి వచ్చిన మీదట మేమంతా దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వెళ్ళి ఆ వ్యక్తి మరణ వృత్తాంతం వివరించాము. దీనిపై దైవప్రవక్త (స) స్పందిస్తూ, "వీళ్లంతా కలసి అతన్ని చంపేశారు. దేవుని దెబ్బ వీళ్లపై పడుగాక! విషయం వీరికి అర్థం కానపుడు దర్యాప్తు చేయవచ్చుకదా! తెలియనపుడు, విషయ పరిజ్ఞానం లేనపుడు దాని గురించి తెలుసుకోవాలి కదా!" అన్నారు. తరువాత ఆయన (స) అతడు 'ఇలా చేస్తే పోయేది' అంటూ హదీసులోని వాక్యం పలికారు.

అంటే గాయమైనచోట కట్టుకట్టే ముందు తయమ్ముమ్ చేస్తే అశుద్ధతా ప్రభావం దూరమై పోతుంది. కాళ్లు కడిగిన తరువాత మేజోళ్లు తొడిగి వాటిపై ఎలా మసహ్ చేసుకోవటం జరుగుతుందో ఇదీ అంతే.

(١١٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مِنَ السُّنَّةِ أَنْ لَا يُصَلِّيَ الرَّجُلُ بِالتَّيَمُّمِ إِلَّا صَلَاةً وَاحِدَةً، ثُمَّ يَتَيَمَّمُ لِلصَّلَاةِ الْأُخْرَى. رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ جِدًّا.

117. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "తయమ్ముమ్ చేసే వ్యక్తి తయమ్ముమ్‌తో ఒకే నమాజ్ చేయాలి. మరో నమాజ్ కోసం సరికొత్తగా తయమ్ముమ్ చేసుకోవాలి. ప్రవక్త సంప్రదాయం (సున్నత్) ఇదే." (దీనిని దారె ఖుత్నీ అత్యంత బలహీనమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

ఈ హదీసు బలహీనమైనది. ఎందుకంటే అందజేసిన వారిలో ఒకరైన హసన్ బిన్ అమ్మార్ బలహీనులు. అందుచేత హదీసువేత్తలు దీనిని 'జయీఫ్' హదీసుగా నిర్ధారించారు. తయమ్ముమ్ వుజూకు ప్రత్యామ్నాయం అని లోగడ చెప్పబడిన హదీసుకు ఇది విరుద్ధంగా ఉంది.

## ١٠ – بَابُ الْحَيْضِ

## 10వ అధ్యాయం

### రుతుస్రావానికి సంబంధించిన ఆదేశాలు

(١١٨) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: إِنَّ فَاطِمَةَ بِنْتَ أَبِي حُبَيْشٍ كَانَتْ

118. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా తెలిపారు: "ఫాతిమా బిన్తె హుబైష్ (ర.అన్హా) కు నిరంతరం 'ఇస్తెహాజా'

تُسْتَحَاضُ، فَقَالَ لَهَا رَسُولُ اللهِ ﷺ: «إِنَّ دَمَ الْحَيْضِ دَمٌ أَسْوَدُ يُعْرَفُ، فَإِذَا كَانَ ذَلِكَ فَأَمْسِكِي عَنِ الصَّلَاةِ، فَإِذَا كَانَ الْآخَرُ فَتَوَضَّئِي وَصَلِّي». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَاسْتَنْكَرَهُ أَبُو حَاتِمٍ.

రక్తం స్రవించేది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇలా ఉద్బోధించారు - "రుతుస్రావపు రక్తం నల్లగా (చిక్కగా) ఉంటుంది. దాన్ని తేలిగ్గా గుర్తుపట్టవచ్చు. ఏఏ రోజుల్లో ఇలాంటి రక్తం వస్తుందో ఆ రోజుల్లో నమాజ్‌ను మానివెయ్యి. వేరే రంగు ఉన్నప్పుడు 'వుజూ' చేసి నమాజ్ చేస్తూ ఉండు." (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అబూ హాతిమ్ దృష్టిలో ఇది నిరుపయోగమైనది).

وَفِي حَدِيثِ أَسْمَاءَ بِنْتِ عُمَيْسٍ عِنْدَ أَبِي دَاوُدَ: وَلْتَجْلِسْ فِي مِرْكَنٍ، فَإِذَا رَأَتْ صُفْرَةً فَوْقَ الْمَاءِ فَلْتَغْتَسِلْ لِلظُّهْرِ وَالْعَصْرِ غُسْلاً وَاحِداً، وَتَغْتَسِلْ لِلْمَغْرِبِ وَالعِشَاءِ غُسْلاً وَاحِداً، وَتَغْتَسِلْ لِلْفَجْرِ غُسْلاً وَاحِداً، وَتَتَوَضَّأُ فِي مَا بَيْنَ ذَلِكَ.

అబూ దావూద్ చేత ఉల్లేఖించబడిన అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) హదీసులో ఇలా ఉంది: ఒక తొట్టిలో కూర్చోవాలి. అప్పుడు నీటి పై భాగంలో కుంకుమ పువ్వు రంగు కనిపిస్తే జుహ్ర మరియు అస్ర్ నమాజుల కోసం ఒకసారి స్నానం చేయాలి. అలాగే మగ్రిబ్ మరియు ఇషా నమాజుల కోసం స్నానం చేయాలి. మరియు ఫజ్ర్ నమాజ్ కోసం వేరుగా స్నానం చేయాలి. ఈ నమాజుల కోసం వుజూ చేయాలి."

## సారాంశం

పడుచు స్త్రీ మూడు రకాల రక్త స్రావాలకు లోనవుతుంది. ఒకటి: బహిష్టు రక్త స్రావం. దీనిని అరబీలో 'హైజ్' అని అంటారు. రెండు : పురిటి రక్తస్రావం (దీనిని అరబీలో దమె నిఫాస్‌గా వ్యవహరిస్తారు. ప్రసవించిన నాటి నుంచి సుమారు 40 రోజుల వరకూ ఈ రక్త స్రావం జరుగుతుంది). మూడు : దమె ఇస్తెహాజా. రుతుస్రావం మరియు పురిటి రక్త స్రావం జరిగే రోజుల్లోనే గాక ఇతర దినాలలో కూడా బ్లీడింగ్ అవుతున్నట్లయితే దీనిని 'ఇస్తెహాజా' రక్తంగా వ్యవహరిస్తారు.

బహిష్టు రక్త స్రావం కనీస గడువు ఇమామ్ షాఫయి దృష్టిలో ఒక రోజు. గరిష్ఠ వ్యవధి 15 రోజులు. మూడు రోజుల నుంచి పదిరోజుల వరకు ఈ రుతుస్రావం ఉంటుందని ఇమామ్ అబూ హనీఫా భావిస్తున్నారు. దేశ, కాల పరిస్థితుల దృష్ట్యా, స్త్రీల ఆరోగ్య ప్రమాణాల రీత్యా ఇద్దరు ఇమాముల అభిప్రాయాలూ తమ తమ కోణాలనుంచి సరైనవే కావచ్చు. అయితే ప్రతి స్త్రీ స్వానుభవం మరియు తన స్వభావం దృష్ట్యా తన 'పీరియడ్' ఎన్నాళ్ళుంటుందో తాను స్వయంగా - సరిగ్గానే -అంచనా వేయగలదు. అంతకు మించి కూడా బ్లీడింగ్ అవుతుంటే అది 'ఇస్తెహాజా' రక్తంగా భావించి తదనుగుణంగా ఆచరించాలి.

## హదీసు ఉల్లేఖకులు

హదీసును అందజేసిన అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (రజి) సతీమణి. ఈమె తన భర్తతో కలసి అబిసీనియాకు హిజ్రత్ చేశారు. అక్కడామెకు దేవుడు సంతాన భాగ్యం కలుగజేశాడు. అబ్దుల్లాహ్ అనే అబ్బాయి పుట్టాడు. మౌతా యుద్ధంలో ఈమె భర్త మరణించిన పిదప హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఈమెను తన దాంపత్య జీవితంలోకి తెచ్చుకున్నారు. తరువాత ఈమెకు మరో పిల్లవాడు పుట్టాడు. ఈ అబ్బాయే ముహమ్మద్ బిన్ అబూబక్ర్‌గా ప్రసిద్ధిచెందాడు. హజ్రత్ అబూబక్ర్ (రజి) మరణానంతరం హజ్రత్ అలీ (రజి) ఈమెను వివాహమాడారు. ఇప్పుడీ దంపతులకు యహ్యా అనే అబ్బాయి పుట్టాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమెను కలల భావార్థం అడిగి తెలుసుకునేవారు. హజ్రత్ అలీ (రజి) మరణానంతరం ఈమె కూడా కన్నుమూశారు.

(١١٩) وَعَنْ حَمْنَةَ بِنْتِ جَحْشٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أُسْتَحَاضُ حَيْضَةً كَثِيرَةً شَدِيدَةً، فَأَتَيْتُ النَّبِيَّ ﷺ أَسْتَفْتِيهِ، فَقَالَ: «إِنَّمَا هِيَ رَكْضَةٌ مِنَ الشَّيْطَانِ، فَتَحَيَّضِي سِتَّةَ أَيَّامٍ أَوْ سَبْعَةَ أَيَّامٍ، ثُمَّ اغْتَسِلِي، فَإِذَا اسْتَنْقَأْتِ فَصَلِّي أَرْبَعَةً وَعِشْرِينَ أَوْ ثَلَاثَةً وَعِشْرِينَ، وَصُومِي

119. హజ్రత్ హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) ఇలా తెలిపారు: నేను తీవ్ర మయిన రక్త స్రావానికి (బ్లీడింగ్‌కి) లోనై ఉండేదానిని. ఈ విషయమై దైవప్రవక్త (సఅసం) అభిప్రాయం ఏమిటో కనుక్కుందామని వెళ్ళాను. ఆయన (సఅసం) ఇలా చెప్పారు - "ఇది షైతాన్ దెబ్బ. కనుక నీవు ఆరు లేక ఏడు దినాలు బహిష్టు కాలంగా లెక్కించి స్నానం చెయ్యి. నీవు పూర్తిగా పరిశుద్ధత నొందిన మీదట ఇరవైనాలుగు లేక ఇరవై మూడు రోజుల వరకూ నమాజ్ చెయ్యి. ఉపవాసవ్రతం కూడా (ఈ దినాలలో) పాటించు. నిశ్చయంగా నీ కొరకు ఇది చాలు. నెల నెలా ఇతర బహిష్టు స్త్రీల వలెనే నువ్వు కూడా ఇలాగే

وَصَلِّي، فَإِنَّ ذَلِكَ يُجْزِئُكِ، وَكَذَلِكَ فَافْعَلِي كُلَّ شَهْرٍ، كَمَا تَحِيضُ النِّسَاءُ، فَإِنْ قَوِيتِ عَلَى أَنْ تُؤَخِّرِي الظُّهْرَ وَتُعَجِّلِي الْعَصْرَ، ثُمَّ تَغْتَسِلِي حِينَ تَطْهُرِينَ، وَتُصَلِّينَ الظُّهْرَ وَالْعَصْرَ جَمِيعاً، ثُمَّ تُؤَخِّرِينَ الْمَغْرِبَ وَتُعَجِّلِينَ الْعِشَاءَ، ثُمَّ تَغْتَسِلِينَ وَتَجْمَعِينَ بَيْنَ الصَّلَاتَيْنِ، فَافْعَلِي، وَتَغْتَسِلِينَ مَعَ الصُّبْحِ وَتُصَلِّينَ، قَالَ: وَهُوَ أَعْجَبُ الْأَمْرَيْنِ إِلَيَّ». رَوَاهُ الْخَمْسَةُ إِلَّا النَّسَائِيُّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ الْبُخَارِيُّ.

చేస్తూ ఉండు. (ఇలా వద్దనుకుంటే) నీలో గనక జుహ్ర్ వేళను కాస్త ఆలస్యం చేసి అస్ర్ వేళను కాస్త ఇవతలకు జరుపు కునే శక్తి ఉన్నట్లయితే స్నానం చేసి పరిశుద్ధత నొందిన పిదప జుహ్ర్-అస్ర్ నమాజులను కలుపుకో. మరి అలాగే మగ్రిబ్ నమాజును కాస్సేపు వాయిదా వేసి ఇషా నమాజును కాస్త ఇవతలకు జరుపుకుని స్నానం చేసి పరిశుద్ధతను పొందు. రెండు నమాజులనూ కలుపుకో. నువ్విలా చేయవచ్చు. (ఈ మేరకు నీకు అనుమతి ఉంది). ఫజ్ర్ నమాజ్ కోసం వేరుగా స్నానం చేసి నమాజ్ చెయ్యి. తరువాత ఆయన (స) ఇలా అన్నారు - "ఈ రెండు పద్ధతులలో రెండవదే నాకు ఇష్టమైనది" (దీనిని 'ఐదుగురి'లో నసాయి మినహా మిగిలిన వారంతా ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు. బుఖారీ దీనిని 'సుస్పష్టం'గా పేర్కొన్నారు).

## సారాంశం

ఈ హదీసులో హమ్నా బిన్తె జహష్‌కు రేయింబవళ్ళలో మూడుసార్లు స్నానం చేయాలని సూచించబడింది. జుహ్ర్ - అస్ర్ నమాజుల కోసం ఒక స్నానం, మగ్రిబ్ - ఇషా నమాజుల కోసం ఒక స్నానం, ఫజ్ర్ నమాజ్ కోసం ఒక స్నానం. ఇంతకు ముందు వచ్చిన హదీసులో ఫాతిమా బిన్తె హుబైష్‌కు - ప్రతి నమాజు కోసం వుజూ చేయాలని ఆజ్ఞాపించబడింది. దీనిద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే నిరంతర బ్లీడింగ్ వ్యాధికి లోనైవున్న స్త్రీ ప్రతి నమాజు కోసం స్నానం చేయటం తప్పనిసరి కాదు గాని ప్రతి నమాజు కోసం సరికొత్తగా వుజూ చేయటం తప్పనిసరి. స్నానం అభిలషణీయం మాత్రమే. అది కూడా ఆరోగ్య, వాతావరణ స్థితిగతులు అనుకూలిస్తేనే. లేకుంటే స్నానం కూడా చేయవలసిన అవసరం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్

జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా) సోదరి. తొలుత ఈమె ముసైబ్ బిన్ ఉమైర్ (రజి)కు సతీమణిగా ఉన్నారు. ఉహుద్ యుద్ధంలో ముసైబ్ అమరగతి నొందగా తల్హా బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఈమెను నికాహ్ చేసుకున్నారు.

(١٢٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا أَنَّ أُمَّ حَبِيبَةَ بِنْتَ جَحْشٍ شَكَتْ إِلَى رَسُولِ اللّٰهِ ﷺ الدَّمَ، فَقَالَ: «امْكُثِي قَدْرَ مَا كَانَتْ تَحْبِسُكِ حَيْضَتُكِ، ثُمَّ اغْتَسِلِي» وَكَانَتْ تَغْتَسِلُ لِكُلِّ صَلَاةٍ. رواه مسلم.

120. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి 'దమె ఇస్తిహాజా' (బ్లీడింగ్) గురించి ఫిర్యాదు చేసింది. దానికి ఆయన (స) ఇలా సెలవిచ్చారు - "నీ నెలవారీ దినాలు లోగడ ఎన్ని నిర్ధారితమయి ఉండేవో అన్ని దినాలూ (నమాజ్, రోజా) వది లెయ్యి. ఆ తరువాత స్నానం చేసి నమాజ్ విధిని నెరవేర్చు." ఉమ్మె హబీబా ఆ తరువాత ప్రతి నమాజ్‌కై తాజాగా స్నానం చేసేది. (ముస్లిం)

وَفِي رِوَايَةِ الْبُخَارِيِّ «وَتَوَضَّئِي لِكُلِّ صَلَاةٍ». وَهِيَ لِأَبِي دَاوُدَ وَغَيْرِهِ مِنْ وَجْهٍ آخَرَ.

కాగా; బుఖారీ ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: "మరి ప్రతి నమాజ్ కోసం సరికొత్తగా వుజూ చేస్తూ ఉండు." (అబూ దావూద్ తదితర హదీసువేత్తలు ఈ హదీసును మరో విధంగా ఉల్లేఖించారు).

**సారాంశం**

ఈ హదీసు ద్వారాగానీ, ఈ అధ్యాయం క్రింద వచ్చిన ఇతర హదీసుల ద్వారాగానీ అవగతమయ్యేదేమిటంటే దీర్ఘకాలంగా బ్లీడింగ్ వ్యాధితో బాధపడే మహిళ బహిష్టు రక్తానికీ - సాధారణ బ్లీడింగ్‌కి మధ్య వున్న వ్యత్యాసాన్ని గ్రహించే ఆనవాళ్లు కొన్ని ఉన్నాయి. అనుభవం, విచక్షణా జ్ఞానంగల మహిళ ఈ తేడాను ఇట్టే పసిగట్టగలుగుతుంది. బహిష్టు కాలపు రక్తం చిక్కగా, నలుపు ఆవరించి ఉంటుంది. వాసన కూడా భరించశక్యం కానిదిగా ఉంటుంది. కాగా; ఇస్తెహాజా (సాధారణ బ్లీడింగ్) రక్తం లేత ఎరుపురంగు కలిగి ఉంటుంది. ఒక్కోసారి కుంకుమ పువ్వు రంగులో కనిపిస్తుంది. పల్చగా ఉంటుంది. అదీగాక ఒక స్త్రీకి తనకు సాధారణంగా - లోగడ ఎన్ని రోజులు బహిష్టు రక్తం పోయేదో - లెక్క ఉంటుంది. ఆ లెక్క ప్రకారం కూడా ఆమె తన పీరియడ్‌ను అంచనా వేయగలదు. లేక తన సమ వయస్కులైన, తన స్వభావానికి అనుగుణమైన స్త్రీలకు ఎన్ని రోజులు రుతుస్రావం జరుగుతుందో తెలుసుకుని కూడా 'పీరియడ్'ను లెక్కించవచ్చు.

హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) ప్రతి నమాజుకై స్నానం చేసేవారు. ఈ స్నానం ఆమె తన శక్తీ స్థోమతలనుబట్టి చేశారేతప్ప ప్రతి నమాజు కోసం సరికొత్తగా స్నానం చేయటం తప్పనిసరి కాదు. పండితులలో అధిక సంఖ్యాకుల అభిప్రాయం ఇదే. ఇస్తెహాజా వ్యాధికి లోనైన స్త్రీపై షరీయత్ ప్రతి నమాజు కోసం స్నానం చేయాల్సిందేనన్న నియమం పెట్టలేదు. 'ఫత్‌హుల్ బారీ' లో అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై) కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించారు. ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) కూడా దీనినే సమర్థించారు. బ్లీడింగ్‌తో సతమతమయ్యే మహిళలపై ప్రతి నమాజు కోసం సరికొత్తగా స్నానం చేసే భారం సహీహ్ హదీసుల ద్వారా నిరూపితం కాలేదంటా రాయన. ఇలాంటి స్త్రీ బహిష్టు కాలం పూర్తయిన పిదప స్నానంచేసి, ఆ తరువాత ప్రతి నమాజ్ కోసం ఇస్తింజా చేసి వుజూ చేసుకుంటే సరిపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉమ్మె హబీబా బిన్తె జహష్ (ర.అన్హా) హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) కు తోబుట్టువు. ఈమె అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సతీమణి. ముస్లింలోని ఉల్లేఖనం ప్రకారం ఈమె నిరంతరం ఏడు సంవత్సరాలు బ్లీడింగ్‌తో బాధపడ్డారని తెలుస్తోంది. హిజ్రీ 44లో ఈమె మరణించారు. కొంతమంది వాదన ప్రకారం జహష్‌కు ముగ్గురు కుమార్తెలు. ముగ్గురూ 'ఇస్తె హాజా' వ్యాధిగ్రస్తులే. ఈ ముగ్గురిలో ఒకరు: ఉమ్ముల్ మోమినీన్ జైనబ్, రెండవవారు: హమ్నా. మూడవవారు: ఉమ్మె హబీబా. కాని నిజమేమిటంటే హజ్రత్ జైనబ్ (ర.అన్హా) ఈ వ్యాధినుండి సురక్షితంగా ఉన్నారు. దైవప్రవక్త (సఅసం) కాలంలో పదిమంది మహిళలు 'ఇస్తెహాజా' వ్యాధికి లోనై ఉండేవారని ప్రతీతి.

(١٢١) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنَّا لاَ نَعُدُّ الْكُدْرَةَ وَالصُّفْرَةَ بَعْدَ الطُّهْرِ شَيْئاً. رَوَاهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ.

121. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) వివరించారు: మేము (రుతుస్రావ కాలం ముగిసిన తరువాత) స్నానాదులు చేసి పరిశుద్ధత పొందేవారం. ఆ తరువాత (స్రవించే) జిగటు మరియు పసుపు పచ్చని రంగుగల పదార్థానికి ప్రాధాన్యత నిచ్చే వారము కాము. (అంటే ఆ పదార్థం స్రవిస్తే దాన్ని రుతుస్రావంగా తలపోసే వాళ్ళం కాము). (బుఖారీ, అబూదావూద్ - హదీసు పదాలు మాత్రం అబూ దావూద్‌లోనివి).

## సారాంశం

బహిష్టు కాలం ముగిసిన తరువాత కనిపించే మైల మరియు పసుపుపచ్చని డిశ్చార్జ్‌ని తాము 'బహిష్టు రక్తం' గా ఎన్నటికీ భావించేవారం కాదు అని భావం.

ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ప్రకారం పసుపుపచ్చని రంగులో స్రవించే నీరును రుతుస్రావంగా తలపోసే వారని తెలిసింది. కాని ఈ హదీసులో 'ఇలాంటి నీరుకు మేము ప్రాధాన్యతనిచ్చే వాళ్లం కాదు' అని చెప్పబడింది. పైకి ఈ రెండు హదీసులలో వైరుధ్యం కనిపిస్తున్నప్పటికీ, కాస్త నిశితంగా ఆలోచిస్తే ఈ వ్యాఘాతం సమసిపోగలదు. పైన పేర్కొనబడిన రంగుగల నీరు ఒకవేళ రుతుస్రావ సమయంలో కనిపిస్తే దాన్ని రుతుస్రావంగానే భావించవచ్చు. ఒకవేళ పీరియడ్ గడచిన తరువాత కనిపిస్తే దానికి ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరం లేదని అనుకోవచ్చు. హదీసులో వచ్చిన 'బాదుత్తుహర్' అనే పదం సూచిస్తున్నది కూడా ఇదే.

## హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె అతియా (ర.అన్హా) అసలు పేరు నుసైబా. కాబ్ కుమార్తె. ఈమె హారిస్ పుత్రిక అని కూడా ఒక వాదన ఉంది. ఈమె గొప్ప స్థానం పొందిన సహాబియాత్‌లలో ఒకరుగా ప్రసిద్ధికెక్కారు. యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) కు తోడుగా ఉండేవారు. రోగగ్రస్తులకు సేవలందించేవారు. క్షతగాత్రులకు కట్లుకట్టేవారు. ఉహుద్ యుద్ధంలో శూరులైన మగవారివలే పోరాడారు. దైవప్రవక్త (సఅసం) కుమార్తెకు (చనిపోయినపుడు) చేయించిన స్నానానికి ఆమె సాక్షిగా ఉన్నారు. ఆమె ఎంతో శుభ్రంగా ఆమెకు స్నానం చేయించారు. ఈమె బస్రాలో ఉన్న కాలంలో అక్కడి పండితులు, తాబయీన్లు ఈమె నుండి అనేక హదీసులను సంగ్రహించేవారు. ఈమె అసలు హదీసు మృతునికి చేయించే స్నానం గురించి ఉంది. బస్రాలో స్థిరపడిన కారణంగా బస్రీ సహాబియాగా పరిగణించ బడ్డారు.

(١٢٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ الْيَهُودَ كَانُوا إِذَا حَاضَتِ الْمَرْأَةُ فِيهِمْ لَمْ يُؤَاكِلُوهَا، فَقَالَ النَّبِيُّ ﷺ: «اِصْنَعُوا كُلَّ شَيْءٍ إِلَّا النِّكَاحَ». رَوَاهُ مُسْلِمٌ.

122. హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు: యూదులలో ఏ స్త్రీకయినా బహిష్టు కాలం వస్తే వాళ్లు ఆ స్త్రీతో కలసి తినటం, త్రాగటం మానేసేవారు. అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు - "(ఓ ముస్లింలారా!) మీరు ఒక్క సంభోగం తప్ప ఏ పనైనా (మీ భార్య అయిన) స్త్రీతో చేయించగలరు." (ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్త (సఅసం) గారి ఉపదేశం వెలుగులో బహిష్టు కాలంలో వున్న స్త్రీతో కలసి కూర్చోవటం, పడుకోవటం, తినటం, త్రాగటం - అన్నీ ముస్లిముల కొరకు ధర్మ సమ్మతమే. కేవలం ఒక్క సంభోగానికి దూరంగా ఉండటం అవసరం. ఈ అంటరానితనం యూదులలో, హిందువులలో అధికంగా ఉంది. ముస్లిముల దృష్టిలో దీనికి ఎలాంటి ప్రాముఖ్యం లేదు.

(١٢٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَأْمُرُنِي فَأَتَّزِرُ، فَيُبَاشِرُنِي وَأَنَا حَائِضٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

123. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను లోఉడుపు గట్టిగా కట్టుకోమని చెప్పేవారు. ఆ తరువాత నన్ను హత్తుకుని పడుకునే వారు. నేనప్పుడు బహిష్టు స్థితిలో ఉండే దానిని.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒండొకరు హత్తుకుని పడుకోవటాన్ని అపార్థం చేసుకోనవసరం లేదు. విచారకరమైన విషయం ఏమిటంటే హదీసులను త్రోసిపుచ్చే వర్గం (మున్కిరీనె హదీస్) మహాప్రవక్త (స) వారి హదీసుల పట్ల ప్రజాబాహుళ్యంలో వెగటును పుట్టించి, అనుమానాలను రేకెత్తించే ఉద్దేశ్యంతో ఇలాంటి హదీసులను వక్రీకరిస్తుంది. ఉదాహరణకు : వారు ఈ హదీసును ఉదాహరిస్తూ దివ్య ఖుర్ఆన్లో వారించబడినప్పటికీ దైవప్రవక్త (సఅసం) బహిష్టు స్థితిలోవున్న తమ భార్యలతో సంభోగించే వారని (దైవం మన్నించుగాక!) అభాండం వేశారు. తత్కారణంగా హదీసులు నిజమైనవి కావని ఘోషిస్తారు. ఇవి నమ్మదగ్గ మాటలు కావు. పరస్పరం హత్తుకుని పండుకోవటమే సంభోగమని అనటం అన్యాయం కాకపోతే ఏమిటీ? బహిష్టు స్థితిలో - ఒక్క నాభిక్రింది భాగాన్ని తప్ప - స్త్రీ శరీరమంతటినీ తాకి మధురానుభూతిని పొందేందుకు షరీయత్ అనుమతిస్తోంది.

(١٢٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ، فِي الَّذِي يَأْتِي امْرَأَتَهُ وَهِيَ حَائِضٌ، قَالَ: «يَتَصَدَّقُ بِدِينَارٍ أَوْ بِنِصْفِ دِينَارٍ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ وَابْنُ الْقَطَّانِ، وَرَجَّحَ غَيْرُهُمَا وَقْفَهُ.

124. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : తన భార్య బహిష్టు అయి వున్న స్థితిలో ఆమె వద్దకు పోయిన వ్యక్తి గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), ''అతడు ఒక దీనారు లేక అర్ధ దీనారు దానం చేయాలి'' అని సెల విచ్చారు. (ఈ హదీసును ఐదుగురు ఉల్లేఖించారు. హాకిమ్ మరియు ఇబ్నె ఖత్తాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. మిగిలిన హదీసువేత్తలు దీనిని 'మౌఖూఫ్'గా నిర్ధారించారు)

(١٢٥) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ:

125. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు:

«أَلَيْسَ إِذَا حَاضَتِ الْمَرْأَةُ لَمْ تُصَلِّ وَلَمْ تَصُمْ؟». مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيثٍ طَوِيلٍ.

"ఏమిటీ, స్త్రీ బహిష్టు అయి వున్నప్పుడు నమాజ్, ఉపవాసాలను విడిచిపెట్టదా?" (బుఖారీ, ముస్లిం - ఇది సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే)

**సారాంశం**

అంటే ఈ అశుద్ధావస్థలో ఆమె నమాజ్ చేయవలసిన అవసరం లేదు. ఉపవాస (రోజా) వ్రతాన్ని పూనవలసిన అవసరం కూడా లేదు. వదలివేయబడిన 'రోజా' లను ఇతర దినాలలో 'ఖజా' చేసుకోవలసి ఉంటుంది. అయితే బహిష్టు కాలంలో వదలివేసిన నమాజులను మాత్రం 'ఖజా' చేయవలసిన అవసరం లేదు.

(١٢٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمَّا جِئْنَا سَرِفَ حِضْتُ، فَقَالَ النَّبِيُّ ﷺ: «افْعَلِي مَا يَفْعَلُ الْحَاجُّ، غَيْرَ أَنْ لاَ تَطُوفِي بِالْبَيْتِ حَتَّى تَطْهُرِي». مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيثٍ طَوِيلٍ.

126. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు: "మేము 'సరిఫ్' అనే ప్రదేశానికి చేరుకునేసరికి నాకు బహిష్టు దినాలు మొదలయ్యాయి. (ఈ సంగతిని నేను తెలియజేయగా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "ఇతర హాజీల మాదిరిగానే నీవు కూడా హజ్ ఆచారాలను నెరవేర్చు. అయితే బైతుల్లాహ్ (దైవ గృహం) ప్రదక్షిణ మాత్రం గడువు దాటిన మీదట స్నానం చేసి చెయ్యి." (బుఖారీ, ముస్లిం - ఇది కూడా సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే)

**సారాంశం**

(1). దైవప్రవక్త (స) వారి అంతిమ హజ్ యాత్ర సందర్భంగా జరిగిన సంఘటన ఇది.

(2). 'సరిఫ్' ఒక ప్రదేశం పేరు. ఇది మక్కాకు పది మైళ్ళ దూరంలో ఉంది.

(3). ఈ హదీసు ప్రకారం బహిష్టు అయివున్న స్త్రీ కాబా ప్రదక్షిణ చేయజాలదు. ఎందుకంటే ప్రదక్షిణ కోసం శుచీ శుభ్రత అవసరం. కాగా; బహిష్టు కాలంలో స్త్రీ అశుద్ధతకు లోనై ఉంటుంది. అశుద్ధావస్థకు లోనై వున్న స్త్రీ మస్జిద్‌లోనే ప్రవేశించలేనప్పుడు కాబా గృహం వద్దకు ఎలా రాగలుగుతుంది? ఈ స్థితిలో ఆమె కనీసం నమాజ్ కూడా చేయజాలదు. అందుకే రచయిత ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకుని విషయాన్ని విశదీకరించారు.

127. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం ఆయన దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, 'స్త్రీ బహిష్టు కాలంలో ఉన్నప్పుడు ఆమెకు సంబంధించిన ఏఏ వస్తువులు భర్త కొరకు ధర్మసమ్మతం అవుతాయి?' అని ప్రశ్నించగా, ఆయన (సఅసం) ఇలా బదులిచ్చారు: "పాజామా లేక ఇజారు (లేకలంగా) పరిధిలోకి వచ్చే శరీర భాగం తప్ప మిగిలినదంతా అతని కొరకు ధర్మసమ్మతమే." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - బలహీనమైనదిగా ఖరారు చేశారు)

(١٢٧) وَعَنْ مُعاذِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَأَلَ النَّبِيَّ ﷺ، مَا يَحِلُّ لِلرَّجُلِ مِنَ امْرَأَتِهِ وَهِيَ حَائِضٌ؟ فَقَالَ: «مَا فَوْقَ الْإِزَارِ». رَوَاهُ أَبُو دَاوُدَ، وضَعَّفَهُ.

## సారాంశం

ఈ హదీసు ద్వారా రెండు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి: బహిష్టు దినాలలో నాభి క్రింది భాగం జోలికి పోకూడదు. అంటే రతిక్రీడలో పాల్గొనరాదు. రెండు: నిర్ణీత శరీర భాగాన్ని మినహాయించి స్త్రీ యొక్క ఇతర శరీరావయవాలను తాకవచ్చు, స్త్రీని హత్తుకుని నిద్రించవచ్చు. ఆమె వండిపెట్టిన ఆహార పదార్థాలను తినవచ్చు - ఒక్క సంభోగం తప్ప - ప్రతిదీ చేయవచ్చు.

128. హజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో స్త్రీలు ప్రసవించిన తరువాత నలభై రోజుల వరకూ అశుద్ధులుగా కూర్చుని ఉండేవారు. (నసాయితో పాటు మరో ఐదుగురు దీనిని ఉల్లేఖించారు. హదీసు పదాలు మాత్రం అబూదావూద్ లోనివి)

(١٢٨) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَتِ النُّفَسَاءُ تَقْعُدُ على عَهْدِ النَّبِيِّ ﷺ بَعْدَ نِفَاسِهَا أَرْبَعِينَ يَوْماً. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَاللَّفْظُ لِأَبِي دَاوُدَ.

దీని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: పురిటిరక్త స్రావ కాలంలో విడిచిపెట్టబడిన నమాజులను 'ఖజా' చేసుకోమని దైవప్రవక్త (సఅసం) ఆదేశించలేదు. (హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

وَفِي لَفْظٍ لَهُ: وَلَمْ يَأْمُرْهَا النَّبِيُّ ﷺ بِقَضَاءِ صَلاَةِ النِّفَاسِ. وَصَحَّحَهُ الْحَاكِمُ.

## సారాంశం

ప్రసవించిన స్త్రీల అశుద్ధ గడువు 40 రోజులని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. దీని కనీస గడువు ఎంత? అనేది ఇదమిత్థంగా చెప్పబడలేదు. అయితే 40 రోజుల తరువాత కూడా పరిశుద్ధత చేకూరకపోతే దాన్ని 'ఇస్తెహాజా'గా పరిగణించవలసి ఉంటుంది.

గడువు ముగిసిన తరువాత నమాజ్, రోజాలను విడిచిపెట్టకూడదు. భర్తతో లైంగిక సంబంధం కూడా ఏర్పరచుకోవచ్చు.

బహిష్టు కాలంలో ధర్మానికి సంబంధించిన ఏ ఏ నిబంధనలున్నాయో అవే పురిటి రక్త స్రావంలోనూ ఉన్నాయి. అంటే ఈ 40 రోజుల గడువులో స్త్రీలు నమాజ్, రోజాలను విడిచిపెట్టాలి. మస్జిద్‌లో ప్రవేశించరాదు. కాబా ప్రదక్షిణ కూడా చేయకూడదు. దివ్య ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటంగానీ, పారాయణం చేయటం గానీ చేయకూడదు. ఈ గడువులో విడిచిపెట్టబడిన ఉపవాసాలను మాత్రం తరువాత ఖజా చేసుకోవాలి. నమాజులను ఖజా చేయనవసరం లేదు.

# 2. నమాజ్ పుస్తకం

# كِتَابُ الصَّلاَةِ

**1వ అధ్యాయం**

## నమాజ్ వేళలు

## ١ - بَابُ الْمَوَاقِيتِ

129. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "జుహ్ర్ నమాజ్‌వేళ నడినెత్తి మీదినుండి పొద్దు వాలినప్పటినుండి మొదలై అస్ర్ నమాజ్ వేళ అరంభమయ్యే వరకూ ఉంటుంది. అస్ర్ వేళ మనిషి నీడ అతని ఎత్తుకు సమానంగా పడినప్పటినుండి మొదలవు తుంది. అస్ర్ ఆఖరివేళ సూర్యుడు పసుపుపచ్చని రంగును సంతరించుకునే వరకూ ఉంటుంది. మగ్రిబ్ నమాజ్ వేళ (సూర్యాస్తమయం అయినప్పటినుండి మొదలై ఆకాశాన వున్న) ఎరుపుదనం మటుమాయమయ్యేదాకా ఉంటుంది. ఇషా నమాజు వేళ అర్ధరాత్రి వరకూ ఉంటుంది. ఫజ్ర్ నమాజ్ వేళ తెల్లవారు జాము నుండి మొదలై సూర్యోదయానికి ముందు వరకూ ఉంటుంది. (ముస్లిం)

(١٢٩) عَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**وَقْتُ الظُّهْرِ إِذَا زَالَتِ الشَّمْسُ، وَكَانَ ظِلُّ الرَّجُلِ كَطُولِهِ، مَا لَمْ يَحْضُرِ الْعَصْرُ، وَوَقْتُ الْعَصْرِ مَا لَمْ تَصْفَرَّ الشَّمْسُ، وَوَقْتُ صَلاَةِ الْمَغْرِبِ مَا لَمْ يَغِبِ الشَّفَقُ، وَوَقْتُ صَلاَةِ الْعِشَاءِ إِلَى نِصْفِ اللَّيْلِ الأَوْسَطِ، وَوَقْتُ صَلاَةِ الصُّبْحِ مِنْ طُلُوعِ الْفَجْرِ مَا لَمْ تَطْلُعِ الشَّمْسُ**». رَوَاهُ مُسْلِمٌ.

ఇందులోనే (అంటే ముస్లింలోనే) బురైదా (రజి) గారి ద్వారా అస్ర్ గురించి ఇలా ఉల్లేఖించబడింది - "సూర్యుడు తెల్లగా, స్పష్టమయిన స్థితిలోనుండాలి." అబూ మూసా (రజి) గారు "సూర్యుడు బాగా ఎత్తున ఉన్నప్పుడు" అని అన్నారు.

وَلَهُ مِنْ حَدِيثِ بُرَيْدَةَ فِي الْعَصْرِ: «وَالشَّمْسُ بَيْضَاءُ نَقِيَّةٌ» وَمِنْ حَدِيثِ أَبِي مُوسَى: «وَالشَّمْسُ مُرْتَفِعَةٌ».

## సారాంశం

ఈ హదీసు ప్రకారం జుహ్ర్ నమాజ్‌వేళ మనిషి నీడ అతని ఎత్తుకు సమానంగా పడేవరకూ ఉంటుంది. అప్పటినుండే అస్ర్ వేళ కూడా మొదలైపోతుంది. ముగ్గురు ప్రముఖ ఇమాములైన ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)లే గాక ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ జుఫర్‌ల అభిమతం కూడా ఇదే. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయం కూడా ఇదే. అయితే ఆయన (రహ్మ.లై) కు సంబంధించి ఉదాహరించే మరో ప్రసిద్ధ ఉల్లేఖనంలో "నీడ రెట్టింపు అయ్యేవరకూ జుహ్ర్ వేళ ఉంటుంది" అని ఉంది. హనఫీ పండితులు ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి మొదటి విధానాన్ని స్వీకరించలేదు. మనిషి ఎత్తుకు సమానంగా నీడవచ్చే వరకూ జుహ్ర్ నమాజును ముగించటమే ఉత్తమం. అబూ హనీఫా (రహ్మ.లై) గారి ముఖ్య శిష్యులైన ఖాజీ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్‌ల నిర్ణయం కూడా ఇదే.

ఇక మగ్రిబ్ వేళ గురించి కూడా ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. సూర్యాస్తమయం తరువాత ఆకాశాన - పడమటి దిక్కున - ఏర్పడే **షఫఖ్** గురించి అభిప్రాయపడుతూ ఇమామ్ అబూ హనీఫా, ఆకాశాన ఆవరించే అరుణిమ అనంతరం అగుపించే తెలుపే ఈ **షఫఖ్** అని అన్నారు. దీనికి భిన్నంగా ఇమామ్ షాఫయి, **షఫఖ్** అంటే సూర్యాస్తమయం తరువాత ఆకాశపుటంచున ఏర్పడే ఎరుపుదనమేనని అభిప్రాయపడ్డారు.

సూర్యోదయ సమయంలోనూ, సూర్యాస్తమయ సమయంలోనూ నమాజ్ చేయటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అంటే సూర్యోదయం కాబోతుందని తెలియగానే నమాజ్‌ను విరమించాలి. ఎందుకంటే ఆ సమయంలో సూర్యుడు షైతాన్ యొక్క రెండు కొమ్ములపై ఉదయిస్తాడు. అది సూర్యుణ్ణి పూజించే వారి సమయం. అలాగే సరిగ్గా సూర్యాస్తమయం జరుగుతున్న వేళ కూడా నమాజ్ ప్రారంభించకూడదు.

ఈ హదీసు ద్వారా ఐదుపూటల నమాజు వేళలు తెలుపబడ్డాయి. నమాజు ఆరంభవేళ, ఆఖరివేళ కూడా హదీసులో సూచించబడింది. కనుక ఈ వేళలలోనే ఆయా నమాజులు చేయాలి.

## హదీసు ఉల్లేఖకులు

(1) హదీసు ఉల్లేఖకులైన బురైదా (రజి) పూర్తిపేరు బురైదా బిన్ హుసైబ్ అస్లమీ. మారుపేరు అబూ అబ్దుల్లాహ్. దైవప్రవక్త (సఅసం) మదీనా వైపునకు హిజ్రత్ చేస్తున్న సమయంలో మార్గమధ్యంలో ఇస్లాం స్వీకరించిన 80 మందిలో ఈయన ఒకరు. ఉహుద్ యుద్ధానంతరం దైవప్రవక్త (స) సమక్షంలో హాజరయ్యారు. ఆ తరువాత యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. 'బైతుర్రిజ్వాన్'లో కూడా ఈయన ఉన్నారు. అనంతరం బస్రా వైపునకు ప్రస్థానం చేశారు. అక్కడి నుండి 'ఖురాసాన్'కు జిహాద్ నిమిత్తం బయలుదేరారు. చివరకు 'మర్వ్' అనే చోట స్థిరపడ్డారు. అక్కడే మరణించారు. ఈయన అంత్యక్రియలు హిజ్రీ 62 లేక 63లో జరిగాయి.

(2) హదీసు ఉల్లేఖకులలో రెండవవారైన అబూ మూసా అష్అరీ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ అష్అరీ (రజి). ఘనత వహించిన సహచరులలో ఈయన కూడా ఒకరు. తొలుత అబిసీనియా వైపునకు ప్రస్థానం (హిజ్రత్) చేశారు. ఖైబర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త

(స)ను కలుసుకున్నారు. జుబేద్ మరియు అదన్ ప్రాంతాల పర్యవేక్షకుడిగా నియుక్తులయ్యారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో కూఫా మరియు బస్రాలకు గవర్నర్‌గా నియమించ బడ్డారు. ఈయన ఆధ్వర్యంలో తస్తర్ జయించబడింది. ఇంకా ఇతర పట్టణాలను కూడా ఈయన జయించారు. హిజ్రీ 42లో మరణించారు.

(١٣٠) وَعَنْ أَبِيْ بَرْزَةَ الأَسْلَمِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي الْعَصْرَ، ثُمَّ يَرْجِعُ أَحَدُنَا إِلَى رَحْلِهِ فِي أَقْصَى الْمَدِيْنَةِ وَالشَّمْسُ حَيَّةٌ، وَكَانَ يَسْتَحِبُّ أَنْ يُؤَخِّرَ مِنَ الْعِشَاءِ، وَكَانَ يَكْرَهُ النَّوْمَ قَبْلَهَا وَالْحَدِيْثَ بَعْدَهَا، وَكَانَ يَنْفَتِلُ مِنْ صَلاَةِ الْغَدَاةِ حِيْنَ يَعْرِفُ الرَّجُلُ جَلِيْسَهُ، وَكَانَ يَقْرَأُ بِالسِّتِّيْنَ إِلَى الْمِائَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

130. హజ్రత్ అబూ బర్జా అస్లమీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అస్ర్ నమాజు ఏ సమయంలో చేసేవారంటే, మాలో ఎవరయినా మదీనా చివరి హద్దుల దాకా వెళ్ళి చూసినా అప్పటికీ సూర్యుడు భగభగా మండుతూ, ప్రకాశిస్తూ కనిపించేవాడు. ఆయన (స) ఇషా నమాజును ఆల స్యంగా చేయడాన్ని ఇష్టపడేవారు. ఇషా నమాజుకు ముందు నిద్రపోవడాన్ని, ఇషా నమాజు అనంతరం (అనవస రంగా) కబుర్లు చెప్పుకోవడాన్ని ఇష్టపడే వారు కాదు. ఫజ్ర్ నమాజ్‌ను ఒక వ్యక్తి సాటి వ్యక్తిని గుర్తుపట్టగలిగే సమయానికే ముగించేవారు. (సాధారణంగా ఫజ్ర్ నమాజ్‌లో) అరవై నుండి వంద ఆయత్‌ల వరకూ పారాయణం చేసే వారు. (బుఖారీ, ముస్లిం)

وَعِنْدَهُمَا مِنْ حَدِيْثِ جَابِرٍ: «وَالْعِشَاءُ أَحْيَاناً يُقَدِّمُهَا، وَأَحْيَاناً يُؤَخِّرُهَا، إِذَا رَآهُمُ اجْتَمَعُوا عَجَّلَ وَإِذَا رَآهُمْ أَبْطَؤُوا أَخَّرَ، وَالصُّبْحُ كَانَ النَّبِيُّ ﷺ يُصَلِّيْهَا بِغَلَسٍ.

జాబిర్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది: ఆయన (స) ఇషా నమాజు ఒక్కోసారి త్వరగా చేసేవారు, ఒక్కోసారి ఆల స్యంగా చేసేవారు. ప్రజలందరూ వచ్చే శారని నిర్ధారణ అయితే తొందరగా నమాజ్ మొదలెట్టేవారు. ప్రజలు ఆలస్యంగా వస్తున్నారనిపిస్తే కాస్సేపు ఆగి ఇషా నమాజు చేసేవారు. అయితే ఉదయం నమాజును మాత్రం దైవప్రవక్త (స) చీకటి అలుముకుని ఉండగానే చేసేవారు. (బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ مِنْ حَدِيثِ أَبِي مُوسَى: «فَأَقَامَ الفَجْرَ حِينَ انْشَقَّ الْفَجْرُ، وَالنَّاسُ لاَ يَكَادُ يَعْرِفُ بَعْضُهُمْ بَعْضاً».

ముస్లింలో అబూ మూసా (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది: "ఉదయం నమాజును తొలి జాములోనే మొదలెట్టే వారు. చీకటి మూలంగా సహచరులు ఒండొకరిని అతి కష్టంమీద గుర్తుపట్ట గలిగేవారు."

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ఫజ్ర్ నమాజును తొలివేళలోనే - చీకటి ఉండగానే - చేసేవారనీ, ఈ నమాజులో అరవై నుండి నూరు ఆయత్‌ల దాకా పారాయణం చేయటం ద్వారా చాలా సుదీర్ఘమయిన నమాజు చేసేవారని, దివ్య ఖుర్‌ఆన్‌ను బాగా ఆగి ఆగి పఠించేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. దీన్నిబట్టి బేరీజువేయవచ్చు - ఆయన (స) ఎంత తొందరగా ఫజ్ర్ నమాజును మొదలెట్టేవారో! దీన్నిబట్టి ఉదయం నమాజ్‌ను తొలివేళలో - అంటే చీకటి ఉండగానే ప్రారంభించాలని మనకు తెలిసివస్తున్నది. అయితే నమాజు కొరకు నిలబడే సమయానికి ఆకాశాన ధవళ రేఖలు పొడసూపటం అవసరమని మరువరాదు. అంతకు ముందు గనక నమాజ్ చేస్తే అప్పటికి ఫజ్ర్ వేళ అవదు.

**హదీసు ఉల్లేఖకులు**

అబూ బర్జా (రజి) అసలు పేరు నద్‌ల బిన్ ఉబైద్. అబూ బర్జా ఆయన నామాంతరం. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించిన ప్రియ సహచరులలో ఒకరు. మక్కా విజయంలోను, ఆ తరువాత జరిగిన యుద్ధాలలోనూ పాల్గొన్నారు. బస్రాలో స్థిరపడ్డారు. ఆ తర్వాత ఖురాసాన్‌కు బదిలీ అయ్యారు. ఒక కథనం ప్రకారం 'మర్వ్'లో హిజ్రీ 60లో పరమపదించారు. హిజ్రీ 64లో మరణించారని వేరొక ఉల్లేఖనం చెబుతోంది.

(١٣١) وَعَنْ رَافِعِ بْنِ خَدِيجٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي الْمَغْرِبَ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ، فَيَنْصَرِفُ أَحَدُنَا وَإِنَّهُ لَيُبْصِرُ مَوَاقِعَ نَبْلِهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

131. హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం: మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి మగ్రిబ్ నమాజ్ చేసేవాళ్ళం. ఆ తరువాత మాలో నుంచి ఎవరయినా (మస్జిద్) బయటికి పోయి చూస్తే ప్రయోగించిన బాణం ఎక్కడ పడిందో చూడగలిగేంత వెలుతురు ఉండేది. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మగ్రిబ్ నమాజ్ చేయటంలో తాత్సారం చేయరాదనీ, వేళ అయిన వెంటనే నమాజ్‌ను ముగించటం ఉత్తమమనీ ఈ హదీసులోని సంఘటననుబట్టి అర్థమవుతున్నది.

### హదీసు ఉల్లేఖకులు

రాఫె బిన్ ఖదీజ్ (రజి) యొక్క మరో పేరు అబ్దుల్లాహ్. పిన్న వయస్సు కారణంగా బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు. ఉహుద్ యుద్ధంలోనూ, ఆ తర్వాతి యుద్ధాలలోనూ పాల్గొన్నారు. హిజ్రీ 73 లేక 74లో 86 ఏండ్ల వయస్సులో మరణించారు.

(١٣٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَعْتَمَ النَّبِيُّ ﷺ ذَاتَ لَيْلَةٍ بِالْعِشَاءِ، حَتَّى ذَهَبَتْ عَامَّةُ اللَّيْلِ، ثُمَّ خَرَجَ فَصَلَّى، وَقَالَ: «إِنَّهُ لَوَقْتُهَا، لَوْلاَ أَنْ أَشُقَّ عَلَى أُمَّتِي»، رَوَاهُ مُسْلِمٌ.

132. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రాత్రి ఇషా నమాజును ఎంత ఆలస్యంగా చేశారంటే, అప్పటికి ఒక వంతు రాత్రి గడచిపోయింది. ఆయన (స) నమాజు కోసం విచ్చేశారు, నమాజు చేసిన మీదట ఇలా వ్యాఖ్యానించారు: నా అనుచర సమాజం కొరకు (ఈ వేళ) భారం కానట్లయితే నేను ఇషా నమాజుకై ఈ వేళనే నిర్ధారించేవాణ్ణి." (ముస్లిం)

### సారాంశం

ఇషా నమాజ్ ఆలస్యంగా చేయటం ఉత్తమం అన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. అయితే ఈ ఆలస్యం ఒక్క ఇషా నమాజ్‌కే ప్రత్యేకం. వేరితర నమాజులు తొలివేళల్లో చేయటం శ్రేష్ఠం. ఇషా నమాజు కోసం ప్రజలు రావటంలో ఆలస్యమయితే మహాప్రవక్త (స) నిరీక్షించేవారని ఇంతకుముందు చెప్పుకున్నాం. అంటే ఏ విషయమయినా ప్రజలకు క్లిష్టతరంగా కనిపిస్తే దాన్ని వీలయినంత వరకు సులభతరం చేయడానికి దైవప్రవక్త (సఅసం) ప్రయత్నించేవారు.

(١٣٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا اشْتَدَّ الحَرُّ فَأَبْرِدُوا بِالصَّلاَةِ، فَإِنَّ شِدَّةَ الحَرِّ مِنْ فَيْحِ جَهَنَّمَ». مُتَّفَقٌ عَلَيْهِ.

133. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: వేసవి తీవ్రత ఉంటే అప్పుడు కాస్త చల్లబడిన తరువాత నమాజ్ చేయండి. ఎందుకంటే వేసవి తీవ్రత నరకం వదిలే గాలి వల్ల ఉత్పన్నమవుతుంది." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

వేసవి కాలంలో జుహ్ర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేయాలని పై హదీసు ద్వారా విశదమవుతున్నది. అయితే ఈ ఆలస్యానికి ఆఖరి హద్దు ఏమై ఉంటుంది? ఈ సందేహానికి

సమాధానం అబూ దావూద్, నసాయిలలో ఉంది - దైవప్రవక్త (స) ఎండా కాలంలో జుహ్ర్ నమాజ్ చేసే సమయానికి నీడ మూడడుగుల నుంచి ఐదడుగుల వరకు వచ్చేది. అయితే ఇది ఆయాదేశాల భౌగోళిక, అక్షాంశ రేఖలపై ఆధారపడి ఉంటుందని అల్లామా ఖుతాబీ అభిప్రాయపడ్డారు. మొత్తంమీద బోధపడే అంశం ఏమిటంటే ఎండాకాలంలో జుహ్ర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేయటం అభిలషణీయం. అత్యధిక మంది పండితుల, విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే.

(١٣٤) وَعَنْ رَافِعِ بْنِ خَدِيْجٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «أَصْبِحُوا بِالصُّبْحِ، فَإِنَّهُ أَعْظَمُ لِأُجُورِكُمْ». رَوَاهُ الْخَمْسَةُ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

134. హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "ఫజ్ర్ నమాజ్‌ను బాగా తెల్లవారబోతుందనగా చేయండి." (దీనిని ఐదుగురు - అంటే అబూదావూద్, తిర్మిజీ, నసాయి, అహ్మద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. తిర్మిజీ మరియు ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

హనఫీ ఫికహ్ ననుసరించేవారు ఈ హదీసు ఆధారంగానే ఫజ్ర్ నమాజ్‌ను ఆఖరివేళలో చేయటం ఉత్తమమని భావిస్తారు. అయితే దైవప్రవక్త (సఅసం) వారి నిరంతర ఆచరణను, ధర్మ ఖలీఫాల ఆచరణను, అత్యధిక సహాబీల, వారి శిష్యుల అనుసరణనుబట్టి చూస్తే ఆలస్యంగా చేయాలన్న నిదర్శనం ప్రబలంగా కనిపించదు. అబూదావూద్‌లో హజ్రత్ అబూ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఫజ్ర్ నమాజ్‌ను ఒకసారి చీకటి ఉండగా చేశారు, ఒకసారి తెల తెలవారుతుండగా కూడా చేశారు. ఆ తరువాత ఆయన (స) జీవితాంతం చీకటి ఉండగానే నమాజ్ చేసేవారు. తెల్ల వారబోతుందన్న సూచన ప్రస్ఫుటం అయినట్లు గమనించి నమాజ్ ఆచరించండన్నదే అసలు ఈ హదీసు భావార్థం. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) తదితరులు వక్కాణించినట్లు తెల్లవారబోతుందన్న విషయంలో అనుమానానికి ఆస్కారం ఉండకూడదు.

(١٣٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «مَنْ أَدْرَكَ مِنَ الصُّبْحِ رَكْعَةً قَبْلَ أَنْ تَطْلُعَ الشَّمْسُ فَقَدْ أَدْرَكَ الصُّبْحَ، وَمَنْ أَدْرَكَ رَكْعَةً مِنَ الْعَصْرِ

135. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: "సూర్యోదయం కాకపూర్వమే ఎవరు ఫజ్ర్ నమాజ్‌లోని ఒక రకత్‌ను పూర్తి చేశాడో అతడు ఉదయం నమాజ్‌ను పొందాడు. మరెవరు సూర్యాస్తమయానికి మునుపే

قَبْلَ أَنْ تَغْرُبَ الشَّمْسُ فَقَدْ أَدْرَكَ الْعَصْرَ». مُتَّفَقٌ عَلَيْهِ.

అస్ర్ నమాజ్‌లోని ఒక రకత్‌ను నెర వేర్చాడో అతడు అస్ర్ నమాజ్‌ను పొందాడు.'' (బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا نَحْوُهُ، وَقَالَ: «سَجْدَةً» بَدَلَ «رَكْعَةً» ثُمَّ قَالَ: وَالسَّجْدَةُ إِنَّمَا هِيَ الرَّكْعَةُ.

ముస్లింలో హ|జత్ ఆయిషా (ర.అన్హా) హదీసులో కూడా ఇదేవిధంగా చెప్ప బడింది. అయితే రకత్ స్థానంలో సజ్దా అనే పదం వచ్చింది. సజ్దా కూడా రకత్‌లో అంతర్భాగమే కదా అని కూడా అనబడింది.

**సారాంశం**

సరిగ్గా సూర్యోదయం, సూర్యాస్తమయం అవుతున్న సమయంలో నమాజ్ చేయటం నిషిద్ధం. కాని ఒకవేళ ఎవరయినా ముందే నమాజ్‌ను ప్రారంభించి ఉండగా సూర్యోదయ సమయం లేక సూర్యాస్తమయ సమయం ఆసన్నమైతే అప్పుడు ఆ వ్యక్తి నమాజ్‌ను పూర్తి చేసుకోవాలి. అతని నమాజ్ నెరవేరుతుందనటంలో సంశయానికి తావు లేదు.

(١٣٦) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللَّهِ ﷺ يَقُولُ: «لاَ صَلاَةَ بَعْدَ الصُّبْحِ حَتَّى تَطْلُعَ الشَّمْسُ وَلاَ صَلاَةَ بَعْدَ الْعَصْرِ حَتَّى تَغِيبَ الشَّمْسُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلَفْظُ مُسْلِمٍ: «لاَ صَلاَةَ بَعْدَ صَلاَةِ الْفَجْرِ».

136. హ|జత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) వివరించారు: నేను దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఉద్బోధించగా విన్నాను - "ఉదయం నమాజ్ నెరవేర్చిన తరువాత సూర్యోదయం వరకూ మరే నమాజూ లేదు. అలాగే అస్ర్ నమాజ్ నెరవేర్చిన తరువాత సూర్యాస్తమయం వరకూ ఏ నమాజూ లేదు (చేయటం ధర్మసమ్మతం కాదు). (బుఖారీ, ముస్లిం)

وَلَهُ عَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: ثَلاَثُ سَاعَاتٍ كَانَ رَسُولُ اللَّهِ ﷺ يَنْهَانَا أَنْ نُصَلِّيَ فِيهِنَّ وَأَنْ نَقْبُرَ فِيهِنَّ مَوْتَانَا: حِينَ تَطْلُعُ الشَّمْسُ بَازِغَةً حَتَّى تَرْتَفِعَ، وَحِينَ يَقُومُ قَائِمُ الظَّهِيرَةِ حَتَّى تَزُولَ الشَّمْسُ، وَحِينَ تَتَضَيَّفُ الشَّمْسُ لِلْغُرُوبِ.

"ఫ|జ్ నమాజ్ తరువాత మరే నమాజూ లేదు"అని ముస్లింలో ఉంది. ముస్లింలో (నే) ఉఖ్‌బా బిన్ ఆమిర్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది: మేము మూడు వేళల్లో నమాజ్ చేయడాన్నీ, మృతుని అంత్యక్రియలు జరపటాన్నీ దైవప్రవక్త (స) వారించేవారు. మొదటిది: సూర్యో

وَالْحُكْمُ الثَّانِيْ عِنْدَ الشَّافِعِيِّ رَحِمَهُ اللَّهُ تَعَالَى مِنْ حَدِيْثِ أَبِي هُرَيْرَةَ بِسَنَدٍ ضَعِيفٍ، وَزَادَ: «إِلاَّ يَومَ الْجُمُعَةِ» وَكَذَا لِأَبِيْ دَاوُدَ عَنْ أَبِي قَتَادَةَ نَحْوَهُ.

దయం అయ్యే వేళ. అది పైకెక్కేవరకూ (ఈ రెండు పనులు చేయరాదు). రెండవది: నడినెత్తి మీదికొచ్చిన సూర్యుడు వాలేవరకూ. మూడవది: సూర్యాస్తమయం అయ్యే వేళ. రెండవ ఆజ్ఞను (అంటే మిట్ట మధ్యాహ్నవేళ నమాజ్ చేయరాదన్న ఆజ్ఞను) ఇమామ్ షాఫయి (రహ్మ.లై) హజ్రత్ అబూ హురైర (రజి) నుండి బలహీన (జయీఫ్) ఆధారాలతో ఉల్లేఖించారు. అయితే ఇందులో **'ఇల్లా యౌమల్ జుముఅ'** అనే పదాలు అదనంగా ఉన్నాయి. (అంటే మిట్ట మధ్యాహ్న వేళ నమాజ్ చేయకండి. కాని శుక్రవారం నాడు చేయవచ్చు). అబూ దావూద్ కూడా హజ్రత్ అబూ ఖతాదా (రజి) నుండి హజ్రత్ అబూ హురైర (రజి) తరహా ఉల్లేఖనాన్ని నకలు చేశారు. (అందులో కూడా శుక్రవారం మినహాయింపు ఉంది)

### సారాంశం

ఈ హదీసులో నిషిద్ధ వేళల్లో చేయకూడని పనుల గురించి వివరించబడింది. వీటిలో మొదటిది: 'శవాన్ని మూడు వేళల్లో ఖననం చేయకూడదు.' ఇందులో జనాజా నమాజ్ కూడా వచ్చేస్తుంది. ఏదైనా అనివార్యమయిన పరిస్థితి ఏర్పడితే అప్పుడు అంత్యక్రియలు జరపవచ్చు.

రెండవది: మిట్ట మధ్యాహ్నవేళ. సూర్యుడు నడినెత్తి మీదికొచ్చినపుడు - అది పడమటి దిక్కుకు వాలే వరకూ నమాజ్‌గానీ, జనాజా నమాజ్‌గానీ చేయరాదు. ఆ సమయంలో శవాన్ని ఖననం కూడా చేయకూడదు. అయితే శుక్రవారానికి మినహాయింపు ఉంది. ఆ సమయంలో నఫిల్ నమాజులు చేసుకోవచ్చు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృక్పథం కూడా ఇదే. శుక్రవారం నాడు సూర్యుడు వాలుతున్న సమయంలో జుమా నమాజు కూడా చేయవచ్చు. హజ్రత్ అబూ హురైర (రజి) నుండి ఉటంకించిన హదీసులలో కూడా ఈ సంగతి వచ్చింది.

మూడవ ఆజ్ఞ : సూర్యాస్తమయ సమయంలో కూడా జనాజా నమాజ్ చేయటంగానీ, శవాన్ని పూడ్చి పెట్టడంగానీ చేయరాదు. ఉదయించిన సూర్యుడు "పైకెక్కే వరకూ..." అని హదీసులో వచ్చింది. దీని భావం ఏమిటి? అబూదావూద్, నసాయి తదితర ఉల్లేఖనాలలో దీని ఎత్తు ఒకటి లేక రెండు ఈటెలకు సమానమని చెప్పబడింది. అంటే సూర్యుడు తూర్పు దిక్కున ఒకటి లేక

రెండు ఈటెలకు సమానమైన ఎత్తుకు చేరుకోగలిగితే అప్పుడు నమాజ్ చేసేందుకు అనుమతి ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉఖ్‌బా బిన్ ఆమిర్ (రజి) మారు పేరు అబూ హమ్మాద్ లేక అబూ ఆమిర్. హిజ్రత్ చేసినవారిలో ఈయనా ఉన్నారు. దైవగ్రంథాన్ని మధురాతి మధురంగా పారాయణం చేసేవారు. ధర్మ శాస్త్ర కోవిదులు. ధర్మవేత్త అవటంతోపాటు మంచి కవి కూడా. బస్రాలో స్థిరపడ్డారు. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అమీర్ ముఆవియ (రజి) పక్షాన నిలిచారు. మూడేండ్లు ఈజిప్టు గవర్నర్‌గా ఉన్నారు. సముద్రతీర యుద్ధాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈజిప్టులో హిజ్రీ 58లో మరణించారు. 'ముఖ్తామ్'లో అంత్యక్రియలు జరిగాయి.

(١٣٧) وعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يَا بَنِي عَبْدِ مَنَافٍ لاَ تَمْنَعُوا أَحَداً طَافَ بِهَذَا الْبَيْتِ، وَصَلَّى أَيَّةَ سَاعَةٍ شَآءَ مِنْ لَيْلٍ أَوْ نَهَارٍ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

137. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "ఓ అబ్దె మునాఫ్ సంతతి వారలారా! దైవ గృహ ప్రదక్షిణ చేసేవారి నెవరినీ వారించటంగానీ, నమాజ్ చేసేవారిని ఆపటం గానీ చేయకండి - వారు ఏ ఘడియలో ఈ పని చేసినాసరే (చేయనివ్వండి). (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లైదుగురూ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

కాబా ప్రాంగణంలో చేయబడే ఏ నమాజ్ గురించి ఈ హదీసులో చెప్పబడింది? కాబా ప్రదక్షిణ అనంతరం చేసుకునే 'నఫిల్ నమాజుల'ని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. సాధారణ నఫిల్ నమాజులు మాత్రం కాదు. కాని అబూదావూద్‌లో పేర్కొనబడిన ఒక హదీసు ప్రకారం ఈ నమాజులు సాధారణ నఫిల్ నమాజులేనని విదితమవుతోంది. మరో ముఖ్య విషయం - మూడు వేళల్లో నమాజ్ చేయరాదన్న ఆజ్ఞ కాబా ప్రాంగణంలో చేసే నమాజులకు వర్తించదని అత్యధికమంది పండితులు అభిప్రాయపడుతున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

(1) జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) గారి మారు పేరు అబూ ముహమ్మద్ లేక అబూ ఉమయ్యా. పూర్తి పేరు జుబైర్ బిన్ ముత్‌యిమ్ బిన్ అదీ బిన్ నౌఫల్ ఖురషీ. మృదు స్వభావులు.

మర్యాదస్తులు. ఖురైష్ వంశీయుల వంశపరంపరను చెప్పటం ఆయనకు కొట్టిన పిండి. మక్కా విజయానికి పూర్వం ఇస్లాం స్వీకరించి మదీనా వచ్చారు. ఈయన మరణ సమయం గురించి అభిప్రాయభేదం ఉంది. హిజ్రీ 54 లేదా 57 లేదా 59లో మరణించారని చెప్పబడుతోంది.

(2) హదీసులో అబ్దె మునాఫ్ ప్రస్తావన వచ్చింది. అబ్దె మునాఫ్ అంటే మునాఫ్ దాసుడు, మునాఫ్ బానిస అని అర్థం. పూర్వం 'మునాఫ్' అనే విగ్రహం ఉండేది. తల్లిగారు ఈయన్ని ఆ దేవతకు సేవకునిగా అంకితం చేసింది. ఈ కారణంగా ఈయన అబ్దె మునాఫ్‌గా పేరు మోసారు. వాస్తవానికి ఈయన పేరు ముగైరా. అబూ అబ్దుష్షమ్స్ అనేది మారుపేరు. బనూ మఖ్జూమ్ మరియు బనూ అబ్దె మునాఫ్ అనే రెండు తెగలతోనూ ఈయనకు సంబంధం ఉండేది. ఇంతకీ ఈ అబ్దె మునాఫ్ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ముత్తాత గారన్న సంగతి మరువరాదు. ఖురైషు సర్దారులలో అత్యంత గౌరవనీయులుగా పరిగణించబడ్డారు.

(١٣٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**الشَّفَقُ الْحُمْرَةُ**». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَ ابْنُ خُزَيْمَةَ وَغَيْرُهُ وَقْفَهُ.

138. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) చెప్పారు: "షఫఖ్ అంటే ఎరుపు అని అర్థం." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమా దీనిని ప్రామాణికం అని అనగా ఇతరులు 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

'షఫఖ్' అంటే సూర్యాస్తమయం అయిన తరువాత ఆకాశపుటంచున ప్రస్ఫుటమయ్యే అరుణిమ చారలు అని భావం. ఈ నిర్వచనంపై ఇమాములందరూ, నిఘంటువు కర్తలు కూడా ఏకీభవిస్తున్నారు. కాని ఒక్క ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం దీంతో విభేదించారు. ఎరుపుదనం పోయిన తరువాత ఏర్పడే తెలుపుదనమే 'షఫఖ్' అంటారాయన. ఆయన ప్రియాతి ప్రియమైన శిష్యులిరువురు కూడా 'షఫఖ్' ను 'ఎరుపు' అన్న భావంలోనే తీసుకున్నారు మరి!

(١٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**الْفَجْرُ فَجْرَانِ، فَجْرٌ يُحَرِّمُ الطَّعَامَ وَتَحِلُّ فِيهِ الصَّلَاةُ، وَفَجْرٌ تَحْرُمُ فِيهِ الصَّلَاةُ**، أَيْ صَلَاةُ الصُّبْحِ، **وَيَحِلُّ فِيهِ الطَّعَامُ**». رَوَاهُ ابْنُ خُزَيْمَةَ

139. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సఅసం) ప్రవచించారు - "ఫజ్ర్ రెండు రకాలు. ఒక రకపు ఫజ్ర్‌లో (ఉపవాసికోసం) తినటం హరామ్ (నిషిద్ధం), నమాజ్ చేయటం హలాల్ (ధర్మసమ్మతం). రెండవ రకపు ఫజ్ర్‌లో నమాజ్ చేయటం హరామ్, తినటం హలాల్." (ఇబ్నె

وَالْحَاكِمُ، وَصَحَّحَاهُ، وَلِلْحَاكِمِ مِنْ حَدِيثِ جَابِرٍ نَحْوُهُ، وَزَادَ فِي الَّذِي يُحَرِّمُ الطَّعَامَ: إِنَّهُ يَذْهَبُ مُسْتَطِيلاً فِي الْأُفُقِ. وَفِي الآخَرِ: «إِنَّهُ كَذَنَبِ السِّرْحَانِ».

ఖుజైమ, హాకిమ్ దీనిని ఉల్లేఖించారు. ఇరువురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

ముస్త్రదక్ హాకిమ్‌లో జాబిర్ (రజి) చేత కూడా ఇలాగే ఉటంకించబడింది. అయితే అందులో ఈ వాక్యం అదనంగా ఉంది: "ఏ ఫజ్ర్‌లో తినటం నిషిద్ధమో అది ఆకాశపుటంచుల్లో, పరిసరాల్లో విస్తృతంగా విస్తరిల్లిపోతుంది. రెండవ కోవకు చెందినది; గొఱ్ఱె తోకలా ప్రస్ఫుట మవుతుంది."

**సారాంశం**

ఫజ్ర్ రెండు రకాలు. ఒకటి: సుబహ్ సాదిఖ్. రెండు: సుబహ్ కాజిబ్. మొదటి రకం ఫజ్ర్‌లో తెల్లవారే సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. రెండవ రకం ఫజ్ర్‌లో చీకటి అలుముకుని ఉంటుంది. చీకటి అలుముకుని వున్న ఫజ్ర్‌లో ఉపవాసం పాటించేవారు సహ్‌రీ చేస్తారు. తెల తెలవారుతుండగా ఫజ్ర్ నమాజ్ చేస్తారు. ఈ రెండు ఆచరణలకు మధ్య కొద్దిపాటి విరామం కూడా ఉంటుంది. సహ్‌రీ వేళల్లో ఫజ్ర్ నమాజ్ నిషేధించబడగా ఫజ్ర్ నమాజ్ వేళలో భోజనాదులు నిషేధించబడ్డాయి. ఇదీ ఈ హదీసు సారాంశం.

(١٤٠) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَفْضَلُ الْأَعْمَالِ الصَّلَاةُ فِي أَوَّلِ وَقْتِهَا». رَوَاهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ، وَصَحَّحَاهُ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ.

140. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "తొలివేళలో చేసే నమాజ్ ఆచరణల న్నింటిలోకీ శ్రేష్ఠమైనది." (తిర్మిజీ, హాకిమ్‌లు దీనిని ఉల్లేఖించటమేగాక, ఇరువురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. హదీసు మూలం మాత్రం బుఖారీ, ముస్లింలలో ఉంది).

**సారాంశం**

ఈ హదీసులో నమాజును తొలి వేళల్లో చేయటాన్ని అన్నింటికన్నా ఉత్తమమయిన ఆచరణగా చెప్పటం జరిగింది. కాగా; ఇతర హదీసులలో ఈమాన్ (విశ్వాసం), సదఖా (దానం), జిహాద్

(ధర్మయుద్ధం)లను శ్రేష్ఠమయిన ఆచరణలుగా పేర్కొనటం జరిగింది. నిజానికి ఈ హదీసులన్నీ ఆయా కోణాల నుంచి సరైనవే. వాటిమధ్య గల సమన్వయం, సమరసం ఈ విధంగా ఉంది: ఈమాన్- అంటే విశ్వాసం మనసుతో, అంతరాత్మతో ముడిపడి ఉంది. కాబట్టి మానసిక ఆచరణలన్నింటిలోకీ శ్రేష్ఠమైనది విశ్వాసం. నమాజ్ శరీరంతో ముడిపడి ఉంది. కనుక శారీరకమయిన సత్కార్యాలన్నింటిలోకీ శ్రేష్ఠమైనది నమాజ్. దానధర్మాల సంబంధం ధనంతో ఉంది. కాబట్టి ధనసంబంధమైన ఆచరణల్లోకెల్లా ఉత్తమమైనది దానం. కాగా; జిహాద్ యుక్త వయస్సుతో, పోరాటపటిమతో, శక్తితో, ఆరోగ్యంతో ముడిపడి ఉంది. ఈ శక్తి సామర్థ్యాలను ఎవరు దైవమార్గంలో అర్పిస్తారో వారి పాలిట జిహాద్ అన్నింటికన్నా గొప్ప ఆచరణ అవుతుంది. ఈ విధంగా ఈ హదీసుల మధ్య పరస్పర సానుకూలత, పరస్పర ప్రయోజనాలు ఉన్నాయి. తొలివేళల్లో నమాజ్ ఆచరించాలన్న ప్రబోధనం ఒక్క ఇషా నమాజ్‌కు తప్ప మిగిలిన అన్ని నమాజులకూ వర్తిస్తుంది.

(١٤١) وَعَنْ أَبِي مَحْذُورَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «أَوَّلُ الْوَقْتِ رِضْوَانُ اللهِ، وَأَوْسَطُهُ رَحْمَةُ اللهِ، وَآخِرُهُ عَفْوُ اللهِ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ بِسَنَدٍ ضَعِيفٍ جِدًّا وَلِلتِّرْمِذِيِّ مِنْ حَدِيثِ ابْنِ عُمَرَ نَحْوُهُ دُونَ الْأَوْسَطِ وَهُوَ ضَعِيفٌ أَيْضاً.

141. హజ్రత్ అబూ మహ్‌జూర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "తొలివేళ (లో చేసే నమాజ్) దైవప్రసన్నతను చూరగొనే సాధనం. మధ్యవేళ (లో చేసే నమాజ్) దైవ కారుణ్యానికి మూలం. ఆఖరివేళ(లో చేసే నమాజ్) రాయితీతో కూడుకున్నది." (దారె ఖుత్నీ దీనిని అత్యంత బలహీనమయిన ఆధారంతో ఉల్లేఖించారు. తిర్మిజీలో ఇబ్నె ఉమర్ (రజి) హదీసు కూడా ఇలాగే ఉందిగానీ అందులో 'మధ్యవేళ' గురించిన ప్రస్తావన లేదు. అయితే ఇది కూడా బలహీనమైనదే).

**సారాంశం**

పై హదీసు అందిన తీరులోనూ, మధ్యలో దాన్ని అందించిన వారి పరంపరలో లోపాలుండటం చేతనూ హదీసువేత్తలు దీనిని అత్యంత జయీఫ్ (బలహీన) హదీసుగా నిర్ధారించారు. ఈ హదీసును సేకరించటానికి యాఖూబ్ బిన్ వలీద్ అనే వ్యక్తి సహాయం తీసుకోవలసివచ్చింది. అతని గురించి ఇమాములకు, హదీసువేత్తలకు సదభిప్రాయం లేదు. ఇమామ్ నసాయి (రహ్మ.లై) గారైతే, ఇతన్ని పూర్తిగా ఉపేక్షించారు. ఇబ్నె హిబ్బాన్‌గారైతే, ఇతడు హదీసులను కల్పించేవాడని ఆరోపించారు. విమర్శకుల, హదీసువేత్తల ఈ అభిప్రాయాలు ముందుకు వచ్చిన తరువాత ఈ హదీసు పరిగణణలోకి తీసుకోదగ్గది కాదని తేలిపోయింది.

### హదీసు ఉల్లేఖకులు

అబూ మహ్జూర (రజి) అసలు పేరు సముర లేక ఔస్. దైవప్రవక్త (స)చే నియమించబడిన ముఅజ్జిన్. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. మక్కాలోనే స్థిరపడ్డారు. ఐదు పూటల నమాజులకై అజాన్ పిలుపు ఇచ్చేవారు. హిజ్రీ 59లో మరణించారు.

(١٤٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «لَا صَلَاةَ بَعْدَ الْفَجْرِ إِلَّا سَجْدَتَيْنِ». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلَّا النَّسَائِيَّ.

142. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ఫజ్ర్ (ఫర్జ్ నమాజ్) తరువాత కేవలం రెండు రకతుల సున్నత్ తప్ప మరే (నఫిల్) నమాజూ లేదు." (నసాయి తప్ప మిగిలిన ఐదుగురూ దీనిని ఉల్లేఖించారు).

وَفِي رِوَايَةِ عَبْدِ الرَّزَّاقِ: «لَا صَلَاةَ بَعْدَ طُلُوعِ الْفَجْرِ إِلَّا رَكْعَتَيِ الْفَجْرِ» وَمِثْلُهُ لِلدَّارَقُطْنِيِّ عَنِ ابْنِ عَمْرِو بْنِ الْعَاصِ.

అబ్దుర్రజ్జాఖ్ ఉల్లేఖనంలో ఇలా వుంది- "తెల్లవారాక ఫజ్ర్ యొక్క కేవలం రెండు రకతులే ఉన్నాయి." (దారెఖుత్నీలో ఇబ్నె అమ్ర్ బిన్ ఆస్ - రజి - చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది).

### సారాంశం

ఈ హదీసు ప్రకారం ఫజ్ర్ అనంతరం రెండు రకతుల సున్నత్ నమాజ్ మినహా మరే నఫిల్ నమాజయినా చేయకూడదు.

(١٤٣) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: صَلَّى رَسُولُ اللهِ ﷺ الْعَصْرَ، ثُمَّ دَخَلَ بَيْتِي، فَصَلَّى رَكْعَتَيْنِ، فَسَأَلْتُهُ فَقَالَ: شُغِلْتُ عَنْ رَكْعَتَيْنِ بَعْدَ الظُّهْرِ فَصَلَّيْتُهُمَا

143. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అస్ర్ నమాజ్ చేసి నా కుటీరంలోకి విచ్చేశారు. రెండు రకతుల నమాజ్ చేశారు. 'ఈ రెండు రకతులు దేనికి సంబంధించినవి?' అని నేనాయన్ని (స) ప్రశ్నించాను. "జుహ్ర్ వేళ ఫర్జ్ నమాజ్ అనంతరం రెండు రకతుల నమాజ్ నెరవేర్చలేకపోయాను. దానిని ఇప్పుడు పూర్తి చేశాను" అని ఆయన (స) వివరించారు. 'ఈ రెండు రకతుల ఖజా మా

اَلْآنَ. قُلْتُ: أَفَنَقْضِيهِمَا إِذَا فَاتَتَا قَالَ: «لَا». أَخْرَجَهُ أَحْمَدُ، وِلِأَبِي دَاوُدَ عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا بِمَعْنَاهُ.

వల్ల కూడా ఎప్పుడయినా జరిగిపోతే మేము కూడా ఇలాగే పూర్తిచేయవచ్చా?' అని నేను అడిగాను. "లేదు" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. అబూదావూద్ హజ్రత్ ఆయిషా - ర.అన్‌హా - గారిచేత కూడా ఇలాగే ఉల్లేఖించబడింది)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే, వదలివేయబడిన సున్నతులను అస్ర్ నమాజ్ అనంతరం నెరవేర్చే వ్యవహారం ఒక్క దైవప్రవక్త (సఅసం)కే ప్రత్యేకం. ఇమామ్ తహావీ, అల్లామా యమానీల అభిప్రాయం కూడా ఇదే.

అయితే ఇమామ్ బైహఖీ, హాఫిజ్ ఇబ్నె హజర్‌ల దృక్పథం మరోవిధంగా ఉంది - "మేము కూడా ఇలా పూర్తి చేయవచ్చా?" అన్న హదీసులోని చివరి వాక్యం 'జయీఫ్' అనీ, ఖజా అయిపోయిన ఫర్జ్ నమాజులయినా, సున్నత్‌లయినా అస్ర్ అనంతరం నెరవేర్చటం సమంజసమేననీ వీళ్లంటున్నారు. అబూదావూద్ వ్యాఖ్యాత షేఖ్ షమ్సుల్ హఖ్ ముహద్దిస్ డయాన్వీగారు "ఆలామ్ అహ్‌లుల్ అస్ర్"లో దీని గురించి బహుచక్కగా చర్చించారు.

## 2వ అధ్యాయం

## అజాన్

## ٢ - بَابُ الْأَذَانِ

(١٤٤) عَنْ عَبْدَ اللّٰهِ بِنْ زَيْدِ بن عَبْدِ رَبِّهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: طَافَ بِي — وَأَنَا نَائِمٌ — رَجُلٌ، فَقَالَ: تَقُولُ «اللّٰهُ أَكْبَرُ اللّٰهُ أَكْبَرُ» فَذَكَرَ الْأَذَانَ بِتَرْبِيعِ التَّكْبِيرِ بِغَيْرِ تَرْجِيعٍ، وَالإِقَامَةَ فُرَادَى، إِلَّا «قَدْ قَامَتِ الصَّلَاةُ» قَالَ: فَلَمَّا أَصْبَحْتُ أَتَيْتُ رَسُولَ اللّٰهِ

144. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దె రబ్బిహి (రజి) ఇలా వివరించారు: కలలో నాకు ఒక వ్యక్తి కానవచ్చాడు. అతడు నాకు 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్' అని పలకమని చెప్పాడు. ఆ తరువాత అతను అజాన్ అంతటినీ వినిపించాడు. అల్లాహు అక్బర్ అని- తర్జీ లేకుండా - నాలుగు సార్లు చెప్పాడు. ఇఖామత్‌లో (ని పదాలు) ఒక్కొక్కసారి పలికాడు. అయితే 'ఖద్ ఖామతిస్స లాహ్' మాత్రం రెండుసార్లు పలికాడు. తెల్లవారిన తరువాత నేను దైవప్రవక్త

ﷺ، فقال: «إِنَّهَا لَرُؤْيَا حق»، الحديث أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَصَحَّحَهُ التِّرمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

(సఅసం) సమక్షంలో హాజరయ్యాను (కలలో జరిగినదంతా చెప్పాను). "నిస్సందేహంగా ఈ కల నిజమైనది" అని ఆయన (సఅసం) అన్నారు. (ఈ హదీసును అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

وَزَادَ أَحْمَدُ فِي آخِرِهِ قِصَّةَ قَوْلِ بِلَالٍ فِي أَذَانِ الْفَجْرِ «الصَّلَاةُ خَيْرٌ مِنَ النَّوْمِ».

ఈ ఉల్లేఖనంలో అహ్మద్ హజ్రత్ బిలాల్ (రజి) గారి ఫజ్ర్ అజాన్‌లో - అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్" - వృత్తాంతాన్ని కూడా విశదీకరించారు.

وَلِابْنِ خُزَيْمَةَ عَنْ أَنَسٍ قَالَ: مِنَ السُّنَّةِ إِذَا قَالَ الْمُؤَذِّنُ فِي الْفَجْرِ «حَيَّ عَلَى الْفَلَاحِ» قَالَ: «الصَّلَاةُ خَيْرٌ مِنَ النَّوْمِ».

ఇబ్నె ఖుజైమాలో హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనంలో ఆయన ఇలా అన్నారు: "ముఅజ్జిన్ ఫజ్ర్ నమాజ్‌కై ఇచ్చే అజాన్‌లో 'హయ్యా అలల్ఫలాహ్' అన్న తరువాత 'అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్' అని పలకటం సున్నత్ (సంప్రదాయం)."

**సారాంశం**

హిజ్రత్ చేసిన మొదటి సంవత్సరం మదీనాలో దైవప్రవక్త (స) సహచరులను సమావేశపరచి సామూహిక నమాజ్‌కై ప్రజలను పిలిచే పద్ధతి గురించి సంప్రతించారు. ఒక్కొక్కరు ఒక్కో సలహా ఇచ్చారు. శంఖం ఊదాలని ఒకరు, ఎత్తయిన స్థలంలో మంట పెట్టాలని మరొకరు, బిగులు వినిపించాలని ఇంకొకరు - తలా ఒక విధంగా సూచించారు. హజ్రత్ ఉమర్ (రజి) మాత్రం అజాన్ పిలుపు ఇవ్వాలని సూచించారు. దైవప్రవక్త (స)కు ఈ సలహా నచ్చింది. బిగ్గరగా అజాన్ పలకమని ఆయన (స) హజ్రత్ బిలాల్ (రజి)ను ఆదేశించారు. ఈ సందర్భంగానే ఈ హదీసు ఉల్లేఖకులైన అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) కూడా కలగన్నారు. కలలో ఒక వ్యక్తి శంఖం పట్టుకుని ఉన్నాడు. 'దేవుని దాసుడా! ఈ శంఖం అమ్ముతావా?' అని అబ్దుల్లా బిన్ జైద్ అతన్ని అడిగారు. 'దీంతో నీకేంపని?' అని ఆ వ్యక్తి ఎదురు ప్రశ్న వేశాడు. 'మేము దీని సహాయంతో జనులను సామూహిక నమాజ్ కోసం పిలుస్తాము' అని ఆయన జవాబిచ్చారు. 'నేను నీకు ఇంతకన్నా మంచి పద్ధతి తెలుపనా?' అన్నాడు. 'తప్పకుండా తెలుపు' అని అబ్దుల్లా బిన్ జైద్ చెప్పారు. అప్పుడా వ్యక్తి ప్రస్తుత అజాన్ మరియు ఇఖామత్ పలుకులను నేర్పాడు.

## హదీసు ఉల్లేఖకులు

(1) అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దె రబ్బిహి (రజి). ఈయన మరోపేరు అబూ ముహమ్మద్. అన్సార్‌కు చెందిన ఖజ్రజ్‌తో సంబంధమున్నందున అన్సారీ, ఖజ్రజీగా వ్యవహరించబడేవారు. బద్ర్ యుద్ధం తప్ప ఇతర యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రత్ మొదటి సంవత్సరంలో ఈయన కలలో ప్రస్తుత అజాన్‌ను ఆస్వాదించారు. ఈ సంఘటన మస్జిదె నబవీ నిర్మాణం తర్వాత జరిగింది. ఈయన హిజ్రీ 32లో 64 యేండ్ల వయస్సులో మరణించారు.

(2) బిలాల్ (రజి). 'తైమ్' తెగకు చెందినవారు. పూర్తిపేరు బిలాల్ బిన్ రిబాహ్. స్వేచ్ఛ నొసగబడిన బానిస. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో వర్ణనాతీతమయిన బాధలకు, వేధింపులకు గురయ్యారు. కాని సత్యమార్గంనుండి ఏమాత్రం తొణకలేదు. దైవప్రవక్త (స) గారి ముఅజ్జిన్. దైవప్రవక్త (స) మరణానంతరం ఈయన అజాన్ ఇవ్వటం మానేశారు. మదీనా నగరాన్ని విడిచిపెట్టి డెమాస్కస్‌లో స్థిరపడ్డారు. హిజ్రీ 17 లేక 18వ సంవత్సరంలో 60 పైచిలుకు వయస్సులో మరణించారు. ఈయనకు సంతానం లేదు.

(١٤٥) وَعَنْ أَبِي مَحْذُورَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ عَلَّمَهُ الأَذَانَ، فَذَكَرَ فِيهِ التَّرْجِيعَ. أَخْرَجَهُ مُسْلِمٌ، وَلٰكِنْ ذَكَرَ التَّكْبِيرَ فِي أَوَّلِهِ مَرَّتَيْنِ فَقَطْ، وَرَوَاهُ الْخَمْسَةُ فَذَكَرُوهُ مُرَبَّعاً.

145. హజ్రత్ అబూ మహ్‌జూర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు అజాన్ నేర్పారు. అందులో ఆయన 'తర్జీ' గురించి ప్రస్తావించారు. (ముస్లిం దీనిని ఉల్లేఖించారు. అయితే ఇందులో మొదటి సారి 'అల్లాహు అక్బర్'ను రెండుసార్లు పలికినట్లు ఉంది. అబూ మహ్‌జూర (రజి) చేత ఉల్లేఖించబడిన హదీసును ఐదుగురూ పొందుపరచారు. 'అల్లాహు అక్బర్'ను ప్రథమంలో నాలుగుసార్లు పలికినట్లు వీరు పేర్కొన్నారు).

## సారాంశం

"అల్లాహు అక్బర్" అనే పదాన్ని మొదట్లో రెండుసార్లు కాదు, నాలుగుసార్లు పలకటమే సరైనదని పై హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అజాన్ కోసం పెద్ద కంఠం, మంచి కంఠం గలవారిని ఎన్నుకోవాలి. ఈ ఎంపిక నిమిత్తం 'అజాన్ పోటీలు' నిర్వహించినట్లుగా కూడా చరిత్రలో ఆధారాలున్నాయి.

(١٤٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أُمِرَ بِلَالٌ أَنْ يَشْفَعَ الأَذَانَ، وَيُوتِرَ الإِقَامَةَ

146. హజ్రత్ అనస్ (రజి) కథనం: అజాన్ వచనాలు రెండేసిసార్లు, తక్బీర్ (ఖద్ ఖామతిస్సలాహ్) తప్ప మిగిలిన

إلاَّ الإقَامَةَ. يَعْنِي إلاَّ قَوْلَهُ. قَدْ قَامَتِ الصَّلاَةُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَلَمْ يَذْكُرْ مُسْلِمٌ الاسْتِثْنَاءَ، وَلِلنَّسَائِيِّ: أَمَرَ النَّبِيُّ ﷺ بِلاَلاً.

వచనాలన్నీ ఒక్కోసారి పలకాలని హ్రజత్ బిలాల్ (రజి)కు ఆదేశించబడింది.

(బుఖారీ, ముస్లిం)

అయితే ముస్లింలో 'ఖద్‌ఖామతిస్స లాహ్' వినాయింపు గురించిన ప్రస్తావన లేదు. 'దైవప్రవక్త (సఅసం) బిలాల్‌కు ఆజ్ఞాపించార'ని నసాయిలో ఉంది.

**సారాంశం**

హ్రజత్ అనస్ (రజి) హదీసులో ఆదేశమిచ్చిన వారు ఎవరో కాదు, దైవప్రవక్తే (స). అజాన్‌లో ఒక్కో వచనం రెండేసిసార్లు పలకాలి. ఇఖామత్‌లో ఒక్కో వచనం ఒక్కోసారి మాత్రమే పలకాలి. ఒక్క 'ఖద్‌ఖామతిస్సలాత్' వచనం మాత్రం రెండుసార్లు పలకాలని భావం.

(١٤٧) وَعَنْ أَبِي جُحَيْفَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ بِلاَلاً يُؤَذِّنُ، وَأَتَتَبَّعُ فَاهُ هٰهُنَا وَهٰهُنَا، وَإِصْبَعَاهُ فِي أُذُنَيْهِ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرمِذِيُّ، وَصَحَّحَهُ.

147. హ్రజత్ అబూ జుహైఫా (రజి) కథనం: అజాన్ ఇస్తుండగా నేను బిలాల్ (రజి)ను చూచాను. ఆయన తన ముఖాన్ని అటూ ఇటూ తిప్పేవారు. అప్పుడు ఆయన చూపుడు వ్రేళ్లు ఆయన రెండు చెవులలో ఉండేవి. (అహ్మద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు).

وَلابْنِ مَاجَهْ: وَجَعَلَ إِصْبَعَيْهِ فِي أُذُنَيْهِ. وِلأبِي دَاوُدَ: لَوَى عُنُقَهُ لَمَّا بَلَغَ «حَيَّ عَلَى الصَّلاَةِ» يَمِيناً وَشِمَالاً، وَلَمْ يَسْتَدِرْ. وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ.

ఇబ్నె మాజా ఉల్లేఖనంలో ఉంది - "ఆయన తన వ్రేళ్లను తన చెవులలో పెట్టుకున్నారు." అబూదావూద్‌లో ఇలా వుంది: "హయ్య అలస్సలాహ్ అని అనేటప్పుడు తన కుడి ఎడమల వైపునకు కొద్దిగా ముఖం తిప్పేవారంతే. పూర్తిగా తిరిగేవారు కాదు." దీని మూలం 'సహీహైన్'లో ఉంది.

**సారాంశం**

ఖిబ్లా వైపునకు తిరిగి అజాన్ ఇవ్వటం సంప్రదాయం. అలాగే 'హయ్య అలస్సలాహ్'

అనేటప్పుడు కుడివైపునకు, 'హయ్య అలల్‌ఫలాహ్' అనేటప్పుడు ఎడమవైపునకు కేవలం ముఖం త్రిప్పటం కూడా సంప్రదాయమే. అజాన్ పిలుపు ఇచ్చే సమయంలో వ్రేళ్ళను చెవులలో పెట్టుకోవటం వల్ల రెండు లాభాలున్నాయి. దీనివల్ల శబ్దం బిగ్గరగా వినవస్తుంది. అజాన్ వినలేని చెవిటివాడు ముఅజ్జిన్ యొక్క ఈ దృశ్యం చూచి అజాన్ ఇవ్వబడుతుందని గ్రహించగలుగుతాడు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ జుహైఫా (రజి) మారుపేరు. అసలు పేరు వహబ్ బిన్ అబ్దుల్లాహ్ సువాయి. సువాయి ఆమిరీగా ప్రసిద్ధిచెందారు. యువ సహచరులలో ఒకరుగా పరిగణించబడ్డారు. కూఫాలో స్థిరపడ్డారు. హ్రజత్ అలీ (రజి) తన పరిపాలనా కాలంలో ఈయన్ని కోశాధికారిగా నియమించారు. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. హిజ్రీ 74లో కూఫాలోనే మరణించారు.

(١٤٨) وَعَنْ أَبِي مَحْذُورَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أَعْجَبَهُ صَوْتُهُ فَعَلَّمَهُ الأَذَانَ. رَوَاهُ ابْنُ خُزَيْمَةَ.

148. హ్రజత్ అబూ మహ్‌జూర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) కు ఈయన కంఠస్వరం ఎంతగానో నచ్చింది. అందువల్ల ఆయన (స) ఈయన (అబూ మహ్‌జూర) కు అజాన్ తర్ఫీదు ఇచ్చారు. (ఇబ్నె ఖుజైమ)

## సారాంశం

ముఅజ్జిన్‌లను ఎంపిక చేసేటప్పుడు, నియమించేటప్పుడు వారి కంఠస్వరాన్ని తప్పకుండా పరిగణన లోకి తీసుకోవాలన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. మధురమైన స్వరం హృదయాలను ఆకట్టుకుంటుంది. సత్యం గురించి ఆలోచింపజేస్తుంది.

(١٤٩) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ الْعِيدَيْنِ، مِنْ غَيْرِ مَرَّةٍ وَلاَ مَرَّتَيْنِ، بِغَيْرِ أَذَانٍ وَلاَ إِقَامَةٍ. رَوَاهُ مُسْلِمٌ، وَنَحْوُهُ فِي الْمُتَّفَقِ عَلَيْهِ عَنِ ابْنِ عَبَّاسٍ وَغَيْرِهِ.

149. హ్రజత్ జాబిర్ బిన్ సముర (రజి) తెలిపారు: నేను ఒకసారి కాదు, రెండు సార్లు కాదు, అనేకసార్లు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి పండుగ నమాజు చేశాను. ఇందు నిమిత్తం అజాన్‌గానీ, ఇఖామత్‌గానీ ఇవ్వబడేది కాదు. (దీనిని ముస్లిం ఉల్లేఖించారు. బుఖారీ, ముస్లింలలో హ్రజత్ ఇబ్నె అబ్బాస్ (రజి) చేత కూడా ఇలాగే పేర్కొనబడింది)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) కాలంలో పండుగ నమాజు సామూహికంగా చేయబడేదన్న దానికి ఈ హదీసు నిదర్శనం. అయినప్పటికీ అంత పెద్ద సమూహాన్ని సమావేశపర్చడానికి అజాన్‌గానీ, ఇఖామత్‌గానీ ఇవ్వబడేది కాదు. ముస్లిం అనుచర సమాజం ఆచరణ దీనికనుగుణంగానే ఉంది.

(١٥٠) وَعَنْ أَبِيْ قَتَادَةَ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ فِي الْحَدِيْثِ الطَّوِيْلِ فِيْ نَوْمِهِمْ عَنِ الصَّلَاةِ: ثُمَّ أَذَّنَ بِلَالٌ، فَصَلَّى النَّبِيُّ ﷺ كَمَا كَانَ يَصْنَعُ كُلَّ يَوْمٍ. رَوَاهُ مُسْلِمٌ.

150. హజ్రత్ అబూ ఖతాద (రజి) కథనం: (ఇదొక సుదీర్ఘమయిన హదీసు. ఇందులో ప్రయాణావస్థలో ప్రయాణ బడలిక మూలంగా గాఢ నిద్ర వచ్చి సకాలంలో మెలకువ రాలేదని చెప్పబడింది). నిద్రనుండి మెలకువ వచ్చిన తరువాత బిలాల్ (రజి) అజాన్ ఇచ్చారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి రోజూ నమాజ్ చేయించినట్లుగానే నమాజ్ చేయించారు. (ముస్లిం)

وَلَهُ عَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ عَنْهُ: أَنَّ النَّبِيَّ ﷺ أَتَى الْمُزْدَلِفَةَ، فَصَلّٰى بِهَا الْمَغْرِبَ وَالعِشَاءَ بِأَذَانٍ وَاحِدٍ وإِقَامَتَيْنِ.

ముస్లింలో జాబిర్ (రజి) కథనం ఇలా వుంది: దైవప్రవక్త (సఅసం) 'ముజ్దలిఫా' చేరుకున్నాక, అక్కడాయన మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ఒక అజాన్, రెండు ఇఖామత్‌లతో చేయించారు.

وَلَهُ عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُمَا: جَمَعَ النَّبِيُّ ﷺ بَيْنَ الْمَغْرِبِ وَالعِشَاءِ بِإِقَامَةٍ وَاحِدَةٍ. وَزَادَ أَبُو دَاوُدَ: «لِكُلِّ صَلَاةٍ» وَفِيْ رِوَايَةٍ لَهُ: وَلَمْ يُنَادِ فِي وَاحِدَةٍ مِنْهُمَا.

ముస్లింలోనే ఇబ్నె ఉమర్ (రజి) కథనం ఈ విధంగా ఉంది: దైవప్రవక్త (సఅసం) మగ్రిబ్ మరియు ఇషా నమాజులను కలిపి ఒకే ఇఖామత్‌తో చేశారు.

అబూదావూద్ అదనంగా ఈ వాక్యం చేర్చారు: ప్రతి నమాజు కోసం తక్బీర్ పలుకబడింది. ఈ రెండు నమాజులలో ఏ ఒక్కదానికై కూడా అజాన్ పిలుపు ఇవ్వబడలేదని అందులోనే మరో ఉల్లేఖనంలో అనబడింది.

**సారాంశం**

(అ) మెలకువ రాని సంఘటన ఫజ్ర్ నమాజ్‌కు సంబంధించినది. దైవప్రవక్త (స) ఖైబర్ నుండి తిరిగి వస్తున్న సందర్భంగా రాత్రి బాగా పొద్దుపోయాక ఒకచోట మకాం వేశారు. మేల్కొనే ఉండమనీ, ఫజ్ర్ నమాజ్ వేళ కాగానే అందరినీ మేల్కొల్పమని దైవప్రవక్త (స) హజ్రత్ బిలాల్ (రజి)ను ఆదేశించి నిద్రపోయారు. బడలిక వల్ల హజ్రత్ బిలాల్ (రజి)కు సయితం నిద్ర ముంచుకువచ్చింది. సూర్యోదయమయ్యే వరకూ మెలకువ రాలేదు. ఈ పరిస్థితిని గమనించిన దైవప్రవక్త (సఅసం) తక్షణం ఆ లోయను వదలిపెట్టవలసినదిగా ఆజ్ఞాపించారు. సహచరులంతా అప్పటికప్పుడు అక్కడినుంచి బయలుదేరి మరో లోయలో మకాం వేశారు. దైవప్రవక్త (స) ఆదేశంపై హజ్రత్ బిలాల్ (రజి) అజాన్ ఇచ్చారు. ఆయన (స) నమాజ్ చేయించారు.

(ఆ) 'ముజ్దలిఫా' - ఇది మక్కాలోని ప్రదేశం పేరు. మినా - అరఫాత్‌ల మధ్య ఉంది. హజ్ ఆచారాలను నిర్వర్తించేటప్పుడు హాజీలు అరఫాత్‌లో ఆగిన పిదప - జిల్ హజ్జ్ 10వ తేదీ రాత్రి ఇక్కడకు వస్తారు.

(ఇ) ఈ హదీసు ద్వారా తెలియవచ్చే ఒక ముఖ్యాంశం ఏమిటంటే; నిద్ర కారణంగా నమాజ్ వేళ దాటి పోయినప్పటికీ సామూహికంగా నమాజ్ చేయదలచుకుంటే అప్పుడు అజాన్ ఇవ్వవలసి ఉంటుంది.

(ఈ) ఇబ్నె ఉమర్ గారి హదీసు, జాబిర్‌గారి మొదటి హదీసుకు విరుద్ధంగా అగుపిస్తుంది. ఎందుకంటే ఈ హదీసు - ముజ్దలిఫాలో మగ్రిబ్ ఇషా నమాజులను కలిపి చేసినపక్షంలో - అజాన్ ఇవ్వనక్కరలేదని అంటోంది. కాగా; ఒక్క అజాన్, రెండు ఇఖామత్‌లు చెప్పబడినట్లు జాబిర్ (రజి) ఉల్లేఖనం రూఢీ చేస్తోంది. జాబిర్ (రజి)గారి మొదటి హదీసు సకారాత్మకమైనది. ఇక్కడ సకారాత్మకమైనదానికి నకారాత్మకమైనదానిపై ప్రాధాన్యతనివ్వాలి.

(١٥١) وَعَنِ ابْنِ عُمَرَ وَعَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمْ، قَالاَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ «إِنَّ بِلاَلاً يُؤَذِّنُ بِلَيْلٍ، فَكُلُوا وَاشْرَبُوا حَتَّى يُنَادِيَ ابْنُ أُمِّ مَكْتُومٍ، وَكَانَ رَجُلاً أَعْمَى لاَ يُنَادِي حَتَّى يُقَالَ لَهُ: أَصْبَحْتَ أَصْبَحْتَ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي آخِرِهِ إِدْرَاجٌ.

151. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) మరియు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇరువురి ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "బిలాల్ (రజి) రాత్రి ఉండగానే అజాన్ పిలుపు ఇస్తారు. మీరు ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అజాన్ అయ్యేవరకూ తినవచ్చు, త్రాగవచ్చు." ఇబ్నె ఉమ్మె మక్తూమ్ అంధులు. 'తెల్లవారింది, తెల్లవారింది' అని జనులు చెప్పేవరకూ ఆయన అజాన్ ఇచ్చేవారు కాదు. (బుఖారీ, ముస్లిం).

## సారాంశం

తెల్లవారుజాము కాకపూర్వం కూడా అజాన్ ఇవ్వటం సబబేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ (మొదటి) అజాన్ ద్వారా ఉపవాసాలు పాటించేవారికీ, తహజ్జుద్ నమాజ్ చేయ దలచుకున్న వారికి ఎంతో మేలు కలుగుతుంది. ఉపవాసం ఉండేవారు తొందరగా మేల్కొని 'సహ్రీ' సన్నాహాలు చేసుకుంటారు. అజాన్ నిమిత్తం ఒక మస్జిద్‌లో ఇద్దరు ముఅజ్జిన్‌లను నియమించవచ్చునని కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది.

## హదీసు ఉల్లేఖకులు

హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అసలు పేరు అమ్ర్ లేక అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ ఖురషీ ఆమిరీ. దివ్య ఖుర్‌ఆన్‌లోని 'అబస్' సూరా అవతరణ సందర్భంగా ఈయన పేరు చర్చకు వస్తుంది. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. హిజ్రత్ కూడా చేశారు. దైవప్రవక్త (సఅసం) తాను నగరంలో లేనపుడు ఈయన్ని 13సార్లు తన స్థానంలో (నమాజ్ చేయించే నిమిత్తం) తాత్కాలిక సారథిగా నియమించారు. ఖాద్‌సియా యుద్ధంలో అమరగతినొందారు. ఆ రోజు ధ్వజం ఆయన చేతిలో ఉంది.

(١٥٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا: أَنَّ بِلَالاً أَذَّنَ قَبْلَ الْفَجْرِ، فَأَمَرَهُ النَّبِيُّ ﷺ أَنْ يَرْجِعَ فَيُنَادِيَ: أَلَا إِنَّ الْعَبْدَ نَامَ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَضَعَّفَهُ.

152. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: (ఒక రోజు) బిలాల్ - రజి - తెల్లవారుజాము కాక మునుపే అజాన్ ఇచ్చేశారు. మళ్లీ అజాన్ ఇవ్వ వలసిందిగా దైవప్రవక్త (సఅసం) ఆజ్ఞా పించగా (బిలాల్ - రజి - ఈ విధంగా ప్రకటన గావించారు - "బాగా వినండి! ఈ దాసుడికి నిద్రవచ్చేసింది." (అందుకే ఈ పొరపాటు జరిగిపోయింది). (అబూ దావూద్ దీనిని ఉల్లేఖించారు. బలహీన హదీసుగా ఖరారు చేశారు)

## సారాంశం

హజ్రత్ బిలాల్ (రజి) ఒక్కరే అజాన్ ఇస్తున్నప్పటి సంఘటన ఇది. ఫజ్ర్ వేళ అయిపోయిందనుకుని ఆయన అజాన్ పిలుపు ఇచ్చారు. కాని నిజానికి అప్పటికింకా వేళ కాకపోవటంతో మలిసారి పిలుపు ఇవ్వవలసిందిగా దైవప్రవక్త (సఅసం) పురమాయించారు. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ రెండవ ముఅజ్జిన్‌గా నియమితులైన తరువాత రెండు అజాన్‌లు ఇవ్వబడసాగాయి. మొదటి అజాన్ హజ్రత్ బిలాల్ ఇవ్వగా, రెండవ అజాన్‌ను ఇబ్నె ఉమ్మె మక్తూమ్ ఇచ్చేవారు.

(١٥٣) وعن أبي سعيد الخدري رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا سَمِعْتُمُ النِّدَاءَ فَقُولُوا مِثْلَ مَا يَقُولُ الْمُؤَذِّنُ». مُتَّفَقٌ عَلَيْهِ.

153. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: “మీరు అజాన్ విన్నప్పుడు ముఅజ్జిన్ పలికినట్లుగానే మీరు కూడా పలకండి.” (బుఖారీ, ముస్లిం)

وَلِلْبُخَارِيِّ عَنْ مُعَاوِيَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ مِثْلَهُ.

وَلِمُسْلِمٍ عَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، فِي فَضْلِ الْقَوْلِ كَمَا يَقُولُ الْمُؤَذِّنُ كَلِمَةً كَلِمَةً سِوَى الْحَيْعَلَتَيْنِ، فَيَقُولُ: لَا حَوْلَ وَلَا قُوَّةَ إِلَّا بِاللّٰهِ.

బుఖారీలో ముఆవియ (రజి) చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది. ముస్లిం హజ్రత్ ఉమర్ (రజి) ఆధారంగా ఉల్లేఖించిన దానిలో - ముఅజ్జిన్ పలుకులకు సమాధానంగా అదేవిధంగా ఒక్కొక్క వచనం పలకటంలోని మహాత్మ్యం గురించి చెప్పబడింది. అయితే 'హయ్య అలస్సలాహ్' 'హయ్య అలల్ ఫలాహ్' అనే పదాలకు బదులుగా 'లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి' అని పలకాలి.

### సారాంశం

ఈ హదీసు ద్వారా మనకు స్పష్టంగా బోధపడేదేమిటంటే - ముఅజ్జిన్ అజాన్‌లో ఏ ఏ వచనాలు పలుకుతాడో వాటిని వినేవారు కూడా - బదులు - పలకాలి. మనిషి ఎట్టి పరిస్థితిలోనూ - అతడు పరిశుద్ధ స్థితిలో వున్నా, అశుద్ధావస్థకులోనై వున్నా సరే - అజాన్‌కు సమాధానం ఇవ్వవలసిందే. అయితే మల మూత్ర విసర్జనలో నిమగ్నమై ఉంటే మాత్రం బదులు పలకటం సమ్మతం కాదు.

హదీసులో చెప్పబడినట్లు ముఅజ్జిన్ ఏ ఏ వచనం పలికితే మనం కూడా ఆ వచనాన్ని పలుకుతూపోవాలి. అయితే 'హయ్య అలస్సలాహ్' 'హయ్య అలల్ ఫలాహ్' పదాలకు మాత్రం 'లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి' అని స్పందించాలి. “ముఅజ్జిన్ పలికినట్లుగానే మీరూ పలకండి” అని అబూ సయీద్ ఖుదరీ హదీసులో చెప్పబడింది. ఇది సాధారణ ఆజ్ఞ. ఆ తరువాత ప్రత్యేక ఆజ్ఞ వచ్చింది. ప్రత్యేకమయిన దానిని సాధారణమైనదానిపై ప్రాధాన్యత నివ్వటం ఇక్కడ నిర్ధారిత సూత్రం.

(١٥٤) وَعَنْ عُثْمَانَ بْنِ أَبِي الْعَاصِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللّٰهِ!

154. హజ్రత్ ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్ (రజి) కథనం: ఈయన ఇలా విన్నవించుకున్నారు - “ఓ దైవప్రవక్తా (సఅసం)!

اجْعَلْنِيْ إِمَامَ قَوْمِي، فَقَالَ: «أَنْتَ إِمَامُهُمْ وَاقْتَدِ بِأَضْعَفِهِمْ، وَاتَّخِذْ مُؤَذِّناً لاَ يَأْخُذُ عَلَى أَذَانِهِ أَجْرًا». أَخْرَجَهُ الْخَمْسَةُ وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

నన్ను నా జాతి వారికి ఇమామ్‌గా నియమించండి." "నీవు వారికి ఇమామ్ అయ్యావు" (నీవు కోరినట్లుగానే నిన్ను నీ జాతివారికి ఇమామ్‌గా నియమించటం జరిగింది). అయితే వారిలో బలహీనులను, వృద్ధులను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకో. అజాన్ పిలుపు ఇచ్చి వేతనం పుచ్చుకోని ముఅజ్జిన్‌ను నియమించు" అని సెలవిచ్చారు దైవప్రవక్త (స). (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. హాకిమ్ మాత్రం ప్రామాణికం (సహీహ్) అని అన్నారు).

**సారాంశం**

ముఅజ్జిన్ తాను నిర్వర్తించే బాధ్యతకు జీతం పుచ్చుకోవటం ధర్మసమ్మతమేనా? కాదా? ఈ విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. జీతం పుచ్చుకోవటం హరామ్ అని మాత్రం హదీసులో లేదు. అయితే జీతం తీసుకోకుండా - స్వచ్ఛందంగా - ఈ బాధ్యతను నిర్వర్తించటం మంచిదనీ, అభిలషణీయమని బోధపడుతున్నది.

ఎట్టి పరిస్థితిలోనూ ఇమామ్ అయినవారు నమాజీల సాధకబాధకాలను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా మసలుకోవాలనీ, సుదీర్ఘమయిన నమాజ్ చేయించి ప్రజలను సామూహిక నమాజ్ పట్ల విముఖత కలిగించరాదనీ ఈ హదీసు తాకీదు చేస్తోంది. ముఅజ్జిన్ జీతం పుచ్చుకోకుండా డ్యూటీ చేయటం మంచిదని కూడా ఈ హదీసు సూచిస్తోంది. అత్యధికమంది ధర్మవేత్తలు జీతం పుచ్చుకోవటాన్ని అవాంఛనీయం (మక్రూహ్)గా భావించారే తప్ప అధర్మం (హరామ్) గా మాత్రం తలపోయలేదు. గత్యంతరం లేని స్థితిలో తీసుకుంటే ధర్మసమ్మతమేనని కూడా నిర్ణయించారు. మంచిని పెంపొందించే, సదాచరణలో ముందంజవేసే సంకల్పంతో ఇమామత్‌ను కోరుకోవటం (నమాజ్‌కు సారథ్యం వహించాలనుకోవటం)లో తప్పులేదని కూడా ఈ హదీసు ద్వారా సంకేతం లభిస్తున్నది. సారథ్య బాధ్యతలను సాధ్యమయినంత వరకు సజావుగా నెరవేర్చే శక్తి సామర్థ్యాలుంటే దాన్ని కోరుకోవటం ధర్మసమ్మతమే.

**హదీసు ఉల్లేఖకులు**

ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్ (రజి) గారి మరో పేరు అబూ అబ్దుల్లాహ్. తాయఫ్ నుండి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన ప్రతినిధి బృందంలో అందరికన్నా పిన్న వయస్కులు ఈయన.

దైవప్రవక్త (స) ఈయన్ని ఆ బృందానికి నాయకునిగా నియమించారు. ఈయన తన జాతి ప్రజలను ధర్మభ్రష్టులు కాకుండా ఆపారు. తత్ఫలితంగా వారు రుజుమార్గంపై నిలకడగా ఉండగలిగారు. హజ్రత్ ఉమర్ (రజి) తాను ఖలీఫాగా ఉన్న కాలంలో ఈయన్ని బహ్రైన్, అమ్మాన్‌లకు గవర్నర్‌గా నియమించారు. బస్రాలో హిజ్రీ 51లో మరణించారు.

(١٥٥) وَعَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لَنَا النَّبِيُّ ﷺ: «إِذَا حَضَرَتِ الصَّلَاةُ، فَلْيُؤَذِّنْ لَكُمْ أَحَدُكُمْ» الْحَدِيثَ، أَخْرَجَهُ السَّبْعَةُ.

155. హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్(రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ఇలా ఉపదేశించారు- "నమాజ్ వేళ సమీపిస్తే మీలో ఎవరయినా ఒకరు మీ అందరినీ పిలిచే ఉద్దేశ్యంతో అజాన్ పలకాలి." తరువాత పూర్తి హదీసు వివరించారు. (దీనిని ఏడుగురూ - అంటే అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

మాలిక్ బిన్ హువైరిస్ (రజి) గారి మరో పేరు అబూ సల్మాన్. ధార్మిక శిక్షణ గరిపే నిమిత్తం దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. 20 రోజుల వరకూ ఆయన (సఅసం) దగ్గరవున్నారు. తిరిగి వెళుతున్న సమయంలో దైవప్రవక్త (స) ఈ బృందానికి హితబోధ చేస్తూ, "దారిలో నమాజ్ వేళ ఆసన్నమయినపుడు మీలో ఒకరు అజాన్ ఇవ్వాలి. మీలో వయసులో పెద్దవారు నమాజ్‌కు నేతృత్వం వహించాలి" అని అన్నారు. ప్రయాణీకులు కూడా అజాన్ పలకాలనీ, సామూహికంగా నమాజ్ చేయాలనీ ఈ ఉపదేశం ద్వారా బోధపడుతున్నది. వ్యక్తిగత స్థాయికన్నా సామూహికతకు ఎక్కువ అధిక్యత, శ్రేష్ఠత ఉంది. మాలిక్ బిన్ హువైరిస్ (రజి) హిజ్రీ 74లో బస్రాలో మరణించారు.

(١٥٦) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ لِبِلَالٍ: «إِذَا أَذَّنْتَ فَتَرَسَّلْ، وَإِذَا أَقَمْتَ فَاحْدُرْ، وَاجْعَلْ بَيْنَ أَذَانِكَ وَإِقَامَتِكَ قَدْرَ مَا يَفْرُغُ الْآكِلُ مِنْ أَكْلِهِ» الحديث. رَوَاهُ التِّرْمِذِيُّ، وَضَعَّفَهُ.

156. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బిలాల్ (రజి)కు ఇలా ఉపదేశించారు - "అజాన్ ఇస్తున్నప్పుడు బాగా ఆగి ఆగి ఇవ్వండి. అయితే 'తక్బీర్' మాత్రం త్వరత్వరగా పలకండి. అజాన్ - ఇఖామత్‌ల మధ్య విరామం భోజనం చేసే వ్యక్తి భోజనాన్ని పూర్తి చేసి సామూహిక నమాజులో పాల్గొన గలిగేంతగా ఉండాలి." (తరువాత హదీసు

నంతటినీ వివరించారు. దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు. జయీఫ్‌గా ఖరారు చేశారు)

وَلَهُ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لاَ يُؤَذِّنُ إِلاَّ مُتَوَضِّىءٌ». وَضَعَّفَهُ أَيْضاً.

దైవప్రవక్త (సఅసం) ప్రవచించారని అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "వుజూ చేయకుండా ఎవరూ అజాన్ ఇవ్వకండి" (దీన్ని కూడా జయీఫ్ - బల హీనం - గా ఖరారు చేశారు)

وَلَهُ عَنْ زِيَادِ بْنِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «وَمَنْ أَذَّنَ فَهُوَ يُقِيمُ». وَضَعَّفَهُ أَيْضاً.

జియాద్ బిన్ హారిస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "అజాన్ ఇచ్చిన వారే ఇఖామత్ చెప్పాలి." (దీనిని కూడా తిర్మిజీ 'జయీఫ్'గా ఖరారు చేశారు)

وِلأَبِي دَاوُدَ من حَدِيثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ، أَنَّهُ قَالَ: أَنَا رَأَيْتُهُ، يَعْنِي الأَذَانَ، وَأَنَا كُنْتُ أُرِيدُه، قَالَ: فَأَقِمْ أَنْتَ. وَفِيهِ ضَعْفٌ أَيْضاً.

అబూదావూద్‌లో అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది: నేను అజాన్‌ను కలలో చూశాను. నేను ముఅజ్జిన్‌గా నియమించబడాలన్న కోరిక నాకు ఉండేది. "నీవు తక్బీర్ చెప్పు" అని ఆయన (సఅసం) నన్ను ఆజ్ఞాపించారు. (ఈ హదీసు కూడా జయీఫ్ కోవకు చెందినదే)

### సారాంశం

పై హదీసు ద్వారా మన దృష్టికివచ్చే కొన్ని ముఖ్యాంశాలు: (1) అజాన్ వాక్యాలు బిగ్గరగానూ, బాగా ఆగి ఆగి పలకాలి. అయితే 'ఇఖామత్' వాక్యాలు మాత్రం త్వరత్వరగా పలకాలి.

(2) అజాన్‌కి - సామూహిక నమాజ్‌కి మధ్య ఎక్కువ విరామం ఉండకూడదు. భోజనం చేస్తున్న వ్యక్తి భోజనం ముగించి వచ్చి సామూహిక నమాజ్‌ను అందుకునేంత విరామం ఇస్తే చాలు. 4 రకత్‌ల నమాజు చేసేంత విరామం ఉంటే చాలని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

(3) అజాన్ ఇచ్చిన వ్యక్తే ఇఖామత్ చెప్పాలనీ, విద్వాంసులలో అధిక సంఖ్యాకులు భావిస్తున్నారు. అయితే అజాన్ ఇచ్చిన వ్యక్తికి అభ్యంతరం లేనిపక్షంలో ఇతరులు కూడా ఇఖామత్ చెప్పవచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులలో ఒకరైన జియాద్ బిన్ హారిస్ (రజి) సుదా తెగకు చెందినవారు. ఈ తెగ యమన్‌కు చెందినది. దైవప్రవక్త (సఅసం) చేతిపై ప్రమాణం చేసినవారు. ఆయన (స) సమక్షంలో అజాన్ కూడా ఇచ్చారు. ఎట్టకేలకు బస్రాలో స్థిరపడ్డారు.

(١٥٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «الْمُؤَذِّنُ أَمْلَكُ بِالْأَذَانِ، وَالْإِمَامُ أَمْلَكُ بِالْإِقَامَةِ». رَوَاهُ ابْنُ عَدِيٍّ، وَضَعَّفَهُ، وَلِلْبَيْهَقِيِّ نَحْوُهُ عَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ مِنْ قَوْلِهِ.

157. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ముఅజ్జిన్ అజాన్ ఇవ్వడానికి, ఇమామ్ తక్బీర్ పలకడానికి ఎక్కువ హక్కుదారులు", (ఇబ్నె అదీ దీనిని ఉల్లేఖించారు. బలహీనమైనదిగా ఖరారు చేశారు. బైహఖీలో కూడా హజ్రత్ అలీ (రజి) చే ఈ విధంగానే అనబడింది)

### సారాంశం

అజాన్ ఇవ్వడానికి ముఅజ్జిన్ ఎక్కువ హక్కుదారుడు. ఎందుకంటే నమాజ్ వేళలను రక్షించవలసిన బాధ్యత అతనిపై ఉంది. అందుచేత వేళకు ముందుగానీ, ఆలస్యంగా గానీ అజాన్ ఇవ్వమని అతనిపై ఒత్తిడి తెచ్చే అధికారం కూడా ఎవరికీ లేదు. తక్బీర్ పలికించే హక్కు ఇమామ్‌ది. అతను సంజ్ఞ చేసే వరకూ (నమాజ్ సారథ్యానికి అతడు సమాయత్తం కానంతవరకూ) ఎవరూ తక్బీర్ పలకలేరు.

(١٥٨) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «لَا يُرَدُّ الدُّعَاءُ بَيْنَ الْأَذَانِ وَالْإِقَامَةِ». رَوَاهُ النَّسَائِيُّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

158. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "అజాన్ - ఇఖామత్‌ల మధ్య గల విరామ సమయంలో చేసే దుఆ త్రోసిపుచ్చబడదు." (దీనిని నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

దైవప్రవక్త (స)గారి ఈ ఉపదేశాన్ని విని సహచరులు, "మరైతే ఓ దైవప్రవక్తా! మేము ఆ సమయంలో దైవాన్ని ఏమని వేడుకోవాలి?" అని విన్నవించుకున్నారు. "దైవసమక్షంలో మన్నింపును,

క్షమాభిక్షను, ఇహపరాల బాగోగులను అర్థించండి" అని ఆయన (స) సలహా ఇచ్చారు (తిర్మిజీ). దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దుఆ స్వీకారానికి ఈ సమయం అత్యంత సముచితమైనది.

(١٥٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ قَالَ حِينَ يَسْمَعُ النِّدَاءَ: اللَّهُمَّ رَبَّ هَذِهِ الدَّعْوَةِ التَّامَةِ، وَالصَّلَاةِ الْقَائِمَةِ، آتِ مُحَمَّداً الْوَسِيلَةَ وَالْفَضِيلَةَ، وَابْعَثْهُ مَقَاماً مَحْمُوداً الَّذِي وَعَدتَّهُ حَلَّتْ لَهُ شَفَاعَتِي يَوْمَ الْقِيَامَةِ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ.

159. హ॥జ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ఎవర యితే అజాన్ పిలుపు విని ఈ దుఆ చేస్తాడో అతని కోసం ప్రళయదినాన నేను సిఫారసు చేయటం సమ్మతమై పోతుంది. (ఈ దుఆ ఇలా ఉంది) - "అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్దావ తిత్తామతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మద నిల్ వసీల్తత వల్ ఫజీలత వబ్ అస్హు మఖామమ్ మహ్మూద నిల్లజీ వ అత్తహు" (అర్థం: ఓ అల్లాహ్! ఈ సంపూర్ణ పిలుపుకు, స్థాపించబడే నమాజ్‌కు అధిపతి అయినవాడా! ముహమ్మద్ - సఅసం - కు ప్రతిష్ఠాత్మక మయిన స్థానాన్ని (మఖామె మహ్మూద్), ఆధిక్యతను ప్రసాదించు. ఏ ప్రశంసాత్మక మయిన (ఉన్నత) స్థానం (స్వర్గంలో) ప్రసాదిస్తానని నీవు వాగ్దానం చేశావో ఆ స్థానంలో (ఆయన్ని) ప్రతిష్ఠింపజెయ్యి) (ఈ హదీసును అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు).

**సారాంశం**

అజాన్ విన్న తరువాత పైన పేర్కొనబడిన దుఆ (ప్రార్థన) చేయటం మస్నూన్ (దైవప్రవక్త విధానం) అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దుఆ చేసే వాడికి ప్రవక్త గారి సిఫారసు లభిస్తుందంటే అంతకన్నా భాగ్యం ఇంకేముంటుంది?! ఆయన ఎవరి గురించి సిఫారసు చేసినా అతను ఎట్టకేలకు స్వర్గంలో ప్రవేశిస్తాడు. "మఖామె మహ్మూద్" ప్రస్తావన దివ్య ఖుర్‌ఆన్‌లోని బనీ ఇస్రాయీల్ సూరాలో వచ్చింది. "నీ ప్రభువు నిన్ను మఖామె మహ్మూద్ పైకి చేర్చే అవకాశం ఉంది" అని అందులో వాగ్దానం చేయబడింది.

3వ అధ్యాయం

## నమాజ్‌కై షరతులు

## ٣ - بَابُ شُرُوطِ الصَّلَاةِ

160. హ|జత్ అలీ బిన్ తల్ఖ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "నమాజ్ చేస్తుండగా మీలో ఎవరికయినా అపాన వాయువు వెలువడితే వారు తిరిగి వెళ్ళి (నమాజ్‌ను పరిత్యజించి), సరికొత్తగా వుజూ చేసి, మళ్లీ నమాజ్ చేయాలి." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఈ ఐదుగురూ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

(١٦٠) عَنْ عَلِيِّ بْنِ طَلْقٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ ﷺ: «إِذَا فَسَا أَحَدُكُمْ فِي الصَّلَاةِ، فَلْيَنْصَرِفْ، وَلْيَتَوَضَّأْ وَلْيُعِدِ الصَّلَاةَ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

**హదీసు ఉల్లేఖకులు**

అలీ బిన్ తల్ఖ్ (రజి) గారి పూర్తిపేరు - అలీ బిన్ తల్ఖ్ బిన్ ముంజిర్ బిన్ ఖైస్ సహిమీ యమామి హనఫీ. బనూ హనీఫా తెగతో సంబంధం కలిగి ఉండటంచేత హనఫీగా పిలువబడ్డారు. ఈయన తల్ఖ్ బిన్ అలీ తండ్రి అని ఒక వాదన ఉంది. వీరిద్దరూ ఒక్కరేనన్న అభిప్రాయం కూడా ఉంది.

161. హ|జత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరి కయితే నెలవారీ అవుతుందో (అంటే ఏ స్త్రీ యుక్త వయస్సుకు చేరిందో) ఆమె వోణీ కప్పుకునేదాకా అల్లాహ్ ఆమె నమాజును స్వీకరించడు." (ఒక్క నసాయి తప్ప మిగిలిన నలుగురూ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

(١٦١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «لَا يَقْبَلُ اللّٰهُ صَلَاةَ حَائِضٍ إِلَّا بِخِمَارٍ». رَوَاهُ الْخَمْسَةُ إِلَّا النَّسَائِيَّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

**సారాంశం**

యుక్త వయస్సుకు చేరిన స్త్రీ శరీరమంతా నమాజ్ చేసే సమయంలో వస్త్రంతో కప్పబడి ఉండాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఆఖరికి శిరోజాలు సయితం కప్పబడి ఉండాలి.

(١٦٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهُ: «إِنْ كَانَ الثَّوْبُ وَاسِعاً فَالْتَحِفْ بِهِ، يَعْنِي فِي الصَّلَاةِ». وَلِمُسْلِمٍ: فَخَالِفْ بَيْنَ طَرَفَيْهِ، وَإِنْ كَانَ ضَيِّقاً فَاتَّزِرْ بِهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

162. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఈ విధంగా ఉపదేశించారని హజ్రత్ జాబిర్ (రజి) తెలిపారు: “వస్త్రం పెద్దగా పొడవుగా ఉంటే (నమాజ్‌లో) వస్త్రాన్ని బాగా చుట్టుకోండి” ముస్లింలోని ఉల్లేఖనంలో ఇలా వుంది - “వస్త్రం పొడవుగా ఉంటే దాని రెండు అంచులను భుజం యొక్క ఇరువైపులా వేసుకోండి. ఒకవేళ వస్త్రం చిన్నగా, కురచగా ఉంటే లుంగీ మాదిరిగా కట్టుకోండి.” (బుఖారీ, ముస్లిం) బుఖారీ, ముస్లింలోనే హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ఇలా ఉంది - “మీలో ఎవరూ ఒకే వస్త్రంలో - దాని భాగమేదయినా భుజాలపై లేనంత వరకూ - నమాజ్ చేయకండి.”

وَلَهُمَا مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ: «لَا يُصَلِّي أَحَدُكُمْ فِي الثَّوْبِ الْوَاحِدِ، لَيْسَ عَلَى عَاتِقِهِ مِنْهُ شَيْءٌ»

**సారాంశం**

నమాజ్ చేసేవాని భుజాలు కూడా నగ్నంగా ఉండరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

(١٦٣) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّهَا سَأَلَتِ النَّبِيَّ ﷺ: أَتُصَلِّي الْمَرْأَةُ فِي دِرْعٍ وَخِمَارٍ بِغَيْرِ إِزَارٍ؟ قَالَ: «إِذَا كَانَ الدِّرْعُ سَابِغاً يُغَطِّي ظُهُورَ قَدَمَيْهَا». أَخْرَجَهُ

163. హజ్రత్ ఉమ్మె సలమ (రజి) కథనం : ఏ స్త్రీ అయినా నడుము బట్ట (లంగా, చీర, పైజామా ఇత్యాదివి) లేకుండానే కేవలం చొక్కా మరియు వోణీ ధరించి నమాజ్ చేయవచ్చా? అని నేను దైవప్రవక్త (సఅసం) ను ప్రశ్నించగా ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు- “చొక్కా పొడవుగా ఆమె పాదాల వరకూ వచ్చేలా ఉంటే అప్పుడు ధర్మసమ్మత

أَبُو دَاوُدَ، وَصَحَّحَ الأَئِمَةُ وَقْفَهُ.

మవుతుంది.'' (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఇమాములు దీనిని మౌఖూఫ్‌గా ఖరారు చేశారు)

## సారాంశం

నమాజ్ చేసే సమయంలో స్త్రీ తన శరీరమంతటినీ వస్త్రంతో కప్పటం అవసరం. ఒక పొడవాటి (మాక్సి తరహా) చొక్కాను తొడుక్కొని, వోణీ కప్పుకుని కూడా ఆమె నమాజ్ చేయగలదు. కాని ఆ చొక్కా ఆమె కాలి మడమలను సయితం కప్పేంత నిడివిగా ఉండాలి. నమాజ్ చేసేటప్పుడు స్త్రీ పాదాలను కూడా కప్పటం అవసరమని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ హదీసు వెలుగులో కొంతమంది ఉలమా (పండితులు) స్త్రీ పాదాలను సయితం ఆమె 'సతర్'లో అంతర్భాగంగా చేర్చారు.

(١٦٤) وَعَنْ عَامِرِ بْنِ رَبِيعَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا مَعَ النَّبِيِّ ﷺ فِي لَيْلَةٍ مُظْلِمَةٍ، فَأَشْكَلَتْ عَلَيْنَا الْقِبْلَةُ، فَصَلَّيْنَا، فَلَمَّا طَلَعَتِ الشَّمْسُ إِذَا نَحْنُ صَلَّيْنَا إِلَى غَيْرِ الْقِبْلَةِ، فَنَزَلَتِ الآيَةُ ﴿فَأَيْنَمَا تُوَلُّوا فَثَمَّ وَجْهُ اللَّهِ﴾ أَخْرَجَهُ التِّرمِذِيُّ، وَضَعَّفَهُ.

164. హజ్రత్ ఆమిర్ బిన్ రబీయ (రజి) కథనం : ఒక చీకటి రాత్రి మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంట ఉన్నాము. 'ఖిబ్లా' దిశను నిర్ధారించటం మాకు గగనమైపోయింది. మేము (ఒక అంచనా ప్రకారం దిశను నిర్ధారించి) నమాజ్ చేశాము. తీరా సూర్యోదయం అయిన పిదప మాకు బోధపడింది - మేము నిర్ధారించుకున్న ఖిబ్లా సరైనది కాదనీ, మరో దిశలో తిరిగి నమాజ్ చేశామని! అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: 'మరి మీరు ఏ వైపునకు అభిముఖమైనా ఆ వైపే అల్లాహ్ ఉన్నాడు.'' (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - జయీఫ్‌గా ఖరారు చేశారు)

## సారాంశం

మనిషి వల్ల పొరపాటు జరగటం సహజం. ప్రయాణావస్థలో పలు కారణాలవల్ల ఖిబ్లా దిశను నిర్ణయించటం కష్టమవుతుంది. మనిషి తన ఆలోచనకు పదునుపెట్టి ఏదో ఒక నిర్ధారణకు వస్తాడు. అతని నిర్ధారణ తప్పని తరువాత తెలిసిరావచ్చు. అంతమాత్రాన నమాజ్‌ను మళ్ళీ చేయవలసిన అవసరం లేదు. కాని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృక్పథం మాత్రం మరోవిధంగా ఉంది. నమాజ్ వేళ దాటినా, దాటకపోయినాసరే - ఖిబ్లా దిశ నిర్ధారించటంలో తప్పటడుగు

వేసినట్లు తెలియగానే ఆ నమాజ్‌ను తిరిగి చేయాల్సిందే. ఎందుకంటే నమాజ్ కోసం ఖిబ్లా వైపునకు తిరగటం అవసరం అంటారాయన.

## హదీసు ఉల్లేఖకులు

ఆమిర్ బిన్ రబీయ (రజి) అన్జ్ బిన్ వాయల్ తెగకు చెందినవారు. వాయల్ కుమారులగు బక్ర్, తగ్లిబ్‌లు ఈయనకు సోదరులు. ఈయన తొలి కాలంలోనే ఇస్లాం సత్యామృతాన్ని ఆస్వాదించారు. అబిసీనియా వైపునకు, మదీనా వైపునకు - రెండు హిజ్రత్‌లు చేశారు. బద్ర్ సంగ్రామంలోనూ, ఇతర యుద్ధాలలోనూ వీరోచితంగా పోరాడారు. ఈయన మరణ సమయం గురించి అభిప్రాయభేదం ఉంది. హిజ్రీ 32 అనీ, 33 అనీ, 35 అనీ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

(١٦٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا بَيْنَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ قِبْلَةٌ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَقَوَّاهُ الْبُخَارِيُّ.

165. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రవచించారు: "తూర్పు - పడమరల మధ్యన 'ఖిబ్లా' ఉంది." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. బుఖారీ దీనిని దృఢతరమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

ఈ హదీసు మదీనా వాసులను, ఆ దిశలోనే ఉన్న ఇతరులను దృష్టిలో పెట్టుకుని చెప్పబడింది. అన్ని ప్రాంతాలవారికి, ముఖ్యంగా భారతీయులకు ఇది వర్తించదు. మదీనా నగరం పవిత్ర మక్కాకు ఉత్తరాన ఉంది. అంటే మదీనా వాసులకు కాబా గృహం దక్షిణాన ఉంటుంది.

(١٦٦) وَعَنْ عَامِرِ بْنِ رَبِيعَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي عَلَى رَاحِلَتِهِ حَيْثُ تَوَجَّهَتْ بِهِ. مُتَّفَقٌ عَلَيْهِ، زَادَ الْبُخَارِيُّ: يُومِئُ بِرَأْسِهِ، وَلَمْ يَكُنْ يَصْنَعُهُ فِي الْمَكْتُوبَةِ.

166. హజ్రత్ ఆమిర్ బిన్ రబీయ (రజి) తెలిపారు: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తమ ఒంటెపై నమాజ్ చేస్తుండగా చూశాను. ఒంటె ఏ వైపునకు తిరిగినప్పటికీ ఆయన నమాజ్‌ను చేస్తూనే ఉండేవారు (బుఖారీ, ముస్లిం). 'ఆయన తన తల ఊపటం ద్వారా నమాజ్ చేసేవారు. ఫర్జ్ నమాజ్‌లో అలా చేసేవారు కాదు.' అన్న వాక్యం బుఖారీలో అదనంగా ఉంది.

وَلِأَبِي دَاوُدَ مِنْ حَدِيثِ أَنَسٍ: وَكَانَ إِذَا سَافَرَ فَأَرَادَ أَنْ يَتَطَوَّعَ اسْتَقْبَلَ بِنَاقَتِهِ الْقِبْلَةَ، فَكَبَّرَ ثُمَّ صَلَّى حَيْثُ كَانَ وَجْهُ رِكَابِهِ. وَإِسْنَادُهُ حَسَنٌ.

అబూదావూద్‌లో హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది - ఆయన (సఅసం) ప్రయాణంలో నుండగా (ఒక సారి) నఫిల్ నమాజ్ చేయగోరి తన ఒంటె దిశను 'కాబా' వైపునకు మళ్లిం చారు. ఆ తరువాత వాహనం ఏఏ దిశ లలో సాగినా -నమాజ్‌ను నిరాఘాటంగా చేసి - పూర్తి చేశారు. (ఈ హదీసు 'పరం పర' దృష్ట్యా 'హసన్'గా ఖరారు చేయ బడింది)

**సారాంశం**

ప్రయాణావస్థలో నఫిల్ నమాజులు కూడా వాహనంపై కూర్చుని చేయవచ్చుని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఒకసారి మన ముఖాన్నిగానీ, వాహనం ముఖాన్నిగానీ ఖిబ్లా వైపునకు తిప్పి ఆరంభిస్తే చాలు - మధ్యలో వాహనం ఎన్ని దిశలవైపునకు తిరిగినా ఫరవాలేదు; నిస్సంశయంగా నమాజ్ నెరవేరుతుంది. ఈవిధంగా ఆధునిక యుగంలో రైలు, ఓడ, విమానం తదితర వాహనాలపై నమాజ్ చేయటం ధర్మసమ్మతమే. ధర్మవేత్తలంతా ఈ విషయంపై ఏకాభిప్రాయం వ్యక్తపరిచారు.

(١٦٧) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «الْأَرْضُ كُلُّهَا مَسْجِدٌ إِلَّا الْمَقْبَرَةَ وَالْحَمَّامَ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَلَهُ عِلَّةٌ.

167. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రబోధించారు: "ఖబరస్తాన్ (ఖనన వాటిక) మరియు స్నానశాల తప్ప మిగి లిన భూభాగమంతా మస్జిదే (ఎక్కడంటే అక్కడే నమాజ్ చేయవచ్చు)." (తిర్మిజీ)

**సారాంశం**

ఖననవాటికలో, బాత్‌రూంలో నమాజ్ చేయటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. బహుదైవారాధనకు దారితీసే ఏ అవకాశానికి కూడా తావు కలగరాదన్న ఉద్దేశ్యంతో 'ఖబరస్తాన్'లో నమాజ్ చేయడాన్ని వారించటం జరిగింది.

(١٦٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللَّهِ ﷺ أَنْ

168. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏడుచోట్ల నమాజ్ చేయడాన్ని వారిం

يُصَلَّى فِي سَبْعَةِ مَوَاطِنَ: الْمَزْبَلَةِ، وَالْمَجْزَرَةِ، وَالْمَقْبَرَةِ، وَقَارِعَةِ الطَّرِيْقِ، وَالْحَمَّامِ، وَمَعَاطِنِ الإِبِلِ، وَفَوْقَ ظَهْرِ بَيْتِ اللهِ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَضَعَّفَهُ.

చారు. చెత్తా చెదారం (కసువు వగైరా) వేసేచోట, జంతువులను కోసేచోట, ఖబరస్తాన్ (ఖననవాటిక)లో, జనులు నడిచే దారిలో, స్నానశాలలో, ఒంటెను కట్టే చోట మరియు బైతుల్లాహ్ (కాబా గృహం) కప్పుపై (నమాజ్ చేయ కూడదు). (తిర్మిజీ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

భూభాగమంతా మస్జిద్‌గా ఖరారు చేయబడినప్పటికీ కొన్ని నిర్ణీత స్థానాలలో నమాజ్ చేయటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. వాటిలో ఒకటి ప్రజలు చెత్తా చెదారం వేసే స్థలం. అది పరిశుద్ధంగా ఉండదు. నమాజ్ చేసే చోటు పరిశుభ్రంగా ఉండటం అవసరం గనక ఈ స్థలంలో నమాజ్ చేయరాదు. అలాగే జంతువులను జిబహ్ చేసేచోటు (Slaughter House). అది కూడా రక్తం వల్ల, కసువువల్ల అశుద్ధంగా ఉంటుంది. జనులు వచ్చే పోయే మార్గంలో కూడా నమాజ్ చేయకూడదు. ఎందుకంటే అసలే జనుల రాకపోకలవల్ల మార్గాలు ఇరుకుగా ఉంటాయి. అందులోనే ప్రజలు నమాజ్ కోసం కూడా మరికొంత జాగాను ఆక్రమిస్తే వచ్చే పోయేవారికి ఇబ్బంది కలుగుతుంది సరికదా, నమాజ్ చేసేవారికి ఏకాగ్రత కూడా లభించదు. ఇక కాబా గృహం పైకప్పుపై నమాజ్ చేయకుండా వారించటంలోని మర్మం ఏమిటంటే నమాజ్ చేసే సమయంలో మనిషి కాబా గృహం వైపునకు అభిముఖమై ఉండటం అవసరం. కప్పుపైకెక్కి నమాజ్ చేస్తే అతనికి ఖిబ్లా ఎదురుగా ఉండదు.

(١٦٩) وَعَنْ أَبِي مَرْثَدٍ الْغَنَوِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُوْلُ: «**لاَ تُصَلُّوا إِلَى الْقُبُورِ، وَلاَ تَجْلِسُوا عَلَيْهَا**». رَوَاهُ مُسْلِمٌ.

169. హజ్రత్ అబూ ముర్సద్ ఘనవీ (రజి) కథనం: "గోరీలు ఎదురుగా నుండగా నమాజ్ చేయటంగానీ, వాటిపై కూర్చోవటంగానీ చేయకండి" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా నేను విన్నాను." (ముస్లిం)

**సారాంశం**

సమాధుల వైపునకు ముఖం త్రిప్పి నమాజ్ చేయటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా స్పష్టమవు తున్నది. చనిపోయిన కొంతమంది పుణ్య పురుషుల ఆత్మల నుండి స్ఫూర్తి పొందవచ్చున్న సంకల్పంతో కొందరు మస్జిదులను ఉద్దేశ్యపూర్వకంగా సమాధులున్న చోట కడతారు. ఇది కూడా నిషిద్ధమే. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) హదీసులో ఈ సంగతి స్పష్టంగా చెప్పబడింది - "అల్లాహ్

శాపం యూదులపై, క్రైస్తవులపై పడుగాక! వాళ్లు తమ ప్రవక్తల గోరీలను సాష్టాంగస్థలం (మస్జిద్) గా చేసుకున్నారు'' అని మహాప్రవక్త (సఅసం) చెప్పారు. అంటే నమాజ్ కోసం నిలబడినచోట - ఎదురుగా సమాధి ఉంటే అది షిర్క్ (బహుదైవోపాసన)కు బీజం నాటవచ్చు. అందుకే ఈ అంశాన్ని తీవ్రంగా వారించటం జరిగింది.

ఇక సమాధిపై కూర్చోవటం గురించి -

దీనికి రెండు అర్థాలున్నాయి. ఒకటి: సమాధిని ఆసీనమయ్యే చోటుగా, తలగడగా చేసుకోవటం తప్పు. రెండు: సమాధులవద్ద ముజావర్లుగా తిష్ఠ వేయటం లేదా కాలకృత్యాలు తీర్చుకోవటానికి ఆ స్థలాన్ని దుర్వినియోగపరచటం నిషిద్ధం.

## హదీసు ఉల్లేఖకులు

అబూ ముర్సద్ ఘనవీ అసలు పేరు కనాజ్ బిన్ హుసైన్ బిన్ యర్బూ. అబూ ముర్సద్ మారు పేరు. ఘిత్ఫాన్ తెగకు చెందిన ఒక వ్యక్తి ఘనీ బిన్ యాసుర్‌తో గల సంబంధం కారణంగా ఘనవీ అని సంబోధించబడ్డారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబీ ఈయన. హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌కు మద్దతుదారులు. యుద్ధాలన్నింటిలోనూ పాల్గొన్నారు. హిజ్రీ 16లో 66 ఏళ్ల వయస్సులో కన్ను మూశారు.

(١٧٠) وَعَنْ أَبِي سَعِيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا جَاءَ أَحَدُكُمُ الْمَسْجِدَ فَلْيَنْظُرْ فَإِنْ رَأَى فِي نَعْلَيْهِ أَذًى أَوْ قَذَراً فَلْيَمْسَحْهُ، وَلْيُصَلِّ فِيهِمَا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ. وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

170. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: ''మీలో ఎవరయినా మస్జిద్‌కు వచ్చినపుడు (లోనికి ప్రవేశించేముందు తన చెప్పులను) సరిగ్గా చూచుకోవాలి. ఒకవేళ తమ చెప్పులకు అశుద్ధతగానీ, మలినంగానీ అంటుకుని ఉంటే అతడు దాన్ని పరిశుభ్రం చేసుకుని మరీ నమాజ్ చేయాలి.'' (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.

## సారాంశం

చెప్పులు (లేక బూట్లు) తొడిగి నమాజ్ చేయటంలో ఆక్షేపణీయం ఏమీ లేదన్న దానికి ఈ హదీసు ప్రబల నిదర్శనం. అయితే పాదరక్షలు పరిశుభ్రంగా ఉండాలన్నది షరతు. చెప్పులకు అంటుకుని వున్న అశుద్ధతను, మాలిన్యాన్ని దూరం చేయటం వల్ల అవి పరిశుభ్రం అయిపోతాయని కూడా దీన్నిబట్టి అవగతమవుతున్నది.

దైవప్రవక్త (సఅసం) ఈవిధంగా ప్రబోధించటం వెనుక ఒక సంఘటన ఉంది. ఒకసారి ఆయన (సఅసం) చెప్పులు తొడిగి నమాజ్ చేయిస్తున్నారు. తన చెప్పు అశుద్ధంగా వున్న సంగతి ఆయన (స)కు తెలీదు. దాని అడుగుభాగాన మలినం తగిలి ఉంది. నమాజ్ మధ్యలో దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఆయన (స)కు ఈ సంగతి తెలియజేశారు. ఆయన నమాజ్ మధ్యలోనే చెప్పులు విడిచి, నమాజ్‌ను కొనసాగించారు. వెనుక నమాజ్ చేస్తున్న సహచరులు కూడా దైవప్రవక్త (స)ను అనుసరిస్తూ తమ తమ పాదరక్షలను విడిచేశారు. నమాజ్‌ను యథాతథంగా కొనసాగించారు. నమాజ్ పూర్తయిన తరువాత, చెప్పుల్ని విడవటానికి కారణం దర్యాప్తు చేశారు దైవప్రవక్త (స). మేము మిమ్మల్ని అనుసరించేవాళ్ళము, మీరు ఎలా చేస్తే మేమూ అలాగే చేస్తాముకదా! అని సహచరులు సంజాయిషీ ఇచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) తాను తన చెప్పులను విడువటానికి గల కారణం వివరించారు.

ఈ హదీసు ద్వారా మనకు బోధపడే విషయం ఏమిటంటే నమాజ్ చేస్తున్న వ్యక్తికి - తన దుస్తులకుగానీ, చెప్పులకుగానీ, మేజోళ్లకుగానీ అశుద్ధత అంటుకుని వున్న సంగతి ముందుగా తెలియక, నమాజు మధ్యలో తెలిస్తే నిస్సంకోచంగా అశుద్ధ వస్తువును అప్పటికప్పుడే విడిచి తన నమాజ్‌ను కొనసాగించవచ్చు. అలా చేయటం వల్ల అతని నమాజ్‌కు ఎలాంటి హాని కలుగదు.

(١٧١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا وَطِىءَ أَحَدُكُمُ الْأَذَى بِخُفَّيْهِ فَطَهُورُهُمَا التُّرَابُ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

171. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరైనా మేజోళ్లు ధరించి అశుద్ధతపై నుంచి నడచివెళితే నిస్సందేహంగా మట్టి పరిశుద్ధపరుస్తుంది." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

చెప్పులకు, బూట్లకు, (తోలుతో చేయబడిన) మేజోళ్లకు - వాటి అడుగు భాగాన అంటుకున్న అశుద్ధత ఎండిపోయినా లేక తడిగా ఉన్నా, అది చిన్న తరహా మలినమయినా, పెద్ద తరహా మలిన మయినా, పరిశుద్ధమయిన మట్టిపై తుడవటం వల్ల అది పరిశుభ్రమైపోతుంది. ప్రత్యేకంగా వాటిని కడగవలసిన అవసరం లేదు. అబూ హనీఫా (రహ్మ.లై) గారి విధానం మరోవిధంగా ఉంది. అయితే హనఫీ శాస్త్రాన్ని అనుసరించేవారు కూడా ఇమామ్ షాఫయి (రహ్మ.లై) విధానాన్ని అంగీకరించారు. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) కూడా ఈ పద్ధతిపట్ల ఏకీభవించారు.

(١٧٢) وَعَنْ مُعَاوِيَةَ بْنِ الْحَكَمِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِنَّ

172. హజ్రత్ ముఆవియా బిన్ హకమ్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్ల

هَذِهِ الصَّلاَةَ لاَ يَصْلُحُ فِيهَا شَيْءٌ مِنْ كَلاَمِ النَّاسِ إِنَّمَا هو التَّسْبِيحُ وَالتَّكْبِيرُ وَقِرَاءَةُ الْقُرْآنِ». رَوَاهُ مُسْلِمٌ.

ల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "నమాజ్‌లో సంభాషణకు ఎలాంటి అవకాశం లేదు. నమాజులోనయితే కేవలం దేవుని పవిత్రత (సుబ్‌హా నల్లాహ్), దేవుని గొప్పతనం (అల్లాహు అక్బర్) కొనియాడబడాలి. దివ్య గ్రంథ పారాయణం చేయాలి." (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు పూర్వరంగం ఏమిటంటే నమాజు మధ్యలో ఒక వ్యక్తి తుమ్మి 'అల్ హమ్దులిల్లాహ్' అని పలికాడు. దీనికి సమాధానంగా ముఆవియ (రజి) గారు నమాజ్ చేస్తూనే (యర్‌హముకల్లాహ్) అని బదులిచ్చారు. నమాజు ముగించిన తరువాత దైవప్రవక్త (సఅసం) పై హదీసును ఉపదేశించారు. నమాజు మధ్యలో ఇతరుల్ని సంబోధించి మాట్లాడటం హరామ్ (నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా అర్థమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

ముఆవియా బిన్ హకమ్ (రజి) హిజాజ్ ప్రాంతానికి చెందినవారు. మదీనాలో స్థిరపడ్డారు. 'బనూ సులైమ్'లో ఉండసాగారు. ఈయన కూడా ప్రవక్త ప్రియసహచరులు (సహాబి)గా పరిగణించ బడతారు.

(١٧٣) وَعَنْ زَيْدِ بْنِ أَرْقَمَ قَالَ: إِن كُنَّا لَنَتَكَلَّمُ فِي الصَّلاَةِ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ: يُكَلِّمُ أَحَدُنَا صَاحِبَهُ بِحَاجَتِهِ، حَتَّى نَزَلَتْ ﴿حَافِظُوا عَلَى الصَّلَوَاتِ وَالصَّلاَةِ الْوُسْطَى وَقُومُوا للهِ قَانِتِينَ﴾ فَأُمِرْنَا بِالسُّكُوتِ، وَنُهِينَا عَنِ الْكَلاَمِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

173. హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో నమాజు మధ్యలో ఒండొకరితో సంభాషించే వాళ్లం. ఒండొకరి అక్కరలను గురించి చర్చించుకునేవాళ్లం. ఎట్టకేలకు ఈ ఆయత్ అవతరించింది - "హాఫిజూ అలస్సలవాతి వస్సలాతిల్ వుస్తా వ ఖూమూ లిల్లాహి ఖానితీన్." దీని తరువాత నిశ్శబ్దంగా ఉండాలని ఆదేశించ బడింది. నమాజ్‌లో మాట్లాడుకోవటాన్ని వారించటం జరిగింది." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

### సారాంశం

నమాజ్ మధ్యలో సంభాషించటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. ఇస్లాం ఆరంభకాలంలో నమాజ్ మధ్యలో సంభాషించుకునేందుకు అనుమతి ఉండేది. తరువాత ఇది నిషేధించబడింది.

### హదీసు ఉల్లేఖకులు

జైద్ బిన్ అర్ఖమ్ (రజి) అన్సార్ వర్గీయులు. ఖజ్రజ్ తెగకు చెందినవారు. అబూ అమ్ర్ ఈయన నామాంతరం. కందక యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. దైవప్రవక్త (స)తో కలసి మొత్తం 17 యుద్ధాలలో పాల్గొన్నారు. సిఫ్ఫీన్ యుద్ధ సందర్భంగా హజ్రత్ అలీ (రజి) మద్దతుదారుల పక్షాన ఉన్నారు. కూఫాలో స్థిరపడ్డారు. హిజ్రీ 66లో మరణించారు.

(١٧٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «التَّسْبِيحُ لِلرِّجَالِ وَالتَّصْفِيقُ لِلنِّسَاءِ». مُتَّفَقٌ عَلَيْهِ، زَادَ مُسْلِمٌ: «فِي الصَّلَاةِ».

174. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖించారు: "(నమాజులో అవసరమైనప్పుడు) పురుషులు తస్బీహ్ పలకాలి (అంటే సుబ్హానల్లాహ్ అని అంటూ ఇమామ్‌ను జాగరూకపరచాలి) స్త్రీలు చప్పట్లు చరచాలి" (బుఖారీ, ముస్లిం-ముస్లింలో 'ఫిస్సలాతి' అంటే నమాజులో అనే పదం అధికంగా ఉంది).

### సారాంశం

నమాజులో ఇమామ్ మరచిపోతే అతన్ని సావధానపర్చడానికి వెనుక నున్నవారు 'సుబ్హానల్లాహ్' అని పలికి అతని పొరబాటును అతని దృష్టికి తీసుకురావాలి. వెనుక నమాజ్ చేసేవారు స్త్రీలయితే చప్పట్లు చరచటం ద్వారా పొరపాటును ఎత్తి చూపాలి. అంతేగానీ స్త్రీలు తమ నోటితో సుబ్హానల్లాహ్ తదితర వాక్యాలు పలుకనవసరం లేదు. వారు తమ కుడిచేతి యొక్క రెండు వ్రేళ్లను ఎడమచేతి ఉపరితలంపై చరిస్తే సరిపోతుందని ఈసా బిన్ అయ్యూబ్ తెలిపారు. పరాయి స్త్రీ కంఠం మగవారికి తెలియకూడదన్న ఉద్దేశ్యంతోనే చప్పట్లు చరిచే పద్ధతి ప్రతిపాదించబడింది. అంటే స్త్రీ కంఠం (శబ్దం) కూడా ఒకవిధంగా 'పరదా' లాంటిదే. ఈ విషయంలో ఇస్లాం ఎంత సెన్సిటివ్‌గా ఉందో, ఆధునికత పేరిట విశృంఖలంగా విహరిస్తున్న మహిళలు ఆలోచించాలి. కొంతమంది మగవాళ్లు ఇమామ్ పొరబాటును ఎత్తిచూపటానికి 'సుబ్హానల్లాహ్' బదులు 'అల్‌హమ్దులిల్లాహ్' అంటూ ఉంటారు. ఇది కూడా సరైనది కాదు. ఎందుకంటే దైవప్రవక్త విధానంలో ఇలాంటిదేదీ లేదు.

(١٧٥) وَعَنْ مُطَرِّفِ بْنِ عَبْدِ اللهِ بْنِ

175. హజ్రత్ ముతర్రిఫ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ షిఖ్ఖీర్ (రజి) తన తండ్రి గారు చెప్పి

الشِّخِّيرِ عَنْ أَبِيهِ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي وَفِي صَدْرِهِ أَزِيزٌ كَأَزِيزِ الْمِرْجَلِ، مِنَ الْبُكَاءِ. أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ ابْنَ مَاجه، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

నట్లు తెలిపారు: (తండ్రిగారు) ఇలా చెప్పారు - నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను నమాజ్ చేస్తుండగా చూచాను. దైవభీతి కారణంగా ఆయన (స) గుండెలో నుంచి ఉడుకుతున్న కుండ చేసే ధ్వని లాంటిది వినవచ్చేది". (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికమని ఖరారు చేశారు)

**సారాంశం**

దైవభీతి, దైవభక్తి పరాయణత కారణంగా నమాజు మధ్యలో మనిషి విలపిస్తే దానివల్ల నమాజ్‌కు ఎలాంటి భంగం, నష్టం వాటిల్లదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది.

**హదీసు ఉల్లేఖకులు**

(1) ముతర్రిఫ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ షిఖ్ఖీర్ (రజి) హర్షీ ఆమిరీ బస్రీ. తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడతారు. విశ్వసనీయులు. దైవభక్తి పరాయణులు. జ్ఞానిగా పేరు మోశారు. హిజ్రీ 95లో మరణించారు.

(2) 'తండ్రిగారు' అంటే ఇక్కడ అబ్దుల్లాహ్ బిన్ షిఖ్ఖీర్ బిన్ ఔఫ్ బిన్ కాబ్ హర్షీ ఆమిరీ (రజి) అన్నమాట. ఈయన దైవప్రవక్త సహచర్యం పొందిన వారిలో ఒకరు. దైవప్రవక్త (స) సమక్షంలోకి వచ్చిన బనీ ఆమిర్ బృందంలో ఈయన కూడా కీలకమయిన వ్యక్తి. బస్రీగా పరిగణించబడతారు.

(١٧٦) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ لِيْ مِنْ رَسُولِ اللهِ ﷺ مَدْخَلاَنِ، فَكُنْتُ إِذَا أَتَيْتُهُ وَهُوَ يُصَلِّي، تَنَحْنَحَ لِيْ. رَوَاهُ النَّسَائِيُّ وَابْنُ مَاجَهْ.

176. హజ్రత్ అలీ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను రెండు వేళల్లో కలుసుకునేవాణ్ణి. నేను ఆయన (స) వద్దకు వెళ్ళిన సమయంలో ఆయన (సఅసం) గనక నమాజ్ చేస్తున్న ట్లయితే నన్ను 'ఆగు' అని తెలియ జేయడానికి (నమాజ్‌లో నెమ్మదిగా) దగ్గేవారు. (నసాయి, ఇబ్నె మాజ)

**సారాంశం**

నమాజ్ మధ్యలో అనివార్యమైనపుడు నోటితో మాట్లాడకుండా కేవలం గొంతు సవరించుకున్న చందాన నెమ్మదిగా దగ్గవచ్చు. దీనివల్ల నమాజ్ భగ్నం కాదని హదీసు చెబుతోంది.

(١٧٧) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قُلْتُ لِبِلَالٍ: كَيْفَ رَأَيْتَ النَّبِيَّ ﷺ يَرُدُّ عَلَيْهِمْ حِينَ يُسَلِّمُونَ عَلَيْهِ، وَهُوَ يُصَلِّي؟ قَالَ: يَقُولُ هٰكَذَا وَبَسَطَ كَفَّهُ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

177. హజ్రత్ (అబ్దుల్లాహ్) ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "నమాజ్ చేసే సమయంలో ప్రజలు దైవప్రవక్త (సఅసం)కు సలాం చేస్తే ఆయన (స) వారికి బదులు ఎలా పలికేవారు?" అని నేను బిలాల్ (రజి)ను అడిగాను. 'ఈ విధంగా చేసేవారు' అంటూ ఆయన తన చేతిని చాపారు. (అబూదావూద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు-తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

నమాజ్‌లో సంజ్ఞ (సైగ చేయటం) ద్వారా 'సలాం' కు బదులు పలకటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. చాలామంది దీనితో ఏకీభవిస్తున్నారు. అయితే కొందరు దీంతో విభేదించారు. "నమాజ్‌లో సంభాషించేందుకు అనుమతి వున్న కాలం నాటిది ఈ సంఘటన. నమాజ్ మధ్యలో సంభాషించటం నిషేధించబడిన తరువాత సలాంకు బదులు పలకటం కూడా హరాం గావించబడినట్లే" అని వీళ్లు అంటున్నారు.

ఇక్కడ కాస్త ఆగి ఆలోచిస్తే ఒక విషయం అర్థం కాగలదు - నమాజ్‌లో సంభాషించే అనుమతి వున్న తొలికాలంలో సైగ ద్వారా జవాబు ఇవ్వవలసిన అగత్యం ఎందుకు ఏర్పడుతుంది? హాయిగా నోటితోనే సలాంకు బదులు ఇవ్వవచ్చుకదా! నోటితో గాకుండా సంజ్ఞతో జవాబు ఇచ్చారంటే, ఇది తరువాతి కాలంలో జరిగిన సంఘటనేననీ, అప్పటికే నమాజ్‌లో సంభాషించటం నిషేధించబడిందని స్పష్టమవుతున్నది. వాస్తవం ఏమిటంటే నమాజ్ స్థితిలో ఎవరయినా చేసిన సలాంకు సైగతో బదులు ఇవ్వటం ధర్మసమ్మతమే.

ఈ హదీసు ద్వారా బోధపడే ఇంకొక విషయమేమిటంటే బయటినుండి, నమాజ్ చేస్తున్న వ్యక్తికి సలాం చేయవచ్చు. కాకపోతే నమాజ్ చేసేవారు నోటితో గాకుండా సైగ చేయటం ద్వారా బదులు ఇవ్వాలి. ఈ సైగ ఎలా చేయాలి? దీనికి సంబంధించి కూడా అనేక ఉల్లేఖనాలు ఉన్నాయి. ఈ అనేక ఉల్లేఖనాల ఆధారంగా తెలిసేదేమంటే తల ఊపటం ద్వారా, చేయిచాపటం ద్వారా, చేతి వ్రేలి ద్వారా నమాజ్ స్థితిలో సలాంకు బదులు పలకవచ్చు.

(١٧٨) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ يُصَلِّي، وَهُوَ حَامِلٌ أُمَامَةَ بِنْتَ زَيْنَبَ، فَإِذَا سَجَدَ وَضَعَهَا،

178. హజ్రత్ అబూ ఖతాదా (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేయిస్తూ (తన మనుమరాలైన) ఉమామ బిన్తె జైనబ్ (ర.అన్హా)ను ఒడిలో ఎత్తుకుని ఉండే

وَإِذَا قَامَ حَمَلَهَا. مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: «وَهُوَ يَؤُمُّ النَّاسَ فِي الْمَسْجِدِ».

వారు. సజ్దాలోకి వెళ్ళేముందు ఆమెను దించేసేవారు. సజ్దాచేసి నిలబడిన తరువాత (తిరిగి ఆమెను) ఎత్తుకునే వారు." (బుఖారీ, ముస్లిం) 'ఆయన(స) ప్రజలకు నమాజ్ చేయిస్తూ ఈ విధంగా చేసేవారు' అని ముస్లిం ఉల్లేఖనంలో అదనంగా ఉంది.

## సారాంశం

అంటే దైవప్రవక్త (సఅసం) సామూహిక నమాజ్‌కు నేతృత్వం వహిస్తూ ఆ పిల్లను ఎత్తుకున్నారని హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఫర్జ్ నమాజ్ అయినా, నఫిల్ నమాజులో నయినా తప్పనిసరైనపుడు పిల్లలను ఎత్తుకుని నమాజ్ చేయవచ్చని దీన్నిబట్టి అర్థమవుతోంది. దీనివల్ల నమాజ్‌కు కలిగే కీడు ఏమీ లేదు.

నమాజులో తలపై నుండి తలపాగా (లేక టోపీ) క్రింద పడిపోతే దాన్ని ఎత్తుకుని తలపై పెట్టుకోవచ్చా? అని ఎవరో ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) ని ప్రశ్నించగా, దైవప్రవక్త (స) మూడేండ్ల పిల్ల ఉమామ బిన్తె జైనబ్‌ను నమాజ్‌లో ఎత్తుకున్నప్పుడు, తల పాగాను ఎత్తుకోవటంలో అభ్యంతరం ఏముంది? అని ఆయన వ్యాఖ్యానించారు. అంటే క్రిందపడిన తల పాగా (లేక టోపీ)ను ఎత్తుకోవటం సమంజసమే. ఈ మాత్రం కదలిక 'అమలె కసీర్' క్రిందికి రాదు.

## హదీసు ఉల్లేఖకులు

హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఉమామ బిన్తె జైనబ్ (ర.అన్హా) దైవప్రవక్త (సఅసం) కుమార్తె యగు జైనబ్ (ర.అన్హా) కూతురు. ఈమె తండ్రి పేరు అబుల్ ఆస్ బిన్ రబీ. ఫాతిమా (ర.అన్హా) వసీయతు ప్రకారం హజ్రత్ అలీ (రజి) గారు ఫాతిమ (ర.అన్హా) మరణానంతరం ఈమెను నికాహ్ చేసుకున్నారు.హజ్రత్ అలీ (రజి) అమరగతినొందిన తరువాత ముగీరా బిన్ నౌఫిల్ (రజి) ఈమెను వివాహమాడారు. కడకు ఈమె ఆయన సతీమణిగానే మరణించారు.

(١٧٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اقْتُلُوا الْأَسْوَدَيْنِ فِي الصَّلَاةِ: الْحَيَّةَ وَالْعَقْرَبَ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

179. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నమాజులో రెండు నల్లటి జంతువులను (పామును, తేలును) చంపేయండి." (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాలు నలుగురూ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు.)

### సారాంశం

నమాజ్ మధ్యలో పాము, తేలు వంటి విషపూరిత జంతువులను, కీటకాలను చంపటం వల్ల నమాజు భంగం కాజాలదని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. హానికరమయిన ఈ రెండు జంతువులను కనిపించగానే చంపివేయటం అవసరమని కూడా హదీసు వల్ల విదితమవుతోంది. అత్యధికమంది పండితులు కూడా దీంతో ఏకీభవించారు.

### 4వ అధ్యాయం

## ٤ - بَابُ سُتْرَةِ الْمُصَلِّي

## సుత్రా (తెర లేక అడ్డు)

(١٨٠) عَنْ أَبِي جُهَيْمِ بْنِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَوْ يَعْلَمُ الْمَارُّ بَيْنَ يَدَيِ الْمُصَلِّي مَاذَا عَلَيْهِ مِنَ الْإِثْمِ، لَكَانَ أَنْ يَقِفَ أَرْبَعِينَ خَيْراً لَهُ مِنْ أَنْ يَمُرَّ بَيْنَ يَدَيْهِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ. وَوَقَعَ فِي الْبَزَّارِ مِنْ وَجْهٍ آخَرَ: «أَرْبَعِينَ خَرِيفاً».

180. హజ్రత్ అబూ జుహైమ్ బిన్ హారిస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "నమాజ్ చేస్తున్న వ్యక్తి ముందు నుంచి నడిచిపోయే వానికి, తన ఈ చేష్టవల్ల ఎంత పాపం కలుగుతుందో తెలిస్తే, అలా నడచిపోయేబదులు నలభై (యేండ్లు) అయినాసరే అక్కడ నిలబడ టానికే అతను ఇష్టపడతాడు."

(బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి. బజ్జార్ ఉల్లేఖ నంలో-వేరొక సౌజన్యంతో - 40 యేండ్లు అన్న ప్రస్తావన వచ్చింది)

### సారాంశం

'సుత్రా' అంటే నమాజ్ చేసే వ్యక్తి తాను సజ్దా చేసే స్థలానికి ముందు అడ్డుగా ఉపయోగించుకునే వస్తువు. అది గోడ కావచ్చు, స్థంభం కావచ్చు, అడ్డు తెర కావచ్చు, కర్ర కావచ్చు లేదా అటువంటిదే మరేదయినా వస్తువు కావచ్చు. ఈ సుత్రా నమాజ్ చేసే వ్యక్తికీ, అతని ముందు నుంచి నడచిపోయే వారికీ మధ్య అడ్డుగా ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

అబూ జుహైమ్ బిన్ హారిస్ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్ అని అనబడుతోంది. ఖజ్రజ్ తెగకు చెందిన హారిస్ బిన్ సిమ్మ అన్సారీ కుమారులు. ప్రముఖ సహాబీలలో ఒకరు. అమీర్ ముఆవియ (రజి) ఖిలాఫత్ వరకు జీవించివున్నారు.

(١٨١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سُئِلَ رَسُولُ اللهِ ﷺ فِي غَزْوَةِ تَبُوكَ عَنْ سُتْرَةِ الْمُصَلِّي، فَقَالَ: «مثل مُؤْخِرَةِ الرَّحْلِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

181. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: తబూక్ యుద్ధ సందర్భంగా 'సుత్రా' (ఎత్తు) గురించి దైవప్రవక్త (సఅసం)ను అడగటం జరిగింది: దానికి ఆయన (సఅసం), "అది ఒంటెపై కట్టబడే పల్లకీ వెనుకభాగపు ఎత్తుకు సమానంగా ఉండాల"ని అన్నారు. (ముస్లిం)

**సారాంశం**

పొలాలు, బహిరంగ స్థలాలు, అటవీ ప్రాంతాలలో 'సుత్రా'ను ప్రతిష్ఠించాలని హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

(١٨٢) وَعَنْ سَبْرَةَ بْنِ مَعْبَدٍ الْجُهَنِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لِيَسْتَتِرْ أَحَدُكُمْ فِي الصَّلَاةِ وَلَوْ بِسَهْمٍ». أَخْرَجَهُ الْحَاكِمُ.

182. హజ్రత్ సబ్రా బిన్ మాబద్ జుహనీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "నమాజ్ (చేసే సమయం)లో మీలో ప్రతి ఒక్కరూ సుత్రాను తప్పక నెల కొల్పుకోవాలి -అది ఒక బాణమైనాసరే!" (ముస్తద్రక్ హాకిమ్)

**సారాంశం**

'సుత్రా' ఆఖరికి ఒక బాణమైనాసరే అని అనబడటాన్నిబట్టి అది లావుగా వున్నా, సన్నగా వున్నా దాన్ని ప్రతిష్ఠించటం మాత్రం అవసరమని దీన్నిబట్టి విదితమవుతున్నది.

**హదీసు ఉల్లేఖకులు**

సబ్రా బిన్ మాబద్ జుహనీ (రజి) మదీనా సహాబీ. 'జీమర్వ'లో నివాసం ఏర్పరచుకున్నారు. ఈయన మారు పేరు అబూ సురయ్యా. కందక పోరాటంలో తొలిసారిగా పాల్గొన్నారు. హజ్రత్ అలీ (రజి) పరిపాలనా కాలంలో అలీ (రజి) గారు తన తరఫున ఈయన్ని సిరియా వాసుల నుండి 'బైత్' స్వీకరించడానికి హజ్రత్ ముఆవియ (రజి) వద్దకు పంపించారు. హజ్రత్ ముఆవియ పరిపాలనాకాలం చరమ దశలో ఈయన మరణించారు.

(١٨٣) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يَقْطَعُ صَلَاةَ

183. హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు: "ముస్లిం

الْمَرْءِ الْمُسْلِمِ - إِذَا لَمْ يَكُنْ بَيْنَ يَدَيْهِ مِثْلُ مُؤْخِرَةِ الرَّحْلِ - الْمَرْأَةُ وَالْحِمَارُ وَالْكَلْبُ الْأَسْوَدُ». الْحَدِيثَ. وَفِيهِ: «الْكَلْبُ الْأَسْوَدُ شَيْطَانٌ». أَخْرَجَهُ مُسْلِمٌ.

పురుషుని నమాజ్‌ను - అతని ముందర, ఒంటెపై కట్టే పల్లకీ వెనుక భాగపు కఱ్ఱ ఎత్తుకు సమానంగా 'సుత్రా' లేనట్లయితే- స్త్రీ, గాడిద, నల్లకుక్క - భంగపరుస్తాయి.'' "నల్లకుక్క షైతాన్ అయి వుంటాడు'' అన్న వాక్యం కూడా ఈ హదీసులో ఉంది. (ముస్లిం)

وَلَهُ عَنْ أَبِي هُرَيْرَةَ نَحْوَهُ دُونَ الْكَلْبِ، وِلِأَبِي، دَاوُدَ وَالنَّسَائِيِّ عَنِ ابْنِ عَبَّاسٍ نَحْوَهُ دُونَ آخِرِهِ، وَقَيَّدَ الْمَرْأَةَ بِالْحَائِضِ.

ఇందులో హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం కూడా ఉందిగాని అందులో కుక్క ప్రస్తావన రాలేదు. అబూదావూద్, నసాయి కూడా హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఆధారంగా ఇదే విధంగా నకలు చేశారు. అయితే ఇందులో హదీసు ఆఖరి భాగం లేదు. ఇంకా, స్త్రీ గురించి చెబుతూ 'బహిష్టు అయి ఉన్నప్పుడు' అన్న నిబంధన ఉంది.

### సారాంశం

'సుత్రా' నిబంధనలో ఎన్నో పరమార్థాలు అంతర్లీనమై ఉన్నాయి. దాసుడు నమాజ్ కొరకు నిలబడినపుడు హదీసులో చెప్పబడినట్లు అతని ముందర దైవకారుణ్యం ఉంటుంది. దాసుడు నమాజ్‌కు ముందు సుత్రాను స్థాపిస్తే అది ఒక హద్దును ఏర్పరచుకుంటుంది. దాని అవతల నుంచి ఎవరు రాకపోకలు సాగించినా నమాజ్‌లో ఎలాంటి అంతరాయం కలగటంగానీ, దైవకారుణ్య పరిధిలో జోక్యం జరగటంగానీ ఉండవు.

'నమాజ్ భంగమవుతుంది' అన్న హదీసులోని వాక్యానికి భావం నమాజ్ పూర్తిగా వృధా అయిందని కాదు, నమాజులోని శుభాలు, మేళ్లు పుణ్యఫలాలు క్షీణిస్తాయని మాత్రమే దీని మతలబు. సామూహిక నమాజ్‌లో నమాజ్‌కు సారథ్యం వహించే వ్యక్తి (ఇమామ్) తన వెనుకనున్న వారందరి పాలిట - పరోక్షంగా - సుత్రాగా ఉంటాడు.

ఇక హదీసులో స్త్రీ, కుక్క, గాడిదల ప్రస్తావన ప్రత్యేకంగా ఎందుకు వచ్చింది? వారుగాక మరొకరెవరయినా నమాజీ ముందునుంచి నడచిపోతే నమాజ్ భంగమవదా?? అన్న ప్రశ్నలు ఇక్కడ జనిస్తాయి. వాస్తవానికి ఎవరు అలా నడచివెళ్ళినా నమాజులో దోషం తప్పక ఏర్పడుతుంది. ఇంతకు ముందు వచ్చిన ఒక హదీసులో పురుషుని ప్రస్తావన కూడా వచ్చింది. కాకపోతే ఇతరులకన్నా ఈ మూడింటి ద్వారా నమాజ్ ఏకాగ్రతకు మరింత ఎక్కువగా ఆటంకం కలుగుతుందన్నమాట!

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) ఆధారంగా తిర్మిజీ ఉటంకించిన ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది - స్త్రీ దాగి వుండవలసిన వస్తువు. ఆమె ఇంటి నుండి బయటికి వస్తే చాలు, షైతాన్ ఆమెను చాటు మాటుగా వెంటాడతాడు. ఇక గాడిద గురించి ఏమనబడిందంటే, అది షైతాన్‌ను చూచినపుడు గాండ్రుపెడుతుంది. ఇక కుక్క గురించి హదీసు ఉండనే ఉంది - నల్ల కుక్క షైతాన్ అయివుంటుంది. కుక్క అత్యంత చెండాలపు జంతువు. అది వున్న చోట దైవదూతలు ప్రవేశించరు. ఎవరయితే షరీయత్ సూచించిన హద్దులలో కాకుండా వేరితర పద్ధతిలో కుక్కను పెంచాడో అతడు అనుదినం తన పుణ్యార్జనలో రెండు యూనిట్ల కోత విధించుకున్నాడు.

(١٨٤) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا صَلَّى أَحَدُكُمْ إِلَى شَيْءٍ يَسْتُرُهُ مِنَ النَّاسِ، فَأَرَادَ أَحَدٌ أَنْ يَجْتَازَ بَيْنَ يَدَيْهِ، فَلْيَدْفَعْهُ، فَإِنْ أَبَى فَلْيُقَاتِلْهُ، فَإِنَّمَا هُوَ شَيْطَانٌ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِيْ رِوَايَةٍ: فَإِنَّ مَعَهُ الْقَرِيْنَ.

184. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయినా 'సుత్రా'ను ప్రతిష్ఠించి నమాజ్ చేయసాగినపుడు ఎవరయినా దాని ముందు నుంచి (అంటే సుత్రాకి-నమాజీకి మధ్య నుండి) నడచిపోతుంటే నమాజ్ చేసే వ్యక్తి అతన్ని ఆపేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ అతను ఖాతరు చేయకపోతే అతనితో పోరాడాలి. ఎందుకంటే అతడు (మానవ రూపంలో వున్న) షైతాన్" (బుఖారీ, ముస్లిం) 'అతనితో పాటు అతని సావాసి ఒకడున్నాడు' అని మరో ఉల్లేఖనంలో చెప్పబడింది.

**సారాంశం**

ఒక వ్యక్తి 'సుత్రా'ను నెలకొల్పి నమాజ్ చేసుకుంటూ ఉండగా అతని ముందర నుంచి వెళ్లడం అవాంఛనీయమయిన విషయం. అలా నడచివెళ్లే వానిని ఆపటం తప్పనిసరి (వాజిబ్) లేక అభిలషణీయం (ముస్తహబ్). ముందు నుంచి నడచిపోయే వ్యక్తిని నమాజీ సైగతో ఆపాలి. అప్పటికీ అతను లెక్క చేయకపోతే అతన్ని ప్రతిఘటించాలి. అప్పటికీ అతను నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే కొట్టాలి. అంతే. అంతకుమించిన గొడవగానీ, సిగపట్లు పట్టుకోవటంగానీ చేయకూడదు. అయితే నమాజీ 'సుత్రా'ను ప్రతిష్ఠించినపుడే ఇలా ప్రతిఘటించే హక్కు ఉంటుంది. ఒకవేళ సుత్రాను ప్రతిష్ఠించకపోతే ఆ తప్పు నమాజీది అవుతుంది. ఈ హదీసు ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే ఈపాటి చలనం వల్ల నమాజ్ భంగమవదు.

(١٨٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِذَا صَلَّى أَحَدُكُمْ فَلْيَجْعَلْ تِلْقَاءَ وَجْهِهِ شَيْئاً، فَإِنْ لَمْ يَجِدْ فَلْيَنْصِبْ عَصاً، فَإِنْ لَمْ يَكُنْ فَلْيَخُطَّ خَطّاً، ثُمَّ لاَ يَضُرُّهُ مَنْ مَرَّ بَيْنَ يَدَيْهِ**». أَخْرَجَهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّان، وَلَمْ يُصِبْ مَنْ زَعَمَ أَنَّهُ مُضْطَرِبٌ بَلْ هُوَ حَسَنٌ.

185. హజ్రత్ అబూ హురైర (రజి) కథనానుసారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరయినా నమాజ్‌కు ఉపక్రమించినపుడు తన ముందర ఏదైనా వస్తువు పాతుకోవాలి లేదా నెలకొల్పుకోవాలి. ఏ వస్తువూ దొరక్కపోతే తన కర్రనే నిలబెట్టుకోవాలి. అదీ లేకపోతే కనీసం నేలపై గీత గీసుకోవాలి. ఇక ఇప్పుడు నమాజీ ముందు నుంచి సాగి పోయేవాడు నమాజీకి ఎలాంటి నష్టం కలిగించలేడు." (దీనిని అహ్మద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఈ హదీసు విషయంలో ఎవరయినా సందిగ్ధస్థితికి లోనయితే వారి ఈ స్థితి సరైనది కాదు. పైగా ఈ హదీసు 'హసన్' (స్పష్టమయిన) స్థాయికి చెందినది).

**సారాంశం**

ప్రతి వస్తువూ 'సుత్రా'గా ఉపయోగపడుతుందని ఈ హదీసు ద్వారా విదితమవుతున్నది. ఏ వస్తువూ లభ్యం కాకపోతే నేలపై ఒక గీత గీసుకుని దానినే 'సుత్రా'గా పరిగణించవచ్చు.

(١٨٦) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَيَقْطَعُ الصَّلاَةَ شَيْءٌ، وَادْرَءُوا مَا اسْتَطَعْتُمْ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَفِي سَنَدِهِ ضَعْفٌ.

186. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "నమాజ్‌ను ఏ వస్తువూ భంగపరచ జాలదు (అయితే ముందునుంచి) నడచిపోయేవారిని సాధ్యమైనంతవరకు ఆపే ప్రయత్నం చేయండి." (అబూ దావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇది అందిన పరంపర బలహీనంగా ఉంది)

## 5వ అధ్యాయం

## نমాజ్‌లో అశక్తత, అణకువ

## ٥ - بَابُ الْحَثِّ عَلَى الْخُشُوعِ فِي الصَّلاَةِ

187. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: నమాజ్‌లో తమ (రెండు) చేతులను రెండు జబ్బలపై పెట్టుకుని నమాజ్ చేయటాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యం మాత్రం ముస్లింలోనిది)

(١٨٧) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ يُصَلِّيَ الرَّجُلُ مُخْتَصِراً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ، وَمَعْنَاهُ أَنْ يَجْعَلَ يَدَهُ عَلَى خَاصِرَتِهِ.

బుఖారీలోని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనంలో ఇలా వుంది - "ఇది యూదుల ఆరాధనా పద్ధతి."

وَفِي الْبُخَارِيِّ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا: «أَنَّ ذَلِكَ فِعْلُ الْيَهُودِ».

### సారాంశం

నమాజ్ కేవలం అల్లాహ్ కొరకే చేస్తున్నపుడు పూర్తి ఏకాగ్రతతో, మనసును లగ్నం చేసి మరీ చేయాలి. నమాజ్ స్ఫూర్తికీ, దాని స్వభావానికి, సంస్కారానికి విరుద్ధమయిన ఏ పనీ అందులో జరగరాదు. నమాజ్‌లో చేతులు కట్టుకుని నిలబడటమే మర్యాద అనిపించుకుంటుంది. జబ్బలపై చేతులు పెట్టుకుని నిలబడటం అణకువకి కాదుకదా అది అహంకారానికి ప్రతిరూపం. నమాజులోనయితే దాసుని అశక్తత, అణకువ, వినయ వినమ్రతలు తొణకిసలాడాలి. అందుకే చేతుల్ని జబ్బలపై (లేదా ప్రక్కలపై) పెట్టుకోవడాన్ని వారించటం జరిగింది. అదీగాక ఈ పద్ధతి యూదుల ఆరాధనా పద్ధతిని పోలివుండటంచేత దానిని విడనాడవలసిన అవసరం కూడా ఏర్పడింది.

188. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "సాయంకాలపు భోజనం గనక తయారై ఉంటే మగ్రిబ్ నమాజ్ చేయకమునుపే భుజించండి." (బుఖారీ, ముస్లిం)

(١٨٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ: قَالَ: «**إِذَا قُدِّمَ الْعَشَاءُ فَابْدَءُوا بِهِ قَبْلَ أَنْ تُصَلُّوا الْمَغْرِبَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

### సారాంశం

దీని భావం ఏమిటంటే నమాజ్‌కు ముందే వంట పూర్తయి భోజనం వడ్డించబడితే - ఆకలి కూడా ఉంటే - నమాజ్‌కు ముందే తినటం మంచిది. దీనివల్ల నమాజ్‌లో ఏకాగ్రత ఉంటుంది. మనిషి ఆకలి బాధతో అలమటిస్తున్నపుడు అతని మనసు నమాజ్‌లో లగ్నమవదు. అతని ధ్యాసంతా అన్నపానీయాలపైనే ఉంటుంది.;;;

(١٨٩) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا قَامَ أَحَدُكُمْ فِي الصَّلاَةِ فَلاَ يَمْسَحِ الْحَصَى، فَإِنَّ الرَّحْمَةَ تُوَاجِهُهُ». رَوَاهُ الْخَمْسَةُ بِإِسْنَادٍ صَحِيحٍ، وَزَادَ أَحْمَدُ: «وَاحِدَةً أَوْدَعْ». وَفِي الصَّحِيحِ عَنْ مُعَيْقِيبٍ نَحْوُهُ بِغَيْرِ تَعْلِيلٍ.

189. హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "మీలో ఏ వ్యక్తయినా నమాజ్ చేస్తున్నప్పుడు (సజ్దా చేసే స్థలం నుండి) కంకరరాళ్ళను తన చేత్తో తొలగించరాదు. ఎందుకంటే (ఆ సమయంలో) దైవకారుణ్యం నమాజీ వైపునకు కేంద్రీకృతం అయి ఉంటుంది." (దీనిని అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ లైదుగురూ ప్రామాణిక ఆధారాలతో ఉల్లేఖించారు)

ముస్నద్ అహ్మద్‌లో అదనంగా ఇలా ఉంది - "ఒకవేళ కంకరరాళ్లను తొలగిం చాలనే అనుకుంటే ఒకసారి తొలగిం చండి లేదా వదిలెయ్యండి" సహీహ్ బుఖారీలో హజ్రత్ ముఐఖిబ్‌చే ఈ విధంగా ఉల్లేఖించబడింది. అందులో కారణం తెలుపబడలేదు.

### సారాంశం

నమాజ్ మధ్యలో సజ్దా చేసే స్థలాన్ని శుభ్రపరచటం, తుడవటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఒకవేళ అలాంటిదేదయినా చేయాల్సివుంటే నమాజ్‌కు ముందే చేసుకోవాలి. ఇలా వారించబడటంలోని ఆంతర్యం ఏమిటంటే నమాజ్‌లో మనిషికి ఒక్క నమాజ్ తప్ప మరో ధ్యాస ఉండకూడదు. అతని మనసు నమాజ్‌లో పూర్తిగా నిమగ్నమై ఉండాలి. నమాజ్ మధ్యలో అతని నుదుటికి దుమ్ము తగిలినా, లేక మరేదయినా గడ్డి పరకలాంటిది అంటుకున్నా మధ్యలోనే దాన్ని దులపకూడదు. ఎందుకంటే ఆ సమయంలో దైవకారుణ్యం అతని వైపునకు మరలి ఉంటుంది. కీలకమయిన ఆ ఘడియలో అతను తన ఏకాగ్రతను పోగొట్టే చేష్టలకు పాల్పడితే దైవకారుణ్యానికి దూరమయ్యే ప్రమాదముంది. కనుక మరీ అనివార్యమైతే తప్ప అతను ఇలాంటి చేష్టలకు పాల్పడ కూడదు.

### హదీసు ఉల్లేఖకులు

ముఐఖిబ్ (రజి) పూర్తిపేరు ముఐఖిబ్ బిన్ అబూ ఫాతిమ. దౌస్ తెగకు చెందిన వారవటంచేత 'దౌసీ'గా పిలువబడేవారు. మక్కాలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో అబిసీనియా వైపునకు హిజ్రత్ చేశారు. బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) వారి 'ప్రవక్తా ముద్ర' ను భద్రపరచేవారు. హజ్రత్ అబూబక్ర్, హజ్రత్ ఉమర్‌లు ఈయన్ని కోశాగారానికి ఇన్‌చార్జిగా నియమించారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు.

(١٩٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنِ الالتِفَاتِ فِي الصَّلاَةِ، فَقَالَ: «**هُوَ اخْتِلاَسٌ يَخْتَلِسُهُ الشَّيْطَانُ مِنْ صَلاَةِ العَبْدِ**». رَوَاهُ الْبُخَارِيُّ.

190. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: నేను దైవప్రవక్త (సఅసం)ను నమాజులో కళ్ల కొనలతో అటూఇటూ దృష్టిసారించడాన్ని గురించి అడిగాను. దీనికాయన (సఅసం), ''ఇది షైతాన్ దోబూచులాట. దీనిద్వారా షైతాన్ దాసుని నమాజ్‌ను దోచుకుంటాడు'' అని చెప్పారు. (బుఖారీ)

وَلِلتِّرمِذِيِّ عَنْ أَنَسٍ - وَصَحَّحَهُ -: «إِيَّاكَ وَٱلالْتِفَاتَ فِي الصَّلاَةِ، فَإِنَّهُ هَلَكَةٌ، فَإِنْ كَانَ لاَ بُدَّ فَفِي التَّطَوُّعِ».

తిర్మిజీలోని హదీసులో దైవప్రవక్త (స) ఇలా చెప్పారని ఉంది: ''నమాజ్‌లో దోబూచులాటకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించండి. ఇది వినాశకర చేష్ట. మరీ అంతగా అవసరమైతే నఫిల్ నమాజులలో అలా చేయవచ్చు.''

### సారాంశం

షైతాన్ మనిషికి బద్ధశత్రువు. మనిషికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ వాడు జారవిడుచుకోడు. ఆఖరికి నమాజులో సయితం మనిషిని వెంటాడి, అతని ఆలోచనలను పరిపరి విధాలా మళ్లించి అతన్ని మరుపుకు లోను చేయాలని చూస్తాడు. కనీసం నమాజీ దృష్టినయినా మరో వైపు మళ్లించాలని ఎత్తు వేస్తాడు. ఆ విధంగానయినా మనిషిని పరధ్యానానికి లోనుచేయవచ్చున్నది వాడి ఉద్దేశ్యం. అందుకే దైవప్రవక్త (సఅసం) నమాజ్ చేసే వ్యక్తిని; షైతాన్ ఎత్తుగడలనుంచి కడు జాగ్రత్తగా, సావధానంగా ఉండాలని తాకీదు చేశారు. మరీ అనివార్యమైతేనే దృష్టిని ప్రక్కకు మరల్చాలి. అది కూడా ముఖం త్రిప్పేబదులు కళ్ల కొనలతో చూడాలంతే. అంతేగాని ఈ చేష్టను అలవాటుగా చేసుకోరాదు.

(١٩١) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ

191. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَانَ أَحَدُكُمْ فِي الصَّلاَةِ فَإِنَّهُ يُنَاجِي رَبَّهُ فَلاَ يَبْصُقَنَّ بَيْنَ يَدَيْهِ وَلاَ عَنْ يَمِينِهِ، وَلَكِنْ عَنْ شِمَالِهِ تَحْتَ قَدَمِهِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ: «أَوْ تَحْتَ قَدَمِهِ».

ప్రవచించారు - "మీలో ఎవరయినాసరే నమాజ్ చేస్తున్నప్పుడు అతడు తన ప్రభువుతో సంభాషిస్తూ ఉంటాడు. (కాబట్టి ఈ స్థితిలో) తన ముందు వైపు గానీ, కుడిప్రక్కనగానీ ఉమ్మివేయ రాదు. దానికి బదులు తన ఎడమ వైపున కాలి క్రింద (ఉమ్మాలి)" (బుఖారీ, ముస్లిం). "ఎడమవైపున లేక తన కాలి క్రింద" అని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

నమాజ్ చేస్తుండగా ఉమ్మి వచ్చినా, జలుబు కారణంగా ముక్కులోనుంచి నీరు వచ్చినా ఖిబ్లా దిశలోగానీ, కుడి వైపునగానీ ఉమ్మటంగానీ, ముక్కు చీదటం గానీ చేయరాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఆ సమయంలో మనిషి మస్జిద్‌లోవుంటే చేతి తువాలును గానీ, గుడ్డ (లేక టిష్యూ పేపర్)నుగానీ అడ్డుపెట్టుకోవాలి. ఒకవేళ ఆ క్షణంలో ఏ వస్తువూ లేకపోతే - గత్యంతరంలేని స్థితిలో - తన ఎడమకాలిక్రింద పారవేయాలి. మస్జిద్‌లో తివాచీ తదితర పాన్పులు లేనపుడే ఇది సాధ్యమవుతుంది. నమాజ్ ముగించిన వెంటనే ఆ స్థలాన్ని నీళ్లతో కడిగివేయాలి. వీలయితే డెట్టాల్ లాంటి క్రిమి సంహారక ద్రవ్యంగానీ, సుగంధద్రవ్యంగానీ అక్కడ చిలకరించి అశుద్ధతా ప్రభావాన్ని పూర్తిగా రూపుమాపాలి. ఇది ఒక విధంగా చేసిన తప్పుకు పరిహారం లాంటిదన్నమాట.

మొత్తానికి నమాజ్‌లో ఖిబ్లా దిక్కున ఉమ్మి వేయటం తప్పు. కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు, వారి శిష్యులు నమాజ్‌లో లేనపుడు (సాధారణ సమయాలలో) కూడా ఈ నియమాన్ని పాటించేవారు. ఖిబ్లా దిశపట్ల వారికున్న గౌరవమర్యాదలకు ఇదొక మచ్చు తునక. దైవప్రవక్త (స) ఒక ఇమామ్‌ను, నమాజ్ చేస్తుండగా ఖిబ్లా దిక్కున ఉమ్మివేసినందుకు, ఇమామత్ బాధ్యతలనుండి ఉద్వాసన పలికారని అబూదావూద్‌లో ఉల్లేఖించబడింది.

(١٩٢) وَعَنْهُ قَالَ: كَانَ قِرَامٌ لِعَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، سَتَرَتْ بِهِ جَانِبَ بَيْتِهَا، فَقَالَ لَهَا النَّبِيُّ ﷺ: «أَمِيطِي عَنَّا قِرَامَكِ هَذَا، فَإِنَّهُ لاَ تَزَالُ تَصَاوِيرُهُ تَعْرِضُ لِي فِي صَلاَتِي». رَوَاهُ الْبُخَارِيُّ.

192. హజ్రత్ అనస్ (రజి) కథనం: హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి వద్ద ఒక ఆకర్షణీయమైన తెర (పరదా నిమిత్తం) ఉండేది. దాన్ని ఆమె తన కుటీరంలో ఒకచోట వ్రేలాడదీశారు. దైవప్రవక్త (సఅసం) దాన్ని గమనించి, "ఆకర్షణీయమైన ఈ తెరను మా ముందునుంచి తీసివెయ్యి. ఎందుకంటే

وَاتَّفَقَا عَلَى حَدِيثِهَا فِيْ قِصَّةِ أَنْبِجَانِيَّةِ أَبِي جَهْمٍ، وَفِيْهِ: «فَإِنَّهَا أَلْهَتْنِي عَنْ صَلَاتِيْ».

దీనిపై వున్న చిత్రాలు నమాజులో నా ముందుకు వచ్చి ఆటంకం కలిగిస్తు న్నాయి" అని సెలవిచ్చారు. (బుఖారీ) బుఖారీ మరియు ముస్లిం లిరువురూ అబూజహమ్ గారి ఉన్ని తెర వృత్తాం తంపై ఏకాభిప్రాయం కలిగివున్నారు. అందులో ఇలా వుంది: "ఈ తెర నన్ను నా నమాజ్ నుండి విస్మరణకు గురి చేసింది."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా మనకు లభించే గుణపాఠం ఏమిటంటే; నమాజీ ఏకాగ్రతను భగ్నం చేసి అతని దృష్టిని తనవైపునకు త్రిప్పుకునే ప్రతి వస్తువునూ దూరంగా ఉంచాలి. దాన్ని నమాజ్ చేసేచోటినుంచి తొలగించటం సంభవం కాకపోతే స్వయంగా అక్కడినుండి నిష్క్రమించి వేరేచోట నమాజ్ చేయాలి. నమాజ్‌లో ఏకాగ్రతను, వినమ్రతను, భక్తీ పారవశ్యాన్ని కాపాడుకోవటానికి ఈ చర్య తీసుకోవటం అవసరం.

**హదీసు ఉల్లేఖకులు**

అబూజహమ్ (రజి) - ఈయన ఇబ్నె హుజైఫా బిన్ ఘానిమ్ ఖురషీ అదవీ. అదవీ తెగకు చెందిన వారవటం చేత అదవీగా వ్యవహరించబడేవారు. ఈయన అసలు పేరు ఆమిర్ లేక ఉబైద్. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. సుదీర్ఘ ఆయుష్షు పొందిన వారిలో ఒకరు. ఖురైషులు కాబాను నిర్మించినపుడూ ఉన్నారు. ఇబ్నె జుబైర్ (రజి) కాబా గృహాన్ని నిర్మించిననాటికి కూడా ఈయన జీవించివున్నారు. ఈయన ఇబ్నె జుబైర్ (రజి) ఖిలాఫత్ తొలికాలంలో మరణించారు.

(١٩٣) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيَنْتَهِيَنَّ أَقْوَامٌ يَرْفَعُونَ أَبْصَارَهُمْ إِلَى السَّمَاءِ فِي الصَّلَاةِ، أَوْلَا تَرْجِعُ إِلَيْهِمْ». رَوَاهُ مُسْلِمٌ.

193. హజ్రత్ జాబిర్ బిన్ సముర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ముస్లిం జాతి నమాజు చేస్తున్నప్పుడు తమ చూపులను ఆకాశం వైపునకు మరల్చే చేష్టకు దూరంగా ఉండాలి. లేకుంటే వారి చూపు తిరిగి రాని పరిస్థితి ఏర్పడ వచ్చు (అంటే అంధులుగా మారిపో వచ్చు). (ముస్లిం)

وَلَهُ عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «لاَ صَلاَةَ بِحَضْرَةِ الطَّعَامِ، وَلاَ وَهُوَ يُدَافِعُهُ الأَخْبَثَانِ».

'ముస్లిం'లోనే హ|జత్ ఆయిషా (ర.అన్హా) గారి ఉల్లేఖనం ఇలా వుంది: "భోజనం తయారై వుండగా, (మల మూత్ర విసర్జన) అవసరం ఏర్పడి వుండగా చేసే నమాజ్ నెరవేరదు" అని దైవప్రవక్త (సఅసం) చెప్పగా నేను విన్నాను.

**సారాంశం**

నమాజ్ మధ్యలో ఆకాశం వైపు చూడటం హరామ్ (నిషిద్ధం). ఇలా చూచేవాని నమాజ్ స్వీకరించబడదని ఇబ్నె హజమ్ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇమామ్ నవవీ (రహ్మ.లై) ముస్లిం వ్యాఖ్యానంలో - ఆకాశం వైపునకు చూచేవానికి ఇందులో తీవ్రమయిన హెచ్చరిక ఉందని అన్నారు. ఈ విషయంపై ఆయన పండితుల, విద్వాంసుల ఏకాభిప్రాయాన్ని కూడా నకలు చేశారు.

నమాజ్ ప్రారంభించకముందే కాలకృత్యాలు తీర్చుకోవటం మంచిది. మలమూత్రాలను విసర్జించవలసిన అవసరం ఏర్పడి ఉండగా, వాటిని బలవంతంగా ఆపే ప్రయత్నం చేస్తూ నమాజ్కై ఉపక్రమించటం మంచిదికాదు. దీనివల్ల నమాజ్లో ఏకాగ్రత దెబ్బతింటుంది. నమాజ్ నుంచి ఎప్పుడు బయటపడాలా? అన్న ఆలోచన అతన్ని తొలచివేస్తూ ఉంటుంది.

(١٩٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ. أَنَّ النَّبِيَّ ﷺ: قَالَ: «التَّثَاؤُبُ مِنَ الشَّيْطَانِ فَإِذَا تَثَاءَبَ أَحَدُكُمْ فَلْيَكْظِمْ مَا اسْتَطَاعَ». رَوَاهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَزَادَ: «فِي الصَّلاَةِ».

194. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హ|జత్ అబూ హురైర (రజి) వక్కాణించారు: "ఆవులింత రావటం షైతాన్ చేష్ట. మీలో ఎవరికయినా ఆవులింత వస్తే వీలయినంతవరకు దాన్ని ఆపడానికి ప్రయత్నించండి." (ముస్లిం, తిర్మిజీ - తిర్మిజీ తన ఉల్లేఖనంలో "నమాజులో" అన్న పదం పెంచారు).

**సారాంశం**

ఆవులింత సోమరితనానికి, బద్ధకానికి, నిద్రమత్తుకు, మితిమీరిన తిండికి ప్రబల నిదర్శనం. దైవదాసుణ్ణి అలాంటి స్థితిలో చూచి షైతాన్ మహా సంబరపడిపోతాడు.

6వ అధ్యాయం

# మస్జిద్ వ్యవస్థ

# ٦ - بَابُ الْمَسَاجِدِ

(١٩٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَمَرَ رَسُولُ اللهِ ﷺ بِبِنَاءِ الْمَسَاجِدِ فِي الدُّوْرِ. وَأَنْ تُنَظَّفَ وَتُطَيَّبَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَ إِرْسَالَهُ.

195. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు: ఇండ్లల్లో (మరియు పేటల్లో) నమాజ్ చేసే స్థలాలను నిర్ధారించుకోవాలనీ, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశించారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'ముర్సల్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

మస్జిదును, నమాజ్ చేసే స్థలాలను పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచుకోవాలి. సాధ్యమైనంతవరకు ఆ స్థలాలలో సువాసనను, పరిమళాన్ని వెదజల్లాలి. హదీసులో 'దువర్' అనే పదం వచ్చింది. దీని అర్థం వీధి అనీ, పేట అనీ వస్తుంది. అంటే మనం నివసించే పట్టణంలో పెద్ద మస్జిదుతో పాటు చిన్న చిన్న మస్జిదులను కూడా పేటల్లో, బస్తీలలో నిర్మించుకోవాలి. వాటిని చాలా పరిశుభ్రంగా ఉంచాలి. సుగంధద్రవ్యాల గుభాళింపుతో వాటిని అత్యంత పరిశుద్ధంగా ఉంచాలి. మన ఇండ్లల్లో కూడా ఏదో ఒక గదిని లేక మూల ప్రదేశాన్ని నమాజ్ కొరకు కేటాయించి దానిని ఎంతో నీటుగా ఉంచాలి. ఈ స్థలంలో ఇంటి ఆడవాళ్లు నమాజ్ చేయటంతో పాటు మగవారు కూడా సున్నత్, నఫిల్ నమాజులను ఆచరించవచ్చు.

(١٩٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**قَاتَلَ اللَّهُ الْيَهُودَ، اتَّخَذُوا قُبُورَ أَنْبِيَائِهِمْ مَسَاجِدَ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ: «**وَالنَّصَارَى**».

196. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: దేవుడు యూదులను సర్వనాశనం చేయుగాక! వాళ్లు దైవప్రవక్తల సమాధులను సాష్టాంగ (సజ్దా) స్థలంగా చేసుకున్నారు. (బుఖారీ, ముస్లిం - ముస్లింలో 'క్రైస్తవులు' అన్న పదం కూడా చేర్చబడింది)

وَلَهُمَا مِنْ حَدِيْثِ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا: **كَانُوا إِذَا مَاتَ فِيْهِمُ الرَّجُلُ الصَّالِحُ بَنَوا عَلَى قَبْرِهِ مَسْجِداً**. وَفِيهِ: **أُولَئِكَ شِرَارُ الْخَلْقِ**.

బుఖారీ, ముస్లింలలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చే ఇలా ఉల్లేఖించబడింది: "వారిలో పుణ్యపురుషుడు ఎవరయినా మరణిస్తే వాళ్లు ఆయన సమాధిని 'సజ్దా'గా చేసుకునేవారు." ఈ హదీసులో "వాళ్లు అత్యంత నీచమయిన జీవులు" అన్న వాక్యం కూడా ఉంది.

**సారాంశం**

దివ్య ఖుర్ఆన్ ప్రకారం వీళ్లు (యూదులు, క్రైస్తవులు) గ్రంథవహులు. వారికి ఆకాశ గ్రంథాలు ప్రసాదించబడ్డాయి. కాని విచారకరమయిన విషయం ఏమిటంటే వారు గ్రంథజ్ఞానం ఉండికూడా ప్రవక్తల సమాధులను పూజా స్థలాలుగా చేసుకున్నారు. ఆ సమాధుల వద్ద తమ కోరికలు వెలిబుచ్చుతూ మొక్కుకునేవారు. నిషిద్ధమయిన, అధర్మమయిన ఈ చేష్టను యూదులు మొదలెట్టగా, క్రైస్తవులు కూడా వారి పంథాలోనే నడవసాగారు. ఈ విధంగా వీళ్లు సృష్టికర్త దృష్టిలో అత్యంత తీవ్రమయిన, క్షమార్హం కాని షిర్క్ (బహుదైవోపాసన) కు ఒడిగట్టారు. కాగా; దర్గాల వద్దకు పోయి, సమాధులను ఆరాధనా స్థలాలుగా మారుస్తున్న నేటి సోకాల్డ్ ముస్లిములు, తాము ఎవరిని అనుసరిస్తున్నారో, తమ ఈ చేష్ట సృష్టికర్త ఆగ్రహాన్ని ఏ విధంగా కొనితెస్తుందో కాస్త ఆలోచించాలి. ముస్లింల ఈ చేష్ట కూడా విగ్రహారాధనా పరిధిలోకి వస్తుందనటంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ఈ పనిని అన్యులు చేస్తే అది శాపగ్రస్తమూను, ముస్లిములు చేస్తే పుణ్యప్రదమూనా?! ఇదెక్కడి ధర్మం? ఇది ఆత్మ వంచన తప్ప మరేమీ కాదు. అల్లాహ్ ముస్లిములకు ఇలాంటి వికృత చేష్టలకు దూరంగా మెలిగే సద్బుద్ధి నొసగుగాక!

(١٩٧) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: بَعَثَ النَّبِيُّ ﷺ خَيْلاً، فَجَاءَتْ بِرَجُلٍ، فَرَبَطُوْهُ بِسَارِيَةٍ مِنْ سَوَارِ الْمَسْجِدِ»، الْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

197. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒకసారి ఓ చిన్న సైనిక (గస్తీ) దళాన్ని ఏదో ప్రాంతం వైపునకు పంపించారు. ఆ సైనికులు ఒక (ముష్రిక్) వ్యక్తిని నిర్బంధించి దైవప్రవక్త (సఅసం) సన్నిధిలోకి తీసుకువచ్చారు. ఆ వ్యక్తిని మస్జిదె నబవీ స్థంభాలలోని ఒక స్థంభానికి కట్టివేశారు (ఖైదీగా బంధించారు).

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అవసరమైనప్పుడు ముష్రిక్కును మస్జిద్‌లోకి రప్పించటం, మస్జిదును కారాగారంగా ఉపయోగించటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఇందులో అనేక పరమార్థాలు

దాగి వున్నాయి. నిర్బంధితుడైన అవిశ్వాసి ముస్లింల ఆరాధనా రీతులను దగ్గరినుంచి గమనిస్తాడు. వాళ్లు ఏవిధంగా బారులు తీరి, హెచ్చుతగ్గులు లేకుండా నిలబడుతున్నారో, ఏవిధంగా ఒకే సమయంలో దైవ సన్నిధిలో మోకరిల్లి ప్రార్థిస్తున్నారో, ఏవిధంగా దివ్య గ్రంథపారాయణం చేస్తున్నారో శ్రద్ధగా తిలకిస్తాడు. ప్రభావితుడవుతాడు. హదీసులో నిర్బంధితునిగా తీసుకురాబడిన వ్యక్తి యమామ ప్రాంతపు నాయకుడు సమామ బిన్ ఉసాల్. ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో వెళుతూ పట్టుబడ్డాడు. మస్జిదె నబవీ (ప్రవక్త మస్జిద్)లో ఆ వ్యక్తిని దైవప్రవక్త (స) మూడు రోజులపాటు బంధించి ఉంచారు. ఎట్టకేలకు అతడు ఇస్లాం మాధుర్యాన్ని ఆస్వాదించాడు.

(١٩٨) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ عُمَرَ مَرَّ بِحَسَّانَ يُنْشِدُ فِي الْمَسْجِدِ، فَلَحَظَ إِلَيْهِ، فَقَالَ: قَدْ كُنْتُ أُنْشِدُ فيه، وَفِيْهِ مَنْ هُوَ خَيْرٌ مِّنْكَ. مُتَّفَقٌ عَلَيْهِ.

198. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) గారు హజ్రత్ హస్సాన్ (రజి) కూర్చున్న వైపు నుండి వెళుతున్నారు. ఆయన మస్జిద్‌లో కూర్చుని కవితలు చెబుతున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఆయన వంక తీక్షణంగా చూచారు. '(ఎందుకలా కొరకొరా చూస్తారు?) మస్జిద్‌లో మీకన్నా శ్రేష్ఠులు (దైవప్రవక్త - సఅసం) ఉన్నప్పుడు కూడా నేను ఇలాగే కవిత్వం చెప్పేవాడిని' అని ఆయన (రజి) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసును బట్టి మస్జిదులో కవితలు చెప్పటం సమ్మతమేగాని ఆ కవిత్వం తౌహీద్ (ఏక దైవారాధన) కు వ్యతిరేకంగా ఉండకూడదు. ఇంకా అందులో బహుదైవోపాసనా భావాలుగానీ, మిథ్యావాదాలుగానీ, ద్వంద్వార్థాలు వచ్చే మాటలుగానీ, నమాజీల ఏకాగ్రతను పాడుచేసే పరాచికాలు గానీ ఉండరాదు. హజ్రత్ హస్సాన్ (రజి) మస్జిద్‌లో కూర్చుని అవిశ్వాసుల ఆత్మ విశ్వాసాన్ని నీరుగార్చే కవితలు అల్లేవారు. దైవప్రవక్త (స) ఈ కవితల్ని విని "పరిశుద్ధాత్మ నీకు తోడ్పడుగాక! నీ కవితలు అవిశ్వాసులకు బాణాల్లా గుచ్చుకుంటున్నాయి" అని దీవించేవారు.

## హదీసు ఉల్లేఖకులు

హస్సాన్ బిన్ సాబిత్ (రజి) అన్సార్ సహాబీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు. 'ప్రవక్త (స) కవి'గా బిరుదు పొందారు. ఆనాటి పట్టణ కవులలో హస్సాన్ బిన్ సాబిత్ (రజి) గారే అందరికన్నా గొప్పవారు. హిజ్రీ 54లో హజ్రత్ ముఆవియా (రజి) పరిపాలనా కాలంలో మరణించారు. హిజ్రీ 55లో మరణించారని మరికొందరు వాదిస్తున్నారు. మరణ సమయంలో ఆయన వయస్సు 120 సంవత్సరాలన్నది గమనార్హం.

(١٩٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ سَمِعَ رَجُلاً يَنْشُدُ ضَالَّةً فِي الْمَسْجِدِ فَلْيَقُلْ: لاَ رَدَّهَا اللَّهُ عَلَيْكَ، فَإِنَّ الْمَسَاجِدَ لَمْ تُبْنَ لِهَذَا». رَوَاهُ مُسْلِمٌ.

199. హ॥జత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ఏ మనిషయినా తాను పోగొట్టుకున్న వస్తువును మస్జిద్‌లో వెతుకుతున్నాడని ఎవరైనా వింటే, 'దైవచిత్తమయితే ఆ వస్తువు దొరకకుండుగాక!' అని అనండి. మస్జిదులు నిర్మించబడింది ఈ ఉద్దేశ్యం కొరకు కాదు కదా!" (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో అందరికీ ఒక హెచ్చరిక ఉంది. ఎక్కడో పోగొట్టుకున్న వస్తువును మస్జిద్‌లో అన్వేషించటంలో అర్థం లేదు. ఇది మస్జిద్ మర్యాదకు విరుద్ధమయిన విషయం. ఈ మధ్య మస్జిదు వేదికలనుండి చేయబడే అనేకానేక ప్రకటనలు కూడా సమంజసమైనవి కావు. అయ్యావారి ఆవులు పోయినా, కామందులవారి కోడిపుంజు కనబడకుండాపోయినా ప్రకటనలు చేయడానికి మస్జిద్ మెంబరే దొరికిందా? ఈ జంతువులు మస్జిద్‌లోకయితే రావుకదా? ఒకవేళ అంతగా అడిగి ఆరా తీయదలచుకుంటే మస్జిద్ గేటు బయట నిలబడి వచ్చేపోయేవారిని అడగవచ్చు.

(٢٠٠) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا رَأَيْتُمْ مَنْ يَبِيعُ أَوْ يَبْتَاعُ فِي الْمَسْجِدِ فَقُولُوا: لاَ أَرْبَحَ اللَّهُ تِجَارَتَكَ». رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

200. హ॥జత్ అబూ హురైర (రజి) కథనానుసారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "మీలో ఎవరినయినా మస్జిద్‌లో క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు మీరు చూస్తే, 'దేవుడు నీ వర్తకంలో, లావాదేవీలలో లాభం చేకూర్చకుండుగాక!' అని అనండి." (ఈ హదీసును తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

మస్జిదులలో వ్యాపార లావాదేవీలు, కొనుగోలు - అమ్మకాలు జరపరాదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. అంటే మస్జిదులను వాణిజ్య కేంద్రాలుగా, వ్యాపార మండీలుగా మార్చుకోరాదు. మస్జిదులను నిర్మించేది దైవారాధన, దైవనామస్మరణ కోసమే గాని వర్తకం కోసం కాదు. మస్జిద్‌లయొక్క ఈ మర్యాదను మనం ఖాతరు చేయకపోతే అవి తమ ఉద్దేశ్యాన్ని, అసలు లక్ష్యాన్ని కోల్పోతాయి.

(٢٠١) وَعَنْ حَكِيمِ بْنِ حِزَامٍ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تُقَامُ الحُدُودُ فِي المَسَاجِدِ، وَلاَ يُسْتَقَادُ فِيهَا». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ بِسَنَدٍ ضَعِيفٍ.

201. హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "మస్జిదులలో శిక్షలు విధించటంగానీ, వాటిలో ఖిసాస్ (రక్త పరిహారం) తీసుకోవటంగానీ చేయరాదు." (ఈ హదీసును అబూదావూద్, అహ్మద్ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

మస్జిదులు దైవారాధన కోసం నిర్మించబడ్డాయి. అవి పవిత్ర స్థలాలు. అందుచేత వాటిలో హద్దులు (శిక్షలు) విధించటం, రక్తం ప్రవహింపజేయటం వంటివి చేయరాదు. శిక్షల్ని అమలుపరచే స్థానాలను ప్రత్యేకంగా నిర్ధారించుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

హకీమ్ బిన్ హిజామ్ (రజి) మరో పేరు అబూ ఖాలిద్. ఖురైష్ వర్గంలోని అసద్ తెగకు చెందినవారు. హజ్రత్ ఖదీజా (ర.అన్హా) కు అన్న కుమారులవుతారు. ఖురైషు కులీనులలో ఒకరుగా గుర్తింపుపొందారు. ఏనుగుల వాళ్ల సంఘటన జరగక 13 సంవత్సరాల క్రితం మక్కాలో జన్మించారు. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 54 తరువాత మదీనాలో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 120 సంవత్సరాలు. అంటే 60 యేండ్లు అజ్ఞాన కాలంలోనూ, మరో 60 యేండ్లు ఇస్లాంలోనూ గడిచాయి. ఆయనకు నలుగురు కుమారులు. నలుగురూ సహాబీలుగా పరిగణించబడ్డారు. మర్యాదస్తులు.

(٢٠٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أُصِيبَ سَعْدٌ يَوْمَ الْخَنْدَقِ، فَضَرَبَ عَلَيْهِ رَسُولُ اللهِ ﷺ خَيْمَةً فِي الْمَسْجِدِ، لِيَعُودَهُ مِنْ قَرِيبٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

202. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: కందక యుద్ధ సందర్భంగా హజ్రత్ సాద్ (రజి) గాయపడగా దైవ ప్రవక్త (సఅసం) ఆయనకు దగ్గరవుండి వైద్యసేవలు చేసే నిమిత్తం మస్జిద్‌లో పందిరి వేయించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దీన్నిబట్టి అత్యవసర సమయాల్లో రోగులను, క్షతగాత్రులను పరామర్శించే, వైద్యసదుపాయాలు కల్పించే ఉద్దేశ్యంతో మస్జిదులో ప్రత్యేక క్యాంపులు (శిబిరాలు) స్థాపించవచ్చని ఈ హదీసు ద్వారా అర్థమవుతోంది. అలాగే మస్జిదులో నిద్రించటం, రోగిని పరామర్శించటం, క్షతగాత్రులకు సేవలు చేయటం, వైద్యసదుపాయాలను సమకూర్చటం కూడా ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

ఇక్కడ సాద్ (రజి) అంటే సాద్ బిన్ ముఆజ్ అన్నమాట! ఈయన 'ఔస్' తెగ నాయకుడు. పెద్ద సహాబీలలో ఒకరుగా పరిగణించబడతారు. రెండు ఉఖబా ప్రమాణాలలో కూడా హాజరయ్యారు. ఈయన ఇస్లాం స్వీకరించిన కారణంగా బనూ అబ్దె అష్హల్ తెగ కూడా ఇస్లాం స్వీకరించింది. ఈయన తన తెగకు సర్దారుగా, మర్యాదస్తుడైన వ్యక్తిగా పేరు సంపాయించారు. ఈయన తెగవారు ఈయన మాటను జవదాటేవారు కాదు. కందక యుద్ధంలో బాణం గుచ్చుకుని శరీరం నుండి రక్తం తీవ్రంగా ప్రవించింది. ఈ బాధతోనే ఆయన (రజి) బనూ ఖురైజ సంఘటన అనంతరం - హిజ్రీ 5 జీఖఅదలో - మరణించారు.

(٢٠٣) وَعَنْهَا قَالَتْ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَسْتُرُنِيْ، وَأَنَا أَنْظُرُ إِلَى الْحَبَشَةِ يَلْعَبُونَ فِي الْمَسْجِدِ، اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

203. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను చూచాను, ఆయన (స) నా కొరకు పరదా కట్టారు. నేను, మస్జిదులో క్రీడా విన్యాసాలు చేస్తున్న అబిసీనియన్లను (నీగ్రోలను)చూస్తూ నిలబడ్డాను. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

పండుగలు, పర్వదినాలలో, ఆనంద సమయాలలో మస్జిదు ప్రాంగణంలో కర్రసాము చేయటం, యుద్ధ విన్యాసాలు ప్రదర్శించటం సమ్మతమేనని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతున్నది. అలాగే అపరిచిత పురుషుల సామూహిక ప్రదర్శనలు కూడా స్త్రీలు తెరచాటున ఉండి చూడవచ్చు.

(٢٠٤) وَعَنْهَا أَنَّ وَلِيْدَةً سَوْدَاءَ كَانَ لَهَا خِبَاءٌ فِي الْمَسْجِدِ، فَكَانَتْ تَأْتِيْنِي، فَتَحَدَّثُ عِنْدِي. اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

204. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "ఒక నల్లని ఆడపిల్ల కోసం మస్జిద్‌లో శిబిరం వేయబడింది. ఆ పిల్ల నాతో మాట్లాడటానికి వస్తూ ఉండేది." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

స్త్రీ కూడా రాత్రిపూట మస్జిదులో ఉండగలదని ఈ హదీసువల్ల స్పష్టమవుతున్నది. అయితే ఉపద్రవానికి, గొడవలకు ఏమాత్రం అవకాశం లేని శుభప్రదమయిన వాతావరణంలోనే ఇలాంటి దృష్టాంతాలు నెలకొల్పటం సాధ్యమవుతుంది.

ఇది సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే. పూర్తి హదీసు బుఖారీలో వుంది.

(٢٠٥) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ

205. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్

قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «البُصَاقُ فِي الْمَسْجِدِ خَطِيئَة، وَكَفَّارَتُهَا دَفْنُهَا». مُتَّفَقٌ عَلَيْهِ.

(రజి) తెలిపారు - "మస్జిద్‌లో ఉమ్మి వేయటం పాపం. దీని పరిహారం ఉమ్మిని పూడ్చిపెట్టడమే. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మస్జిద్ దైవారాధన నిమిత్తం నిర్మించబడింది. దైవారాధన జరిగే చోటు పవిత్రంగా ఉండాలి. అశుద్ధతకు, మాలిన్యానికి అక్కడ ఎలాంటి ఆస్కారముండకూడదు. మస్జిద్‌లో ఉమ్మివేయటం మస్జిద్ మర్యాదకు విరుద్ధాంశం. అందులో ఏది జరిగినా సభ్యతా సంస్కారాలకు ప్రతిబింబంగా ఉండాలి. అసభ్యంగా, అమర్యాదకరంగా ప్రవర్తించి పవిత్రమయిన వాతావరణాన్ని పాడు చేయకూడదు. అందుకే మస్జిద్‌లో ఉమ్మటం మహాపాపంగా పరిగణించబడింది. ఎవరయినా తెలియక అలా చేస్తే దానికి పరిహారం (కప్ఫారా) పూడ్చిపెట్టడమే. (ఒకవేళ నాపరాయిపై లేక గచ్చుపై ఉమ్మివేస్తే దాన్ని శుభ్రంగా కడిగివేయాలి)

(٢٠٦) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَقُومُ السَّاعَةُ حَتَّى يَتَبَاهَى النَّاسُ فِي الْمَسَاجِدِ». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

206. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు: "ప్రజలు మస్జిదుల (నిర్మాణం)పై గర్వాన్ని చాటనంతవరకూ ప్రళయం సంభవించదు." (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప అందరూ ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ప్రళయదినం సమీపించేముందు ఒక కాలం రానున్నది. ఆ కాలంలో ప్రజలు అందమైన మస్జిదులను నిర్మిస్తారు. వాటిని అపురూపంగా తీర్చిదిద్దుతారు. మా మస్జిద్ ఫలానా వారు కట్టిన మస్జిద్‌కన్నా అందంగా ఉందని బడాయి చాటుకుంటారు. కాని శోచనీయమయిన విషయం ఏమిటంటే ఆ మస్జిదులు నమాజీలతో కళకళలాడే బదులు వెల వెల బోతుంటాయి. జనులు మస్జిదులనయితే పోటీపడి నిర్మిస్తారుగానీ నమాజ్ కోసం రారు. తమపట్ల నిర్మాతలు కనబరుస్తున్న నిర్లక్ష్యవైఖరిపై మస్జిదులు విలపిస్తూ ఉంటాయి.

(٢٠٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا

207. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "మస్జిదుల అలంకరణ, ముస్తాబు గురించి నాకు ఆజ్ఞాపించబడలేదు" (అబూదావూద్

أُمِرْتُ بِتَشْيِيدِ الْمَسَاجِدِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు).

**సారాంశం**

ఆర్భాటంగా మస్జిదులపై నగిషీలు వేయటం, అట్టహాసంగా విద్యుద్దీపాలతో ముస్తాబు చేయటం సమంజసంకాదని పై హదీసు ద్వారా స్పష్టమవుతోంది. మస్జిదులను దైవ నామస్మరణ ద్వారా, నమాజ్ ద్వారా కళకళలాడేలా చేయమని ఆజ్ఞాపించబడింది. దేవుని దృష్టిలో అసలు కళ 'ఆరాధనే'. ఈ కళను పట్టించుకోకుండా కృత్రిమమయిన కళాకాంతులపై శ్రద్ధచూపటంలో అర్థం లేదు. మస్జిదులలో మోతాదుకు మించిన అలంకరణ వల్ల నమాజ్‌లో ఏకాగ్రతకు భంగం వాటిల్లే అవకాశం ఉంది. పైగా అట్టహాసంతో కూడిన నగిషీలు, అలంకరణలు రాజుల, చక్రవర్తుల సున్నత్ (సంప్రదాయం) మాత్రమే గానీ ప్రవక్త సంప్రదాయం కాదు. వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ మస్జిదె నబవీలో తొలిసారిగా నగిషీలు వేయించాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలంలోగానీ, ధర్మ ఖలీఫాల పరిపాలనా కాలంలోగానీ ఇలాంటి వినూత్న పోకడలు మస్జిద్‌లలో ఎక్కడా కానరావు. సత్య ప్రేమికులయిన ఉలమా సయితం ఇలాంటి విషయాలపై నోరు విప్పని పరిస్థితి దాపురించింది.

(٢٠٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «عُرِضَتْ عَلَيَّ أُجُورُ أُمَّتِي، حَتَّى الْقَذَاةَ يُخْرِجُهَا الرَّجُلُ مِنَ الْمَسْجِدِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَاسْتَغْرَبَهُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

208. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: "నా అనుచర సమాజం ఆచరణలు నా ముందు సమర్పించ బడ్డాయి. (పుణ్యప్రదమయిన) ఈ ఆచరణలలో మనిషి మస్జిద్ నుండి తీసి బయటపారవేసే ఓ చిన్న చెత్తముక్కను కూడా నేను చూశాను." (ఈ హదీసును అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'గరీబ్ (అరుదైనది)గా ఖరారు చేశారు, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

అతి చిన్న సత్కార్యం కూడా లెక్కలోనికి వస్తుందనీ, చిత్తశుద్ధి ఉంటే ఆ చిన్న సదాచరణే ఒక్కోసారి పెద్ద పుణ్యఫలాన్ని ఆర్జించిపెడుతుందనీ ఈ హదీసు భావం. మస్జిదుల పరిశుభ్రత, పరిశుద్ధతల గురించి ఇస్లాం తన అనుయాయులకు గట్టిగా తాకీదు చేస్తోంది. ఒక చిన్న గడ్డిపరక,

రద్దీముక్క కూడా మస్జిదులో ఉండకుండా మనం జాగ్రత్తపడాలి. ఎవరయినా ఈ తేలికపాటి పనిని కూడా సంకల్పశుద్ధితో చేస్తే దాని సత్ఫలం అతనికి తప్పక లభిస్తుంది.

(٢٠٩) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا دَخَلَ أَحَدُكُمُ الْمَسْجِدَ فَلَا يَجْلِسْ حَتَّى يُصَلِّيَ رَكْعَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

209. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ ఖతాద (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరు ఎప్పుడు మస్జిద్‌లో ప్రవేశించినా కూర్చునే ముందు రెండు రకతుల (నఫిల్) నమాజు చేయాలి."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో ప్రస్తావించబడిన నఫిల్ నమాజును 'తహియతుల్ మస్జిద్' అనంటారు. షాఫయిాల దృష్టిలో ఇది తప్పనిసరి. కాగా; అత్యధికమంది ధర్మవేత్తలు దీనిని అభిలషణీయం (ముస్తహబ్) గా భావించారు. హదీసులోని తాకీదును దృష్టిలో పెట్టుకుని కొంతమంది పండితులు నఫిల్ నమాజులను మక్రూహ్ వేళల్లో కూడా చేసేందుకు అనుమతించారు. ఈ హదీసు దృష్ట్యా మనకు బోధపడే మరో విషయమేమిటంటే; మస్జిద్ వేదికపైనుండి ఖతీబ్ ప్రసంగిస్తున్నప్పటికీ మస్జిద్‌లోకి ప్రవేశించిన వ్యక్తి రెండు రకతుల నమాజ్ చేసి మరీ కూర్చోవాలి.

**7వ అధ్యాయం**

## నమాజ్ చేసే విధానం

## ٧ - بَابُ صِفَةِ الصَّلَاةِ

(٢١٠) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: إِذَا قُمْتَ إِلَى الصَّلَاةِ فَأَسْبِغِ الْوُضُوءَ، ثُمَّ اسْتَقْبِلِ الْقِبْلَةَ فَكَبِّرْ، ثُمَّ اقْرَأْ مَا تَيَسَّرَ مَعَكَ مِنَ الْقُرْآنِ، ثُمَّ ارْكَعْ حَتَّى تَطْمَئِنَّ رَاكِعاً، ثُمَّ ارْفَعْ حَتَّى تَعْتَدِلَ قَائِماً، ثُمَّ اسْجُدْ حَتَّى تَطْمَئِنَّ سَاجِداً، ثُمَّ ارْفَعْ حَتَّى تَطْمَئِنَّ جَالِساً، ثُمَّ اسْجُدْ حَتَّى

210. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "మీరు నమాజ్ చేయ సంకల్పించినపుడు ముందు సరిగ్గా వుజూ చేసుకుని ఖిబ్లా వైపునకు తిరిగి తక్బీర్ (అల్లాహు అక్బర్) పలకండి. తరువాత దివ్య ఖుర్ఆన్‌లో ఎంత భాగం మీకు జ్ఞాపకమున్నా అందులో నుంచి సులువుగా చదవగలిగినంత చదవండి. తరువాత 'రుకూ' చేయండి. రుకూ సాధ్యమైనంత వరకు తాపీగా చేయండి. తరువాత

تَطْمَئِنَّ سَاجِداً، ثُمَّ افْعَلْ ذَلِكَ فِي صَلاَتِكَ كُلِّهَا». أَخْرَجَهُ السَّبْعَةُ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

నిటారుగా నిలబడండి. ప్రశాంతంగా నిలబడండి (హడావిడి వద్దు). ఆ తరువాత 'సజ్దా' చేయండి. సజ్దా చాలా నింపాదిగా చేయండి. సజ్దాలోనుంచి తల పైకెత్తి హాయిగా కూర్చోండి. ఆ తరువాత రెండవ సజ్దా చేయండి. ఈ సజ్దా కూడా నింపాదిగా చేయండి. అంతే. ఆ తరువాత మిగిలిన నమాజునంతా ఈ విధంగానే (ప్రశాంతంగా - ఓపికతో - చేయండి). (దీనిని బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ, ఇమామ్ అహ్మద్ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం ఇమామ్ బుఖారీ గారివి)

وَلِابْنِ مَاجَهْ بِإِسْنَادِ مُسْلِمٍ: «حَتَّى تَطْمَئِنَّ قَائِماً» وَمِثْلُهُ فِي حَدِيثِ رِفَاعَةَ بْنِ رَافِعِ بْنِ مَالِكٍ عِنْدَ أَحْمَدَ وَابْنِ حِبَّانَ. وَفِي لَفْظٍ لِأَحْمَدَ: فَأَقِمْ صُلْبَكَ حَتَّى تَرْجِعَ العِظَامُ.

ఇబ్నె మాజ ముస్లిం ఆధారంగా - 'రుకూ' నుండి నిలబడే సమయంపై ఈ పదాలు నకలు చేశారు: "పూర్తిగా స్థిరంగా నిలబడండి" అహ్మద్ మరియు ఇబ్నె హిబ్బాన్‌లో రిఫా బిన్ రాఫె బిన్ మాలిక్ ఉల్లేఖనంలో కూడా ఇలాగే వుంది. ముస్నద్ అహ్మద్‌లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: "మీ నడుమును నిటారుగా - ఎముకలు తమ స్థానాలలోకి వచ్చేలా - నిలబెట్టండి" అని వుంది.

وَلِلنَّسَائِيِّ وَأَبِي دَاوُدَ مِنْ حَدِيثِ رِفَاعَةَ ابْنِ رَافِعٍ: إِنَّهَا لَنْ تَتِمَّ صَلاَةُ أَحَدِكُمْ حَتَّى يُسْبِغَ الْوُضُوءَ كَمَا أَمَرَهُ اللَّهُ تَعَالَى، ثُمَّ يُكَبِّرَ اللَّهَ تَعَالَى، وَيَحْمَدَهُ، وَيُثْنِيَ عَلَيْهِ. وفيها: فَإِنْ

నసాయి మరియు అబూదావూద్‌లో రిఫా బిన్ రాఫె ద్వారా ఇలా ఉల్లేఖించబడింది: "అల్లాహ్ ఆదేశించిన విధంగా వుజూ సంపూర్ణంగా చేయనంతవరకూ నమాజ్ సంపూర్ణం కాజాలదు. తరువాత తక్బీర్ పలకాలి, దైవస్తోత్రం చేయాలి,

كَانَ مَعَكَ قُرْآنٌ فَاقْرَأْ، وَإِلاَّ فَاحْمَدِ اللَّهَ، وَكَبِّرْهُ، وَهَلِّلْهُ. وِلأَبِي دَاوُدَ «ثُمَّ اقْرَأْ بِأُمِّ الْقُرْآنِ، وَبِمَا شَاءَ اللَّهُ» وَلابْنِ حِبَّانَ: «ثُمَّ بِمَا شِئْتَ».

ఆయన్ని కొనియాడాలి.'' ఈ ఉల్లేఖనంలో ఇంకా ఇలా వుంది: ''నీకు ఖుర్ఆన్ లోని ఎంత భాగం జ్ఞాపకముంటే అంత పఠించు. లేకుంటే దైవస్తోత్రం చెయ్యి మరియు అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలుకు.'' అబూ దావూద్‌లో ''ఫాతిహా సూరా పఠించు. ఇంకా అల్లాహ్ తలచినంతగా (పఠించు)'' అని వుంది. ఇబ్నె హిబ్బాన్ లో ''మరి మీరు కోరినంతగా చదవండి'' అని వుంది.

## సారాంశం

ఎంతో ప్రశాంతంగా, ఆగి ఆగి ఒక్కో 'రుకున్'ను చక్కగా, పరిపూర్ణంగా నెరవేరుస్తూ మరీ నమాజ్ చేయాలని హదీసులో తాకీదు చేయబడింది. నమాజ్‌లో ఏ అంశం తరువాత ఏ అంశం వస్తుందో - క్రమపద్ధతిలో తెలుపబడింది. నమాజ్ చేసేవారు - వారు ఇమాములయినా, ఇమాములను అనుసరించే ముఖ్తదీలయినా, లేక ఒంటరిగా నమాజ్ చేసే వారయినా - తాము నమాజ్‌లో ఏం పలుకుతున్నారో, ఏం చేయబోతున్నారో బాగా ఆలోచించి, అర్థం చేసుకుని చేస్తే అందలి మధురిమను తనివితీరా ఆస్వాదించవచ్చు. అలా కాకుండా ఏదో మొక్కుబడిగా చేస్తే మనిషి జీవితంపై దాని ప్రభావం కనిపించదు. హడావిడిగా చేసే నమాజ్ అసలు నమాజే కాదు. ఇటువంటి వారిని దైవప్రవక్త (స) నమాజ్ దొంగలుగా, కపట నమాజీలుగా పేర్కొన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

రిఫా బిన్ రాఫె బిన్ మాలిక్ (రజి). ఈయన మారుపేరు అబూ ముఆజ్. జుర్ఖీ అన్సారీ మదనీగా పేరు మోశారు. సుప్రసిద్ధ సహాబీలలో ఒకరు. ఈయన తన తండ్రితో కలసి 'ఉఖబా ప్రమాణా'నికి హాజరయ్యారు. ఈయన తండ్రిగారు అన్సార్లలో అందరికన్నా ముందు ఇస్లాం స్వీకరించారు. రిఫా బిన్ రాఫె బద్ర్ యుద్ధం మినహా మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. జమల్ మరియు సిఫ్ఫీన్ యుద్ధాలలో హజ్రత్ అలీ (రజి)కి మద్దతునిచ్చారు. అమీర్ ముఆవియ (రజి) పరిపాలనా కాలంలో - హి॥జీ 41లో మరణించాను.

(٢١١) وَعَنْ أَبِي حُمَيْدٍ السَّاعِدِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ

211. అబూ హుమైద్ సాయిదీ (రజి) ఉల్లేఖించారు: ''నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను తక్బీర్ (తక్బీరె ఊలా) చేస్తుండగా చూశాను.

ﷺ إِذَا كَبَّرَ جَعَلَ يَدَيْهِ حَذْوَ مَنْكِبَيْهِ، وَإِذَا رَكَعَ أَمْكَنَ يَدَيْهِ مِنْ رُكْبَتَيْهِ ثُمَّ هَصَرَ ظَهْرَهُ، فَإِذَا رَفَعَ رَأْسَهُ اسْتَوَى، حَتَّى يَعُودَ كُلُّ فَقَارٍ مَكَانَهُ، فَإِذَا سَجَدَ وَضَعَ يَدَيْهِ غَيْرَ مُفْتَرِشٍ وَلاَ قَابِضِهِمَا، وَاسْتَقْبَلَ بِأَطْرَافِ أَصَابِعِ رِجْلَيْهِ الْقِبْلَةَ، وَإِذَا جَلَسَ فِي الرَّكْعَتَيْنِ جَلَسَ عَلَى رِجْلِهِ الْيُسْرَى، وَنَصَبَ الْيُمْنَى، وَإِذَا جَلَسَ فِي الرَّكْعَةِ الأَخِيرَةِ قَدَّمَ رِجْلَهُ الْيُسْرَى، وَنَصَبَ الأُخْرَى، وَقَعَدَ عَلَى مَقْعَدَتِهِ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

అప్పుడాయన రెండు చేతులనూ భుజాలకు సమానాంతరంగా లేపేవారు. రుకూ చేసినపుడు తన రెండు చేతులతో తన మోకాళ్లను గట్టిగా పట్టుకునేవారు. ఆ సమయంలో తన వీపును వంచేవారు. రుకూనుండి తలను ఎత్తినపుడు నిటారుగా - కీళ్లన్నీ యథాస్థానంలోకి వచ్చేలా-నిలబడేవారు. సజ్దా చేసినపుడు తన రెండు చేతులనూ నేలపై ఉంచేవారు. ఆ సమయంలో (చేతుల్ని) మరీ ముడుచుకోవటంగానీ, మరీ చాపటంగానీ చేసేవారు కాదు. సజ్దా స్థితిలో రెండు కాళ్ల వ్రేళ్లు ఖిబ్లా వైపునకు ఉండేవి. ఆయన రెండు రకతులు పూర్తి చేసి ఖాయిదాలో కూర్చున్నపుడు ఎడమ పాదాన్ని నేలపై పరచుకునేవారు. కుడిపాదాన్ని నిలిపి ఉంచేవారు. చివరి ఖాయిదాలో ఎడమ పాదాన్ని కాస్త ముందుకు జరిపి కుడి పాదాన్ని నిలిపి ఉంచేవారు. పిరుదుపై (బరువు మోపి) కూర్చునేవారు." (బుఖారీ)

## సారాంశం

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) గారి నమాజ్ చేసే విధానం విశదీకరించబడింది. ఆయన (స) అనుయాయులయిన ముస్లింలు కూడా సాధ్యమైనంతవరకూ ఈ విధానాన్నే అనుసరించాలి. 'నేను నమాజ్ చేస్తుండగా మీరు చూసిన విధంగానే మీరు కూడా నమాజ్ చేయండి' అని దైవప్రవక్త (స) ఉపదేశించారు. దైవప్రవక్త (స) వారి ఉపదేశాన్ని దృష్టిలో పెట్టుకుని నమాజీలు ఎంతో నింపాదిగా, ప్రశాంతంగా, ఒక్కో అంశాన్ని సజావుగా నెరవేరుస్తూ, ఖుర్ఆన్ వాక్యాలను బాగా ఆగి ఆగి పఠిస్తూ నమాజ్ చేయాలి. త్వరత్వరగా రుకూ, సజ్దాలు చేసి నమాజ్‌ను చెడగొట్టకూడదు. కొద్ది సమయంలో ఆదరాబాదరాగా నమాజ్ చేసేవానిని కోడి ముక్కుతో పోల్చటం జరిగింది. ఇంకా అటువంటి నమాజ్ 'కపట నమాజ్'గా ఖరారు చేయబడింది. అటువంటి నమాజులతో చేకూరే ప్రయోజనం ఏముంటుంది?

### హదీసు ఉల్లేఖకులు

అబూ హుమైద్ సాయిదీ (రజి) గారి నామాంతరం అమ్ర్. ముంజిర్ బిన్ సాద్ బిన్ ముంజిర్ అని కొందరంటారు. మాలిక్ అన్సారీ ఖజ్రజీ మదనీ అని మరికొందరు వాదిస్తారు. ఉహుద్ మరియు ఆ తరువాత జరిగిన యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రీ 61లో అమీర్ ముఆవియా (రజి) పరిపాలనా కాలం చరమదశలోనో, లేక యజీద్ పరిపాలనా కాలం తొలిదశలోనో మరణించారు.

(٢١٢) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ رَسُولِ اللهِ ﷺ، أَنَّهُ كَانَ إِذَا قَامَ إِلَى الصَّلَاةِ، قَالَ: «**وَجَّهْتُ وَجْهِيَ لِلَّذِي فَطَرَ السَّمَاوَاتِ وَالْأَرْضَ** – إِلَى قَوْلِهِ – **مِنَ الْمُسْلِمِينَ. اللَّهُمَّ أَنْتَ الْمَلِكُ، لَا إِلَهَ إِلَّا أَنْتَ، أَنْتَ رَبِّي وَأَنَا عَبْدُكَ، إِلَى آخره**». رَوَاهُ مُسْلِمٌ، وَفِي رِوَايَةٍ لَهُ إِنَّ ذَلِكَ فِي صَلَاةِ اللَّيْلِ.

212. హజ్రత్ అలీ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ కొరకు నిలబడినపుడు మొదట ఈ దుఆ పఠించేవారు - "నేను నా ముఖాన్ని ఏకాగ్రచిత్తంతో భూమ్యాకాశాలను సృష్టించిన వాని వైపునకు త్రిప్పుకొంటున్నాను. నేను బహుదైవారాధకులలోని వాణ్ణి కాను. నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవనం మరియు నా మరణం సర్వలోక ప్రభువైన అల్లాహ్ కే అంకితం. ఆయన సహవర్తులెవరూ లేనివాడు. నాకు దీని గురించిన ఆజ్ఞే ఇవ్వబడింది. నేను ముస్లింలలోని వాణ్ణి. ఓ అల్లాహ్! నీవే యజమానివి (చక్రవర్తివి). నీవే ఆరాధ్యుడవు. నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నీవే నా ప్రభువువి. నేను నీ దాసుణ్ణి......" (ముస్లిం)

### సారాంశం

పై హదీసులోని దుఆ ఇంకావుంది. మిగిలిన భాగం యొక్క అనువాదం ఇది: "....... నేను నా ఆత్మకు అన్యాయం చేసుకున్నాను. నేను నా పాపాన్ని ఒప్పుకుంటున్నాను. కనుక (ఓ స్వామీ) నా పాపాలన్నింటినీ మన్నించు. (వాస్తవమేమిటంటే) నీవు తప్ప పాపాలను మన్నించగల వాడెవడూ లేడు. నన్ను ఉత్తమ నైతికత వైపునకు, సత్ప్రవర్తన వైపునకు నడిపించు. నీవు తప్ప మంచినడవడిక వైపునకు ఎవరూ మార్గదర్శకత్వం వహించలేరు. నా దుర్గుణాలను నా నుండి దూరం చెయ్యి. వాస్తవమేమిటంటే నీవు తప్ప మరెవరూ దుర్గుణాలను దూరం చెయ్యలేరు. మాటిమాటికీ నీ సమక్షంలో హాజరవుతున్నాను. నీ విధేయుణ్ణి. మేళ్లన్నీ నీ స్వాధీనంలో ఉన్నాయి. నీ తరఫునుండి ఎన్నటికీ కీడు ఉండదు. నేను నీ వెంటవున్నాను. నీ వైపున ఉన్నాను. నీవు మాత్రమే శుభప్రదమయిన వాడవు మరియు ఘనత, ఆధిపత్యం కలవాడవు. పాపాల మన్నింపుకై నిన్నే వేడుకుంటున్నాను.

పశ్చాత్తాపభావంతో నీ వైపునకే మరలుతున్నాను." దీనిని ముస్లిం ఉల్లేఖించారు. ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఈ దుఆ రాత్రిపూట (తహజ్జుద్) నమాజ్‌లో చేసేవారని ఉంది. ఫర్జ్ నమాజ్‌లో దైవప్రవక్త (సఅసం) ఈ దుఆ చేసేవారన్న దానికీ అనేక ఆధారాలున్నాయి. (వివరాల్లోకి పోయే అవకాశం లేకపోవటం వల్ల ఈ చర్చను ఇక్కడితో ముగిస్తున్నాము).

(٢١٣) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا كَبَّرَ لِلصَّلاَةِ سَكَتَ هُنَيْهَةً قَبْلَ أَنْ يَقْرَأَ، فَسَأَلْتُهُ، فَقَالَ: أَقُولُ: «اللّٰهُمَّ بَاعِدْ بَيْنِي وَبَيْنَ خَطَايَايَ، كَمَا بَاعَدْتَ بَيْنَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ، اللّٰهُمَّ نَقِّنِي مِنْ خَطَايَايَ، كَمَا يُنَقَّى الثَّوْبُ الأَبْيَضُ مِنَ الدَّنَسِ، اللّٰهُمَّ اغْسِلْنِي مِنْ خَطَايَايَ بِالْمَاءِ وَالثَّلْجِ وَالْبَرَدِ». مُتَّفَقٌ عَلَيْهِ.

213. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: తక్బీరె తహ్‌రీమా తరువాత దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొద్దిసేపు ఆగి ఖుర్‌ఆన్ పారాయణం మొదలెట్టేవారు. 'దైవప్రవక్తా (స)! ఈ విరామ సమయంలో మీరేం చదువు తారు?' అని నేను ప్రశ్నించాను. "ఈ దుఆ పఠిస్తాను" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు: (దుఆ అనువాదం ఇది) "ఓ అల్లాహ్! తూర్పు - పడమరలకు మధ్య ఎంత అంతరం ఉందో నాకు - నా పాపాలకు మధ్య అంత దూరాన్ని ఉంచు. ఓ దేవా! ఏ విధంగా తెల్లని వస్త్రం మాలిన్యాల నుండి పరిశుభ్రం చేయబడుతుందో ఆ విధంగా నన్ను పాపాలు, అపరాధాల నుండి పరిశుద్ధ పరచు. ఓ ప్రభూ! నా పాపాలను నీటితో, మంచుతో, వడగళ్లతో ప్రక్షాళనం చెయ్యి." (ముస్లిం)

**సారాంశం**

'తక్బీరె తహ్రీమా' తరువాత - ఖుర్‌ఆన్ పారాయణం మొదలెట్టక ముందు - ఈ 'దుఆ' చేయటం దైవప్రవక్త విధానమని ఈ హదీసు ద్వారా మనకు బోధపడుతున్నది. దుఆ బిగ్గరగా గాకుండా, మెల్లగా చదవాలని కూడా హదీసు ద్వారా విదితమవుతోంది.

(٢١٤) وَعَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَانَ يَقُوْلُ: «سُبْحَانَكَ اللّٰهُمَّ،

214. హజ్రత్ ఉమర్(రజి) (విరామ సమయంలో) "సుబ్‌హాన కల్లాహుమ్మ..." పఠించేవారు - (అర్థం) దేవా! నీవు పవిత్రుడవు. ప్రశంసలన్నీ నీకు మాత్రమే

وَبِحَمْدِكَ، وَتَبَارَكَ اسْمُكَ، وَتَعَالَى جَدُّكَ، وَلاَ إِلَهَ غَيْرُكَ». رَوَاهُ مُسْلِمٌ بِسَنَدٍ مُنْقَطِعٍ، وَالدَّارَقُطْنِيُّ مَوْصُولاً، وَهُوَ مَوْقُوفٌ.

తగును. నీ నామం శుభప్రదం. నీ ఘనత ఎంతో ఉన్నతమైనది. నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. (ముస్లిం దీనిని 'మున్‌ఖతీ'గాను, దారె ఖుత్నీ 'మౌసూల్'గాను ఉల్లేఖించారు. ఈ హదీసు మౌఖూఫ్)

وَنَحْوُهُ عَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ مَرْفُوعاً عِندَ الْخَمْسَةِ، وَفِيهِ: وَكَانَ يَقُولُ بَعْدَ التَّكْبِيرِ: «أَعُوذُ بِاللهِ السَّمِيعِ الْعَلِيمِ مِنَ الشَّيْطَانِ الرَّجِيمِ مِنْ هَمْزِهِ، وَنَفْخِهِ، وَنَفْثِهِ».

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లైదుగురూ హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) సౌజన్యంతో ఈ విధంగానే ఉల్లేఖించారు. ఇందులో "అవుజుబిల్లాహి స్సమీయిల్ అలీమ్, మినష్షయితా నిర్రజీమ్ మిన్ హమ్‌జిహీ, వ నఫ్‌ఖిహీ, వ నఫ్సిహీ" అని కూడా ప్రస్తావించ బడింది (అర్థం: నేను శాపగ్రస్తుడైన షైతాన్ బారినుండి, వాడి పైశాచిక ప్రేరణలనుండి, వాడి కవ్వింపు నుండి, వాడి గర్వాహంకారం నుండి సర్వం వినే వాడు, సర్వం తెలిసినవాడైన అల్లాహ్ శరణు కోరుతున్నాను).

## సారాంశం

'తక్బీరె తహ్రీమా'కి - సూరె ఫాతిహాకి మధ్య నున్న విరామ సమయంలో "అల్లాహుమ్మ బాయిద్ బైని....." అనే దుఆ పఠించాలని ఇంతకు ముందు వచ్చిన సహీహ్ హదీసులో ఉంది. కొన్ని ఉల్లేఖనాలలో "ఇన్నీవజ్జహ్తు...." దుఆ చదవాలనీ, దీంతోపాటు "సుబ్‌హానకల్లాహుమ్మ....." కూడా కలుపుకోవచ్చనీ ఉంది. "సుబ్‌హానకల్లాహుమ్మ" ప్రస్తావన ఉన్న హదీసు 'మౌఖూఫ్' అయినప్పటికీ హజ్రత్ ఉమర్ (రజి) లాంటి గొప్ప సహాబీ బిగ్గరగా దాన్ని పఠించటమేగాక, ప్రజలకు దానిని నేర్పేవారు. అందువల్ల దీనిని ఉపేక్షించలేము. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) కూడా దీనిని అవలంబించారు. మరో ముఖ్య విషయం - ఫాతిహా సూరా ప్రారంభించే ముందు 'తఅవ్వుజ్' మరియు 'తస్మియ' చదవటం అవసరం అని దైవప్రవక్త (సఅసం) గారి ఆదేశం వల్ల తెలుస్తోంది.

(٢١٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَسْتَفْتِحُ الصَّلَاةَ بِالتَّكْبِيرِ، وَالْقِرَاءَةَ بِـ«الْحَمْدُ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ»، وَكَانَ إِذَا رَكَعَ لَمْ يُشْخِصْ رَأْسَهُ وَلَمْ يُصَوِّبْهُ، وَلَكِنْ بَيْنَ ذَلِكَ؛ وَكَانَ إِذَا رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ لَمْ يَسْجُدْ حَتَّى يَسْتَوِيَ قَائِماً، وَإِذَا رَفَعَ رَأْسَهُ مِنَ السُّجُودِ لَمْ يَسْجُدْ حَتَّى يَسْتَوِيَ جَالِساً، وَكَانَ يَقُولُ فِي كُلِّ رَكْعَتَيْنِ التَّحِيَّةَ، وَكَانَ يَفْرِشُ رِجْلَهُ الْيُسْرَى، وَيَنْصِبُ الْيُمْنَى، وَكَانَ يَنْهَى عَنْ عُقْبَةِ الشَّيْطَانِ، وَيَنْهَى أَنْ يَفْتَرِشَ الرَّجُلُ ذِرَاعَيْهِ افْتِرَاشَ السَّبُعِ، وَكَانَ يَخْتِمُ الصَّلَاةَ بِالتَّسْلِيمِ. أَخْرَجَهُ مُسْلِمٌ، وَلَهُ عِلَّةٌ.

215. హ(జత్ ఆయిషా (ర.అన్హా) కథనం: దైవ(ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అల్లాహు అక్బర్' అంటూ నమాజ్‌ను ఆరంభించేవారు. 'అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్' (ఫాతిహా సూరా) తో ఖుర్‌ఆన్ పఠనం మొదలెట్టేవారు. రుకూ చేసినపుడు తన తలను మరీ పైకిగానీ, మరీ క్రిందికిగానీ ఉంచేవారు కారు. ఆ రెండింటికీ మధ్య స్థితిలో తల ఉంచేవారు. రుకూ స్థితినుండి తల పైకెత్తిన తరువాత అప్పటికప్పుడే సజ్దాలోకి వెళ్ళకుండా నిటారుగా నిలబడేవారు. సజ్దానుండి తలపైకెత్తిన మీదట ప్రశాంతంగా కూర్చొననిదే రెండవ సజ్దాలోకి వెళ్ళేవారు కాదు. ప్రతి రెండు రకతుల తరువాత తషహ్హుద్ (అత్తహియ్యాత్) పఠించేవారు. ఆ సమయంలో ఎడమ కాలిని క్రిందపరచుకుని కుడి పాదాన్ని నిలిపి ఉంచేవారు. షైతాన్ తరహాలో కూర్చోవటాన్ని వారించేవారు. క్రూరమృగాల వలె భుజాలను (చేతులను) ముందుకు జరిపి కూర్చోవడాన్ని కూడా వారించేవారు. సలాం చేయడంతో నమాజ్‌ను ముగించేవారు." (ముస్లిం - దీని పరంపర లోపభూయిష్టంగా ఉంది)

(٢١٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَرْفَعُ يَدَيْهِ

216. హ(జత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవ(ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్‌ను ఆరంభించినపుడు తన

حَذْوَ مَنْكِبَيْهِ إِذَا افْتَتَحَ الصَّلَاةَ وَإِذَا كَبَّرَ لِلرُّكُوعِ، وَإِذَا رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ. مُتَّفَقٌ عَلَيْهِ.

రెండు చేతులను భుజాలకు సమానాంతరంగా ఎత్తేవారు. రుకూ చేసినపుడు, రుకూ నుండి తలపైకెత్తినపుడు కూడా తన రెండు చేతుల్ని భుజాలకు సమానాంతరంగా లేపేవారు. (అంటే 'రఫె యదైన్' చేసేవారు). (బుఖారీ, ముస్లిం)

وَفِيْ حَدِيْثِ أَبِي حُمَيْدٍ عِنْدَ أَبِي دَاوُدَ يَرْفَعُ يَدَيْهِ حَتَّى يُحَاذِيَ بِهِمَا مَنْكِبَيْهِ، ثُمَّ يُكَبِّرُ.

అబూదావూద్‌లో అబూ హుమైద్‌చే ఉల్లేఖించబడిన హదీసులో ఉంది: "తన రెండు చేతుల్ని భుజాలకు సమానంగా ఎత్తి అల్లాహు అక్బర్ అని పలికేవారు."

وَلِمُسْلِمٍ عَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ. نَحْوَ حَدِيْثِ ابْنِ عُمَرَ، لَكِنْ قَالَ: حَتَّى يُحَاذِيَ بِهِمَا فُرُوْعَ أُذُنَيْهِ.

ఇంకా ముస్లింలో మాలిక్ బిన్ హువైరిస్ (రజి) చేత ఉల్లేఖించబడిన హదీసులో కూడా ఇబ్నెఉమర్ ఉల్లేఖనంలో ఉన్నట్లే చెప్పబడింది. కాని ఇందులో 'తన భుజాలకు సమానాంతరంగా' అనే బదులు 'చెవులవరకు' అని ఉంది.

**సారాంశం**

తక్బీరె తహ్రీమా చెప్పే సమయంలోనూ, రుకూలోకి వెళ్ళే సందర్భంలోనూ, రుకూ నుండి నిలబడే సమయంలోనూ 'రఫెయదైన్' చేయటం దైవప్రవక్త సంప్రదాయం (మస్నూన్) అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. మరికొన్ని హదీసులలో రెండు రకతుల తరువాత మూడవ రకత్ ఆరంభానికి ముందు కూడా రఫెయదైన్ చేయాలని ఉంది. అత్యధిక సహాబీలు, వారి శిష్యులు ఈ విధానాన్నే పాటించారు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అహ్మద్ (రహ్మ.లై), అబూసూర్ (రహ్మ.లై), ఇబ్నె ముబారక్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ద్వారా కూడా ఇదే ఉటంకించబడింది. దైవప్రవక్త (సఅసం) జీవితాంతం 'రఫెయదైన్' చేసేవారని, ధర్మ ఖలీఫాలు కూడా ఈ పద్ధతిని అనుసరించారన్న దానికి చారిత్రక ఆధారాలున్నాయి.

హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) గారి సాక్ష్యం ఈ విషయంలో ప్రబల తార్కాణంగా నిలిచింది. వాయల్ బిన్ హుజ్ర్ (రజి) తబూక్ యుద్ధానంతరం హిజ్రీ 9లో ఇస్లాం స్వీకరించారు. మరుసటి సంవత్సరం ఆయన (రజి) దైవ ప్రవక్త (సఅసం) సన్నిధిలోకి వచ్చినపుడు మదీనాలో చలి తీవ్రంగా ఉంది. ఆయన ప్రవక్త ప్రియ సహచరులను (చలి కారణంగా) దుస్తుల లోపలినుంచే 'రఫెయదైన్' చేయటం గమనించారు. అవి హిజ్రీ 10వ సంవత్సరం ఆఖరి మాసాలు. ఆ తరువాత

హి|జ్రీ 11వ ఏట దైవప్రవక్త (సఅసం) పరమపదించారు. దీన్నిబట్టి తెలిసేదేమంటే 'రఫెయదైన్' ఆచరణ ఆయన (స) జీవితం ఆఖరి ఘడియ వరకూ కొనసాగింది. కొంతమంది చెబుతున్నట్లు ఈ ఆచరణ రద్దవటంగానీ, మానివేయబడటంగానీ జరగలేదు. ప్రవక్త ప్రియసహచరులలో అత్యధికులు దీనిని అవలంబించారు. కూఫా నగరంతో సహా అరేబియాలోని ప్రముఖ పట్టణాలన్నింటిలోనూ దీనిపై అమలు జరిగింది. ఇస్లామీయ ధర్మవేత్తలలో అత్యధికులు ఈ 'రఫెయదైన్' పద్ధతిని అభిలషించారు. బుఖారీ, ముస్లింలతో పాటు క్రింద పేర్కొనబడిన గ్రంథాలలో కూడా ఈ హదీసు పొందుపరచబడి ఉంది : -

సుననె అబూదావూద్, జామె తిర్మిజీ, సునన్ నసాయి, సునన్ ఇబ్నెమాజ, సునన్ దారిమీ, ముఅత్తా ఇమామ్ మాలిక్, ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్, అల్ ముసన్నఫ్, లి ఇబ్నె అబీ షైబ, ముస్నద్ అహ్మద్, సహీహ్ ఇబ్నె ఖుజైమ, సహీహ్ ఇబ్నె హిబ్బాన్, ముస్నద్ అబీ అవానా, సునన్ దారె ఖుత్నీ, సుననె కుబ్రా, బైహఖీ మొదలగునవి.

(٢١٧) وَعَنْ وَائِلِ بْنِ حُجْرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَوَضَعَ يَدَهُ الْيُمْنَى عَلَى يَدِهِ الْيُسْرَى عَلَى صَدْرِهِ. أَخْرَجَهُ ابْنُ خُزَيْمَةَ.

217. హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) ఉల్లేఖించారు: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి నమాజ్ చేశాను. ఆయన (స) తన కుడి చేతిని ఎడమ చేతిపై ఉంచి రొమ్ముపై చేతులు కట్టుకున్నారు." (ఇబ్నె ఖుజైమ)

## సారాంశం

ఈ హదీసు ద్వారా రెండు అంశాలు మన దృష్టికి వస్తున్నాయి. ఒకటి: నమాజులో చేతులు కట్టుకుని నిలబడటం సరైన విధానం (మస్నూన్). చేతులు వదలి నమాజ్ చేయటం సరైన విధానం కాదు. షాఫయీలు, హనఫీలు, హంబలీలు - అందరూ ఈ అంశంపై ఏకీభవించారు. అత్యధికమంది ప్రవక్త సహచరులు, వారి శిష్యుల ఉవాచ కూడా ఇదే. ఇబ్నె ముంజిర్ తదితరులు ఇమామ్ మాలిక్ నుండి సంగ్రహించిన నకలులో కూడా ఇదే ఉంది. ఆఖరికి ముఅత్తా ఇమామ్ మాలిక్‌లో కూడా చేతులు కట్టుకోవడం గురించిన ఉల్లేఖనమే ఉంది. మరలాంటప్పుడు ఈ పద్ధతినే పాటించాలి. దీనికి భిన్నంగా - చేతులు వదలి నమాజ్ చేయాలన్న ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఉల్లేఖనం సరైనది కాదు.

రెండు: చేతులు ఎక్కడ కట్టాలి? అన్న విషయానికి వద్దాం. చేతులు రొమ్ముపై కట్టుకోవాలా? నాభిక్రింద కట్టుకోవాలా? కొంతమంది నాభిక్రింద చేతులు కట్టుకుంటారు. దీన్ని సమర్థిస్తున్న హదీసు బలహీనమైనది, ప్రామాణికమైనది కాదు. పైన పేర్కొనబడిన హదీసును ఇబ్నె ఖుజైమ తన సహీహ్‌లో లిఖించగా ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ హల్బ్ హదీసు ద్వారా దీనికి మద్దతు లభిస్తున్నది. దైవప్రవక్త (స) తన చేతులను రొమ్ముపై కట్టుకునే వారని అందులో చెప్పబడింది. అహ్లె హదీస్ ఉలమాలు, రొమ్ముపై చేతులు కట్టుకోవటమే సరైనదని, నాభి క్రింద చేతులు కట్టుకోవాలన్న ఉల్లేఖనం బలహీనమైనదని ప్రబలమైన నిదర్శనాల ద్వారా నిరూపిస్తున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

వాయల్ బిన్ హుజ్ర్ (రజి) గారి మరో పేరు అబూ హునైద లేక అబూ హింద. సుప్రసిద్ధ సహాబీలలో ఒకరు. హజర్‌మోత్ చక్రవర్తులలో ఒకరు. ఈయన తన మిత్ర బృందంతో కలసి దైవప్రవక్త (సఅసం) సన్నిధిలోకి వచ్చినపుడు ఈయన గౌరవార్థం దైవప్రవక్త (స) తన శాలువాను క్రిందపరచి కూర్చోబెట్టారు. ఈయన కొరకు, ఈయన సంతతి కొరకు ప్రార్థించారు. హజర్‌మోత్ తెగలపై ఈయన్ని పర్యవేక్షకునిగా నియమించారు. ఎట్టకేలకు ఈయన కూఫాలో స్థిరపడ్డారు. అమీర్ ముఆవియ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు.

(٢١٨) وَعَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «لاَ صَلاَةَ لِمَنْ لَمْ يَقْرَأْ بِأُمِّ الْقُرْآنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

218. హజ్రత్ ఉబాద బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు: "ఎవరయితే (నమాజ్‌లో) ఉమ్ముల్ ఖుర్‌ఆన్ పఠించలేదో అతని నమాజ్ నెరవేరదు." (బుఖారీ, ముస్లిం)

وَفِيْ رِوَايَةٍ لابْنِ حِبَّانَ وَالدَّارَقُطْنِيِّ: «لاَ تُجْزِىءُ صَلاَةٌ لا يُقْرَأُ فِيهَا بِفَاتِحَةِ الْكِتَابِ».

ఇబ్నె హిబ్బాన్, దారె ఖుత్నీ ఉల్లేఖనాలలో ఇలా వుంది: "ఏ నమాజులో ఫాతిహా సూరా పఠించబడలేదో ఆ నమాజ్ అసంపూర్ణంగా ఉంటుంది."

وَفِيْ أُخْرَى لِأَحْمَدَ وَأَبِيْ دَاوُدَ وَالتِّرْمِذِيِّ وَابْنِ حِبَّانَ: «لَعَلَّكُمْ تَقْرَءُونَ خَلْفَ إِمَامِكُمْ؟» قُلْنَا نَعَمْ؛ قَالَ: «لاَ تَفْعَلُوا إِلاَّ بِفَاتِحَةِ الْكِتَابِ، فَإِنَّهُ لاَ صَلاَةَ لِمَنْ لَمْ يَقْرَأْ بِهَا.»

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌ల మరో ఉల్లేఖనంలో ఉంది- "బహుశా మీరు ఇమామ్ వెనుక (ఏదో) చదువుతారనుకుంటాను" అని ఆయన (స) చెప్పగా 'అవును' అని మేమన్నాము. "అలా చేయకండి - ఒక్క ఫాతిహా సూరా తప్ప. ఎందుకంటే ఎవరు ఫాతిహా సూరా చదవలేదో అతని నమాజే కాదు" అని ఆయన (స) సెలవిచ్చారు.

## సారాంశం

సూరె ఫాతిహా చదవనిదే నమాజ్ కాదన్న దానికి ఈ హదీసు స్పష్టమయిన ఆధారం. ఇమామ్ అయినా, ముఖ్తదీ అయినా, ఒంటరిగా నమాజ్ చేసే వ్యక్తి అయినా ఫాతిహా సూరా పఠనం తప్పనిసరి. ప్రామాణిక హదీసుల వెలుగులో సిసలయిన విధానం ఇదే. షాఫయీలు, అహ్లెహదీసు వారు ఈ విధానాన్నే అవలంబించారు. ప్రతి నమాజీ, ప్రతి రకతులో ఫాతిహా సూరా పఠించటం

తప్పనిసరియని వీరంతా వక్కాణిస్తారు. ప్రవక్త ప్రియసహచరుల, తాబయీన్ల, అధికసంఖ్యాక ఉలమాల మస్లక్ (పద్ధతి) ఇదే. ముస్లింలో హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ద్వారా కూడా - ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించటం అనివార్యం అని విదితమవుతున్నది.

మౌలానా అబ్దుల్ హై లక్నోవీ హనఫీ "ఉమ్ముల్ కలామ్"లో ఇలా అంటున్నారు: "ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించరాదన్న వాదనను సమర్థించే బలమైన హదీసు ఏదీ లేదు. ఈ సందర్భంగా ఉదాహరించబడేవేవీ ప్రామాణికమైనవి కావు. సిర్రీ నమాజుల్లోనూ, జహ్రీ నమాజులలోనూ ఇమామ్ వెనుకనున్నవారు (ముఖ్తదీలు) ఫాతిహా సూరా పఠించాలన్నదే ప్రామాణికమైనది. హదీసువేత్తల (ముహద్దిసీన్)లోని ఒక సమూహం అవలంబన కూడా ఇదే."

ఈయనే కాదు, హనఫీ పండితులలోని పూర్వీకులు, తరువాతి తరంలో కూడా కొంతమంది తాము జరిపిన పరిశోధన ఆధారంగా, ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించేవారు. షాహ్ వలియుల్లాహ్ ముహద్దిస్ దహెల్వీ (రహ్మలై), షాహ్ అబ్దుల్ అజీజ్ (రహ్మ.లై) కూడా ఈ కోవకు చెందినవారిలో ఉన్నారు. కడకు మౌలానా రషీద్ అహ్మద్ గంగూహీ (రహ్మ.లై) వంటివారు సయితం సిర్రీ నమాజులలోనే గాక, జహ్రీ నమాజులలోనూ ఇమామ్ వెనుక సూరె ఫాతిహా పఠించడాన్ని ధర్మసమ్మతంగా ఖరారు చేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలకై "అల్‌కలామ్" మొదటి సంపుటిని చూడవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

ఉబాదా బిన్ సామిత్ (రజి) అన్సారీ సహాబీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు. అన్సార్ సర్దారులలో ప్రముఖ వ్యక్తిగా పేరుమోసారు. ప్రథమ, ద్వితీయ అఖబా ఒప్పందాలలో పాల్గొన్నారు. బద్ర్‌తో పాటు ఇతర యుద్ధాలలో కూడా పాల్గొన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని సిరియా వైపునకు ఖాజీగా, అధ్యాపకునిగా నియమించి పంపారు. తొలుత హిమ్స్‌లో స్థిరపడ్డారు. తరువాత పాలస్తీనా వైపునకు ప్రస్థానం చేశారు. 'రమ్‌ల'లో కన్నుమూశారు. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం హిజ్రీ 34లో బైతుల్ మఖ్దిస్‌లో మరణించారు. అప్పటికి ఆయనకు 72 సంవత్సరాలు.

(٢١٩) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ وَأَبَا بَكْرٍ وَعُمَرَ كَانُوا يَفْتَتِحُونَ الصَّلَاةَ بِـ«الْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِينَ». مُتَّفَقٌ عَلَيْهِ.

219. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం), అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి) లందరూ "అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్"తో నమాజ్‌ను ఆరంభించేవారు. (బుఖారీ, ముస్లిం)

زَادَ مُسْلِمٌ: لَا يَذْكُرُونَ «بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ» فِي أَوَّلِ قِرَاءَةٍ وَلَا فِي آخِرِهَا.

ముస్లింలో అదనంగా ఇలా అనబడింది: "పఠనం మొదట్లోగానీ, ఆఖరిలోగానీ - రెండు సందర్భాలలో కూడా బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్ చదివేవారు కారు."

وَفِيْ رِوَايَةٍ لِأَحْمَدَ وَالنَّسَائِيِّ وَابْنِ خُزَيْمَةَ: لاَ يَجْهَرُوْنَ بِبِسْمِ اللهِ الرَّحْمَنِ الرَّحِيْمِ.

ముస్నద్ అహ్మద్, నసాయి, ఇబ్నె ఖుజైమాలలోని ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ హెచ్చు స్వరంతో పఠించేవారు కాదు."

وَفِيْ أُخْرَى لاِبْنِ خُزَيْمَةَ: «كَانُوْا يُسِرُّونَ». وَعَلَى هَذَا يُحْمَلُ النَّفْيُ فِيْ رِوَايَةِ مُسْلِمٍ، خِلاَفاً لِمَنْ أَعَلَّهَا.

ఇబ్నె ఖుజైమాలోని వేరొక ఉల్లేఖనంలో "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ నెమ్మదిగా పఠించేవారు" అని వుంది.

**సారాంశం**

దైవప్రవక్త (స) ఫాతిహా సూరాతో దైవగ్రంథ పారాయణాన్ని మొదలెట్టేవారనీ, 'బిస్మిల్లాహ్' మెల్లగా పఠించేవారనీ ఈ హదీసుద్వారా అవగతమవుతున్నది. మరికొన్ని ఉల్లేఖనాలలో బిస్మిల్లాహ్ బిగ్గరగా చెప్పేవారని కూడా ఉంది. కాబట్టి రెండు విధాలుగా పఠించినప్పటికీ అది అనుచితం కాదుగానీ ప్రామాణిక ఉల్లేఖనాల దృష్ట్యా 'బిస్మిల్లాహ్'ను నెమ్మదిగా పలకటమే సమంజసం.

(٢٢٠) وَعَنْ نُعَيْمٍ الْمُجْمِرِ قَالَ: صَلَّيْتُ وَرَآءَ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّهُ تَعَالَى عَنْهُ، فَقَرَأَ بِسْمِ اللهِ الرَّحْمَنِ الرَّحِيْمِ، ثُمَّ قَرَأَ بِأُمِّ الْقُرْآنِ، حَتَّى إِذَا بَلَغَ «وَلاَ الضَّآلِّيْنَ» قَالَ: آمِيْنَ. وَيَقُولُ كُلَّمَا سَجَدَ، وَإِذَا قَامَ مِنَ الْجُلُوسِ: اَللّهُ أَكْبَرُ، ثُمَّ يَقُوْلُ إِذَا سَلَّمَ: وَالَّذِيْ نَفْسِيْ بِيَدِهِ إِنِّي لأَشْبَهُكُمْ صَلاَةً بِرَسُولِ اللهِ ﷺ. رَوَاهُ النَّسَائِيُّ وَابْنُ خُزَيْمَةَ.

220. హజ్రత్ నుఐమ్ ముజ్మిర్ (రహ్మ.లై) వివరించారు: నేను హజ్రత్ అబూ హురైర (రజి) నేతృత్వంలో నమాజ్ చేశాను. ఆయన మొదట బిస్మిల్లాహ్ పఠించారు. తరువాత ఉమ్ముల్ ఖుర్ఆన్ (సూరె ఫాతిహా) పారాయణం చేశారు. 'వలజ్జాల్లీన్' వరకూ వచ్చిన తరువాత ఆయన 'ఆమీన్' పలికారు. సజ్దాలోకి వెళ్ళినప్పుడు, సజ్దా తరువాత కూర్చుని నిలబడినపుడు 'అల్లాహు అక్బర్' అనేవారు. సలాం చేసిన తరువాత ఆయన ఇలా పలికారు: "ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షిగా చెబుతున్నాను! నిశ్చయంగా నేను మీకన్నా ఎక్కువగా నమాజ్ నెరవేర్చటంలో దైవప్రవక్త (సఅసం)ను పోలి వున్నాను." (నసాయి, ఇబ్నె ఖుజైమ)

### సారాంశం

ఈ హదీసు 'బిస్మిల్లాహ్' మరియు 'ఆమీన్'లను బిగ్గరగా పలకాలన్న దానికి ఆధారంగా నిలిచింది. అయితే అత్యధిక ప్రామాణిక ఆధారాల దృష్ట్యా 'బిస్మిల్లాహ్' నెమ్మదిగానూ, 'ఆమీన్' బిగ్గరగానూ పలకటం సమంజసం. ఎన్నో సమయాల్లో (జహ్రీ నమాజులలో) బిస్మిల్లాహ్ నెమ్మదిగా చదవబడింది. కొన్ని సమయాల్లోనే బిగ్గరగా పఠించబడింది.

ఫాతిహా సూరా ముగింపుపై 'ఆమీన్' పలకటం 'మస్నూన్'అనే విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇమామ్ అయినా, ముఖ్తదీ అయినా, ఒంటరిగా నమాజ్ చేసేవారైనా - అందరూ ఆమీన్ చెప్పవలసిందే. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో ఆమీన్ పలకటం తప్పనిసరి. ఆమీన్ పలకనివాడు పాపాత్ముడవుతాడు. ''ఓ అల్లాహ్! నా ప్రార్థనను స్వీకరించు'' అని ఆమీన్ భావం.

### హదీసు ఉల్లేఖకులు

నుఐమ్ ముజ్‌మిర్ (రహ్మ.లై) హజ్రత్ ఉమర్ (రజి)చే స్వేచ్ఛ నొసగబడిన బానిస. ఈయన మారు పేరు అబూ అబ్దుల్లాహ్. హజ్రత్ ఉమర్ ఆదేశాన్ని శిరసావహిస్తూ ప్రతి శుక్రవారం మధ్యాహ్నం మస్జిదె నబవీని సుగంధ నీటితో కడిగేవారు. ఈ కారణంగానే ఈయన ముజ్‌మిర్‌గా ఖ్యాతి గడించారు. ప్రసిద్ధ తాబయీలలో ఒకరు. అబూ హాతిమ్, ఇబ్నె ముయీన్, ఇబ్నె సాద్, నసాయి తదితరులు ఈయన్ని విశ్వసనీయమయిన వ్యక్తిగా నిర్ధారించారు.

(٢٢١) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قال رَسُولُ اللهِ ﷺ: «إِذَا قَرَأْتُمُ الفَاتِحَةَ فَاقْرَءُوا بِسْمِ اللهِ الرَّحْمَنِ الرَّحِيمِ، فَإِنَّهَا إِحْدَى آيَاتِهَا». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَصَوَّبَ وَقْفَهُ.

221. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - ''మీరు ఫాతిహా సూరా పఠించినపుడు బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్ కూడా దాంతోపాటే పఠిం చండి. ఎందుకంటే అది కూడా ఫాతిహా సూరాలోని ఒక వచనమే.'' (దారె ఖుత్నీ దీనిని 'మౌఖూఫ్'గా నిర్ధారించారు)

### సారాంశం

'బిస్మిల్లాహ్' ఫాతిహా సూరాలోని ఒక ఆయత్ అని ఈ హదీసు వక్కాణిస్తోంది. అయితే ఈ హదీసు మౌఖూఫ్ అన్న విషయాన్ని విస్మరించరాదు. ముస్లింలోని సహీహ్ హదీసు దీనికి విరుద్ధంగా ఉంది. ఈ హదీసులో దైవప్రవక్త ఈ సూరాను విభజించారు. 'అల్ హమ్దులిల్లాహ్'ను మొదటి భాగంగా ఖరారు చేశారు - 'బిస్మిల్లాహ్'ను ఇందులో చేర్చలేదు.

(٢٢٢) وَعَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا فَرَغَ مِنْ قِرَاءَةِ أُمِّ الْقُرْآنِ، رَفَعَ صَوْتَهُ

222. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉమ్ముల్ ఖుర్ఆన్ (ఫాతిహా సూరా) పఠనం పూర్తి కాగానే బిగ్గరగా

وَقَالَ: آمِينَ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَحَسَّنَهُ، وَالْحَاكِمُ وَصَحَّحَهُ. وَلِأَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ مِنْ حَدِيثِ وَائِلِ ابْنِ حُجْرٍ نَحْوُهُ.

ఆమీన్ పలికేవారు." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. 'హసన్'గా నిర్ధారించారు. హాకిమ్ మాత్రం దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారుచేశారు. అబూ దావూద్, తిర్మిజీలలో వాయల్ బిన్ హుజ్ర్ - రజి- ఉల్లేఖనం కూడా ఇలాగే ఉంది)

## సారాంశం

సూరె ఫాతిహా చివరిలో దైవప్రవక్త (స) 'ఆమీన్'ని బిగ్గరగా పలికేవారని ఈ హదీసులో వుంది. అయితే బిగ్గరగా పలకటం - నెమ్మదిగా పలకటం గురించి భేదాభిప్రాయం ఉంది. ఆమీన్ పలికే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయం లేదు. హనఫీలు ఆమీన్ నెమ్మదిగా పలకాలంటారు. కాగా; మిగిలిన ఇమాములు ముగ్గురూ, హదీసువేత్తలు, అహ్లెహదీసు విద్వాంసులు ఆమీన్ బిగ్గరగా పలకాలంటారు.

అనేక ప్రామాణిక హదీసుల ద్వారా ఆమీన్ బిగ్గరగా పలకడానికే ఎక్కువ సమర్థన లభిస్తోంది. తిర్మిజీ, అబూదావూద్, దారిమీలలో దైవప్రవక్త (స) ఆమీన్ పలికారనీ, ఆ సమయంలో తన గొంతును పెంచారని వాయల్ బిన్ హుజ్ర్ (రజి) ఉల్లేఖనం చెబుతోంది.

సహీహ్ ఇబ్నె హిబ్బాన్, దారె ఖుత్నీ, హాకిమ్‌లలో - దైవప్రవక్త (స) ఉమ్ముల్ ఖుర్‌ఆన్‌ను ముగించిన తరువాత హెచ్చు స్వరంతో 'ఆమీన్' చెప్పేవారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ద్వారా స్పష్టమవుతున్నది.

సహీహ్ ఇబ్నె ఖుజైమాలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ గురించి ఇలా ఉంది: ఆయన ఇమామ్ వెనుక నమాజ్ చేసినపుడు జనులు కూడా ఆమీన్ పలికేవారు. ఇబ్నె ఉమర్ కూడా ఆమీన్ పలికేవారు. దీనిని 'సున్నత్'గా భావించేవారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆమీన్‌ను వదిలేవారు కారనీ, ఆమీన్ పలకమని మమ్మల్ని ప్రోత్సహించేవారనీ ఆయన శిష్యులు నాఫె తెలిపారు.

ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గురువర్యులైన హజ్రత్ అతా బిన్ రిబాహ్ ఇలా అంటున్నారు: "మక్కాలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) బిగ్గరగా ఆమీన్ పలికేవారు. ఆయన వెనుకనున్న వారు కూడా బిగ్గరగా ఆమీన్ అనేవారు. దీంతో మస్జిద్ ప్రతిధ్వనించేది." (బుఖారీ)

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "యూదులు ముస్లింలపై మూడు విషయాలలో ఈర్ష్య చెందుతారు: (1) సలాంకు బదులు ఇవ్వటంపై (2) పంక్తుల్ని తీర్చిదిద్దటంపై (నమాజ్‌లో వరుసలు తీరి నిలబడటంపై) (3) ఇమామ్ వెనుక నిలబడి 'ఆమీన్' అనటంపై"

దైవప్రవక్త (సఅసం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు- "యూదులు మీలోని 'సలాం' మరియు 'ఆమీన్'లపై అసూయ చెందినంతగా మరేవిషయంలోనూ అసూయ చెందరు." (సునన్ ఇబ్నె మాజ)

ఈ విధంగా ఉదాహరించసాగితే మరెన్నో హదీసులు వస్తాయి. ఇక భారత ఉపఖండానికి చెందిన కొంతమంది సుప్రసిద్ధ విద్వాంసులు దీని గురించి ఏమంటున్నారో చూద్దాం -

షేఖ్ అబ్దుల్ హఖ్ ముహద్దిస్ దహెల్వీ ఇలా అంటున్నారు - "దైవప్రవక్త (సఅసం) జహ్రీ నమాజులలో ఆమీన్ బిగ్గరగా పలికేవారు. వెనుకనున్న అనుయాయులు కూడా ఆయన్ను అనుసరించేవారు. బిగ్గరగా ఆమీన్ పలకాలన్న హదీసులు అధికంగానూ, బలవత్తరంగానూ ఉన్నాయి."

హజ్రత్ షాహ్ ఇస్మాయీల్ షహీద్ (రహ్మాలై) ఇలా వ్యాఖ్యానించారు: "బిగ్గరగా ఆమీన్ పలకాలన్న హదీసులు ఎక్కువగానూ, సుస్పష్టంగానూ ఉన్నాయి."

మౌలానా అబ్దుల్ హై లక్నోవి (ఈయన హనఫీ ఆలిమ్) ఇలా అభిప్రాయపడ్డారు: "ప్రమాణబద్ధమైన ఆధారాల వెలుగులో చూసినపుడు ఆమీన్‌ను బిగ్గరగా పలకమని అనటమే న్యాయం." ఆ మాటే ఆయన 'సఆయ'లో మరింత స్పష్టంగా విడమరచి చెప్పారు. ఆయన ఇలా అన్నారు - "నెమ్మదిగా ఆమీన్ పలకాలి అని అంటున్న ఉల్లేఖనాలు బలహీనమైనవి (జయీఫ్). బిగ్గరగా ఆమీన్ పలకాలంటున్న ఉల్లేఖనాలతో ఇవి పోటీపడలేవు."

ఇంత చర్చ జరిగాక ఈ విషయమై ఇంకా వ్యాఖ్య అనవసరం.

(٢٢٣) وَعَنْ عَبْدِ اللهِ بْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: إِنِّي لاَ أَسْتَطِيعُ أَنْ آخُذَ مِنَ الْقُرْآنِ شَيْئاً، فَعَلِّمْنِي مَا يُجْزِئُنِي مِنْهُ، فَقَالَ: «قُلْ: سُبْحَانَ اللهِ، وَالْحَمْدُ لِلَّهِ، وَلاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَاللَّهُ أَكْبَرُ، وَلاَ حَوْلَ وَلاَ قُوَّةَ إِلاَّ بِاللهِ الْعَلِيِّ الْعَظِيمِ» الْحَدِيثَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ.

223. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఔఫా (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి, 'నేను దివ్య ఖుర్ఆన్‌లోని ఏ భాగాన్నీ జ్ఞాపకం ఉంచుకోలేకపోతున్నాను. కనుక దీనికి ప్రత్యామ్నాయం కాగల మరేదయినా నాకు ఉపదేశించండి' అని విన్నవించుకున్నాడు. దీనికి ఆయన (స), "సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్" పఠించమని సూచించారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, దారె ఖుత్నీ, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

## సారాంశం

ఎవరికయినా ఖుర్‌ఆన్‌లో ఏ కొంత భాగం కూడా (చిన్న చిన్న సూరాలు కూడా) జ్ఞాపకం లేకపోతే వారు గత్యంతరం లేని స్థితిలో పై వచనాలను పఠించినా నమాజ్ నెరవేరుతుంది అని ఈ హదీసు చెబుతోంది. ఇక ఎవరయినా దీనిని ఒక ఆధారంగా తీసుకుని 'నమాజ్‌లో సూరె ఫాతిహా చదవటం విధి కాద'ని వాదిస్తే ఇది మరీ చాదస్తం అనిపించుకుంటుంది. ఎందుకంటే ఇది గత్యంతరం లేని పరిస్థితి. ఒక వ్యక్తికి ఏమీ జ్ఞాపకం లేని స్థితిలో ప్రవక్త అతనికి అతి సులభ మయిన ఒక 'కలిమా' నేర్పారు. ఇదొక తాత్కాలిక స్థితి. ఇలాంటి వారికోసం షరీయత్ రాయితీ కల్పిస్తుంది. కొత్తగా కలిమా పఠించి ఇస్లాంలోకి ప్రవేశించిన వ్యక్తి ఆ క్షణం నుంచే నమాజ్ చేయవలసి ఉంటుంది. మరి అతనికి నమాజ్‌లో ఏం చదవాలో తెలీదు. ఈ కారణంచేత అతన్ని నమాజ్ చేయరాదని అంటామా? నమాజ్‌ను పూర్తిగా నేర్చుకునేంతవరకూ ఆ వ్యక్తి మౌనంగా నిలబడినా, వచ్చినమటుకే చదివినా దైవసన్నిధిలో అతని నమాజ్ స్వీకారయోగ్యమవుతుంది.

ఇంతకీ చెప్పవచ్చిందేమంటే గత్యంతరం లేని స్థితి అందరికీ వర్తించదు. ఆ స్థితి వర్తించవలసిన వారికే వర్తిస్తుంది. కాబట్టి ఇలాంటి వాటిని ఆసరాగా తీసుకుని అందరూ అసలు విషయం నుండి పలాయనం చిత్తగించే ప్రయత్నం చేయకూడదు. నమాజ్‌లో - దివ్య గ్రంథ పారాయణం అన్నప్పుడు ఫాతిహా సూరా పఠనం కూడా అందులో ఇమిడి ఉందని మరువరాదు.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి). మారుపేరు అబూ ముహమ్మద్ లేక అబూ ముఆవియ. ఈయన తండ్రి పేరు అల్ఖమ బిన్ హారిస్ అస్లమీ. తండ్రీ కొడుకులిరువురూ సహాబీలే. ఈయన హుదైబియా ఒడంబడిక లోనూ, ఖైబర్ యుద్ధంలోనూ పాల్గొన్నారు. ఆ తరువాత జరిగిన యుద్ధాలలో కూడా వచ్చారు. దైవప్రవక్త (స) మరణానంతరం కూఫా వైపునకు ప్రస్థానం చేశారు. హిజ్రీ 87లో మరణించారు. కూఫాలో మరణించిన సహాబీలలో అందరికన్నా చివరివారు ఈయనేనని అంటారు. వయసు పెరిగిన కొద్దీ కంటిచూపు తగ్గిపోసాగింది.

(٢٢٤) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ يُصَلِّي بِنَا فَيَقْرَأُ فِي الظُّهْرِ وَالْعَصْرِ فِي الرَّكْعَتَيْنِ الْأُولَيَيْنِ بِفَاتِحَةِ الْكِتَابِ وَسُورَتَيْنِ، وَيُسْمِعُنَا الْآيَةَ أَحْيَانًا، وَيُطَوِّلُ الرَّكْعَةَ الْأُولَى، وَيَقْرَأُ فِي الْأُخْرَيَيْنِ بِفَاتِحَةِ الْكِتَابِ. مُتَّفَقٌ عَلَيْهِ.

224. హజ్రత్ అబూ ఖతాదా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు నమాజ్ చేయించి నపుడు - జుహ్ర్, అస్ర్‌ల మొదటి రెండు రకతులలో ఫాతిహా సూరాతోపాటు మరో రెండు సూరాలు పఠించేవారు. ఒక్కోసారి మాకు ఏదన్నా ఒక ఆయత్‌ను వినిపిం చేవారు కూడా. మొదటి రకత్‌ను సుదీర్ఘంగా చేసేవారు. ఆఖరి రెండు రకతులలో కేవలం ఫాతిహా సూరా పఠించేవారు.'' (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ద్వారా కొన్ని విషయాలు చర్చకు వస్తాయి. (1) జుహ్ర్ అస్ర్ నమాజులలో ఖుర్ఆన్ పారాయణం నెమ్మదిగా జరగాలి. ఇందులో ద్వంద్వాభిప్రాయానికి తావులేదు. మరలాంటప్పుడు ఏదన్నా ఒక ఆయత్‌ను వినిపించటంలోని ఆంతర్యం ఏమై ఉంటుంది?! ఇందులో దాగివున్న ఒక పరమార్థం; ప్రస్తుతం ఆయన నమాజులో ఖుర్ఆన్‌లోని ఒకానొక భాగాన్ని పారాయణం చేస్తున్నారే తప్ప వేరొక స్మరణలో, దుఆలో నిమగ్నమై లేరు అని సహాబీలకు తెలియజేయటం కావచ్చు! రెండు : ఈ నమాజులో ఫలానా సూరా పఠించబడిందని నమాజీలకు తెలియజేయటం మరో ఉద్దేశ్యం కావచ్చు!!

(2) మొదటి రకత్‌లో ఖుర్ఆన్ పఠనం రెండవ రకత్‌లోని పఠనంకన్నా కాస్త అధికంగా ఉండాలన్న అంశం కూడా ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్‌లతో పాటు ఇమామ్ ముహమ్మద్ దృక్పథం కూడా ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ అబూ యూసుఫ్‌ల దృష్టిలో మాత్రం రెండు రకతుల్లోనూ ఖుర్ఆన్ పారాయణం సమంగా ఉండాలి. జుహ్ర్, అస్ర్ నమాజుల్లోని మొదటి రకతులు సుదీర్ఘంగా ఉండేవని మూలాంశం ద్వారా రూఢీ అవుతోంది. ఆయన (స) అలా ఎందుకు చేసేవారు? ఆలస్యంగా వచ్చే ప్రజలకు కూడా మొదటి రకత్ లభించాలన్నది ఒక పరమార్థం అయి ఉండవచ్చు!

(3) జుహ్ర్, అస్ర్‌లలోని ఆఖరి రెండు రకతులలో అల్‌హం సూరా తప్ప మరో సూరా పఠించేవారు కాదని ఈ హదీసు ద్వారా తెలియ వస్తోంది. అయితే మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆఖరి రెండు రకతులలో కూడా మరో సూరా పఠించవచ్చని ఉంది. అందువల్ల ఫాతిహా సూరాతో పాటు మరేదయినా సూరా కూడా ఆఖరి రకతులలో ఎవరయినా పారాయణం చేస్తే అందులో విపరీతం ఏమీ లేదు.

(4) సిర్రీ నమాజులలో (అంటే మెల్లగా చదివే నమాజులలో) ఏదన్నా ఒక వాక్యం (ఆయత్) బిగ్గరగా చదివినంత మాత్రాన "సజ్దా సహూ" తప్పనిసరికాదు. దైవప్రవక్త (స) ఒకటి రెండు సార్లు కాదు, అనేకసార్లు ఈ విధంగా చేసినట్లు ఆధారాలున్నాయి.

225. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: మేము జుహ్ర్, అస్ర్‌లలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్ఆన్ పారాయణాన్ని అంచనా వేసేవాళ్ళం. మా అంచనా ప్రకారం ఆయన (స) జుహ్ర్ యొక్క మొదటి రెండు రకతులలో 'సూరె సజ్దా' పారాయణం చేసినంత సమయం తీసుకునే వారు. ఆఖరి రెండు రకతుల కోసం మొదటి రెండు రకతుల్లోని సగం సమ

(٢٢٥) وَعَنْ أَبِيْ سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نَحْزُرُ قِيَامَ رَسُوْلِ اللّٰهِ ﷺ فِي الظُّهْرِ وَالْعَصْرِ، فَحَزَرْنَا قِيَامَهُ فِي الرَّكْعَتَيْنِ الْأُوْلَيَيْنِ مِنَ الظُّهْرِ قَدْرَ ﴿آلم تنزيل﴾ السجدة وفي الأُخْرَيَيْنِ قدر النِّصْفِ

مِنْ ذَلِكَ وَفِي الْأُولَيَيْنِ مِنَ الْعَصْرِ، عَلَى قَدْرِ الْأُخْرَيَيْنِ مِنَ الظُّهْرِ، وَالْأُخْرَيَيْنِ عَلَى النِّصْفِ مِنْ ذَلِكَ. رَوَاهُ مُسْلِمٌ.

యాన్ని తీసుకునేవారు. కాగా; అస్ర్‌లోని మొదటి రెండు రకతులకోసం జుహ్ర్ లోని చివరి రెండు రకతులకు సమాన మైన సమయం తీసుకునేవారు. ఇంకా అస్ర్‌లోని చివరి రెండు రకతులకై అస్ర్ లోని మొదటి రెండు రకతుల్లోని సగం సమయం వెచ్చించేవారు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా జుహ్ర్, అస్ర్ నమాజులలో దైవప్రవక్త (స) గారి ఖుర్‌ఆన్ పారాయణం పరిమాణం తెలియవస్తోంది. చివరి రెండు రకతులలో ఫాతిహా సూరాతోపాటు మరేదయినా సూరా పఠించటం మస్నూన్ అని కూడా దీనిద్వారా స్పష్టమవుతోంది. అలాగే కొన్ని సమయాల్లో పఠించకపోవటం కూడా మస్నూన్‌యేనని బోధపడుతున్నది. కనుక నమాజీ చివరి రెండు రకతులలో ఫాతిహా సూరాతో పాటు మరేదయినా సూరా చదువుకుంటే అందులో తప్పు పట్టాల్సిన పని ఏమీ లేదు. అలాగే చదవకపోవటం వల్ల వచ్చిన అనర్థం కూడా ఏమీ లేదు.

(٢٢٦) وَعَنْ سُلَيْمَانَ بْنِ يَسَارٍ قَالَ: كَانَ فُلَانٌ يُطِيلُ الْأُولَيَيْنِ مِنَ الظُّهْرِ وَيُخَفِّفُ الْعَصْرَ وَيَقْرَأُ فِي الْمَغْرِبِ بِقِصَارِ الْمُفَصَّلِ، وَفِي الْعِشَاءِ بِوَسَطِهِ، وَفِي الصُّبْحِ بِطِوَالِهِ، فَقَالَ أَبُو هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ: مَا صَلَّيْتُ وَرَاءَ أَحَدٍ أَشْبَهَ صَلَاةً بِرَسُولِ اللّٰهِ ﷺ مِنْ هَذَا. أَخْرَجَهُ النَّسَائِيُّ بِإِسْنَادٍ صَحِيحٍ.

226. హజ్రత్ సులైమాన్ బిన్ యసార్ (రహ్మ.లై) ఇలా తెలిపారు: "ఫలానా వ్యక్తి జుహ్ర్‌లోని మొదటి రెండు రకతులను సుదీర్ఘంగా చేస్తున్నారు (అంటే వీటిలో సుదీర్ఘంగా ఖుర్‌ఆన్ పఠిస్తున్నారు). అస్ర్ నమాజ్‌ను సంక్షిప్తంగా చేస్తున్నారు. మగ్రిబ్ నమాజులో చిన్న తరహా సూరాలు పఠిస్తున్నారు. ఇషా నమాజులో మధ్య తరహా సూరాలు పఠిస్తున్నారు. ఉదయం నమాజులో సుదీర్ఘమయిన సూరాలు పఠిస్తున్నారు." (అని ఆయన చెప్పగా) ఇది విని అబూ హురైర (రజి) ఇలా అన్నారు: "నేను ఎవరి ఇమామత్ (సారథ్యం)లో కూడా ఇంతకన్నా ఎక్కువగా దైవప్రవక్త (స) నమాజ్‌ను పోలిన నమాజ్‌ను చేయ లేదు." (నసాయి దీనిని ప్రామాణిక ఆధారాలతో ఉల్లేఖించారు).

### సారాంశం

దివ్య ఖుర్‌ఆన్‌లోని అల్ హుజ్రాత్ సూరా నుండి చివరి వరకు (సూరయె నాస్ వరకూ) గల సూరాలు 'ముఫస్సలాత్' అనబడతాయి. ఇందులోనూ మూడు రకాలున్నాయి. (1) చిన్న తరహా (2) మధ్య తరహా (3) పెద్ద తరహా సూరాలు. ఫజ్ర్ నమాజ్‌లో పెద్ద తరహా సూరాలు, ఇషా నమాజులో మధ్య తరహా సూరాలు, మగ్రిబ్ నమాజులో చిన్న తరహా సూరాలు పఠించటం మస్నూన్ (దైవప్రవక్త విధానం).

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు సులైమాన్ బిన్ యసార్ (రహ్మ.లై). మరోపేరు అబూ అయ్యూబ్. ఏడుగురు (సమకాలీన) అగ్రశ్రేణి ధర్మవేత్తలలో ఈయన కూడా ఒకరుగా పరిగణించబడ్డారు. దైవభక్తి పరాయణులు, ధర్మావగాహనలో సాటిలేని మేటి. అత్యుత్తమశ్రేణి పండితులు. అసంఖ్యాకమయిన హదీసులు ఈయనచేత ఉల్లేఖించబడ్డాయి. ఉమ్మల్ మోమినీన్ హజ్రత్ మైమూన (ర.అన్హా)చే స్వేచ్ఛ నొసగబడిన బానిస.

(٢٢٧) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَقْرَأُ فِي الْمَغْرِبِ بِالطُّورِ. مُتَّفَقٌ عَلَيْهِ.

227. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మగ్రిబ్ నమాజులో తూర్ సూరా పఠించగా విన్నాను." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

సాధారణంగా దైవప్రవక్త (సఅసం) మగ్రిబ్ నమాజులో చిన్న సూరాలనే చదివేవారు. అయితే ఎప్పుడయినా ఒక్కోసారి (ఈ హదీసులో వచ్చినట్లు) పెద్ద సూరాలు కూడా పారాయణం చేసేవారు. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం అద్దుఖాన్, సాఫ్ఫాత్ లాంటి పెద్ద సూరాలు కూడా మగ్రిబ్ నమాజ్‌లో చదివారని ఉంది. ప్రయాణ సమయాల్లో ఆయన (స) ఫజ్ర్ నమాజ్‌లో కేవలం 'ముఅవ్వజతైన్' (సూరయే ఫలఖ్, సూరయే నాస్‌లు) పఠించేవారని కూడా మనకు ఆధారాలు లభిస్తున్నాయి. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే, లోగడ వచ్చిన హదీసు (హదీసు నెంబరు 226) ప్రకారమే సాధారణంగా ఆయన (స) ఆచరణ ఉండేది. కాకపోతే అప్పుడప్పుడు ఈ 'మామూలు'లో మార్పు ఉండేది.

(٢٢٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ يَقْرَأُ فِي صَلَاةِ الْفَجْرِ يَوْمَ الْجُمُعَةِ (آلم تَنْزِيْلُ

228. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం నాడు ఫజ్ర్ నమాజు మొదటి రకత్‌లో సూరయే సజ్దా (అలిఫ్-లామ్-మీమ్. తన్‌జీలు), రెండవ

السَّجْدَة، «وَهَلْ أَتَى عَلَى الإِنْسَانِ». مُتَّفَقٌ عَلَيْهِ. وَلِلطَّبَرَانِيِّ مِنْ حَدِيثِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «يُدِيمُ ذَلِكَ».

రకత్‌లో సూరయే దహర్ (హల్ అతా అలల్ ఇన్‌సాని) చదివేవారు (బుఖారీ, ముస్లిం). తబ్రానీలో ఇబ్నె మస్‌వూద్ ఉల్లేఖనంలో - "ఆయన నిత్యం ఇలాగే చేసేవారు" అని ఉంది.

**సారాంశం**

దైవప్రవక్త (స) శుక్రవారం నాడు ఈ రెండు సూరాలనే ఎందుకు ఎన్నుకున్నారు? దీని గురించి షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: "ఈ రెండు సూరాలలో ఆదం సృష్టి గురించి, ప్రళయదినాన హష్ర్ మైదానంలో మానవులంతా సమావేశపరచబడటం గురించి వివరంగా వచ్చింది. ప్రళయం కూడా శుక్రవారం నాడే సంభవిస్తుంది. ఈ కారణంగా దైవప్రవక్త (స) శుక్రవారం నాటి నమాజులో ఈ రెండు సూరాలను ప్రత్యేకంగా ఎన్నుకుని తన అనుచర సమాజంలో మానవసృష్టి పరమార్థాన్నీ, పరలోక చింతనను పాదుకొల్పాలని తలంచి ఉండవచ్చు."

అందుచేత శుక్రవారం నాడు ఉదయం ఫజ్ర్ నమాజులో ఈ రెండు సూరాలను పఠించటం సంప్రదాయం. ఏ ఆచరణను దైవప్రవక్త (స) నిత్యం పాటించారో దానిని మనం కూడా పాటించటం మస్నూన్. అయితే ఈ రెండు సూరాలు తప్ప ఇతర సూరాలు పఠించటం వల్ల నమాజ్ నెరవేరదని దీని భావం ఎంతమాత్రం కాదు. ఏ సూరాలు ఎన్నుకున్నా నమాజ్ నెరవేర్పులో ఎలాంటి దోషం ఏర్పడదు. కాకపోతే దైవప్రవక్త (సఅసం) నెలకొల్పిన ఒక ఆదర్శాన్ని అవలంబించటంలో అపారమయిన శుభాలు ఇమిడి ఉంటాయి. ఇప్పటికీ అహ్లె హదీసు వారు వీలయినంతవరకు ఫజ్ర్ నమాజ్‌లో శుక్రవారంనాడు ఈ రెండు సూరాలనే పఠిస్తారు.

(٢٢٩) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ، ﷺ فَمَا مَرَّتْ بِهِ آيَةُ رَحْمَةٍ إِلاَّ وَقَفَ عِنْدَهَا يَسْأَلُ، وَلاَ آيَةُ عَذَابٍ إِلاَّ تَعَوَّذَ مِنْهَا. أَخْرَجَهُ الْخَمْسَةُ وَحَسَّنَهُ التِّرْمِذِيُّ.

229. హజ్రత్ హుజైఫా (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి నమాజ్ చేశాను. దైవ కారుణ్య ప్రస్తావన ఉన్న ఆయత్‌లు వచ్చినపుడు ఆయన (స) ఆగి కారుణ్యాన్ని అర్థించేవారు. శిక్షకు సంబంధించిన ఆయత్‌లు వచ్చినపుడు కొద్దిగా ఆగి దాని బారినుండి దేవుని శరణు కోరేవారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లైదుగురూ దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా నిర్ధారించారు)

### సారాంశం

ఈ ఆచరణ బహుశా తహజ్జుద్ నమాజ్‌కు సంబంధించినది. ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ద్వారానూ, వేరితర ఉల్లేఖనాల ద్వారానూ, దైవప్రవక్త (స) తహజ్జుద్ నమాజ్‌లో ఈ విధంగా చేసేవారని తెలుస్తున్నది. ఒకవేళ ఈ విధంగా ఫర్జ్ నమాజులో చేసినా తప్పులేదు - అయితే ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు ఇలా చేస్తే ఫరవాలేదు. సామూహిక నమాజులో ఇలా చేయటం వల్ల ఇతరుల్ని ఇబ్బందుల్లో పడవేసినట్లవుతుంది.

(٢٣٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «أَلَا وَإِنِّي نُهِيتُ أَنْ أَقْرَأَ الْقُرْآنَ رَاكِعاً أَوْ سَاجِداً، فَأَمَّا الرُّكُوعُ فَعَظِّمُوا فِيهِ الرَّبَّ، وَأَمَّا السُّجُودُ فَاجْتَهِدُوا فِي الدُّعَاءِ، فَقَمِنٌ أَنْ يُسْتَجَابَ لَكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

230. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "ప్రజలారా! వినండి. నేను రుకూ, సజ్దాలలో ఖుర్‌ఆన్ పారాయణం చేయడాన్ని వారించబడింది. కనుక రుకూలో మీ ప్రభువు ఔన్నత్యాన్ని కొనియాడండి. సజ్దాలో దుఆ చేసేందుకు ప్రయత్నించండి - తద్వారా మీ దుఆ స్వీకరించబడవచ్చు." (ముస్లిం)

### సారాంశం

నమాజ్‌లో వివిధ అర్కాన్ (ముఖ్యాంశాలు)లున్నాయి. వాటిలో ప్రతిదీ వైవిధ్యంతో కూడుకున్నది. ఒక్కో 'రుకున్' లో దైవధ్యానం చేసే పద్ధతి ఒక్కోవిధంగా ఉంది. తదనుగుణంగానే వాటిని పాటించటం సున్నత్ (సంప్రదాయం). దైవప్రవక్త (సఅసం) రుకూ, సజ్దాలలో ఖుర్‌ఆన్ పారాయణం చేయడాన్ని వారించారు. ఖుర్‌ఆన్ పారాయణం 'ఖియామ్' స్థితిలో మాత్రమే జరగాలి. రుకూలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీమ్' అంటూ దేవుని ఘనత్వాన్ని కీర్తించాలి. సజ్దాలో దైవాన్ని వేడుకోమని ప్రవక్త (స) వారు బోధించారు. కొంతమంది హదీసు వేత్తల మరియు ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) ల అభిప్రాయంలో రుకూలో దేవుని ఘనత్వం, సజ్దాలో వేడుకోలు (దుఆ) తప్పనిసరి. అయితే అత్యధిక మంది ఉలమా దీనిని ముస్తహబ్ (అభిలషణీయం)గా భావించారు. దుఆ స్వీకరించబడే సందర్భాలలో 'సజ్దా' ముఖ్యమైనది. అందుకే దైవప్రవక్త (స) సజ్దా స్థితిలో దుఆ చేయమని ఉద్బోధించారు. ఆయన స్వయంగానూ సజ్దాలో అనేక వేడుకోళ్లు చేసేవారు. వాటిలో ఒక దుఆ దీని తరువాతి హదీసులో రాబోతున్నది.

(٢٣١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ يَقُولُ فِي

231. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రుకూ సజ్దాలలో ఈ విధంగా వేడుకునేవారు - "సుబ్‌హానకల్లాహుమ్మ రబ్బనా వ బిహమ్దిక. అల్లాహుమ్మగ్

رُكُوعِهِ وَسُجُودِهِ: «سُبْحَانَكَ اللَّهُمَّ رَبَّنَا وَبِحَمْدِكَ، اللَّهُمَّ اغْفِرْ لِي». مُتَّفَقٌ عَلَيْهِ.

ఫిర్‌లీ'' (నీవు పవిత్రుడవు. ఓ అల్లాహ్! ఓ మా ప్రభూ! ప్రశంసలు, పొగడ్తలు నీకే తగును. ఓ అల్లాహ్! నన్ను క్షమించు). (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

రుకూలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీమ్', సజ్దాలో 'సుబ్‌హాన రబ్బియల్ ఆలా' అని అనటంతోపాటు పైన పేర్కొనబడిన దుఆ కూడా చేయవచ్చన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. ''ఇజా జాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హు'' సూరా అవతరించినప్పటి నుండీ ఆయన (సఅసం) నిత్యం ఈ 'దుఆ' నే రుకూ సజ్దాలలో చేసేవారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ద్వారా తెలుస్తున్నది. కాబట్టి నమాజీలు ఈ మస్నూన్ దుఆలలో ఏదో ఒక దానిని అప్పుడప్పుడూ చదువుతూ ఉండటం మంచిది.

(٢٣٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ إِذَا قَامَ إِلَى الصَّلَاةِ يُكَبِّرُ حِينَ يَقُومُ، ثُمَّ يُكَبِّرُ حِينَ يَرْكَعُ، ثُمَّ يَقُولُ: سَمِعَ اللَّهُ لِمَنْ حَمِدَهُ، حِينَ يَرْفَعُ صُلْبَهُ مِنَ الرُّكُوعِ، ثُمَّ يَقُولُ وَهُوَ قَائِمٌ. رَبَّنَا وَلَكَ الْحَمْدُ، ثُمَّ يُكَبِّرُ حِينَ يَهْوِي سَاجِداً، ثُمَّ يُكَبِّرُ حِينَ يَرْفَعُ رَأْسَهُ، ثُمَّ يُكَبِّرُ حِينَ يَسْجُدُ. ثُمَّ يُكَبِّرُ حِينَ يَرْفَعُ، ثُمَّ يَفْعَلُ ذَلِكَ فِي الصَّلَاةِ كُلِّهَا، وَيُكَبِّرُ حِينَ يَقُومُ مِنَ الثِّنْتَيْنِ بَعْدَ الْجُلُوسِ. مُتَّفَقٌ عَلَيْهِ.

232. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ కొరకు నిలబడగానే అల్లాహు అక్బర్ అని పలికేవారు. రుకూలోకి వెళుతున్నప్పుడు కూడా అల్లాహు అక్బర్ అని అనేవారు. రుకూచేసి నిలబడే సమయంలో 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అని చెప్పి నిలబడేవారు. అలా నిలబడిన మీదట 'రబ్బనా వలకల్ హమ్ద్' అని పలికేవారు. సజ్దా స్థితిలోకి వెళుతున్నప్పుడు తక్బీర్ పలికి సజ్దా కొరకు వంగేవారు. సజ్దా నుండి లేస్తూ కూడా అల్లాహు అక్బర్ అనేవారు. తిరిగి సజ్దాలోకి వెళుతూ అల్లాహు అక్బర్ అనేవారు. మళ్లీ సజ్దానుండి తల ఎత్తేటప్పుడు కూడా అల్లాహు అక్బర్ అనేవారు. తరువాత నమాజ్ అంతా ఇలాగే చేసేవారు. రెండవ రకత్ (పూర్తయిన) తరువాత తషహ్హుద్ చదివి లేచేటప్పుడు కూడా అల్లాహు అక్బర్ అని పలికేవారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

నమాజ్‌లో పలకబడే మొట్టమొదటి తక్బీర్‌ను 'తక్బీరె తహ్రీమా' లేక 'తక్బీరె ఊలా' అంటారు. ఈ తక్బీర్ పలకగానే మనిషి నమాజ్‌లో ప్రవేశిస్తాడు. ఆ క్షణంనుంచీ నమాజ్ ముగించే వరకూ సాధారణ సమయాలలో అతని కొరకు హలాల్ అయివున్నవన్నీ ఇప్పుడు 'హరామ్' అయిపోతాయి. మిగిలిన తక్బీర్‌లను 'తక్బీరాతె ఇన్తిఖాల్' గా వ్యవహరిస్తారు. అంటే మనిషి నమాజ్‌లో ఒక రుకున్‌లోనుంచి మరో రుకున్‌లోకి బదిలీ అవుతూ తక్బీర్ పలకటం వల్ల 'ఇన్తిఖాల్' అనే పదం ఉపయోగించబడింది. ఇన్తిఖాల్ అంటే బదిలీ, ప్రస్థానం అనే అర్థాలువస్తాయి. నమాజ్‌లో మొదటి తక్బీర్ ఫర్జ్ (విధి)కాగా, మిగిలిన తక్బీర్‌లను కొందరు వాజిబ్ (తప్పనిసరి) గా భావించారు. కాని అధిక సంఖ్యాకులు వీటిని మస్నూన్ (సంప్రదాయం)గా భావించారు.

బనూ ఉమయ్యా పరిపాలనా కాలంలో కొంతమంది అధికార్లు ఈ తక్బీర్‌లను అప్రస్తుతమైనవిగా భావించి వాటిని పరిత్యజించసాగారు. కాని ఆ కాలంలో తాబయీలు, ధర్మవేత్తలు సంస్కరణకు నడుం బిగించి ఈ తక్బీర్ల ప్రాముఖ్యతను గురించి ప్రజలకు బోధపర్చారు. ఆ విధంగా వారు దైవప్రవక్త (స) ఆచార సంప్రదాయాల పరంపర తెగిపోకుండా కాపాడారు. ఆ మాటకు వస్తే అన్ని కాలాల్లోనూ సత్యప్రేమికులయిన పండితులు, ధర్మవేత్తలు తమ గురుతర బాధ్యతను గుర్తెరిగి, దురాచారాలకు లోనవుతున్న ప్రజాబాహుళ్యాన్ని దైవప్రవక్త (స) విధానం వైపునకు మరల్చాలి. ధర్మంలో కొత్త పుంతలు తొక్కే పరిపాలకులకు కళ్ళెం వేయాలి. దీనికొరకు వారు ప్రజాచైతన్యాన్ని మేల్కొలుపుతూ ఉండాలి.

(٢٣٣) وَعَنْ أَبِيْ سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُوْلُ اللّٰهِ ﷺ إِذَا رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ قَالَ: «اللّٰهُمَّ رَبَّنَا لَكَ الْحَمْدُ مِلْءَ السَّمٰوَاتِ وَالْأَرْضِ، وَمِلْءَ مَا شِئْتَ مِنْ شَيْءٍ بَعْدُ، أَهْلَ الثَّنَاءِ وَالْمَجْدِ، أَحَقُّ مَا قَالَ الْعَبْدُ – وَكُلُّنَا لَكَ عَبْدٌ – اللّٰهُمَّ

233. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం) రుకూ నుండి తన తలను ఎత్తినపుడు ఈ దుఆ పఠించేవారు - "అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్దు మిల్ అస్సమావాతి వల్ అర్జి వ మిల్అ మాషిత మిన్ షయ్యిన్ బాదు, అహ్లస్సనాయి వల్ మజ్ది అహఖ్ఖు మా ఖాలల్ అబ్దు - వ కుల్లునా లక అబ్దున్ -అల్లాహుమ్మ లా మానిఅ లిమా ఆతైత వలా మూతియ లిమా మనాత వలా యన్ఫవు జల్‌జద్ది మిన్కల్ జద్దు." (ముస్లిం) (అర్థం: ఓ అల్లాహ్! మా ప్రభూ! ప్రశంస కేవలం నీ కొరకే. భూమ్యాకాశాలు నిండిపోయేంత ప్రశంస! ఆ తరువాత నీవు కోరిన ప్రతిదీ నిండిపోయేంత ప్రశంస (నీకు మాత్రమే

لاَ مَانِعَ لِمَا أَعْطَيْتَ، وَلاَ مُعْطِيَ لِمَا مَنَعْتَ، وَلاَ يَنْفَعُ ذَا الجَدِّ مِنْكَ الجَدُّ». رَوَاهُ مُسْلِمٌ.

శోభిస్తుంది). ఓ ఘనతకు, మరియు పొగడ్తలకధిపతీ! దాసులు పొగిడే ప్రతి దానికీ నీవు అర్హుడవు. అందరూ నీ దాసులే. ఓ అల్లాహ్! నీవు ఏది ప్రసాదించినా దాన్ని ఎవరూ అడ్డుకోజాలరు. మరి నీవు దేనిని ఇవ్వకున్నా దానిని ఇతరులెవరూ ఇవ్వజాలరు. ఇంకా - ఎవరి పెద్దరికం, ఐశ్వర్యం కూడా నీ శిక్ష ముందు వారికి లాభం చేకూర్చలేవు)

**సారాంశం**

రుకూ చేసి నిలబడిన తరువాత (ఖౌమ స్థితిలో) ఈ దుఆ చేయటం సంప్రదాయం అన్నదానికి ఈ హదీసు ప్రబల నిదర్శనం. ఈ దుఆ కేవలం నఫిల్ నమాజుకే ప్రత్యేకం అని వాదించే వారివద్ద ఏ నిదర్శనమూ లేదు. అది వారు ఏర్పరచుకున్న భావం మాత్రమే. 'ముస్లిం'లో పొందుపరచబడి వున్న బరా బిన్ ఆజిబ్ (రహ్మ.లై) ఉల్లేఖనం ఈ ఊహను పటాపంచలుచేస్తుంది. ఫర్జ్ నమాజులో ఈ దుఆ చేసినట్టు రుజువు ఉందని ఈ ఉల్లేఖనం స్పష్టం చేసింది.

అదీగాక ఈ దుఆలోని ''వలా యన్ఫవు జల్‌జద్ది మిన్కల్ జద్దు'' వాక్యం ద్వారా తేటతెల్లమైపోయింది- భూమ్యాకాశాల సృష్టికర్త సమక్షంలో మానవుని సిరిసంపదలు, ఆస్తీ అంతస్థులు, అధికారాలు, అట్టహాసాలు దేనికీ పనికిరావని! అతని వంశపరంపరగానీ, అతని కులగోత్రాలుగానీ మనిషిని కాపాడలేవు. కేవలం అతని సదాచరణలు, అతనిలోని దైవభక్తి మాత్రమే అతన్ని రక్షిస్తాయి. ఒకరు ఉన్నత కుటుంబీకుడైనంత మాత్రాన, పుణ్యపురుషుని పుత్రరత్నమైనంత మాత్రాన దైవాగ్రహం నుండి తప్పించుకోలేడు. ఒకవేళ అదే సాధ్యమై ఉంటే దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) కుమారుడు, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తండ్రి, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి పినతండ్రి అబూతాలిబ్‌లు కూడా దేవుని శిక్షనుండి తప్పించుకోగలిగేవారు. మహాప్రవక్త (స) తన కుటుంబీకులను పిలిపించి, సత్కార్యాలు చేయమనీ, తాను దైవ సమక్షంలో ఏ విధంగానూ సహాయపడలేనని స్పష్టం చేశారు. కన్న కూతురు హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) ను పిలిచి ఆయన (స) ఇలా ఉపదేశించారు: ''ఫాతిమా! నీవు అంతిమ దైవప్రవక్త (స) పుత్రికనన్న భ్రమలో పడి ఉండకు. నేను నిన్ను దైవశిక్షనుండి ఏ విధంగానూ కాపాడలేను. కేవలం నా కూతురైనంత మాత్రాన నీవు దేవుని పట్టునుండి బయటపడలేవు. సదాచరణ చెయ్యి. అది మాత్రమే నిన్ను దైవశిక్షనుండి కాపాడవచ్చు.''

చూశారా ! వజ్రసంకల్పులైన దైవప్రవక్తలే తమ ఆప్తులను దేవుని పట్టునుండి కాపాడలేనపుడు, అంతిమ దైవ సందేశహరులు (సఅసం) సయితం తన సంతానానికి అభయం ఇవ్వలేనపుడు తమ తాత ముత్తాతల ఘనకార్యాల ఆధారంగా దైవసమక్షంలో ఇట్టే ఉత్తీర్ణులవగలమని ఎవరైనా ఎలా దావా చేయగలరు?

ఈ హదీసు ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే నమాజ్‌లో (ఖౌమాలో) నిటారుగా నిలబడటంతోనే సరిపోదు, మస్నూన్ దుఆలలో ఏదైనా ఒకటి పఠించాలి.

(٢٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: أُمِرْتُ أَنْ أَسْجُدَ عَلَى سَبْعَةِ أَعْظُمٍ: عَلَى الْجَبْهَةِ - وَأَشَارَ بِيَدِهِ إِلَى أَنْفِهِ - وَالْيَدَيْنِ، وَالرُّكْبَتَيْنِ وَأَطْرَافِ الْقَدَمَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

234. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "నాకు ఏడు ఎముకల (అవయవాల) ఆధారంగా 'సజ్దా' చేయమని ఆదేశించ బడింది - తన చేతుల సైగతో తెలిపారు- నుదురు మరియు ముక్కు, రెండు చేతులు, రెండు మోకాళ్లు, రెండు పాదాలు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

నుదురు మరియు ముక్కు - రెండూ కలిపి ఒకే ఎముక (శరీరావయవం)గా పరిగణించ బడిందని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఒకవేళ వాటిని వేర్వేరుగా లెక్కిస్తే మొత్తం ఎనిమిది అవయవాలు అవుతాయి. అందుచేత ఆ రెంటినీ ఒకే భాగంగా లెక్కించటం జరిగింది. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ షాఫయీలతో పాటు ఇమామ్ అబూ హనీఫా గారి ప్రియ శిష్యులైన ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్‌లు కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. కేవలం నుదురు లేక కేవలం ముక్కును నేలకానించి చేసే సజ్దా అసంపూర్ణ సజ్దా అవుతుంది. దీనికి భిన్నంగా ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అవి రెండూ వేర్వేరు శరీర భాగాలని అన్నారు. ఆ రెంటిలో ఏ ఒక్క శరీర భాగం నేలకు ఆనినా సజ్దా అయిపోతుందని, అందులో ఎలాంటి వెలితి ఉండబోదని ఆయన వ్యాఖ్యానించారు.

అయితే ఇది అధికసంఖ్యాకుల అభిప్రాయానికి భిన్నంగా ఉంది. ముగ్గురు ఇమాములు మరియు ఇద్దరు హనఫీ ఇమాములు ఒక వైపు ఉండగా ఒక్క అబూ హనీఫా (రహ్మ.లై) గారే తనదైన అభిప్రాయంపై నిలిచివున్నారు. పైగా ఆయన అభిప్రాయం పై హదీసుకు విరుద్ధంగా ఉంది. అందుచేత ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి అభిప్రాయం బలహీనమైనది. ఇబ్నె అబీ షైబాలో హజ్రత్ ఇక్రిమ (రజి)చే ఉల్లేఖించబడిన ఒక హదీసు ఇలా వుంది: దైవప్రవక్త (స) ఒక వ్యక్తి నమాజ్ చేస్తున్న వైపునుంచి సాగిపోతున్నారు. అతని ముక్కు నేలకు తగలటంలేదు. అప్పుడాయన (స) ఇలా అన్నారు - "ఎవరి నుదురు మరియు ముక్కు నేలకు ఆనలేదో వారి నమాజ్ నెరవేరదు" అంటే సజ్దా స్థితిలో నుదుటితో పాటు ముక్కు కూడా నేలకు తగలటం అవసరం అన్నమాట!

(٢٣٥) وَعَنِ ابْنِ بُحَيْنَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ. أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا صَلَّى وَسَجَدَ، فَرَّجَ بَيْنَ يَدَيْهِ حَتَّى يبدو بَيَاضُ إِبِطَيْهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

235. హజ్రత్ ఇబ్నె బుహైన (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ సందర్భంగా సజ్దా చేసినప్పుడు తన రెండు భుజాలను తన రెండు ప్రక్కలనుండి వేరుగా ఉంచేవారు - ఆ స్థితిలో ఆయన (స) చంకల తెలుపుదనం సయితం కనిపించేది." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

అంటే దైవప్రవక్త (స) సజ్దా స్థితిలో ముడుచుకుపోకుండా తన రెండు చేతులను కొంత విస్తరింపజేసేవారు. ఆ స్థితిలో ఆయన (స) చంకల తెలుపుదనం సయితం కానవచ్చేది. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ తబ్రీ తదితరులు ఇలా అంటున్నారు: దైవప్రవక్త (స) గారి చంకలు శరీరంలోని ఇతర అవయవాల్లా తెల్లగా ఉండేవి - నల్లగా ఉండేవి కావు. ఆయనలోని ఇతర ప్రత్యేకతల మాదిరిగా ఇది కూడా ఒక ప్రత్యేకతే అనుకోవాలి.

## హదీసు ఉల్లేఖకులు

ఇబ్నె బుహైన (రజి) గారి పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ బిన్ ఖిష్బ్. బుహైన అనేది ఆయన తల్లి పేరు. తల్లి పేరుతోనే ఆయన ప్రసిద్ధిచెందారు. తండ్రిపేరు మాత్రం మాలిక్. తొల్దొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. కఠోర అభ్యాసాలు జరిపేవారు. అత్యధికంగా ఉపవాసాలు పాటించేవారు. ఇహలోకంతో నామమాత్రపు సంబంధం పెట్టుకునేవారు. మదీనాకు 30 మైళ్ళ దూరంలో వున్న రిమ్ లోయలో హిజ్రీ 54 - 58 మధ్య కాలంలో మరణించారు.

(٢٣٦) وَعَنِ الْبَرَاءِ بْنِ عَازِبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا سَجَدْتَ فَضَعْ كَفَّيْكَ، وَارْفَعْ مِرْفَقَيْكَ». رَوَاهُ مُسْلِمٌ.

236. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) తెలిపారు: "నీవు సజ్దా చేసినపుడు నీ అరచేతులను నేలకు ఆనించు, మోచేతులను పైకి లేపు." (ముస్లిం)

## సారాంశం

సజ్దా స్థితిలో రెండు చేతులను నేలపై పరచటంగానీ, మోచేతులను తొడలకు ఆనించి అలసట తీర్చుకోవటం వంటివి గానీ చేయరాదనీ పై హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. దైవప్రవక్త (స) గారు ఏ విధంగా నమాజ్ చేశారో ఆ విధంగానే మనం కూడా నమాజ్ చేయాలి.

## హదీసు ఉల్లేఖకులు

బరా బిన్ ఆజిబ్ (రజి) మరో పేరు అబూ అమ్మార. తండ్రి పేరు ఆజిబ్ బిన్ హారిస్ బిన్ అదీ. అన్సార్‌కు చెందిన ఔస్ తెగతో ఈయనకు సంబంధం ఉండేది. తండ్రీ కొడుకులిరువురూ సహాబీలే. బరా బిన్ ఆజిబ్ పిన్న వయస్సు మూలంగా బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు. ఉహుద్ సంగ్రామంలోనో, కందక యుద్ధంలోనో తొలిసారిగా యుద్ధరంగ ప్రవేశం చేశారు. 'రే' ను జయించారు. జమల్, సిఫ్ఫీన్, నహర్ వాన్ యుద్ధాలలో హజ్రత్ అలీ (రజి) మద్దతుదారునిగా నిలిచారు. కూఫాలో హిజ్రీ 72లో మరణించారు.

(٢٣٧) وَعَنْ وَائِلِ بْنِ حُجْرٍ رَضِيَ

237. హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రుకూలో ఉన్నప్పుడు తన

اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا رَكَعَ فَرَّجَ بَيْنَ أَصَابِعِهِ، وَإِذَا سَجَدَ ضَمَّ أَصَابِعَهُ. رَوَاهُ الْحَاكِمُ.

(చేతి) వ్రేళ్లను విప్పి (చాచి) ఉంచేవారు. మరదే సజ్దా స్థితిలో మాత్రం తన (చేతి) వ్రేళ్లను పరస్పరం కలిపి ఉంచేవారు.'' (ముస్తద్రక్ హాకిమ్)

**సారాంశం**

రుకూ మరియు సజ్దాల స్థితిలో చేతివ్రేళ్లు ఎలా ఉండాలో ఈ హదీసు మనకు చెబుతోంది. రుకూలో నుండగా చేతి వ్రేళ్లను విడిగా నుంచటం మస్నూన్. మరదే సజ్దాలోనయితే రెండు చేతుల వ్రేళ్లను పరస్పరం కలిపివేయాలి. ఎందుకంటే ఆ స్థితిలో వ్రేళ్లు కాబా దిశలో ఉండగలగటానికి అలా చేయాలి.

(٢٣٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: رَأَيْتُ رَسُولَ اللّٰهِ ﷺ يُصَلِّي مُتَرَبِّعاً. رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

238. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: ''నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను కాళ్లు మడత పెట్టుకుని కూర్చుని నమాజ్ చేయగా చూచాను.'' (నసాయి దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) గుఱ్ఱంపై నుంచి క్రిందపడి కాలికి దెబ్బ తగిలిన తరువాత చేసినప్పటి నమాజ్‌కు సంబంధించినది ఈ హదీసు. దీన్నిబట్టి బోధపడేదేమంటే మనిషి ఏ కారణంగానయినా సాధారణ స్థితిని కోల్పోయినపుడు షరీయత్ అతన్ని తదనుగుణమైన రీతిలో నమాజ్‌ను నెరవేర్చేందుకు అనుమతినిస్తుంది.

(٢٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقُولُ بَيْنَ السَّجْدَتَيْنِ: **اَللّٰهُمَّ اغْفِرْ لِيْ، وَارْحَمْنِيْ،**

239. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు సజ్దాల మధ్య ఈ దుఆ చేసేవారు : ''అల్లాహుమ్మగ్‌ఫిర్లీ వర్‌హమ్నీ వహ్‌దినీ వ ఆఫినీ వర్‌జుఖ్‌నీ'' (ఓ అల్లాహ్! నన్ను క్షమించు. నాకు సన్మార్గం చూపు. నా తప్పులను మన్నించు. ఇంకా నాకు (ధర్మసమ్మతమయిన) ఉపాధిని ప్రసాదించు) (దీనిని

وَاهْدِنِي، وَعَافِنِي، وَارْزُقْنِي. رَوَاهُ الْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَاللَّفْظُ لِأَبِي دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

'నలుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు. వాక్యాలు మాత్రం అబూ దావూద్ లోనివి. హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) నమాజ్‌లో వివిధ సందర్భాలలో వివిధ వేడుకోళ్లు చేసేవారు. రెండు సజ్దాల మధ్య - 'జల్సా' స్థితిలో - ఆయన ఈ 'దుఆ' చేశారు. కనుక మనం కూడా నమాజులో ఈ చిన్న దుఆను చేయటం మస్నూన్ (సంప్రదాయం).

(٢٤٠) وَعَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ رَأَى النَّبِيَّ ﷺ يُصَلِّي، فَإِذَا كَانَ فِي وِتْرٍ مِنْ صَلَاتِهِ لَمْ يَنْهَضْ حَتَّى يَسْتَوِيَ قَاعِداً. رواه البخاري.

240. తాను దైవప్రవక్త (సఅసం)ను నమాజ్ చేస్తుండగా చూచానని హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్ (రజి) చెప్పారు: "ఆయన (స) తన నమాజులోని వితర్ (రకత్)ను చేసినప్పుడు (ముందు కాస్సేపు) కూర్చొని తరువాత తిన్నగా నిలబడేవారు." (బుఖారీ)

**సారాంశం**

ఇలా కూర్చోవటాన్ని "జల్సయే ఇస్తిరాహత్" అంటారు. ఇమామ్ షాఫయి దీనికి అనుకూలంగా ఉన్నారు. కాని ఇమామ్ అహ్మద్, ఇమామ్ అబూ హనీఫా దీనికి అనుకూలంగా లేరు. వృద్ధాప్యం వల్ల దైవప్రవక్త (స) అలా విరామం పాటించేవారని వీరిద్దరి వాదన. అయితే ఈ హదీసును ఉల్లేఖించిన మాలిక్ (రజి) మరియు ఆయన మిత్రబృందాన్ని ఉద్దేశ్యించి దైవప్రవక్త (స) ఖుద్దుగా ఇలా అన్నారు: నేను ఏవిధంగా నమాజ్ చేస్తుండటాన్ని మీరు చూచారో ఆ విధంగానే నమాజ్ చేయండి." ఈ హదీసు వెలుగులో ఏది మంచిదో మీరే ఆలోచించండి!

(٢٤١) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَنَتَ شَهْراً بَعْدَ الرُّكُوعِ، يَدْعُو عَلَى أحياءٍ من أَحْيَاءِ الْعَرَبِ، ثُمَّ تَرَكَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

241. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పూర్తిగా నెల రోజులపాటు రుకూ అనంతరం 'దుఆయే ఖునూత్' చదివారు. ఆ తరువాత వదిలేశారు." (బుఖారీ, ముస్లిం)

وَلِأَحْمَدَ وَالدَّارَقُطْنِيِّ نَحْوُهُ مِنْ وَجْهٍ

అహ్మద్, దారె ఖుత్నీ తదితరులు మరో విధంగా దీనిని ఉల్లేఖించారు. అందులో

آخَرَ، وَزَادَ: فَأَمَّا فِي الصُّبْحِ فَلَمْ يَزَلْ يَقْنُتُ حَتَّى فَارَقَ الدُّنْيَا.

వారు అదనంగా ఇలా పేర్కొన్నారు - "ఉదయం నమాజ్‌లో దుఆయే ఖునూత్‌ను జీవితాంతం చేశారు."

### పూర్వాపరాలు

దైవధర్మ ప్రచారం నిమిత్తం పంపబడిన రెండు సహచర బృందాలను శత్రువులు మోసగించి, దగాచేసి చంపినందుకుగాను దైవప్రవక్త (సఅసం) శోకసంతప్త హృదయంతో - శపిస్తూ చేసిన దుఆ ఇది.

అది హిజ్రీ 4వ సంవత్సరం సఫర్ మాసం - అరేబియాలోని కొన్ని తెగలవారు చేసిన అభ్యర్థనపై- వారికి ధర్మాదేశాలు బోధించడానికిగాను దైవప్రవక్త 70 మంది ఖుర్ఆన్ బోధకులను ఆ తెగలవారి వద్దకు పంపారు. రీల్, జక్వాన్, ఉసైయ వంటి తెగలు నమ్మకద్రోహానికి పాల్పడి ఎంతో విలువైన ప్రవక్త ప్రియ సహచరులను చుట్టుముట్టి నరమేధం సృష్టించారు. వారిలో ఒక్క కాబ్ బిన్ జైద్ (రజి) మాత్రమే ఎలాగో బయటపడగలిగారు.

అలాగే బనూ లిహ్యాన్ దరఖాస్తుపై దైవప్రవక్త (స) పదిమంది విద్వాంసులను ధర్మోపదేశం నిమిత్తం పంపగా ఆ తెగకూడా విశ్వాసఘాతుకానికి పాల్పడి హత్యాకాండ చేసింది. ఇద్దరు సహాబీలు ప్రాణాలతో బయటపడగలిగారు. ఈ రెండు విషాదోదంతాల సమాచారం దైవప్రవక్త (సఅసం)కు ఒకే రాత్రి అందింది. ఆయన (స) మనసు బాధతో తల్లడిల్లిపోయింది. అందుచేత ఆయన నెలరోజులపాటు వారిని శపిస్తూ దైవాన్ని ప్రార్థించారు. ఇటువంటి దుఆయె ఖునూత్‌ను 'ఖునూతె నాజిలా' అంటారు. ఇటువంటి ప్రార్థనలు వ్యధాభరితమయిన ఉదంతాలు జరిగినపుడు, జాతి భయంకరమయిన విపత్తులకు లోనయినపుడు చేయబడతాయి.

### సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు చర్చకు వస్తాయి. ఫజ్ర్ నమాజ్‌లో ఆయన (స) 'దుఆయె ఖునూత్' చేసినట్టు రుజువవుతున్నది. వాగ్దాన భంగానికి పాల్పడి తన సహచరులను హతమార్చినందుకు గాను అవిశ్వాసులను ఆయన (స) నెలరోజులపాటు శపించారు. అంటే ఫర్జ్ నమాజులో (సామూహిక నమాజులో) ఆయన ఈ విధంగా చేశారు. రుకూ చేసి నిలబడిన తరువాత ఈ దుఆ చేశారన్నది గమనార్హం.

దీనిద్వారా తెలిసే మరో విషయం ఏమిటంటే ఇస్లాం ధర్మం మానవులందరికీ పరిచయం చెయ్యవలసిన ధర్మం. ఇందునిమిత్తం ధర్మప్రచారకుల సమూహం (బృందం) ఒకటి నిత్యం సిద్ధంగా ఉండాలి. ఎక్కడెక్కడ దీని అవసరముంటే అక్కడ ఆ జమాఅత్‌ను పంపి సందేశ ప్రచార బాధ్యతను నిర్వర్తిస్తూ ఉండాలి. ఈ విధి నిర్వహణ నిమిత్తం ఒక జమాఅత్ ఉండాలనీ, దానికొక అమీర్ (నాయ కుడు) ఉండాలని కూడా సంకేతం లభిస్తున్నది.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే మరో ముఖ్య విషయం ఏమిటంటే దైవప్రవక్త (స)కు 'అగోచర జ్ఞానం' లేదు. కొంతమంది చెబుతున్నట్లు ఆయన (స) కు అగోచర జ్ఞానం (ఇల్మె గైబ్)

గనక ఉండి ఉంటే తన ప్రియ సహచరులను హంతకులకు ఎందుకు అప్పజెప్పేవారు? తెలిసీ ఆయన (స) అలా చేస్తారా? (దైవం మన్నించుగాక!) దేవుని తరపున ఈ సమాచారం అందేవరకు ఆయన (స)కు హతుల గురించి ఏమీ తెలీదాయె!

హనఫీ మస్లక్ ననుసరించేవారు ఈ హదీసు వెలుగులో అవసరం ఏర్పడినపుడు 'ఖునూతె నాజిలా' చేయవచ్చని అంగీకరిస్తారు. కాగా; ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ఫజ్ర్ నమాజ్‌లో నిత్యం దుఆయె ఖునూత్ చదవాలంటారు. దీన్ని ఆయన 'మస్నూన్'గా ఖరారు చేశారు. ఈ దుఆచేసే పద్ధతి ఏమిటంటే; ఇమామ్ రుకూ తరువాత చేతులెత్తి ఖునూతె నాజిలా పఠిస్తుండగా వెనుకనున్నవారు 'ఆమీన్' పలకాలి.

(٢٤٢) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ لاَ يَقْنُتُ إِلاَّ إِذَا دَعَا لِقَوْمٍ أَوْ عَلَى قَوْمٍ. وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

242. హజ్రత్ అనస్ (రజి) గారి చేతనే మరో ఉల్లేఖనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏదేని ఒక జాతి కోసం ప్రార్థన చేయవలసివుంటే లేదా ఎవరి నయినా శపించవలసి ఉంటేనే 'ఖునూత్' పఠించేవారు. లేకుంటే పఠించేవారు కాదు." (ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులలో వైరుధ్యం, వ్యాఘాతం ఉన్నట్లు పైకి కనిపిస్తోంది. ఫజ్ర్‌లో ఖునూత్ నిత్యం పఠించాలని మొదటి హదీసులో చెప్పబడింది. ఏదేని జాతి ప్రయోజనాన్ని ఆశించో, లేక దాని వినాశాన్ని కాంక్షించో ఖునూత్ పఠించేవారని రెండవ హదీసులో ఉంది. రాబోయే హదీసులో - ఫజ్ర్ నమాజ్‌లో ఖునూత్ పఠించటం 'వినూత్న విషయం' (కొత్తపుంత) అని వుంది. వీటి మధ్య పొంతన ఈ విధంగా ఉండవచ్చు!

ఆయన (స) మరియు ఖులఫాయె రాషిదీన్ ఫజ్ర్ నమాజులో ఖునూత్‌ను పఠిస్తూ ఉన్నారు. రాబోయే హదీసులో అది 'కొత్త విషయం'గా పేర్కొనబడిందంటే దాని భావం ఉదయం నమాజులో నిరంతరం - నాగా లేకుండా - అలా జరగలేదన్నది కావచ్చు. అంటే ఈ పద్ధతిని మస్నూన్‌గా ఖరారు చేయటం 'కొత్త పోకడ' అన్నది దీని మతలబు కావచ్చు! అంటే ఫజ్ర్ నమాజులో నాగాలేకుండా - అవసరం లేకపోయినప్పటికీ - ఖునూత్ చదవవలసిన పనిలేదు అని భావం!

అయితే ఏ హదీసులో - ఫజ్ర్ నమాజ్‌లో - నిత్యం ఖునూత్ చదవాలని ఉందో, దాని భావం మాత్రం సుస్పష్టమే - ఖునూత్ ఎప్పటికీ రద్దుకాలేదని ఇది చెబుతోంది. అవసరం ఏర్పడినప్పుడల్లా ఆయన (స) ఖునూత్ చదువుతూ ఉండేవారు.

ఏ హదీసులో ఒకరి శ్రేయాన్ని కోరి లేక ఒకరి వినాశాన్ని వాంఛించి ఖునూత్ పఠించేవారని వుందో అది తాత్కాలిక స్థితిని సూచిస్తోంది. అంటే అవసరార్థం దుఆ చేయటమో, శపించటమో

చేసేవారన్నమాట! హనఫీ ఫికహ్ ననుసరించేవారు దీనినే అవలంబిస్తున్నారు. ఒక్క వితర్ నమాజ్‌లో తప్ప మరే నమాజులోనయినా - నిత్యం ఖునూత్ పఠించాలన్న వాదనకు హనఫీ ధర్మవేత్తలు సుముఖంగా లేరు. ముస్లింలపై ఏదన్నా ఆపద ముంచుకువస్తే, ఉదాహరణకు శత్రువు వారి రాజ్యాన్ని కబళిస్తే, ఏదయినా మహమ్మారి ప్రబలిపోతే, దుర్భిక్షం తాండవిస్తే అట్టి పరిస్థితిలో హనఫీలు కూడా ఐదు పూటలా నమాజులో ఖునూత్ పఠించటం 'మస్నూన్' గా భావిస్తున్నారు.

(٢٤٣) وَعَنْ سَعْدِ بْنِ طَارِقٍ الْأَشْجَعِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قُلْتُ لِأَبِي: يَا أَبَتِ! إِنَّكَ قَدْ صَلَّيْتَ خَلْفَ رَسُولِ اللهِ ﷺ وَأَبِي بَكْرٍ وَعُمَرَ وَعُثْمَانَ وَعَلِيٍّ، أَفَكَانُوا يَقْنُتُونَ فِي الْفَجْرِ؟ قَالَ: أَيْ بُنَيَّ مُحْدَثٌ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ أَبَا دَاوُدَ.

243. హజ్రత్ సాద్ బిన్ తారిఖ్ అష్జయి (రజి) కథనం: "నాన్నా! మీరు దైవప్రవక్త (సఅసం), అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), అలీ (రజి)ల వెనుక నమాజ్ చేసివున్నారు కదా! వీళ్లంతా ఫజ్ర్ నమాజ్‌లో దుఆయే ఖునూత్ పఠించేవారా?!" అని నేను నా తండ్రిని అడిగాను. "అబ్బాయి! ఇదొక క్రొత్త విషయం (బిద్అత్)" అని ఆయన నాకు జవాబు ఇచ్చారు." ('ఐదుగురి'లో అబూదావూద్ తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు)

## సారాంశం

ఈ హదీసును ఆధారంగా తీసుకుని నమాజ్‌లో ఖునూత్ పఠించటం 'బిద్అత్' అని ఎవరయినా అంటే అది సరికాదు. దీనికి సంబంధించిన వివరణ మేమింతకు ముందే ఇచ్చాము. నిత్యం, ఎడతెగకుండా ఖునూత్ పఠించనవసరం లేదన్న భావంలో ఈ హదీసు ఉంది. అంతేగాని ఇది పూర్తిగా ఖునూత్‌ను త్రోసిపుచ్చటం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

1. సాద్ (రహ్మ.లై) : పూర్తిపేరు సాద్ బిన్ తారిఖ్ బిన్ అష్యమ్ బిన్ మస్వూద్ అష్జయి (రజి). మారుపేరు అబూ మాలిక్. విశ్వసనీయులయిన తాబయీన్లలో ఒకరుగా పరిగణించ బడతారు. హిజ్రీ 140లో మరణించారు.

2. తారిఖ్ అష్జయి (రజి) : అంటే సాద్ (రహ్మ.లై) గారి తండ్రి. ప్రముఖ సహాబీలలో ఒకరు. ఈయన కేవలం 14 హదీసులు మాత్రమే అందజేశారు. ఈయన గారినుండి ఈయన కుమారుడు తప్ప వేరెవరూ హదీసులను సంగ్రహించలేదు. కూఫా వాసులుగా పరిగణించబడ్డారు.

(٢٤٤) وَعَنِ الْحَسَنِ بْنِ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: عَلَّمَنِي رَسُولُ اللهِ ﷺ

244. హజ్రత్ హసన్ బిన్ అలీ (రజి) వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాకు కొన్ని వచనాలు నేర్పారు. నేను వాటిని వితర్‌లో

كَلِمَاتٍ أَقُولُهُنَّ فِي قُنُوتِ الْوِتْرِ: «اللَّهُمَّ اهْدِنِي فِيمَنْ هَدَيْتَ، وَعَافِنِي فِيمَنْ عَافَيْتَ، وَتَوَلَّنِي فِيمَنْ تَوَلَّيْتَ، وَبَارِكْ لِي فِيمَا أَعْطَيْتَ، وَقِنِي شَرَّ مَا قَضَيْتَ، فَإِنَّكَ تَقْضِي وَلاَ يُقْضَى عَلَيْكَ، إِنَّهُ لاَ يَذِلُّ مَنْ وَّالَيْتَ، تَبَارَكْتَ رَبَّنَا وَتَعَالَيْتَ». رَوَاهُ الْخَمْسَةُ، وَزَادَ الطَّبْرَانِيُّ وَالْبَيْهَقِيُّ: «وَلاَ يَعِزُّ مَنْ عَادَيْتَ». زَادَ النَّسَائِيُّ مِنْ وَجْهٍ آخَرَ فِي آخِرِهِ: «وَصَلَّى اللَّهُ عَلَى النَّبِيِّ».

(దుఆయె ఖునూత్‌గా) పఠిస్తాను. ఆ వచనాలివి: "అల్లాహుమ్మహ్‌దినీ ఫీమన్ హదైత్. వ ఆఫినీ ఫీమన్ ఆఫైత్. వ తవల్లనీ ఫీమన్ తవల్లైత్. వ బారిక్‌లీ ఫీమా ఆతైత్. వఖినీ షర్ర మా ఖజైత్. ఫ యిన్నక తఖ్‌జీ వలా యుఖ్‌జా అలైక్. ఇన్నహు లా యజిల్లు మన్ వాలైత్. తబారక్త రబ్బనా వ తఆలైత్."

(అర్థం: ఓ అల్లాహ్! నాకు సన్మార్గం చూపి నీవు సన్మార్గం చూపిన వారి శ్రేణిలో నన్ను చేర్చు. నాకు రక్షణనిచ్చి నీవు రక్షణనిచ్చిన వారిలో నన్ను చేర్చు. ఎవరినయితే నీవు నీ నేస్తాలుగా ఖరారు చేశావో వారిలో నన్ను కూడా చేర్చి నీ నేస్తంగా చేసుకో. నీవు నాకు ప్రసాదించిన దానిలో వృద్ధి నొసగు. ఏ చెడు మరియు కీడుకు సంబంధించి నీవు నిర్ణయం గైకొన్నావో దాన్నుండి నన్ను సురక్షితంగా ఉంచు. నిశ్చయంగా నిర్ణయాన్ని జారీ చేసేవాడవు నీవే. నీకు వ్యతిరేకంగా నిర్ణయం జారీ చేయటం అసంభవం. ఎవరినయితే నీవు స్నేహితునిగా చేసు కున్నావో అతడు ఎన్నటికీ పరాభవా నికి, అవమానానికి గురికాడు. ప్రభూ! నువ్వు మాత్రమే శుభాలు కలవాడవు, సర్వోన్నతుడవు) (దీనిని ఐదుగురు - అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఉల్లేఖించారు. తబ్రానీ మరియు బైహఖీలు "వలా యుయిజ్జు మన్ ఆదైత్" అనే వాక్యాన్ని

وَلِلْبَيْهَقِي عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَلِّمُنَا دُعَاءً نَدْعُو بِهِ فِي الْقُنُوتِ مِنْ صَلاةِ الصُّبْحِ. وَفِي سَنَدِهِ ضَعْفٌ.

అదనంగా నకలు చేశారు. నసాయి మరో విధంగా ఈ దుఆ చివరిలో "వ సల్లల్లాహు అలన్నబీ" అనే వాక్యాన్ని అదనంగా ఉల్లేఖించారు.

బైహఖీలో ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది - "దైవప్రవక్త -సఅసం- మాకు దుఆ నేర్పేవారు. దానిని మేము ఉదయం నమాజులో 'దుఆయె ఖునూత్' రూపంలో చదివేవాళ్ళం." (దీని ఆధారం బలహీనంగా ఉంది)

## సారాంశం

వితర్ నమాజులో ఈ దుఆ చేయాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ దుఆ రుకూకి ముందు, తరువాత - రెండు తరహాలుగా కూడా చేయవచ్చు. అయితే ముస్తద్రక్ హాకిమ్, బైహాఖీలోని మాటల్ని బట్టి రుకూ తరువాత దుఆ చేయటమే సమంజసం. దుఆ చివరిలో నున్న "సల్లల్లాహు అలన్నబీ" వాక్యాన్ని కొంత మంది 'జయీఫ్' గా ఖరారు చేశారు. అయితే అల్లామా అల్-బానీ గారు ఈ అదనపు వాక్యాన్ని ప్రమాణబద్ధమైనదిగా వ్యాఖ్యానించారు.

ఇక నమాజె వితర్ స్థాయి ఏమిటీ? దాని రకత్‌లు ఎన్ని? అనే విషయంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. హనఫీ ఫుకహా దృష్టిలో ఈ నమాజ్ వాజిబ్ (తప్పనిసరి). కాగా; మిగిలిన వారందరి అభిప్రాయంలో ఇది సున్నత్.

రకతుల సంఖ్య గురించి కూడా అనేక ఉల్లేఖనాలున్నాయి. వివిధ ఉల్లేఖనాల ప్రకారం దీని సంఖ్య ఒకటి నుంచి పదకొండు వరకూ వుంది. హనఫీ ఫుకహా మూడు రకతుల వైపునకు మొగ్గు చూపారు. దీనిని నెరవేర్చే విధానంలో కూడా స్వల్పమయిన వ్యత్యాసం ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

హసన్ బిన్ అలీ (రజి) దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి ప్రియతమ మనవడు. స్వర్గలోకపు యువజన నాయకులలో ఈయన కూడా ఒకరు. హజ్రత్ హసన్ (రజి) హిజ్రీ 3లో జన్మించారు. తండ్రి అమరగతి నొందిన తరువాత ఈయన ముస్లిముల ఖలీఫాగా చేయబడ్డారు. కాని ఖలీఫాగా ఎన్నికయిన ఏడు మాసాల తర్వాత హిజ్రీ 41 జమాదుల్ ఊలాలో - హజ్రత్ ముఆవియాకు అనుకూలంగా ఆయన తన పదవిని త్యాగం చేశారు. ముస్లిముల మధ్య అంతర్గత వైషమ్యాలు పెచ్చరిల్లి రక్తపాతం జరగరాదన్నదే ఆయన నిర్ణయం వెనుక ముఖ్యోద్దేశ్యం. హిజ్రీ 49లో మరణించారు. జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(٢٤٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا سَجَدَ أَحَدُكُمْ فَلَا يَبْرُكْ كَمَا يَبْرُكُ الْبَعِيرُ، وَلْيَضَعْ يَدَيْهِ قَبْلَ رُكْبَتَيْهِ». أَخْرَجَهُ الثَّلَاثَةُ.

245. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీలో ఎవరయినా సజ్దా చేసినప్పుడు ఒంటె మాదిరిగా కూర్చోకండి. మోకాళ్ల కన్నా ముందుగా మీ చేతులను నేలపై ఆనించండి." (నసాయి, తిర్మిజీ, ఇబ్నె మాజ)

وَهُوَ أَقْوَى مِنْ حَدِيثِ وَائِلِ ابْنِ حُجْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «رَأَيْتُ النَّبِيَّ ﷺ إِذَا سَجَدَ وَضَعَ رُكْبَتَيْهِ قَبْلَ يَدَيْهِ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ. فَإِنَّ لِلْأَوَّلِ شَاهِداً مِنْ حَدِيثِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ. وَذَكَرَهُ الْبُخَارِيُّ مُعَلَّقاً مَوْقُوفاً.

ఈ హదీసు వాయల్ బిన్ హుజ్ర్ (రజి) తరఫున ఉల్లేఖించబడిన హదీసుకన్నా బలవత్తరమైనది. అందులో (వాయల్ హదీసులో) ఇలా వుంది: "నేను దైవ ప్రవక్త (స)ను సజ్దాలోకి వెళుతుండగా చూశాను - ఆయన (స) తన మోకాళ్లను చేతులకన్నా ముందుగా నేలపై ఆనిం చారు." (దీనిని నలుగురు - అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజా- ఉల్లేఖించారు. మొదటి హదీసుకు సాక్ష్యం ఇబ్నె ఉమర్ (రజి) హదీసు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. బుఖారీ దీనిని 'మౌఖూఫ్' అని చెప్పారు)

## సారాంశం

హజ్రత్ వాయల్ (రజి) ఈ హదీసును ఒంటరిగా వివరించారు. హదీసును ఎవరయినా ఒంటరిగా చెప్పినపుడు - ఆ ఉల్లేఖనంపై హదీసు వేత్తలు తమ వ్యాఖ్యానాలు చేశారు. వాయల్ హదీసును హజ్రత్ అనస్ (రజి) గారి ఉల్లేఖనం ఒకటి సమర్థిస్తున్నప్పటికీ, దానిని అందజేసిన వారిలో ఒక వ్యక్తి అంతగా నమ్మకస్థుడు కాడు. కాబట్టి హజ్రత్ అబూహురైర (రజి)చే ఉల్లేఖించబడిన హదీసు ఎక్కువ ప్రామాణికమైనదనీ, అనుసరణీయమైనదనీ రూఢీ అయింది.

గ్రంథ రచయిత హాఫిజ్ ఇబ్నె హజర్ కూడా హజ్రత్ అబూ హురైర (రజి) హదీసునే అనుసరణీయమైనదిగా భావించారు. ఎందుకంటే ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం దీనిని సమర్థిస్తోంది. హదీసువేత్తలు, హంబలీ ఫిక్హ్ ననుసరించేవారు కూడా ఈ హదీసుకు అనుకూలంగా ఉన్నారు. అయితే హనఫీలు, షాఫయీలు మాత్రం హజ్రత్ వాయల్ (రజి) హదీసు వైపుకు మొగ్గు చూపారు. మొదట మోకాళ్లను నేలకు ఆనించాలని ఈ హదీసులో ఉంది.

(٢٤٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ كَانَ إِذَا قَعَدَ لِلتَّشَهُّدِ وَضَعَ يَدَهُ الْيُسْرَى عَلَى رُكْبَتِهِ الْيُسْرَى، وَالْيُمْنَى عَلَى الْيُمْنَى، وَعَقَدَ ثَلَاثًا وَخَمْسِينَ، وَأَشَارَ بِإِصْبَعِهِ السَّبَّابَةِ. رَوَاهُ مُسْلِمٌ.

246. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తషహ్హుద్ కోసం (ఖాయిదాలో) కూర్చున్నప్పుడు తన ఎడమ చేతిని ఎడమ మోకాలిపై ఉంచేవారు. కుడి చేతిని తన కుడి మోకాలిపై ఉంచి, చేతి (నాలుగు) వ్రేళ్లను ముడుచుకునేవారు. చూపుడు వ్రేలితో సంజ్ఞ చేసేవారు.'' (ముస్లిం)

وَفِي رِوَايَةٍ لَهُ: وَقَبَضَ أَصَابِعَهُ كُلَّهَا، وَأَشَارَ بِالَّتِي تَلِي الْإِبْهَامَ.

ముస్లిం ఉల్లేఖించిన వేరొక ఉల్లేఖనం లో ఇలా వుంది: తన (కుడి చేతి) వ్రేళ్లన్నింటినీ మూసివుంచి, బొటన వ్రేలికి దగ్గరలో వున్న వ్రేలితో (చూపుడు వ్రేలితో) సంజ్ఞ చేసేవారు.''

**సారాంశం**

హదీసు మూలంలో '53ను పోలిన ముడి వేసేవార'ని ఉంది. చూపుడు వ్రేలిని చాచి, మిగిలిన మూడు వ్రేళ్ళను బొటన వ్రేలితో నొక్కి పట్టుకుంటే, అరబీ అంకెల ప్రకారం 53ను పోలిన రూపం వస్తుంది. ఖాయిదాలో దైవ ప్రవక్త (స) ఎలా చేసేవారో మనం కూడా అలాగే చేయాలి. దైవ ప్రవక్త (స) అనుసరణలో ఇది కూడా ఒక భాగమే కదా! తషహ్హుద్‌లో చూపుడు వ్రేలితో సంజ్ఞ చేయటంపై ఇమాములందరూ ఏకీభవించారు.

(٢٤٧) وَعَنْ عَبْدِاللّٰهِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: اَلْتَفَتَ إِلَيْنَا رَسُولُ اللّٰهِ ﷺ، فَقَالَ: «إِذَا صَلَّى أَحَدُكُمْ فَلْيَقُلْ: «التَّحِيَّاتُ لِلّٰهِ وَالصَّلَوَاتُ وَالطَّيِّبَاتُ، السَّلَامُ عَلَيْكَ أَيُّهَا النَّبِيُّ! وَرَحْمَةُ اللّٰهِ وَبَرَكَاتُهُ، السَّلَامُ عَلَيْنَا وَعَلَى عِبَادِ اللّٰهِ الصَّالِحِينَ،

247. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా వైపు దృష్టిసారించి ఇలా ఉపదేశించారు - మీలో ఎవర యినా నమాజ్ చేసినపుడు 'తషహ్హుద్' లో ఇలా అనండి: సమస్త స్తోత్రాలు, పరి శుద్ధతలు, (సమస్త నోటి ఆరాధనలు, శారీరక ఆరాధనలు, ధనపరమైన ఆరాధ నలు) కేవలం అల్లాహ్ కొరకే. ఓ ప్రవక్తా! మీపై శాంతి కలుగుగాక! దైవకారుణ్యం

أَشْهَدُ أَنْ لاَ إِلَه إِلاَّ اللَّهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّداً عَبْدُهُ وَرَسُولُهُ» ثُمَّ لِيَتَخَيَّرْ مِنَ الدُّعَاءِ أَعْجَبَهُ إِلَيْهِ، فَيَدْعُو». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

మరియు శుభాలు కలుగుగాక! మాపైన మరియు దేవుని సజ్జనులైన దాసులపైన కూడా శాంతి కలుగుగాక! అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ (సఅసం) దేవుని దాసుడు మరియు సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను." - ఆ తరువాత వారు 'దుఆ'ను ఎన్నుకోవాలి. తనకు అన్నిటికన్నా మంచిదనిపించిన దుఆ చేయాలి. (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

وَلِلنَّسَائِيِّ: «كُنَّا نَقُولُ قَبْلَ أَنْ يُفْرَضَ عَلَيْنَا التَّشَهُّدُ». وَلأَحْمَدَ: أَنَّ النَّبِيَّ ﷺ عَلَّمَهُ التَّشَهُّدَ، وَأَمَرَهُ أَنْ يُعَلِّمَهُ النَّاسَ.

'నసాయి'లో ఉంది: "తషహ్హుద్ విధించబడక మునుపు మేము ఇది.... పఠించేవారము." అహ్మద్‌లో వుంది: "దైవప్రవక్త (స) వీళ్లకు తషహ్హుద్ నేర్పారు. ప్రజలకు దీన్ని నేర్పమని ఆజ్ఞాపించారు." ముస్లిం లో ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం ఈ విధంగా ఉంది: "దైవప్రవక్త (సఅసం) మాకు తషహ్హుద్‌ను నేర్పేవారు. అది ఈవిధంగా ఉండేది-(అత్తహియ్యాతుల్ ముబారకాతు అస్సలవాతుత్తయ్యిబాతు లిల్లాహి.....)"

وَلِمُسْلِمٍ عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَلِّمُنَا التَّشَهُّدَ: «التَّحِيَّاتُ الْمُبَارَكَاتُ الصَّلَوَاتُ الطَّيِّبَاتُ لِلَّهِ» إِلَى آخِرِهِ.

**సారాంశం**

తషహ్హుద్ విధించబడక మునుపు ప్రవక్త సహచరులు "అస్సలాము అలల్లాహ్-అస్సలాము అలా జిబ్రయీల్ వ మేకాయీల్....." అని పఠించేవారు. దైవ ప్రవక్త (స) దీనిని వారించి 'అత్తహియ్యాత్ ......' నేర్పారు.

తషహ్హుద్ తరువాత దుఆ చేయటం 'మస్నూన్' అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఏ దుఆ చేయాలి? అన్న దానిపై ఎలాంటి షరతు లేదు. మనకు నచ్చిన దుఆ ఏదయినా చేయవచ్చు. అయితే దైవప్రవక్త (స) గారి దుఆలు చేయటం మంచిది. ఖుర్ఆనీ దుఆలు కూడా చేయవచ్చు. మన అవసరాలు, అక్కరలకు సంబంధించిన దుఆలు కూడా చేయవచ్చు.

తషహ్హుద్ వాజిబ్ (తప్పనిసరి) అని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. హజ్రత్ ఉమర్

(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి), ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) కూడా దీనిని వాజిబ్‌గానే తలంచారు. ఇతర విద్వాంసులు మాత్రం దీనిని ఫర్జ్ (విధి)గా పరిగణిస్తున్నారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ఉల్లేఖనంలోని తషహ్హుద్ వాక్యాలను ఇమామ్ అబూ హనీఫా సహా అనేక మంది విద్వాంసులు ఇష్టపడ్డారు. ఎందుకంటే తషహ్హుద్ అధ్యాయం క్రింద వచ్చిన ఉల్లేఖనాలన్నింటిలోకీ ఇది అత్యంత ప్రామాణికమైనది.

ఇమామ్ షాఫయి మాత్రం హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)చే ఉల్లేఖించబడిన తషహ్హుద్ వాక్యాలను అవలంబించారు.

(٢٤٨) وَعَنْ فَضَالَةَ بْنِ عُبَيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعَ رَسُولُ اللّٰهِ ﷺ رَجُلاً يَدْعُوْ فِي صَلاَتِهِ، وَلَمْ يَحْمَدِ اللّٰهَ، وَلَمْ يُصَلِّ عَلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: عَجِلَ هٰذَا، ثُمَّ دَعَاهُ، فَقَالَ: إِذَا صَلَّى أَحَدُكُمْ فَلْيَبْدَأْ بِتَحْمِيْدِ رَبِّهِ وَالثَّنَاءِ عَلَيْهِ، ثُمَّ يُصَلِّيْ عَلَى النَّبِيِّ ﷺ، ثُمَّ يَدْعُوْ بِمَا شَاءَ. رَوَاهُ أَحْمَدُ وَالثَّلاَثَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

248. హజ్రత్ ఫజాలా బిన్ ఉబైద్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తిని నమాజులో దుఆ చేస్తుండగా విన్నారు. అతను దైవ స్తోత్రం చేయటంగానీ, దైవ ప్రవక్త (స) పై దరూద్ పంపటం గానీ చేయలేదు. "ఇతను తొందరపడ్డాడు" అని దైవప్రవక్త (స) వ్యాఖ్యానించారు. తరువాత ఆయన (స) ఆ వ్యక్తిని దగ్గరకు పిలిచి, "మీలో ఎవరయినాసరే దుఆ చేయ సాగినపుడు తొలుత మీ ప్రభువును ప్రశంసించాలి, కొనియాడాలి. తరువాత దైవప్రవక్త (స)పై దరూద్ పంపాలి. ఆ తరువాత మీరు కోరుకున్నదల్లా అర్థిం చవచ్చు" అని ఉపదేశించారు. (దీనిని అహ్మద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాలు ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రమాణ బద్ధమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

దుఆలో వేగిరపాటు పనికిరాదని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతున్నది. అణకువకీ, అశక్తతకీ మారుపేరే దుఆ. ఇందులో వీలయినంత ఎక్కువగా దాసుని నిస్సహాయస్థితి వ్యక్తం కావాలి. అందుకే దుఆ చేస్తున్నప్పుడు ఎంతో నింపాదిగా, ప్రశాంతంగా వ్యవహరించాలి. మొదట దేవుని స్తోత్రం చేయాలి. తరువాత దైవప్రవక్త (స)పై శాంతి శుభాలు కలుగజేయమని కోరాలి. ఆ తరువాత

తమ కోసం దైవాన్ని వేడుకోవాలి. ఈ హదీసు చాలా వరకు అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) గారి 'హదీసె తషహ్హుద్'ను పోలివుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈయన ఫజాలా బిన్ ఉబైద్ (రజి). బిన్ నాఫిజ్ బిన్ ఖైస్. మారు పేరు అబూ ముహమ్మద్. అన్సార్లలోని ఔస్ తెగకు చెందిన వ్యక్తి. ఉహుద్ యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. ఆ తరువాత యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. 'బైతె రిజ్వాన్'లో ఈయన కూడా పాలుపంచుకున్నారు. సిరియా వైపునకు ప్రస్థానం చేశారు. డెమాస్కస్‌లో స్థిరపడ్డారు. అమీర్ ముఆవియా (రజి) సిఫ్ఫీన్ యుద్ధానికి వెళ్ళినప్పుడు ఈయన ఆ పట్టణ ఖాజీగా ఉన్నారు. హిజ్రీ 56లో మరణించారు.

(٢٤٩) وَعَنْ أَبِيْ مَسْعُوْدٍ الْأَنْصَارِيِّ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ قَالَ: قَالَ بَشِيْرُ بْنُ سَعْدٍ: يَا رَسُولَ اللّٰهِ! أَمَرَنَا اللّٰهُ أَنْ نُصَلِّيَ عَلَيْكَ، فَكَيْفَ نُصَلِّي عَلَيْكَ؟ فَسَكَتَ؟ ثُمَّ قَالَ: «قُولُوا: اللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ، وَعَلٰى آلِ مُحَمَّدٍ، كَمَا صَلَّيْتَ عَلٰى إِبْرَاهِيمَ، وَبَارِكْ عَلٰى مُحَمَّدٍ. وَعَلٰى آلِ مُحَمَّدٍ، كَمَا بَارَكْتَ عَلٰى إِبْرَاهِيمَ فِي الْعَالَمِينَ، إِنَّكَ حَمِيدٌ مَجِيدٌ. وَالسَّلَامُ كَمَا عَلِمْتُمْ». رَوَاهُ مُسْلِمٌ،

249. హజ్రత్ అబూ మస్ఊద్ అన్సారీ (రజి) కథనం: 'ఓ దైవప్రవక్తా (సఅసం)! అల్లాహ్ మమ్మల్ని మీపై దరూద్ పంపమని సెలవిచ్చాడు కదా! మరయితే మేము మీపై ఎలా దరూద్ పంపేదీ?' అని బషీర్ బిన్ సాద్ విన్నవించుకున్నారు. కొద్దిసేపు ఆగి దైవప్రవక్త (సఅసం), "ఇదిగో ఈ విధంగా చేయండి. అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్......(అర్థం : ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీంపై కరుణానుగ్రహాలను కురిపించినట్లే ముహమ్మద్ (సఅసం)పై, ముహమ్మద్ (స) కుటుంబీకులపై కరుణానుగ్రహాలను కురిపించు. ఇబ్రాహీంపై, ఇరులోకాలలో శుభాలు కురిపించినట్లే నీవు ముహమ్మద్ (సఅసం)పై ఆయన (స) కుటుంబీకులపై శుభాలను కురిపించు. నిస్సందేహంగా నీవు స్తుతించదగినవాడవు, మహోన్నతుడవు) ఇక 'సలాం' అంటారా అది మీకు నేర్పబడింది కదా!" (ముస్లిం) మరియు ఇబ్నె ఖుజైమ ఇందులో

وَزَادَ ابْنُ خُزَيْمَةَ فِيهِ: فَكَيْفَ نُصَلِّي عَلَيْكَ إِذَا نَحْنُ صَلَّيْنَا عَلَيْكَ فِي صَلَاتِنَا؟.

అదనంగా ఇలా నకలు చేశారు: మేము నమాజ్ చేస్తున్నప్పుడు మీపై దరూద్ ఎలా పంపాలి?)

**సారాంశం**

నమాజ్‌లో 'దరూద్' మరియు 'సలాం' పంపటం వాజిబ్ అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఇమామ్ షాఫయి సమేతంగా అనేకమంది ఇమాములు దీనిని వాజిబ్‌గానే తలపోశారు.

ఇక దరూదె షరీఫ్‌లోని వాక్యాలు విభిన్నంగా ఉన్నాయి. వివిధ ఉల్లేఖనాలలో ఈ వైవిధ్యం కానవస్తున్నది. అయితే అన్నింటికన్నా ప్రామాణికమైన ఉల్లేఖనం ఈ హదీసులోనిదే. కనుక దరూద్ పఠించేటప్పుడు ఈ హదీసులోని వాక్యాలకు ప్రాధాన్యత నివ్వటం శ్రేయస్కరం.

**హదీసు ఉల్లేఖకులు**

(1) అబూ మస్‌వూద్ అన్సారీ (రజి) : ఈయన అసలు పేరు ఉఖ్బా బిన్ అమ్ర్. అబూ మస్‌వూద్ మారు పేరు. మదీనాలోని అన్సార్ వర్గీయుడవటంచేత అన్సారీగా వ్యవహరించబడ్డారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న ప్రముఖ సహచరులలో ఈయన కూడా ఒకరు. రెండవ అఖబా ఒడంబడికలో పాల్గొన్నారు. అయితే అప్పటికి పిన్న వయస్కులు. కూఫాలో స్థిరపడ్డారు. అక్కడే మరణించారు. హిజ్రీ 40 తరువాత మదీనాలో మరణించారని మరొక వినికిడి ఉంది.

(2) బషీర్ బిన్ సాద్ (రజి) : మరోపేరు అబూ నూమాన్. అన్సారీ. ఖజ్రజీ. బద్ర్ యుద్ధంలోనూ, అఖబా ఒప్పందంలోనూ పాల్గొన్న పెద్ద సహాబీ. ఉహుద్ యుద్ధం, కందక యుద్ధం, ఆ తరువాత జరిగిన ముఖ్య యుద్ధాలన్నింటిలో ఈయన పాల్గొన్నారు. 'ఐనుత్తమర్'లో హిజ్రీ 13లో అమరగతినొందారు.

(٢٥٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا تَشَهَّدَ أَحَدُكُمْ فَلْيَسْتَعِذْ بِاللهِ مِنْ أَرْبَعٍ، يَقُولُ: اللَّهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنْ عَذَابِ جَهَنَّمَ، وَمِنْ عَذَابِ الْقَبْرِ، وَمِنْ فِتْنَةِ الْمَحْيَا

250. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: - "మీలో ఎవరయినా సరే తషహ్హుద్ పఠించిన మీదట నాలుగు విషయాల నుండి దేవుని శరణు కోరండి. 1) ఓ అల్లాహ్! నరకం నుండి నేను నీ శరణు కోర్తున్నాను. 2) మరియు సమాధి యాతన నుండి నీ శరణు కోర్తున్నాను. 3) జీవన్మరణాల పరీక్ష నుండి నీ శరణు వేడుతున్నాను. 4) ఇంకా - మసీహ్

وَالمَمَاتِ، وَمِنْ شَرِّ فِتْنَةِ المَسِيحِ الدَّجَّالِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ لِمُسْلِمٍ: إِذَا فَرَغَ أَحَدُكُمْ مِنَ التَّشَهُّدِ الأَخِيرِ.

దజ్జాల్ ఉపద్రవపు కీడు నుండి నీ శరణు కోర్తున్నాను." (ముస్లిం, బుఖారీ) ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా ఉంది: "మీలో ఎవర యినా సరే ఆఖరి తషహ్హుద్ పఠించటం పూర్తయిన మీదట ఈ నాలుగు విష యాల నుండి అల్లాహ్ శరణు కోరండి."

**సారాంశం**

తషహ్హుద్‌లో దరూద్, సలాం అన్నీ పూర్తయిన మీదట ఈ విధంగా వేడుకోవటం వాజిబ్ అని ఇబ్నె హజమ్ వక్కాణించారు. తాబయీన్లలో ఇమామ్ తావుస్ (రహ్మ.లై) అభిమతం కూడా ఇదే. కాగా; మిగిలిన పండితులు, విద్వాంసులు దీనిని చివరి తషహ్హుద్‌లో - దరూద్ ముగించిన తరువాత పఠించటం అభిలషణీయం (ముస్తహబ్) అని అభిప్రాయపడ్డారు.

సమాధి యాతన అనేది సత్యమని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దీనిని గనక కాదంటే ఖుర్‌ఆన్, హదీసులను నిరాకరించినట్లవుతుంది.

(٢٥١) وَعَنْ أَبِي بَكْرٍ الصِّدِّيقِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ قَالَ لِرَسُولِ اللّٰهِ ﷺ: عَلِّمْنِي دُعَاءً أَدْعُوْ بِهِ فِيْ صَلَاتِيْ! قَالَ: «قُلْ: اللَّهُمَّ إِنِّي ظَلَمْتُ نَفْسِي ظُلْماً كَثِيراً، وَلَا يَغْفِرُ الذُّنُوبَ إِلَّا أَنْتَ، فَاغْفِرْ لِي مَغْفِرَةً مِنْ عِنْدِكَ، وَارْحَمْنِي، إِنَّكَ أَنْتَ الغَفُورُ الرَّحِيمُ». مُتَّفَقٌ عَلَيْهِ.

251. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) కథనం: నేను నమాజ్‌లో చేయగల దుఆ ఏదయినా నాకు ఉపదేశించండి అని నేను దైవప్రవక్త (సఅసం)ను విన్నవించు కోగా, ఆయన (సఅసం) ఇలా అన్నారు- "ఈ దుఆ పఠించండి - అల్లాహుమ్మ ఇన్నీ జలమ్‌తు నఫ్సీ.... (అర్థం: ఓదేవా! నేను నా ఆత్మకు ఎంతో అన్యాయం చేశాను. నీవు తప్ప పాపాలను మన్నించ గల వాడెవడూ లేడు. కనుక నీ తరపున నాకు క్షమాభిక్షను ప్రసాదించు. నాపై దయజూపు. నిస్సందేహంగా నీవు మాత్రమే క్షమించేవాడవు, నిత్యం కటాక్షించేవాడవు)"

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ప్రతి మనిషీ తన వల్ల జరిగిన పాపాలపై, లోటుపాట్లపై సిగ్గుతో కుమిలిపోతూ క్షమాపణ కొరకు దైవాన్ని ప్రార్థించాలని ఈ హదీసు చెబుతోంది. ఎందుకంటే మానవుని వల్ల నిత్యం తప్పులు, పొరబాట్లు జరుగుతుంటాయి. అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) లాంటి పుణ్యపురుషులే దీనికి అతీతులు కానపుడు ఇతరుల లెక్కేముందీ?

## హదీసు ఉల్లేఖకులు

అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ ఉస్మాన్. అబూబక్ర్ మారు పేరు. సిద్దీఖ్ అనేది ఆయన బిరుదు. 'తైమ్' తెగకు చెందినవారు. దైవప్రవక్త (సఅసం) పరమపదించిన పిదప తొలి ధర్మ ఖలీఫాగా ఎన్నికయ్యారు. దైవప్రవక్తల (అలైహిముస్సలాం) తరువాత మానవకోటిలో అత్యుత్తములు. మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు దైవప్రవక్త (స)కు తోడుగా ఉన్నారు. సూర్ గుహలో దైవప్రవక్త (స) వెంటవున్న ఘనత ఈయనకు దక్కింది. అందుకే ఈయన్ని 'గుహవాసి'గా కూడా వ్యవహరిస్తారు. ఎఱ్రగా, బక్కపలచగా ఉండేవారు. పొగడ్తల కతీతమైన వ్యక్తిత్వం. వజ్ర సంకల్పులు. దైవమార్గంలో ఆయన చూపిన సహనస్థయిర్యాలు అనుపమమైనవి. మిత్రుల పాలిట దయార్ద్ర హృదయులు. ధర్మ విరోధుల పాలిట కొరుకుడు పడని తత్వం. సత్యధర్మం విషయంలో ఎన్నటికీ రాజీ ధోరణి నవలంబించలేదు. హిజ్రీ 13వ సంవత్సరం జమాదివుల్ ఆఖిర్‌లో మరణించారు.

252. హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) కథనం: "నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి నమాజ్ చేశాను. ఆయన (స)కుడివైపుకు సలాం చేస్తూ అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు అన్నారు. అలాగే ఎడమ వైపునకు సలాం చేస్తూ అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు అన్నారు."

(అబూదావూద్ దీనిని ప్రామాణిక మయిన ఆధారాలతో ఉల్లేఖించారు)

(٢٥٢) وَعَنْ وَائِلِ بْنِ حُجْرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَكَانَ يُسَلِّمُ عَنْ يَمِينِهِ: اَلسَّلَامُ عَلَيْكُمْ وَرَحْمَةُ اللّٰهِ وَبَرَكَاتُهُ، وَعَنْ شِمَالِهِ: اَلسَّلَامُ عَلَيْكُمْ وَرَحْمَةُ اللّٰهِ وَبَرَكَاتُهُ. رَوَاهُ أَبُوْ دَاوُدَ بِإِسْنَادٍ صَحِيْحٍ.

## సారాంశం

నమాజ్ చివరిలో చేసే 'సలాం'లో 'వ బరకాతుహు' అనే అదనపు పదం సహీహ్ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ అంశం క్రింద వచ్చిన అనేక హదీసులలో ఈ అదనపు పదం లేకపోయినప్పటికీ దీని ప్రామాణికతపై ఎలాంటి సంశయానికి తావులేదు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) "నతాయజుల్ అఫ్కార్"లో దీనిపై వివరంగా చర్చించారు. అందుచేత 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు' అని అనటం సమంజసమే.

(٢٥٣) وَعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقُولُ فِي دُبُرِ كُلِّ صَلَاةٍ مَكْتُوبَةٍ: «لَا إِلٰهَ إِلَّا اللّٰهُ، وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيْرٌ، اَللّٰهُمَّ لَا مَانِعَ لِمَا أَعْطَيْتَ، وَلَا مُعْطِيَ لِمَا مَنَعْتَ، وَلَا يَنْفَعُ ذَا الْجَدِّ مِنْكَ الْجَدُّ». مُتَّفَقٌ عَلَيْهِ.

253. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి ఫర్జ్ నమాజు చివర్లో ఈ దుఆ చేసేవారు : "లా ఇలాహ ఇల్లల్లాహు.... (అర్థం : అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన ఏకేశ్వరుడు, సహవర్తులెవరూ లేనివాడు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే శోభాయమానం. ఆయన ప్రతిదాన్నీ చేయగల సమర్థుడు. ఓ అల్లాహ్! నీవు అనుగ్రహించిన దానిని ఎవరూ ఆపలేరు. నీవు ఆపిన దానిని ఇప్పించగలవాడెవడూ లేడు. నీకు వ్యతిరేకంగా ఏ భాగ్యవంతుడికీ అతని భాగ్యాలు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేవు)"

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఫర్జ్ నమాజ్‌ను ముగించిన వెంటనే ఈ దుఆ చేయాలి. ఈ దుఆలో ఒక వైపు దేవుని వైభవం చాటబడింది - మరోవైపు దాసుని నిస్సహాయస్థితి కూడా వ్యక్తపరచబడింది. యదార్థానికి మనిషి అక్కరలను తీర్చేవాడు, అతన్ని కటాక్షించేవాడు ఆయన మాత్రమే. భూమ్యాకాశాలలో వున్నదంతా ఆయన సొంతం. ఎవరికి ఏది ఇవ్వాలన్నా, ఏది ఇవ్వకూడదనుకున్నా - అది ఆయన ఇష్టాయిష్టాలపై ఆధారపడివుంది. సాటిలేని స్వామి ఆయన. ప్రాపంచిక పదవులు, ఆస్తీ అంతస్తులు ఆయన చలువతోనే మనిషికి ప్రాప్తమవుతాయి. ఆయన కటాక్షం లేనంతవరకూ ఎవరి ఐశ్వర్యం కూడా వారికి అచ్చిరాదు. దేవుని ఏకత్వానికి ఈ దుఆ మచ్చుతునక లాంటిది.

(٢٥٤) وَعَنْ سَعْدِ بْنِ أَبِي وَقَّاصٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ كَانَ يَتَعَوَّذُ بِهِنَّ دُبُرَ كُلِّ صَلَاةٍ: «اَللّٰهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنَ الْبُخْلِ، وَأَعُوذُ بِكَ مِنَ الْجُبْنِ، وَأَعُوذُ بِكَ مِنْ أَنْ أُرَدَّ إِلَى أَرْذَلِ الْعُمُرِ،

254. హజ్రత్ సాద్ బిన్ వఖ్ఖాస్ (రజి) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి నమాజ్ చివర్లో ఈ 'తఅవ్వుజ్'ను పఠించేవారు : అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక..... (అర్థం: దేవా! పిసినారితనం నుండి, పిరికితనం నుండి నేను నీ శరణు కోర్తున్నాను. హీనాతి హీనమైన వృద్ధాప్యం వైపునకు

وَأَعُوذُ بِكَ مِنْ فِتْنَةِ الدُّنْيَا، وَأَعُوذُ بِكَ مِنْ عَذَابِ الْقَبْرِ». رَوَاهُ الْبُخَارِيُّ.

మరలించబడటం నుండి నీ శరణు వేడుతున్నాను. ప్రాపంచిక పరీక్ష నుండి, సమాధి యాతన నుండి నీ శరణు కోరు తున్నాను." (బుఖారీ)

**సారాంశం**

హదీసు వాక్యాలను బట్టి ఈ దుఆ నమాజ్ చివరిలో 'సలాం' చేయక మునుపు, సలాం చేసిన తరువాత కూడా పఠించవచ్చని అర్థమవుతున్నది. ఎంతో అర్థవంతమైన, సమగ్రమైన దుఆ ఇది. దీన్ని సాధ్యమైనంతవరకు చేస్తూ ఉండటం మంచిది.

**హదీసు ఉల్లేఖకులు**

అసలు పేరు సాద్ బిన్ వఖ్ఖాస్. మరోపేరు అబూ ఇస్హాఖ్. తండ్రి పేరు మాలిక్. ఖురైషు వంశీయులు. ఇస్లాం స్వీకరించిన వారిలో ఐదవవారు. ప్రపంచ జీవితంలోనే స్వర్గలోక శుభవార్త పొందిన పదిమందిలో ఈయనా ఉన్నారు. దైవమార్గంలో విలువిద్యను ఆచరణలో పెట్టిన ప్రథమ వ్యక్తి ఈయన. అంటే మొట్టమొదట ఈయనే బాణం ప్రయోగించారు. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఇరాక్‌ను జయించారు. పొట్టివారు. కాని గట్టివారు. గోధుమ వర్ణం ఛాయ. మదీనాకు పదిమైళ్ళ దూరంలో ఉన్న 'అఖీఖ్'లో తనువు చాలించారు. అక్కడి నుంచి ఈయన భౌతిక కాయం మదీనా తేబడింది. హిజ్రీ 55లో జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

(٢٥٥) وَعَنْ ثَوْبَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا انْصَرَفَ مِنْ صَلَاتِهِ اسْتَغْفَرَ اللّٰهَ ثَلَاثًا، وَقَالَ: «اللّٰهُمَّ أَنْتَ السَّلَامُ، وَمِنْكَ السَّلَامُ، تَبَارَكْتَ يَا ذَا الْجَلَالِ وَالْإِكْرَامِ». رَوَاهُ مُسْلِمٌ.

255. హజ్రత్ సోబాన్ (రజి) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సలాం చేసిన మీదట మూడు సార్లు అస్తగ్‌ఫిరుల్లాహ్ అని పలికేవారు. ఆ తరువాత 'అల్లాహుమ్మ అన్తస్సలాము, వ మిన్కస్సలాము, తబారక్త యా జల్ జలాలి వల్ ఇక్రామ్" పఠించేవారు. (అర్థం : ఓ అల్లాహ్! నీవు శాంతిగల వాడవు. శాంతి నీ వైపు నుంచే ఉంది. ఓ ఘనత్వం, గౌరవోన్నతులు గలవాడా! నీవు ఎంతో శుభవంతుడవు) (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా నమాజ్ సందర్భంగా చేసే పై దుఆల ప్రాముఖ్యత ఎంతటిదో అర్థమవుతున్నది. నమాజ్ చేస్తున్నప్పుడు మానవ సహజమయిన దౌర్బల్యాల వల్ల తప్పులు జరగవచ్చు. మరుపుకు గురికావచ్చు. నమాజులో పలు ఆలోచనలు రావచ్చు. మనసు నమాజులో

లగ్నం కాలేకపోవచ్చు. వీటన్నింటికీ మందు ఒక్కటే - క్షమాభిక్ష! దాసుడు తన అశక్తతను వెలిబుచ్చి, ప్రభువును క్షమాపణ కోరుకుంటే ఆయన తన దయతో మన్నించి నమాజును స్వీకరించే అవకాశం ఉంది.

దైవప్రవక్త 'ఇస్తిగ్ఫార్' ఎలా చేసేవారు? అని ఇమామ్ ఔజాయి (రహ్మ.లై) ని ఎవరో ప్రశ్నించగా, "దైవప్రవక్త (స) అస్తగ్ఫిరుల్లాహ్ -అస్తగ్ఫిరుల్లాహ్ - అస్తగ్ఫిరుల్లాహ్" అని అనేవారని ఆయన జవాబిచ్చారు.

(٢٥٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ رَسُولِ اللهِ ﷺ قَالَ: «مَنْ سَبَّحَ اللَّهَ دُبُرَ كُلِّ صَلاَةٍ ثَلاثاً وَثَلاَثِينَ، وَحَمِدَ اللَّهَ ثَلاثاً وَثَلاَثِينَ وَكَبَّرَ اللَّهَ ثَلاثاً وَثَلاَثِينَ، فَتِلْكَ تِسْعٌ وَتِسْعُونَ، وَقَالَ تَمَامَ الْمِائَةِ «لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ لاَ شَرِيكَ لَهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ» غُفِرَتْ لَهُ خَطَايَاهُ وَلَوْ كَانَتْ مِثْلَ زَبَدِ الْبَحْرِ». رَوَاهُ مُسْلِمٌ، وَفِي رِوَايَةٍ أُخْرَى: أَنَّ التَّكْبِيرَ أَرْبَعٌ وَثَلاثُونَ.

256. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ఉపదేశించారు - "ఎవరయితే ప్రతి నమాజులో సలాం చేసిన మీదట 33 సార్లు సుబ్హానల్లాహ్, 33 సార్లు అల్ హమ్దు లిల్లాహ్, 33 సార్లు అల్లాహు అక్బర్ అని కూడా పలికాడో - ఇవి మొత్తం 99 అవుతాయి - మరియు నూరును పూర్తి చేయడానికి లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లాషరీకలహూ లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు వహువ అలాకుల్లి షైయిన్ ఖదీర్ అని పలికాడో, అతని పాపాలన్నీ-వాటి సంఖ్య సముద్రంలోని బుడగల సంఖ్యకు సమానంగా ఉన్నా సరే - క్షమించి వేయ బడతాయి. (ముస్లిం) వేరొక ఉల్లేఖనం లో 34వ సారి 'అల్లాహు అక్బర్' అని పలకాలి అని వుంది.

**సారాంశం**

ప్రతి నమాజ్ ఆఖరిలో - అది ఫర్జ్ నమాజయినా, నఫిల్ నమాజయినా - ఈ కలిమాలు (వచనాలు) పలకటం 'మస్నూన్' అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే కొంతమంది పండితులు ఈ 'తస్బీహ్' ఫర్జ్ నమాజులకే వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ తస్బీహ్ పూర్వాపరాలిలావున్నాయి - ఒకరోజు కొంతమంది ముహాజిర్ పేదలు దైవప్రవక్త (స) సన్నిధిలోకి వచ్చి 'ఓ దైవప్రవక్తా! ధనవంతులు పుణ్యకార్యాలన్నీ జుర్రుకుంటున్నారు. వాళ్లూ మాలాగే నమాజ్ చేస్తున్నారు, ఉపవాసాలు పాటిస్తున్నారు. దానధర్మాలు కూడా మాకన్నా ఎంతో ఎక్కువగా చేస్తున్నారు. మేము (దాన ధర్మాలలో) వాళ్లతో పోటీపడలేకపోతున్నాము (ఎందుకంటే

మా దగ్గర సిరి సంపదలు లేవు)' అని విన్నవించుకోగా ఆయన (స) వారికి ఈ తస్బీహ్ గురించి బోధించారు....

257. హ|జత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)నాకిలా ఉపదేశించారు - ఓ ముఆజ్! ప్రతి నమాజును ముగించిన తరువాత ఈ వచనాలను విస్మరించ రాదని నేను నీకు వసీయతు చేస్తు న్నాను- ''అల్లాహుమ్మ అఇన్నీ అలా జిక్రిక వ షుక్రిక వ హుస్ని ఇబాదతిక''. (అర్థం : ఓ అల్లాహ్! నాకు నీ ధ్యానం చేసే, నీకు కృతజ్ఞతలు తెలిపే, అత్యు త్తమ రీతిలో నిన్ను ఆరాధించే సద్బుద్ధి నొసగు) (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి దృఢమయిన ఆధారాలతో ఉల్లేఖించారు).

(٢٥٧) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ لَهُ: «أُوصِيكَ يَا مُعَاذُ: لاَ تَدَعَنَّ دُبُرَ كُلِّ صَلاَةٍ أَنْ تَقُولَ: اللّٰهُمَّ أَعِنِّي عَلَى ذِكْرِكَ، وَشُكْرِكَ، وَحُسْنِ عِبَادَتِكَ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ بِسَنَدٍ قَوِيٍّ.

**సారాంశం**

'విస్మరించరాదు' అని తాకీదు చేయడాన్నిబట్టి దీనికెంత ప్రాముఖ్యం ఉందో అర్థం చేసుకో వచ్చు. ప్రతి నమాజు తర్వాత - ముఖ్యంగా ఫర్జ్ నమాజు ముగించిన తరువాత ఈ దుఆను తప్పక పఠించాలి. దీన్ని విడనాడటం మంచిది కాదు. ఈ దుఆయేగాక హదీసు గ్రంథాలైన ముస్లిం, అబూదావూద్, నసాయి, అహ్మద్, తిర్మిజీలలోని మరెన్నో దుఆలను ఆయన (స) చేసినట్లు ఆధారా లున్నాయి. సాధ్యమయినంతవరకు వాటిని కంఠస్థం చేసుకుని పఠిస్తే మన స్వయానికి ప్రయోజనం చేకూరటమేగాక, ప్రవక్త (స) గారి సున్నత్కు ప్రాచుర్యం ఇచ్చినట్లవుతుంది.

258. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హ|జత్ అబూ ఉమామ (రజి) ఉల్లేఖించారు - ఏ వ్యక్తయితే ప్రతి ఫర్జ్ నమాజ్ తరువాత 'ఆయతుల్ కుర్సీ' పఠించాడో అతన్ని స్వర్గంలో ప్రవేశించకుండా మృత్యువు

(٢٥٨) وَعَنْ أَبِي أُمَامَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنْ قَرَأَ آيَةَ الْكُرْسِيِّ دُبُرَ كُلِّ صَلاَةٍ مَكْتُوبَةٍ، لَمْ يَمْنَعْهُ مِنْ دُخُولِ الْجَنَّةِ إِلاَّ الْمَوْتُ». رَوَاهُ

النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَزَادَ فِيهِ الطَّبَرَانِيُّ: «وَقُلْ هُوَ اللَّهُ أَحَدٌ».

తప్ప మరేదీ అడ్డుకోజాలదు (అంటే మరణించగానే అతనికై స్వర్గం సిద్ధంగా ఉంటుంది. అయితే అతని విశ్వాసంలో 'తౌహీద్' ఉండాలి) (దీనిని నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికంగా ఖరారు చేశారు - తబ్రానీ ఇందులో 'ఖుల్‌హు వల్లాహు అహద్'ను కూడా చేర్చారు.)

## సారాంశం

'ఆయతుల్ కుర్సీ' మహత్యం గురించి ఆయన (స) ప్రవచనాలనేకం ఇతర హదీసు గ్రంథాలలో కూడా ఉన్నాయి. దీని మహత్మ్యానికి గల అనేక కారణాలలో ఒకటి: దేవుని ఏకత్వానికి సంబంధించి ఇందులో స్పష్టంగా చెప్పబడటమే అయివుండవచ్చు. ఇందులో దేవుని ఏకత్వంతోపాటు, ఆయన గుణవిశేషాలు, అపారమయిన అధికారాలు, ఆధిపత్యాల ప్రస్తావన ఉంది. అందుకే ఇది అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరమయినది.

సూరయే ఇఖ్లాస్ కూడా అటువంటిదే. అది మూడవ వంతు ఖుర్‌ఆన్‌కు సమానంగా పుణ్యం కలిగినది. ఇస్లాం విశ్వాసాలు మౌలికంగా మూడు - (1) తౌహీద్ (2) రిసాలత్ (3) ఆఖిరత్. కాగా; ఈ సూరా (ఖుల్‌హు వల్లాహు అహద్) తౌహీద్ (దేవుని ఏకత్వం) తో నిండి వుంది. అందుచేత ఈ సూరా కూడా అల్లాహ్‌కు ఎంతో ఇష్టకరమయినది. అందువల్ల ఏ మనిషి ఫర్జ్ నమాజ్ తరువాత వీటిని మనస్ఫూర్తిగా పారాయణం చేస్తాడో అతడు మరణించిన వెంటనే స్వర్గంలో పంపబడతాడు - ఇన్‌షా అల్లాహ్!

## హదీసు ఉల్లేఖకులు

అబూ ఉమామ (రజి) మారుపేరు. అసలు పేరు ఇయాస్ బిన్ సాలబ బలవీ. అన్సార్‌కు చెందిన బనూ హారిసా తెగకు మద్దతుదారులు. సహాబీగా గుర్తించబడే భాగ్యం పొందారు. ఈయన చేత అనేక హదీసులు ఉల్లేఖించబడ్డాయి. తల్లి సేవలో ఉండటం వల్ల బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు.

(٢٥٩) وَعَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «صَلُّوا كَمَا رَأَيْتُمُونِي أُصَلِّي». رَوَاهُ الْبُخَارِيُّ.

259. హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్(రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రభోధించారు : "ఏ విధంగా నన్ను నమాజ్ చేస్తుండగా మీరు చూశారో ఆ విధంగానే నమాజ్ చేయండి." (బుఖారీ)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ఆనాడు ప్రత్యక్షంగా తన సహచరులనుద్దేశ్యించి ఈ మాటలన్నప్పటికీ ముస్లిం సమాజ సభ్యుడైన ప్రతి వ్యక్తికీ ఇది వర్తిస్తుంది. నమాజ్‌లో ఆయన (స) ఏ ఏ క్రియను ఏ విధంగా ఆచరించారో సరిగ్గా అదేవిధంగా ఆచరించటం వాజిబ్ అని ఈ హదీసు ద్వారా అవగత మవుతున్నదని అమీర్ యమానీ వ్యాఖ్యానించారు.

(٢٦٠) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ لِي رَسُولُ اللّٰهِ ﷺ: «صَلِّ قَائِماً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَقَاعِداً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَعَلَى جَنْبٍ، وَإِلاَّ فَأَوْمِ». رَوَاهُ الْبُخَارِيُّ.

260. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఉపదేశించారని హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) తెలిపారు: "నమాజ్‌ను నిలబడి చేయండి. ఒకవేళ నిలబడి చేయలేకపోతే కూర్చుని చేయండి. ఒకవేళ కూర్చుని చేసే శక్తి కూడా లేకపోతే ప్రక్క ఆధారంగా పరుండి చేయండి. వీటిలో ఏ ఒక్కటీ చేయలేకపోతే సైగ ద్వారా (నమాజ్) చేయండి." (బుఖారీ)

**సారాంశం**

ఎట్టి పరిస్థితిలో కూడా నమాజ్ క్షమార్హం కాదనీ, ఒక్క స్పృహ కోల్పోయిన స్థితిలో మాత్రమే దీనినుండి మినహాయింపు లభిస్తుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. సాధారణంగా నమాజ్‌ను నిలబడి నెరవేర్చటం మంచిది. అస్వస్థత కారణంగా నిలబడలేకపోతే కూర్చుని చేయవచ్చు. అదీ సాధ్యం కాకపోతే పండుకుని చేయవచ్చు. అత్యంత హీన దశలో సైగ ద్వారా కూడా నమాజ్ చేయవచ్చు. అంటే ఏ పరిస్థితిలో కూడా మనిషి నమాజ్‌ను త్యజించరాదు.

(٢٦١) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لِمَرِيضٍ - صَلَّى عَلَى وِسَادَةٍ، فَرَمَى بِهَا، - وَقَالَ: «صَلِّ عَلَى الْأَرْضِ إِنِ اسْتَطَعْتَ، وَإِلاَّ فَأَوْمِ إِيْمَاءً، وَاجْعَلْ سُجُودَكَ أَخْفَضَ مِنْ رُكُوعِكَ». رَوَاهُ الْبَيْهَقِيُّ بِسَنَدٍ قَوِيٍّ، وَلٰكِنْ صَحَّحَ أَبُو حَاتِمٍ وَقْفَهُ.

261. హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), ఒక వ్యాధిగ్రస్తుడు దిండుపై నమాజ్ చేస్తుండగా గమనించి ఆ దిండును పారవేశారు. "చేయగలిగితే నేలపై నమాజ్ చెయ్యి. లేకుంటే సైగతో (నమాజ్) చెయ్యి. అయితే సజ్దాను రుకూ కన్నా కాస్త దిగువ ఉండేలా చూసుకో" అని అతనికి ఉపదేశించారు. (దీనిని బైహఖీ దృఢమయిన ఆధారంతో ఉల్లేఖించారు. అయితే అబూ హాతిమ్ దీనిని 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు).

**సారాంశం**

నమాజీ ఎత్తయిన వస్తువుపై సజ్దా చేయటం సమంజసం కాదన్న దానికి ఈ హదీసు ఒక నిదర్శనం. అతడు సజ్దా చేయదలచుకుంటే నేలపైనే చేయాలి. అలా చేయలేకపోవటానికి ఏదయినా బలమైన కారణముంటే,సైగతోనే అతడు నమాజ్ చేయాలి. అయితే సజ్దా చేయవలసి వచ్చినపుడు రుకూ కన్నా కాస్త ఎక్కువగా వంగాలి. ఎట్టి పరిస్థితిలోనూ మనిషి తన సృష్టికర్తతో సంబంధం త్రెంచుకోజాలడనీ, అనుదినం, అనుక్షణం అతని మనో మస్తిష్కాలలో దేవుడు మెదలుతూ ఉండాలనీ ఈ హదీసు ద్వారా సూచన లభిస్తోంది. ఇదే అసలు దైవదాస్యానికి ప్రతీక.

**8వ అధ్యాయం**

## సహూ సజ్దాలు

## ٨ - بَابُ سُجُودِ السَّهْوِ وَغَيْرِهِ

262. హజ్రత్ అబ్దుల్లా బిన్ బుహైన (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు జుహ్ర్ నమాజ్ చేయించారు. కాని రెండు రకతులు పూర్తయిన తరువాత తషహ్హుద్‌లో కూర్చోకుండానే లేచి నిలబడ్డారు. ముఖ్తదీలు కూడా ఆయన (స) నే అనుసరించారు. ఆ విధంగా ఆయన (స) నమాజ్ అంతటినీ పూర్తి చేశారు. ఆయన (స) ఇక సలాం చేయబోతున్నారని ప్రజలు ఎదురు చూస్తుండగానే - ఆయన (స) కూర్చునే - 'అల్లాహు అక్బర్' అంటూ సలాంకు ముందు రెండు సజ్దాలు చేశారు. అనంతరం సలాం చేశారు. (దీనిని అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి) ముస్లిం ఉల్లేఖనంలో ఇలా వుంది: "ప్రతి సజ్దాకోసం

(٢٦٢) عَنْ عَبْدِاللهِ بْنِ بُحَيْنَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّ النَّبِيَّ ﷺ صَلَّى بِهِمُ الظُّهْرَ فَقَامَ فِي الرَّكْعَتَيْنِ الْأُوْلَيَيْنِ، وَلَمْ يَجْلِسْ، فَقَامَ النَّاسُ مَعَهُ، حَتَّى إِذَا قَضَى الصَّلَاةَ، وَانْتَظَرَ النَّاسُ تَسْلِيْمَهُ كَبَّرَ وَهُوَ جَالِسٌ، وَسَجَدَ سَجْدَتَيْنِ قَبْلَ أَنْ يُسَلِّمَ، ثُمَّ

سَلَّمَ. أَخْرَجَهُ السَّبْعَةُ، وَهَذَا لَفْظُ الْبُخَارِيِّ. وَفِيْ رِوَايَةٍ لِمُسْلِمٍ: يُكَبِّرُ فِي كُلِّ سَجْدَةٍ وَهُوَ جَالِسٌ، وَسَجَدَ النَّاسُ مَعَهُ، مَكَانَ مَا نَسِيَ مِنَ الْجُلُوسِ.

'అల్లాహు అక్బర్' అనే వారు. కూర్చునే సజ్దా చేశారు. వెనుకనున్న వారు కూడా ఆయన్ని అనుసరించారు. ఇది మరచి పోయిన దానికి ప్రత్యామ్నాయం'' - అంటే రెండు రకతుల తరువాత తషహ్హుద్‌లో కూర్చోవటం మరచిపోయినందుకు పరిహారంగా ఈ రెండు సజ్దాలు చేశారన్న మాట!

**సారాంశం**

అరబీలో మరుపుకై రెండు పదాలు ఉపయోగించబడతాయి. ఒకటి: సహూ. రెండు: నిస్‌యాన్. మొదటి పదం సాధారణంగా ఏదైనా క్రియను మరచిపోవటానికి సంబంధించి ఉపయోగిస్తారు. రెండవది: విషయ పరిజ్ఞానం గురించి వాడతారు. పండిత వర్గంలో ఏ ఒక్కరు కూడా దైవప్రవక్త (స) రెండవ రకపు మరపుకు (నిస్‌యాన్‌కు) గురయ్యారని భావించరు. ఎందుకంటే దైవప్రవక్త (స) తనకు 'వహీ' ద్వారా అందజేయబడిన దైవాదేశాలను మానవాళికి అందజేయటంలో ఎన్నడూ మరుపుకు లోనుకాలేదు. అలాంటి అవకాశానికి తావు కూడా లేదు. ఎందుకంటే 'సనుఖ్రివుక ఫలా తన్సా' అని అల్లాహ్ స్వయంగా హామీ ఇచ్చాడు.

ఇక నమాజ్‌లో జరిగిన 'సహూ' అంటారా! అది ఆచరణకు సంబంధించినది. పైగా ఇలా జరగవలసిన అవసరం కూడా ఉందని కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు. దైవప్రవక్త (స) అందరికీ ఆదర్శప్రాయులు. ఆయన నమాజులో ఈ మరుపుకు లోనై ఉండకపోతే 'సహూ' గురించి ఉమ్మత్‌కు తెలిసేదికాదు. ఇది కూడా దైవ ప్రణాళికలోని ఒక అంశమే మరి!

నలుగురు ఇమాములు కూడా దైవప్రవక్త (స) ద్వారా 'సహూ' జరిగిన విషయంపై ఏకీభవించారు. బహుశా ఈనాటి వరకూ ఎవరూ దీనిపై ఆక్షేపణ తెలుపలేదు. పైగా ఇందులో ఎన్నో పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. జ్ఞానసంపన్నులైనవారికి ఇందలి మర్మాలను గురించి బాగా తెలుసు!

(٢٦٣) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى النَّبِيُّ ﷺ إِحْدَى صَلَاتَيِ الْعَشِيِّ رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ قَامَ إِلَى خَشَبَةٍ فِي مُقَدَّمِ الْمَسْجِدِ، فَوَضَعَ يَدَهُ عَلَيْهَا وَفِي الْقَوْمِ أَبُو بَكْرٍ وَعُمَرَ، فَهَابَا، أَنْ يُكَلِّمَاهُ، وَخَرَجَ سَرَعَانُ النَّاسِ فَقَالُوا: أَقُصِرَتِ

263. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మధ్యాహ్నం తరువాత రెండు నమాజులలో (జుహ్ర్, అస్ర్) ఏదో ఒక దానిలో రెండు రకతులు చేసి సలాం చేశారు. ఆ తరువాత మస్జిద్‌కు ముందున్న ఒక కొయ్య వద్దకు వెళ్ళి దానిపై చేయిపెట్టి అక్కడే నిలబడ్డారు.

الصَّلَاةُ، وَرَجُلٌ يَدْعُوهُ النَّبِيُّ ﷺ ذَا الْيَدَيْنِ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! أَنَسِيتَ أَمْ قَصُرَتِ الصَّلَاةُ؟ فَقَالَ: **لَمْ أَنْسَ وَلَمْ تُقْصَرْ، قَالَ: بَلَى قَدْ نَسِيتَ، فَصَلَّى رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ كَبَّرَ، فَسَجَدَ مِثْلَ سُجُودِهِ أَوْ أَطْوَلَ، ثُمَّ رَفَعَ رَأْسَهُ فَكَبَّرَ، ثُمَّ وَضَعَ رَأْسَهُ فَكَبَّرَ، فَسَجَدَ مِثْلَ سُجُودِهِ أَوْ أَطْوَلَ، ثُمَّ رَفَعَ رَأْسَهُ وَكَبَّرَ.** مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

నమాజీలలో హజ్రత్ అబూబక్ర్, ఉమర్ కూడా ఉన్నారు. వారిద్దరికీ ఈ విషయమై ఆయన (స)తో మాట్లాడే ధైర్యం లేకపోయింది. తొందరపాటుతో మస్జిద్ నుంచి బయటకు వెళ్ళిపోయిన వారు- ఏమిటీ? నమాజులో రకతుల కోత విధించబడిందా? అంటూ పరస్పరం గుసగుసలాడుకోసాగారు. నమాజీలలో ఒక వ్యక్తి ఉండేవాడు (అతని చేతులు పొడవుగా ఉండటం వల్ల) దైవప్రవక్త (స) అతన్ని 'ఆజానుబాహుడా!' అని సంబోధించే వారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (స) నుద్దేశ్యించి, 'ఓ దైవప్రవక్తా! (ఈ రోజు) మీరు మరచిపోయారా? లేక నమాజ్ కుదించబడిందా?' అని అడిగాడు. "నేను మరచిపోనూలేదు, నమాజ్ కుదించబడనూలేదు'' అని ఆయన(స) సమాధానమిచ్చారు. 'మరైతే మీరు తప్పకుండా మరచిపోయారు' అని ఆ వ్యక్తి అన్నాడు. అప్పుడాయన (స) వదలివేయబడిన రెండు రకతులను పూర్తి చేశారు. ఆ తరువాత సలాం చేశారు. మరి 'అల్లాహు అక్బర్' అంటూ మామూలు సజ్దాల వలెనే సజ్దా చేశారు. లేదా మరి కాస్త సుదీర్ఘమయిన సజ్దా చేసి అల్లాహు అక్బర్ అంటూ తల పైకెత్తారు. మళ్లీ అల్లాహు అక్బర్ అంటూ తలను నేలకాన్చారు. సాధారణ సజ్దా

లాగే చేశారు. లేదా మరి కాస్త సుదీర్ఘ మయిన సజ్దా చేసి అల్లాహు అక్బర్ అంటూ తలపైకెత్తారు. (బుఖారీ, ముస్లిం) (ఈ పదాలు బుఖారీలోనివి)

وَفِيْ رِوَايَةٍ لِّمُسْلِمٍ: «صَلاَةَ الْعَصْرِ». وِلأَبِيْ دَاوُدَ: فَقَالَ: أَصَدَقَ ذُو الْيَدَيْنِ؟ فَأَوْمَئُوا أَيْ نَعَمْ. وَهِيَ فِي الصَّحِيْحَيْنِ، لٰكِنْ بِلَفْظِ: «فَقَالُوا». وَفِيْ رِوَايَةٍ لَّهُ: «وَلَمْ يَسْجُدْ حَتَّى يَقَّنَهُ اللّٰهُ تَعَالَى ذٰلِكَ».

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో వుంది : "ఇది అస్ర్ నమాజ్‌కు సంబంధించినది". అబూదావూద్ ఉల్లేఖనం ప్రకారం, "ఆజానుబాహుడు చెప్పింది నిజ మేనా?" అని దైవప్రవక్త (స) దర్యాప్తు చేయగా 'అవును' అన్నట్టు జనులు తలూపారు. ఈ అదనపు వాక్యాలు 'సహీహైన్'లో కూడా ఉన్నాయి - అయితే 'అవును' అని నోటితో జవాబిచ్చి నట్లు అందులో వుంది. ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది - "దేవుని తరపున ఈ మేరకు సంకేతం లభించే వరకూ ఆయన (స) 'సజ్దా సహూ' చేయలేదు."

## సారాంశం

దైవప్రవక్త (స) 'మరుపు'కు లోనయ్యారన్న దానికి ఈ హదీసు తార్కాణం. అయితే ఇది ప్రవక్త స్థాయికి విరుద్ధమయిన విషయం ఏమీ కాదు. దైవప్రవక్త (స) కూడా మానవమాత్రులే. మనిషి అనేవాడు మరచిపోవటం సహజం. ఆయనకు అగోచర జ్ఞానం లేదన్న దానికి కూడా ఈ సంఘటన ఒక నిదర్శనం. ఆయనకే గనక అగోచర జ్ఞానం ఉండివుంటే తన వల్ల జరిగిన 'సహూ' గురించి ప్రజలను అడిగి తెలుసుకోవలసిన అవసరం ఉండేది కాదు. తనవల్ల పొరబాటు జరిగిందని తెలుసుకున్నప్పుడు దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయటం గొప్పవారి లక్షణం.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో దైవప్రవక్త (స) 'ఆజానుబాహుడా!' అని సంబోధించిన వ్యక్తి పేరు 'ఖిర్‌బాఖ్ బిన్ అమ్ర్ సులమీ (రజి). బనూ సులైమ్ తెగకు చెందిన వారవటంచేత సులమీగా పిలువబడ్డారు. ఈయన అమీర్ ముఆవియ (రజి) పరిపాలనా కాలంలో మరణించారు. హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలంలో 'జీ ఖషబ్' అనే ప్రాంతంలో మరణించారని వేరొక ఆధారం ద్వారా తెలుస్తోంది. ఈయన చేతులు మరీ పొడవుగా ఉండటంవల్ల 'జుల్ యదైన్'గా పేరుమోశారు.

264. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు నమాజ్ చేయించగా ఆయన (స) వల్ల 'సహూ' అయింది (అంటే మరచిపోయారు). అందుచేత ఆయన (స) రెండు సజ్దాలు చేశారు, తరువాత తషహ్హుద్ చదివారు. ఆ తర్వాత సలాం చేశారు. (దీనిని అబూ దావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేయగా, హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా నిర్ధారించారు).

(٢٦٤) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى بِهِمْ فَسَهَا، فَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ تَشَهَّدَ، ثُمَّ سَلَّمَ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَالْحَاكِمُ، وَصَحَّحَهُ.

**సారాంశం**

నమాజ్‌లో దైవప్రవక్త (స) వల్ల 'మరుపు' జరిగిందన్న సుప్రసిద్ధ సంఘటన పొడవుచేతుల వ్యక్తి ప్రశ్నించినదే. నమాజ్ కుదించబడిందా? లేక మీరు మరచిపోయారా? అని ఆయన నేరుగా దైవప్రవక్త (స)ను ప్రశ్నించి అసలు విషయాన్ని వెలికి తీశారు. ఈ సంఘటన సహీహైన్ మరియు సునన్ గ్రంథాలలో వివరంగా వచ్చింది. అయితే ఈ గ్రంథాలన్నింటిలో ఎక్కడా 'సజ్దాసహూ' తరువాత తషహ్హుద్ ప్రస్తావన రాలేదు. సహీహ్ ముస్లింలో స్వయంగా హజ్రత్ ఇమ్రాన్ గారి ఈ ఉల్లేఖనంలోనూ తషహ్హుద్ ప్రస్తావన రాలేదు. అందువల్ల తిర్మిజీలోని ఉల్లేఖనంలో ప్రస్తావనకు వచ్చిన ఈ తషహ్హుద్ పదం 'అరుదైనది.' బైహఖీ కూడా అదే అంటారు. కాని హాఫిజ్ ఇబ్నె హజర్ మాత్రం మొత్తానికి తషహ్హుద్ ఉంది అని అభిప్రాయపడ్డారు. అత్యధిక ధర్మవేత్తల దృష్టిలో సలాంకు ముందు సజ్దాసహూ చేయవలసివుంటే తషహ్హుద్ చదువవలసిన అవసరం లేదు. ఒకవేళ సలాం తరువాత సజ్దాసహూ చేసినట్లయితే అప్పుడు తషహ్హుద్ తలచుకుంటే చేయవచ్చు, చేయకపోవచ్చు.

265. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "మీలో ఎవరికయినా నమాజ్‌లో చదివిన రకతులు ఎన్ని? మూడా? నాలుగా? అన్న సంశయం కలిగితే అట్టి పరిస్థితిలో సంశయాన్ని ఉపేక్షించి, నిశ్చితంగా మీకు కలిగిన దృఢ అభిప్రాయాన్నే

(٢٦٥) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «إِذَا شَكَّ أَحَدُكُمْ فِي صَلَاتِهِ فَلَمْ يَدْرِ كَمْ صَلَّى أَثَلَاثًا أَمْ أَرْبَعًا؟ فَلْيَطْرَحِ الشَّكَّ، وَلْيَبْنِ عَلَى مَا اسْتَيْقَنَ، ثُمَّ يَسْجُدْ سَجْدَتَيْنِ قَبْلَ أَنْ

يُسَلِّمَ، فَإِنْ كَانَ صَلَّى خَمْساً شَفَعْنَ لَهُ صَلاَتَهُ، وَإِنْ كَانَ صَلَّى تَمَاماً كَانَتَا تَرْغِيماً لِلشَّيْطَانِ». رَوَاهُ مُسْلِمٌ.

ప్రాతిపదికగా తీసుకుని నమాజ్‌ను కొనసాగించండి. 'సలాం' చేయకముందు 'సహూ'కి సంబంధించిన రెండు సజ్దాలు చేయండి. ఒకవేళ మీరు ఐదు రకతులు చదివి ఉంటే, ఈ రెండు (సహూ) సజ్దాలు ఆరవ రకతుకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. (అంటే బేసి సంఖ్యను సరి సంఖ్యగా మారుస్తాయి). ఒకవేళ అతడు ముందే పూర్తి నమాజు (సరిగ్గా) చేసి వుంటే ఈ రెండు సజ్దాలు షైతాన్ పాలిట పరాభవంగా పరిణమిస్తాయి.'' (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ద్వారా బోధపడిందేమిటంటే నమాజ్ మధ్యలో మనిషికి తాను పూర్తి చేసిన రకతుల గురించి అనుమానం రేకెత్తితే, అప్పుడతను తక్కువ చేసినట్లుగా పరిగణించాలి. ఇటువంటి పరిస్థితిలో అతనికి దృఢనమ్మకం కుదురుతుంది. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ మరియు అధిక సంఖ్యాక పండితుల అభిమతం ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరోవిధంగా ప్రతిపాదించారు: అలాంటి పరిస్థితిలో మనిషి జ్ఞాపకం తెచ్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాలి. అప్పటికీ అనుమానం తీరకపోతే మనసు ఎటువైపు మొగ్గితే అటువైపు సంఖ్యనే లెక్కలోకి తీసుకోవాలి. అంతచేసినప్పటికీ రకతులు సరిసమానంగా లెక్కలోకి వస్తే అప్పుడు తక్కువ సంఖ్యను అనుసరించాలి.

(٢٦٦) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى رَسُولُ اللهِ ﷺ، فَلَمَّا سَلَّمَ قِيلَ لَهُ: يَا رَسُولَ اللهِ أَحَدَثَ فِي الصَّلاَةِ شَيْءٌ؟ قَالَ: «وَمَا ذَاكَ؟» قَالُوا: صَلَّيْتَ كَذَا وَكَذَا، قَالَ: فَثَنَى رِجْلَيْهِ، وَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ أَقْبَلَ عَلَيْنَا بِوَجْهِهِ فَقَالَ: «إِنَّهُ لَوْ حَدَثَ فِي الصَّلاَةِ شَيْءٌ أَنْبَأْتُكُمْ بِهِ، وَلَكِنْ إِنَّمَا أَنَا بَشَرٌ مِثْلُكُمْ،

266. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేయించారు. సలాం చేసిన తరువాత ఆయన (సఅసం) సమక్షంలో ఇలా విన్నవించుకోవటం జరిగింది-'దైవప్రవక్తా (సఅసం)! నమాజ్‌లో ఏదన్నా మార్పు చేయబడిందా?' ''ఏమిటది?'' అని ఆయన (స) అన్నారు. 'ప్రస్తుతం తమరు ఇన్ని రకాతులు చేశారు' అని సహచరులు

أَنْسَى كَمَا تَنْسَوْنَ، فَإِذَا نَسِيتُ فَذَكِّرُونِي، وَإِذَا شَكَّ أَحَدُكُمْ فِي صَلَاتِهِ فَلْيَتَحَرَّ الصَّوَابَ، فَلْيُتِمَّ عَلَيْهِ، ثُمَّ لْيَسْجُدْ سَجْدَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

విన్నవించుకున్నారు. ఇబ్నె మస్ఊద్ ఇలా అంటున్నారు - మహాప్రవక్త తన రెండు కాళ్ళను మడుచుకున్నారు (కూర్చున్నారు). ఖిబ్లావైపుకు తిరిగి రెండు సజ్దాలు చేశారు. తరువాత సలాం చేశారు. ఆ తరువాత మమ్మల నుద్దేశించి ఇలా ఉపదేశించారు: "ఒకవేళ నమాజ్‌లో ఏదయినా కొత్తదనం వచ్చివుంటే నేను స్వయంగా దీనిగురించి మీకు తెలిపి ఉండేవాణ్ణి. కాని నేను కూడా మానవ మాత్రుణ్ణేనన్న సంగతిని గుర్తుంచుకోండి. మీరు మరచిపోయి నట్లే నేను కూడా మరచిపోతుంటాను. కనుక నేను మరచిపోయినప్పుడల్లా నన్ను జ్ఞాపకం చేస్తుండండి. మీలో ఎవరికయినా - ఏ నమాజ్‌లోనయినా - సందిగ్ధ స్థితి ఏర్పడితే నిజనిర్ధారణ కొరకు ప్రయత్నించండి (ఆలోచించండి). దాని ఆధారంగానే నమాజ్‌ను పూర్తిచేసి తరువాత రెండు సజ్దాలు చేయండి". (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لِّلْبُخَارِيِّ: «فَلْيُتِمَّ، ثُمَّ يُسَلِّمْ، ثُمَّ يَسْجُدْ». وَلِمُسْلِمٍ: أَنَّ النَّبِيَّ ﷺ سَجَدَ سَجْدَتَيِ السَّهْوِ بَعْدَ السَّلَامِ وَالْكَلَامِ.

బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది: "(తొలుత) నమాజ్ పూర్తి చేసుకోవాలి. తదుపరి సలాం చేయాలి. ఆపైన సజ్దా చేయాలి." దైవప్రవక్త (సఅసం) సజ్దా సహూను సలాం మరియు కలాం తరువాత చేశారని ముస్లింలో వుంది.

وَلِأَحْمَدَ وَأَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ مِنْ

ముస్నద్ అహ్మద్, అబూదావూద్, నసాయిలో ఉల్లేఖించబడిన అబ్దుల్లా

حَدِيْثِ عَبْدِاللهِ بْنِ جَعْفَرٍ مَرْفُوعاً: مَنْ شَكَّ فِيْ صَلاَتِهِ فَلْيَسْجُدْ سَجْدَتَيْنِ بَعْدَ مَا يُسَلِّمُ. وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

బిన్ జాఫర్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది: "ఏ వ్యక్తికయితే నమాజ్‌లో సందేహం కలిగిందో అతడు సలాం చేసిన మీదట రెండు సజ్దాలు చేయాలి." (ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికంగా ఖరారుచేశారు)

**సారాంశం**

ఈ హదీసులో దైవప్రవక్త (స) 'నేను కూడా మానవమాత్రుణ్ణే' అని చెప్పారు. కనీసం ఈ వాక్కు ఆధారంగానయినా ప్రజలు తమ మూఢ విశ్వాసాలను, మిథ్యా ఆలోచనలను సంస్కరించుకోవాలి. దైవప్రవక్త (స) 'మానవమాత్రులు కారు' అని బొంకేవారికి ఇది చెంపపెట్టువంటిది.

సామూహిక నమాజులో ముఖ్తదీలు (వెనుకనున్నవారు) ఇమామ్ ఒకవేళ మరచిపోయినప్పటికీ ఇమామ్‌ను మాత్రమే అనుసరించాలి. కాకపోతే ఇమామ్ వల్ల పొరబాటు జరిగినప్పుడు "సుబ్‌హానల్లాహ్" అంటూ వెనుకనుండి సావధానపరచవచ్చు. దీనికి సంబంధించిన వివరాలు ఇతర హదీసులలో కూడా ఉన్నాయి.

**హదీసు ఉల్లేఖకులు (అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ - రజి)**

పూర్తిపేరు అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ బిన్ అబూతాలిబ్. మారుపేరు అబూ జాఫర్. తల్లి పేరు అస్మా బిన్తె ఉమైస్. అబిసీనియా (నేటి ఇథియోపియా) వైపునకు వలసపోతున్న సందర్భంగా ఇస్లాంలో జన్మించిన తొలి శిశువు ఈయన. హిజ్రీ 7వ యేట తండ్రితో కలసి మదీనా వచ్చారు. గొప్ప ధర్మదాత. ధీశాలి. సచ్ఛీలి. మర్యాదస్తులు. విస్తృతంగా దానధర్మాలు చేసిన కారణంగా 'దాతృసాగరం'గా పేరుగాంచారు. మదీనా మునవ్వరాలో హిజ్రీ 80లో 80 సంవత్సరాల వయస్సులో తనువు చాలించారు.

(٢٦٧) وَعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ، قَالَ: «إِذَا شَكَّ أَحَدُكُمْ، فَقَامَ فِي الرَّكْعَتَيْنِ، فَاسْتَتَمَّ قَائِماً، فَلْيَمْضِ، وَلاَ يَعُودُ، وَلْيَسْجُدْ سَجْدَتَيْنِ، فَإِنْ لَمْ يَسْتَتِمَّ قَائِماً فَلْيَجْلِسْ،

267. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరికయినా రెండు రకతుల తర్వాత సందేహం రేకెత్తితే -అట్టి స్థితిలో లేచి నిలబడితే - పూర్తిగా నిలబడితే - అతను నమాజ్‌ను కొనసాగించాలి - వెనుకంజ వేయనవసరం లేదు. తరువాత రెండు సహూ సజ్దాలు చేసుకోవాలి.

وَلاَ سَهْوَ عَلَيْهِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ، وَاللَّفْظُ لَهُ، بِسَنَدٍ ضَعِيفٍ.

ఒకవేళ నిటారుగా నిలబడకముందే సందేహం వస్తే వెంటనే కూర్చోవాలి. అట్టి పరిస్థితిలో అతడు సజ్దా సహూ చేయవలసిన అవసరం లేదు." (అబూ దావూద్, ఇబ్నె మాజ, దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు కూడా దారె ఖుత్నీలోనివే. దీని ఆధారం బలహీనమైనది (జయీఫ్).

(٢٦٨) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَيْسَ عَلَى مَنْ خَلْفَ الْإِمَامِ سَهْوٌ، فَإِنْ سَهَا الْإِمَامُ فَعَلَيْهِ وَعَلَى مَنْ خَلْفَهُ». رَوَاهُ الْبَزَّارُ وَالْبَيْهَقِيُّ بِسَنَدٍ ضَعِيفٍ.

268. హజ్రత్ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : - "ఏ ముఖ్తదీ (ఇమామ్ వెనుకనున్నవాని) పైనా సజ్దా సహూ బాధ్యతలేదు. ఒకవేళ ఇమామ్ మరిచి పోతే అప్పుడు ఇమామ్ మరియు ముఖ్తదీ - ఇద్దరిపై సజ్దా సహూ బాధ్యత ఉంటుంది." (దీనిని బజ్జార్, బైహఖీ లిరువురూ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు.)

(٢٦٩) وَعَنْ ثَوْبَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لِكُلِّ سَهْوٍ سَجْدَتَانِ بَعْدَ مَا يُسَلِّمُ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ بِسَنَدٍ ضَعِيفٍ.

269. హజ్రత్ సౌబాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రతి సహూ (మరుపు)కై రెండు సజ్దాలున్నాయి. అవి సలాం చేసిన తరువాత చేయాలి." (అబూదావూద్, ఇబ్నె మాజా లిరువురూ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు).

(٢٧٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَجَدْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ فِي «إِذَا السَّمَاءُ انْشَقَّتْ» وَ«اقْرَأْ بِاسْمِ رَبِّكَ». رَوَاهُ مُسْلِمٌ.

270. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : మేము సూరయె ఇజస్సమావున్ షఖ్ఖత్, ఇఖ్ర బిస్మిరబ్బికల్లజీ....(సూరయె అలఖ్)లలో దైవప్రవక్త (సఅసం)తో కలిసి "సజ్దా తిలావత్" చేశాము.

(ముస్లిమ్)

**సారాంశం**

"సజ్దా తిలావత్" (దివ్య గ్రంథ పారాయణపు సజ్దా) చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. దీనిపై ఉలమా అందరిమధ్య ఏకాభిప్రాయం ఉంది. అయితే ఇది తప్పనిసరా? లేక సంప్రదాయమా? అన్న విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలున్నాయి. అధిక సంఖ్యాక పండితులు సజ్దా తిలావత్‌ను మస్నూన్ (సంప్రదాయం) గా భావించగా, ఇమామ్ అబూ హనీఫా మాత్రం దీనిని వాజిబ్ (తప్పనిసరి)గా ఖరారు చేశారు.

ఖుర్ఆన్‌లోని సజ్దాల సంఖ్యపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయినాయి. సూరయె 'సాద్' మరియు ముఫస్సల్ సూరాలలో సజ్దా తిలావత్ అక్కరలేదంటారు ఇమామ్ షాఫయి. ఈ విధంగా ఆయన దృష్టిలో ఖుర్ఆన్‌లోని సజ్దాలు 11 మాత్రమే. ఈ లెక్కన చూస్తే ఈ హదీసు ఈయనగారి ఆలోచనకు భిన్నంగా ఉంది. ఇమామ్ అబూ హనీఫా గారేమో మొత్తం 14 సజ్దాలున్నాయని అంటారు. ఈయన హజ్ సూరాలోని మొదటి సజ్దాను సజ్దాగా శిరసావహించారుగాని, అందలి రెండవ సజ్దాను పరిగణనలోకి తీసుకోలేదు. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ గారి దృష్టిలో హజ్ సూరాలోని రెండు సజ్దాలను కూడా కలుపుకుంటే మొత్తం 15 సజ్దాలు ఖుర్ఆన్‌లో ఉన్నాయి. ఈ విషయంలో అందరికన్నా అత్యంత ప్రామాణికమైన, అనుసరణీయమైన విధానం ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ గారిదే అనాలి.

(٢٧١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: (صٓ) لَيْسَتْ مِنْ عَزَائِمِ السُّجُودِ، وَقَدْ رَأَيْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَسْجُدُ فِيهَا. رَوَاهُ الْبُخَارِيُّ.

271. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "తప్పనిసరిగా చేయవలసిన సజ్దాలలో సూరయె సాద్ సజ్దా లేదు. అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ సూరా పారాయణం చేసే సందర్భంగా సజ్దా చేయటం నేను చూచాను."

(బుఖారీ)

**సారాంశం**

దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే సూరయె సాద్ సజ్దా దైవప్రవక్త (స) మాత్రం చేశారుగాని, దాని గురించి ఇతరులను ఆజ్ఞాపించటంగానీ, తాకీదు చేయటంగానీ చేయలేదు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే కొన్ని ఆచరణలు 'మస్నూన్' అయి ఉంటాయిగానీ, ఇతరులపై దానికి సంబంధించిన ఆంక్ష ఉండదు. అనుసరిస్తే మంచిది. అనుసరించకపోతే వచ్చే అనర్థం కూడా లేదు.

(٢٧٢) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ سَجَدَ بِالنَّجْمِ. رَوَاهُ الْبُخَارِيُّ.

272. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి మరొక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నజమ్ సూరాలో 'సజ్దా తిలావత్' చేశారు.

(బుఖారీ)

### సారాంశం

నజమ్ సూరాలో సజ్దా తిలావత్ చేయటం తప్పనిసరి అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ముఫస్సల్ సూరాలలో సజ్దాలు లేవని వాదించేవారు దీనిపై యోచన చేయాలి.

(٢٧٣) وَعَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَرَأْتُ عَلَى النَّبِيِّ ﷺ النَّجْمَ، فَلَمْ يَسْجُدْ فِيهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

273. హ|జత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎదుట నజమ్ సూరాను పారాయణం చేశాను. కాని ఆయన (స) ఈ సందర్భంగా సజ్దా తిలావత్ చేయలేదు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దైవప్రవక్త (స) నజమ్ సూరా సందర్భంగా ఎప్పుడయినా ఒకసారి (పారాయణపు) సజ్దా చేయలేదంటే దీని భావం ఆ సూరాలో సజ్దా తిలావత్ అసలు లేదనీ లేక సజ్దా చేయనక్కరలేదని ఎంతమాత్రం కాదు. అసలు విషయం ఏమిటంటే కొన్ని కొన్ని సందర్భాలలో ఆయన (స) సజ్దా చేయలేదు. ఈ ఖుర్ఆనీ సజ్దాలు 'సున్నత్' (సంప్రదాయం) అన్న దానికి ఇదొక నిదర్శనం. ఒకవేళ ఇవి వాజిబ్ అయివుంటే సజ్దా తప్పకుండా చేసి వుండేవారు. ఈ విషయంలో అధిక సంఖ్యాక పండితుల అభిమతం కూడా ఇదే.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు జైద్ బిన్ సాబిత్ (రజి). మారుపేరు అబూ సయీద్. అన్సార్ల ప్రముఖ తెగ అయిన నజ్జార్‌తో ఈయనకు సంబంధముండేది. దైవప్రవక్త (స)పై అవతరించే 'వహీ'ని అందరికన్నా ఈయనే అధికంగా గ్రంథస్థం చేసేవారు. దైవప్రవక్త (స) సహచరులలో వారసత్వ పంపకాలను విశదీకరించటంలో సాటిలేని మేటి. కందక పోరాటంలో తొలిసారిగా పాల్గొన్నారు. హ|జత్ అబూబక్ర్ సిద్దీఖ్ పరిపాలనా కాలంలో ఖుర్ఆన్‌ను క్రోడీకరించే కార్యం ఈయనే అధికంగా నిర్వర్తించారు. హ|జత్ ఉస్మాన్ పరిపాలనా కాలంలో వాటి నకలును కూడా తయారు చేశారు. దైవప్రవక్త (సఅసం) ఆదేశానుసారం కేవలం 15 రోజులలో యూదుల భాషా లిపిని నేర్చుకుని, దైవప్రవక్త (స)గారి ఉత్తరాలను లిఖించసాగారు. లిఖించిన మీదట ఆ ఉత్తరాలను దైవప్రవక్త (స)కు చదివి వినిపించే వారు. హి|జీ 45లో మదీనాలో మరణించారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం మదీనా గాక, వేరొక ప్రాంతంలో మరణించారు.

(٢٧٤) وَعَنْ خَالِدِ بْنِ مَعْدَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: فُضِّلَتْ سُوْرَةُ الْحَجِّ بِسَجْدَتَيْنِ. رَوَاهُ أَبُو دَاوُدَ فِي الْمَرَاسِيْلِ، وَرَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ مَوْصُولاً مِنْ حَدِيْثِ عُقْبَةَ بْنِ

274. హ|జత్ ఖాలిద్ బిన్ మాదాన్ (రజి) కథనం : "హజ్ సూరాకు రెండు సజ్దాల మూలంగా శ్రేష్ఠత నొసగ బడింది." (అబూదావూద్ దీనిని 'మరాసీల్' అనే పుస్తకంలో ప్రస్తావించారు) అహ్మద్ మరియు తిర్మిజీ దీనిని

عَامِرٍ، وَزَادَ: «فَمَنْ لَمْ يَسْجُدْهُمَا فَلاَ يَقْرَأْهُمَا». وَسَنَدُهُ ضَعِيفٌ.

ఉత్‌బా బిన్ ఆమిర్ హదీసును బట్టి 'మౌసూల్'గా ఖరారు చేశారు. ఇందులో అదనంగా ఈ వాక్యం ఉంది - "ఎవరయితే ఈ సూరాలోని రెండు సజ్దాలు చేయరో వారు దీనిని పారాయణం చేయరాదు." (దీని ఆధారం బలహీనం)

**సారాంశం**

హజ్ సూరాలో రెండు సజ్దాలున్నాయనీ, ఆ రెండు సజ్దాలు కూడా చేయాల్సిందేననీ ఈ హదీసు చెబుతోంది. సజ్దాలు చేయదలచనివారు దీనిని పఠించకూడదు గాక! అని కూడా అనబడింది. ఇందలి పరమార్థం ఏమిటంటే ఖుర్‌ఆన్ పారాయణం ముస్తహబ్ కాగా; సజ్దా తిలావత్ చేయటం మస్నూన్. సున్నత్‌ను విడనాడటం కన్నా ముస్తహబ్ పై అమలు చేయకుండా ఉండటమే మంచిది - అంటే ఈ సూరాను పారాయణం చేయకుండా ఉండటం సముచితమని భావం. హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి), అబూ మూసా (రజి), అబూదర్దా (రజి), అమ్మార్ బిన్ యాసిర్ (రజి) తదితర సహచరులు హజ్ సూరాలోని రెండు సజ్దాలు కూడా చేసేవారు. అందుచేత ఈ ఉల్లేఖనాన్ని ఆచరణ యోగ్యం కాదని అనటం పొరపాటు.

**హదీసు ఉల్లేఖకులు**

అసలు పేరు ఖాలిద్ బిన్ మాదాన్ (రజి). మారుపేరు అబూ అబ్దుల్లా కలాయి. హిమ్స్ (సిరియా)కు చెందినవారు. సహాబీల తరువాతి తరం వారు (తాబయి). జ్ఞానసంపన్నులు. తాను 70 మంది సహాబీలను కలుసుకున్నానని ఆయన అనేవారు. ఈయన మరణం హిజ్రీ 103 లేక 104 లేక 108 లో సంభవించింది.

(٢٧٥) وَعَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: يَآ أَيُّهَا النَّاسُ! إِنَّا نَمرُّ بِالسُّجُودِ، فَمَنْ سَجَدَ فَقَدْ أَصَابَ، وَمَنْ لَمْ يَسْجُدْ فَلاَ إِثْمَ عَلَيْهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

275. హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు : "ప్రజలారా! మనం సజ్దాలున్న ఆయత్‌లు పారాయణం చేస్తూ ముందుకు సాగుతుంటాము. 'సజ్దా' చేసినవాడు సవ్యంగా తన బాధ్యతను నిర్వర్తించాడు. చేయనివాడు పాపాత్ముడు మాత్రం కాడు." (బుఖారీ)

وَفِيهِ: إِنَّ اللّٰهَ تَعَالَى لَمْ يَفْرِضِ السُّجُودَ إِلاَّ أَنْ يَشَآءَ. وَهُوَ فِي الْمُوَطَّإِ.

ముఅత్తాలో ఇలా వుంది-"అల్లాహ్ సజ్దా తిలావత్‌ను విధిగా చేయలేదు. అయితే పఠించేవాడు గనక తలచుకుంటే (సజ్దా) చేయవచ్చు".

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఖుర్ఆన్ పారాయణం చేసేవారికి సజ్దా తిలావత్‌కు సంబంధించి స్వేచ్ఛ ఇవ్వబడింది. సజ్దా తిలావత్ గనక ఫర్జ్ లేక వాజిబ్ అయివుంటే ఈ మేరకు స్వేచ్ఛ నొసగ బడేది కాదు. హజ్రత్ ఉమర్ (రజి) సహాబీల సమక్షంలో ఈ మాటలన్నారు. విన్నవారంతా మౌనంగా ఉన్నారు. అంటే ఇది అందరికీ వర్తించే అంశమని విదితమవుతున్నది. ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్‌ల అభిమతం కూడా ఇదే. అహ్లె హదీసు వారు కూడా సజ్దా తిలావత్‌ను 'మస్నూన్'గానే తలపోస్తారు. కాని హనఫీలు దీనిని 'వాజిబ్'గా తలంచారు.

(٢٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَقْرَأُ عَلَيْنَا الْقُرْآنَ، فَإِذَا مَرَّ بِالسَّجْدَةِ كَبَّرَ وَسَجَدَ، وَسَجَدْنَا مَعَهُ. رَوَاهُ أَبُو دَاوُدَ بِسَنَدٍ فِيهِ لِيْنٌ.

276. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా ముందు దివ్యఖుర్ఆన్ పారాయణం చేసేవారు. సజ్దా గల ఆయత్ వచ్చినపుడు 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దా చేసేవారు. మేము కూడా ఆయన (స)తో పాటే సజ్దా చేసే వారము.'' (అబూదావూద్ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

సజ్దా తిలావత్ చేసేటప్పుడు అల్లాహు అక్బర్ అని అనటం నియమం అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. సజ్దా తిలావత్‌లో ఈ దుఆ పఠించాలి -

**సజద వజ్‌హీలిల్లజీ ఖలఖహూ వ సవ్వరహూ వ**
**షఖ్ఖ సమఅహూ వ బసరహూ వ బిహౌలిహీ వ ఖువ్వతిహీ**

(అర్థం : ఎవరయితే సృష్టించాడో, రూపకల్పన చేశాడో, వినే శక్తినిచ్చాడో, చూపునొసగాడో, శక్తి సామర్థ్యాలను ప్రసాదించాడో వాని ముందు నా తల వాలిపోయింది)

(٢٧٧) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا جَاءَهُ أَمْرٌ يَسُرُّهُ خَرَّ سَاجِداً لِلّٰهِ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

277. హజ్రత్ అబూబక్ర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఏదయినా శుభవార్త అందితే ఆయన (స) దైవసమక్షంలో సాష్టాంగ పడేవారు" ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు).

**సారాంశం**

ఏదైనా దైవానుగ్రహం కలిగినపుడు, ఏదైనా గండం గడచినపుడు, ఏదైనా సంతోషకర విషయం తెలిసినపుడు దైవానికి కృతజ్ఞతా సూచకంగా మోకరిల్లటం షరీయత్‌పరంగా సబబేనని దీన్నిబట్టి రూఢీ అవుతున్నది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్‌లు కూడా దీనికి సుముఖంగా ఉన్నారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫాలు దీనిని వాంఛనీయంగాగానీ, అవాంఛనీయంగాగానీ పేర్కొనలేదు.

(٢٧٨) وَعَنْ عَبْدِ الرَّحْمَنِ بْنِ عَوْفٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَجَدَ النَّبِيُّ ﷺ فَأَطَالَ السُّجُودَ، ثُمَّ رَفَعَ رَأْسَهُ وَقَالَ: إِنَّ جِبْرِيلَ أَتَانِي، فَبَشَّرَنِي، فَسَجَدْتُ لِلَّهِ شُكْراً. رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

278. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సజ్దా చేశారు. చాలా సుదీర్ఘమయిన సజ్దా చేశారు. సజ్దా నుండి తల పైకెత్తిన పిదప ఇలా అన్నారు- "ఇప్పుడే జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా దగ్గరకు ఒక శుభవార్త తీసుకు వచ్చారు. ఆ శుభవార్త విని నేను అల్లాహ్ సన్నిధిలో కృతజ్ఞతా పూర్వకంగా సాష్టాంగ పడ్డాను." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు).

**సారాంశం**

ముస్నద్ అహ్మద్‌లో ఈ హదీసు పలు ఆధారాలతో ఉల్లేఖించబడింది. ఆ శుభవార్త ఏమిటో కూడా అందులో తెలుపబడింది - "ఎవరయితే మహాప్రవక్త (సఅసం)పై ఒకసారి దరూద్ పంపుతాడో అతనిపై అల్లాహ్ పది దయానుగ్రహాలను తన తరఫున కురిపిస్తాడు" అని ఆయనకు తెలుపబడగా ఆయన (స) దైవానికి కృతజ్ఞతలర్పిస్తూ ఈ సజ్దా చేశారు. కాబట్టి ఎవరికయినా సంతోషకరమయిన వార్త అందినపుడు వారు తమ ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సజ్దా చేయటం అభిలషణీయం.

**హదీసు ఉల్లేఖకులు**

అసలు పేరు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి). మరోపేరు అబూ ముహమ్మద్. ఖురైష్‌కు చెందిన 'జుహ్రి' తెగతో ఈయనకు బాంధవ్యం ఉంది. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో రెండు హిజ్రత్‌లు చేసిన ఘనత ఈయనకు దక్కింది. బద్ర్, ఉహుద్‌లతో సహా యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) నోట ఇహలోకంలోనే స్వర్గలోక శుభవార్త పొందిన

పదిమందిలో ఈయన కూడా ఉన్నారు. తన తరువాత ఖలీఫాగా ఎంపిక చేసేందుకు పరిశీలించదగ్గ ఆరుగురు వ్యక్తుల పేర్లతో కూడిన జాబితాను ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) అందజేశారు. ఈ ఆరుగురు వ్యక్తులలో ఈయన కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) కాలంలో ఈయన ఒకసారి నాలుగువేలు, మరోసారి నలభై వేల దీనార్లు దానం చేశారు. అంతేకాదు, దైవమార్గంలో పోరాటం నిమిత్తం 500 గుఱ్ఱాలు, 500 ఒంటెలను కూడా సమర్పించారు. దైవప్రవక్త సతీమణుల కోసం తన ఆస్తిలోని ఒక భాగాన్ని వీలు వ్రాసి ఇచ్చారు. ఆ తరువాత ఆ ఆస్తికి వెలకట్టగా అది 4 లక్షల దీనార్లని తేలింది. హిజ్రీ 34లో మరణించారు. జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

(٢٧٩) وَعَنِ الْبَرَاءِ بْنِ عَازِبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ عَلِيًّا إِلَى الْيَمَنِ، فَذَكَرَ الحديث. قال: فكتب عليٌّ بإسلامهم، فَلَمَّا قَرَأَ رَسُولُ اللّٰهِ ﷺ الْكِتَابَ خَرَّ سَاجِداً، شُكْراً لِلّٰهِ عَلَى ذٰلِكَ. رَوَاهُ الْبَيْهَقِيُّ، وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

279. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ అలీ (రజి)ని యమన్ వైపునకు పంపించారు. హదీసు ఉల్లేఖకులు ఇలా అంటున్నారు - హజ్రత్ అలీ (రజి) యమన్ వాసుల ఇస్లాం స్వీకారానికి సంబంధించిన వివరాలు దైవప్రవక్త సమక్షానికి వ్రాసి పంపగా దైవప్రవక్త (స) ఆ ఉత్తరాన్ని చదివారు. దైవానికి కృతజ్ఞతలు చెల్లించేందుకై ఆయన (స) సాష్టాంగ పడ్డారు. (బైహఖీ దీనిని ఉల్లేఖించారు- దీని మూలం బుఖారీలో పొందుపరచబడి ఉంది)

## సారాంశం

యమన్ ప్రజలు ఇస్లాంలోకి ప్రవేశించిన సంగతిని హజ్రత్ అలీ (రజి) లేఖ ద్వారా తెలుసుకుని దైవప్రవక్త (స) మేను ఆనందంతో పులకించింది. కృతజ్ఞతా సూచకంగా దైవసన్నిధిలో ఆయన (స) సజ్దా చేశారు.

ముస్లింల సంఖ్య గణనీయంగా పెరగటం సంతోషదాయకమైన విషయం. నిశ్చయంగా ఇది దేవుని మహదానుగ్రహం. కనుక దీనికిగాను కృతజ్ఞతలర్పించటం ధర్మం. ఒకప్పుడు ఇలాంటి సంతోషకరమైన సంఘటనలు జరిగినపుడు - ముస్లింల సంఖ్య గణనీయంగా పెరిగినపుడు - దేవునికి కృతజ్ఞతలర్పించేవారు. కాని ఇప్పుడో?! ముస్లింల సంఖ్యను గణనీయంగా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కుటుంబ నియంత్రణ పథకాల పేరుతో, వ్యక్తిగత స్థాయిలోనే గాకుండా, ప్రభుత్వ స్థాయిలో కూడా జననాల రేటును తగ్గించే కృషి జరుగుతోంది. కొన్ని ముస్లిం రాజ్యాలలో సయితం ఈ పథకాలు ప్రవేశపెట్టబడటం కడు శోచనీయం!

9వ అధ్యాయం

## నఫిల్ నమాజులు

## ٩ - بَابُ صَلاَةِ التَّطَوُّعِ

280. హజ్రత్ రబీయ బిన్ కాబ్ అస్లమీ (రజి) ఉల్లేఖించారు : ఒకరోజు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్నుద్దేశ్యించి ఇలా అన్నారు : "(నీకేం కావాలో) అడుగు?". 'నేను స్వర్గంలో తమరి వెంట ఉండగోర్తున్నాను' అని నేనన్నాను. "ఇదిగాక ఇంకేమయినా కోరుకో" అని అన్నారాయన (స). 'నాకంతే చాలు' అని నేను విన్నవించుకున్నాను. "మర యితే నీ ఆశయ సాధనకై అత్యధిక మయిన సజ్దాలతో నాకు తోడ్పడు" అని ఆయన (సఅసం) ఉపదేశించారు.

(ముస్లిం)

(٢٨٠) عَنْ رَبِيْعَةَ بْنِ كَعْبٍ ٱلْأَسْلَمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لِيَ النَّبِيُّ ﷺ: «سَلْ»، فَقُلْتُ: أَسْأَلُكَ مُرَافَقَتَكَ فِي الْجَنَّةِ، فَقَالَ: «أَوَ غَيْرَ ذٰلِكَ؟» فَقُلْتُ: هُوَ ذَاكَ، قَالَ: «فَأَعِنِّي عَلَى نَفْسِكَ بِكَثْرَةِ السُّجُودِ».

رَوَاهُ مُسْلِمٌ.

### సారాంశం

ఈ హదీసులో అత్యధిక సజ్దాలంటే భావం నఫిల్ (అదనపు) నమాజులు ఎక్కువగా చేస్తూ ఉండమని అన్నమాట! నమాజులోని అంశాలన్నింటికన్నా శ్రేష్ఠమయినది సజ్దా (సాష్టాంగం). దైవ సామీప్యానికి అత్యంత ముఖ్యమయిన సాధనం సజ్దా. దైవ సామీప్యం పొందడానికీ, దైవప్రవక్త (స) సహచర్యం (సాన్నిహిత్యం) లభించడానికి నఫిల్ (స్వచ్ఛంద) నమాజులను నెరవేర్చటం అవసరమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

చాలామంది తమను తాము దైవప్రవక్త (స) యొక్క నికార్సయిన అనుయాయులమని ప్రకటించుకుంటారు. కాని ప్రవక్త (స) సూచించిన ఆరాధనలను, అభ్యాసాలను మాత్రం పట్టించు కోరు. మరికొంత మంది ఉన్నారు - వారు తమను తాము దైవప్రవక్త (స) భక్తులుగా, వీరాభి మానులుగా గొప్పలు చెప్పు కుంటారు. కాని వారు నఫిల్ నమాజులు కాదుకదా, కనీసం ఫర్జ్ నమాజులు కూడా చేయరు. ఇది అజ్ఞానానికి, సోమరితనానికి, తలబిరుసుతనానికి, దగుల్బా జీతనానికి ప్రబల తార్కాణం మాత్రమే.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు రబీయ బిన్ కాబ్ (రజి). మారుపేరు అబూ ఫిరాస్. అస్లం తెగకు చెందిన వారవటం చేత అస్లమీగా పిలువబడ్డారు. అస్హాబె సుఫ్ఫహ్ (అరుగువాళ్లు)లో ఒకరు. మదీనా వాసులు. దైవప్రవక్త (సఅసం) గారి ప్రత్యేక సేవకులు. మదీనాలోనూ, ప్రయాణ సమయాల్లోనూ దైవప్రవక్త (సఅసం) కు తోడుగా ఉండేవారు.

(٢٨١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: حَفِظْتُ مِنَ النَّبِيِّ ﷺ عَشْرَ رَكَعَاتٍ: رَكْعَتَيْنِ قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ بَعْدَهَا، وَرَكْعَتَيْنِ بَعْدَ الْمَغْرِبِ فِي بَيْتِهِ، وَرَكْعَتَيْنِ بَعْدَ الْعِشَاءِ فِيْ بَيْتِهِ، وَرَكْعَتَيْنِ قَبْلَ الصُّبْحِ. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لَّهُمَا: وَرَكْعَتَيْنِ بَعدَ الْجُمُعَةِ فِيْ بَيْتِهِ.

281. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)గారి పది రకతులు నాకు జ్ఞాపకం ఉన్నాయి. రెండు రకతులు జుహ్ర్ నమాజుకు ముందు, రెండు తరువాత, మగ్రిబ్ (నమాజు) తర్వాత రెండు రకతులు ఇంటి వద్ద చదివేవారు. అలాగే రెండు రకతులు ఇషా ఫర్జ్ నమాజ్ అనంతరం ఇంటి వద్దనే చేసేవారు. రెండు రకతులు ఉదయానికి (నమాజుకు) ముందు చేసేవారు.'' (బుఖారీ, ముస్లిం).

బుఖారీ, ముస్లింలలోని రెండు ఉల్లేఖనాలలోనూ ఇది కూడా వుంది: ''రెండు రకతులు జుమా నమాజ్ (ఫర్జ్ నమాజ్) అనంతరం ఇంటివద్ద చేసేవారు.''

وَلِمُسْلِمٍ: كَانَ إِذَا طَلَعَ الْفَجْرُ لاَ يُصَلِّي إِلاَّ رَكْعَتَيْنِ خَفِيْفَتَيْنِ.

ముస్లిం ఉల్లేఖనంలో ఇంకా ఈ విధంగా ఉంది - ''తెల్లవారాక తేలికపాటి రెండు రకతులు తప్ప మరొకటి నెరవేర్చేవారు కారు.''

**సారాంశం**

ఈ హదీసును బట్టి జుహ్ర్ నమాజులో ఫర్జ్‌కు ముందు రెండు రకతులు, ఫర్జ్ తరువాత రెండు రకతులు - మొత్తం నాలుగు రకతులు మాత్రమే (సున్నత్ నమాజులు) ఉన్నాయని అవగతమవుతోంది. వేరొక హదీసు ప్రకారం ఫర్జ్‌కు ముందు 4 రకతులు, ఫర్జ్ తరువాత 2 రకతులు చేసినట్టు కూడా ఆధారం ఉంది.

(٢٨٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ لاَ يَدَعُ أَرْبَعاً قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ قَبْلَ الْغَدَاةِ. رَوَاهُ الْبُخَارِيُّ.

282. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుహ్ర్ నమాజుకు ముందు 4 రకతులను, ఫజ్ర్ నమాజు (కు ముందు) రెండు రకతులను ఎన్నడూ విడనాడ లేదు.'' (బుఖారీ)

## సారాంశం

దైవప్రవక్త (సఅసం) రేయింబవళ్లలో ఫర్జ్ నమాజులతో పాటు కొన్ని నఫిల్ నమాజులను కూడా నెరవేర్చేవారు. ఏ నఫిల్ నమాజులను ఆయన ఎన్నడూ విడవకుండా చేసేవారో మరియు చేయమని తన సహచరులను ప్రోత్సహించేవారో వాటిని 'సున్నతె ముఅక్కద'గాను, మరే నమాజులను నిరంతరం చేసేవారు కాదో వాటిని 'సున్నతె గైర్ ముఅక్కద'గానూ, 'నఫిల్' నమాజులు గాను పేర్కొనటం జరిగింది. యదార్థానికి ఇవన్నీ నఫిల్ నమాజులే (స్వచ్ఛంద నమాజులే).

ఈ హదీసులో జుహ్ర్ నమాజుకు ముందు నాలుగు రకతుల ప్రస్తావన వచ్చింది. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గారి ఉల్లేఖనంలో జుహ్ర్‌లో ఫర్జ్‌కు ముందు రెండు రకతులు, ఫర్జ్ తరువాత రెండు రకతులు అని వుంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో జుహ్ర్‌కు ముందు రెండు రకతులు ప్రాధాన్యతతో కూడుకున్నవి. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో నాలుగు రకతులు ప్రాధాన్యతతో కూడుకున్నవి. ఈ సందర్భంగా ఉల్లేఖనాలన్నింటినీ ముందుకు తెచ్చి, ఆయన (సఅసం) రెండు విధాలుగానూ ఆచరించే వారని చెప్పటం సమంజసంగా ఉంటుంది. అయితే రెండు రకతులకన్నా నాలుగు రకతులు చదవటం ఎక్కువ పుణ్యప్రదం అనటంలో సందేహం లేదు.

(٢٨٣) وَعَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمْ يَكُنِ النَّبِيُّ ﷺ عَلَى شَيْءٍ مِّنَ النَّوَافِلِ أَشَدَّ تَعَاهُداً مِّنْهُ عَلَى رَكْعَتَيِ الْفَجْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

وَلِمُسْلِمٍ: «رَكْعَتَا الْفَجْرِ خَيْرٌ مِّنَ الدُّنْيَا وَمَا فِيهَا».

283. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నఫిల్ నమాజులలో అన్నిటి కన్నా అధికంగా ఫజ్ర్ సున్నతుల పట్ల శ్రద్ధ వహించేవారు." (బుఖారీ, ముస్లిం).

ముస్లింలో ఇలా వుంది : "ఫజ్ర్ నమాజు లోని రెండు రకతులు (సున్నత్) ప్రపంచం మరియు అందులో ఉన్న దానికన్నా శ్రేష్టమైనవి."

## సారాంశం

ఇందులో ఏమాత్రం సందేహానికి ఆస్కారం లేదు. నఫిల్ నమాజులలో దైవప్రవక్త (స) ఉదయం పూట నమాజుకు ఇచ్చినంత ప్రాధాన్యత మరి దేనికీ ఇవ్వలేదు. ఆఖరికి ప్రయాణ సమయాలలో కూడా ఆయన (స) ఈ రెండు రకతులను విడిచిపెట్టలేదు. ఈ రెండు సున్నతుల గురించి చేయబడిన తాకీదును దృష్టిలో పెట్టుకునే హనఫీ ఫికహ్ ననుసరించేవారు ఫజ్ర్‌లో సామూహిక నమాజ్ జరుగుతున్నప్పటికీ - ఈ రెండు రకతులను చేయటం అనివార్యంగా చేసుకున్నారు. మరి చూడబోతే ఈ పద్ధతి హదీసుతో సమరసం చెందదు. ఎందుకంటే మస్జిద్‌లో - ఫర్జ్ నమాజ్ సామూహికంగా నెలకొన్న తరువాత వేరొక నమాజ్‌కు వీలుండదు. దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు: "ఇఖామత్ అయిన తరువాత ఫర్జ్ నమాజు తప్ప మరో నమాజు లేదు."

(٢٨٤) وَعَنْ أُمِّ حَبِيبَةَ أُمِّ الْمُؤْمِنِينَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَنْ صَلَّى اثْنَتَيْ عَشْرَةَ رَكْعَةً فِي يَوْمٍ وَلَيْلَةٍ بُنِيَ لَهُ بِهِنَّ بَيْتٌ فِي الْجَنَّةِ». رَوَاهُ مُسْلِمٌ، وَفِي رِوَايَةٍ: «تَطَوُّعاً»

284. ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా నేను స్వయంగా విన్నాను- "ఏ వ్యక్తయితే రేయింబవళ్ళలో 12 రకతుల నఫిల్ నమాజు చేశాడో అతని కొరకు - వాటికి బదులుగా - స్వర్గంలో గృహం నిర్మించబడింది" (ముస్లిం). మరొక ఉల్లేఖనంలో "నఫిల్ రూపేణా" అని వుంది.

وَلِلتِّرْمِذِيِّ نَحْوُهُ وَزَادَ: أَرْبَعاً قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ بَعْدَهَا، وَرَكْعَتَيْنِ بَعْدَ الْمَغْرِبِ، وَرَكْعَتَيْنِ بَعْدَ الْعِشَاءِ وَرَكْعَتَيْنِ قَبْلَ صَلاَةِ الْفَجْرِ.

తిర్మిజీ ఉల్లేఖనంలో కూడా ఇలాగే వుంది - అయితే అందులో అదనంగా ఇలా చెప్పబడింది: "4 రకతులు జుహ్రకు ముందు, 2 రకతులు తరువాత, 2 రకతులు మగ్రిబ్ నమాజు తర్వాత, 2 రకతులు ఇషా తరువాత, 2 రకతులు ఉదయం నమాజుకు ముందు."

وَلِلْخَمْسَةِ عَنْهَا: «مَنْ حَافَظَ عَلَى أَرْبَعٍ قَبْلَ الظُّهْرِ، وَأَرْبَعٍ بَعْدَهَا، حَرَّمَهُ اللَّهُ تَعَالَى عَلَى النَّارِ».

ఐదుగురూ (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ) హజ్రత్ ఉమ్మెహబీబా (ర.అనహా) గారి ఆధారంగానే ఇలా ఉల్లేఖించారు: "ఎవరయితే జుహ్రలోని మొదటి నాలుగు రకతులను కాపాడాడో, తదుపరి నాలుగు రకతులను సక్రమంగా చదువుతూ ఉన్నాడో అతనిపై అల్లాహ్ నరకాగ్నిని నిషిద్ధం (హరామ్) గావిస్తాడు."

**సారాంశం**

రేయింబవళ్లలో 12 రకతులు 'సున్నతె ముఅక్కద'గా చేయబడ్డాయని ఈ హదీసును బట్టి విదిత మవుతోంది. దీనిని తప్పక పాటించాలి. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) ఈ నమాజులను

నిరంతరం పాటించారు. జుహ్రలో ఫర్జ్ నమాజ్ అనంతరం రెండు రకతులయినా చేయవచ్చు. నాలుగు రకతుల నమాజ్ అయినా చెయ్యవచ్చు. నాలుగు రకతులు ఎంతో మహత్ పూర్వకమైనవని చెప్పబడింది. ఒకవేళ ఎవరయినా ఆరు రకత్‌లు చెయ్యదలచుకుంటే అందుకూ అనుమతి ఇవ్వబడింది.

### హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె హబీబా (ర.అన్హా). ఈమె అసలు పేరు 'రమ్‌లా'. అబూ సుఫ్యాన్ కుమార్తె. అమీర్ ముఆవియ (రజి) సోదరి. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. అబిసీనియా (నేటి ఇథియోపియా)కు వలస వెళ్ళిన వారిలో ఈమె కూడా ఉన్నారు. ఈమె భర్త అబ్దుల్లా బిన్ జహష్ కూడా ఈమెతోపాటే వలస వెళ్ళాడు. కాని అక్కడతను క్రైస్తవుడిగా మారిపోయాడు. కొంతకాలం తరువాత అక్కడే చనిపోయాడు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆమెను - హిజ్రీ 7లో - నికాహ్ చేసుకుని తన దాంపత్య జీవితంలోనికి తెచ్చుకున్నారు. నికాహ్ సమయంలో ఈమె అబిసీనియా లోనే ఉన్నారు. తరువాత ఈమె అబిసీనియా ముహాజిర్లతో కలసి మదీనా వచ్చారు. హిజ్రీ 42లోనో, 44లోనో లేక 50 లోనో మరణించారు.

(٢٨٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «رَحِمَ اللّٰهُ امْرَأً صَلَّى أَرْبَعاً قَبْلَ الْعَصْرِ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَابْنُ خُزَيْمَةَ، وَصَحَّحَهُ.

285. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు: "అస్ర్ నమాజుకు ముందు నాలుగు రకతులు చదివిన వానిపై అల్లాహ్ దయదలచు గాక!" (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. ఇబ్నె ఖుజైమా మాత్రం 'సహీహ్'గా నిర్ధారించారు.)

### సారాంశం

అస్ర్ నమాజుకు ముందు చదివే ఈ నాలుగు రకతులు 'సున్నతె ముఅక్కద' క్రిందికి రావు - ఇవి కేవలం నఫిల్ మాత్రమే. అయితే వీటిని నెరవేర్చిన వానిపై దైవకారుణ్యానికి సంబంధించిన వేడుకోలు వచనాలు వచ్చినందున ఈ నాలుగు రకతులు చేయటం మంచిదే. దైవకారుణ్యానికి నోచుకోవటంకన్నా భాగ్యం ఇంకేముందీ?!

(٢٨٦) وَعَنْ عَبْدِ اللّٰهِ بْنِ مُغَفَّلٍ الْمُزَنِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «صَلُّوا قَبْلَ الْمَغْرِبِ، صَلُّوا قَبْلَ

286. హజ్రత్ అబ్దుల్లా బిన్ ముగప్ఫల్ ముజనీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మగ్రిబ్‌కు ముందు నమాజ్

الْمَغْرِبَ»، ثُمَّ قَالَ فِي الثَّالِثَةِ: لِمَنْ شَاءَ، كَرَاهِيَةَ أَنْ يَتَّخِذَهَا النَّاسُ سُنَّةً. رَوَاهُ الْبُخَارِيُّ.

చేయండి. మగ్రిబ్‌కు ముందు నమాజ్ చేయండి. మూడవసారి - 'చేయదలిచిన వానికి మాత్రమే ఈ ఆజ్ఞ వర్తిస్తుంది' అని అన్నారు. ప్రజలు దీనిని ఎక్కడ సున్నత్‌గా తలపోస్తారో నన్న సంశయంతో ఆయన (స) ఈ విధంగా సెలవిచ్చారు." (బుఖారీ)

وَفِي رِوَايَةٍ لابْنِ حِبَّانَ: أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى قَبْلَ الْمَغْرِبِ رَكْعَتَيْنِ.

ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖనంలో ఇలా వుంది: "దైవప్రవక్త (సఅసం) మగ్రిబ్‌కు ముందు రెండు రకతుల నమాజ్ సలిపారు."

وَلِمُسْلِمٍ عَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي رَكْعَتَيْنِ بَعْدَ غُرُوبِ الشَّمْسِ، وَكَانَ النَّبِيُّ ﷺ يَرَانَا، فَلَمْ يَأْمُرْنَا، وَلَمْ يَنْهَنَا.

ముస్లింలో హజ్రత్ అనస్ (రజి) గారి ఉల్లేఖనంలో ఇలా వుంది: "మేము సూర్యాస్తమయం అయిన తరువాత (ఫర్జ్ నమాజ్‌కు ముందు) రెండు రకతులు చేసేవారము. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) మమ్మల్ని గమనిస్తూనే ఉండేవారు. కాని ఆయన (స) ఈ నమాజు చేయండి అని గానీ, చేయవద్దు అని గానీ చెప్పేవారు కాదు."

## సారాంశం

మగ్రిబ్ నమాజుకు ముందు (అజాన్ ఇచ్చిన వెంటనే) చేసే రెండు రకతుల నమాజ్ అదనపు నమాజుగా పరిగణించబడుతుంది. ఇది 'సున్నతె ముఅక్కద' పరిధిలోకి రాదు. అయితే ఈ నమాజును చేయటం అభిలషణీయం (ముస్తహబ్).

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ ముగఫ్ఫల్ ముజనీ (రజి) ముజ్‌నియా తెగకు చెందినవారు. అందుకే ముజనీగా వ్యవహరించబడ్డారు. 'అస్‌హాబె షజర్'లో ఈయనా ఉన్నారు. (అంటే హుదైబియా సంఘటన సందర్భంగా వృక్షం క్రింద కూర్చుని - ఖురైషులకు వ్యతిరేకంగా - ధర్మరక్షణకై కట్టుబడి ఉంటామని శపథం చేసిన వారిలో ఈయన కూడా ఉన్నారు). తొలుత మదీనాలో ఉన్నారు. తదుపరి ఈజిప్టుకు మకాం మార్చారు. బస్రా వాసులకు ధార్మిక శిక్షణ నివ్వడానికి హజ్రత్ ఉమర్ (రజి) చే పంపబడిన 10 మంది అధ్యాపక వర్గంలో ఈయన కూడా ఒకరు. హిజ్రీ 60లో మరణించారు.

(٢٨٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنها قَالَتْ: كَانَ النَّبِيُّ ﷺ يُخَفِّفُ الرَّكْعَتَيْنِ اللَّتَيْنِ قَبْلَ صَلَاةِ الصُّبْحِ، حَتَّى إِنِّي أَقُولُ: أَقَرَأَ بِأُمِّ الْكِتَابِ؟ مُتَّفَقٌ عَلَيْهِ.

287. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజ్ర్ నమాజ్‌కు ముందు రెండు రకతుల (సున్నత్) నమాజ్‌ను ఎంతో సరళంగా (అంటే ముక్తసరిగా) చేసేవారు. ఆయన (స) బహుశా ఉమ్ముల్ కితాబ్ (ఫాతిహా సూరా)తోనే సరిబుచ్చుతున్నారా?! అని నాకు సందేహం కలిగేది". (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే ఆయన (స) ఉదయం నమాజులో - ఫర్జ్ నమాజుకు ముందు రెండు రకతుల సున్నత్ నమాజును ఎంతో సంక్షిప్తంగా చేసేవారు. అంటే చిన్న సూరాలు పఠించేవారు, ఎక్కువ సేపు నిలబడి ఉండేవారు కాదని భావం. దీని ఆధారంగానే ఉదయం పూట సున్నత్ నమాజులో కొద్దిసేపు మాత్రమే ఖియామ్ చేయటం ఉత్తమమని ఇమామ్ షాఫయి, అధిక సంఖ్యాక విద్వాంసులు నిర్ధారించారు. కాని ఇమామ్ అబూ హనీఫా మాత్రం సుదీర్ఘమయిన ఖియామ్ చేయాలని అభిప్రాయపడ్డారు. ఆయన అభిప్రాయంతో ఆయన ప్రముఖ శిష్యులయిన ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్‌లు సయితం ఏకీభవించలేదు. అది వేరే విషయం ! దైవప్రవక్త (స) ఈ నమాజులో ఫాతిహా సూరాతో పాటు చిన్న చిన్న సూరాలు పఠించేవారు. వాటి వివరాలు తరువాతి హదీసులో వస్తాయి.

(٢٨٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَرَأَ فِي رَكْعَتَيِ الْفَجْرِ «قُلْ يَا أَيُّهَا الْكَافِرُونَ» وَ «قُلْ هُوَ اللّٰهُ أَحَدٌ». رَوَاهُ مُسْلِمٌ.

288. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజ్ర్‌లోని రెండు (సున్నత్) రకతులలో మొదటి దానిలో 'ఖుల్ యా అయ్యు హల్ కాఫిరూన్', రెండవ దానిలో 'ఖుల్‌హు వల్లాహు అహద్' పఠించారు. (ముస్లిం)

**సారాంశం**

ఈ రెండు రకతులలో ఈ రెండు సూరాలను పఠించటం మస్నూన్ (సంప్రదాయం). దైవప్రవక్త అడుగుజాడలలో నడిచే భావనతో ఈ రెండు సూరాలనే పఠించటం మంచిది. అంతమాత్రాన వేరే సూరాలు పఠించరాదనిగానీ, పఠిస్తే నమాజ్ నెరవేరదనిగానీ భావం ఎంతమాత్రం కాదు సుమా!

(٢٨٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا صَلَّى رَكْعَتَيِ الْفَجْرِ اضْطَجَعَ عَلَى شِقِّهِ الْأَيْمَنِ. رَوَاهُ الْبُخَارِيُّ.

289. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజ్ర్ నమాజులోని రెండు రకతులను చదివి, కుడి ప్రక్కకు తిరిగి కాస్సేపు విశ్రమించేవారు. (బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే ఉదయం (ఫజ్ర్) నమాజుకు ముందు రెండు రకతుల సున్నత్ చదివి కాస్సేపు విశ్రాంతి తీసుకుంటే అందులో దోషం ఏమీ లేదు. పైగా దైవప్రవక్త (స) ఈ మేరకు ప్రోత్సహించారని రానున్న హదీసు ద్వారా తెలుస్తోంది.

(٢٩٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا صَلَّى أَحَدُكُمُ الرَّكْعَتَيْنِ قَبْلَ صَلَاةِ الصُّبْحِ فَلْيَضْطَجِعْ عَلَى جَنْبِهِ الْأَيْمَنِ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

290. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "మీలో ఎవరయినాసరే ఫజ్ర్ నమాజుకు ముందు రెండు రకతులను పూర్తి చేస్తే వారు (కాస్సేపు) తమ కుడిప్రక్క ఆధారంగా విశ్రమించాలి." (ఈ హదీసును అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

**సారాంశం**

పై రెండు హదీసుల దృష్ట్యా ఉదయం పూట సున్నత్ నమాజు చేసిన వెంటనే కాస్సేపు విశ్రాంతి తీసుకోవటం సున్నత్ అని రూఢీ అయింది. ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త ఈ మేరకు ఆచరించగా, మరొక హదీసు ప్రకారం అలా ఆచరించమని ఆదేశించారు. దీన్ని ఆధారంగా తీసుకుని 'అహ్లె జవాహిర్' (బాహ్య గ్రాహ్యార్థుల) వర్గం ఈ విశ్రాంతిని వాజిబ్‌గా భావించింది. ఏ నమాజీ ఉద్దేశ్యపూర్వకంగా దీన్ని ఆచరించలేదో అతని ఫర్జ్ నమాజ్ కూడా నెరవేరదని తేల్చి చెప్పేసింది. కాని ఇలా అనటం సమంజసం కాదు. ఇమామ్ నవవీ (రహ్మలై) దీనిని 'సున్నత్'గా పరిగణించారు. మరి కొంతమంది ఈ విశ్రాంతిని 'మక్రూహ్'గా భావించారు. ఈ భావన కూడా హదీసుకు విరుద్ధమైనదే. ఏ విధంగా చూచినా దీనిని 'సున్నత్'గా పరిగణించటమే సమంజసం.

(٢٩١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ:

291. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "రాత్రి

«صَلاَةُ اللَّيْلِ مَثْنَى مَثْنَى، فَإِذَا خَشِيَ أَحَدُكُمُ الصُّبْحَ صَلَّى رَكْعَةً وَاحِدَةً، تُوتِرُ لَهُ مَا قَدْ صَلَّى». مُتَّفَقٌ عَلَيْهِ، وِلِلْخَمْسَةِ - وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ - بِلَفْظِ «صَلاَةُ اللَّيْلِ وَالنَّهَارِ مَثْنَى مَثْنَى». وَقَالَ النَّسَائِيُّ: هَذَا خَطَأٌ.

నమాజ్ రెండేసి రకతుల రూపంలో (చేయాలి), మీలో ఎవరికయినా ఉషోదయం కావస్తున్నట్లు అనిపిస్తే (ఆఖరిలో) ఒక్క రకత్‌నే చేయండి. అంతకు ముందు చదివిన అతని నమాజ్ అంతా వితర్ (బేసి)గా చేయబడుతుంది.". (బుఖారీ, ముస్లిం మరియు మిగిలిన ఐదుగురూ ఉల్లేఖించారు.) ఇబ్నె హిబ్బాన్ మాత్రం "రేయింబవళ్ళ నమాజ్‌లు రెండేసి రకతులుగా ఉన్నాయి" అన్న దానిని ప్రామాణికంగా ఖరారు చేశారు. అయితే నసాయి దీనిని ఖతా - అంటే పొరపాటు - అని వ్యాఖ్యానించారు.

### సారాంశం

రాత్రిపూట చేసే నమాజులను రెండేసి రకతులుగా చేయాలని, రెండు రకతుల తర్వాత సలాం చేయాలని ఈ హదీసు సారాంశం. ముస్లిం సమాజంలోని అత్యధికులు దీన్ని అంగీకరించారు. మరో ముఖ్య విషయం - వితర్ నమాజ్ ఒక్క రకత్ చేసినా నెరవేరుతుంది. మరికొంతమంది దృష్టిలో అసలు వితర్ ఒక్క రకతే. కాని హదీసు ప్రకారం 3, 5, 7, 9, 11 వరకూ వితర్ చేయవచ్చు.

(٢٩٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَفْضَلُ الصَّلاَةِ بَعْدَ الفَرِيضَةِ، صَلاَةُ اللَّيْلِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

292. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఫర్జ్ నమాజు తర్వాత అత్యంత శ్రేష్ఠమయిన నమాజ్ రాత్రిపూట నమాజ్." (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా తహజ్జుద్ నమాజ్ ప్రాముఖ్యత విదితమవుతున్నది. దీని ప్రాముఖ్యత, మహత్తు గురించి దివ్య ఖుర్‌ఆన్ స్వయంగా సాక్ష్యమిచ్చింది. హజ్రత్ అబూ హురైర (రజి) గారి ఒక ఉల్లేఖనం ప్రకారం; ఫర్జ్ నమాజ్ తర్వాత అన్నిటికన్నా మహత్తు గల నమాజ్ ఏది? అని దైవప్రవక్త (స)ను ప్రశ్నించగా, 'రాత్రి చివరి భాగంలోని నమాజ్' అని ఆయన (స) సమాధానమిచ్చారు. తిర్మిజీలో అమ్ర్ బిన్ అబ్సా గారి ఉల్లేఖనం ప్రకారం; దాసుడు తన ప్రభువు సామీప్యం పొందేందుకు అత్యంత అనువైన సమయం రాత్రి చివరి భాగం అని తెలుస్తోంది.

అందుచేత దైవదాసులు రాత్రి చివరి భాగంలో తహజ్జుద్ నమాజ్ చేసి అరుదైన వ్యక్తుల జాబితాలో చేరే ప్రయత్నం చేయాలి. తమ ప్రభువును కలుసుకునే, ఆయనతో సంభాషించే, ఆయనకు విన్నపాలు చేసుకునే సమయం ఇది!

(٢٩٣) وَعَنْ أَبِي أَيُّوبَ الأَنْصَارِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: **«الْوِتْرُ حَقٌّ عَلَى كُلِّ مُسْلِمٍ، مَنْ أَحَبَّ أَنْ يُوتِرَ بِخَمْسٍ فَلْيَفْعَلْ، وَمَنْ أَحَبَّ أَنْ يُوتِرَ بِثَلَاثٍ فَلْيَفْعَلْ، وَمَنْ أَحَبَّ أَنْ يُوتِرَ بِوَاحِدَةٍ فَلْيَفْعَلْ»**. رَوَاهُ الأَرْبَعَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَرَجَّحَ النَّسَائِيُّ وَقْفَهُ.

293. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: వితర్ ప్రతి ముస్లింపై గల హక్కు (అంటే దానిని నిర్వర్తించవలసిన బాధ్యత అతనిపై ఉంది). ఎవరికి ఐదు (రకాత్‌ల) వితర్ చేయటం ఇష్టమో అతను ఆ విధంగానే చేయాలి. మరెవరికి మూడు (రకతుల) వితర్ ఇష్టమో అతను ఆ మేరకే ఆచరించాలి. ఇంకా ఎవరికి ఒక (రకత్) వితర్ ఇష్టమో అతను తదనుగుణంగా పాటించాలి. ('నలుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అయితే నసాయి మాత్రం దీనిని 'మౌఖూఫ్' అని గట్టిగా తలపోశారు).

## సారాంశం

వితర్ నమాజ్ వాజిబా? లేక సున్నతా? ఈ విషయమై ఇమాముల మధ్య భేదాభిప్రాయం ఉంది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దీనిని 'వాజిబ్'గా భావిస్తున్నారు. కాగా; అత్యధిక మంది ఉలమా దీనిని సున్నత్‌గానే అభిప్రాయపడ్డారు. "వితర్ చదవటం హక్కు" అన్న వాక్యాన్నిబట్టి అది వాజిబ్ అన్న అర్థం మాత్రం రావటం లేదు. అయితే దీని ప్రాముఖ్యత మాత్రం విస్మరించరానిది. "వితర్ సత్యబద్ధమైనది. ఎవరు దీనిని చేయరో వారితో మాకు సంబంధం లేదు" అని ఒక హదీసు ఉంది. ఈ హదీసులో కూడా వితర్ నమాజ్ మహత్తు నొక్కి వక్కాణించబడిన సంగతి వాస్తవమేగాని 'వాజిబ్' అన్న పదం అందులోనూ లేదు. ఆయన (స) ప్రయాణ సమయాలలో కూడా వితర్ నమాజ్ చేసేవారు. వాహనంపై కూర్చుని కూడా వితర్ చేసేవారు. దీన్నిబట్టి ఈ

నమాజు మహత్తు తెలియవస్తుందేగాని అది వాజిబ్ (తప్పనిసరి) గావించబడిందన్న దానికి ఆధారం ఏదీ కనిపించటం లేదు.

ఈ హదీసును బట్టి వితర్ నమాజ్ ఒక రకత్ లేక మూడు రకతులు లేక ఐదు రకతులు చేయవచ్చునని బోధపడుతున్నది. హనఫీ ఫికహ్ ననుసరించేవారు మూడు రకతులు చేయవలసిందేనని అంటారు.

(٢٩٤) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: لَيْسَ الْوِتْرُ بِحَتْمٍ كَهَيْئَةِ الْمَكْتُوبَةِ، وَلٰكِنْ سُنَّةٌ سَنَّهَا رَسُولُ اللّٰهِ ﷺ: رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ وَحَسَّنَهُ، وَالْحَاكِمُ وَصَحَّحَهُ.

294. హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) కథనం : ఫర్జ్ నమాజుల మాదిరిగా వితర్ అనివార్యం కాదు. పైగా అది దైవప్రవక్త (సఅసం) నిర్ధారించిన సున్నత్ మాత్రమే." (తిర్మిజీ, నసాయి దీనిని ఉల్లేఖించారు. 'హసన్'గా ఖరారు చేశారు. హాకిమ్ మాత్రం దీనిని 'సహీహ్' అని అన్నారు).

**సారాంశం**

వితర్ నమాజ్ వాజిబ్ (తప్పనిసరి) కాదు అని చెప్పే అత్యధిక మంది విద్వాంసులు ఈ హదీసును నిదర్శనంగా చూపిస్తారు. ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ఈ హదీసును హసన్ (సుస్పష్టమైనది)గా నిర్ధారించగా ఇమామ్ హాకిమ్ (రహ్మ.లై) 'సహీహ్' (ప్రామాణికమైనది)గా ఖరారు చేశారు.

(٢٩٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَامَ فِي شَهْرِ رَمَضَانَ، ثُمَّ انْتَظَرُوهُ مِنَ الْقَابِلَةِ فَلَمْ يَخْرُجْ، وَقَالَ: إِنِّي خَشِيتُ أَنْ يُكْتَبَ عَلَيْكُمُ الْوِتْرُ. رَوَاهُ ابْنُ حِبَّانَ.

295. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ నెలలో (రాత్రిపూట) ఖియామ్ చేశారు. (సామూహికంగా వితర్ నమాజు చేయించారు). మరుసటి రోజు కూడా సహచరులు ఆయన (సఅసం) కొరకు నిరీక్షించారు. కాని ఆయన (స) తన కుటీరం నుంచి బయటికి రాలేదు. దీని గురించి ఆయన (స) ఇలా వ్యాఖ్యానించారు -"ఈ విత్ర్ నమాజ్ మీ కొరకు ఎక్కడ ఫర్జ్‌గా (విధిగా) చేయబడుతుందోనని నాకు భయమేసింది." (దీనిని ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖించారు)

(٢٩٦) وَعَنْ خَارِجَةَ ابْنِ حُذَافَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِنَّ اللّٰهَ أَمَدَّكُمْ بِصَلاَةٍ هِيَ خَيْرٌ لَكُمْ مِنْ حُمْرِ النَّعَمِ»، قُلْنَا: وَمَا هِيَ يَا رَسُولَ اللّٰهِ؟ قَالَ: «الْوِتْرُ، مَا بَيْنَ صَلاَةِ الْعِشَاءِ إِلَى طُلُوعِ الْفَجْرِ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

وَرَوَى أَحْمَدُ عَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ عَنْ أَبِيهِ عَنْ جَدِّهِ نَحْوَهُ.

296. హ్రజత్ ఖారిజ బిన్ హుజాఫా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ ఒక నమాజ్ ద్వారా మీకు సహాయపడ్డాడు. ఆ సహాయం మీ కొరకు ఎర్రని ఒంటెల కన్నా ఎంతో మేలైనది." 'ఓ దైవ ప్రవక్తా! ఆ నమాజ్ ఏది?' అని మేము విన్నవించుకోగా, "విత్ర్ నమాజ్. అది ఇషా మరియు ఉషోదయానికి మధ్యనున్నది" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు. ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అహ్మద్ గారు అమ్ర్ బిన్ షుఐబ్ నుండి, ఆయన తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుండి దీనిని సంగ్రహించారు.)

### సారాంశం

'సహాయం' అంటే అదేదో కొత్త వస్తువు అని భావించనవసరం లేదు. అది ముందు నుంచీ ఉన్నదే. దానికి బలం చేకూర్చడానికి ఈవిధంగా నొక్కిపలికారు. వితర్ నమాజ్‌కు గల ప్రాముఖ్యతను, మహత్తును నొక్కి వక్కాణించటం ఇక్కడ ముఖ్యోద్దేశం. ఈ నమాజును ఎర్రవి ఒంటెలతో పోల్చటం జరిగింది.

ఆనాడు అరేబియాలో ఎర్రని ఒంటె అత్యంత ఖరీదైన వాహనం. అది ఈనాటి మెర్సిడిస్ కారుకన్నా ఎంతో విలువైనది. -అనువాదకుడు)

### హదీసు ఉల్లేఖకులు

(1) ఖారిజ బిన్ హుజాఫ ఖురషీ అదవీ (రజి). గొప్ప శూరుడు. ఈయన వెయ్యి గుఱ్ఱాలకు సమానమని ప్రతీతి. అమ్ర్ బిన్ ఆస్ (రజి) మూడు వేల రౌతులను కోరగా హ్రజత్ ఉమర్ (రజి) ముగ్గురు శూరులను పంపించారు. వారిలో ఒకరు జుబైర్ బిన్ అవామ్, రెండవవారు మిఖ్దాద్ బిన్ అస్వద్, మూడవ వారు ఖారిజ బిన్ హుజాఫ. అమ్ర్ బిన్ ఆస్ (రజి) కోరిక మేరకు ఈయన ఈజిప్టుకు ఖాజీగా పంపబడ్డారు. హిజ్రీ 40 రమజాన్ నెలలో హత్యచేయబడ్డారు. అమ్ర్ బిన్ ఆస్ అని తలపోసి ఈయన్ని ఒక ఖారిజీ వర్గంవాడు హత్యచేశాడు. అప్పట్లో ఖవారిజ్ తిరుగుబాటు

దారులు ఒకే సమయంలో హజ్రత్ అలీని, హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్‌ను, అమీర్ ముఆవియాను హతమార్చాలని కుట్ర పన్నారు.

(2) అమ్ర్ బిన్ షుఐబ్ (రజి) : ఆయన వంశపరంపర ఈ విధంగా ఉంది - అమ్ర్ బిన్ షుఐబ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ సహ్మీ ఖురషీ మదనీ. మారుపేరు అబూ ఇబ్రాహీం. తాయఫ్‌లో స్థిరపడ్డారు. నసాయిగారు ఈయన్ని విశ్వసనీయులైన వ్యక్తిగా కితాబు ఇచ్చారు. హిజ్రీ 118లో మరణించారు.

(3) షుఐబ్ : నమ్మకస్థులైన తాబయి. ఈయన పిన్న వయస్కులుగా నుండగానే ఈయన తండ్రి ముహమ్మద్ మరణించారు. అందువల్ల ఈయన తాతగారైన అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈయన్ని తన సంరక్షణలోకి తీసుకున్నారు. అందువల్ల ఆయన సంగ్రహించిన హదీసు ప్రమాణ బద్ధమైనదిగా పరిగణించబడింది.

(٢٩٧) وَعَنْ عَبْدِ اللهِ ابْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيْهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عنه ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْوِتْرُ حَقٌّ، فَمَنْ لَمْ يُوتِرْ فَلَيْسَ مِنَّا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِسَنَدٍ لَيِّنٍ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَلَهُ شَاهِدٌ ضَعِيفٌ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ عِنْدَ أَحْمَدَ.

297. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ బురైద తన తండ్రి గారి ఆధారంగా ఉల్లేఖించారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "వితర్ సత్యబద్ధమైనది. ఎవరు వితర్ (నమాజ్) చేయలేదో వారితో మాకు ఎలాంటి సంబంధం లేదు" (అబూదావూద్ దీనిని బలహీనమైన ఆధారాలతో నకలు చేశారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు. అహ్మద్ గారి వద్ద దీనికి సంబంధించి సాక్ష్యం కూడా ఉంది. దాని ప్రకారం ఇది హజ్రత్ అబూ హురైర (రజి)చే ఉల్లేఖించబడింది).

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ బురైద (రహ్మ.లై)గారి మరోపేరు అబూ సహ్ల్. 'మర్వ్'లో ఖాజీగా నియమితులయ్యారు. ఎన్నదగిన, విశ్వసనీయులైన తాబయీలలో ఒకరు. మూడో తరానికి చెందినవారు. హిజ్రీ 115లో 'మర్వ్'లోనే మరణించారు.

(٢٩٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مَا كَانَ رَسُولُ اللهِ ﷺ يَزِيْدُ فِيْ رَمَضَانَ وَلاَ فِيْ غَيْرِهِ عَلَى إِحْدَى عَشْرَةَ رَكْعَةً، يُصَلِّيْ أَرْبَعاً، فَلاَ تَسْأَلْ عَنْ حُسْنِهِنَّ

298. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్‌లోనూ, రమజానేతర సమయాలలోనూ (రాత్రిపూట) 11 రకతుల కన్నా ఎక్కువ నమాజ్ చేయ

وَطُولِهِنَّ، ثُمَّ يُصَلِّي أَرْبَعاً، فَلاَ تَسْأَلْ عَنْ حُسْنِهِنَّ وَطُولِهِنَّ، ثُمَّ يُصَلِّي ثَلاَثاً، قَالَتْ عَائِشَةُ فَقُلْتُ: يَا رَسُولَ اللهِ أَتَنَامُ قَبْلَ أَنْ تُوتِرَ؟ قَالَ: يَا عَائِشَةُ إِنَّ عَيْنَيَّ تَنَامَانِ، وَلاَ يَنَامُ قَلْبِي. مُتَّفَقٌ عَلَيْهِ.

లేదు. 4 రకతులు బహుచక్కగా (నింపాదిగా) చేసేవారు. ఎంత చక్కగా చేసేవారంటే వాటి చక్కదనం మరియు సుదీర్ఘ ప్రక్రియ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ తర్వాత మరో నాలుగు రకతులు చేసేవారు. వాటిని నెరవేర్చిన తీరు గురించి, సుదీర్ఘ ప్రక్రియ గురించి ఏం చెప్పమంటారు?! తరువాత 3 రకతులు చేసేవారు. 'దైవప్రవక్తా! మీరు వితర్ చదవకుండానే నిద్రపోతున్నారా?' అని నేను విన్నవించుకోగా, "ఆయిషా! నా కళ్లు నిద్రిస్తాయి. మనసు మాత్రం నిద్రించదు" అని ఆయన (స) సెల విచ్చారు. (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لَهُمَا عَنْهَا رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا كَانَ يُصَلِّي مِنَ اللَّيْلِ عَشْرَ رَكَعَاتٍ، وَيُوتِرُ بِسَجْدَةٍ، وَيَرْكَعُ رَكْعَتَيِ الْفَجْرِ، فَتِلْكَ ثَلاَثَ عَشْرَةَ.

బుఖారీ, ముస్లిం రెండింటిలోనూ వేరొక ఉల్లేఖనంలో ఇలా అనబడింది - "రాత్రి ఆయన (స) 10 రకతులు చదివే వారు. ఆ తరువాత 1 వితర్ చేసేవారు. ఆ తరువాత ఫజ్ర్ యొక్క రెండు రకతులు చేసేవారు. ఇవన్నీ కలుపుకుని 13 రకతులయ్యేవి.

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక ముఖ్యాంశాలు మన ముందుకు వస్తున్నాయి -

(1) దైవప్రవక్త (సఅసం)గారి 'కళ్లు నిద్రించేవి, మనసు మాత్రం మేల్కొనే ఉండేది' - ఇది ఆయన (సఅసం)గారి ప్రత్యేకతలలో ఒకటి! దైవప్రవక్తలందరి మనసు సతతం మేల్కొనే ఉంటుందని, కళ్లు మాత్రం నిద్రిస్తాయని బుఖారీలోని మరో ఉల్లేఖనంలో ఉంది.

(2) మనసు నిద్రపోయేంత గాఢ నిద్రగనక వస్తే వుజూ భంగమైపోతుంది.

(3) తహజ్జుద్ నమాజును బాగా ఆగి ఆగి, ఉత్తమ రీతిలో చేయాలి.

(4) దైవప్రవక్త (సఅసం) తరావీహ్ నమాజు (వితర్ సహితంగా) 11 రకతులు మాత్రమే

చేశారని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ సందర్భంగా హ్రజత్ ఆయిషా (ర.అన్హా) గారి ఉల్లేఖనం ప్రాధాన్యతతో కూడుకున్నది. ఎందుకంటే ఆయన (స) ఈ ఆరాధనలను రాత్రి పూట ఇంటివద్దనే నెరవేర్చేవారు. ఆయన (స) ఇంట్లో చేసే ఆచరణలు, ముఖ్యంగా రాత్రిపూట చేసే ఆరాధనల గురించి ధర్మపత్నికి తెలిసి ఉన్నంతగా వేరొకరికి తెలిసివుండదు.

(5) హదీసు ఆఖరిలో, దైవప్రవక్త (స) 10 రకతుల తహజ్జుద్ నమాజ్ కూడా చేశారని, చివర్లో ఒక రకత్ వితర్ రూపంలో చేశారని వుంది. ఈ విధంగా 11 రకతులు అవుతాయి.

(6) ఆయన ఒక్కోసారి 13 రకతులు చేశారనీ చెప్పబడింది. వాటిలో 8 రకతులు నఫిల్ కాగా, మిగిలిన 5 రకతులు వితర్‌కు సంబంధించినవి.

(٢٩٩) وَعَنْهَا رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّيْ مِنَ اللَّيْلِ ثَلَاثَ عَشْرَةَ رَكْعَةً، يُوْتِرُ مِنْ ذٰلِكَ بِخَمْسٍ، لَا يَجْلِسُ فِيْ شَيْءٍ إِلَّا فِي آخِرِهَا.

299. హ్రజత్ ఆయిషా (ర.అన్హా) గారి మరో ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాత్రి పూట 13 రకతులు చదివేవారు. వాటిలో 5 వితర్‌కు సంబంధించినవి. ఈ ఐదు వితర్‌లలో తషహ్హుద్ కోసం ఆఖరి రకతులోనే కూర్చునేవారు.

(ముత్తఫఖున్ అలైహ్)

(٣٠٠) وَعَنْهَا رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مِنْ كُلِّ اللَّيْلِ قَدْ أَوْتَرَ رَسُولُ اللهِ ﷺ، وَانْتَهَى وِتْرُهُ إِلَى السَّحَرِ. مُتَّفَقٌ عَلَيْهِمَا.

300. హ్రజత్ ఆయిషా (ర.అన్హా) గారిదే ఇంకొక ఉల్లేఖనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాత్రి పూట అన్ని దశలలో విత్ర్ నమాజు చేశారు. ఆయన (స) విత్ర్ చేసిన ఆఖరి సమయం సహ్రీ సమయం.

(ముత్తఫఖున్ అలైహ్)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యిందేమిటంటే ఆయన (స) వితర్ నమాజును రాత్రి మొదటి భాగంలోనూ, నడిరేయిలోనూ, రాత్రి చివరి భాగంలోనూ చేశారు. వితర్ సమయం ఇషా నమాజు నుండి మొదలై తెల్లవారు జాము వరకూ ఉంటుంది. తహజ్జుద్ నమాజు చేసే అలవాటువున్నవారు వితర్‌ను రాత్రి చివరి భాగంలో చేయటం మంచిది. రాత్రి చివరి భాగంలో లేవలేనివారు ఇషా నమాజు తర్వాత వితర్ చేసుకోవాలి. ఒకవేళ ఏదయినా గత్యంతరం లేని పరిస్థితిలో వితర్ నమాజ్ రాత్రి చేయలేకపోతే ఫజ్ర్ నమాజ్‌కై జమాఅత్ నిలబడే వరకూ వితర్ చేయవచ్చు.

(٣٠١) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: «يَا عَبْدَ اللهِ لاَ تَكُنْ مِثْلَ فُلاَنٍ، كَانَ يَقُومُ مِنَ اللَّيْلِ. فَتَرَكَ قِيَامَ اللَّيْلِ». مُتَّفَقٌ عَلَيْهِ.

301. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాకిలా ఉపదేశించారు - "అబ్దుల్లాహ్! రాత్రిపూట దైవారాధన (ఖియాముల్లైల్)ను చేస్తూ తరువాత దాన్ని పరిత్యజించిన ఫలానా వ్యక్తి మాదిరిగా మారిపోకు." (ముస్లిం)

## సారాంశం

ఖియాముల్లైల్ (రాత్రిపూట ఆరాధనకై నిలబడటం) తప్పనిసరి కాదు గాని అది వాంఛనీయమైన ఆచరణే. సదాచరణను ఒకసారి మొదలెడితే దాన్ని నిరంతరం కొనసాగించటం, మధ్యలో విడనాడకుండా ఉండటం మంచిది. సదాచరణలో ఆరంభశూరత్వాన్ని కనబరచి తరువాత అలసత్వం కనబరచటం, బద్ధకంతో ఆ పనిని విడనాడటం వాంఛనీయం కాదు. పైగా ఆ పనిని ఎడతెగకుండా చేయాలి. దైవ ప్రవక్త (సఅసం) ఎప్పుడయినా ఏదయినా ఒక ఆచరణను ప్రారంభిస్తే - అది సాధారణ ఆచరణ అయినా సరే - దానిని కొనసాగించేవారు.

ఈ హదీసు ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే; ఒకరి చెడు అలవాటును ఇతరుల ముందు ప్రస్తావించవలసి వచ్చినపుడు అతని పేరును ప్రస్తావించరాదు. రాత్రిపూట తహజ్జుద్ నమాజును పరిత్యజించిన వ్యక్తి పేరును దైవప్రవక్త (స) మరుగుపరచటం గమనార్హం.

(٣٠٢) وَعَنْ عَلِيِّ بْنِ أَبِيْ طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَوْتِرُوا يَا أَهْلَ الْقُرْآنِ! فَإِنَّ اللَّهَ وِتْرٌ، يُحِبُّ الْوِتْرَ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

302. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) ఉల్లేఖించారు: "ఓ ఖుర్ఆన్ వారలారా! వితర్ చదవండి. అల్లాహ్ స్వయంగా వితర్. ఆయన వితర్‌ను ఇష్టపడతాడు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

## సారాంశం

'ఖుర్ఆన్ వారలారా!' అనేది ముఖ్యంగా 'హాఫిజె ఖుర్ఆన్'లకు వర్తిస్తుంది. హదీసులో 'వితర్' అంటే రాత్రిపూట దైవసన్నిధిలో నిలబడి దైవారాధన చేయటం అని భావం. ఈ ఆరాధనవల్ల

దైవసామీప్యం లభించటంతోపాటు, ఖుర్‌ఆన్‌ను జ్ఞాపకముంచుకోవటానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

(٣٠٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «اِجْعَلُوا آخِرَ صَلَاتِكُمْ بِاللَّيْلِ وِتْرًا». مُتَّفَقٌ عَلَيْهِ.

303. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మీరు రాత్రి యొక్క చివరి నమాజును వితర్ రూపంలో చేయండి"

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఈ ఉపదేశం కూడా 'వాజిబ్' కాదు; ముస్తహబ్ మాత్రమే. ఒకవేళ ఎవరయినా రాత్రి తొలి భాగంలోనే వితర్ చదివి పడుకుంటే, రాత్రి మధ్య భాగంలోనో, రాత్రి చివరి భాగంలోనో మెలకువవస్తే అప్పుడతను తాను తలచుకున్న నమాజ్‌ను చేయవచ్చుగానీ వితర్ చేయకూడదు. వితర్ చేసిన తరువాత రెండు రకతులు చదివితే అందులో దోషం లేదు. దైవప్రవక్త (సఅసం) స్వయంగా వితర్ నమాజ్ తర్వాత కూడా రెండు రకతులు కూర్చుని చదివేవారని సహీహ్ ముస్లింలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది.

(٣٠٤) وَعَنْ طَلْقِ بْنِ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَقُولُ: لَا وِتْرَانِ فِي لَيْلَةٍ. رَوَاهُ أَحْمَدُ وَالثَّلَاثَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

304. హజ్రత్ తల్ఖ్ బిన్ అలీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా నేను విన్నాను - "ఒకే రాత్రి రెండుసార్లు వితర్ ఉండదు." (అహ్మద్ మరియు ముగ్గురు - తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

### సారాంశం

ఒకేరాత్రి రెండు సార్లు వితర్ నమాజ్ చేయరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఒకవేళ రాత్రి తొలిభాగంలో వితర్ చదివి ఉండి రాత్రి చివరి భాగంలో మేల్కొంటే - అప్పుడు ఒక రకత్ నమాజ్ చేసి - వెనుకటి నమాజులను సరిసంఖ్యలో లెక్కించుకోవాలనీ, ఆ తరువాత నఫిల్ నమాజులు నెరవేర్చి, చివర్లో వితర్ నమాజు చేయవచ్చుననీ కొంతమంది సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. కాని ఈ సర్దుబాటు హదీసు ఉపదేశానికి విరుద్ధమైనది. మరిన్ని వివరాల కోసం ఇమామ్ మరూజీ (రహ్మ.లై) గారి 'ఖియాముల్లైల్'ను అధ్యయనం చేయగలరు.

(٣٠٥) وَعَنْ أُبَيِّ بْنِ كَعْبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ يُوتِرُ «بِسَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى» وَ«قُلْ يَا أَيُّهَا الْكَافِرُونَ» و«قُلْ هُوَ اللّٰهُ أَحَدٌ» رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَزَادَ: وَلَا يُسَلِّمُ إِلَّا فِي آخِرِهِنَّ.

305. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు రకతుల వితర్ (నమాజు)లో క్రమంగా ఈ సూరాలు పఠించేవారు - మొదటి రకత్‌లో సబ్బిహిస్మ రబ్బికల్ అలా, రెండవ రకత్‌లో ఖుల్ యా అయ్యుహల్ కాఫి రూన్, మూడవ రకత్‌లో ఖుల్‌హు వల్లాహు అహద్ చదివేవారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ''చివరి రకత్‌లో సలాం చేసేవారు'' అన్న వాక్యాన్ని నసాయి అదనంగా చేర్చారు.)

وَلِأَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ نَحْوُهُ عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، وَفِيهِ: كُلُّ سُورَةٍ فِي رَكْعَةٍ، وَفِي الْأَخِيرَةِ «قُلْ هُوَ اللّٰهُ أَحَدٌ» وَ«الْمُعَوِّذَتَيْنِ».

అబూదావూద్ తిర్మిజీలు కూడా హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా)ఉల్లేఖనాన్ని ఇదే విధంగా నకలు చేశారు. అందులో ఇలా వుంది - ''ప్రతి రకత్‌లో ఒక సూరా పఠించేవారు. చివరి రకత్‌లో మాత్రం ఖుల్‌హు వల్లాహు అహద్‌తోపాటు ముఅవ్వజతైన్ పఠించేవారు. ''

## సారాంశం

దైవప్రవక్త (సఅసం) మూడు రకతుల వితర్ నమాజు చేసేవారనీ, ప్రతి రకతులో ఫాతిహా సూరాతోపాటు వేరొక సూరా కూడా పఠించేవారనీ, ఆఖరి రకత్‌లో మాత్రం దివ్య ఖుర్‌ఆన్‌లోని చిట్టచివరి మూడు సూరాలు పారాయణం చేసేవారనీ పై హదీసు ద్వారా స్పష్టమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

ఉబై బిన్ కాబ్ (రజి) అసలు పేరు. అబూ ముంజిర్ మారుపేరు. అన్సార్లకు చెందిన ఖజ్రజ్ తెగలోని నజ్జార్ అనే ఉపతెగకు చెందినవారు. అందువల్ల అన్సారీ, ఖజ్రజీ, నజ్జారీగా పిలువబడ్డారు. ఖుర్‌ఆన్ విద్వాంసులకు గురువు. అందుచేత 'సయ్యిదుల్ ఖుర్రా' అనే బిరుదు పొందారు. దైవప్రవక్త (సఅసం)పై అవతరించే 'వహీ'ని లిఖించే వారిలో ఈయన కూడా ఒకరు. దైవప్రవక్త (స) హయాంలో ధార్మిక తీర్పులు (ఫత్వాలు) కూడా జారీ చేసేవారు. రెండవ అఖబా ఒప్పందంలో పాల్గొన్నారు. బద్ర్ యుద్ధంలోనూ, ఆ తరువాతి యుద్ధాలలోనూ పాల్గొన్నారు. ఈయన మరణకాలం

గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. హిజ్రీ 19 నుండి హిజ్రీ 33 వరకు గల మధ్య కాలంలో మరణించి ఉంటారని చెప్పబడుతోంది. వాస్తవం దైవానికే ఎరుక.

(٣٠٦) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «أَوْتِرُوا قَبْلَ أَنْ تُصْبِحُوا». رَوَاهُ مُسْلِمٌ.

306. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "తెల్లవారక ముందే వితర్ చదువు కోండి." (ముస్లిం)

وَلِابْنِ حِبَّانَ: مَنْ أَدْرَكَ الصُّبْحَ وَلَمْ يُوتِرْ، فَلاَ وِتْرَ لَهُ.

ఇబ్నె హిబ్బాన్‌లో ఉంది - "ఎవరయితే తెల్లవారే వరకూ వితర్ చదవలేదో వారి వితర్ వితరే కాదు."

**సారాంశం**

ఉషోదయం కాక మునుపు వరకూ వితర్ నమాజ్‌కు అవకాశం ఉందని ఈ హదీసు చెబుతోంది. ఉషోదయం అవగానే వితర్ వేళ దాటిపోతుంది. ఆ తర్వాత దాన్ని నెరవేర్చినా అది వితర్ అనిపించుకోదు. మరి 'ఖజా' సంగతేమిటి? దాన్ని ఎప్పుడయినా చేయవచ్చు. రాబోయే హదీసు దీన్ని వివరిస్తోంది.

(٣٠٧) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «مَنْ نَامَ عَنِ الْوِتْرِ أَوْ نَسِيَهُ، فَلْيُصَلِّ إِذَا أَصْبَحَ أَوْ ذَكَرَ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

307. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "వితర్ చదవకుండానే నిద్రపోయిన వారు లేదా మరుపునకు గురయిన వారు ఉదయం పూట నెరవేర్చాలి లేదా తమకు జ్ఞాపకం వచ్చినపుడు చేయాలి" ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు దీనిని ఉల్లేఖించారు).

**సారాంశం**

ఏ కారణంగానయినా రాత్రి వితర్ నమాజ్‌ను నెరవేర్చలేకపోయిన వారు దాన్ని మొత్తానికి పూర్తి చేసుకోవాలని హదీసు చెబుతున్నది. ఈ హదీసును బట్టి కూడా వితర్ నమాజుకు గల ప్రాముఖ్యత తెలియవస్తున్నది.

(٣٠٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «مَنْ خَافَ أَنْ لاَ

308. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి

يَقُومَ مِنْ آخِرِ اللَّيْلِ فَلْيُوتِرْ أَوَّلَهُ، وَمَنْ طَمِعَ أَنْ يَقُومَ آخِرَهُ فَلْيُوتِرْ آخِرَ اللَّيْلِ، فَإِنَّ صَلَاةَ آخِرِ اللَّيْلِ مَشْهُودَةٌ، وَذَلِكَ أَفْضَلُ». رَوَاهُ مُسْلِمٌ.

వ సల్లం) ఇలా ఉపదేశించారు: "రాత్రి చివరి భాగంలో మెలకువ రాదేమోనన్న భయం వున్నవారు రాత్రి తొలి భాగం లోనే వితర్ నమాజ్ చేసుకోవచ్చు. రాత్రి చివరి భాగంలో మేల్కోగలనన్న నమ్మకం, భరోసా వున్నవారు రాత్రి చివరి భాగంలోనే వితర్ నమాజ్ చేయటం మంచిది. ఎందుకంటే రాత్రి చివరి భాగంలో చేసే నమాజ్కై దైవదూతలు హాజరవుతారు. ఇదెంతో శుభకర మైనది." (ముస్లిం)

**సారాంశం**

దైవదూతలు కూడా సృష్టితాలేననీ, వాళ్ళూ తమ తమ డ్యూటీని నిర్వర్తిస్తారనీ, వారి డ్యూటీ వేళలు కూడా మారుతూ ఉంటాయనీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. రాత్రి చివరి భాగంలో వితర్ నమాజ్ చేయటం ఎంతో శ్రేష్ఠమని కూడా విదితమవుతున్నది. మెలకువ వచ్చే అవకాశముంటే చివర్లోనే ఈ నమాజ్ చేయాలి. ఒకవేళ మెలకువ రాదన్న సంశయం వుంటే మాత్రం వితర్ చేసి నిద్రపోవటం మంచిది.

(٣٠٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا طَلَعَ الْفَجْرُ، فَقَدْ ذَهَبَ وَقْتُ كُلِّ صَلَاةِ اللَّيْلِ، وَالْوِتْرِ، فَأَوْتِرُوا قَبْلَ طُلُوعِ الْفَجْرِ». رَوَاهُ التِّرْمِذِيُّ.

309. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు - "ఉషోదయం అయిందంటే చాలు, వితర్ సమేతంగా రాత్రిపూట చదవవలసిన నమాజులన్నింటి వేళ దాటి పోయినట్లే లెక్క." (తిర్మిజీ)

(٣١٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي الضُّحَى أَرْبَعاً، وَيَزِيدُ مَا شَاءَ اللَّهُ. رَوَاهُ مُسْلِمٌ.

310. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం :దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుహా నమాజు (చాష్త్ నమాజ్) లో నాలుగు రకతులు చేసేవారు. దైవ చిత్తమయిన మేరకు ఇంకా ఎక్కువ కూడా చేసేవారు." (ముస్లిం)

وَلَهُ عَنْهَا أَنَّهَا سُئِلَتْ: هَلْ كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي الضُّحَى؟ قَالَتْ: لاَ إِلاَّ أَن يَجِيءَ مِن مَغِيبِهِ.

ముస్లింలోనే హ్రజత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనంలో వుంది - దైవ ప్రవక్త (సఅసం) జుహా నమాజ్ చేసే వారా? అని ఆమెను ప్రశ్నించగా 'లేదు- ప్రయాణం నుంచి వాపసు అయి నప్పుడు మాత్రమే అలా చేసేవారు' అని ఆమె సమాధానమిచ్చారు.

وَلَهُ عَنْهَا: مَا رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي سُبْحَةَ الضُّحَى قَطُّ، وَإِنِّي لأُسَبِّحُهَا.

ముస్లింలోనే హ్రజత్ ఆయిషా (ర.అన్‌హా) గారి ఉల్లేఖనం ఈ విధంగా కూడా ఉంది - "నేను దైవప్రవక్త (సఅసం)ను జుహా నమాజు చేస్తుండగా ఎన్నడూ చూడలేదు. అయినప్పటికీ నేను నఫిల్ నమాజులు చేస్తాను."

**సారాంశం**

'నమాజె ఇష్రాఖ్', 'సలాతె జుహా', 'సలాతె అవ్వాబీన్' - ఇవి మూడూ వేర్వేరు నమాజులా లేక ఒకే నమాజు యొక్క వేర్వేరు పారిభాషిక పదాలా? అరబీ భాష ఎంతో విస్తృతమయినది. ఇందులో ఒకే వస్తువు అసంఖ్యాకమయిన పదాలలో వర్ణించబడుతుంది.

'తబ్రానీ'లోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది : - దైవప్రవక్త (సఅసం) తమ బంధుత్వ వరుసకు సోదరి అయ్యే ఉమ్మె హానీ (ర.అన్‌హా) ఇంట నమాజు చేశారు. ఉమ్మె హానీని పిలిచి, "ఇది ఇష్రాఖ్ నమాజు" అని తెలియజేశారు.

హ్రజత్ అనస్ (రజి) గారి ఒక ఉల్లేఖనం ప్రకారం ఇది "సలాతె జుహా" అని తెలుస్తోంది. ఈ నమాజు సూర్యోదయం అయినప్పటినుండి సూర్యుడు (పగలులో) నాల్గోవంతు పైకెక్కేవరకూ చేయబడింది.

అవ్వాబీన్ నమాజ్ వేళ ఎండ ముదిరిన తరువాత మొదలవుతుంది. అంటే సూర్యుడు బాగా పైకెక్కేవరకూ చేయవచ్చన్నమాట!

మరి కొంతమంది అభిప్రాయంలో ఈ మూడు నమాజులూ వాస్తవానికి ఒక్కటే. కాకపోతే వాటి పేర్లు మాత్రం విభిన్నం. ఇష్రాఖ్ నమాజునూ, జుహా నమాజు ఒక్కటేననీ, అవ్వాబీన్ నమాజు మాత్రం వేరని ఇంకొందరి అభిప్రాయం.

ఇంతకీ జుహా నమాజులోని రకతులు ఎన్ని? అన్నది అసలు ప్రశ్న. కనీస రకతులు రెండనీ, గరిష్ట సంఖ్య పన్నెండనీ హదీసు ద్వారా తెలుస్తోంది.

(٣١١) وَعَنْ زَيْدِ بْنِ أَرْقَمَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: «صَلَاةُ الْأَوَّابِينَ حِينَ تَرْمَضُ الْفِصَالُ». رَوَاهُ التِّرْمِذِيُّ.

311. హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "అవ్వాబీన్ నమాజ్ వేళ (ఆడ) ఒంటె దూడలు ఎండను, గ్రీష్మతాపాన్ని ఆస్వాదించ సాగినపుడు మొదలవుతుంది." (తిర్మిజీ)

(٣١٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنْ صَلَّى الضُّحَى ثِنْتَيْ عَشْرَةَ رَكْعَةً، بَنَى اللّٰهُ لَهُ قَصْراً فِي الْجَنَّةِ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَاسْتَغْرَبَهُ.

312. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరయితే జుహా నమాజ్ (చాష్త్ నమాజ్)యొక్క 12 రకతులు చదివాడో అతని కొరకు అల్లాహ్ స్వర్గంలో మేడను నిర్మిస్తాడు." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు గాని దీనిని సందేహాస్పదమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా చాష్త్ నమాజ్ మహత్తు తెలియ వస్తోంది. అయితే ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ఈ హదీసును 'గరీబ్'గా ఖరారు చేశారు. ఈ నమాజు ప్రాముఖ్యతను చాటే హదీసులు ఇంకా అనేకం ఉన్నాయిగాని అవన్నీ 'జయీఫ్' హదీసుల కోవకు చెందినవే.

(٣١٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ رَسُولُ اللّٰهِ ﷺ بَيْتِي، فَصَلَّى الضُّحَى ثَمَانِيَ رَكَعَاتٍ. رَوَاهُ ابْنُ حِبَّانَ فِي صَحِيحِهِ.

313. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా కుటీరానికి విచ్చేసి, జుహా నమాజ్‌కి సంబంధించిన ఎనిమిది రకతులు నెరవేర్చారు. (ఇబ్నె హిబ్బాన్ దీనిని తన సహీహ్‌లో ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా దైవప్రవక్త (సఅసం) గారు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కుటీరంలో 8 రకతుల జుహా నమాజ్ చేసినట్టు రూఢీ అవుతోంది. బహుశా ఇది దైవప్రవక్త (స) ప్రయాణం నుంచి తిరిగి వచ్చిన పిదప చేసిన నమాజ్ అయివుండవచ్చు. నమాజె జుహా ప్రయోజనాలు 'ముస్లిం' లోని ఉల్లేఖనంలో క్షుణ్ణంగా తెలుపబడ్డాయి - మనిషి యొక్క ఒక్కో కీలుకు ఒక్కో హక్కును నెరవేర్చాల్సిన బాధ్యత ఉంటుంది. మానవ శరీరంలో 307 కీళ్ళు ఉంటాయి. ఈ

నమాజులోని రెండు రకతుల్ని నెరవేర్చటం ద్వారా కీళ్ళన్నింటిపై మోపబడివున్న బాధ్యత నెరవేరినట్లవుతుంది.

10వ అధ్యాయం

## సామూహిక నమాజ్ మరియు ఇమామత్

## ١٠ - بَابُ صَلاةِ الْجَمَاعَةِ وَالإِمَامَةِ

314. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "సామూహికంగా చేసే నమాజ్ ఒంటరిగా చేసే నమాజ్ కన్నా ఇరవై ఏడు రెట్లు శ్రేష్ఠమయినది." (బుఖారీ, ముస్లిం)

(٣١٤) عَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «صَلاَةُ الْجَمَاعَةِ أَفْضَلُ مِنْ صَلاَةِ الْفَذِّ بِسَبْعٍ وَعِشْرِينَ دَرَجَةً». مُتَّفَقٌ عَلَيْهِ.

బుఖారీ మరియు ముస్లింలోనే హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనంలో "ఇరవై అయిదు రెట్లు పుణ్యం అధికంగా లభిస్తుంది" అని వుంది.

وَلَهُمَا عَنْ أَبِي هُرَيْرَةَ: «بِخَمْسٍ وَعِشْرِينَ جزءًا» وَكَذَا لِلْبُخَارِيِّ عَنْ أَبِي سَعِيْدٍ، وَقَالَ: «دَرَجَةً».

బుఖారీలో - హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనంలో 'రెట్లు' బదులు 'అంతస్థు' అనే పదం వుంది.

**సారాంశం**

నమాజ్‌ను సామూహికంగా (జమాఅత్‌తో కలసి) చేయటం వాజిబ్ (తప్పనిసరి)కాదు అని వాదించేవారికి ఈ హదీసు ద్వారా పరోక్షంగా సమర్థన లభిస్తోంది. ఒంటరిగా చేసే నమాజ్‌లో పెక్కు కారణాల దృష్ట్యా శుభాలు క్షీణిస్తాయి అన్నది నిర్వివాదాంశమేగాని నమాజ్ నెరవేరకపోయే ప్రశ్న మాత్రం తలెత్తదు. ఒకవేళ ఫర్జ్ నమాజ్‌ను సామూహికంగా చేయాలన్నది 'వాజిబ్'గా నిర్ధారించబడి వుంటే ఒంటరిగా నెరవేర్చేవాని నమాజ్ ధర్మసమ్మతం అయ్యేది కాదు. కాని వాస్తవానికి అలా కాలేదు. కనుక ఫర్జ్ నమాజును జమాఅత్‌తో కలసి చేయటాన్ని "సున్నతె ముఅక్కద"గా భావించాలి.

315. హజ్రత్ అబూహురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "ఎవరి

(٣١٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «وَالَّذِي

نَفْسِي بِيَدِهِ، لَقَدْ هَمَمْتُ أَنْ آمُرَ بِحَطَبٍ فَيُحْتَطَبَ، ثُمَّ آمُرَ بِالصَّلَاةِ فَيُؤَذَّنَ لَهَا، ثُمَّ آمُرَ رَجُلاً فَيَؤُمَّ النَّاسَ، ثُمَّ أُخَالِفَ إِلَى رِجَالٍ لاَ يَشْهَدُونَ الصَّلَاةَ فَأُحَرِّقَ عَلَيْهِمْ بُيُوتَهُمْ، وَالَّذِي نَفْسِي بِيَدِهِ لَوْ يَعْلَمُ أَحَدُهُمْ أَنَّهُ يَجِدُ عَرْقاً سَمِيناً، أَوْ مِرْمَاتَيْنِ حَسَنَتَيْنِ لَشَهِدَ الْعِشَاءَ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షి! కట్టెల్ని ప్రోగుచేయమని ఆజ్ఞాపించి, తరువాత నమాజ్ కోసం (అజాన్) పిలుపు ఇవ్వమని ఆదేశించి, ఆ తరువాత ఎవరినయినా నమాజ్ చేయించమని చెప్పి, నమాజ్‌కు రాకుండా ఇండ్లల్లో కూర్చున్న వారి వైపుకు నేను స్వయంగా వెళ్ళి - వారలా కూర్చుని ఉండగానే - వారి ఇళ్ళకు నిప్పు అంటించాలని నాకనిపిస్తోంది. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను! (వీళ్లు ఎలాంటి వారంటే) మాంసంతో కూడిన ఒక లావుపాటి ఎముక దొరుకుతుందని వీళ్లకు తెలిసినా లేదా (గొఱ్ఱె) కాళ్లు రెండు లభ్యమవుతాయని తెలిసినా ఇషా నమాజుకు ఎగబడి వచ్చేవాళ్లు" (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ నుండి గ్రహించబడ్డాయి).

**సారాంశం**

ఫర్జ్ నమాజును జమాఅత్‌తో కలసి చేయటం చాలా ముఖ్యమనీ, ఇది 'ఫర్జె ఐన్' అనీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. ఇది ఫర్జె కిఫాయగానీ, సున్నతె ముఅక్కద గానీ కాదు. ఇదే గనక ఫర్జె ఐన్ కాకపోతే దీన్ని విడనాడిన వారికి ఇంత తీవ్రమైన హెచ్చరిక చేయబడేది కాదు. జాహిరియ, అతా, ఔజాయి, ఇమామ్ అహ్మద్, అబూ సూర్, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె ముంజిర్, ఇబ్నె హిబ్బాన్ తదితరులందరూ జమాఅత్‌తో కలసి నమాజ్ చేయటం ఫర్జ్ అని అంటున్నారు. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ.లై) మాత్రం దీనిని 'ఫర్జె కిఫాయ' గా పరిగణిస్తున్నారు. అంటే కొంతమంది సామూహికంగా చేస్తే చాలు, మిగిలిన వారు జవాబుదారులు కారు అని దీని భావం. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో సామూహిక నమాజ్ 'సున్నతె ముఅక్కద' - ఇది 'ఫర్జె కిఫాయ' కానేకాదు, ఒకవేళ ఇది 'ఫర్జె కిఫాయ' అయి వుంటే జమాఅత్ కొరకు రానివారి ఇళ్లకు నిప్పు అంటించాలన్న ఆగ్రహం వ్యక్తమయ్యేదే కాదు. ఫర్జె కిఫాయ ప్రకారం చూస్తే కొద్దిమంది జమాఅత్‌కు వచ్చి, జమాఅత్‌ను నెలకొల్పితే సరిపోతుందాయె!

(٣١٦) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «أَثْقَلُ الصَّلَاةِ عَلَى الْمُنَافِقِينَ صَلَاةُ الْعِشَاءِ وَصَلَاةُ الْفَجْرِ، وَلَوْ يَعْلَمُونَ مَا فِيهِمَا لَأَتَوْهُمَا وَلَوْ حَبْوًا». مُتَّفَقٌ عَلَيْهِ.

316. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వ్యాఖ్యానించారు - "కపటుల (మునాఫిఖ్‌ల) పాలిట అన్నిటికన్నా ఇషా మరియు ఫజ్ర్ నమాజులు భారంగా, కష్టంగా పరిణమిస్తాయి. ఈ రెండింటికీ హాజరవటం వల్ల ఎంత (గొప్ప) పుణ్యఫలం ప్రాప్తమవుతుందో వారికి బోధపడి ఉంటే వాళ్లు అవశ్యంగా వచ్చేవాళ్లు-మోకాళ్ళ ఆధారంగా రావలసి వచ్చినా వెనుకాడే వారు కాదు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇషా నమాజ్ భారంగా ఎందుకనిపిస్తుందంటే పగలంతా శ్రమించిన వారు అలసిసొలసి వుంటారు. తియ్యని నిద్ర ముంచుకొస్తూ ఉంటుంది. ఇప్పుడు మస్జిద్ దాకా ఎందుకులే, ఇంట్లోనే నమాజ్ చేసి పడుకో అని మనసు పురికొల్పుతుంది. మనోవాంఛకు లొంగిపోయి సామూహికతకు ఉన్న ప్రాముఖ్యతను మనిషి విస్మరిస్తాడు. ఇక ఫజ్ర్ నమాజ్‌కు ఎందుకు రాలేకపోతాడంటే, నిద్రమత్తుకు లోనైవున్న వారిని షైతాన్ లాలించి, బుజ్జగించి పడుకోబెడతాడు. అయితే సజ్జనులైన దాసులు మాత్రం అజాన్ పిలుపు విన్నంతనే మనోవాంఛలకు, షైతాన్ లాలింపులకు లొంగిపోకుండా సరాసరి మస్జిద్ వైపునకు కదలివస్తారు.

(٣١٧) وَعَنْهُ قَالَ: أَتَى النَّبِيَّ ﷺ رَجُلٌ أَعْمَى فَقَالَ: يَا رَسُولَ اللّٰهِ! إِنَّهُ لَيْسَ لِيْ قَائِدٌ يَقُودُنِيْ إِلَى الْمَسْجِدِ، فَرَخَّصَ لَهُ، فَلَمَّا وَلَّى

317. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: ఒక అంధుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలోకి వచ్చి, 'ఓ దైవప్రవక్తా(స)! నన్ను మస్జిద్ వరకూ తీసుకుని వచ్చే వారెవరూ లేరు' అని విన్నవించుకున్నాడు. (ఆ వ్యక్తి ఇంట్లోనే నమాజ్ చేసుకునేందుకు) దైవప్రవక్త (సఅసం) అతన్ని అనుమతించారు. కాని అతను తిరిగి వెళుతుండగా ఆయన (స) అతన్ని వెనక్కి

دَعَاهُ فَقَالَ: «هَلْ تَسْمَعُ النِّدَاءَ بِالصَّلَاةِ؟» قَالَ: نَعَمْ، قَالَ: «فَأَجِبْ». رَوَاهُ مُسْلِمٌ.

పిలిపించి "నీకు అజాన్ పిలుపు వినవస్తుందా?" అని అడిగారు. దానికి 'అవున'న్నాడా వ్యక్తి. "అయితే నీవు అజాన్‌కు బదులు ఇవ్వాల్సిందే (అంటే మస్జిద్‌కు వచ్చి సామూహిక నమాజ్ చేయాల్సిందే)" అని సెలవిచ్చారాయన (స). (ముస్లిం)

**సారాంశం**

అజాన్ పిలుపు చెవిన పడిన తరువాత వికలాంగుడైన వ్యక్తి సయితం మస్జిద్‌కు రావలసిందేనని ఈ హదీసు చెబుతోంది. వికలాంగుడు ఇంట్లో నమాజ్ చేసుకుంటే అతని నమాజ్ స్వీకారయోగ్యమయితే అవుతుంది గాని సామూహిక నమాజ్‌లోని శుభాలు మాత్రం ప్రాప్తమవవు. ఎవరయినా అజాన్ పిలుపు వినకపోతే వారి సంజాయిషీ స్వీకారయోగ్యమే. అయితే అజాన్ పిలుపు విన్న మీదట వంకలు పెట్టడానికి వీలుండదు. కాకపోతే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం షరీయత్ మినహాయింపునిస్తుంది. ఉదాహరణకు - వర్షం, తుఫాను, తీవ్రమయిన ఆకలిబాధ, మలమూత్ర విసర్జన, వ్యాధిగ్రస్తత, శత్రు భయం లాంటి కారణాలుంటే అప్పుడు జమాఅత్‌లో వచ్చి కలవక పోయినా క్షమార్హమే.

(٣١٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ سَمِعَ النِّدَاءَ فَلَمْ يَأْتِ فَلَا صَلَاةَ لَهُ إِلَّا مِنْ عُذْرٍ». رَوَاهُ ابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَإِسْنَادُهُ عَلَى شَرْطِ مُسْلِمٍ، لٰكِنْ رَجَّحَ بَعْضُهُمْ وَقْفَهُ.

318. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "అజాన్ పిలుపు విన్న మీదట సామూహిక నమాజ్‌లో పాల్గొనని వ్యక్తి కోసం మరే నమాజూ లేదు - ఏదయినా బలమైన (షరీయత్ పరమైన) కారణముంటే తప్ప!" (ఇబ్నెమాజ, దారెఖుత్నీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ఉల్లేఖించారు. దీని ఆధారం 'ముస్లిం' నిబంధనకు అనుగుణంగా ఉంది. అయితే కొంత మంది దీన్ని 'మౌఖూఫ్' అనడానికే ప్రాధాన్యత ఇచ్చారు).

**సారాంశం**

ఈ హదీసు ద్వారా కూడా మనిషి సామూహిక నమాజ్‌లో పాల్గొనవలసిన ఆవశ్యకత తెలియవస్తోంది. అబూదావూద్‌లో - ఈ హదీసు చివర్లో ప్రియ సహచరులు దైవప్రవక్త (స)

నుద్దేశ్యించి, "ఆ బలమైన కారణమేమిటీ?" అని విన్నవించుకోగా, "(శత్రు) భయం మరియు వ్యాధి" అని దైవప్రవక్త (స) జవాబిచ్చారు. పెనుగాలులు, భారీ వర్షంతో పాటు క్రింది కారణాల వల్ల కూడా మనిషికి సామూహిక నమాజ్ నుండి మినహాయింపు లభిస్తుందని వేరొక హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అవేమంటే, పచ్చి ఉల్లిగడ్డ, వెల్లుల్లి లాంటివి అప్పుడే తిని వుంటే వారు మస్జిద్‌లోకి రాకూడదు. ఎందుకంటే వాటి వల్ల నోటినుండి అదో రకమయిన - ఇతరుల్ని ఇబ్బందుల్లోపెట్టే - వాసన వస్తుంది. ఈ కారణంగా సాటి నమాజీలకు బాధ కలుగుతుంది. అలాగే ధూమపానం, పొగాకు నమలటం, జర్దా కిళ్లీలు నమలటం వంటివి తీరా సామూహిక నమాజ్‌కు ముందు చేయరాదు. దీనివల్ల సాటి దైవదాసులను నమాజ్‌లో మానసిక క్షోభకు గురిచేసి, వారి ఏకాగ్రతను భంగపరచినట్లవుతుంది. ముస్లిం అనేవాడు తన ఇరుగు పొరుగువారిని వేధించకూడదు కదా!

(٣١٩) وَعَنْ يَزِيْدَ بْنِ الْأَسْوَدِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ صَلَّى مَعَ رَسُوْلِ اللّٰهِ ﷺ صَلَاةَ الصُّبْحِ، فَلَمَّا صَلَّى رَسُوْلُ اللّٰهِ ﷺ، إِذَا هُوَ بِرَجُلَيْنِ لَمْ يُصَلِّيَا، فَدَعَا بِهِمَا، فَجِيءَ بِهِمَا، تَرْعَدُ فَرَائِصُهُمَا، فَقَالَ لَهُمَا: «مَا مَنَعَكُمَا أَنْ تُصَلِّيَا مَعَنَا»؟ قَالَا: قَدْ صَلَّيْنَا فِيْ رِحَالِنَا، قَالَ: «فَلَا تَفْعَلَا، إِذَا صَلَّيْتُمَا فِيْ

319. హ॥జత్ యజీద్ బిన్ అస్వద్ (రజి) కథనం: ఆయన దైవప్రవక్త (సఅసం)తో కలసి ఫజ్ర్ నమాజ్ చేశారు. దైవప్రవక్త (సఅసం) దృష్టి నమాజ్‌ను ముగించిన పిదప ఇద్దరు వ్యక్తులపై పడింది. వాళ్ళిద్దరూ (ఆయన -స-తో కలిసి) నమాజ్ చేయలేదు. ఆయన (స) వారిద్దరినీ తన దగ్గరకు పిలిచారు. వారిరువురూ ఆయన (స) సమక్షంలో హాజరు పరచబడ్డారు. (భయంతో) వాళ్ల శరీరాలు ఒణుకుతున్నాయి. "మీరు మా వెంట నమాజ్ చేయకుండా ఏ వస్తువు అడ్డుకుందో చెప్పండి" అని ఆయన (స) దర్యాప్తుచేయగా 'మేము మా ఇండ్లలోనే నమాజ్ చేశాము' అని ఇద్దరూ సంజాయిషీ ఇచ్చుకున్నారు. "అలా చేయకండి. ఒకవేళ మీరు మీ ఇండ్లలో నమాజ్ చేసినప్పటికీ, ఇమామ్‌ను గనక మీరు పొందితే, ఇమామ్ కూడా అప్పటి వరకూ నమాజ్ చేయకుండా

رِحَالِكُمَا ثُمَّ أَدْرَكْتُمَا الإِمَامَ وَلَمْ يُصَلِّ فَصَلِّيَا مَعَهُ، فَإِنَّهَا لَكُمَا نَافِلَةٌ». رَوَاهُ أَحْمَدُ، وَاللَّفْظُ لَهُ، وَالثَّلَاثَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

ఉంటే అతనితో కలసి (సామూహిక) నమాజ్ చేయండి. ఇది మీ కొరకు నఫిల్ (అదనం) అవుతుంది'' అని ఆయన (స) ఉపదేశించారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు కూడా ఇందులోనివే. మరో ముగ్గురు (తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ) కూడా దీనిని పొందుపర్చారు. తిర్మిజీ , ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు).

### సారాంశం

ఈ హదీసు ద్వారా బోధపడిందేమిటంటే ఎవరయినా అంతకుముందే నమాజ్ చేసి వుండగా జమాఅత్ లభిస్తే అది ఏ నమాజు అయినాసరే అతను జమాఅత్‌లో కలసిపోవాలి - ఇమామ్ షాఫయి గారి అభిప్రాయం కూడా ఇదే. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం, జుహ్ర్ మరియు ఇషా నమాజులయితేనే అలా చేయవచ్చునని అన్నారు. ఫజ్ర్ నమాజ్‌ను మాత్రం తిరిగి ఎందుకు చేయకూడదు? హదీసులో అసలు చెప్పబడింది ఫజ్ర్ సమయంలోనే కదా! అన్న సందేహం రావచ్చు, అందుచేత ఈ విషయంలో ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృక్పథం స్పష్టమైనది, అనుసరణీయమైనది.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు యజీద్ బిన్ అస్వద్ (రజి). మారుపేరు అబూ జాబిర్ సవాయి ఆమిరీ. ఖురైషులతో ఈయన తెగకు మైత్రీ సంబంధాలుండేవి. సుప్రసిద్ధ సహాబీ ఈయన. తాయఫ్‌లో స్థిరపడ్డారు. ఈయనచేత ఈ ఒక్క హదీసు మాత్రమే ఉల్లేఖించబడింది. ఈయన కుమారుడు జాబిర్ (రహ్మ.లై) ఈయన నుండి హదీసును విని అందజేశారు.

(٣٢٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّمَا جُعِلَ الْإِمَامُ لِيُؤْتَمَّ بِهِ، فَإِذَا كَبَّرَ فَكَبِّرُوا، وَلَا تُكَبِّرُوا حَتَّى يُكَبِّرَ، وَإِذَا رَكَعَ فَارْكَعُوا، وَلَا تَرْكَعُوا حَتَّى يَرْكَعَ وَإِذَا قَالَ: «سَمِعَ اللَّهُ لِمَنْ حَمِدَهُ» فَقُولُوا: «اللَّهُمَّ رَبَّنَا لَكَ

320. దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: ''ఇమామ్‌ను అనుసరించాలన్న ఉద్దేశ్యంతోనే అతన్ని నియమించటం జరిగింది. కనుక అతను అల్లాహు అక్బర్ అని అంటే మీరు కూడా అల్లాహు అక్బర్ అనండి. ఇమామ్ అల్లాహు అక్బర్ అని పలికే

الحَمْدُ» وَإِذَا سَجَدَ فَاسْجُدُوا، وَلاَ تَسْجُدُوا حَتَّى يَسْجُدَ، وَإِذَا صَلَّى قَائِماً فَصَلُّوا قِيَاماً، وَإِذَا صَلَّى قَاعِداً فَصَلُّوا قُعُوداً أَجْمَعِينَ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَهَذَا لَفْظُهُ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ.

వరకూ మీరు అల్లాహు అక్బర్ అని పలకకండి. అతను రుకూ చేస్తే మీరు కూడా రుకూ చేయండి. ఇమామ్ రుకూ చేసే వరకూ మీరు రుకూ చేయకండి. ఇమామ్ 'సమి అల్లాహు లిమన్ హమి దహ్' అని అంటే, మీరు 'అల్లాహుమ్మ రబ్బనాలకల్ హమ్ద్' అని అనండి. అతను సజ్దా చేస్తే మీరు కూడా సజ్దా చేయండి. అతను సజ్దా చేసే వరకూ మీరు సజ్దా చేయకూడదు. మరి ఇమామ్ నిలబడి నమాజ్ చేయసాగితే మీరు కూడా నిలబడి నమాజ్ చేయండి. అతను కూర్చుని నమాజ్ చేస్తే మీరు కూడా కూర్చుని నమాజ్ చేయండి." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు అబూదావూద్‌లోనివే. దీని మూలం మాత్రం సహీహైన్ (బుఖారీ, ముస్లిం)లో ఉంది)

**సారాంశం**

ముఖ్తదీలు (వెనుకనున్నవారు) తమ ఇమామ్‌ను అనుసరించటం అవశ్యమని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. వారు ఏ విషయంలోనూ ఇమామ్ కన్నా ముందంజ వేయరాదు. తక్బీరె తహ్రీమా మొదలుకుని సలాం చేసేవరకూ ఇమామ్ కన్నా కొంచెం వెనుక ఉండాలి. ఇమామ్ చేసినట్లే చేయాలి. అనుసరణ అంటే ఇదే. దైవప్రవక్త (స) సజ్దాలో తలను నేలకు ఆన్చినపుడు, తాము సజ్దాకై వంగేవారమని సహాబీలు తెలిపారు. ఇమామ్ సమిఅల్లాహు లిమన్ హమిదహ్ అని అన్నప్పుడు ముఖ్తదీలు 'రబ్బనా లకల్ హమ్ద్' అనాలి. ఇమామ్ అబూహనీఫా అభిప్రాయం ఇదే. అయితే ఇమామ్ అబూహనీఫా గారి ప్రియశిష్యులిరువురూ, అహ్లె హదీసు వారు, ఇమామ్ షాఫయిగారేమంటారంటే; ముఖ్తదీలు కూడా 'సమిఅల్లాహ్' పలికి, ఆపైన రబ్బనా లకల్ హమ్ద్ అని చెప్పాలి.

(٣٢١) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ رَأَى فِي

321. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరులను వెనుక జరిగి ఉండటం గమనించి

أَصْحَابِهِ تَأَخُّراً، فَقَالَ «تَقَدَّمُوْا، فَائْتَمُّوا بِيْ، وَلْيَأْتَمَّ بِكُمْ مَنْ بَعْدَكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

"ముందుకు జరగండి. నన్ను అనుసరించండి. మీకు వెనుకనున్న వారు మిమ్మల్ని అనుసరించాలి" అని ఉద్బోధించారు. (ముస్లిం)

**సారాంశం**

సామూహిక నమాజ్‌లో తొలి వరుస (పంక్తి) కు ఎంత ప్రాముఖ్యం ఉందో దీన్నిబట్టి అర్థమవుతోంది. మొదటి వరుసలో నిలబడివున్నవారు ఇమామ్‌ను ఖచ్చితంగా అనుసరించాలి. ఇందుకోసం వారు ఇమామ్‌ను క్రీగంట చూసినా తప్పులేదు. వెనుక పంక్తుల్లోనున్నవారు తమ ముందు పంక్తుల్లో నిలబడినవారిని అనుసరించాలి. దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే ఇమామ్‌ను నేరుగా చూడలేనివారు, ఇమామ్ పలుకులను వినలేనివారు తమ ముందు వరుసల్లోని నమాజీల కదలికలను అనుసరించవచ్చు. ఈ హదీసు ద్వారా లభించే ఇంకొక సూచన ఏమిటంటే; తమ వద్ద ధర్మజ్ఞానం లేనివారు విద్వాంసులను అడిగి తెలుసుకోవాలి.

(٣٢٢) وَعَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: اَحْتَجَرَ رَسُولُ اللّٰهِ ﷺ حُجْرَةً مُخَصَّفَةً، فَصَلَّى فِيْهَا، فَتَتَبَّعَ إِلَيْهِ رِجَالٌ، وَجَاءُوْا يُصَلُّوْنَ بِصَلَاتِهِ، اَلْحَدِيْثَ. وَفِيْهِ: «أَفْضَلُ صَلَاةِ الْمَرْءِ فِيْ بَيْتِهِ، إِلاَّ الْمَكْتُوبَةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

322. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గడ్డిపోచతో తయారు చేయబడిన చాపతో ఒక చిన్న (పందిరిలాంటి) కుటీరాన్ని వేసి అందులో నమాజ్ చేయసాగారు. ఈ సంగతి తెలుసుకుని ప్రజలు కూడా వచ్చి ఆయనతో కలసి నమాజ్ చేయసాగారు. '(ఫర్జ్ నమాజ్ తప్ప ఇతర నమాజులను) పురుషుడు తన ఇంట్లో చేయటం ఉత్తమం' అని కూడా ఈ హదీసులో ఉంది. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

రమజాన్ నెలలో జరిగిన సంఘటన ఇది. మస్జిద్‌లో ఒక మూల ఆయన (స) ప్రత్యేకంగా ఈ పందిరి వేసుకున్నారు. మస్జిద్‌లో ఇతర నమాజీలకు అసౌకర్యం కలగని పక్షంలో ఈ విధంగా ఏర్పాటు చేసుకోవచ్చునని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రత్యేక స్థానాన్ని కేటాయించుకుని నమాజ్ చేస్తున్నారని తెలుసుకున్న ప్రజలు - ఒక్కొక్కరుగా వచ్చి ఆయన వెంట నమాజ్ చేయటం మొదలెట్టారు. దైవప్రవక్త (స) ఒక రోజు రాత్రి ఆలస్యంగా ఆ పందిరి నుండి బయటికి వచ్చి, "నేను మీ పరిస్థితిని అర్థం చేసుకున్నాను. మీ ఇండ్లలో నమాజ్ చేయండి. ఎందుకంటే ఫర్జ్ నమాజ్ తప్ప మిగిలిన నమాజులను పురుషులు ఇంట్లో చేయటం ఉత్తమం" అని ఉద్బోధించారు.

(٣٢٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى مُعَاذٌ بِأَصْحَابِهِ الْعِشَاءَ، فَطَوَّلَ عَلَيْهِمْ، فَقَالَ النَّبِيُّ ﷺ: «أَتُرِيدُ أَنْ تَكُونَ يَا مُعَاذُ فَتَّانًا؟ إِذَا أَمَمْتَ النَّاسَ فَاقْرَأْ «بِالشَّمْسِ وَضُحَاهَا» وَ«سَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى» وَ«اقْرَأْ بِاسْمِ رَبِّكَ» «وَاللَّيْلِ إِذَا يَغْشَى» مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

323. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : హజ్రత్ ముఆజ్ (రజి) తన ముఖ్తదీలకు ఇషా నమాజ్ చేయించారు. ఆ సందర్భం గా ఆయన సుదీర్ఘ పారాయణం చేశారు. దీనిపై దైవప్రవక్త (సఅసం), "ఓ ముఆజ్! నమాజీలకు పరీక్ష పెడుతున్నావా? నీవు ప్రజలకు ఇమామత్ చేస్తే వష్షమ్సి వజుహాహా, సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా సూరాలు, ఇంకా ఇఖ్రబిస్మి, వల్లైలి ఇజా యఘ్షా వంటి సూరాలు చదవాలి"అని ఉద్బోధించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

ప్రజలకు నమాజ్ పట్ల విసుగుపుట్టేలా, సామూహిక నమాజ్ అంటే వారికి భయం కలిగేలా సుదీర్ఘమయిన సూరాలు ఇమామ్ పఠించరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. అయితే ఖుర్ఆన్ పారాయణంలోని ముఖ్యోద్దేశమే మరుగున పడిపోయేవిధంగా మరీ అంత సంక్షిప్తంగా కూడా చేయరాదు. రెండు అతివాదాలకు మధ్య మధ్యేమార్గాన్ని అవలంబించటం శ్రేయస్కరం. దైవప్రవక్త (స) విధానం కూడా ఇదే. వెనుకనున్న నమాజీల ఓపికనుబట్టి సుదీర్ఘ పారాయణం కూడా చేయవచ్చు. ఇక హజ్రత్ ముఆజ్ (రజి)గారి ఇమామత్ సంఘటన బుఖారీలో ఈ విధంగా ఉంది -

ఒకరోజు రాత్రి హజ్రత్ ముఆజ్ (రజి) గారు ఇషా నమాజ్ చేయిస్తూ, మామూలు కంటే సుదీర్ఘమయిన పారాయణం చేశారు. ఒక ప్రయాణీకుడు అదే రోజు తన రెండు ఒంటెలను బయట వదలి వచ్చి, సామూహిక నమాజులో పాల్గొన్నాడు. నమాజు మరీ సుదీర్ఘంగా ఉండటంతో అతను జమాఅత్‌ను పరిత్యజించి, ప్రక్కకు వెళ్ళి ఒంటరిగా నమాజ్‌చేసి, తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఈ సంగతి ముఆజ్ (రజి)కు తెలియగా, 'అతడు మునాఫిఖ్ (కపటి)' అని వ్యాఖ్యానించారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సమక్షానికి వచ్చి, హజ్రత్ ముఆజ్ (రజి) గురించి ఫిర్యాదు చేశాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ముఆజ్ (రజి)ను పిలిపించి పై హదీసులోని విధంగా హితబోధ చేశారు. 'పరీక్ష పెడుతున్నావా?' అంటే భావం - నమాజులో వృద్ధులు, బలహీనులు, అగత్యపరులు, అలసిపోయినవారు రకరకాల జనులుంటారు. ఇమామ్ అయినవాడు వాళ్లందరినీ దృష్టిలో పెట్టుకోవాలి. అందరి పరిస్థితినీ అర్థం చేసుకుని మసలుకోవాలి. లేకుంటే ప్రజలకు సామూహిక నమాజ్ పట్ల వెగటు కలిగి వారు ఏకాంతంలో నమాజ్ చేసుకోవటం మొదలెడతారు. తత్ఫలితంగా ముస్లింల సామూహిక వ్యవస్థ కుంటుపడుతుంది.

(٣٢٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، فِيْ قِصَّةِ صَلاَةِ رَسُولِ اللّٰهِ ﷺ بِالنَّاسِ وَهُوَ مَرِيْضٌ، قَالَتْ: فَجَاءَ حَتَّى جَلَسَ عَنْ يَسَارِ أَبِي بَكْرٍ، فَكَانَ يُصَلِّيْ بِالنَّاسِ جَالِساً، وَأَبُو بَكْرٍ قَائِماً. يَقْتَدِيْ أَبُو بَكْرٍ بِصَلاَةِ النَّبِيِّ ﷺ، وَيَقْتَدِي النَّاسُ بِصَلاَةِ أَبِيْ بَكْرٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

324. హ్రజత్ ఆయిషా (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్యాధిగ్రస్తులై వుండి నమాజ్ చేయించిన వైనాన్ని ఇలా తెలిపారు - ఆయన (సఅసం) వచ్చి హ్రజత్ అబూబక్ర్ (రజి) కు ఎడమ ప్రక్కన కూర్చున్నారు. ఆయన (స) కూర్చునే నమాజ్ చేయిస్తుండగా హ్రజత్ అబూబక్ర్ (రజి) నిలబడి వున్నారు. అబూబకర్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను అనుసరిస్తుండగా, ప్రజలు అబూబకర్ (రజి)ను అనుసరించ సాగారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) మరణ వ్యాధికి గురైవున్నప్పటి సంఘటన ఇది. ఆయన (స) రోగగ్రస్తు లయ్యారు. జ్వరం తీవ్రతరమయింది. ఈ సందర్భంగా ఆయన (స) ఆదేశానుసారమే హ్రజత్ అబూబకర్ (రజి) సామూహిక నమాజ్‌కు సారథ్యం వహించేవారు. ఒకరోజు ఆరోగ్యం కాస్తంత కుదుటపడగా ఆయన (స) ఇద్దరు మనుషుల సహాయంతో మస్జిద్‌కు వచ్చారు. ఆ సమయంలో అబూబకర్ (రజి) నమాజ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన (స) అబూబకర్‌కు ఎడమ ప్రక్కన కూర్చుని నమాజ్ చేయించటం మొదలెట్టారు. ఆయన (స) ఇమామత్ చేయసాగారు. అందుకే ఎడమప్రక్కన కూర్చున్నారు. ఆ క్షణం నుంచీ అబూబకర్ (రజి) 'ముఖ్తదీ'గా మారిపోయారు. ఎందుకంటే ఆయన (రజి) కుడిప్రక్కన నిలుచుని వున్నారు. వ్యాధి మూలంగా దైవప్రవక్త (స) బాగా నీరసించిపోయారు. ఆయన (స) నోట వెలువడే తక్బీర్ అందరికీ వినబడలేదు. అందుచేత హ్రజత్ అబూబకర్ (రజి) 'ముకబ్బిర్' గా మారి హెచ్చు స్వరంతో తక్బీర్లు పలకసాగారు. ప్రజలు అబూబక్ర్‌ను అనుసరించి నమాజ్‌ను నెరవేర్చారు. ఈ హదీసు ఆధారంగా షాఫయీలు ఒక గమనార్హమైన విషయాన్ని ప్రతిపాదించారు. అదేమంటే తమకన్నా శ్రేష్ఠుడైన వ్యక్తి మస్జిదుకు వచ్చినపుడు ఇమామ్ తన స్థానాన్ని ఖాళీచేసి, ఆ వ్యక్తికి ఇమామత్ చేసే అవకాశం కల్పించాలి. అయితే ఈ వ్యవహారం ఒక్క దైవప్రవక్త (స) కే ప్రత్యేకం అని ఇబ్నె అబ్దుల్ బిర్ వ్యాఖ్యానించారు.

(٣٢٥) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «إِذَا أَمَّ أَحَدُكُمُ النَّاسَ فَلْيُخَفِّفْ، فَإِنَّ فِيهِمُ الصَّغِيرَ وَالْكَبِيرَ

325. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హ్రజత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయినా ప్రజలకు ఇమామత్ చేసి నపుడు వారు ఖిరాత్‌ను తగ్గించాలి.

والضَّعِيفَ وَذَا الْحَاجَةِ، فَإِذَا صَلَّى وَحْدَهُ فَلْيُصَلِّ كَيْفَ شَاءَ». مُتَّفَقٌ عَلَيْهِ.

ఎందుకంటే ముఖ్తదీలలో (వెనుకనున్న వారిలో)పిల్లలు,వృద్ధులు, బలహీనులు, అగత్యపరులు ఉంటారు. అయితే మీరు ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు మీరు కోరినవిధంగా చేసుకోవచ్చు.''

(ముత్తఫకున్ అలైహి)

**సారాంశం**

దీన్నిబట్టి తెలిసేదేమంటే ఒక వ్యక్తి సారథ్య బాధ్యతల్ని నెరవేరుస్తున్నప్పుడు పెద్దపెద్ద సూరాలు పఠించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదు. ఎందుకంటే వెనుక నమాజ్ చేసే వారిలో రకరకాల వారుంటారు. అందరి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇమామ్ తదనుగుణంగా వ్యవహరించాలి. అయితే ఒకవ్యక్తి ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు అతని పరిస్థితి అతనికి బాగా తెలుసు గనక, అతనెంత సుదీర్ఘ పారాయణం చేసుకున్నా ఫరవాలేదు. ఇక్కడా ఒక విషయాన్ని మరువరాదు. తాను ఒంటరిగా నమాజ్ చేస్తున్నాను కదా అని చెప్పి, తన ఆరోగ్య స్థితిని, దైనందిన జీవితావసరాలను కూడా లెక్క చేయకుండా పొద్దస్తమానం దైవధ్యానంలో గడపటం కూడా విపరీతమే. ఎందుకంటే అతని శరీరావయవాలకు కూడా అతనిపై హక్కుంది.

(٣٢٦) وَعَنْ عَمْرِو بْنِ سَلِمَةَ قَالَ: قَالَ أَبِي: جِئْتُكُمْ مِنْ عِنْدِ النَّبِيِّ ﷺ حَقًّا، قَالَ: «فَإِذَا حَضَرَتِ الصَّلَاةُ فَلْيُؤَذِّنْ أَحَدُكُمْ، وَلْيَؤُمَّكُمْ أَكْثَرُكُمْ قُرْآناً»، قَالَ: فَنَظَرُوا، فَلَمْ يَكُنْ أَحَدٌ أَكْثَرَ قُرْآناً مِنِّي، فَقَدَّمُونِي، وَأَنَا ابْنُ سِتٍّ أَوْ سَبْعِ سِنِينَ. رَوَاهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

326. హజ్రత్ అమ్ర్ బిన్ సలమ (రజి) కథనం : మా నాన్నగారు తన జాతి వారి నుద్దేశ్యించి, నేను మీ వద్దకు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరఫున సత్యం తీసుకువచ్చాను. ఆయన (సఅసం) ఏమని ఉపదేశించారంటే, ''నమాజ్ వేళ అవగానే మీలో ఒకరు అజాన్ పిలుపు ఇవ్వాలి మరియు మీలో దివ్య ఖుర్ఆన్ అవగాహన అత్యధికంగా ఉన్నవారు నమాజ్‌కు నాయకత్వం వహించాలి.'' (నేను తప్ప ఖుర్ఆన్ పారంగతుడు వారిలో ఎవరూ లేక పోవటం గమనించి నా జాతి వారు నన్నే ఇమామత్ కొరకు ముందుకు పంపారు. అప్పుడు నా వయస్సు ఆరు లేక ఏడేళ్ళు అంతే) అని అమ్ర్ అన్నారు.

(బుఖారీ, అబూదావూద్, నసాయి)

## సారాంశం

ఈ హదీసు ఇమామ్ నియామకం గురించి ఒక సూత్రాన్ని నిర్ధారించింది. ఎవరికి ఖుర్ఆన్ జ్ఞానం అధికంగా వుందో వారే ఇమామ్‌గా ఎంపిక కావాలి. అమ్ర్ (రజి)ను ఆయన జాతి ప్రజలు దీని ఆధారంగానే ఇమామత్ బాధ్యతను అప్పగించారు. ఇమామత్ హోదా ముఅజ్జిన్ హోదా కన్నా ఉన్నత మైనది. ముఅజ్జిన్ కొరకు కఠినమయిన షరతులు విధించబడలేదు. మంచి కంఠం గలవాడు, హెచ్చు స్వరంతో అజాన్ ఇవ్వగలవాడై ఉంటే చాలు - ముఅజ్జిన్‌గా నియమించవచ్చు. కాని ఇమామ్ కావటానికి ధర్మజ్ఞానం, ధర్మావగాహన అవసరం.

హజ్రత్ అమ్ర్ బిన్ సలమ (రజి) ఏడేళ్ల పిన్న వయస్కులైనప్పటికీ ఆయన జాతి వారు ఆయనకు ఇమామత్‌ను కట్టబెట్టడానికి కారణం - ఆయనకు ఇతరులకన్నా ఎక్కువగా ఖుర్ఆన్ కంఠస్థం అయి ఉండటమే. హసన్ బస్రీ, ఇమామ్ షాఫయి, ఇమామ్ రాహ్వే, అహ్లె హదీసు వారు - వీరంతా యుక్త వయస్కులు కాని అబ్బాయి వెనుక పెద్దవారు కూడా నమాజ్ చేయవచ్చని భావిస్తున్నారు. అయితే ఇమామ్ మాలిక్, ఇమామ్ సౌరి తదితరులు దీన్ని మక్రూహ్ (అయిష్టకరం)గా భావిస్తున్నారు. ఇమామత్ చేసేవ్యక్తి పిన్న వయస్కుడై (నా బాలిగ్) ఉంటే అతని వెనుక నఫిల్ నమాజులు చేయ వచ్చుగాని ఫర్జ్ నమాజు చేయటం ధర్మసమ్మతం కాదని ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ అహ్మద్‌లు చెబుతున్నారు. అమ్ర్ బిన్ సలమ (రజి)ను ఇమామ్‌గా నియమించిన వారు దైవప్రవక్త (సఅసం) ఆదేశాన్ని పురస్కరించుకుని నియమించటంగానీ లేదా దైవప్రవక్త (స)ను సంప్రతించి నియమించటం గానీ చేయలేదన్నది వీరి వాదన. ఈ వాదనలో అంతగా బలంలేదు. ఎందుకంటే ఒకవేళ ఆ నియామకం ధర్మ విరుద్ధమై వుంటే ఆ సంగతి వహీ ద్వారా దైవప్రవక్త (స) కు తెలిసి వుండేది. దైవప్రవక్త (స) భవిష్యత్తులో అలా జరక్కుండా ఆదేశాలు జారీ చేసేవారు. కాని అలా జరగలేదు. ఇది ఇస్లాం ధర్మం యొక్క అత్యంత ముఖ్యమైన ఆరాధన - నమాజ్ - తో ముడిపడి ఉండటం వల్ల అది గనక అధర్మమై ఉంటే దైవప్రవక్త (సఅసం) తన జీవితకాలంలోనే దానిని నిషేధించేవారు. కాని అలాంటి ఉత్తర్వులు ఏమీ ఆయన తరపున జారీ కాలేదు. కనుక తేలిందేమంటే ధర్మజ్ఞానం ఆధారంగా పిన్న వయస్కులను కూడా - అవసరం మేరకు - ఇమామ్‌గా ఎన్నుకోవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు అమ్ర్ బిన్ సలమ (రజి). 'జురుమ్' తెగకు చెందిన వారవటం చేత జురుమీగా వ్యవహరించబడ్డారు. అబూ యజీద్ లేక అబూ బురైద్ ఈయన మారుపేరు. తన తండ్రి గారితో కలసి దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరయ్యారు. అప్పటికి ఆయన వయస్సు ఆరేడు సంవత్సరాలు. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఈయన దైవప్రవక్త (సఅసం) దగ్గరకు రాలేదు.

327. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - దైవ గ్రంథ జ్ఞానం ఎక్కువగా వున్నవాడు ప్రజలకు ఇమామ్ కావాలి. ఈ అర్హతలో జనులంతా సమానులైవుంటే, దైవప్రవక్త

(٣٢٧) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «يَؤُمُّ الْقَوْمَ أَقْرَؤُهُمْ لِكِتَابِ اللّٰهِ تَعَالَى، فَإِنْ كَانُوا فِي الْقِرَاءَةِ سَوَاءً فَأَعْلَمُهُمْ بِالسُّنَّةِ، فَإِنْ كَانُوا

فِي السُّنَّةِ سَوَاءً فَأَقْدَمُهُمْ هِجْرَةً، فَإِنْ كَانُوا فِي الْهِجْرَةِ سَوَاءً فَأَقْدَمُهُمْ سِلْماً – وَفِي رِوَايَةٍ «سِنّاً» – وَلاَ يَؤُمَّنَّ الرَّجُلُ الرَّجُلَ فِي سُلْطَانِهِ، وَلاَ يَقْعُدُ فِي بَيْتِهِ عَلَى تَكْرِمَتِهِ، إِلاَّ بِإِذْنِهِ». رَوَاهُ مُسْلِمٌ.

(స) ఆచరణా విధానం గురించిన అవగాహన అధికంగా గలవారు ఇమామ్ కావాలి. ఈ విషయంలో కూడా ప్రజలు సమానులుగా ఉంటే, దైవమార్గంలో మొదట హిజ్రత్ చేసినవారు ఇమామ్ కావాలి. ఇక్కడా సమానత్వం కనిపిస్తే అప్పుడు అందరికన్నా ముందు ఇస్లాం స్వీకరించినవారు ఇమామ్ కావాలి. వేరొక ఉల్లేఖనంలో 'ఇస్లాం' బదులు 'వయస్సు' అన్న పదం ఉంది. అంటే పైన పేర్కొనబడిన గుణగణాలలో, ప్రతిభలో అందరూ సమానులుగా ఉన్నప్పుడు వయస్సులో పెద్దవారైన వారికి ఇమామత్ బాధ్యత అప్పజెప్పాలి. ఎవరూ ఒకరి అధికార ప్రతిపత్తికి లోబడి ఇమామత్ చేయించటంగానీ, ఒకరి ఇంట్లోని ప్రత్యేక స్థలంలో (ఆసనం లేక పడకపై) వారి అనుమతి లేకుండా కూర్చోవటంగానీ చేయరాదు. (ముస్లిం)

**సారాంశం**

దివ్య ఖుర్‌ఆన్ జ్ఞానం ఎక్కువగా వున్నవారు, దైవప్రవక్త (స) సున్నత్‌ను గురించి అధికంగా తెలిసివున్నవారు, దైవధర్మం కోసం వలసవెళ్లినవారు, త్యాగాలు చేసినవారు, సత్యామృతాన్ని ఆస్వాదించటంలో ముందంజ వేసినవారు, వయస్సులో పెద్దవారు ఇమామత్‌కు అర్హులని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది.

(٣٢٨) وَلاِبْنِ مَاجَهْ مِنْ حَدِيثِ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ؛ «وَلاَ تَؤُمَّنَّ امْرَأَةٌ رَجُلاً، وَلاَ أَعْرَابِيٌّ مُهَاجِراً، وَلاَ فَاجِرٌ مُؤْمِناً»، وَإِسْنَادُهُ وَاهٍ.

328. ఇబ్నె మాజాలో హజ్రత్ జాబిర్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది: "ఏ స్త్రీ ఏ పురుషునికీ ఇమామ్ కారాదు. ఏ పల్లెటూరి బైతు కూడా ఏ ముహాజిర్ వ్యక్తికీ ఇమామత్ చేయరాదు. అలాగే ఏ పాపాత్ముడూ ఒక విశ్వాసికి ఇమామ్ కారాదు." (ఈ ఉల్లేఖనం అందిన తీరు జయీఫ్ - బలహీనమైనది)

## సారాంశం

ఈ హదీసు అత్యంత బలహీనమైనది. ఇది అందిన పరంపర విశ్వసనీయమైనది కాదు. అందువల్ల దీని ఆధారంగా ధార్మిక అంశాలను పరిశోధించటం సమంజసం కాదు.

(٣٢٩) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «رُصُّوا صُفُوفَكُمْ، وَقَارِبُوا بَيْنَهَا، وَحَاذُوا بِالْأَعْنَاقِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

329. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు - మీ పంక్తులను కట్టు దిట్టం చేసుకోండి : వాటి మధ్య దూరం తగ్గించండి. మీ మెడలను ఒకే తీరులో ఉంచండి." (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

ఇస్లాంలో పంక్తుల్ని తీర్చిదిద్దడం గురించి, క్రమశిక్షణ గురించి గట్టిగా తాకీదు చేయబడింది. ఇస్లాం అనుయాయులు చేసే సామూహిక ఆరాధనలో సయితం వరుసలు తీరి నిలబడటానికి, క్రమశిక్షణకు అత్యధిక ప్రాముఖ్యత నివ్వబడింది. యుద్ధరంగంలో క్రమశిక్షణతో వరుసలు తీరి నిలవటానికి గల ప్రాముఖ్యతను గురించి వేరుగా చెప్పనవసరం లేదు. వరుసల్లో లోపం ఏర్పడితే, పరస్పర వ్యవహారాల్లో కూడా సమన్వయం దెబ్బతింటుంది. సంఘీభావం సన్నగిల్లుతుంది. నమాజ్ ద్వారా ఇస్లాం తన అనుయాయుల మధ్య ప్రేమానురాగాలను సృజించగోర్తుంది. వారిమధ్య గల అరమరికలను, అంతరాలను అంతమొందించి హృదయాలు హత్తుకునే ప్రేమైక వాతావరణాన్ని పెంపొందించగోర్తుంది. నిమ్నోన్నతా భేదభావాలను రూపుమాపి సమాజంలోని అన్ని వర్గాల వారిని సమానులుగా - ఒకే పంక్తిలో - నిలబెట్టాలని ఆశిస్తుంది. ఐకమత్యానికీ, సంగఠిత భావానికి ప్రతీకగా వుండవలసిన పంక్తులమధ్య షైతాన్ జొరబడితే జరిగే అనర్థం ఏమిటో తెలియనిది కాదు.

అందుకే దైవప్రవక్త (సఅసం) వారు సామూహిక నమాజ్ కోసం అందరూ నిలబడినపుడు ఆయన నమాజీల వైపునకు తిరిగి "మీ పంక్తులను సరిదిద్దుకోండి. లేకుంటే అల్లాహ్ మీ మనసుల్లో వక్రతను, వైరుధ్య భావాన్ని నింపుతాడు" (సహీహైన్) అని తాకీదు చేసేవారు. ప్రజలు నమాజ్‌లో తమ భుజాన్ని ఇతరుల భుజంతో కలిపేవారనీ, తమ అడుగులను ప్రక్కనున్నవారి అడుగులతో కలిపేవారని ఉల్లేఖకులు తెలిపారు. దైవప్రవక్త (సఅసం) ఒకసారి ఇలా అన్నారు : "నా ప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆయన సాక్షిగా చెబుతున్నాను - షైతాన్ పంక్తుల మధ్య తోడేలు పిల్ల రూపంలో జొరబడటాన్ని నేను చూస్తున్నాను" అంటే వాడు నమాజీల మధ్య దుష్ప్రేరణలను రేకెత్తిస్తాడు. దాసుల ఏకాగ్రతను దెబ్బతీస్తాడు. వారి ధ్యాసను దేవుని తరఫునుండి వేరే మార్గాల్లో మళ్ళించజూస్తాడు. అందుకే అందరూ వరుసలు తీరి, తిన్నగా, భుజానికి భుజం ఆనించి మరీ నిలబడాలి. మధ్యలో దూరం వదలకూడదు.

(٣٣٠) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُوْلُ اللّٰهِ ﷺ: «خَيْرُ صُفُوفِ الرِّجَالِ أَوَّلُهَا، وَشَرُّهَا آخِرُهَا، وَخَيْرُ صُفُوفِ النِّسَاءِ آخِرُهَا، وَشَرُّهَا أَوَّلُهَا». رَوَاهُ مُسْلِمٌ.

330. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "పురుషుల అత్యంత ఉత్తమ వరుస మొదటి వరుస. అత్యంత అధమ వరుస వారి ఆఖరి వరుస. స్త్రీల అత్యంత ఉత్తమ వరుస ఆఖరి వరుస. వారి అత్యంత అధమమైన వరుస మొదటి వరుస." (ముస్లిం)

**సారాంశం**

జమాఅత్‌లో స్త్రీలు, పురుషులు కూడా పాల్గొన్నప్పుడు వారి మధ్య దూరం ఎంత అధికంగా వుంటే అంతే మంచిదని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. మొదటి వరుసలో నిలబడే పురుషులు సాధారణంగా మస్జిద్‌కు అందరికన్నా ముందువస్తారు. మస్జిద్‌కు త్వరగా రావటం కూడా పుణ్యప్రదమైన విషయం. అదీగాక మొదటి వరుసలో వున్నవారు సాధారణంగా పెద్దవారు, జ్ఞానసంపన్నులు అయివుంటారు. ఇతర నమాజీలకన్నా వారు ఇమామ్‌కు అతి సమీపంలో వుంటారు. అందువల్ల వారు ఇమామ్ గారి తక్బీర్లను, ఖుర్‌ఆన్ పఠనాన్ని స్పష్టంగా వింటారు. స్త్రీలకు బహుదూరంగా ఉండటంవల్ల షైతాన్ రేకెత్తించే దుష్ప్రేరణల నుండి సురక్షితంగా ఉంటారు.

కాగా; పురుషుల చివరి పంక్తిలో నిలబడివున్న వారు వీటన్నింటికీ దూరంగా వుంటారు. అందుచేత వీరికి పుణ్యం మొదటి పంక్తి వారికన్నా తక్కువ లభిస్తుంది. స్త్రీల ఆఖరి వరుస అన్నింటికన్నా మేలైన వరుస అని అనబడటంలోని ఆంతర్యం ఏమిటంటే ఆఖరి వరుసలో నిలబడివున్న స్త్రీలు మస్జిద్‌కు ఆలస్యంగా వస్తారు. అందుచేత వారి సంచారం పురుషులు వున్న చోట ఉండదు. మస్జిద్‌లో ఒకే హాలు వుండి స్త్రీ పురుషులు ముందు - వెనుక నిలబడవలసి వచ్చినప్పుడు ఈ పరిస్థితి ఉత్పన్న మవుతుంది. ఒకవేళ స్త్రీలు కూడా ప్రత్యేక హాలులో - వేరుగా కూర్చోవలసి వచ్చినప్పుడు - వారి పంక్తుల్లో కూడా మొదటి పంక్తే ఉత్తమపంక్తిగా పరిగణించబడుతుంది సుమా!

(٣٣١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: صَلَّيْتُ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ ذَاتَ لَيْلَةٍ، فَقُمْتُ عَنْ يَسَارِهِ، فَأَخَذَ رَسُولُ اللّٰهِ ﷺ بِرَأْسِي مِنْ وَّرَائِيْ، فَجَعَلَنِيْ عَنْ يَمِينِهِ، مُتَّفَقٌ عَلَيْهِ.

331. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: నేను ఒక రోజు రాత్రి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి నమాజ్ చేశాను. నమాజ్‌లో ఆయన (స) ఎడమ ప్రక్కన నిలబడ్డాను. దైవప్రవక్త (సఅసం) వెనుక నుండి నా తల పట్టుకుని తన కుడి ప్రక్కకు నిలబెట్టుకున్నారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

నమాజ్ చేసేవారు ఇద్దరే వున్నప్పుడు ముఖ్తదీ ఇమామ్‌కు కుడిప్రక్కన నిలబడాలి. ఒకవేళ తెలీక, అవివేకం వల్ల ముఖ్తదీ ఎడమప్రక్కన నిలబడితే ఇమామ్ అతన్ని తన కుడిప్రక్కకు లాక్కోవాలి. ఈ మాత్రం చేష్ట (కదలిక) వల్ల నమాజ్ చెడిపోదు. ఎందుకంటే ఈ చలనం కూడా నమాజ్ కోసమే జరిగింది. ఆ సమయంలో ముఖ్తదీ కూడా ఇమామ్ అంతరంగాన్ని పసిగట్టి శీఘ్రంగా స్పందించాలి. స్థానం మారినంత మాత్రాన నమాజ్‌కు కలిగే అనర్థం ఏమీ ఉండదు - ఎందుకంటే నమాజ్‌ను సంస్కరించే ఉద్దేశ్యంతోనే ఈ బదిలీ జరిగింది. ఈ హదీసు వల్ల తెలిసేదేమంటే ఇద్దరు వ్యక్తులు కూడా సామూహికంగా నమాజ్ చేయవచ్చు. నఫిల్ నమాజు కోసం కూడా జమాఅత్‌గా ఏర్పడవచ్చని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

(٣٣٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى رَسُولُ اللّٰهِ ﷺ، فَقُمْتُ أَنَا وَيَتِيمٌ خَلْفَهُ، وَأُمُّ سُلَيْمٍ خَلْفَنَا. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

332. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేయించగా నేను మరియు ఒక అనాథ వ్యక్తి - ఇద్దరం ఆయన (స) వెనుక నిలబడి నమాజ్ చేశాము. ఉమ్మె సులైమ్ (ర.అన్‌హా) (ఒక్కతే) మా వెనుక నిలబడి నమాజ్ చేశారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

నఫిల్ నమాజు సామూహికంగా చేయవచ్చన్న దానికి ఈ హదీసు ఇంకొక తార్కాణం. సామూహిక నమాజ్‌లో స్త్రీ ఒక్కామే ఉంటే ఆమె ఒక్కతే వేరుగా - వెనుక - పంక్తిలో నిలబడాలనీ, పురుషుల పంక్తిలోకి వచ్చి చేరకూడదని కూడా ఈ హదీసు చెబుతోంది. ఒకవేళ చిన్న పిల్లలు ఉన్నప్పటికీ ఆమె వారి వెనుకే నిలబడాలి. అంటే మొదట పురుషులు, వారి వెనుక పిల్లలు, వారి వెనుక స్త్రీల పంక్తి ఉండాలన్నమాట! ఒకవేళ పురుషుడు (పెద్దవాడు) ఒక్కడే ఉంటే చిన్నపిల్లలను తన ప్రక్కన నిలబెట్టుకోవచ్చు.

శుభాలను, మేళ్లను ఆశించి ఇంట్లో దైవభక్తి పరాయణుల సారథ్యంలో నఫిల్ నమాజులను చేయవచ్చు. ఉమ్మె సులైమ్ ఎవరో కాదు, స్వయంగా హజ్రత్ అనస్ (రజి) తల్లిగారే. ఈమెగారే అనస్ (రజి)ను దైవప్రవక్త (సఅసం) సేవకై అంకితం చేశారు. ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యే మరో విషయం ఏమిటంటే ఒక స్త్రీ తన కన్న కొడుకు ప్రక్కన సయితం నిలబడి - ఒకే పంక్తిలో - నమాజ్ చేయజాలదు.

(٣٣٣) وَعَنْ أَبِي بَكْرَةَ أَنَّهُ انْتَهَى إِلَى النَّبِيِّ ﷺ وَهُوَ رَاكِعٌ، فَرَكَعَ قَبْلَ أَنْ يَصِلَ إِلَى

333. హజ్రత్ అబూబక్రా (రజి) తెలిపారు: దైవప్రవక్త (సఅసం) రుకూ చేస్తున్న సమయంలో తాను ఆయన

الصَّفّ، ثم مشي إلى الصف وَذَكَرَ ذَلِكَ لِلنَّبِيِّ ﷺ، فَقَالَ - لَهُ النَّبِيُّ ﷺ -: «زَادَكَ اللَّهُ حِرْصاً، وَلاَ تَعُدْ». رَوَاهُ الْبُخَارِيُّ، وَزَادَ أَبُو دَاوُدَ فِيهِ: «فَرَكَعَ دُوْنَ الصَّفِّ، ثُمَّ مَشَى إِلَى الصَّفِّ».

(స) వద్దకు వెళ్ళారు. వరుసలోకి వెళ్ళి కలవకుండానే ఆయన అక్కడికక్కడే రుకూలోకి వెళ్ళిపోయారు. దైవప్రవక్త (స) ఆయనున్నుద్దేశ్యించి "దేవుడు నీ అత్యాశను మరింత వృద్ధి చేయుగాక! కాని ఇక మీదట ఇలా చేయకు" అని ఉపదేశించారు. (బుఖారీ)

"ఆ వ్యక్తి వరుసలోకి వెళ్ళి నిలబడక ముందే రుకూ చేశాడు. రుకూ స్థితిలోనే నడచివెళ్ళి వరుసలో కలసిపోయాడు" అని అబూదావూద్ నకలు చేశారు.

(٣٣٤) وَعَنْ وَابِصَةَ بْنِ مَعْبَدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ رَأَى رَجُلاً يُصَلِّي خَلْفَ الصَّفِّ وَحْدَهُ، فَأَمَرَهُ أَنْ يُعِيْدَ الصَّلاَةَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

334. హజ్రత్ వాబిస బిన్ మాబద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దృష్టి ఒక వ్యక్తిపై పడింది. అతను వెనుక ఒంటరిగా నిలబడి నమాజ్ చేస్తున్నాడు. నమాజ్‌ను తిరిగి చేయవలసిందిగా ఆయన (స) అతనిని ఆజ్ఞాపించారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్' గా ఖరారు చేయగా, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికంగా నిర్ధారించారు)

وَلَهُ عَنْ طَلْقٍ: لاَ صَلاَةَ لِمُنْفَرِدٍ خَلْفَ الصَّفِّ. وَزَادَ الطَّبْرَانِيُّ فِي حَدِيثِ وَابِصَةَ: أَلاَ دَخَلْتَ مَعَهُمْ أَوِ اجْتَرَرْتَ رَجُلاً؟

అలాగే తల్ఖ్ బిన్ అలీ (రజి) ఉల్లేఖనంలో ఉంది - "పంక్తి వెనుక ఒకే వ్యక్తి నమాజ్ చేస్తే అతని నమాజ్ నెరవేరదు." తిర్మిజీ గారు వాబిస హదీసులో అదనంగా నకలు చేసిన వాక్యాలు ఇలా వున్నాయి - "నీవు వీళ్ళతో ఎందుకు కలసిపోలేదు? లేదా నీవు ఏ నమాజీనయినా వెనక్కి ఎందుకు లాక్కోలేకపోయావు?"

## సారాంశం

పంక్తి వెనుక ఒకే వ్యక్తి నిలబడి నమాజ్ చేస్తే అతని నమాజ్ నెరవేరుతుందా? లేదా? ఈ విషయంపై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. ఇమామ్ అహ్మద్ మరియు మరి కొంతమంది పండితుల దృష్టిలో ఆ వ్యక్తి నమాజ్ అవదు. ఎందుకంటే అటువంటి వ్యక్తి నుద్దేశ్యించి, మళ్లీ నమాజ్ చేయవలసిందిగా దైవప్రవక్త (స) ఆజ్ఞాపించారు.

మరి కొంతమంది అభిప్రాయంలో అలాంటి వ్యక్తి నమాజ్ అయిపోతుంది. ఇక దైవప్రవక్త (స) ఆ వ్యక్తిని తిరిగి నమాజ్ చేయమన్నారంటే అతన్ని దండించే ఉద్దేశ్యంతో అలా చేశారని వీళ్ళంటారు.

ఈ విషయంలో సహీహ్ హదీసుల సారాంశం ఇలా వుంది -

ముందు వరుస పూర్తి కావాలి. ఇక ఆ వరుసలో ఏమాత్రం స్థలం లేనపుడు మిగిలిపోయిన ఒక వ్యక్తి వెనుక ఒంటరిగానే నిలబడవచ్చు. ఎందుకంటారేమో, ముందు వరుసలో మధ్యనుంచి ఒక నమాజీని వెనక్కి పిలుచుకుంటే ఆ వరుసలో వెలితి ఎలాగూ ఏర్పడుతుంది. ఈ వెలితి వాంఛనీయం కాదు. ఈ వెలితిని పూరించడానికి ఆ వరుసలోని నమాజీలంతా కదలవలసి ఉంటుంది. పోనీ వరుసలోని ఏదో ఒక మూల నుంచి ఒక వ్యక్తిని వెనక్కి లాక్కుంటే అట్టి పరిస్థితిలో చాలా దూరం (నమాజ్‌లో) నడవవలసి ఉంటుంది. ఇది కూడా అంతగా శ్రేయస్కరం కాదు. కనుక అతడు ఒంటరిగా వెనుక నిలబడి నమాజ్ చేసుకోవటమే భావ్యం. ఇమాములలో ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ షాఫయీల దృక్పథం కూడా ఇదే. షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్నె తైమియ కూడా ఈ పద్ధతినే ఇష్టపడ్డారు. ముందు వరుసలో నుంచి ఒక వ్యక్తిని వెనక్కి లాక్కోవాలన్న తబ్రానీలోని ఉల్లేఖనం అప్రమాణికమైనది (జయీఫ్).

## హదీసు ఉల్లేఖకులు

వాబిస బిన్ మాబద్ (రజి). మారుపేరు అబూఖిర్‌సాఫ. అన్సార్‌కు చెందిన తెగ అసద్ బిన్ ఖుజైమాతో ఈయనకు సంబంధం ఉంది. హిజ్రీ 9లో దైవప్రవక్త (స) సమక్షంలో ప్రతినిధిగా హాజరయ్యారు. మొదట కూఫాలో స్థిరపడ్డారు. తరువాత హీరా వైపునకు తరలివెళ్ళారు. హిజ్రీ 90లో మరణించారు.

(٣٣٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا سَمِعْتُمُ الْإِقَامَةَ فَامْشُوا إِلَى الصَّلَاةِ، وَعَلَيْكُمُ السَّكِينَةُ وَالْوَقَارُ، وَلَا تُسْرِعُوا، فَمَا أَدْرَكْتُمْ فَصَلُّوا، وَمَا فَاتَكُمْ فَأَتِمُّوا»، مُتَّفَقٌ عَلَيْهِ. وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

335. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీరు నమాజ్‌కై ఇఖామత్‌ను వినగానే నమాజ్ వైపునకు నింపాదిగా, హుందాగా నడచి రండి. హడావిడి చేయకండి. జమాఅత్‌తో ఎంత నమాజ్ లభిస్తే అంత పొందండి. మిగిలిన (రకతుల) నమాజు తర్వాత పూర్తి చేసుకోండి." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

### సారాంశం

హదీసు ప్రకారం మనిషి నమాజ్ కోసం ఎప్పుడు మస్జిద్‌కు వచ్చినా గంభీరంగా, ప్రశాంతంగా, సంస్కారం ఉట్టిపడే విధంగా రావాలి. అంతేగానీ ఆందోళన చెందుతున్నట్లుగా, ఆదరాబాదరాగా-హైరానా పడిపోతున్నట్లుగా - నడచి రాకూడదు. నడుస్తున్నప్పుడు చూపుల్ని క్రిందికి దించాలి. ఏదన్నా చెప్పవలసి ఉంటే నెమ్మదిగా చెప్పాలి. ఆ విధంగా నడచివచ్చిన తరువాత, ఇమామ్ ఏ స్థితిలో వుంటే ఆ స్థితిలోనే నమాజ్‌ను మొదలెట్టాలి. మిగిలివున్న నమాజును తరువాత పూర్తి చేసుకోవాలి.

ఇమామ్ రుకూలోకి వెళుతుండగా వచ్చి కలసిన వారి రకత్ నెరవేరుతుందా? (లెక్కలోకి వస్తుందా?) లేదా? అనే విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. ఆ రకత్‌ను లెక్కలోకి తీసుకోక పోవటమే సరైనది. ఎందుకంటే రుకూలోకి వెళ్లకమునుపు ఆ వ్యక్తి ఖియామ్‌లో పాల్గొనలేదు, సూరె ఫాతిహా పఠించలేదు. నమాజ్‌లో ఈ రెండు అంశాలు పాటించటం చాలా ముఖ్యం. కనుక చివరి క్షణాల్లో వచ్చి రుకూలో చేరిపోయిన వ్యక్తికి ఆ రెండు అంశాలు లభించలేదు. మరలాంటప్పుడు అతని నమాజ్ పరిపూర్ణమెలా అవుతుంది?

(٣٣٦) وَعَنْ أُبَيِّ بْنِ كَعْبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «صَلَاةُ الرَّجُلِ مَعَ الرَّجُلِ أَزْكَى مِنْ صَلَاتِهِ وَحْدَهُ، وَصَلَاتُهُ مع الرَّجُلَيْنِ أزكى من صلاته مَعَ الرَّجُلِ، وَمَا كَانَ أَكْثَرَ فَهُوَ أَحَبُّ إِلَى اللّٰهِ عَزَّ وَجَلَّ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

336. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) తెలిపారు : ఒక వ్యక్తి రెండో వ్యక్తితో కలసి నమాజ్ చేయటం ఒంటరిగా నమాజ్ చేయడం కన్నా ఎంతో పవిత్రమైనది. పుణ్యంతో కూడు కున్నది. ఇద్దరు వ్యక్తులతో కలసి నమాజ్ చేయడం (మొదటి స్థితికన్నా) మరింత ఎక్కువ పుణ్యప్రదమైనది. అదేవిధంగా ఎంతమంది అధికంగా ఉంటే అంతే అల్లాహ్ దృష్టిలో అది ప్రీతికరమవు తుంది. (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

సామూహిక నమాజ్ వ్యక్తిగత స్థాయి నమాజ్ కన్నా ఎన్నో రెట్లు మహత్తుతో కూడుకున్నది. అందునా సామూహిక నమాజులో ఎక్కువ మంది ఉంటే అది దేవుని దృష్టిలో మరింత మహత్తును సంతరించు కుంటుంది. అటువంటి భారీ సమూహంలో చేరి నమాజ్ చేయటం వల్ల దాసులకు చేకూరే ఇహపర శుభాలు అపారం.

(٣٣٧) وَعَنْ أُمِّ وَرَقَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ أَمَرَهَا أَنْ تَؤُمَّ أَهْلَ دَارِهَا. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

337. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు, తన ఇంటివారలకు నమాజ్ చేయించమని ఆజ్ఞాపించారని హజ్రత్ ఉమ్మె వరఖా (ర.అన్హా) చెప్పారు. (అబూదావూద్ ఉల్లేఖించారు- ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన దిగా నిర్ధారించారు)

**సారాంశం**

స్త్రీ ఇమామత్ బాధ్యతలను నిర్వర్తించగలదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. కాని ఎవరికి? స్త్రీ పురుషులిద్దరికీ ఇమామత్ చేయగలదా? కొంతమంది ఇక్కడే పొరబడ్డారు. స్త్రీ స్త్రీలకు మాత్రమే ఇమామ్‌గా ఉండగలదు. పురుషుల నమాజ్‌కు ఆమె ఎట్టి పరిస్థితిలోనూ సారథ్యం వహించజాలదు.

స్త్రీ ఇమామ్‌గా నిలబడి స్త్రీలకు నమాజ్ చేయించేటప్పుడు పురుష ఇమామ్ మాదిరిగా ప్రత్యేకంగా- ఒంటరిగా - నిలబడకూడదు. ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) చెప్పిన దాని ప్రకారం, స్త్రీల మొదటి పంక్తి మధ్యలో నిలబడి ఇమామత్ చేయాలి. హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అన్హా), హజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్హా) కూడా ఇలాగే నమాజ్ చేయించేవారు.

**హదీసు ఉల్లేఖకులు**

ఈ హదీసును అందజేసిన ఉమ్మె వరఖా (ర.అన్హా) నౌఫిల్ కుమార్తె లేదా అబ్దుల్లాహ్ బిన్ హారిస్ కుమార్తె అయివుంటారు. అన్సార్ వర్గానికి చెందినవారు. ఈమె హృదయంలో దాదాపు ఖుర్ఆన్ అంతా పదిలమై ఉండేది. బద్ర్ యుద్ధంలో పాల్గొనేందుకు ఈమె దైవప్రవక్త (సఅసం) అనుమతి కోరారు. కాని దైవప్రవక్త (స) అనుమతి ఇవ్వలేదు. ఎందుకంటే ఇంటివద్దనే ఆమెకు అమరగతి లభించనున్నది. ఆమెను పలకరించడానికి దైవప్రవక్త (సఅసం) స్వయంగా ఆమె ఇంటికి వచ్చేవారు. ఆయన (స) ఆమెను వీరవనితగా కొనియాడేవారు. ఆమె వద్ద ఇద్దరు బానిసలు (ఒక స్త్రీ, ఒక పురుషుడు) ఉండేవారు. తాను మరణించిన తక్షణమే వారు స్వతంత్రులవుతారని ఆమె ముందే ప్రకటించారు. కాని ఆ బానిసలిద్దరూ కుట్రపన్ని, ఒకనాడు రాత్రి సమయంలో ఆమెను దుప్పటితో ఉరివేసి రాత్రికి రాత్రే పలాయనం చిత్తగించారు. అయితే హజ్రత్ ఉమర్ (రజి) వారిద్దరినీ నిర్బంధించి, ఉరిశిక్ష విధించారు. మదీనా మునవ్వరాలో ఉరితీతకు గురైన తొలి దోషులు వీరే. ఉమ్మె వరఖా (ర.అన్హా) దైవప్రవక్త (స) అనుమతితో తన వీధిలోని వారికి ఇమామత్ చేసేవారు. ఎందుకంటే ఈమె మనోఫలకంపై దివ్య ఖుర్ఆన్ ముద్రపడి ఉండేది.

(٣٣٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ اسْتَخْلَفَ ابْنَ أُمِّ مَكْتُومٍ،

338. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అంధులైన ఇబ్నె ఉమ్మె మక్తూమ్‌ను తన గైర్హాజరీలో ప్రజలకు ఇమామత్

يَؤُمُّ النَّاسَ وَهُوَ أَعْمَى. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَنَحْوُهُ لِابْنِ حِبَّانَ عَنْ عَائِشَةَ.

చేయించే బాధ్యతను అప్పగించారు. (అహ్మద్, అబూదావూద్ దీనిని ఉల్లే ఖించారు. ఇబ్నె హిబ్బాన్ కూడా ఇటువంటి హదీసునే హజ్రత్ ఆయిషా - ర.అన్హా - ఆధారంగా ఉటంకించారు)

**సారాంశం**

ఇమామ్ తాను లేని సమయంలో ప్రజలకు నమాజ్ చేయించేందుకు గాను - తన సహాయ కుడిని నియమించుకోవచ్చని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతూంది. అంధుడైన వ్యక్తి ఇమామ్‌గా నియమించబడవచ్చని కూడా ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. దైవప్రవక్త (స) నియమించిన అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) అంధులు. దైవప్రవక్త (స) ఈయన్ని 13 సార్లు తన ఉప ఇమామ్‌గా నియమించారు. దైవప్రవక్త (స) మదీనా నగరంలో లేని సమయంలో ఈయన సామూహిక నమాజ్‌కు సారథ్యం వహించేవారు.

(٣٣٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «صَلُّوا عَلَى مَنْ قَالَ لَا إِلَهَ إِلَّا اللهُ، وَصَلُّوا خَلْفَ مَنْ قَالَ لَا إِلَهَ إِلَّا اللهُ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

339. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "ఎవ రయితే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని నోటితో పలికాడో అతని అంత్యక్రియల నమాజ్ చేయండి. మరెవరు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అన్నాడో అతని వెనుక నమాజ్ కూడా చేయండి." (దీనిని దారె ఖుత్నీ 'బలహీన' ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

దైవధర్మ విధులపట్ల నిర్లక్ష్య వైఖరి కనబరచిన వ్యక్తి చనిపోతే - అతను కలిమాను పఠించిన కారణంగా అతని జనాజా (అంత్యక్రియల) నమాజ్‌ను చేయవచ్చని ఈ హదీసు చెబుతున్నది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) కూడా దీంతో ఏకీభవించారుగాని దైవధర్మంపై తిరుగుబాటు వైఖరిని ప్రదర్శించిన వ్యక్తి యొక్క జనాజా నమాజ్ మాత్రం చేయరాదని అన్నారు. మొత్తంమీద ఇస్లాం ధర్మం పట్ల పబ్లిగ్గా ధిక్కారానికి పాల్పడిన వ్యక్తి మరియు ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి జనాజా నమాజు చేయ కూడదు. దైవప్రవక్త (స) సయితం ఆత్మహత్యకు పాల్పడిన ఒక వ్యక్తి అంత్యక్రియల నమాజులో పాల్గొనలేదు. అయితే "మీరు వెళ్ళి అతని జనాజా నమాజ్ చేయించండి" అని ఆయన (స) తన సహచరులను ఆదేశించారు.

(٣٤٠) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا أَتَى أَحَدُكُمُ الصَّلاَةَ، وَالإِمَامُ عَلَى حَالٍ، فَلْيَصْنَعْ كَمَا يَصْنَعُ الإِمَامُ». رَوَاهُ التِّرْمِذِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

340. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) వివరించారు : “మీలో ఎవరయినా నమాజ్ చేయ డానికి వస్తే, ఇమామ్‌ను ఏ స్థితిలో చూస్తే ఆ స్థితిలోనే మీరు ఇమామ్‌ను అనుసరించండి.” (తిర్మిజీ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

అంటే ఇమామ్ రుకూ స్థితిలో వుంటే, అప్పుడే వచ్చిన వ్యక్తి అల్లాహు అక్బర్ అంటూ రుకూలో చేరిపోవాలి. ఇమామ్ సజ్దా స్థితిలో ఉంటే అల్లాహు అక్బర్ అంటూ సజ్దాలోకి వెళ్ళిపోవాలి. ఒకవేళ ఇమామ్ కూర్చునివుంటే వచ్చినవ్యక్తి అల్లాహు అక్బర్ అంటూ కూర్చోవాలి. తిర్మిజీలోని ఈ హదీసు 'జయీఫ్' అయినప్పటికీ ఇతర హదీసుల ద్వారా దీనికి మద్దతు లభిస్తున్నది.

## ١١ - بَابُ صَلاَةِ الْمُسَافِرِ وَالْمَرِيضِ

## 11వ అధ్యాయం
## ప్రయాణీకుల, వ్యాధిగ్రస్తుల నమాజ్

(٣٤١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَوَّلُ مَا فُرِضَتِ الصَّلاَةُ رَكْعَتَانِ، فَأُقِرَّتْ صَلاَةُ السَّفَرِ، وَأُتِمَّتْ صَلاَةُ الْحَضَرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

341. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : “ప్రారంభకాలంలో రెండు రకతులు ఫర్జ్ (విధి) గావించబడ్డాయి. అంటే ఫర్జ్ గావించబడినవి రెండు రక తులే. అవి (ప్రయాణీకుల నమాజ్‌గా) మిగిల్చి ఉంచబడ్డాయి. సాధారణ (స్థితి లోని) నమాజ్ పరిపూర్ణం గావించ బడింది. (అంటే నాలుగు రకతులు చేయబడింది) (బుఖారీ, ముస్లిం)

وَلِلْبُخَارِيِّ: ثُمَّ هَاجَرَ، فَفُرِضَتْ أَرْبَعاً، وَأُقِرَّتْ صَلاَةُ السَّفَرِ عَلَى الأَوَّلِ.

బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది - “ఆయన (స) హిజ్రత్ చేసిన తరువాత నాలుగు రకతులు విధించ బడ్డాయి. ప్రయాణ నమాజ్ మాత్రం యథాతథంగా (మొదటి స్థితిలో) ఉంచ బడింది.”

وَزَادَ أَحْمَدُ: إِلاَّ الْمَغْرِبَ، فَإِنَّهَا وِتْرُ النَّهَارِ، وَإِلاَّ الصُّبحَ، فَإِنَّهَا تُطَوَّلُ فِيهَا الْقِرَاءَةُ.

అహ్మద్ ఈ వాక్యాన్ని అదనంగా చేర్చారు: "మగ్రిబ్ నమాజ్ తప్ప. ఎందుకంటే అవి పగటి వితర్. ఉదయం నమాజ్ కూడా యధాతథంగానే ఉంచబడింది. ఎందుకంటే ఈ నమాజ్‌లో ఖుర్‌ఆన్ పారాయణం సుదీర్ఘంగా ఉంటుంది."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే తొలి కాలంలో సాధారణ సమయాలలోనూ, ప్రయాణావస్థలోనూ రెండేసి రకతుల నమాజ్ మాత్రమే ఫర్జ్‌గా ఉండేది. తరువాత ప్రయాణావస్థ నమాజును యధాతథంగా వుంచి, సాధారణ స్థితిలో నమాజ్‌ను రెండింతలు చేయటం జరిగింది. అంటే రెండు రకతుల ఫర్జ్ నమాజ్ కాస్తా నాలుగు రకతులుగా చేయబడింది.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఖసర్ నమాజ్ గురించిన ప్రస్తావన వచ్చింది. ప్రయాణావస్థలో నమాజ్‌ను ఖసర్ చేయటం (తగ్గించటం) ధర్మసమ్మతమేనని అందులో చెప్పబడిందేగాని, ఖసర్ చేయటం వాజిబ్ (తప్పనిసరి) అని మాత్రం అనబడలేదు.

ప్రయాణంలో ఖసర్ చేయటం వాజిబ్ (తప్పనిసరి) అన్నది ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిమతం. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) లు మాత్రం ఖసర్‌ను సున్నత్ (దైవప్రవక్త) సంప్రదాయంగా తలపోస్తున్నారు.

దారె ఖుత్నీలో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ఈ విధంగా ఉంది - "ప్రయాణ సమయంలో నేను పూర్తి నమాజ్ చేశాను. దీనిగురించి ఆయన (సఅసం) కు తెలియజేయగా, ఆయన (స) మెచ్చుకున్నారు."

(٣٤٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقْصُرُ فِي السَّفَرِ وَيُتِمُّ، وَيَصُومُ وَيُفْطِرُ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَرُوَاتُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ مَعْلُولٌ، وَالْمَحْفُوظُ عَنْ عَائِشَةَ مِنْ فِعْلِهَا، وَقَالَتْ: إِنَّهُ لاَ يَشُقُّ عَلَيَّ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ.

342. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణ దినాలలో ఒక్కోసారి ఖసర్ చేసేవారు. ఒక్కోసారి పూర్తి నమాజ్ చేసేవారు. (అంటే రెండింటినీ అనుసరించేవారు). అలాగే ఉపవాసాలూ ఉండేవారు, ఇఫ్తార్ కూడా చేసేవారు '(దారె ఖుత్నీ). ఈ హదీసును అందజేసిన వారు విశ్వసనీయులు. కాని హదీసు అందిన పరంపరలో మాత్రం ఎక్కడో లింకు తెగింది. అయితే హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారి ఆచరణ రూపంలో ఇది సురక్షితంగా ఉంది. "ఉపవాసవ్రతం

నాకు భారమేమీ కాదు" అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వక్కాణించారు.

(బైహఖీ)

343. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "అల్లాహ్ రాయితీ నిచ్చిన విషయాలలో ఈ రాయితీలపై అమలు చేయటం ఆయనకెంతో ఇష్టం. ఆయన తన అవిధేయతను ఎంతగా ఇష్టపడడో అంతగానే (తన ప్రసాదిత సౌలభ్యాలను సద్వినియోగ పరచుకోవటాన్ని ఇష్టపడతాడు).

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్‌లు ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు). వేరొక ఉల్లేఖనంలో ఈ వాక్యం ఉంది - "తాను తాకీదు చేసిన ఆదేశాలను - ఫర్జ్‌లను - నెరవేర్చటాన్ని అల్లాహ్ ఇష్టపడినట్లే."

(٣٤٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ اللهَ يُحِبُّ أَنْ تُؤْتَى رُخَصُهُ، كَمَا يَكْرَهُ أَنْ تُؤْتَى مَعْصِيَتُهُ». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وابْنُ حِبَّانَ، وَفِي رِوَايَةٍ: «كَمَا يُحِبُّ أَنْ تُؤْتَى عَزَائِمُهُ».

**సారాంశం**

ప్రయాణంలో నమాజ్‌ను ఖసర్ చేసి (తగ్గించి) చేయటం ఉత్తమమని ఈ హదీసు తాత్పర్యం. క్రియాత్మకంగా 4 రకతుల బదులు 2 రకతులే చేసినప్పటికీ ఇదే శ్రేష్ఠమయినది - ఎందుకంటే దేవుడు సమకూర్చిన సౌలభ్యాన్ని సద్వినియోగపరచుకోవటం దాసుల విజ్ఞతకు తార్కాణం. ఇది దైవానికి అత్యంత ప్రీతికరం.

344. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు మైళ్ళు, లేక మూడు 'ఫెర్సిఖ్'ల దూరం ప్రయాణం చేసినపుడు రెండు రకతుల (ఖసర్) నమాజ్ చేసేవారు."

(ముస్లిం)

(٣٤٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا خَرَجَ مَسِيرَةَ ثَلاَثَةِ أَمْيَالٍ أَوْ ثَلاَثَةِ فَرَاسِخَ صَلَّى رَكْعَتَيْنِ. رَوَاهُ مُسْلِمٌ.

**సారాంశం**

ఒక మైలుకు 8 ఫర్లాంగులు. ఒక 'ఫిరసిఖ్' మూడు మైళ్లకు సమానం. మూడు 'ఫిరసిఖ్'లు అంటే 9 మైళ్ళు అన్నమాట! అయితే ఈ 'దూరం' విషయంలో హదీసువేత్తల, ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ.లై), ఆయన ప్రియ అనుయాయి హాఫిజ్ ఇబ్నె ఖయ్యిం (రహ్మ.లై) ల అభిప్రాయం ప్రకారం ఖసర్ నమాజు కోసం ఇంతదూరం ప్రయాణించాలి అని ఖచ్చితంగా ఏమీ నిర్ధారితం కాలేదు. ఇమామ్ షూబ (రహ్మ.లై) గారు మూడు మైళ్లు లేక మూడు ఫిరసిఖ్‌లు ప్రయాణిస్తే చాలు, ఖసర్ చేయవచ్చునని వ్యాఖ్యానించారు. హదీసులో కూడా ఈ మాటే అనబడింది. కొంతమంది ఈ దూరాన్ని 36 మైళ్లుగా, మరి కొందరు 48 మైళ్లుగా, ఇంకా కొందరు 56 మైళ్లుగా నిర్ధారించారు. వాస్తవానికి ఇవన్నీ అంచనాల ఆధారంగా నిర్ధారించుకున్నవే గాని వారి ఈ నిర్ధారణను సమర్థించే సహీహ్ హదీసు ఏదీ లేదు.

(٣٤٥) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: خَرَجْنَا مَعَ رَسُولِ اللّٰهِ ﷺ مِنَ الْمَدِيْنَةِ إِلَى مَكَّةَ، فَكَانَ يُصَلِّيْ رَكْعَتَيْنِ رَكْعَتَيْنِ، حَتَّى رَجَعْنَا إِلَى الْمَدِيْنَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

345. హజ్రత్ అనస్ (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి మదీనా నుండి మక్కా వరకు పయనించాము. ఆయన (సఅసం) తిరిగి వచ్చేదాకా రెండేసి రకతులే చేశారు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

ప్రయాణ సంకల్పంతో మనిషి తన ఇంటి నుండి బయలుదేరినప్పటినుండీ అతడు బాటసారి గానే పరిగణించబడతాడు. పట్టణ పరిధిని దాటితే, అంటే నేటి ఆధునిక పరిభాషలో మునిసిపల్ పరిసరాలను లేక పంచాయితీ పొలిమేరలను దాటినప్పటినుండీ తిరిగివచ్చే వరకూ అతడు ప్రయాణీకుడే. ఈ మధ్య కాలంలో అతడు 'ఖసర్' చేయవచ్చు.

(٣٤٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَقَامَ النَّبِيُّ ﷺ تِسْعَةَ عَشَرَ يَوْماً يَقْصُرُ وَفِيْ لَفْظٍ: «بِمَكَّةَ، تِسْعَةَ عَشَرَ يَوْماً». رَوَاهُ الْبُخَارِيُّ. وَفِيْ رِوَايَةٍ لِأَبِيْ دَاوُدَ: «سَبْعَ عَشْرَةَ». وَفِيْ أُخْرَى: «خَمْسَ عَشْرَةَ».

346. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 19 రోజులపాటు ప్రయాణంలో (ఒకచోట ఆగి) వున్నారు. కాని ఆయన (స) 'ఖసర్' చేస్తూ వున్నారు. 'మక్కాలో 19 రోజులు ఉన్నార'ని వేరొక ఉల్లేఖనంలో ఉంది (బుఖారీ). అబూ దావూద్ ఉల్లేఖనంలో 17 రోజులు అని ఉంది. ఇంకొక ఉల్లేఖనంలో 15 రోజులని ఉంది.

وَلَهُ عَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ: «ثَمَانِيَ عَشْرَةَ». وَلَهُ عَنْ جَابِرٍ: أَقَامَ بِتَبُوكَ عِشْرِينَ يَوماً يَقْصُرُ الصَّلَاةَ. وَرُوَاتُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ اخْتُلِفَ فِي وَصْلِهِ.

అబూదావూద్‌లోనే ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది - "ఆయన(స) ఆగిన కాలం 18 రోజులు." "ఆయన (స) తబూక్‌లో 20 రోజులు ఆగారు. ఆగినన్ని రోజులూ ఖసర్ చేశారు" అని జాబిర్ (రజి) చెప్పారు. ఈ ఉల్లేఖనాన్ని అందజేసిన వారు విశ్వస నీయులేగాని, అసలిది ఎక్కడినుండి మొదలైంది అన్న విషయం వివాదా స్పదం అయింది. (అబూదావూద్)

**సారాంశం**

మక్కాలో దైవప్రవక్త (సఅసం) ఆగిన రోజుల గురించి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 19 రోజులని కొందరూ, 17 రోజులని మరికొందరు, 18 రోజులని ఇంకొందరూ వాదించారు. ప్రతి ఒక్కరూ తమ తమ వాదనల కనుగుణంగా ఏదో ఒక ఆధారాన్ని ఉదాహరించారు. వాస్తవానికి ఇది దైవప్రవక్త (స) మక్కాను జయించినప్పటి సంఘటన. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆగిన గడువు కాదిది. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆయన (స) విచ్చేసినపుడు మొత్తం పది రోజులకన్నా ఎక్కువ ఉండలేదు. ఈ వివిధ ఉల్లేఖనాలను జోడించిన పిదప 19 రోజుల ఉల్లేఖనం ఇతర ఉల్లేఖనాలకన్నా దృఢంగా కనిపిస్తుంది. ఎందుకంటే దైవప్రవక్త (స) మక్కా విజయం సందర్భంగా - రమజాన్ నెల 17వ తేదీ మంగళవారం వాడు మక్కాలో ప్రవేశించారు. అక్కడి నుండి హునైన్ వైపునకు షవ్వాల్ మాసం 6వ తేదీన బయలుదేరారు. దాఖలైన రోజును, వెడలిపోయిన రోజును కలుపుకుంటే మొత్తం 19 రోజులవుతాయి.

అయితే ఈ 'అన్వయింపు' విషయంలో ధర్మవేత్తలమధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపాయి. ఒక్కొక్కరు ఒక్కో కోణం నుంచి ప్రయాణీకుని నిరీక్షణా గడువును నిర్ధారించారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మలై)ల దృష్టిలో ఈ గడువు 3 రోజులు. ఇమామ్ అబూహనీఫా (రహ్మ.లై) దృష్టిలో 15 రోజులు. కాని ప్రయాణీకుని తిరుగు ప్రయాణ సమయం నిర్ధారితం కాక అతడు సందిగ్ధావస్థకు లోనైవుంటే అట్టి పరిస్థితిపై కూడా ఇమాముల మధ్య అభిప్రాయభేదం ఏర్పడింది. ఇలాంటి సందిగ్ధావస్థకు లోనై వున్న ప్రయాణీకుడు, అతడు తన స్థిరనివాసానికి చేరుకునేవరకూ ఖసర్ చేయవచ్చని ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయపడ్డారు. ఒకానొక కథనం ప్రకారం ఇమామ్ షాఫయి కూడా దీనికి మద్దతు తెలిపారు. ఈ అభిప్రాయాన్ని సమర్థించే సంఘటనలు కూడా ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) అజర్ బాయ్‌జాన్‌లో 6 నెలల దాకా 'ఖసర్' చేశారు. హజ్రత్ అనస్ (రజి) ఒక ప్రయాణంలో ఏడాది కాలం లేక రెండేళ్ళపాటు డోలాయమాన

స్థితిలో ఉండవలసి వచ్చింది. అప్పటివరకూ ఆయన ఖసర్ చేస్తూనే వున్నారు. కొంతమంది ప్రవక్త సహచరులు ఒక ప్రయాణంలో 9 మాసాల దాకా అనిశ్చిత స్థితికి లోనుకావలసి వచ్చింది. ఈ స్థితి తొలగిపోయేదాకా వారు ఖసర్ చేసినట్టు ఆధారాలున్నాయి. ఈ సంఘటనల ద్వారా అవగతమయ్యే దేమిటంటే ప్రయాణంలో మనిషి అనిశ్చిత స్థితికి, సందిగ్ధావస్థకు గురైవున్నంత కాలం 'ఖసర్' గడువు ఇదమిత్థంగా 'ఇంత' అని చెప్పజాలము. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా అతను ఎన్నాళ్ళయినా 'ఖసర్' చేయటం ధర్మసమ్మతమే.

(٣٤٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا ارْتَحَلَ قَبْلَ أَنْ تَزِيغَ الشَّمْسُ، أَخَّرَ الظُّهْرَ إِلَى وَقْتِ الْعَصْرِ، ثُمَّ نَزَلَ فَجَمَعَ بَيْنَهُمَا، فَإِنْ زَاغَتِ الشَّمْسُ قَبْلَ أَنْ يَرْتَحِلَ صَلَّى الظُّهْرَ ثُمَّ رَكِبَ. مُتَّفَقٌ عَلَيْهِ.

347. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సూర్యుడు (పడమటి దిక్కున) వాలక ముందే ప్రయాణానికి బయలుదేరి వుంటే జుహ్ర్ నమాజును అస్ర్ నమాజ్ వేళ వరకూ చేయకుండా వాయిదా వేసే వారు. ఆ తర్వాత వాహనం దిగి జుహ్ర్ అస్ర్ నమాజులను ఒకేసారి నెరవేర్చే వారు. ఒకవేళ ప్రయాణానికి బయలు దేరక ముందే సూర్యుడు (పడమటి దిశన) వాలిపోయి వుంటే, అప్పుడు జుహ్ర్ నమాజ్ చేసి ప్రయాణం కట్టేవారు. (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةِ الْحَاكِمِ فِي الْأَرْبَعِينَ بِالْإِسْنَادِ الصَّحِيحِ: صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ ثُمَّ رَكِبَ.

హాకిమ్ గారి 'అర్బయీన్'లో ఒక ప్రామాణిక ఆధారం ఇలా ఉంది: "ఆయన (స) జుహ్ర్, అస్ర్ నమాజులను (ఒకేసారి) చేసి ప్రయాణానికి బయలుదేరారు."

وَلِأَبِي نُعَيْمٍ فِي مُسْتَخْرَجِ مُسْلِمٍ: كَانَ إِذَا كَانَ فِي سَفَرٍ فَزَالَتِ الشَّمْسُ صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ جَمِيعاً، ثُمَّ ارْتَحَلَ.

అబూ నుఐమ్ గారి "ముస్తఖ్రజ్"లో ఇలా వుంది - "ఆయన (స) ప్రయాణంలో నున్నప్పుడు, పొద్దు వాలిన తరువాత జుహ్ర్ మరియు అస్ర్ - రెండింటినీ కలిపి చేసేవారు. ఆ తరువాత ముందుకు సాగిపోయేవారు.

348. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం : "మేము తబూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (సఅసం) వెంట ఉన్నాము. ఆయన (స) జుహ్రా - అస్ర్ నమాజులను కలిపి చేసేవారు. మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి ఒకేసారి చేసే వారు." (ముస్లిం)

(٣٤٨) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: خَرَجْنَا مَعَ النَّبِيِّ ﷺ فِي غَزْوَةِ تَبُوكَ، فَكَانَ يُصَلِّي الظُّهْرَ وَالْعَصْرَ جَمِيْعاً. رَوَاهُ مُسْلِمٌ.

349. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : నాలుగు 'బురుద్'ల కన్నా తక్కువ దూరం వుంటే ఖసర్ నమాజ్ చేయకండి. నాలుగు బురుద్‌లంటే మక్కా నుండి 'ఉస్ఫాన్' వరకు గల దూరం. (దీనిని దారె ఖుత్నీ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు. వాస్తవానికి ఈ హదీసు 'మౌఖూఫ్' కోవకు చెందినది. ఇబ్నె ఖుజైమ కూడా దీనిని ఈ విధంగానే ఉల్లేఖించారు)

(٣٤٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهما قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «لَا تَقْصُرُوا الصَّلَاةَ فِي أَقَلَّ مِنْ أَرْبَعَةِ بُرُدٍ، مِنْ مَكَّةَ إِلَى عُسْفَانَ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَالصَّحِيحُ أَنَّهُ مَوْقُوفٌ، كَذَا أَخْرَجَهُ ابْنُ خُزَيْمَةَ.

**సారాంశం**

'బురుద్' అనేది బహు వచనం. ఏకవచనంలో 'బరీద్' గా వ్యవహరిస్తారు. ఒక బరీద్ 12 మైళ్ళకు సమానం. 4 బురుదులంటే మొత్తం 48 మైళ్ళు అవుతాయి.

4 బురుదులకన్నా తక్కువ దూరం ప్రయాణిస్తే ఖసర్ ధర్మసమ్మతం కాదంటూ హదీసును అందజేసిన వ్యక్తి నమ్మదగిన వ్యక్తి కాడు. అతడు హదీసుకు అబద్ధాన్ని అంటగట్టాడు. ఇమామ్ సౌరీ (రహ్మాలై) అతన్ని కజ్జాబ్‌గా అభివర్ణించారు. ఇబ్నె అబ్బాస్ (రజి) స్వయంగా మక్కా-తాయఫ్‌ల మధ్య ప్రయాణం చేసినపుడు ఖసర్ చేసేవారని ఆధారాలున్నాయి. మక్కా - ఉస్ఫాన్‌ల మధ్య, మక్కా - జెద్దాల మధ్య కూడా ఆయన ఖసర్ చేసేవారని ఇమామ్ మాలిక్ తన 'ముఅత్తా' లో నకలు చేశారు.

350. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారు - "నా ఉమ్మత్ (అనుచర సమాజం)లో అత్యుత్తములెవరంటే,

(٣٥٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «خَيْرُ أُمَّتِي الَّذِين

إِذَا أَسَاءُوا اسْتَغْفَرُوا، وَإِذَا سَافَرُوا قَصَرُوا وَأَفْطَرُوا». أَخْرَجَهُ الطَّبَرَانِيُّ فِي الْأَوْسَطِ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَهُوَ فِي مَرَاسِيلِ سَعِيدِ بْنِ الْمُسَيَّبِ عِنْدَ الْبَيْهَقِيِّ مُخْتَصَراً.

వారు తప్పులు చేసి క్షమాపణకై వేడుకుంటారు. ప్రయాణంలో ఉన్నప్పుడు ఖసర్ నమాజ్ చేస్తారు. ఉపవాసం ఉండరు." (దీనిని తబ్రానీ బలహీన ఆధారంతో తన 'ఔసత్'లో ఉల్లేఖించారు. బైహఖీలో సయీద్ బిన్ ముసైబ్ ఆధారంగా సంక్షిప్తంగా దీని గురించి వివరించబడింది)

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందజేసిన వారిలో ఒకరైన సయీద్ బిన్ ముసైబ్ (రహ్మ.లై) తాబయీన్ల నాయకునిగా ప్రసిద్ధిచెందారు. గొప్ప పండితులు. హదీసు, ఫికహ్, దైవధ్యానం, ఆరాధనలు, తఖ్వా (దైవభక్తి) తదితర అంశాలపై ఎంతో జ్ఞానసంపదను సమకూర్చారు. విద్యల క్రోడీకరణలో ప్రవీణులు. ఈయన హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ మొదలయిన రెండు సంవత్సరాలకు జన్మించారు. హిజ్రీ 90 లో మరణించారు.

(٣٥١) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَتْ بِي بَوَاسِيرُ، فَسَأَلْتُ النَّبِيَّ ﷺ عَنِ الصَّلَاةِ، فَقَالَ: «صَلِّ قَائِماً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَقَاعِداً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَعَلَى جَنْبٍ». رَوَاهُ الْبُخَارِيُّ.

351. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : నేను మొలల వ్యాధితో బాధ పడేవాణ్ణి. ఈ స్థితిలో నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను సంప్రతించి నమాజ్ ఎలా చేయాలని అడిగాను. ఆయన (సఅసం) ఈ సలహా ఇచ్చారు-"నిలబడి (నమాజ్) చేయండి. ఒకవేళ నిలబడి చేయలేకపోతే కూర్చుని చేయండి. కూర్చుని చేయడానికి కూడా వీలుపడకపోతే ఒక ప్రక్కకు ఒత్తిగిలి నమాజ్ చేయండి." (బుఖారీ)

### సారాంశం

అయితే ఎలా కూర్చుని నమాజ్ చేయాలి? కాళ్లు మడతపెట్టుకుని కూర్చోవాలా? లేక తషహ్హుద్ స్థితిలో కూర్చున్నట్లు కూర్చోవాలా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వ్యాధిగ్రస్తుడు ఎలా కూర్చోగలిగితే అలాగే కూర్చుని నమాజ్ చేయవచ్చు. పడుకొని నమాజ్ చేసేటప్పుడు కూడా ఎలా వీలుంటే అలా చేయవచ్చు.

352. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రోగిని పరామర్శించారు. అతడు దిండుపై నమాజ్ (సజ్దా) చేస్తున్నాడు. దైవప్రవక్త (స) ఆ దిండును తీసిపార వేశారు. "నీకు వీలుపడితే నేలపై నమాజ్ చెయ్యి. లేకుంటే తల ఊపుతూ నమాజ్ చెయ్యి. సజ్దా చేయవలసి వచ్చినపుడు మాత్రం రుకూ కన్నా కాస్త క్రిందికి తలను వంచు." (బైహఖీ దీనిని ఉల్లేఖించారు. అబూ హాతిమ్ గారు ఇది 'మౌఖూఫ్' కావటాన్ని నిజమని ఖరారు చేశారు)

(٣٥٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: عَادَ النَّبِيُّ ﷺ مَرِيضاً، فَرَآه يُصَلِّي عَلَى وِسَادَةٍ فَرَمَى بِهَا، وَقَالَ: **«صَلِّ عَلَى الْأَرْضِ إِنِ اسْتَطَعْتَ، وَإِلاَّ فَأَوْمِ إِيْمَاءً، وَاجْعَلْ سُجُودَكَ أَخْفَضَ مِنْ رُكُوعِكَ».** رَوَاهُ الْبَيْهَقِيُّ، وَصَحَّحَ أَبُو حَاتِمٍ وَقْفَهُ.

353. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను కాళ్ళు మడత పెట్టు కుని నమాజ్ చేయగా చూచాను." (దీనిని నసాయి ఉల్లేఖించారు - హాకిమ్ గారు దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

(٣٥٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنها قالت: رَأَيْتُ النَّبِيَّ ﷺ يُصَلِّي مُتَرَبِّعاً. رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

**12 వ అధ్యాయం**

## జుమా నమాజ్

## ١٢ - بَابُ صَلاَةِ الْجُمُعَةِ

354. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) మరియు హజ్రత్ అబూహురైర (రజి)ల కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్ వేదిక మెట్లపై (నుంచి) చెబుతుండగా తాము విన్నామని తెలిపారు - "ప్రజలు జుమా (శుక్ర వారం) నమాజు విడనాడటాన్ని మాను కోవాలి. లేకపోతే అల్లాహ్ వారి హృద

(٣٥٤) عَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ، وَأَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمْ، أَنَّهُمَا سَمِعَا رَسُولَ اللهِ ﷺ يَقُولُ عَلَى أَعْوَادِ مِنْبَرِهِ: **«لَيَنْتَهِيَنَّ أَقْوَامٌ عَنْ وَدْعِهِمُ الْجُمُعَاتِ، أَوْ**

لَيَخْتِمَنَّ اللّٰهُ عَلَى قُلُوبِهِمْ، ثُمَّ لَيَكُونُنَّ مِنَ الْغَافِلِينَ». رَوَاهُ مُسْلِمٌ.

యాలపై సీలు వేస్తాడు. మరి వారు నిశ్చయంగా విస్మరణకు గురైన వారిలో చేరిపోతారు.'' (ముస్లిం)

### సారాంశం

'జుమా' అంటేనే అసలు ఒకచోట సమావేశమవటం అని అర్థం. అజ్ఞానకాలంలో అరేబియాలో దీనిని 'ఉరూబ'గా వ్యవహరించేవారు. ఇస్లాం దీనికి 'జుమా' అని నామకరణం చేసింది. ముస్లింలు ఒక ప్రత్యేక దినాన ప్రత్యేక వేళలో సమావేశమై, అందరూ కలసి దైవారాధన చేసుకోవాలనీ, ఒండొకరి మంచీచెబ్బరలను గురించి తెలుసుకోవాలని, సామూహిక నిర్ణయాలు గైకొనాలని ఇస్లాం అభిలషిస్తోంది.

ఈ హదీసు ద్వారా శుక్రవారం నమాజు యొక్క ప్రాముఖ్యత స్పష్టమవుతోంది. షరీయత్‌పరమైన తగు కారణమేదీ లేకుండా దీనిని విడనాడినవారి హృదయాలపై సీలుపడిపోతుందని, దైవధర్మంపట్ల వారిలో పూర్తిగా నిర్లక్ష్య వైఖరి పొడసూపుతుందని, ఎట్టకేలకు వారు కపటులుగా, మిథ్యావాదులుగా మారిపోయే అవకాశం ఉందనీ హదీసు భావం. కాబట్టి శుక్రవారం నమాజును సాధారణ నమాజుగా భావించి దానిపట్ల అశ్రద్ధ, ఉపేక్ష కనబరచరాదు. ఒకవేళ అలా చేస్తే అది దౌర్భాగ్యానికి, పరాభవానికి తొలిమెట్టు అవుతుంది.

(٣٥٥) وَعَنْ سَلَمَةَ بْنِ الْأَكْوَعِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي مَعَ رَسُولِ اللّٰهِ ﷺ الْجُمُعَةَ، ثُمَّ نَنْصَرِفُ وَلَيْسَ لِلْحِيطَانِ ظِلٌّ نَسْتَظِلُّ بِهِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

355. హజ్రత్ సలమ బిన్ అక్వ (రజి) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి జుమా నమాజు చేసేవారము. జుమా నమాజు ముగిసిన తరువాత మేము ఇళ్లకు వెళ్ళే టప్పుడు గోడ ప్రక్కన నీడలో విశ్రాంతి తీసుకుందామంటే గోడల నీడ క్రింద కనబడేదికాదు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు బుఖారీలోనివి)

وَفِي لَفْظٍ لِّمُسْلِمٍ: كُنَّا نُجَمِّعُ مَعَهُ إِذَا زَالَتِ الشَّمْسُ، ثُمَّ نَرْجِعُ، نَتَتَبَّعُ الْفَيْءَ.

''ఆయన(స)తో కలసి జుమా నమాజు చేసేవారం. పొద్దు వాలగానే వాపసు అయ్యేవారం'' అని ముస్లింలో ఉంది.

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) కాలంలో శుక్రవారం నమాజు చాలా తొందరగా చేసేవారన్న దానికి ఈ హదీసు మచ్చుతునక. అయితే పొద్దువాలక మునుపు మాత్రం నమాజ్ అయ్యేది కాదన్నది కూడా గమనార్హమే. దాదాపు శుక్రవారం నమాజ్ కూడా జుహ్ర్ వేళలోనే అవుతుంది. విద్వాంసులలో అత్యధికులు ఈ సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఇమామ్ అహ్మద్, ఇమామ్ రాహ్వే, ఇమామ్

మాలిక్ ప్రభృతులు మాత్రం పొద్దువాలక ముందు కూడా జుమా నమాజ్ చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

ఆధునిక కాలంలోనయితే కొన్నిచోట్ల ప్రజలు జుహ్ర్ నమాజ్ వేళకన్నా ఆలస్యంగా జుమా నమాజ్ చేస్తున్నారు. ఇది దైవప్రవక్త (స) విధానానికి వ్యతిరేకం. మస్జిద్ ఇమాములు, వక్తలు దీని గురించి సీరియస్‌గా ఆలోచించాలి.

## హదీసు ఉల్లేఖకులు

సలమ బిన్ అక్వ (రజి). మరోపేరు అబూ ముస్లిం. దైవప్రవక్త (స) ప్రియ సహచరులలో గొప్ప యోధునిగా భావించబడేవారు. పరుగులో గుఱ్ఱంకన్నా వేగం అని ప్రతీతి. దాతృ స్వభావం గలవారు. విద్యావంతులు. మూర్తీభవించిన మృదుత్వం. మదీనాలో హిజ్రీ 74లో కన్నుమూశారు.

(٣٥٦) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: مَا كُنَّا نَقِيْلُ وَلاَ نَتَغَدَّى إِلاَّ بَعْدَ الْجُمُعَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ. وَفِيْ رِوَايَةٍ: فِي عَهْدِ رَسُولِ اللّٰهِ ﷺ.

356. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : "(శుక్రవారం నాడు) మేము మధ్యాహ్న భోజనం, మధ్యాహ్న విశ్రాంతి జుమా నమాజ్ అనంతరమే చేసే వారము." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

"దైవప్రవక్త (సఅసం) గారి కాలంలో ఇలా జరిగేది" అని వేరొక ఉల్లేఖనంలో వుంది.

## సారాంశం

ఈ హదీసు ద్వారా కూడా బోధపడేదేమంటే, దైవప్రవక్త (సఅసం) కాలంలో జుమా నమాజ్ తొందరగా ముగిసేది. ప్రవక్త సహచరులు నమాజ్ అనంతరం ఇళ్లకు వెళ్ళి భోజనం చేసి విశ్రమించేవారు.

## హదీసు ఉల్లేఖకులు

సహ్ల్ బిన్ సాద్ (రజి) అసలు పేరు. అబుల్ అబ్బాస్ మారుపేరు. ఖజ్రజీ సైదీ అన్సారీ. ఇస్లాంకు పూర్వం ఈయన పేరు హజన్. ఇస్లాం స్వీకరణ తరువాత దైవప్రవక్త (స) ఈయన పేరు మార్చారు. మనిషి పేరులో దోషం ఉంటే దాన్ని మార్చివేయాలని ఈ హదీసు చెబుతోంది. దైవప్రవక్త (సఅసం) మరణించే సమయానికి ఈయన వయస్సు 15 సంవత్సరాలు మాత్రమే. హిజ్రీ 91లో మదీనాలో మరణించారీయన. మదీనాలో అందరికన్నా ఆఖరిలో మరణించిన సహాబీ ఈయనే. ఈయనగారి చేత సుమారు 100 హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(٣٥٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى

357. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَخْطُبُ قَائِماً، فَجَاءَتْ عِيرٌ مِنَ الشَّامِ، فَانْفَتَلَ النَّاسُ إِلَيْهَا، حَتَّى لَمْ يَبْقَ إِلاَّ اثْنَا عَشَرَ رَجُلاً. رَوَاهُ مُسْلِمٌ.

జుమా ప్రసంగం నిలబడి ఇస్తుండగా సిరియా నుండి ఒక వర్తక బిడారు వచ్చింది. ప్రజలు ఆ బిడారు వైపునకు ఎగబడ్డారు. కేవలం 12 మంది మాత్రమే మస్జిద్‌లో వుండిపోయారు. (ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) నిలబడి జుమా ప్రసంగం ఇచ్చేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమయింది. సాంప్రదాయిక పద్ధతి ఇదే. జుమా ప్రసంగం జుమా నమాజ్‌కు ముందే అవుతుంది. 12 మంది ఉన్నప్పటికీ జుమా ప్రసంగం ఇవ్వవచ్చునని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. షాఫయీలు 40 మంది ఉంటేనే జుమా ప్రసంగం ఇవ్వాలన్నారు. ఇది సరైనది కాదు.

(٣٥٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ أَدْرَكَ رَكْعَةً مِنْ صَلاَةِ الْجُمُعَةِ وَغَيْرِهَا فَلْيُضِفْ إِلَيْهَا أُخْرَى، وَقَدْ تَمَّتْ صَلاَتُهُ». رَوَاهُ النَّسَائِيُّ وَابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ، وَاللَّفْظُ لَهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ، لَكِنْ قَوَّى أَبُو حَاتِمٍ إِرْسَالَهُ.

358. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం-''ఎవరయితే జుమా నమాజు మరియు ఇతర నమాజులలో ఏదైనా ఒక రకతును (జమాఅత్‌లో) పొందారో, వారు మిగిలిన దానిని దాంతో కలుపు కోవాలి. (అలా కలుపుకుంటే)చాలు, అతని నమాజ్ పూర్తయినట్లే.'' (నసాయి, ఇబ్నె మాజ, దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం దారె ఖుత్నీకి చెందినవి. దీని ప్రమాణం సరైనది. అయితే అబూ హాతింగారు దీనిని 'ముర్సల్' అని గట్టిగా భావిస్తున్నారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే జుమా నమాజులో ఒక రకత్‌ను మాత్రమే పొందినవాడు, దాంతోపాటు రెండవ రకత్‌ను కూడా కలుపుకోవాలి. అంటే అతను సలాం చేయకుండా నిలబడి రెండవ రకత్ (నమాజ్) అప్పటికప్పుడే చేయాలి. ఆఖరిలో వచ్చి ఒక రకత్‌ను పొందినవాడు జుమా ప్రసంగాన్ని కోల్పోయినట్లే. కాని అతని జుమా మాత్రం నెరవేరుతుంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల అభిప్రాయం కూడా ఇదే.

(٣٥٩) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ

359. హజ్రత్ జాబిర్ బిన్ సమురహ (రజి) కథనం : ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి

اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَخْطُبُ قَائِماً، ثُمَّ يَجْلِسُ، ثُمَّ يَقُومُ فَيَخْطُبُ قَائِماً، فَمَنْ أَنْبَأَكَ أَنَّهُ كَانَ يَخْطُبُ جَالِساً فَقَدْ كَذَبَ. أَخْرَجَهُ مُسْلِمٌ.

వ సల్లం) నిలబడి శుక్రవారం ప్రసంగం చేసేవారు. మధ్యలో కొద్దిసేపు కూర్చునే వారు. మళ్ళీ నిలబడి ఉపన్యసించే వారు. ఆయన (సఅసం) కూర్చొని ఉపన్యసించేవారని ఎవరయినా మీకు సమాచారమందిస్తే అతడు అబద్ధం చెప్పాడు (అని భావించండి)." (ముస్లిం)

**సారాంశం**

జుమాలో రెండు ప్రసంగాలున్నాయి. రెండు ప్రసంగాలకు మధ్య కొద్దిసేపు విరామం అవసరం. ఆ విరామ సమయంలో కూర్చోవటం సంప్రదాయం (సున్నత్). రెండు ప్రసంగాలను కూడా ఆయన (స) నిలబడే చేసేవారు. షరీయత్ పరమయిన కారణమేదీ లేకుండా వీటికి విరుద్ధంగా చేస్తే - అది బిద్అత్ అవుతుంది.

ఇబ్నె అబీ షైబ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స), అబూబకర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), అలీ (రజి) - వీళ్లంతా నిలబడే జుమా ప్రసంగమిచ్చేవారు. ఆయన (సఅసం) వేదికనెక్కి, ముఖ్తదీల వైపునకు తిరిగి అస్సలాము అలైకుమ్ అని అనేవారని కొన్ని హదీసుల ద్వారా తెలుస్తున్నది.

(٣٦٠) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللّٰهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا خَطَبَ احْمَرَّتْ عَيْنَاهُ، وَعَلَا صَوْتُهُ، وَاشْتَدَّ غَضَبُهُ، حَتَّى كَأَنَّهُ مُنْذِرُ جَيْشٍ يَقُولُ: «صَبَّحَكُمْ وَمَسَّاكُمْ»، وَيَقُولُ: «أَمَّا بَعْدُ، فَإِنَّ خَيْرَ الْحَدِيثِ كِتَابُ اللّٰهِ، وَخَيْرَ الْهَدْيِ هَدْيُ مُحَمَّدٍ، وَشَرَّ الْأُمُورِ مُحْدَثَاتُهَا، وَكُلَّ بِدْعَةٍ ضَلَالَةٌ». رَوَاهُ مُسْلِمٌ.

360. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రసంగిస్తున్నప్పుడు ఆయన కళ్లు ఎర్రబడిపోయేవి. గొంతు బిగ్గరయ్యేది. ఆవేశం పెరిగేది (ఆ పరిస్థితిని చూసినవారికి) "శత్రుసైన్యం పొద్దున వచ్చిందా? సాయంత్రం వచ్చిందా?" అ సైనికదళాన్ని నిలదీస్తున్నారా? అనిపించేది.

(ప్రసంగ సమయలో) ఆయన ఇలా అనేవారు : "స్తోత్రానంతరం ... అన్నిటి కన్నా ఉత్తమమయిన వాక్కు దైవ గ్రంథం. ఉత్తమమయిన విధానం ముహమ్మద్ (సఅసం) విధానం. ఆచరణలన్నింటిలోకీ చెడ్డది కొత్త పోకడ

(బిద్అత్). ప్రతి బిద్అత్‌తో కూడినపని మార్గభ్రష్టతకు, మార్గవిహీనతకు ప్రతీక. (ముస్లిం)

وَفِي رِوَايَةٍ لَهُ: كَانَتْ خُطْبَةُ النَّبِيِّ ﷺ يَوْمَ الْجُمُعَةِ: يَحْمَدُ اللّٰهَ، وَيُثْنِي عَلَيْهِ، ثُمَّ يَقُولُ عَلَى إِثْرِ ذٰلِكَ، وَقَدْ عَلَا صَوْتُهُ.

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది : జుమా రోజున దైవప్రవక్త (సఅసం) ఉపన్యాసం ఇలా సాగేది - (తొలుత) దైవస్తోత్రం చేసేవారు. తరువాత ప్రసంగించటం మొదలెట్టగానే ఆయన స్వరం పెరిగేది.

وَفِي رِوَايَةٍ لَهُ: «مَنْ يَهْدِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهُ، وَمَنْ يُضْلِلْ فَلَا هَادِيَ لَهُ». وَلِلنَّسَائِيِّ: «وَكُلُّ ضَلَالَةٍ فِي النَّارِ».

ముస్లింలోని మరో ఉల్లేఖనంలో వుంది- "అల్లాహ్ ఎవరికయితే సన్మార్గం చూపాడో వారినెవరూ అపమార్గం పట్టించలేరు. ఆయన ఎవరిని అపమార్గాన వదిలేశాడో వారిని సన్మార్గానికి తీసుకురాగలవారు కూడా ఎవరూ లేరు". "ప్రతి అపమార్గం నరకాగ్నిలోకి తీసుకుపోతుంది" అని నసాయిలో ఉంది.

**సారాంశం**

ఇదీ దైవప్రవక్త (సఅసం) నోట జాలువారే ప్రసంగం. శుక్రవారం నాడు ఉపన్యాసకుడు ఉపన్యసించేటప్పుడు పరిసరాల ప్రభావం, పరిస్థితుల స్వరూపం అతని మనో మస్తిష్కాలపై చెరగని ముద్రవేసి ఉంటుంది. ఒకవైపు శుభవార్తలు, మరో వైపు అవాంఛనీయ సంఘటనలు అతని మెదడును తొలుస్తూ ఉంటాయి. అనుచర సమాజాన్ని ఈ సంక్లిష్ట పరిస్థితుల నుండి గట్టెక్కించేదెలా? అని అతడు తీవ్రంగా ఆలోచిస్తుంటాడు. తత్కారణంగా అతని ముఖం ఎర్రగా కందిపోతుంది. ప్రేక్షకుల్ని ప్రభావితం చేయడానికి అతని ముఖ కవళికలు ఈ మాత్రం మారవలసిన ఆవశ్యకత కూడా ఎంతైనా ఉంది.

ప్రసంగంలో తొలుత దైవస్తోత్రం తప్పక చేయాలి. ప్రసంగం వీలైనంత క్లుప్తంగా ఉండాలి. కాని అది ఎంతో సమగ్రంగా ఉండాలి. ప్రసంగం ద్వారా ప్రేక్షకుల్ని ప్రభావితం చేయాలేగాని, వారిని భయభ్రాంతులకు లోను చేయరాదు. నిరాశానిస్పృహల వాతావరణాన్ని సృజించరాదు. భావప్రకటనలో ఎలాంటి మొహమాటానికీ, అస్పష్టతకు తావుండరాదు. ప్రసంగం మరీ సుదీర్ఘంగా ఉండకూడదు. క్లుప్తమైన ప్రసంగాలే ప్రజలకు బాగా జ్ఞాపకముంటాయి. అవి వారి మనోఫలకాలపై ముద్ర వేసుకుంటాయి.

(٣٦١) وَعَنْ عَمَّارِ بْنِ يَاسِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَقُولُ: «إِنَّ طُولَ صَلَاةِ الرَّجُلِ وَقِصَرَ خُطْبَتِهِ مَئِنَّةٌ مِنْ فِقْهِهِ». رَوَاهُ مُسْلِمٌ.

361. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కథనం : "మనిషి నమాజ్ సుదీర్ఘం మరియు ఉపన్యాసం సంక్షిప్తం అయి ఉండటం అతని విజ్ఞతకు ప్రతీక" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా నేను విన్నాను. (ముస్లిం)

**సారాంశం**

సంక్షిప్త ప్రసంగం, సుదీర్ఘ నమాజ్ మనిషి బుద్ధి కౌశల్యానికి, విజ్ఞతా వివేచనలకు తార్కాణమని ఈ హదీసులో చెప్పబడింది. సాధారణంగా దైవప్రవక్త (స) శుక్రవారంనాడు క్లుప్తంగా ప్రసంగించేవారు. ఈ ప్రసంగాలు చాలా తేలిగ్గా కంఠస్థం కూడా అయ్యేవి. ఈ సంగతి నేటి మన వక్తలకు కనువిప్పు కావాలి. ఎందుకంటే వారి ఉపన్యాస వరద గోదారి దీనికి విరుద్ధంగా పరవళ్లు తొక్కుతున్నది. వారి ఉపన్యాసాలు సుదీర్ఘంగా ఉంటాయి, కాని నమాజ్ మాత్రం అతి క్లుప్తంగా ఉంటుంది. ఇది సున్నత్‌కు విరుద్ధం. ఈ ధోరణి సంస్కరించదగినది.

(٣٦٢) وَعَنْ أُمِّ هِشَامٍ بِنْتِ حَارِثَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مَا أَخَذْتُ ﴿قٓ وَالْقُرْآنِ الْمَجِيدِ﴾ إِلاَّ عَنْ لِّسَانِ رَسُولِ اللّٰهِ ﷺ، يَقْرَأُهَا كُلَّ جُمُعَةٍ عَلَى الْمِنْبَرِ إِذَا خَطَبَ النَّاسَ. رَوَاهُ مُسْلِمٌ.

362. హజ్రత్ ఉమ్మె హిషామ్ బిన్తె హారిస (ర.అన్హా) వివరించారు : "నేను సూరె 'ఖాఫ్'ను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)నోట వినీ వినీ జ్ఞాపకం చేసుకున్నాను. ఆయన (స) ప్రతి శుక్రవారం వేదికపై నిలబడి - జుమా ప్రసంగంలో -ఈ సూరాను పారాయణం చేసేవారు." (ముస్లిం)

**సారాంశం**

జుమా ప్రసంగంలో ప్రేక్షకులకు దివ్య ఖుర్ఆన్‌లోని వాక్యాలు వీలైనంత అధికంగా వినిపించటం, విడమరచి చెప్పటం ఎంతో అవసరమని ఈ హదీసు తాత్పర్యం. దైవప్రవక్త (సఅసం) సాధారణంగా జుమా ప్రసంగంలో ఖాఫ్ సూరాను పఠించేవారని కూడా ఈ హదీసు చెబుతోంది. కడకు ఉమ్మె హిషామ్ (ర.అన్హా) కు ప్రసంగం ద్వారానే సూరా పూర్తిగా కంఠస్థం అయిపోయింది. ఈ సూరాలో మరణ ప్రస్తావన ఉంది. ప్రళయదినం గురించి చెప్పబడింది. స్వర్గనరకాల ప్రస్తావన వచ్చింది. అందుకే ఆయన ఈ సూరాను పదే పదే పఠించి ప్రజలలో పరలోక చింతనను పెంపొందించి, తద్వారా వారిని కార్యోన్ముఖుల్ని చేయాలని తలపోసేవారు. జుమా ప్రసంగంలో అనవసర విషయాలు, కాకమ్మ కథలు చోటు చేసుకోరాదు. కవితలు, ఆశయ రహితమయిన మాటలు షరీయత్ స్వభావానికి విరుద్ధమైనవి. కనుక వీటిని జుమా ప్రసంగంలో విడనాడాలి.

(٣٦٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنْ تَكَلَّمَ يَوْمَ الْجُمُعَةِ: وَالْإِمَامُ يَخْطُبُ، فَهُوَ كَمَثَلِ الْحِمَارِ يَحْمِلُ أَسْفَاراً، وَالَّذِي يَقُولُ لَهُ: أَنْصِتْ، لَيْسَتْ لَهُ جُمُعَةٌ». رَوَاهُ أَحْمَدُ بِإِسْنَادٍ لَا بَأْسَ بِهِ.

363. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "జుమా రోజున ఇమామ్ వేదికనెక్కి ప్రసంగిస్తుండగా ఏ వ్యక్తయితే మాట్లాడతాడో అతడు వీపుపై పుస్తకాలు మోస్తున్న గాడిద లాంటివాడు. అతన్ని ఉద్దేశ్యించి, 'నిశ్శబ్దంగా ఉండు' అని చెప్పిన వాని జుమా కూడా వృధా అయిపోయింది." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు)

وَهُوَ يُفَسِّرُ حَدِيثَ أَبِي هُرَيْرَةَ فِي الصَّحِيحَيْنِ مَرْفُوعاً: «إِذَا قُلْتَ لِصَاحِبِكَ: أَنْصِتْ، يَوْمَ الْجُمُعَةِ، وَالْإِمَامُ يَخْطُبُ، فَقَدْ لَغَوْتَ».

ఈ హదీసు 'సహీహైన్'లో చెప్పబడిన హజ్రత్ అబూహురైరా (రజి) హదీసుకు 'తఫ్సీలు' వంటిది. అందులో ఇలా అనబడింది - "ఇమామ్ జుమా ప్రసంగం చేస్తుండగా 'నిశ్శబ్దంగా ఉండు' అని నీవు నీ తోడున్న వానికి చెబితే, నీవు కూడా వ్యర్థమయిన మాటనే అన్నావు లేదా నీ జుమాను వృధా చేసుకున్నావు."

**సారాంశం**

శుక్రవారం ప్రసంగాన్ని ఎంతో నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో వినాలని, ఆ సమయంలో మనిషి ఆలోచనలకు అవరోధం కలిగించే అలజడి, గలాటా ఏదీ జరగరాదని హదీసు బోధిస్తున్నది. ఒకవేళ ఎవరయినా ఆ సమయంలో తెలియక మాట్లాడినా, ఏదైనా వెకిలిచేష్ట చేసినా అతని జోలికి పోనూరాదు. 'నోరు మూసుకో' అని చెప్పటం కూడా ఒక విధంగా ప్రశాంతతను భగ్నం చేయటమే అవుతుంది. ఆ సమయంలో ప్రేక్షకుల ధ్యాసంతా వక్త చెప్పేమాటలపై ఉండాలి. మనసును పూర్తిగా లగ్నం చేసి వింటేనే అది హృదయకవాటాలను తట్టగలుగుతుంది.

(٣٦٤) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: دَخَلَ رَجُلٌ يَوْمَ الْجُمُعَةِ، وَالنَّبِيُّ ﷺ يَخْطُبُ، فَقَالَ: «صَلَّيْتَ»؟ قَالَ: لَا، قَالَ: «قُمْ فَصَلِّ رَكْعَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

364. హజ్రత్ జాబిర్ (రజి) ఇలా తెలిపారు : జుమా రోజున ఒక వ్యక్తి మస్జిదులో ప్రవేశించాడు. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) ప్రసంగిస్తున్నారు. వచ్చిన వ్యక్తి నుద్దేశ్యించి ఆయన (స), "నమాజ్ చేశావా?" అని దర్యాప్తు చేశారు. 'లేదు' అని అన్నాడా

వ్యక్తి. "మరయితే లే. రెండు రకతుల నమాజ్ చెయ్యి" అని ఆయన (సఅసం) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

జుమా ప్రసంగం జరుగుతుండగా రెండు రకతుల నమాజ్ చేయవచ్చునని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ప్రసంగ కర్త మటుకు అవసరం మేరకు మాట్లాడగలడనీ, మస్జిద్‌కు వచ్చే నమాజీలకు రెండు రకతులు నెరవేర్చమని చెప్పగలడని కూడా దీనిద్వారా స్పష్టమవుతున్నది. హనఫీలు ఈ రెండు రకతులకు అనుకూలంగా లేరు.

(٣٦٥) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقْرَأُ فِي صَلاَةِ الْجُمُعَةِ سُوْرَةَ الْجُمُعَةِ وَالْمُنَافِقِيْنَ. رَوَاهُ مُسْلِمٌ.

365. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సాధారణంగా శుక్రవారం నాడు నమాజులో సూరయె జుమా, సూరయె మునాఫిఖూన్ పఠించేవారు." (ముస్లిం)

وَلَهُ عَنِ النُّعْمَانِ بْنِ بَشِيْرٍ كَانَ يَقْرَأُ فِيْ الْعِيْدَيْنِ وَفِيْ الْجُمُعَةِ «بِسَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى» «وَهَلْ أَتَاكَ حَدِيْثُ الْغَاشِيَةِ».

ముస్లింలోనే నూమాన్ బిన్ బషీర్ (రజి) గారి ఉల్లేఖనంలో ఇలా వుంది : "ఆయన (సఅసం) పండుగ నమాజులలోనూ, శుక్రవారం నమాజులోనూ 'సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా', 'హల్ అతాక హదీసుల్ ఘాషియ' సూరాలు పారాయణం చేసేవారు.

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అర్థమయ్యేదేమిటంటే ఆయన (స) కొన్ని ప్రత్యేక నమాజులలో కొన్ని ప్రత్యేక సూరాలు పఠించేవారు. దైవప్రవక్త (స)ను అనుసరించే ఉద్దేశ్యంతో ఆయా నమాజులలో ఆ సూరాలనే మనం కూడా పారాయణం చేయటం ఉత్తమం. ఇతర సూరాలు పఠిస్తే నమాజ్ నెరవేరదని దీని భావం ఎంతమాత్రం కాదు. పైన పేర్కొనబడిన సూరాలు జుమా సందర్భంలో, పండుగ సందర్భాలలో పఠించటంలో ఎన్నో పరమార్థాలు దాగి ఉన్నాయి.

సూరయె జుమాలో జుమా నమాజు వైపునకు రావటం గురించి, దాని మహత్తు గురించి నొక్కి చెప్పబడింది. జుమా నమాజులో నికార్సయిన ముస్లింలతోపాటు, కపటులు, వంచకులు కూడా వస్తారు. వారికి హెచ్చరిక చేసే ఉద్దేశ్యంతో ఆయన (స) మునాఫిఖూన్ సూరా పఠించేవారు. అలాగే అల్ ఆలా, అల్ ఘాషియ సూరాలలో ప్రళయదినం గురించి, పరలోక సాఫల్యం గురించి

చెప్పబడింది. అందుచేత దైవప్రవక్త (సఅసం) నమాజీలకు పరలోకాన్ని పదే పదే జ్ఞాపకం చేయదలచి ఈ రెండు సూరాలను పారాయణం చేసేవారు.

జుమా సూరాలో అల్లాహ్ అంతిమ దైవప్రవక్త (సఅసం) ప్రభవింపజేయబడటంలోని 4 ముఖ్యోద్దేశాలను తెలియజేశాడు. ముస్లిం అనుచర సమాజానికి ముహమ్మద్ (సఅసం) ప్రవక్త చేసిన మహోపకారాన్ని కూడా గుర్తుచేశాడు. ఆ తర్వాత దైవధ్యానం వైపునకు మరలమని ప్రేరేపించాడు. అలాగే మునాఫిఖూన్ సూరాలో కాపట్యాన్ని ఖండించటంతోపాటు, దానధర్మాలను ప్రోత్సహించటం జరిగింది.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు నూమాన్ బిన్ బషీర్ (రజి). మారుపేరు అబూ అబ్దుల్లాహ్. అన్సార్ వర్గానికి చెందినవారు. హిజ్రత్ తరువాత 14వ మాసంలో అన్సార్లలో జన్మించిన తొలి శిశువు ఈయనే. సిరియాలో స్థిరపడ్డారు. కూఫాకు గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ తరువాత 'హిమ్స్' గవర్నర్‌గా కూడా నియమించబడ్డారు. హిజ్రీ 64లో రాహిత్ దినాన ఖాలిద్ బిన్ ఖలి అల్ కిలాయి ఈయన్ని హత్యచేశాడు.

(٣٦٦) وَعَنْ زَيْدِ بْنِ أَرْقَمَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى النَّبِيُّ ﷺ الْعِيْدَ، ثُمَّ رَخَّصَ فِيْ الْجُمُعَةِ، فَقَالَ: «مَنْ شَآءَ أَنْ يُصَلِّيَ فَلْيُصَلِّ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

366. హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ చేశారు. జుమా నమాజ్ విషయంలో అనుమతి ఇచ్చారు - "చేయదలచిన వారు చేయండి" అని ఆయన (స) ఆ సందర్భంగా సెలవిచ్చారు. ('ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమని నిర్ధారించారు)

## సారాంశం

ఒకే రోజు పండుగ మరియు శుక్రవారం వస్తే అట్టి పరిస్థితిలో ఆయన (స) పండుగ నమాజ్‌ను చేయించారు. జుమా నమాజ్‌ను చేయటం చేయకపోవటం గురించి ప్రజల ఇష్టాయిష్టాలకే వదలిపెట్టారు. అబూదావూద్‌లో హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా ప్రకటించారు - "ఈ రోజు రెండు పండుగల సమావేశం ఉంది. దీంతో సరిపెట్ట దలచుకున్నవారు సరిబెట్టుకోవచ్చు. అయితే మేము మాత్రం జుమా నమాజ్ తప్పక చేస్తాము."

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యేదేమిటంటే శుక్రవారంనాడు పండుగ వస్తే పండుగ నమాజ్ తర్వాత జుమా నమాజ్ ఫర్జ్ (విధి) కాదు - జుహ్ర్ నమాజ్ చేస్తే సరిపోతుంది. అయితే హనఫీ పండితులు దీనికి అనుకూలంగా లేరు.

పండుగరోజు, శుక్రవారం - రెండూ కలిసివస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం పతనమవుతుందని జన సామాన్యంలో ఒక నమ్మకం ఉంది. ఇది గుడ్డి నమ్మకం తప్ప మరేమీ కాదు. పైగా ఆయన (స) దీనిని రెండు పండుగల దినంగా ఖరారు చేశారు.

(٣٦٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا صَلَّى أَحَدُكُمُ الْجُمُعَةَ فَلْيُصَلِّ بَعْدَهَا أَرْبَعاً». رَوَاهُ مُسْلِمٌ.

367. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "మీలో ఎవ రయినా జుమా నమాజ్ చేస్తే, ఆ తరువాత 4 రకతులు చదవండి." (ముస్లిం)

**సారాంశం**

శుక్రవారం నాడు సామూహిక నమాజ్ అనంతరం 4 రకతుల (సున్నత్) నమాజ్ చేయాలని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్, మరియు అధిక సంఖ్యాకులైన పండితుల అభిప్రాయం కూడా ఇదే. వేరొక ఉల్లేఖనంలో ఆయన (స) జుమా తరువాత రెండు రకతులు చేసేవారని ఉంది. దీని ఆధారంగా షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్నె తైమియ (రహ్మ.లై) ఏమన్నారంటే; మస్జిద్‌లో రెండు రకతులు చదివి, ఇంటి దగ్గర 4 రకతులు చదవాలి. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆచరణ కూడా ఇలాగే ఉండేది. హనఫీ ఫికహ్ ననుసరించేవారు జుమా తరువాత 6 రకతులు చేయాలని అంటారు. కాని ప్రామాణికమైన ఏ హదీసు ద్వారా కూడా దీనికి ఆధారం లభించటం లేదు.

(٣٦٨) وَعَنِ السَّائِبِ بْنِ يَزِيدَ أَنَّ مُعَاوِيَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ لَهُ: إِذَا صَلَّيْتَ الْجُمُعَةَ فَلاَ تَصِلْهَا بِصَلاَةٍ حَتَّى تَكَلَّمَ أَوْ تَخْرُجَ، فَإِنَّ رَسُولَ اللّٰهِ ﷺ أَمَرَنَا بِذَلِكَ: أَنْ لاَّ نُوْصِلَ صَلاَةً بِصَلاَةٍ حَتَّى نَتَكَلَّمَ أَوْ نَخْرُجَ. رَوَاهُ مُسْلِمٌ.

368. హజ్రత్ సాయిబ్ బిన్ యజీద్ (రజి) కథనం : హజ్రత్ ముఆవియా (రజి) ఇలా తెలిపారు - "నీవు జుమా నమాజ్ చేశాక ఇతరులెవరితోనయినా సంభాషించే వరకూ లేక స్థానమార్పిడి జరిగే వరకూ ఇతర నమాజును చేయకు. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) మాకు ఈ మేరకు ఆదేశించారు. మేము జుమా చేశాక పరస్పరం సంభాషించుకునే వరకూ లేదా అక్కడి నుండి బదిలీ అయ్యేవరకూ వేరితర నమాజు చేయ రాదు" అని ఆయన (స) అన్నారు. (ముస్లిం)

### సారాంశం

జుమా చేసిన తరువాత ఇతర సున్నత్ లేక నఫిల్ నమాజులకై అదే స్థానంలో నిలబడరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ఈ ఆదేశం ఒక్క జుమా నమాజుకే పరిమితం కాకుండా ఇతర దినాలలో కూడా స్థానమార్పిడికై ప్రయత్నించాలి. ఆ విధంగా ఫర్జ్ నమాజ్‌కీ - నఫిల్ నమాజులకీ మధ్య గల వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కానవస్తుంది. దైవప్రవక్త (స) సాధారణంగా నఫిల్, సున్నత్ నమాజులను ఇంట్లో నెరవేర్చేవారు. ఈ పద్ధతే ఉత్తమమైనది. దైవారాధన ఒకేచోట కాకుండా దేవుని భూమండలంపై అనేకచోట్ల జరగాలన్నదీ, దైవనామస్మరణ అన్ని మూలల్లో జరగాలన్నది ఈ ఆదేశంలో దాగివున్న మరో మర్మం కావచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

సాయబ్ బిన్ యజీద్ (రజి) గారి మరోపేరు అబూ యజీద్ అల్ కింది. హిజ్రీ శకం 2వ సంవత్సరంలో జన్మించారు. తండ్రితో కలసి అంతిమ హజ్ యాత్రలో పాల్గొన్నారు. హిజ్రీ 80లో మరణించారు.

(٣٦٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنِ اغْتَسَلَ، ثُمَّ أَتَى الْجُمُعَةَ، فَصَلَّى مَا قُدِّرَ لَهُ، ثُمَّ أَنْصَتَ حَتَّى يَفْرُغَ الْإِمَامُ مِنْ خُطْبَتِهِ، ثُمَّ يُصَلِّي مَعَهُ، غُفِرَ لَهُ مَا بَيْنَهُ وَبَيْنَ الْجُمُعَةِ الْأُخْرَى، وَفَضْلُ ثَلَاثَةِ أَيَّامٍ». رَوَاهُ مُسْلِمٌ.

369. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఎవరయితే స్నానం చేసి జుమా నమాజ్‌కు వస్తాడో, తన అదృష్టంలో వున్నంత నమాజ్ చేస్తాడో, మరి ఇమామ్ ఖుత్బా (ఉపన్యాసం) ఇచ్చేవరకూ నిశ్శబ్దంగా కూర్చుని ఉంటాడో, తరువాత ఇమామ్‌తో కలసి ఫర్జ్ (సామూహిక) నమాజు చేస్తాడో రెండు శుక్రవారాల మధ్య అతని వల్ల జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి. మరో మూడు రోజుల పాపాలు అదనంగా కూడా మన్నించబడతాయి."

(ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో శుక్రవారం నాటి నమాజు మహత్మ్యం చాటబడింది. స్నానం చేసి ఇమామ్‌కన్నా ముందే మస్జిద్‌లోకి వచ్చి దైవధ్యానంలో నిమగ్నమవటం మంచిది. మస్జిద్‌లో కూర్చున్నంతసేపూ ప్రశాంతంగా కూర్చోవాలి. ఇమామ్ చేసే ప్రసంగాన్ని శ్రద్ధగా వినాలి. సామూహిక నమాజ్‌ను శ్రద్ధాభక్తులతో చేయాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని జుమా నమాజు చేసిన వ్యక్తి యొక్క అపరాధాలు - రెండు శుక్రవారాల మధ్య అతని వల్ల జరిగిన చిన్న చిన్న తప్పులు - మన్నించబడతాయి.

(٣٧٠) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ ذَكَرَ يَوْمَ الْجُمُعَةِ، فَقَالَ: «فِيهِ سَاعَةٌ لاَ يُوَافِقُهَا عَبْدٌ مُسْلِمٌ، وَهُوَ قَائِمٌ يُصَلِّي يَسْأَلُ اللّٰهَ عَزَّ وَجَلَّ شَيْئاً، إِلاَّ أَعْطَاهُ إِيَّاهُ». وَأَشَارَ بِيَدِهِ يُقَلِّلُهَا. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لِمُسْلِمٍ: «وَهِيَ سَاعَةٌ خَفِيفَةٌ».

370. ఈ హదీసు కూడా హజ్రత్ అబూ హురైర (రజి) గారి చేతనే ఉల్లేఖించ బడింది - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రోజు జుమా నమాజ్ గురించి ప్రస్తావిస్తూ, 'అందులో ఒక ఘడియ వుంది. ఆ ఘడియలో ఏ ముస్లిం దాసుడు అయినా నమాజ్ చేసి దైవాన్ని ఏదయినా వేడుకుంటే దేవుడు తప్పక దాన్ని అతనికి ప్రసాదిస్తాడు' అని అన్నారు. ఆ ఘడియ చాలా కొద్దిసేపే అయివుంటుందని ఆయన (స) తన చేత్తో సైగ చేశారు. (బుఖారీ, ముస్లిం)

'ఆ సమయం చాలా చిన్నది' అని ముస్లింలోని ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

శుక్రవారం నమాజ్ సందర్భంగా ఉన్న ఆ అత్యంత విలువైన, కారుణ్య ప్రదమయిన ఘడియలో దాసుని దుఆ స్వీకారయోగ్యమవుతుంది. ఆ ఘడియ ఏ దశలో వుంది? అనేది దైవప్రవక్త (స) చెప్పలేదు. 'లైలతుల్ ఖద్ర్' మాదిరిగా ఈ శుభ ఘడియ కూడా గోప్యంగా ఉంచబడింది. దాని అన్వేషణలో దాసులు వీలైనంత ఎక్కువ సమయం మస్జిద్‌లో - దైవధ్యానంలో- గడపాలన్నది దీని ఉద్దేశ్యమై ఉండవచ్చు.

(٣٧١) وَعَنْ أَبِي بُرْدَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنْ أَبِيهِ، قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «هِيَ مَا بَيْنَ أَنْ يَجْلِسَ الإِمَامُ إِلَى أَنْ تُقْضَى الصَّلاَةُ». رَوَاهُ مُسْلِمٌ، وَرَجَّحَ الدَّارَقُطْنِيُّ أَنَّهُ مِنْ قَوْلِ أَبِي بُرْدَةَ.

371. హజ్రత్ అబూ బుర్దా (రజి) తన తండ్రి ఆధారంగా వివరించారు: ఆయన తండ్రి ఇలా వివరించారు : "దైవప్రవక్త (స) ఈ విధంగా చెప్పగా నేను విన్నాను- 'ఆ (శుభ) ఘడియ ఇమామ్ వేదికపై కూర్చున్న క్షణం నుంచీ సామూహిక నమాజ్ ముగిసే వరకూ ఎప్పుడన్నా ఆసన్నం కావచ్చు'' (ముస్లిం). ఈ పలుకులు అబూ బుర్దా (రజి) గారివే అయి ఉండవచ్చునని దారె ఖుత్నీ అభిప్రాయపడ్డారు.

وَفِيْ حَدِيْثِ عَبْدِ اللهِ بْنِ سَلَامٍ عِنْدَ ابْنِ مَاجَهْ، وَجَابِرٍ عِنْدَ أَبِيْ دَاوُدَ وَالنَّسَائِيِّ: أَنَّهَا مَا بَيْنَ صَلَاةِ الْعَصْرِ إِلَى غُرُوْبِ الشَّمْسِ.

అబ్దుల్లా బిన్ సలాం (రజి) నుండి ఇబ్నె మాజా గారు, జాబిర్ (రజి) నుండి అబూ దావూద్, నసాయి నకలు చేసిన ఉల్లేఖనం ఈ విధంగా ఉంది - "ఆ ఘడియ అస్ర్ నమాజ్ నుండి సూర్యాస్తమయం వరకూగల మధ్య సమయంలో ఉంది.

وَقَدِ اخْتُلِفَ فِيْهَا عَلَى أَكْثَرَ مِنْ أَرْبَعِيْنَ قَوْلاً أَمْلَيْتُهَا فِي شَرْحِ الْبُخَارِيِّ.

ఈ నేపథ్యంలో అనేకమంది ఉలమాల 40 వ్యాఖ్యలు ఉన్నాయి. వాటన్నింటినీ నేను 'ఫత్‌హుల్ బారీ' బుఖారీ వ్యాఖ్యానంలో పొందుపరచాను.

## హదీసు ఉల్లేఖకులు

(1) అబూబుర్దా (రహ్మ.లై) గారి అసలు పేరు ఆమిర్ బిన్ అబీ మూసా అష్అరీ, ప్రఖ్యాత తాబయీన్లలో ఒకరు. ఈయన తన తండ్రి గారినుండీ, హజ్రత్ అలీ (రజి) గారినుండీ, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) నుండీ ఈ హదీసు విన్నారు. 80పై చిలుకు వయస్సులో - హిజ్రీ 104 లో - కన్నుమూశారు.

(2) అబ్దుల్లాహ్ బిన్ సలాం (రజి) : ఈయనగారి మారుపేరు అబూ యూసుఫ్. యూద పండితులలో ఎన్నదగినవారు. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) వంశస్థులు. బనూ ఖైనుఖాతో ఈయనగారికి సంబంధం ఉండేది. దైవప్రవక్త (సఅసం) మదీనాకు ఏతెంచినపుడే ఇస్లాం స్వీకరించారు. ప్రపంచంలో ఉండగానే స్వర్గలోక శుభవార్త పొందిన భాగ్యవంతులలో ఈయన ఒకరు. మదీనా మునవ్వరాలో హిజ్రీ 43లో మరణించి స్వర్గంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

(٣٧٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: مَضَتِ السُّنَّةُ أَنَّ فِي كُلِّ أَرْبَعِيْنَ فَصَاعِداً جُمُعَةً. رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

372. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "నలభై లేక అంతకు మించిన సంఖ్య ఉంటేనే జుమా ఏర్పాటు చేసుకోవటం సంప్రదాయంగా వస్తోంది." (దారె ఖుత్నీ దీనిని అత్యంత బలహీనమైన ఆధారంతో ఉల్లేఖించారు)

## సారాంశం

జుమా నమాజ్ కొరకు నమాజీల సంఖ్య 'ఇంత ఉండాలి' అని సహీహ్ హదీసులలో ఎక్కడా ప్రస్తావన రాలేదు. అందుచేత ఈ విషయమై ధర్మవేత్తల మధ్య వివిధ అభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ కనీస సంఖ్య 4 అని కొందరు, 7 అని మరికొందరు, 9 లేక 12 అని ఇంకొందరు, 20 అనీ, 40 అనీ, 50 అనీ - ఇలా రకరకాలుగా అంచనా వేశారు. వీరిలో ఏ ఒక్కరూ సహీహ్ హదీసు

ఆధారంగా వ్యాఖ్యానించలేదు. ఇద్దరు వ్యక్తులున్నా జమాఅత్‌తో నమాజ్ చేయాల్సిందేనని దైవప్రవక్త (స) ఆదేశించారు. ప్రయాణంలో ఇద్దరు వ్యక్తులున్నప్పుడు వారిలో ఒకరు అజాన్ ఇవ్వాలి. ధర్మజ్ఞానం ఎక్కువగా ఉన్న వ్యక్తి ఇమామత్ చేయాలి. ఇమామ్ షాఫయి దృష్టిలో జుమా నమాజుకై 40 మంది హాజరవ్వాలి. ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయం ప్రకారం ఇమామ్‌గాక మరో ఇద్దరు వ్యక్తులున్నా చాలు - జుమా నమాజ్‌ను స్థాపించవచ్చు. అయితే జుమా నమాజ్ కోసం అది పెద్ద గ్రామం అయి ఉండాలని ఆయన షరతు విధించారు. కాని ఇస్లాంలో తొట్టతొలి జుమా నమాజు 'జవాసీ' బస్తీలో నెలకొల్పబడింది. మరి అది పెద్ద గ్రామమో లేక పట్టణమో కానేకాదు.

(٣٧٣) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَسْتَغْفِرُ لِلْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنَاتِ فِيْ كُلِّ جُمُعَةٍ. رَوَاهُ الْبَزَّارُ بِإِسْنَادٍ لَيِّنٍ.

373. హజ్రత్ సమురహ బిన్ జున్దుబ్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి శుక్రవారం విశ్వాసులైన పురుషుల, స్త్రీల మన్నింపుకై ప్రార్థించే వారు." (బజ్జార్ దీనిని బలహీనమైన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

శుక్రవారం నమాజ్ సందర్భంగా ప్రసంగకర్త తన కోసం, విశ్వాసులైన స్త్రీ పురుషులందరి మన్నింపు కోసం ప్రార్థించటం సమంజసమే. అయితే ఈ హదీసు అందజేసిన పరంపరలో లోపం ఏర్పడింది. ఈ పరంపరలో యూసుఫ్ బిన్ ఖాలిద్ అనే వ్యక్తిపై హదీసువేత్తలకు సదభిప్రాయం లేదు.

(٣٧٤) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ فِيْ الْخُطْبَةِ يَقْرَأُ آيَاتٍ مِّنَ الْقُرْآنِ، يُذَكِّرُ النَّاسَ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ.

374. హజ్రత్ జాబిర్ బిన్ సమురహ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దివ్య ఖుర్‌ఆన్‌లోని కొన్ని వచనాలు జుమా ప్రసంగం సందర్భంగా పారాయణం చేసి ప్రజలకు హితబోధ చేసేవారు." (అబూదావూద్ - దీని మూలం ముస్లింలో ఉంది)

**సారాంశం**

జుమా ప్రసంగంలో దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆయతులను ఉదాహరించటం 'సున్నత్' అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఈ ఆయత్‌ల ద్వారా ఉపన్యాసకుడు ప్రజలలో ధార్మిక చింతన కలిగించాలి. పరలోక భీతిని, దైవభీతిని రేకెత్తించి తద్వారా వారి జీవితాలలో నైతిక విప్లవం తీసుకురావటానికి కృషిచేయాలి. ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా జరిగినంత సంస్కరణ మరో సాధనం ద్వారా జరగదన్నది తిరుగులేని సత్యం. ఈ సందర్భంగా కట్టుకథలను, స్వీయకల్పిత విషయాలను జొప్పించే ప్రయత్నం చేయరాదు.

(٣٧٥) وَعَنْ طَارِقِ بْنِ شِهَابٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **«الجُمُعَةُ حَقٌّ وَاجِبٌ عَلَى كُلِّ مُسْلِمٍ فِي جَمَاعَةٍ، إِلاَّ عَلَى أَرْبَعَةٍ: مَمْلُوكٌ، وَامْرَأَةٌ وصبيٌّ ومَرِيضٌ»** رواه أبو داود وقال: لَمْ يَسْمَعْ طَارِقٌ مِّنَ النَّبِيِّ ﷺ، وَأَخْرَجَهُ الْحَاكِمُ مِنْ رِوَايَةِ طَارِقِ الْمَذْكُورِ عَنْ أَبِي مُوسَى.

375. హజ్రత్ తారిఖ్ బిన్ షిహాబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "జుమా నమాజును సాముహికంగా నెరవేర్చటం ప్రతి ముస్లింకు తప్పనిసరి. అయితే నాలుగు రకాల వారికి దీని నుండి మినహాయింపు ఉంది - బానిస, స్త్రీ, పసిపిల్లలు, వ్యాధిగ్రస్తుడు." (అబూ దావూద్ దీనిని ఉల్లేఖించారు - తారిఖ్ నేరుగా దైవప్రవక్త (సఅసం) నుండి ఈ హదీసు వినలేదని కూడా ఆయన పేర్కొన్నారు - తారిఖ్ గారి ఈ ఉల్లేఖనాన్ని హాకిమ్ గారు అబూ మూసా సౌజన్యంతో ప్రస్తావించారు)

### సారాంశం

బానిసలు, స్త్రీలు, చిన్న పిల్లలు, రోగగ్రస్తులు - వీళ్లపై జుమా నమాజ్ ఫర్జ్ (విధి) కాదు. ఒకవేళ వారు జుమా నమాజ్‌లో పాల్గొంటే జుహ్ర్ నమాజ్ చేయనవసరం లేదు. జుమాకు రాకపోతే మాత్రం జుహ్ర్ నమాజ్ చేసుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

తారిఖ్ బిన్ షిహాబ్ (రజి). ఈయన 'కూఫా' వాస్తవ్యులు. బజలీ తెగకు చెందినవారు. అందుకే కూఫీగా, బజలీగా పిలువబడ్డారు. దైవప్రవక్త (సఅసం) ను చూచారు. కాని ఆయన (స) ద్వారా ఏమీ వినలేదు. హజ్రత్ అబూబకర్, హజ్రత్ ఉమర్‌ల పరిపాలనా కాలంలో 33 లేక 34 యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రీ 82లో మరణించారు.

(٣٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لَيْسَ عَلَى مُسَافِرٍ جُمُعَةٌ»**. رَوَاهُ الطَّبَرَانِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

376. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "ఏ ప్రయాణీకునిపై కూడా జుమా నమాజ్ (విధిగా చేయబడ)లేదు" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు. (తబ్రానీ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

ప్రయాణీకునిపై కూడా జుమా నమాజ్ బాధ్యత లేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఈ హదీసు జయీఫ్ అన్నది వాస్తవమే అయినప్పటికీ హజ్ యాత్ర సందర్భంగా దైవప్రవక్త (సఅసం) జుమా నమాజ్ చేయలేదన్న సంగతి గమనార్హం.

(٣٧٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا اسْتَوَى عَلَى الْمِنْبَرِ، اسْتَقْبَلْنَاهُ بِوُجُوهِنَا. رَوَاهُ التِّرْمِذِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ. وَلَهُ شَاهِدٌ مِنْ حَدِيثِ الْبَرَاءِ عِنْدَ ابْنِ خُزَيْمَةَ.

377. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వేదికనెక్కి నిలబడగానే మేము మా ముఖాలను ఆయన (స) వైపునకు కేంద్రీకరించేవాళ్ళము. (తిర్మిజీ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు. దీని సాక్ష్యం ఇబ్నె ఖుజైమలో పొందుపరచబడి ఉంది.)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ప్రేక్షకులు జుమా ప్రసంగం సందర్భంగా తమ ముఖాలను 'ఖతీబ్' వైపునకు త్రిప్పుకోవాలి. ఈ విషయంలో భేదాభిప్రాయం లేదు. పైగా దీనిపై అందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది.

(٣٧٨) وَعَنِ الْحَكَمِ بْنِ حَزْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْنَا الْجُمُعَةَ مَعَ النَّبِيِّ ﷺ، فَقَامَ مُتَوَكِّئاً عَلَى عَصاً أَوْ قَوْسٍ. رَوَاهُ أَبُو دَاوُدَ.

378. హజ్రత్ హకమ్ బిన్ హజ్న్ (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి జుమాలో పాల్గొన్నాము. ఆయన (స) లాఠీ లేక ఊతకర్ర సాయంతో (ప్రసంగించడానికి) నిలబడ్డారు." (అబూదావూద్)

**సారాంశం**

ఈ హదీసు దృష్ట్యా ప్రసంగకర్త ప్రసంగ సమయంలో ఏదైనా వస్తువును ఊతగా తీసుకుని నిలబడవచ్చు. పైగా ఇది 'ముస్తహబ్' కూడా. ఇది ప్రసంగీకునికి ఆధారంగా ఉంటుంది. చేతులు అనవసరంగా అటూ ఇటూ తిరగకుండా అదుపులో ఉంటాయి. ప్రసంగ సమయంలో మనిషి అలసిపోడు.

**హదీసు ఉల్లేఖకులు**

పూర్తిపేరు హకమ్ బిన్ హజ్న్ బిన్ అబూ వహ్హాబ్ మఖ్జూమి (రజి). మక్కా విజయం సందర్భంగా ఈయన ఇస్లాం స్వీకరించారు. ఈ హదీసును బట్టి ఈయన దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో జుమా నమాజ్ చేశారని అర్థమవుతోంది.

13వ అధ్యాయం

## భయస్థితిలో నమాజ్ (సలాతుల్ ఖౌఫ్)

## ١٣ - بَابُ صَلاَةِ الْخَوْفِ

(٣٧٩) عَنْ صَالِحِ بْنِ خَوَّاتٍ رَضِيَ اللّٰهُ عَنْهُ عَمَّنْ صَلَّى مَعَ النَّبِيِّ ﷺ يَوْمَ ذَاتِ الرِّقَاعِ صَلاَةَ الْخَوْفِ: أَنَّ طَائِفَةً صَفَّتْ مَعَهُ، وَطَائِفَةً وِجَاهَ العَدُوِّ، فَصَلَّى بِالَّذِيْنَ مَعَهُ رَكْعَةً، ثُمَّ ثَبَتَ قَائِماً، وَأَتَمُّوا لِأَنْفُسِهِمْ، ثُمَّ انْصَرَفُوْا، فَصَفُّوا وِجَاهَ الْعَدُوِّ، وَجَاءَتِ الطَّائِفَةُ الْأُخرَى، فَصَلَّى بِهِمُ الرَّكْعَةَ الَّتِيْ بَقِيَتْ، ثُمَّ ثَبَتَ جَالِساً، وَأَتَمُّوا لِأَنْفُسِهِمْ، ثُمَّ سَلَّمَ بِهِمْ. مُتَّفَقٌ عَلَيْهِ. وَهَذَا لَفْظُ مُسْلِمٍ. وَوَقَعَ فِيْ الْمَعْرِفَةِ لِابْنِ مَنْدَه: عَنْ صَالِحِ بْنِ خَوَّاتٍ، عَنْ أَبِيْهِ.

379. హ|జత్ సాలిహ్ బిన్ ఖవ్వాత్ (రజి), 'జాతుర్రిఖా' యుద్ధం జరిగిన నాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి 'సలాతుల్ ఖౌఫ్' (భీతావహ స్థితిలో నమాజ్) చేసిన వ్యక్తి ఆధారంగా ఉటంకించారు - ఆ వ్యక్తి ఇలా వివరించాడు - ఒక బృందం ఆయన (సఅసం)తో కలసి నమాజ్ కోసం వరుసతీరి నిలబడింది. రెండవ బృందం శత్రువును ప్రతిఘటించటానికి ఎదురుగా నిలబడింది. తన వెనుక, వరుస తీరి నిలబడిన వారికి ఆయన (సఅసం) ఒక రకత్ నమాజ్ చేయించి, ఆయన (స) తిన్నగా నిలబడ్డారు. వెనుక నున్నవారు మిగిలిన నమాజును తమ తమ తరపున పూర్తి చేసుకుని వెళ్ళి పోయారు. వెళ్ళి శత్రువును నిలువరించ డానికి నిలబడిపోయారు. అప్పుడు రెండవ బృందం వచ్చింది. ఈ బృందా నికి ఆయన (స) రెండవ రకతును చేయించి కూర్చున్నారు. కాగా; వెనుక నున్న వారు తమ తరపున మిగిలిన నమాజును పూర్తిచేసుకున్నారు. తరువాత ఆయన (సఅసం) వారితో కలసి 'సలాం' చేశారు. (బుఖారీ, ముస్లిం -కాని హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి. 'సాలిహ్ బిన్ ఖవ్వాత్ తన తండ్రినుంచి ఉల్లేఖించార'ని ఇబ్నె ముంద యొక్క 'అల్ మారిఫ'లో ఉంది)

## సారాంశం

'సలాతుల్ ఖౌఫ్' పలురకాలుగా చేయబడింది. అది ఆయా సమయ సందర్భాలనుబట్టి ఉంటుంది. ఈ హదీసులో పేర్కొనబడిన స్థితి దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన సంఘటనే. అంటే ఇమామ్ ప్రతి జట్టుకూ ఒక్కో రకత్ చొప్పున చేయించగా మిగిలిన ఒక రకత్‌ను సహాబీలు తమ తరపున నెరవేర్చుకున్నారు. ఆ విధంగా రెండు గ్రూపులకు కూడా జమాఅత్ (సామూహిక నమాజ్) లభించింది. మొదటి బృందం తమ తరపున సలాం చేసుకోగా, రెండవ బృందం దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో సలాం చేసింది.

ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ మరియు అధిక సంఖ్యాక ధర్మవేత్తల దృష్టిలో - భయానక స్థితిలో - సలాతుల్ ఖౌఫ్‌ను ప్రయాణంలో వున్నా లేకపోయినా కూడా చేయవచ్చు. ఇమామ్ మాలిక్ మాత్రం 'సలాతుల్ ఖౌఫ్' ప్రయాణావస్థలో ఉన్నప్పుడే చేయాలని షరతు పెట్టారు.

## హదీసు ఉల్లేఖకులు

(1) సాలిహ్ బిన్ ఖవ్వాత్ : పూర్తి పరంపర ఇలా వుంది - సాలిహ్ బిన్ ఖవ్వాత్ బిన్ జుబైర్ బిన్ నూమాన్ అన్సారీ మదనీ. ప్రఖ్యాత తాబయీన్లలో ఒకరు. అనేకమంది ప్రవక్త సహచరుల నోట ఈయన హదీసులు విన్నారు. ఈ హదీసును ఈయన హజ్రత్ సహ్ల్ బిన్ హస్మ (రజి) గారి ద్వారా విన్నారు లేదా తన తండ్రి (ఖవ్వాత్ - రజి) ద్వారా విన్నారు. హదీసు చివరిలో కూడా ఈ విషయం చెప్పబడింది.

(2) ఖవ్వాత్ (రజి) : ప్రముఖ సహాబీ. ఉహుద్ సంగ్రామంలో తొలిసారిగా పాల్గొన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం బద్ర్ యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. హిజ్రీ 40లో మదీనాలో మరణించారనీ, హిజ్రీ 40 తరువాత మరణించారనీ రెండు వేర్వేరు అభిప్రాయాలున్నాయి. అప్పటికి ఈయన వయస్సు 70 లేక 71.

380. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి 'నజ్ద్' వైపునకు ఏదో యుద్ధానికి వెళ్లాను. మేము శత్రు సేనకు ఎదురుగా నిలబడి ఉన్నాము. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) నిలబడి మాకు నమాజ్ చేయించారు. ఒక జట్టు ఆయన (స) వెనుక నమాజ్ చేయడానికై నిలబడింది. మరో జట్టు శత్రుసేనకు దీటుగా పంక్తులు తీరి నిలబడింది. దైవప్రవక్త (స)తో కలసి నమాజ్ చేస్తున్న (తొలి)జట్టు ఒక రుకూ,

(٣٨٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: غَزَوْتُ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ قِبَلَ نَجْدٍ فَوَازَيْنَا الْعَدُوَّ، فَصَافَفْنَاهُمْ، فَقَامَ رَسُولُ اللّٰهِ ﷺ، فَصَلَّى بِنَا، فَقَامَتْ طَائِفَةٌ مَّعَهُ، وَأَقْبَلَتْ طَائِفَةٌ عَلَى الْعَدُوِّ، وَرَكَعَ بِمَنْ مَّعَهُ، وَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ انْصَرَفُوا مَكَانَ الطَّائِفَةِ الَّتِيْ لَمْ تُصَلِّ، فَجَاءُوْا، فَرَكَعَ بِهِمْ رَكْعَةً، وَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ سَلَّمَ فَقَامَ كُلُّ

وَاحِدٍ مِّنْهُمْ، فَرَكَعَ لِنَفْسِهِ رَكْعَةً وَسَجَدَ سَجْدَتَيْنِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

రెండు సజ్దాలు చేసి తిరిగివచ్చింది. అప్పటి వరకూ నమాజ్‌లో పాల్గొనని (రెండవ) జట్టు సభ్యులు వచ్చిచేరగా ఆయన (స) వారికి కూడా ఒక రుకూ, రెండు సజ్దాలు చేయించారు. తరువాత ఆయన (స) సలాం చేశారు. అయితే రెండు బృందాల వారు కూడా (తరువాత) వేర్వేరుగా తమ (అసంపూర్ణ) నమాజును పరిపూర్తి గావించుకున్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) కథనం ప్రకారం 'సలాతుల్ ఖౌఫ్'కు సంబంధించి ఆరు లేక ఏడు సహీహ్ హదీసులు ఉన్నాయి. ఈ హదీసుల కనుగుణంగా ఎలా చేసినా ఈ నమాజ్ నెరవేరుతుంది. దీనికి ఒక పద్ధతి అంటూ ప్రత్యేకంగా నిర్ధారితం కాలేదు. పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని - తదనుగుణంగా - ఈ నమాజ్‌ను నెరవేర్చవచ్చు. ఈ నమాజ్ దైవప్రవక్త (సఅసం) నెలకొల్పినదన్న విషయంలో కూడా భేదాభిప్రాయం లేదు.

అల్లామా షౌకానీ (రహ్మ.లై) కూడా ఈ నమాజుకు సంబంధించి ఆరు పద్ధతులను విశదీకరించారు.

(٣٨١) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ صَلَاةَ الْخَوْفِ، فَصَفَفْنَا صَفَّيْنِ، صَفٌّ خَلْفَ رَسُولِ اللّٰهِ ﷺ، وَالْعَدُوُّ بَيْنَنَا وَبَيْنَ الْقِبْلَةِ، فَكَبَّرَ النَّبِيُّ ﷺ، وَكَبَّرْنَا جَمِيعاً، ثُمَّ رَكَعَ، وَرَكَعْنَا جَمِيعاً، ثُمَّ رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ، وَرَفَعْنَا جَمِيعاً، ثُمَّ انْحَدَرَ بِالسُّجُودِ، وَالصَّفُّ الَّذِي يَلِيهِ، وَقَامَ الصَّفُّ الْمُؤَخَّرُ فِي نَحْرِ الْعَدُوِّ، فَلَمَّا قَضَى السُّجُودَ قَامَ الصَّفُّ الَّذِي يَلِيهِ، فَذَكَرَ الْحَدِيثَ.

381. హజ్రత్ జాబిర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి 'నమాజె ఖౌఫ్' చేశాను. మేము రెండు పంక్తులు చేశాము. ఒక పంక్తి దైవప్రవక్త (సఅసం) వెనుక నిలబడింది. ఆ సమయంలో శత్రుసైన్యం మాకు - ఖిబ్లా దిశకు మధ్యన ఉంది. దైవప్రవక్త (సఅసం) అల్లాహు అక్బర్ అని పలుకగా మేమంతా అల్లాహు అక్బర్ అన్నాము. ఆయన రుకూ చేయగా మేమందరం రుకూ చేశాము. మరి ఆయన (స) రుకూ నుండి తలపైకెత్తగా మేమంతా తలలు పైకెత్తాము. ఆయన (స) సజ్దాలోకి వెళ్ళగా మొదటి పంక్తిలోని వారంతా

సజ్దాలోకి వెళ్ళారు. అయితే రెండవ పంక్తిలోని వారు మాత్రం - శత్రువును ఎదుర్కొనడానికి - నిలబడే వున్నారు. ఆయన (స) సజ్దాలు చేసిన పిదప ఆయన సమీప పంక్తిలో నున్నవారు నిలబడి పోయారు ... ఉల్లేఖకుడు ఈ విధంగా పూర్తి హదీసు వివరించారు....

وَفِيْ رِوَايَةٍ: ثُمَّ سَجَدَ، وَسَجَدَ مَعَهُ الصَّفُّ الْأَوَّلُ، فَلَمَّا قَامُوْا سَجَدَ الصَّفُّ الثَّانِيْ، ثُمَّ تَأَخَّرَ الصَّفُّ الْأَوَّلُ، وَتَقَدَّمَ الصَّفُّ الثَّانِيْ، وَذَكَرَ مِثْلَهُ، وَفِيْ آخِرِهِ: ثُمَّ سَلَّمَ النَّبِيُّ ﷺ، وَسَلَّمْنَا جَمِيْعاً. رَوَاهُ مُسْلِمٌ. وِلِأَبِيْ دَاوُدَ عَنْ أَبِيْ عَيَّاشٍ الزُّرَقِيِّ مِثْلُهُ، وَزَادَ: إِنَّهَا كَانَتْ بِعُسْفَانَ.

ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది - ఆయన (స) సజ్దా చేయగా ఆయన (స)తో పాటు మొదటి పంక్తివారు కూడా సజ్దా చేశారు. మరి వీరంతా లేచి నిలబడగా, రెండవ పంక్తిలోనివారు సజ్దాలోకి వెళ్ళారు. తరువాత మొదటి పంక్తి వెనక్కి వెళ్ళిపోగా, వెనుక పంక్తి ముందుకు వచ్చింది. మునుపటి వలెనే ఇది దైవధ్యానం చేసింది. చివర్లో దైవప్రవక్త (సఅసం) సలాం చేయగా మేమంతా సలాం చేశాము. (ముస్లిం)

అబూ అయ్యాష్ జురఖీ నుండి అబూ దావూద్ నకలు చేసిన దానిలో - "అది ఉస్ఫాన్ అనే స్థలంలో నెరవేర్చబడింది" అన్న వాక్యం అదనంగా ఉంది.

وَلِلنَّسَائِيِّ مِنْ وَجْهٍ آخَرَ عَنْ جَابِرٍ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى بِطَائِفَةٍ مِنْ أَصْحَابِهِ رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ صَلَّى بِآخَرِيْنَ أَيْضاً رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ. وَمِثْلُهُ لِأَبِيْ دَاوُدَ عَنْ أَبِيْ بَكْرَةَ.

నసాయి హజ్రత్ జాబిర్ (రజి) నుండి వేరొక ఆధారంతో ఇలా ఉల్లేఖించారు- దైవప్రవక్త (సఅసం) తన సహచరుల లోని ఒక వర్గానికి రెండు రకతులు చేయించి సలాం చేశారు. తరువాత రెండవ వర్గానికి కూడా ఇదే విధంగా రెండు రకతులు చేయించి సలాం చేశారు. అబూదావూద్‌లో హజ్రత్ అబూబక్రా (రజి) ఆధారంగా ఇలాంటి ఉల్లేఖనమే ఒకటుంది.

## సారాంశం

ఈ హదీసు ద్వారా నమాజె ఖౌఫ్‌కు సంబంధించిన మరో పద్ధతి ముందుకు వచ్చింది. నమాజె ఖౌఫ్‌కు సంబంధించిన పరిస్థితులు, ఉల్లేఖనాలు కూడా అనేకం ఉండటం వల్ల దాన్ని నెరవేర్చిన తీరులో కూడా వైవిధ్యం కనబడుతోంది. నసాయిలో హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) రెండు వేర్వేరు బృందాలకు రెండేసి రకతుల నమాజు చేయించారు. ఆ విధంగా దైవప్రవక్త (స)కు 4 రకతులు అయ్యాయి. అంటే ఆయన (స) మొదటి రెండు రకతులు 'ఫర్జ్' గా ఆచరించారు. మిగతా రెండు రకతులు 'నఫిల్' రూపంలో చేశారు. ఎందుకంటే ఒకే నమాజ్ రెండుసార్లు ఫర్జ్‌గా పరిగణించబడదు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే నఫిల్ నమాజు చేసే ఇమామ్ వెనుక ముఖ్తదీలు ఫర్జ్ నమాజును చేయవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ అయ్యాష్ జురఖీ (రజి) అసలు పేరు జైద్ బిన్ సాబిత్. అన్సారీగా, జురఖీగా ప్రసిద్ధి చెందారు. ఈ హదీసును ఒక ముస్లిం సమూహం ఈయనకు తెలియజేసింది. ఈయన హిజ్రీ 40 తరువాత మరణించారు.

(٣٨٢) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى صَلاَةَ الْخَوْفِ بِهٰؤُلَاءِ رَكْعَةً، وَهٰؤُلَاءِ رَكْعَةً، وَلَمْ يَقْضُوْا. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَمِثْلُهُ عِنْدَ ابْنِ خُزَيْمَةَ عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا.

382. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా బృందానికీ ఒకే రకత్ (నమాజె ఖౌఫ్) చేయించారు. వేరొక బృందానికి కూడా ఒకే రకత్‌ను చేయించారు. మరి వారు నమాజ్‌ను పూర్తి చేయలేదు. (అహ్మద్, అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఇబ్నె ఖుజైమ కూడా ఇబ్నె అబ్బాస్ సౌజన్యంతో ఈ విధంగానే హదీసును నకలు చేశారు)

## సారాంశం

'నమాజె ఖౌఫ్' కనీసం ఒక రకత్ కూడా చేయవచ్చునన్న దానికి ఈ హదీసు ఒక ఆధారం వంటిది. ప్రవక్త (స) అనుయాయులలో ఒక వర్గం దీన్ని అనుసరిస్తున్నది. తాబయీన్లలో హసన్ బస్రీ (రహ్మ.లై), జహాక్ (రహ్మ.లై), ఇబ్నె రాహ్వే (రహ్మ.లై), అతా (రహ్మ.లై), తావుస్ (రహ్మ.లై), హకమ్ బిన్ ఉతైబ (రహ్మ.లై), ఖతాదా (రహ్మ.లై) తదితరులు ఇంకా ప్రవక్త ప్రియ సహచరులలో ఇబ్నె అబ్బాస్ (రజి), అబూ హురైర (రజి), అబూ మూసా అష్అరీ (రజి) లు దీనికి సుముఖంగా ఉన్నారు. భీతావహస్థితిలో కేవలం సైగతో ఒక రకత్ చేసినా సరిపోతుందని వీరి అభిప్రాయం. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి హదీసు ఈ దృక్పథాన్ని సమర్థిస్తోంది. ముస్లిం, తిర్మిజీలతో సహా

మరో ఐదుగురు ఉల్లేఖించిన ఈ హదీసులో ఇలా వుంది : "అల్లాహ్ తన ప్రవక్త (సఅసం) నోట సాధారణ స్థితిలో 4 రకతులను, ప్రయాణావస్థలో 2 రకతులను, భయానకస్థితిలో ఒక రకత్‌ను విధి (ఫర్జ్) గావించాడు."

అయితే అధిక సంఖ్యాక ధర్మవేత్తలతోపాటు నలుగురు ఇమాములు కూడా రకతుల సంఖ్యలో భయానక స్థితి ప్రభావం అంతగా లేదని వ్యాఖ్యానించారు.

(٣٨٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «صَلَاةُ الْخَوْفِ رَكْعَةٌ عَلَى أَيِّ وَجْهٍ كَانَ». رَوَاهُ الْبَزَّارُ بِإِسْنَادٍ ضَعِيفٍ.

383. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు: "నమాజె ఖౌఫ్‌ను ఏ విధంగా నెరవేర్చినాసరే అది ఒక రకత్ మాత్రమే." (బజ్జార్ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ఆధారంగా కొంతమంది ఇమాములు, ముహద్దిసులు కూడా నమాజె ఖౌఫ్ ఒకే రకత్ చేయాలని భావిస్తున్నారు. సుఫ్యాన్ కూడా దీనికి సుముఖంగా ఉన్నారు. 'ఏ విధంగా నెరవేర్చినాసరే' అన్న వచనంలో ఖిబ్లా వైపునకు అభిముఖమైనా, కాకపోయినాసరే నమాజ్ నెరవేరుతుంది అన్న భావం ఇమిడి ఉంది.

(٣٨٤) وَعَنْهُ مَرْفُوعاً: لَيْسَ فِي صَلَاةِ الْخَوْفِ سَهْوٌ. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

384. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పినట్లుగా హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు - "నమాజె ఖౌఫ్‌లో సహూ సజ్దా లేదు." (దారె ఖుత్నీ దీనిని బలహీన ఆధారాలతో వెలికి తీశారు)

**14వ అధ్యాయం**

## ١٤ - بَابُ صَلَاةِ الْعِيدَيْنِ

## పండుగల నమాజ్

(٣٨٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «الفِطْرُ يَوْمَ يُفْطِرُ النَّاسُ، وَالْأَضْحَى يَوْمَ يُضَحِّي النَّاسُ». رَوَاهُ التِّرْمِذِيُّ.

385. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ రోజున ప్రజలు ఉపవాసాలు అన్నీ పూర్తిచేసి 'ఇఫ్తార్' చేస్తారో ఆ రోజు వారి కొరకు పండుగ రోజు అవుతుంది. ప్రజలు ఖుర్బానీ ఇచ్చే రోజు ఈదుల్ అజ్హా అవుతుంది." (తిర్మిజీ)

### సారాంశం

ముస్లింల కొరకు ఏడాదికి రెండు పండుగలు మాత్రమే ఉన్నాయని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అవి (1) ఈదుల్ ఫిత్ర్ (2) ఈదుల్ అజ్హా. ఈ రెండు పండుగలు మినహా మరో పండుగగానీ, సంబరంగానీ ఇస్లాంలో లేదు. ఈ మధ్య ముస్లింలు సృష్టించుకున్న కొంగ్రొత్త పండుగలకు షరీయత్‌తో ఏ మాత్రం సంబంధం లేదు.

పండుగలు సామూహికత యొక్క ప్రాముఖ్యతను చాటి చెబుతాయి. ఇస్లాం ప్రతిపాదించిన పండుగలలో సామూహిక స్ఫూర్తితోపాటు, ఆరాధనలు కూడా ఉన్నాయి. ఏ ఒక్క మనిషి కూడా-ఒంటరిగా - నెలవంక చూసి, ఒంటరిగా పండుగ జరుపుకోలేడు. పండుగ జరుపుకోవటానికి ముస్లిం సమాజంలోని అత్యధికులు ఆమోదించాలి.

(٣٨٦) وَعَنْ أَبِي عُمَيْرِ بْنِ أَنَسٍ، عَنْ عُمُومَةٍ لَّهُ مِنَ الصَّحَابَةِ، أَنَّ رَكْبًا جَاءُوا، فَشَهِدُوْا أَنَّهُمْ رَأَوُا الْهِلَالَ بِالْأَمْسِ، فَأَمَرَهُمُ النَّبِيُّ ﷺ أَنْ يُفْطِرُوْا، وَإِذَا أَصْبَحُواْ أَنْ يَغْدُوا إِلَى مُصَلَّاهُمْ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَهَذَا لَفْظُهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ.

386. హజ్రత్ అబూ ఉమైర్ బిన్ అనస్ (రజి) తన పినతండ్రి అయిన ఒక సహాబీ (రజి) గారి ఆధారంగా ఉల్లేఖించారు - కొంతమంది దైవప్రవక్త (సఅసం) దగ్గరకు స్వారీ చేసివచ్చి తాము నిన్న సాయంత్రం నెలవంకను చూసినట్లు సాక్ష్యమిచ్చారు. దీనిపై ఆయన (స), "ఉపవాసాన్ని విరమించండి. రేపు దయం పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు రండి" అని ఆజ్ఞాపించారు. (అహ్మద్, అబూదావూద్‌లు దీనిని ఉల్లేఖించారు - వాక్యాలు మాత్రం అబూ దావూద్‌లోనివి. దీని ఆధారం ప్రమాణ బద్ధమైనది)

### సారాంశం

రమజాన్ నెల 29వ రోజు సాయంత్రం - ఆకాశం నిర్మలంగా వున్న ప్రదేశంలో గనక నెలవంక కనబడి - ఆ సమాచారం మరునాడు విశ్వసనీయ వర్గాల ద్వారా అందితే - ఆ సమాచారం ఆధారంగా అప్పటికప్పుడే ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయవచ్చు. అయితే పొద్దు నడినెత్తిపై రాక మునుపే సమాచారం అందితే ఆ రోజు పండుగ నమాజ్ చేయాలి. మధ్యాహ్న సమయానికి సమాచారం అందితే పండుగ మరునాడే జరుపుకోవలసి ఉంటుంది.

ఈ హదీసు ఆధారంగా తెలిసిన మరో విషయమేమిటంటే పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో జరుపుకోవటం ఉత్తమం. నెలవంక కనబడినట్లు అధికారికంగా కూడా సమాచారం అందించవచ్చు. ఇలాంటి ప్రకటన ధార్మిక సంస్థల, ధార్మిక వ్యక్తుల ద్వారా చేయించటం మంచిది. ఆధునిక యుగంలో రేడియో, టీవీ వంటి ప్రసార సాధనాల వల్ల క్షణాల్లో సమాచారం అందుతోంది.

**హదీసు ఉల్లేఖకులు**

అబూ ఉమైర్ బిన్ అనస్ (రహ్మ.లై) గారి అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ అన్సారీ. అనస్ (రజి) గారి పెద్దకొడుకు. యువ తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడ్డారు. 4వ కోవకు చెందిన ఉల్లేఖకులు. తన తండ్రి తరువాత చాలా కాలం వరకు జీవించారు.

(٣٨٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ لاَ يَغْدُو يَوْمَ الْفِطْرِ حَتَّى يَأْكُلَ تَمَرَاتٍ. يَأْكُلُهُنَّ وِتْرًا. أَخْرَجَهُ الْبُخَارِيُّ، وَفِيْ رِوَايَةٍ مُعَلَّقَةٍ - وَوَصَلَهَا أَحْمَدُ -: (وَيَأْكُلُهُنَّ إِفْرَادًا).

387. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ (ఈదుల్ ఫిత్ర్) కు బయలుదేరకముందు కొన్ని ఖర్జూరపు పండ్లు తినేవారు. ఈ ఖర్జూర పండ్లు బేసి సంఖ్యలో ఉండేవి.'' (దీనిని బుఖారీ ఉల్లేఖించారు - ఒక అనిశ్చిత (ముఅల్లఖ్) ఉల్లేఖనంలో కూడా ఇలాగే ఉంది. ఆయన (స) ఈ ఖర్జూర పండ్లను ఒక్కొక్కటిగా చేసి తినేవారని అహ్మద్ గారు ఒక మౌసూల్ ఉల్లేఖనంలో ప్రస్తావించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన దృష్టికి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఇవి: (1) ఈద్ నమాజ్ కోసం బహిరంగ స్థలాలకు వెళ్ళాలి. (2) పండుగ నమాజ్‌కు వెళ్ళేముందు బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లు తినటం సంప్రదాయం (సున్నత్). (3) ఖర్జూర పండ్లు ఒకేసారి అనేకం నోట్లో వేసుకునే బదులు ఒక్కొక్కటీ తినాలి. ఒకేసారి నోట్లో కుక్కటం అనాగరికం, సంస్కార విహీనం అనిపించుకుంటుంది. ఒకవేళ ఖర్జూర పండ్లు లభ్యమవకపోతే మరేదయినా తీపి పదార్థంగానీ, తీపి పండ్లుగానీ తినవచ్చు.

(٣٨٨) وَعَنِ ابْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيْهِ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ لاَ يَخْرُجُ يَوْمَ الْفِطْرِ حَتَّى يَطْعَمَ، وَلاَ يَطْعَمُ يَوْمَ الْأَضْحَى حَتَّى يُصَلِّيَ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

388. తన తండ్రి తనతో చెప్పినట్లు హజ్రత్ ఇబ్నె బురైద తెలిపారు - "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ కొరకు ఏదైనా తినేవరకూ బయలుదేరేవారు కారు. అయితే ఖుర్బానీ పండుగనాడు ఆయన (స) నమాజ్ చేసేదాకా ఏమీ తినేవారు కారు. (అహ్మద్ మరియు తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

రమజాన్ పండుగ రోజున ఏదన్నా తిన్న తరువాత నమాజ్ చేయటం, బక్రీద్ పండుగనాడు నమాజ్ చేసిన తరువాత తినటం దైవప్రవక్త (స) విధానం. ఫలానా పదార్థమే తినాలన్న ఆంక్ష ఏమీలేదు. కాకపోతే ఖర్జూర పండ్లను 'మస్నూన్'గా భావించి వాటిని తినటం చాలా మంచిది.

(٣٨٩) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أُمِرْنَا أَنْ نُخْرِجَ الْعَوَاتِقَ وَالْحُيَّضَ فِي الْعِيدَيْنِ، يَشْهَدْنَ الْخَيْرَ وَدَعْوَةَ الْمُسْلِمِينَ، وَتَعْتَزِلُ الْحُيَّضُ الْمُصَلَّى. مُتَّفَقٌ عَلَيْهِ.

389. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : "ముస్లింల సంక్షేమ కార్యాలలో, వేడుకోళ్లలో పాలుపంచుకునే ఉద్దేశ్యంతో, మేము పడుచు పిల్లలను, బహిష్టు స్త్రీలను కూడా పండుగలకు (ఈద్గాహ్‌లకు) తీసుకు రావలసిందిగా మాకు ఆజ్ఞాపించబడింది. అయితే బహిష్టు స్త్రీలు ఈద్గాహ్ ప్రక్కనే ఉండాలని (నమాజ్ చేయరాదని, కేవలం దుఆలో పాల్గొనాలనీ) సూచించబడింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పండుగ నమాజ్ కొరకు మహిళలు ఇల్లు వదలి ఈద్గాహ్‌కు వెళ్ళటం సమంజసమేనని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవప్రవక్త (స) స్వయంగా తన సతీమణులను, కుమార్తెలను ఈద్గాహ్‌కు తీసుకు వెళ్ళేవారని ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు. హజ్రత్ అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), అలీ (రజి)లు స్త్రీలను పండుగ నమాజ్‌కు పిలుచుకు వెళ్ళటం తప్పనిసరి అని భావించేవారు.

ఈ హదీసుపై హనఫీ ధర్మవేత్తలు ఇలా వ్యాఖ్యానించారు: "ఇది ఇస్లాం ఆరంభకాలంనాటి సంగతి. ఆ రోజుల్లో ముస్లింల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. పర్వదినాలలో - ఈద్గాహ్‌లో - ముస్లింలు వీలైనంత ఎక్కువమంది పాల్గొంటే అవిశ్వాసులపై దాని ప్రభావం పడుతుందన్న ఉద్దేశ్యంతో మహిళలను సయితం గొనిపోయేవారు."

అల్లామా తహావీ ఎంతో కష్టపడి సేకరించిన ఈ సమాచారంలో పసలేదు. ఎందుకంటే హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ఈ (పండుగ) సంఘటన మక్కా విజయం తరువాత సంభవించింది. దైవకృపవల్ల అప్పటికే ముస్లింల సంఖ్య గణనీయంగా పెరిగింది. మక్కా మదీనాలలో దాదాపు ఇస్లామీయ వ్యవస్థ నెలకొన్నది.

ఇంతకీ చెప్పవచ్చిందేమిటంటే ఈద్గాహ్‌లలో స్త్రీలు పాల్గొనటం మంచిది. ఇది దైవప్రవక్త (సఅసం) నెలకొల్పిన ఒక ఆదర్శం.

(٣٩٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ وَأَبُو بَكْرٍ وَعُمَرَ يُصَلُّونَ الْعِيدَيْنِ قَبْلَ الْخُطْبَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

390. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం), హజ్రత్ అబూ బక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)లు పండుగ నమాజుల సందర్భంగా ప్రసంగానికి ముందే నమాజు చేసేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పండుగలలో తొలుత నమాజ్ చేసి, ఆ తరువాత ప్రసంగం చేయాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. బనూ ఉమయ్యా పరిపాలనా యుగంలో మర్వాన్ అనే పరిపాలకుడు ముందు ప్రసంగించి తరువాత నమాజ్ చేసే దురాచారాన్ని (బిద్అత్‌ను) ఆరంభించాడు. ఆ సమయంలో హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) దీనిపై తీవ్ర నిరసన తెలిపారు. 'నీవు సున్నత్‌కు విరుద్ధమైన పని మొదలెట్టావు' అని ఆయన పరిపాలకుని మొహం మీదే చెప్పేశారు. (సహీహ్ ముస్లిం)

(٣٩١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى يَوْمَ الْعِيدِ رَكْعَتَيْنِ، لَمْ يُصَلِّ قَبْلَهُمَا وَلاَ بَعْدَهُمَا. أَخْرَجَهُ السَّبْعَةُ.

391. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజున రెండు రకతుల నమాజ్ మాత్రమే చేశారు. దీనికి ముందుగానీ, తరువాతగానీ ఆయన (స) మరే నమాజూ చేయలేదు." (దీనిని ఏడు గురూ-అంటే అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా - ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఈద్గాహ్‌లో ఈ రెండు రకతుల పండుగ నమాజ్ తప్ప మరే నమాజూ దైవప్రవక్త (స) చేయలేదు. అయితే ఇంటికి తిరిగి వచ్చిన మీదట రెండు రకతులు చేసేవారు.

(٣٩٢) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى الْعِيدَ بِلاَ أَذَانٍ وَلاَ إِقَامَةٍ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

392. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "అజాన్, ఇఖామత్‌లు చెప్పకుండానే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ చేయించారు." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు -దీని మూలం బుఖారీలో ఉంది)

**సారాంశం**

పండుగ నమాజ్ కోసం అజాన్, ఇఖామత్‌లు చెప్పవలసిన అవసరం లేదు. ఒకవేళ ఎవరయినా అజాన్, ఇఖామత్ ఇస్తే వారు బిద్అత్ (కొత్త పోకడ)ను సృష్టించినవారే అవుతారు.

(٣٩٣) وَعَنْ أَبِيْ سَعِيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ لاَ يُصَلِّيْ قَبْلَ الْعِيْدِ شَيْئاً، فَإِذَا رَجَعَ إِلَى مَنْزِلِهِ صَلَّى رَكْعَتَيْنِ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ حَسَنٍ.

393. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్‌కు ముందు ఏ నమాజూ చేసేవారు కాదు. అయితే ఇంటికి వచ్చిన తరువాత రెండు రకతుల నఫిల్ నమాజు మాత్రం చేసే వారు." (దీనిని ఇబ్నె మాజ స్పష్టమయిన ఆధారంతో ఉల్లేఖించారు)

(٣٩٤) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَخْرُجُ يَوْمَ الْفِطْرِ وَالْأَضْحَى إِلَى الْمُصَلَّى، وَأَوَّلُ شَيْءٍ يَبْدَأُ بِهِ الصَّلاَةُ، ثُمَّ يَنْصَرِفُ، فَيَقُوْمُ مُقَابِلَ النَّاسِ - وَالنَّاسُ عَلَى صُفُوْفِهِمْ - فَيَعِظُهُمْ وَيَأْمُرُهُمْ. مُتَّفَقٌ عَلَيْهِ.

394. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ మరియు ఈదె ఖుర్బానీ కొరకు ఈద్గాహ్‌కు రాగానే చేసే మొదటి పని నమాజ్ చేయించటం. నమాజ్ పూర్తయిన వెంటనే ఆయన (స) ప్రజల వైపునకు తిరిగి నిలబడేవారు. ప్రజలు తమ తమ పంక్తుల్లో కూర్చుని వుండగా ఆయన (స) వారికి హితబోధ చేసేవారు. మంచిని పెంపొందించమని ఆజ్ఞాపించేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా క్రింది అంశాలు వెలుగులోకి వస్తాయి -

(1) పండుగ నమాజుకు మునుపు దైవప్రవక్త (సఅసం) మరే ఆచరణా చేసినట్టు ఆధారం లేదు. (2) నమాజ్ చేసిన తరువాత ప్రసంగించాలి. (3) ఉపన్యాసకుడు ప్రజల వైపునకు తిరిగి నిలబడాలి. (4) ఉపన్యాసం నిలబడి ఇవ్వాలి. ప్రతి ఉపన్యాసకుడూ ఉపన్యసించే సమయంలో ప్రజలకు ధర్మబోధ చేయాలి. సదాచరణ గురించి నొక్కి వక్కాణించాలి. అనవసర వ్యాఖ్యలకు, కాలక్షేపపు కబుర్లకు అందులో తావుండరాదు.(5) ప్రసంగం కొనసాగే సమయంలో ప్రజలు తమ తమ స్థానాలలో నిశ్శబ్దంగా కూర్చోవాలి. ఉపన్యాసకుని వైపునకు తిరిగి కూర్చోవాలి. (6) పండుగ

నమాజ్‌ను వీలయినంత వరకు ఈద్గాహ్‌లోనే చేయాలి. ఈ మధ్య జనులు తగు కారణమేదీ లేకుండానే తమ పేటలో వున్న మస్జిదులలో పండుగ నమాజ్ చేస్తున్నారు. ఇది హర్షించదగ్గ విషయం కాదు. (7) దైవప్రవక్త (సఅసం) పండుగ రోజు ప్రసంగం కొరకు వేదికను ఉపయోగించలేదు. అందరికన్నా ముందు ఈద్గాహ్‌లో వేదికను ప్రతిష్ఠించిన వ్యక్తి మర్వాన్ అనీ, అతడు దానిపై నిలబడి ఉపన్యసించాడనీ బుఖారీలో ఉంది. అయితే ఇబ్నె హిబ్బాన్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఒకసారి ఒంటెపై కూర్చొని పండుగ ప్రసంగం చేశారు. కనుక అవసరం మేరకు వాహనంపై నుంచి కూడా ప్రసంగించవచ్చునన్న దానికి ఇదొక నిదర్శనం.

(٣٩٥) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ نَبِيُّ اللهِ ﷺ: «التَّكْبِيرُ فِي الْفِطْرِ سَبْعٌ فِي الْأُولَى، وَخَمْسٌ فِي الْأُخْرَى، وَالْقِرَاءَةُ بَعْدَهُمَا كِلْتَيْهِمَا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَنَقَلَ التِّرْمِذِيُّ عَنِ الْبُخَارِيِّ تَصْحِيحَهُ.

395. హ్రజత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి గారినుండి, మరి ఆయనేమో తన తాతగారి నుండి గ్రహించిన విషయాన్ని ఇలా తెలియజేస్తున్నారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు : "ఈదుల్ ఫిత్ర్ నమాజు మొదటి రకత్‌లో ఏడు తక్బీర్లు, రెండవ రకతులో ఐదు తక్బీర్లు ఉన్నాయి. రెండు రకతులలోనూ తక్బీర్ల అనంతరమే ఖిరాత్ (ఖుర్ఆన్ పారాయణం) ఉంటుంది." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు - తిర్మిజీ గారు ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) నుండి దీని ప్రామాణికతను నకలు చేశారు)

**సారాంశం**

పండుగ నమాజులలో 12 అదనపు తక్బీర్లు ఉన్నాయని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. హ్రజత్ ఆయిషా (ర.అన్హా), హ్రజత్ సాద్ (రజి), హ్రజత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తదితర సహాబీల ఉల్లేఖనాలు కూడా ఈ హదీసుకు అనుకూలంగా ఉన్నాయి. అనేక మంది తాబయీలు, మదీనా ధర్మవేత్తల (ఫుకహా)తో పాటు ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయీ కూడా ఈ హదీసు ప్రకారమే ఆచరించారు. తిర్మిజీ వ్యాఖ్యాత అల్లామా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి దీని గురించి జరిపిన చర్చ తిరుగులేనిది.

అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరియు కొంతమంది కూఫా ధర్మవేత్తలు మాత్రం 6 అదనపు తక్బీర్లతో పండుగ నమాజ్ చేయాలని అభిప్రాయపడ్డారు. అంటే మొదటి రకతులో ఖిరాత్‌కు ముందు 3 తక్బీర్లు, రెండవ రకతులో 'రుకూ' లోకి వెళ్ళకముందు 3 తక్బీర్లు.

పండుగ నమాజ్‌లలో అదనపు తక్బీర్లు పలికే సమయంలో కూడా 'రఫెయదైన్' చేయటం సంప్రదాయమని ఇమామ్ ఇబ్నె ముంజిర్, బైహఖీలు పేర్కొన్నారు.

(٣٩٦) وَعَنْ أَبِي وَاقِدٍ اللَّيْثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَقْرَأُ فِي الْأَضْحَى وَالْفِطْرِ بِـ «ق، وَاقْتَرَبَتْ». أَخْرَجَهُ مُسْلِمٌ.

396. హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ అజ్హా మరియు ఈదుల్ ఫిత్ర్ నమాజులలో సూరయె ఖాఫ్ మరియు ఇఖ్తరబతిస్సాఅ సూరాలు పఠించేవారు." (ముస్లిం)

**సారాంశం**

పండుగ నమాజులలో ఏ సూరాలు పఠించినా నమాజు నెరవేరుతుంది. అయితే ప్రవక్త (సఅసం) అనుసరణకు ప్రతీకగా ఈ రెండు సూరాలను చదవటం మంచిది.

(٣٩٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا كَانَ يَوْمُ الْعِيدِ خَالَفَ الطَّرِيقَ. أَخْرَجَهُ الْبُخَارِيُّ، وِلِأَبِي دَاوُدَ عَنِ ابْنِ عُمَرَ نَحْوُهُ.

397. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజున ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి మరో దారిగుండా తిరిగి వచ్చే వారు." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు- అబూదావూద్‌లో ఇబ్నె ఉమర్ (రజి) చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది)

**సారాంశం**

ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి, మరో దారిన రావటం వల్ల ప్రజాబాహుళ్యంలో పండుగ వాతావరణాన్ని సృజించినట్లవుతుంది. పండుగ రోజున వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు పలికే తక్బీర్లతో వీధి వీధి, వాడ వాడ ప్రతిధ్వనిస్తుంది. దేవుని గొప్పదనం, ఘనత చాటబడుతుంది. తద్వారా ఇస్లాం వైభవం కూడా వ్యక్తమవుతుంది.

(٣٩٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَدِمَ رَسُولُ اللهِ ﷺ الْمَدِينَةَ، وَلَهُمْ يَوْمَانِ يَلْعَبُونَ فِيهِمَا، فَقَالَ: قَدْ أَبْدَلَكُمُ اللَّهُ بِهِمَا خَيْراً مِّنْهُمَا: يَوْمَ الْأَضْحَى، وَيَوْمَ الْفِطْرِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ بِإِسْنَادٍ صَحِيحٍ.

398. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా ఏతెంచినపుడు అక్కడ ఏడాదికి రెండు రోజులు ఆటపాటలకై, వినోదానికై ప్రత్యేకించబడి ఉండటం గమనించారు. "అల్లాహ్ మీ కోసం ఈ రెండు దినాలకు బదులుగా ఇంతకన్నా మేలైన రెండు దినాలను ప్రసాదించాడు. ఒకటి : ఈదుల్ అజ్హా. రెండవది :

ఈదుల్ ఫిత్ర్." (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు - దీని ఆధారం ప్రామాణికమైనది)

**సారాంశం**

షరీయత్ పరిధిలో వుంటూ పండుగ దినాలలో ఆనందంగా ఆటలాడుకోవటం, విద్యా పాటవం ప్రదర్శించటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే అవధులు మీర కూడదు. సభ్యతా సంస్కారాలకు విరుద్ధమైన వెకిలి చేష్టలకు, ధన మాన ప్రాణాలకు నష్టం కలిగించే కృత్యాలకు పాల్పడరాదు.

(٣٩٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: مِنَ السُّنَّةِ أَنْ يَخْرُجَ إِلَى الْعِيْدِ مَاشِيًا. رَوَاهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

399. ఈద్గాహ్ వైపునకు నడచి వెళ్లటం సున్నత్ (సంప్రదాయం)అని హజ్రత్ అలీ (రజి) తెలిపారు. (దీనిని తిర్మిజీ నకలు చేశారు. 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈద్గాహ్‌కు నడచి వెళ్లడం ఎక్కువ పుణ్యప్రదమయిన విషయం. పండుగ నమాజ్ కోసం ఎన్ని అడుగులు వేస్తే అన్ని సత్కార్యాలు లిఖించబడతాయి. ఒకవేళ ఈద్గాహ్ చాలా దూరముంటే వాహనంపై వెళ్ళటంలో తప్పులేదు.

(٤٠٠) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُمْ أَصَابَهُمْ مَطَرٌ فِي يَوْمِ عِيْدٍ، فَصَلَّى بِهِمُ النَّبِيُّ ﷺ صَلَاةَ الْعِيْدِ فِي الْمَسْجِدِ. رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ لَيِّنٍ.

400. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: ఒకసారి పండుగ రోజున ముస్లిం లను వర్షం వెంటాడటం వల్ల దైవప్రవక్త (సఅసం), వారికి మస్జిదులోనే పండుగ నమాజ్ చేయించారు. (అబూదావూద్ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖిం చారు)

**సారాంశం**

షరీయత్‌పరంగా తగు కారణమేదైనా ఉంటే అప్పుడు మస్జిద్‌లో కూడా పండుగ నమాజ్ చేయవచ్చునని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. సాధారణంగా ఆయన (స) ఈద్గాహ్‌లోనే పండుగ నమాజ్‌ను చేసేవారు. కాని ఒకసారి మాత్రం దైవకారుణ్యం వర్షించటం మూలంగా మస్జిదులో పండుగ నమాజ్ చేయించాల్సి వచ్చింది.

ఇక పండుగ నమాజ్ ఈద్గాహ్‌లో చేయాలా? లేక మస్జిదులలో చేయాలా? అన్న విషయమై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో సువిశాలమైన (పెద్ద) మస్జిదులో పండుగ నమాజ్ చేయటం ఉత్తమం.

ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: "దైవప్రవక్త (సఅసం) జీవితాంతం పండుగ నమాజ్‌ను బహిరంగ ప్రదేశంలో - ఈద్గాహ్ స్థలంలో - ఆచరించారు. కేవలం ఒక్కసారి మాత్రం వర్షం కారణంగా గత్యంతరం లేక మస్జిద్‌లో పండుగ నమాజ్‌ను నెరవేర్చారు. కనుక పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో చేయటమే శ్రేష్ఠం."

హజ్రత్ అలీ (రజి) గారి పలుకులు -

ఆయన (రజి) పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన (రజి) ఇలా అన్నారు : "ఒకవేళ బహిరంగ స్థలానికి వచ్చి ఈద్ నమాజ్ చేయటం 'మస్నూన్' (సంప్రదాయం) కాకపోయినట్లయితే నేను మస్జిద్‌లోనే నమాజ్ చేసి ఉండేవాణ్ణి."

కాబట్టి పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో చేయటమే సంప్రదాయం, శ్రేష్ఠం కూడా.

**15వ అధ్యాయం**

## ١٥ - بَابُ صَلاَةِ الْكُسُوفِ

## గ్రహణ సమయాలలో నమాజ్ (సలాతుల్ కుసూఫ్)

(٤٠١) عَنِ الْمُغِيرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: انْكَسَفَتِ الشَّمْسُ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ يَوْمَ مَاتَ إِبْرَاهِيمُ، فَقَالَ النَّاسُ: انْكَسَفَتِ الشَّمْسُ لِمَوتِ إِبْرَاهِيمَ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: **«إِنَّ الشَّمْسَ وَالْقَمَرَ آيَتَانِ مِنْ آيَاتِ اللهِ، لاَ يَنْكَسِفَانِ لِمَوْتِ أَحَدٍ وَلاَ لِحَيَاتِهِ، فَإِذَا رَأَيْتُمُوهُمَا فَادْعُوا اللَّهَ وَصَلُّوا، حَتَّى تَنْكَشِفَ»**. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: **«حَتَّى تَنْجَلِيَ»**.

401. హజ్రత్ ముగీరా బిన్ షూబా (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో ఇబ్రాహీం చనిపోయిన నాడు సూర్యగ్రహణం పట్టింది. ఇబ్రాహీం మరణం మూలంగానే సూర్యునికి గ్రహణం పట్టిందని ప్రజలు చెప్పుకున్నారు. దీనిపై దైవప్రవక్త (సఅసం), "సూర్యచంద్రులు దేవుని నిదర్శనాలలో రెండు నిదర్శనాలు మాత్రమే. ఒకరి జీవన్మరణాలతో వాటి గ్రహణానికి ఎలాంటి సంబంధం లేదు. మీరు వాటిని ఎప్పుడు ఈ స్థితిలో చూచినా అల్లాహ్‌ను ప్రార్థించండి. సూర్యగ్రహణం వీడిపోయేదాకా నమాజ్ చేయండి" అని బోధించారు. (బుఖారీ, ముస్లిం) బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో "అది ప్రకాశించే వరకూ నమాజ్ చేస్తూ ఉండండి" అని ఉంది.

وَلِلْبُخَارِيِّ مِنْ حَدِيثِ أَبِي بَكْرَةَ: «فَصَلُّوا، وَادْعُوا، حَتَّى يَنْكَشِفَ مَا بِكُمْ».

బుఖారీలో అబూబక్రా (రజి) హదీసులో ఈ విధంగా ఉంది : "ఆ స్థితి మీ ముందు నుంచి తొలగిపోయేవరకు నమాజ్ చేయండి, దుఆ చేయండి."

## సారాంశం

సూర్యగ్రహణమైనా, చంద్రగ్రహణమైనా దైవనిదర్శనాలలో రెండు గొప్ప నిదర్శనాలు మాత్రమే. సూర్యచంద్రులు దేవుడు విధించిన నియమానికీ, ప్రణాళికకు కట్టుబడి ఉన్నాయి. ఈ నియమాన్ని అతిక్రమించి, తమ ఇష్టానుసారం ఉదయించే, అస్తమించే ధైర్యం వాటికి లేదు. అవి అలా చేయలేవు కూడా. దైవశాసనం ముందు అవి ఇంత నిస్సహాయంగా ఉన్నప్పుడు ఇతరులకు లాభనష్టాలు ఎలా కలిగించగలుగుతాయి? ఆలోచించాలి.

ఈ సందర్భంగా నమాజ్ చేయటం, దుఆ చేయటం సంప్రదాయం. రెండు రకతుల నమాజును ఆయన (స) సామూహికంగా చేసినట్లు ఆధారాలున్నాయి. ఒక్కో రకతులో రెండేసి రుకూలు చేయటం విశేషం. సూర్యగ్రహణం ఎప్పుడు పడితే అప్పుడే నమాజ్ చేయాలి.

ఇంతకీ ఈ నమాజ్ సున్నతా? వాజిబా? సున్నత్ అని కొందరు, వాజిబ్ అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారు ఈ నమాజ్‌ను వాజిబ్ (తప్పనిసరి)గా తలపోశారు. అత్యధిక ధర్మవేత్తల ప్రకారం ఈ నమాజ్ రెండు రకతులు. ఒక్కో రకతులో రెండేసి రుకూలు, రెండేసి ఖియామ్‌లు ఉంటాయి. రెండేసిసార్లు ఖిరాత్ కూడా చేయవలసి ఉంటుంది. మొదటి ఖియామ్‌లో ఫాతిహా సూరా పఠించే విషయమై ఏకాభిప్రాయముంది. కాని రెండో ఖియామ్‌లో ఫాతిహా సూరా పఠించటంపై అభిప్రాయభేదం ఉంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) దృష్టిలో ఫాతిహా సూరా రెండవ ఖియామ్‌లోనూ పఠించవలసిందే. లేకపోతే ఆయన దృష్టిలో నమాజ్ సక్రమం కాజాలదు.

ఖిరాత్ (ఖుర్‌ఆన్ పారాయణం) బిగ్గరగా చేయాలా? నెమ్మదిగా చేయాలా? అన్న విషయంపై కూడా నాలుగు అభిప్రాయాలున్నాయి. బిగ్గరగా ఖుర్‌ఆన్ పఠించాలని భావించేవారిలో ఇమామ్ అహ్మద్, ఇమామ్ అబూ హనీఫా, ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె ముంజిర్ తదితరులున్నారు. ఖిరాత్ నెమ్మదిగా పఠించాలని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) వక్కాణించారు. ఏవిధంగా తలచుకుంటే ఆ విధంగా పఠించవచ్చు అన్నది మూడవ వాదన. సూర్యగ్రహణమైతే నెమ్మదిగా పారాయణం చేయాలనీ, చంద్రగ్రహణమైతే బిగ్గరగా పారాయణం చేయాలన్నది నాల్గవ దృక్పథం.

## హదీసు ఉల్లేఖకులు

ఇబ్రాహీం (రజి). ఈ పిల్లవాడు దైవప్రవక్త (సఅసం)గారి పుత్రుడు. ఈయన తల్లిపేరు మారియ ఖిబ్‌తియ (ర.అన్‌హా). అంటే ఈమె దైవప్రవక్త (సఅసం) ధర్మపత్ని. అలెగ్జాండ్రియా మరియు ఈజిప్టు పరిపాలకుడు ఈమెను దైవప్రవక్త (సఅసం)కు కానుకగా సమర్పించాడు. ఆయన (స) కుమారుడగు ఇబ్రాహీం (రజి) హిజ్రీ 9వ ఏట జమాది ఉల్ ఊలాలో జన్మించారు. 18 మాసాల అనంతరం - హిజ్రీ 10వ సంవత్సరం షవ్వాల్ మాసంలో - మరణించారు. బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి. "స్వర్గంలో ఒక పాలు త్రాపే మహిళ ఈ అబ్బాయి పాలగడువును పూర్తిచేసింది" అని దైవప్రవక్త (సఅసం) వ్యాఖ్యానించారు.

(٤٠٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ جَهَرَ فِي صَلَاةِ الْكُسُوفِ بِقِرَاءَتِهِ، فَصَلَّى أَرْبَعَ رَكَعَاتٍ، فِي رَكْعَتَيْنِ وَأَرْبَعَ سَجَدَاتٍ. مُتَّفَقٌ عَلَيْهِ، وَهَذَا لَفْظُ مُسْلِمٍ. وَفِي رِوَايَةٍ لَهُ: فَبَعَثَ مُنَادِياً يُنَادِي «الصَّلَاةُ جَامِعَةٌ».

402. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గ్రహణ సమయంలో చేసిన నమాజులో బిగ్గరగా (ఖుర్ఆన్) పారాయణం చేశారు. రెండు రకతులలో మొత్తం నాలుగు రుకూలు, నాలుగు సజ్దాలే చేశారు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి) ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది -"ఆయన ప్రకటన గావించే వానిని పంపారు. ఆ వ్యక్తి 'అస్సలాతు జామిఅతున్' అని ప్రకటించేవాడు."

**సారాంశం**

దైవప్రవక్త (స) 'సలాతుల్ కుసూఫ్'లో బిగ్గరగా పారాయణం చేసేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. హజ్రత్ అలీ (రజి) చే ఉల్లేఖించబడిన ఒక హదీసు కూడా ఈ విషయాన్ని నిర్ధారిస్తోంది. ఈ నమాజు సాధారణ నమాజుల వంటిది కాదనీ, ఇందులో రుకూలు అదనంగా ఉంటాయని కూడా అర్థమవుతున్నది. ఈ ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఒక్కో రకత్‌లో రెండేసి రుకూలు చేశారు. ఈ నమాజుకు ఒక వేళ అంటూ ఉండదు. ఎప్పుడు సూర్యగ్రహణముంటే అప్పుడే చేయవలసి ఉంటుంది.

(٤٠٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: انْخَسَفَتِ الشَّمْسُ عَلَى عَهْدِ رَسُولِ اللّٰهِ ﷺ فَصَلَّى، فَقَامَ قِيَاماً طَوِيلاً نَحْواً مِّنْ قِرَاءَةِ سُورَةِ الْبَقَرَةِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيلاً، ثُمَّ رَفَعَ، فَقَامَ قِيَاماً طَوِيلاً، وَهُوَ دُونَ الْقِيَامِ الْأَوَّلِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيلاً، وَهُوَ دُونَ الرُّكُوعِ الْأَوَّلِ، ثُمَّ سَجَدَ، ثُمَّ قَامَ قِيَاماً طَوِيلاً، وَهُوَ دُونَ الْقِيَامِ الْأَوَّلِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيلاً، وَهُوَ دُونَ الرُّكُوعِ الْأَوَّلِ، ثُمَّ رَفَعَ، فَقَامَ قِيَاماً طَوِيلاً، وَهُوَ دُونَ الْقِيَامِ

403. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో సూర్యగ్రహణం పట్టింది. ఆయన (స) నమాజె కుసూఫ్ చేశారు. అందులో సూరయె బఖరా పారాయణం చేసినంతసేపు నిలబడ్డారు. (రుకూ కూడా) సుదీర్ఘమయిన రుకూ చేశారు. మళ్లీ నిలబడ్డారు. ఈసారి కూడా సుదీర్ఘ సమయం నిలబడ్డారు. అయితే మొదటిసారి ఖియామ్ కన్నా కొంచెం తక్కువ. మళ్లీ సుదీర్ఘమయిన రుకూ చేశారు. కాని మొదటి రుకూ కన్నా

الْأَوَّلِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيلاً، وَهُوَ دُونَ الرُّكُوعِ الْأَوَّلِ، ثُمَّ رَفَعَ رَأْسَهُ، ثُمَّ سَجَدَ، ثُمَّ انْصَرَفَ، وَقَدْ انْجَلَتِ الشَّمْسُ، فَخَطَبَ النَّاسَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

చిన్నది. తరువాత సజ్దా చేశారు. ఆ తరువాత నిలబడి మళ్లీ పారాయణం చేశారు. కాని ఇది మొదటి రకత్‌లోని పారాయణంకన్నా తక్కువే. అనంతరం సుదీర్ఘ రుకూ చేశారు. అయితే మును పటి రుకూ కన్నా స్వల్పం. తరువాత తలపైకెత్తి సుదీర్ఘమయిన ఖియామ్ చేశారు. ఇది అంతకుముందు ఖియామ్ కన్నా కొంచెం చిన్నది. ఆ తరువాత మరో సుదీర్ఘమయిన రుకూ చేశారు. ఇది క్రితంసారి రుకూ కన్నా కాస్త చిన్నది. తరువాత తన తలను పైకెత్తారు. ఆ తరు వాత సజ్దా చేశారు. తరువాత సలాం చేశారు. (ఈ లోగా గ్రహణం వీడి) సూర్యుడు ధగధగా ప్రకాశించసాగాడు. అనంతరం ఆయన (స) ప్రజలకు ధర్మ బోధన చేశారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

وَفِي رِوَايَةٍ لِمُسْلِمٍ: صَلَّى حِينَ كُسِفَتِ الشَّمْسُ ثَمَانِيَ رَكَعَاتٍ فِي أَرْبَعِ سَجَدَاتٍ.

ఆయన (స) సూర్యగ్రహణ సమయంలో ఎనిమిది రుకూలు, నాలుగు సజ్దాలతో నమాజ్ చేశారని ముస్లింలోని ఒక ఉల్లే ఖనంలో ఉంది.

وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مِثْلُ ذَلِكَ.

హజ్రత్ అలీ (రజి)చే కూడా ఈ విధం గానే ఉల్లేఖించబడింది.

وَلَهُ عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: صَلَّى سِتَّ رَكَعَاتٍ بِأَرْبَعِ سَجَدَاتٍ.

ముస్లింలోనే హజ్రత్ జాబిర్ (రజి) గారి ఉల్లేఖనంలో ఇలా అనబడింది : "ఆయన (స) ఆరు రుకూలు, నాలుగు సజ్దాలతో ఈ నమాజ్ చేశారు."

وِلأَبِيْ دَاوُدَ عَنْ أُبَيِّ بْنِ كَعْبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ: صَلَّى، فَرَكَعَ خَمْسَ رَكَعَاتٍ، وَسَجَدَ سَجْدَتَيْنِ، وَفَعَلَ فِي الثَّانِيَةِ مِثْلَ ذٰلِكَ.

అబూదావూద్‌లో హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) చే ఈ విధంగా ఉల్లేఖించబడింది- "ఆయన (సఅసం) నమాజె కుసూఫ్ చేశారు. మొదటి రకత్‌లో ఐదు రుకూలు, రెండు సజ్దాలు చేశారు. రెండవ రకత్ కూడా అలాగే చేశారు."

**సారాంశం**

మొత్తంమీద రుకూ, సజ్దాల గురించి విభిన్న అభిప్రాయాలు ముందుకు వచ్చాయి. వీటన్నింటినీ జోడిస్తే ఒక్కో రకత్‌లో రెండేసి, మూడేసి, నాలుగేసి, ఐదేసి రుకూలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిప్రకారం ఆయన (సఅసం) జీవిత కాలంలో అనేకసార్లు 'గ్రహణం' పట్టినట్లు విదితమవుతోంది. రెండేసి రుకూలతో కూడిన రకతులు ఎక్కువ అనుసరణీయమని కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సంఘటన పూర్వాపరాలను సంక్షిప్తంగా చర్చించదలిచాము. అసలు విషయం పాఠకులకు బోధపడాలన్నదే దీని ఉద్దేశ్యం -

దైవప్రవక్త (స) పుత్రుడు ఇబ్రాహీం (రజి) చనిపోయినది హిజ్రీ 10వ సంవత్సరం షవ్వాల్ నెల 28 లేక 29వ తేదీ అనీ, అది క్రీ.శ. 632 జనవరి 27వ తేదీన వస్తుందని పరిశోధకులు, చరిత్రకారులు, ఖగోళ శాస్త్రవేత్తలు, విమర్శకులు, సమీక్షకులు అందరూ ఏకీభవించారు. సూర్యగ్రహణం ఉదయం ఎనిమిదిన్నరకు పట్టింది. దైవప్రవక్త (స) జీవితకాలంలో దీని తరువాత మరెన్నడూ సూర్యగ్రహణం పట్టలేదన్న విషయంలో కూడా వీరందరి మధ్య ఏకాభిప్రాయముంది. అయితే అంతకు ముందు పట్టిన గ్రహణాల గురించి ప్రఖ్యాత పరిశోధకుడు అల్లామా ఖాజీ ముహమ్మద్ సల్మాన్ మన్సూర్‌పూరీ తన విశ్వవిఖ్యాత గ్రంథం "సీరత్ రహ్మతుల్ లిల్ ఆలమీన్"లో ప్రస్తావించారు. దైవప్రవక్త (స) మక్కా జీవితంలోనూ, మదీనా జీవితంలోనూ మొత్తం 10సార్లు గ్రహణాలు పట్టాయనీ, వీటిలో సూర్యగ్రహణాలతోపాటు, చంద్రగ్రహణాలు కూడా ఉన్నాయనీ ఆయన పేర్కొన్నారు. దైవప్రవక్త (స) కుమారుడు చనిపోయిన సందర్భంగా పట్టిన సూర్యగ్రహణం కూడా అందులో ఉంది. ఈ గ్రహణం వాటిలో చిట్టచివరిది. అయితే రచయిత ఈ గ్రహణ సమయాలను గానీ, గ్రహణ ప్రదేశాలను గానీ పొందుపరచలేదు.

ఇక హదీసుల ఆధారంగా ఈ అంశాన్ని తరచిచూద్దాం - 'ముస్లిం'లో అబ్దుర్రహ్మాన్ బిన్ సమురే (రజి) ఉల్లేఖనం ఆధారంగా ఇలా అనబడింది - (ఆయన ఇలా అన్నారు) - నేను దైవప్రవక్త (సఅసం) జీవిత కాలంలో మదీనాలో విలువిద్యా విన్యాసాలు చేస్తున్నాను. అంతలోనే సూర్యునికి గ్రహణం పట్టింది. నేను బాణాలు పడేసి, 'ఈ సూర్యగ్రహణం మూలంగానే కదా ఈ రోజు దైవప్రవక్త (సఅసం) కు కష్టకాలం వచ్చింది. దైవసాక్షి! నేను దీన్ని తప్పక చూడాల్సిందే' అని మనసులో అనుకున్నాను.

ఈ పూర్వరంగంలో ఆలోచిస్తే దైవప్రవక్త (స) కాలంలో పట్టిన తొలి గ్రహణం ఇదేనని బోధపడుతుంది. అప్పటివరకూ గ్రహణానికి సంబంధించిన ధర్మాదేశం ఏదీ లేదు. కాగా; అబ్దుర్రహ్మాన్ బిన్ సమురే (రజి) మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారన్న సంగతి

విస్మరించరానిది. కనుక దైవప్రవక్త (స) హయాంలో కానవచ్చిన తొలి సూర్యగ్రహణం మక్కా విజయం తరువాత కానవచ్చినదేనని దీని ఆధారంగా స్పష్టమవుతున్నది.

ఇకపోతే, 'ముస్లిం' మరియు 'నసాయి'లలో జాబిర్ (రజి) ఉల్లేఖనం ఏమంటుందంటే, గ్రహణం తీవ్రమయిన వేసవి కాలంలో పట్టింది. కాగా; సూర్యగ్రహణం ఇబ్రాహీం (రజి) మరణం నాడు పట్టిందనీ, అది జనవరి మాసమని ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఈ మాసంలో తీవ్రంగా వేసవి కాదు, చలి ఉంటుంది. కాబట్టి ఈ సంఘటనలు వేర్వేరని దీన్నిబట్టి అవగతమవుతున్నది.

ఇక మనం అల్లామా ఖాజీ ముహమ్మద్ సల్మాన్ విశదీకరించిన ఖగోళ శాస్త్ర లెక్కల్ని పరిశీలిద్దాం- ఆయన ప్రకారం 'మక్కా విజయం' తరువాత మనకు మూడు గ్రహణాల ఆధారాలు లభిస్తున్నాయి. తొలి గ్రహణం హిజ్రీ 9, రబీవుల్ ఆఖిర్ 28వ తేదీన (క్రీ.శ. 630, ఆగస్టు 13వ తేదీ) పట్టింది. అది ఆగస్టు నెల. అరేబియా ద్వీపంలో ఈ నెలలో ఎండలు తీవ్రంగా ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. రెండవ గ్రహణం హిజ్రీ 9, షవ్వాల్ నెల 29వ తేదీ (క్రీ.శ. 631, ఫిబ్రవరి)న సంభవించింది. మూడవ గ్రహణం హిజ్రీ 10, షవ్వాల్ నెల 28వ తేదీన (క్రీ.శ. 632 జనవరి 27వ తేదీన) పట్టింది.

ఖగోళ శాస్త్ర లెక్కల్ని, హదీసులలో ప్రస్తావనకు వచ్చిన నమాజె కుసూఫ్‌లను మనం కలిపిచూస్తే గ్రహణాలు కనీసం రెండు అని రూఢీ అవుతుంది. ఒక గ్రహణం ఎండాకాలంలో - ఆగస్టు నెలలో - పట్టింది. రెండవది ఇబ్రాహీం మరణ సందర్భంగా - జనవరి నెలలో - పట్టింది. మూడవ సూర్యగ్రహణం ఫిబ్రవరి నెలలో పట్టింది. ఈ గ్రహణం మదీనాలో కూడా కనిపించిందా? లేదా? అన్నది ఖచ్చితంగా తెలీదు. ఈ సంఘటనలన్నింటి ద్వారా విదితమయ్యేదేమిటంటే ఆ కాలంలో సూర్యగ్రహణం అనేకసార్లు పట్టింది.

ఇబ్రాహీం మరణం నాడు పట్టిన గ్రహణం గురించి కూడా వివిధ ఉల్లేఖనాలు ఉన్నాయి. ఆ ఉల్లేఖనాల మధ్య కూడా కొంత వ్యాఘాతం కనిపిస్తుంది. ఆనాటి నమాజె కుసూఫ్ - ఒక్కో రకత్ రెండేసి రుకూలతో చేయబడిందని పెక్కు ఉల్లేఖనాలు చెబుతున్నాయి. కాని ముస్లింలోని ఉల్లేఖనం మాత్రం మూడేసి రుకూలతో ఒక్కో రకత్ నెరవేర్చబడిందని ఉంది. కాబట్టి ఈ సంఘటనకు సంబంధించిన హదీసులలో ఏర్పడిన వైరుధ్యాన్ని, వ్యాఘాతాన్ని దూరం చేయటం సాధ్యంకాదు. కాకపోతే ఒక్కో రకత్ రెండేసి రుకూలతో చేయబడిందని చెబుతున్న ఉల్లేఖనాలు దృఢమైనవిగా, ఎక్కువ ప్రమాణబద్ధమైనవిగా కనిపిస్తున్నాయి. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ బుఖారీ (రహ్మ.లై), ఇమామ్ ఇబ్నె తైమియ (రహ్మ.లై), ఆధునిక ధర్మవేత్తలలో షా వలియుల్లా (రహ్మ.లై) ప్రభృతులు కూడా రెండేసి రుకూలతో కూడిన నమాజె కుసూఫే ఎక్కువ అనుసరణీయమని అభిప్రాయపడ్డారు.

404. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : వేగంగా పెనుగాలులు వీచినపుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మోకాళ్ళపై కూర్చుని (దైవ సమక్షంలో) ఈ విధంగా వేడుకునేవారు:

(٤٠٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَا هَبَّتِ الرِّيحُ قَطُّ، إِلاَّ جَثَا النَّبِيُّ ﷺ عَلَى رُكْبَتَيْهِ، وَقَالَ: «اللّٰهُمَّ اجْعَلْهَا

رَحْمَةً، وَلاَ تَجْعَلْهَا عَذَاباً». رَوَاهُ الشَّافِعِيُّ وَالطَّبَرَانِيُّ.

"దేవా! ఈ గాలిని కారుణ్య పవనంగా చేయి. శిక్షగా మార్చకు." (దీనిని షాఫయి, తబ్రానీ - ఇరువురూ ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే పెను గాలులు వీస్తున్నప్పుడు, భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు దాసులు దైవకారుణ్యాన్ని ఆశిస్తూ, కడు దీనంగా దైవాన్ని ప్రార్థించాలి. పెనుగాలుల వల్ల సంభవించే నష్టం నుండి కాపాడమని వేడుకోవాలి. కురిసే వర్షాన్ని ప్రాణుల కోసం లాభదాయకంగా చేయమని దుఆ చేయాలి.

(٤٠٥) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ صَلَّى فِي زَلْزَلَةٍ سِتَّ رَكَعَاتٍ، وَأَرْبَعَ سَجَدَاتٍ، وَقَالَ: هٰكَذَا صَلاَةُ الْآيَاتِ. رَوَاهُ الْبَيْهَقِيُّ، وَذَكَرَ الشَّافِعِيُّ عَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ مِثْلَهُ، دُوْنَ آخِرِهِ.

405. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారిచే ఈ హదీసు కూడా ఉల్లేఖించబడింది. ఈయన భూకంపం వచ్చినపుడు నాలుగు సజ్దాలు, ఆరు రుకూలతో నమాజ్ చేశారు. 'దైవ నిదర్శనాల నమాజ్ ఈ విధంగానే చేయబడుతుంద'ని ఆయన (రజి) అన్నారు. (దీనిని బైహఖీ ఉల్లేఖించారు. హజ్రత్ అలీ (రజి) ఆధారంతో షాఫయి కూడా ఇలాగే సంగ్రహించారు. అయితే ఇందులో ఉల్లేఖనంలోని చివరి పలుకులు లేవు)

**సారాంశం**

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భూకంపాలు, వరదలు, ఉప్పెనలు వచ్చి నష్టం వాటిల్లినప్పుడు ఈ విధంగా నమాజ్ చేయాలని పై హదీసు చెబుతోంది. దీనిని "సలాతుల్ ఆయాత్" గా వ్యవహరిస్తారు. కష్టకాలంలో, పరీక్షా ఘడియలలో తమను సృష్టించిన వాని వైపునకే మరలాలి. ఆయన్నే వేడుకోవాలి. దైవేతరులను వేడుకోవటం, కష్టాలనుండి గట్టెక్కించమని మిథ్యా దైవాలను మొరపెట్టుకోవటం షిర్క్‌గా పరిగణించబడుతుంది. షిర్క్ చాలా పెద్ద అన్యాయం. ఈ అన్యాయానికి పాల్పడిన వారిని దేవుడు సుతరామూ క్షమించడు. కనుక ముస్లింలు ఎలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లోనూ దైవకారుణ్యం పట్ల నిరాశ చెందకుండా - ఆశావహ దృక్పథంతో - ఆయన్ని ప్రార్థించాలి.

**16వ అధ్యాయం**

## వర్షం కొరకు నమాజ్ (సలాతుల్ ఇస్తిస్ఖా)

## ١٦ - بَابُ صَلاَةِ الاسْتِسْقَاءِ

(٤٠٦) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهما قَالَ: خَرَجَ النَّبِيُّ ﷺ مُتَوَاضِعاً، مُتَبَذِّلاً، مُتَخَشِّعاً، مُتَرَسِّلاً، مُتَضَرِّعاً، فَصَلَّى رَكْعَتَيْنِ، كَمَا يُصَلِّي فِي الْعِيدِ، لَمْ يَخْطُبْ خُطْبَتَكُمْ هٰذِهِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَأَبُو عَوَانَةَ وَابْنُ حِبَّانَ.

406. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారు ఇలా తెలిపారు - "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో అణకువతో, నిరాడంబరమైన దుస్తుల్లో వినయ వినమ్రతలు ఉట్టిపడుతుండగా (వర్షం కొరకు వేడుకునే ఉద్దేశ్యంతో) నమాజ్‌కై బయటికి వెడలారు. పండుగ నమాజ్ మాదిరిగా ప్రజలకు రెండు రకతుల నమాజ్ చేయించారు. మీ ప్రసంగం వలె ప్రసంగించలేదు." (ఈ ఉల్లేఖనాన్ని ఐదుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ, అబూ అవానా, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమయిన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) 'నమాజె ఇస్తిస్ఖా' సామూహికంగా చేసినట్టు ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. 'ఇస్తిస్ఖా' అంటే నీళ్ల కోసం అర్థించటం, దరఖాస్తు పెట్టుకోవటం అని అసలు అర్థం. షరీయత్ పరిభాషలో 'ఇస్తిస్ఖా' అంటే ఒక ప్రత్యేక స్ఫూర్తితో, భావోద్రేకంతో దైవసమక్షంలో మొరపెట్టుకోవటం అని భావం. ఇస్తిస్ఖా మూడు రకాలు. (1) అల్పస్థాయి ఇస్తిస్ఖా (2) మధ్య స్థాయి ఇస్తిస్ఖా (3) ఉన్నతస్థాయి ఇస్తిస్ఖా.

అల్పస్థాయి ఇస్తిస్ఖాలో వర్షం కోసం సాధారణంగా దుఆ చేయటం జరుగుతుంది. మధ్య రకం ఇస్తిస్ఖాలో నమాజ్ తరువాత వర్షాన్ని కోరుతూ వేడుకోవటం జరుగుతుంది. ఉన్నతస్థాయి ఇస్తిస్ఖాలో కొంతమంది కలసి, ఓ ప్రత్యేక వాతావరణాన్ని సృజిస్తారు. ఏదయినా బహిరంగ ప్రదేశంలో అందరూ ఒకచోట చేరి అత్యంత అణకువతో, ఆర్ద్రతతో దైవకారుణ్యంపట్ల పూర్తి ఆశతో, నమ్మకంతో ప్రార్థన చేస్తారు. దైవసమక్షంలో తమ అశక్తతను వెల్లడిస్తూ, వర్షం కురిపించి కష్టాలు తీర్చమని దీనాతిదీనంగా దుఆ చేస్తారు. ఇది ఉన్నతస్థాయి ఇస్తిస్ఖాగా భావించబడుతుంది.

దైవప్రవక్త (సఅసం) కేవలం 'దుఆ' ద్వారా కూడా వర్షాన్ని అర్థించినట్లు ఆధారాలున్నాయి. ఒకసారి ఆయన (స) జుమా ప్రసంగం చేస్తుండగా ఒక వ్యక్తి లేచి నిలబడి వర్షం కోసం దైవాన్ని

ప్రార్థించమని ఆయన్ని (స) అభ్యర్థించాడు. ఆయన (స) వేదికపై నిలబడి దుఆ చేశారు. దేవుడు ఆయన (స) మొరను ఆలకించాడు. వర్షం మొదలయింది. తరువాతి శుక్రవారం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. ఉపన్యాసకుడు ఉపన్యాస వేదికనుండి వర్షం కోసం ప్రార్థించవచ్చునన్నదానికి ఈ సంఘటన ఒక దృష్టాంతం. ఆ సమయంలో అతడు ఖిబ్లా వైపునకు తిరిగి ఉండవలసిన అవసరం లేదు. ఖుత్బా సమయంలో ఖతీబ్ (ప్రసంగకర్త)తో అత్యవసరమయిన అభ్యర్థన చేసుకో వచ్చునీ, ఖతీబ్ కూడా ఇతరుల అభ్యర్థనలను ఆమోదించవచ్చునీ ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది.

దైవప్రవక్త (సఅసం) గారు నమాజె ఇస్తిస్ఖాను పండుగ నమాజ్ తరహాలో చేసేవారని ఈ హదీసు చెబుతోంది. నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా చేసే ప్రసంగం చాలా సంక్షిప్తంగా ఉండాలి. ప్రసంగ ఉద్దేశ్యాన్ని ప్రసంగకర్త విస్మరించకూడదు. విషయంతో సంబంధం లేని మాటలను ప్రస్తావించి ఎక్కువ సమయం వృథా చేయకూడదు. షాహ్ వలీయుల్లాహ్ ముహద్దిస్ దహెల్వీ (రహ్మ.లై) తన విశ్వవిఖ్యాత పుస్తకం "హుజ్జతుల్లాహిల్ బాలిఘ"లో ఇలా వ్రాశారు:

"దైవప్రవక్త (స) గారి నమాజె ఇస్తిస్ఖా గురించి పలు ఉల్లేఖనాలు ఉన్నాయి. మస్నూన్ (సాంప్రదాయిక) పద్ధతి ఏమంటే పట్టణ (లేక గ్రామ) ప్రజలంతా ఒకచోట - బహిరంగ ప్రదేశంలో - సమావేశమవ్వాలి. చినిగిన దుస్తులు (పాతబట్టలు) ధరించాలి. భయభక్తులతో, కుమిలిపోతూ దైవాన్ని వేడుకోవాలి. ఆ తరువాత ఇమామ్ వారికి రెండు రకతుల నమాజ్ చేయించాలి. ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా చేయాలి. తరువాత ప్రసంగించాలి. ఖిబ్లా వైపునకు తిరిగి 'దుఆ' చేయాలి. ఈ సమయంలో దుప్పటిని తిరగవేయాలి."

(٤٠٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: شَكَا النَّاسُ إِلَى رَسُولِ اللّٰهِ ﷺ قُحُوطَ الْمَطَرِ، فَأَمَرَ بِمِنْبَرٍ، فَوُضِعَ لَهُ فِي الْمُصَلَّى، وَوَعَدَ النَّاسَ يَوْماً يَخْرُجُوْنَ فِيْهِ، فَخَرَجَ حِيْنَ بَدَا حَاجِبُ الشَّمْسِ، فَقَعَدَ عَلَى الْمِنْبَرِ، فَكَبَّرَ وَحَمِدَ اللّٰهَ، ثُمَّ قَالَ: **إِنَّكُمْ شَكَوْتُمْ جَدْبَ دِيَارِكُمْ، وَقَدْ أَمَرَكُمُ اللّٰهُ أَنْ تَدْعُوْهُ، وَوَعَدَكُمْ أَنْ يَسْتَجِيْبَ لَكُمْ، ثُمَّ قَالَ: اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ، الرَّحْمٰنِ الرَّحِيْمِ، مَالِكِ يَوْمِ الدِّيْنِ، لاَ إِلٰهَ إِلاَّ اللّٰهُ، يَفْعَلُ مَا يُرِيْدُ، اللّٰهُمَّ أَنْتَ اللّٰهُ، لاَ إِلٰهَ إِلاَّ أَنْتَ، أَنْتَ الْغَنِيُّ، وَنَحْنُ الْفُقَرَاءُ، أَنْزِلْ عَلَيْنَا الْغَيْثَ، وَاجْعَلْ مَا أَنْزَلْتَ عَلَيْنَا قُوَّةً وَبَلاَغاً إِلَى**

407. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : వర్షాలు కురవకపోవటం మూలంగా కరువు ఏర్పడిందని ప్రజలు దైవప్రవక్త (సఅసం)కు ఫిర్యాదుచేసు కున్నారు. వేదిక (మింబర్)ను ఈద్గాహ్‌కు తరలించమని ఆయన (స) ఆజ్ఞాపించారు. వేదిక ఈద్గాహ్‌కు తరలించ బడింది. ప్రజలు ఒక రోజు తామంతా బహిరంగ ప్రదేశానికి వస్తామని వాగ్దానం చేశారు. ఆయన (సఅసం) స్వయంగా ఆ రోజు ఉదయం ఇంటినుండి వెడలి వచ్చారు. సూర్యుడు ఆకాశపుటంచున ఉదయించగానే ఆయన వచ్చి వేదికపై కూర్చున్నారు. అల్లాహు అక్బర్ అని పలికి, ఆ తరువాత దైవస్తోత్రం చేశారు.

حِيْنٍ. ثُمَّ رَفَعَ يَدَيْهِ، فَلَمْ يَزَلْ حَتَّى رُئِيَ بَيَاضُ إِبِطَيْهِ، ثُمَّ حَوَّلَ إِلَى النَّاسِ ظَهْرَهُ، وَقَلَّبَ رِدَاءَهُ، وَهُوَ رَافِعٌ يَدَيْهِ، ثُمَّ أَقْبَلَ عَلَى النَّاسِ، وَنَزَلَ، وَصَلَّى رَكْعَتَيْنِ، فَأَنْشَأَ اللّٰهُ تَعَالَى سَحَابَةً، فَرَعَدَتْ، وَبَرَقَتْ، ثُمَّ أَمْطَرَتْ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَقَالَ: غَرِيْبٌ، وَإِسْنَادُهُ جَيِّدٌ.

దేవుని గొప్పదనాన్ని కొనియాడారు. తరువాత (ప్రజలనుద్దేశ్యించి) సెల విచ్చారు - "మీరు మీమీ ప్రాంతాల్లో సంభవించిన దుర్భిక్షం గురించి ఫిర్యాదు చేశారుకదూ! తనను వేడుకోమనీ, తాను మీ మొరలను ఆలకించి ఆమోదిస్తానని అల్లాహ్ ఆదేశించాడు." ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు - "ప్రశం సలు పొగడ్తలు సర్వలోక ప్రభువైన అల్లాహ్‌కే శోభిస్తాయి. జనుల పాలిట ఆయన అపార కరుణామయుడు. పరమకృపాశీలుడు. తీర్పు దినపు యజమాని. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయన తలచుకున్న దల్లా చేసితీర్తాడు. దేవా! నీవే దైవానివి. నీవు తప్ప మరో పూజనీయుడు లేడు. నీవు అక్కరలేనివాడవు. మేము అభాగ్యు లము, నిరాధార జీవులము. మాపై నీ కారుణ్యాన్ని కురిపించు. నీవు మాపై కురిపించే దానిని మా కొరకు ఉపాధిగా, సుదీర్ఘకాలం దాకా సమకూరే సాధనంగా చెయ్యి." ఆ తరువాత ఆయన (సఅసం) తన రెండు చేతుల్నీ పైకి ఎత్తారు. అవి క్రమక్రమంగా పైకి లేవసాగాయి. ఆ సమయంలో ఆయన చంకల తెలుపు దనం సయితం కానరాసాగింది. తరు వాత ఆయన ప్రజలకు వెన్నుచూపి నిలబడ్డారు. తన (భుజాలపై ఉన్న) దుప్పటిని తిరగవేసుకున్నారు. ఆ సమయంలో ఆయన (స) తన రెండు

చేతుల్ని పైకి లేపి ఉన్నారు. ఆ పైన ఆయన (స) ప్రజల వంక తిరిగారు. వేదిక దిగివచ్చి రెండు రకతుల నమాజ్ చేయించారు. ఆ క్షణంలోనే అల్లాహ్ ఆకాశంలో మేఘాలు సృజించాడు. అవి దట్టంగా క్రమ్ముకున్నాయి, గర్జించాయి, మెరుపు తీగలు మెలిక తిరిగాయి, వర్షం కురవసాగింది. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఈ హదీసు 'గరీబ్' కోవకు చెందినదిగా భావించబడింది - అయితే హదీసు అందిన పరంపర మాత్రం ఉత్తమంగా ఉంది)

وَقِصَّةُ التَّحْوِيْلِ فِي الصَّحِيْحِ مِنْ حَدِيْثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ، وَفِيْهِ: فَتَوَجَّهَ إِلَى الْقِبْلَةِ يَدْعُو، ثُمَّ صَلَّى رَكْعَتَيْنِ، جَهَرَ فِيْهِمَا بِالْقِرَاءَةِ.

సహీహ్ బుఖారీలో అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖనంలో దుప్పటి (తిప్పుకున్న) సంఘటన ఇలా వుంది - "ఆయన (స) ఖిబ్లా వైపునకు తిరిగారు. దుఆ చేయసాగారు. అనంతరం రెండు రకతుల నమాజ్ చేయించారు. ఈ సందర్భంగా బిగ్గరగా ఖుర్ఆన్ పారాయణం చేశారు."

وَلِلدَّارَقُطْنِيِّ مِنْ مُرْسَلِ أَبِي جَعْفَرٍ الْبَاقِرِ: وَحَوَّلَ رِدَاءَهُ لِيَتَحَوَّلَ الْقَحْطُ.

దారె ఖుత్నీలో అబూ జాఫర్ బాఖిర్ గారి 'ముర్సల్' ఉల్లేఖనంలో, "దుర్భిక్షం కూడా ఈ దుప్పటి మాదిరిగా మారిపోవాలన్న దానికి సంకేతంగా ఆయన (స) దుప్పటిని తిరగవేశారు" అని వుంది.

**సారాంశం**

'నమాజె ఇస్తిస్ఖా' సందర్భంగా మస్జిద్‌లోని వేదికను బహిరంగ స్థలానికి తీసుకు వెళ్లవచ్చునని దీని ఆధారంగా తెలుస్తున్నది. పండుగ నమాజ్ కొరకు వేదికను ఉపయోగించలేరు. నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా చేతులు బాగా పైకెత్తి దుఆ చేయాలని కూడా ఈ హదీసు చెబుతోంది. హజ్రత్ అనస్ (రజి) మాటల్లోనే చెప్పాలంటే దైవప్రవక్త (సఅసం) ఈ సందర్భంగా చేతులు

పైకెత్తినంతగా మరెన్నడూ ఎత్తలేదు. చేతులెత్తి దుఆ చేసే విషయమై ఇమామ్ నవవీ (రహ్మ.లై) 30 హదీసులను సేకరించారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే చేతులెత్తి వేడుకోవటం కూడా సంప్రదాయమే. ప్రసంగం 'బిస్మిల్లాహ్' తో కాకుండా 'అల్ హమ్దులిల్లాహ్'తో ఆరంభించాలన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా మన ముందుకు వచ్చింది. దైవస్తోత్ర వచనాలతో తప్ప వేరే వాక్యాలతో ప్రసంగాన్ని మొదలెట్టడం సమంజసం కాదు.

## హదీసు ఉల్లేఖకులు (అబూ జాఫర్ బాఖిర్ - రహ్మ.లై)

అసలు పేరు ముహమ్మద్ బిన్ అలీ జైనులాబిదీన్ బిన్ హుసైన్ బిన్ అలీ బిన్ అబూ తాలిబ్. అబూ జాఫర్ బాఖిర్ మారుపేరు. ఈయన హజ్రత్ అలీ (రజి)గారి మనవడు. హజ్రత్ హుసైన్ (రజి) గారి కుమారుడు. షియా వర్గం నమ్మకం ప్రకారం వాళ్ల 12 ఇమాముల పరంపరలో ఈయన ఐదవవారు. ఈయన జ్ఞానసంపద అపారమైనది. అందుకే ఈయన 'బాఖిర్' గా పిలువబడ్డారు. గొప్పపండితులు. హిజ్రీ 56లో జన్మించారు. హిజ్రీ 117లో 63 ఏళ్ళ వయస్సులో మరణించారు. జన్నతుల్ బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

(٤٠٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً دَخَلَ الْمَسْجِدَ يَوْمَ الْجُمُعَةِ، وَالنَّبِيُّ ﷺ قَائِمٌ يَخْطُبُ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! هَلَكَتِ الْأَمْوَالُ، وَانْقَطَعَتِ السُّبُلُ، فَادْعُ اللّٰهَ يُغِيثُنَا، فَرَفَعَ يَدَيْهِ، ثُمَّ قَالَ: «اللّٰهُمَّ أَغِثْنَا، اللّٰهُمَّ أَغِثْنَا، اللّٰهُمَّ أَغِثْنَا»، فَذَكَرَ الْحَدِيثَ، وَفِيهِ الدُّعَاءُ بِإِمْسَاكِهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

408. హజ్రత్ అనస్ (రజి) కథనం : ఒక వ్యక్తి శుక్రవారం నాడు మస్జిద్‌లో ప్రవేశించాడు. ఆ సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిలబడి ఉపన్యసిస్తున్నారు. 'ఓ దైవ ప్రవక్తా (స)! (పశు) సంపద నాశనమై పోయింది. రాకపోకల మార్గాలు (వాణిజ్య సంబంధాలు) స్థంభించాయి. మాపై వర్షం కురిపించమని కాస్త దైవ సన్నిధిలో ప్రార్థించండి' అని ఆ వ్యక్తి విన్నవించుకున్నాడు. ఆయన (స) అప్పటికప్పుడే చేతులెత్తి ఇలా ప్రార్థించారు, "ఓ దేవా! మా విన్నపాన్ని మన్నించి వర్షం కురిపించు. ఓ దేవా!! మా మొరను ఆలకించి మాపై నీ కారుణ్యాన్ని అవతరింపజెయ్యి."..... ఈ విధంగా హదీసునంతటినీ వివరించారు. ఇందులో వర్షం ఆపమని ప్రార్థించిన ప్రస్తావన కూడా ఉంది. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్తలు సయితం అక్కరలు తీర్చమని దేవాన్నే వేడుకుంటారనీ, వారంతట వారుగా ఏమీ చెయ్యజాలరని, ఆఖరికి అంతిమ దైవప్రవక్త (సఅసం) సయితం తనంతట తానుగా తన అనుచర సమాజానికి ఏమీ చెయ్యలేరని ఈ హదీసు స్పష్టంచేస్తోంది. అలాగే దైవప్రవక్త (స) నేరుగా దైవాన్నే ప్రార్థించారు. మధ్యలో ఇతర ప్రవక్తల ఆసరాగానీ, సిఫారసుగానీ పొందలేదు. ప్రవక్త ప్రియసహచరులు సయితం; తమకేదైనా ఆపద వచ్చిపడితే దాన్ని తొలగించగలవాడు కేవలం అల్లాహ్‌యేనని దృఢంగా విశ్వసించేవారు. దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన వ్యక్తి, తమ ప్రాంతంలో వర్షం కురిపించమని ప్రవక్త (స) ను కోరలేదు, వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించమని మాత్రమే విన్నవించుకున్నాడు. ఇదే తౌహీద్ (ఏక దైవారాధన).

దైవప్రవక్తలకు అగోచర జ్ఞానముండదు. అగోచర జ్ఞానమే గనక మహాప్రవక్త (స)కు ఉండివుంటే దుర్భిక్షం తాండవిస్తున్న ప్రాంత ప్రజల కష్టసుఖాలు ముందుగానే ఆయనకు తెలిసి ఉండేవి. కాని ఆ వ్యక్తి వచ్చి తమ బాధలు చెప్పుకున్న మీదటే అసలు సంగతి ఆయనకు అవగతమయ్యింది.

ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. అబూ సుఫ్యాన్ అని కొంతమంది అభిప్రాయపడ్డారు. కాని అప్పటికింకా ఆయన ఇస్లాం స్వీకరించలేదు. విన్నపం చేసుకున్న తీరునుబట్టి ఆ వ్యక్తి తప్పక ముస్లిం అయి ఉంటాడని అర్థమవుతున్నది. అతడే గనక ముస్లిం కాకపోయినట్లయితే వర్షం కురిపించమని నేరుగా దైవప్రవక్తనే అభ్యర్థించి ఉండేవాడు.

ఈ హదీసు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమిటంటే వర్షం కొరకు ఆయన (స) కేవలం 'దుఆ' చేశారు. నమాజ్ చేయలేదు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) బహుశా ఈ హదీసు ఆధారంగానే కాబోలు 'వర్షం కొరకు దుఆ చేస్తే సరిపోతుంది, నమాజ్ చేయవలసిన అవసరం లేద'ని అభిప్రాయపడ్డారు. అయితే ఇతర హదీసుల ద్వారా నమాజ్ కూడా చేయవచ్చని రూఢీ అవుతున్నది.

వివిధ ఉల్లేఖనాలన్నింటినీ ఒకచోట చేర్చి, వాటిని జోడిస్తే ఆయన (స) 6 పద్ధతుల్లో వర్షం కొరకు దైవాన్ని అర్థించారన్న వాస్తవం మన ముందుకు వస్తుంది. (1) ఒకసారి ఆయన (స) జనులను ఈద్గాహ్‌లోకి పిలుచుకు వెళ్ళి నమాజ్ చేయించారు, ప్రసంగించారు, వేడుకోలు చేశారు. (2) ఒకసారి జుమా ప్రసంగం సందర్భంగా వేదికపైనుంచి కేవలం దుఆ చేశారు. (3) ఒకసారి ఆయన (స) వేదికను తెప్పించి, దానిపై కూర్చుని దుఆ చేశారు. (4) ఒకసారి నమాజ్ ముగించిన పిదప అందరితో కలసి సామూహిక దుఆ చేశారు. (5) ఒకసారి జనవాసాలను దాటి (బహిరంగ స్థలానికి) వచ్చి 'అహ్‌జారుజ్జైత్' అనే స్థలంలో దుఆ చేశారు. (6) ఒకసారి యుద్ధసమయంలో వర్షం కొరకు అల్లాహ్‌ను ప్రార్థించారు.

(٤٠٩) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ كَانَ إِذَا قَحَطُوا اسْتَسْقَى بِالْعَبَّاسِ بْنِ عَبْدِ الْمُطَّلِبِ، وَقَالَ:

409. హ|జత్ అనస్ (రజి) కథనం : ప్రజలు కరువు కాటకాలకు గురైనపుడు హ|జత్ ఉమర్ (రజి) గారు హ|జత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి)ను మధ్యవర్తి (వసీలా)గా చేసి వర్షం కొరకు

اللّٰهُمَّ إِنَّا كُنَّا نَسْتَسْقِيْ إِلَيْكَ بِنَبِيِّنَا فَتَسْقِيْنَا، وَإِنَّا نَتَوَسَّلُ إِلَيْكَ بِعَمِّ نَبِيِّنَا فاسْقِنَا، فَيُسْقَوْنَ. رَوَاهُ الْبُخَارِيُّ.

అర్థించేవారు. ఆయన (రజి) ఈ విధంగా వేడుకునేవారు: "ఓ దేవా! మేము నిన్ను నీ ప్రవక్త (సఅసం) ఆధారంగా వర్షం కొరకు ప్రార్థించగా నీవు మాపై దయ దలచి వర్షం కురిపిస్తూ ఉండేవాడివి. మరి ఇప్పుడు నీ ప్రవక్త (సఅసం) పిన తండ్రిని మధ్యవర్తిగా నీ సమక్షంలోనికి తీసుకువచ్చాము. కనుక నీవు మాపై వర్షాన్ని కురిపించి మా కష్టాలు తీర్చు." (ఈ దుఆ స్వీకారానికి ప్రతీకగా) వారిపై వర్షం కురిసేది. (బుఖారీ)

**సారాంశం**

సమాధి పూజ చేసే వారికీ, చిల్లర దేవుళ్లను ఆశ్రయించేవారికి ఈ హదీసు 'ఒక ఆయుధం'గా తోడ్పడింది. ఈ హదీసులోని భావాన్ని వక్రీకరించి అమాయక జనులను పెడత్రోవ పట్టించడంలో వారు చాలామటుకు సఫలీకృతులయ్యారు. ప్రవక్త ప్రియసహచరులంతటివారే పుణ్యపురుషులను మధ్యవర్తి (వసీలా) గా చేసుకున్నప్పుడు మనం అలా చేయటంలో అభ్యంతరం ఏముందీ? అని వీళ్లు వేలకొలదీ ప్రశ్నలను ఉత్పన్నం చేశారు. వాస్తవానికి ఈ హదీసుకు ఈ మహానుభావులు చెబుతున్న భాష్యం తప్పుడు భాష్యం. వీళ్లు బ్రతికివున్న వాళ్ళనేకాదు, చనిపోయినవాళ్ళనీ, దగ్గరవున్న వాళ్ళనీ, లేనివాళ్ళనీ, వాళ్ల పేర్లనూ కూడా 'వసీలా'గా చేస్తున్నారు. కాగా; కేవలం బ్రతికి ఉన్న వాళ్ళను దుఆ కొరకు మధ్యవర్తిగా ఉదాహరించవచ్చని మాత్రమే ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ మహానుభావులు తలపోస్తున్నట్లుగా మరణించిన వారిని కూడా 'వసీలా'గా ఆశ్రయించటం ధర్మసమ్మతమై ఉంటే ప్రవక్త (స) గారి పినతండ్రిని మధ్యవర్తిగా చేయవలసిన ఖర్మ హజ్రత్ ఉమర్ (రజి)గారికి ఎందుకు పట్టేది? నేరుగా ఆయన దైవప్రవక్త (స)నే మధ్యవర్తి (వసీలా) గా చేసుకుని ఉండేవారుకదా! కాని ఇటువంటి 'వసీలా'కు సంబంధించి ఖుర్ఆన్‌లోగానీ, హదీసులోగానీ ఎక్కడా ఎలాంటి సూచనా లేదు.

ఈ హదీసు మనకు మూడు విషయాలను నొక్కి పలుకుతోంది. ఒకటి: వర్షాన్ని కోరుతూ ప్రార్థించదలచినపుడు సజ్జనులను, దైవప్రవక్త (స) వంశానికి చెందిన దైవభక్తిపరాయణుడ్ని వెంటబెట్టుకు వెళ్ళవచ్చు. ఈ హదీసు ద్వారా హజ్రత్ అబ్బాస్ (రజి)గారి ధర్మపరాయణత, పెద్దరికం వ్యక్తమవుతున్నాయి. దైవప్రవక్త (సఅసం) కుటుంబీకులలో ఆయన (రజి) నిజంగానే కీలకమయిన వ్యక్తి, పెద్దమనిషి. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి)లోని వినయ వినమ్రతలు కూడా ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నాయి. ఆయన ఒక ఖలీఫా అయివుండి కూడా దైవప్రవక్త (స)

కుటుంబీకుల్లోని ఒక ప్రముఖ వ్యక్తికి పెద్దపీట వేశారు. ప్రార్థన కోసం హజ్రత్ అబ్బాస్ (రజి)ను మధ్యవర్తిగా ఉంచారు. బ్రతికివున్న మనిషి చనిపోయిన వ్యక్తికన్నా అధమశ్రేణికి చెందినవాడైనప్పటికీ, అతని చేతనే దుఆ చేయించాలన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. చనిపోయిన వ్యక్తి 'వసీలా'ను ఆశ్రయించటం షరీయత్‌పరంగా నిరూపితం కాలేదు.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి) దైవప్రవక్త (సఅసం) కు స్వయాన పినతండ్రి. ఈయన నామాంతరం అబుల్ ఫజల్. కాబా గృహ వ్యవహారాల పర్యవేక్షణ, హజ్ యాత్రీకులకు మంచినీరు సరఫరా చేయటం వంటి బాధ్యతలు ఈయనపై ఉండేవి. 'అఖబా ఒప్పందం' సందర్భంగా ఈయన కూడా హాజరయ్యారు. ఒప్పందానికి కట్టుబడి ఉండవలసిన ఆవశ్యకతను అన్సార్లకు నొక్కి చెప్పడానికి ఆయన ఆ సందర్భంగా అక్కడికి వచ్చారు. విచిత్రమేమిటంటే అప్పటికింకా ఆయన ముస్లిం కారు. బద్ర్ యుద్ధంలో యుద్ధ ఖైదీగా పట్టుబడ్డారు. మక్కా విజయానికి కొన్నాళ్ల క్రితమే ఇస్లాం స్వీకరించారు. ఆ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. హునైన్ యుద్ధం జరిగిన రోజున మొక్కవోని వీరునిలా నిలిచారు. హిజ్రీ 32వ సంవత్సరం రజబ్ లేక రమజాన్ నెలలో కన్ను మూశారు. మదీనాలోని జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(٤١٠) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أَصَابَنَا - وَنَحْنُ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ - مَطَرٌ، قَالَ: فَحَسَرَ ثَوْبَهُ حَتَّى أَصَابَهُ مِنَ الْمَطَرِ، وَقَالَ: إِنَّهُ حَدِيثُ عَهْدٍ بِرَبِّهِ. رَوَاهُ مُسْلِمٌ.

410. హజ్రత్ అనస్ (రజి) గారే ఈ విధంగా ఉల్లేఖించారు: "మేమొకసారి వర్షంలో చిక్కుకున్నాము. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా మా వెంట వున్నారు. ఆయన (సఅసం) తన భుజాలపై ఉన్న వస్త్రాన్ని పైకి ఎత్తుకున్నారు. వర్షపు చినుకులు ఆయన (స) ఒంటిపై పడసాగాయి. 'ఇవి నా ప్రభువు, యజమాని తరపున కొంగ్రొత్త కానుకల రూపంలో ఇవ్వబడుతున్నాయి' అని ఆయన (స) సెలవిచ్చారు." (ముస్లిం)

## సారాంశం

ఈ వర్షం పరమ ప్రభువు తరఫున పంపబడింది. మరో విశేషమేమిటంటే ఈ వర్షపు నీటిని అప్పటివరకూ ఏ పాపాత్ముడు కూడా ముట్టుకోలేదు. దుర్మార్గులు, దుష్టులు నివసిస్తున్న ప్రాంతాలకు ఈ నీరు ఇంకా చేరలేదు. అదీగాక ఆ వర్షపు చినుకుల్లో శుభశ్రేయాలు ఎన్నో నిండి ఉండవచ్చు. అందుచేత వర్షపు నీటిలో తడవటం, స్నానం చేయటం ఒక విధంగా మంచిదే.

(٤١١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا رَأَى الْمَطَرَ قَالَ: «اللَّهُمَّ صَيِّباً نَافِعاً». أَخْرَجَاهُ.

411. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్షం కురవటాన్ని గమనించి నప్పుడల్లా ఇలా వేడుకునేవారు - "ఓ అల్లాహ్! ఈ వర్షాన్ని మా కొరకు లాభ సాటిగా, ఫలవంతంగా చెయ్యి."

(బుఖారీ, ముస్లిం)

(٤١٢) وَعَنْ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ دَعَا فِي الاسْتِسْقَاءِ: «اللَّهُمَّ جَلِّلْنَا سَحَاباً كَثِيفاً، قَصِيفاً، دَلُوقاً، ضَحُوكاً، تُمْطِرُنَا مِنْهُ رُذَاذاً، قِطْقِطاً، سَجْلاً، يَا ذَا الْجَلَالِ وَالْإِكْرَامِ». رَوَاهُ أَبُو عَوَانَةَ فِي صَحِيحِهِ.

412. హజ్రత్ సాద్ (రజి) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇస్తిస్ఖా వేడుకోలు ఈ విధంగా చేశారు- "ఓ దేవా! భూమి అంతటినీ క్రమ్ముకున్న మబ్బుల ద్వారా, దట్టమైన మేఘాల ద్వారా, గర్జించే మేఘాల ద్వారా, ధారా పాతంగా కురిసే, మెరిసే, గర్జించే మేఘాల ద్వారా, నిరంతరం వర్షించే మేఘాల ద్వారా మాపై చిటపట చిను కుల రూపంలో అధిక వర్షం కురిపించు- ఓ ఘనతా గౌరవాల అధిపతీ!"

(ముస్నద్ అబూఅవానా)

**సారాంశం**

దుఆయె ఇస్తిస్ఖాలలో ఈ దుఆ ఒకటి. దైవప్రవక్త (సఅసం) వర్షాన్ని కోరుతూ అనేక రకాల దుఆలు చేశారు. వాటిలో దేనినయినా తీసుకోవచ్చు.

(٤١٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: خَرَجَ سُلَيْمَانُ عَلَيْهِ السَّلَامُ يَسْتَسْقِي، فَرَأَى نَمْلَةً مُسْتَلْقِيَةً عَلَى ظَهْرِهَا، رَافِعَةً قَوَائِمَهَا إِلَى

413. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలియజేశారు : "హజ్రత్ సులైమాన్ - అలైహిస్సలాం - వర్షాన్ని అర్థించటానికి బయటికి వచ్చారు. ఆ సమయంలో ఒక చీమ తన వెనుకటి కాళ్లను ఆకాశం వైపునకు ఎత్తి దైవాన్ని వేడుకోవటం ఆయన గమనించారు.

السَّمَاءِ، تَقُولُ: اللَّهُمَّ إِنَّا خَلْقٌ مِنْ خَلْقِكَ، لَيْسَ بِنَا غَنًى عَنْ سُقْيَاكَ، فَقَالَ: «ارْجِعُوا فَقَدْ سُقِيتُمْ بِدَعْوَةِ غَيْرِكُمْ». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ الْحَاكِمُ.

ఆ చీమ ఇలా వేడుకోసాగింది: "దేవా! నీవు సృష్టించిన ఇతర ప్రాణుల మాదిరి గానే మేము నీ ప్రాణులం. నీ వర్షపు నీరు లేకుండా మేము కూడా మనజాలము." ఇది విన్నంతనే హజ్రత్ సులైమాన్ అలైహిస్సలాం, "తిరిగి వెళదాం పదండి, ఇతర జీవాల ప్రార్థనా ఫలంగా మీపై వర్షం కురిసినట్లే" అని వ్యాఖ్యానించారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైన దిగా నిర్ధారించారు)

### సారాంశం

అంతిమ దైవప్రవక్త (సఅసం)కు ముందు గతించిన ప్రవక్తలు కూడా అనావృష్టి ఏర్పడినపుడు ఇళ్లనుండి బయటికి వచ్చి వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఒక చిన్న చీమ చేసుకున్న విన్నపం ఆధారంగా ప్రాణులన్నింటికీ వర్షపు నీరు లభ్యమవటం యోచించదగ్గ విషయం. నమాజె ఇస్తిస్ఖా అయినా, దుఆయె ఇస్తిస్ఖా అయినా గ్రామం లేక పట్టణం బయటికి వచ్చి, చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో చేయటం అభిలషణీయం.

(٤١٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ اسْتَسْقَى فَأَشَارَ بِظَهْرِ كَفَّيْهِ إِلَى السَّمَاءِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

414. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్షం కొరకు దుఆ చేసినప్పుడు, రెండు (అర) చేతుల్నీ తిరగవేసి ఆకాశం వైపు నకు చాచారు. (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) చేతుల్ని తిరగవేసి దుఆ చేసినట్టు ఉంది. సాధారణంగా ఆయన (స) అలా చేయరు. ఈ రెండు పద్ధతులకూ మధ్య గల వ్యత్యాసాన్ని తెలుపుతూ విద్వాంసులు ఇలా అన్నారు: కారుణ్యాన్ని అర్థిస్తున్నప్పుడు ఆయన (స) చేతుల్ని తిన్నగానే ఉంచేవారు. కాని ఏదైనా దుస్థితినీ, దురవస్థను దూరం చేయమని కోరుతున్నప్పుడు మాత్రం చేతుల్ని తిరగవేసేవారు. పరిస్థితిని ఈ విధంగా మార్చమన్న దానికి సంకేతంగా ఆయన (స) అలా చేసేవారు! దుఆయే ఇస్తిస్ఖా సందర్భంగా ఆయన (స) తన దుప్పటిని తిరగవేయటంలో ఉద్దేశ్యం కూడా బహుశా అదే అయి ఉంటుంది.

**17వ అధ్యాయం**

## వస్త్రధారణ

## ١٧ - بَابُ اللِّبَاسِ

415. హజ్రత్ అబూ ఆమిర్ అష్అరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నా అనుచర సమాజంలో కొన్ని జాతుల వారుంటారు - వారు తప్పక వ్యభిచారాన్నీ, సిల్కు (పట్టు)ను తమ కొరకు ధర్మసమ్మతంగా తలపోస్తారు." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - దీని మూలం బుఖారీలో వుంది)

(٤١٥) عَنْ أَبِي عَامِرٍ ٱلْأَشْعَرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيَكُونَنَّ مِنْ أُمَّتِي أَقْوَامٌ يَسْتَحِلُّونَ ٱلْحِرَ وَٱلْحَرِيرَ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُه فِي ٱلْبُخَارِيِّ.

### సారాంశం

ఈ హదీసులో రెండు విషయాలు నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేయబడ్డాయి. అవేమంటే; (1) వ్యభిచారం (2) సిల్కు (పట్టు) వస్త్రాలు ధరించటం. సిల్కు వస్త్రాలు మనిషిలో - ముఖ్యంగా మగవారిలో - గర్వాన్నీ, అహంకారాన్నీ పెంపొందిస్తాయి. అందుకే ఇది ఉమ్మత్ కొరకు నిషిద్ధంగా పరిగణించబడింది. పైగా ఈ సిల్కు అత్యంత సున్నితమయింది. లావణ్యంతో కూడుకున్నది. లావణ్యం, సౌకుమార్యం పురుషులకు తగదు. లావణ్యంతో కూడుకున్న దుస్తులు ఆడవారికైతే శోభిస్తాయి. వస్త్ర ధారణలో మగవారు ఆడవారి తరహాలో తయారవటం హరామ్ (నిషిద్ధం).

### హదీసు ఉల్లేఖకులు

అబూ ఆమిర్ అష్అరీ (రజి) గారి అసలు పేరు అబ్దుల్లా బిన్ హాని లేదా ఉబైద్ బిన్ వహబ్. ప్రవక్త సహచరునిగా పేర్కొనబడ్డారు. సిరియాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఉమవీ ఖలీఫా అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ పరిపాలనా కాలంలో మరణించారు.

416. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేము బంగారు వెండి పాత్రలలో తినటాన్నీ, త్రాగటాన్నీ, పలుచటి మరియు చిక్కటి సిల్కు (పట్టు) వస్త్రాలను ధరించటాన్నీ, వాటిపై కూర్చోవటాన్నీ వారించారు." (బుఖారీ)

(٤١٦) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ نَشْرَبَ فِي آنِيَةِ الذَّهَبِ وَالْفِضَّةِ، وَأَنْ نَأْكُلَ فِيهَا، وَعَنْ لُبْسِ الْحَرِيرِ وَالدِّيبَاجِ، وَأَنْ نَجْلِسَ عَلَيْهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

(٤١٧) وَعَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللّٰهِ ﷺ عَنْ لُبْسِ الْحَرِيْرِ، إِلاَّ مَوْضِعَ أُصْبُعَيْنِ أَوْ ثَلاَثٍ أَوْ أَرْبَعٍ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

417. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పట్టు (సిల్కు) వస్త్రాలు ధరించటాన్ని వారించారు. రెండు లేక మూడు లేక నాలుగు అంగుళాలకు సమానంగా ఉంటే ఫరవాలేదు అని అన్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

పురుషులు పట్టు వస్త్రాలు ధరించటం షరీయత్ పరంగా నిషిద్ధం (హరామ్). అయితే దురద, ఎలర్జీ తదితర కారణాల దృష్ట్యా - తాత్కాలికంగా - అలాంటి సుతిమెత్తని దుస్తులు తొడుక్కుంటే తప్పులేదు. అదీగాక సాధారణంగా మనం ధరించే దుస్తులకు ఒకటి నుండి నాలుగు అంగుళాల వెడల్పు సిల్కును జోడించినా, డిజైనుగా అతికించినా అందులో తప్పులేదు. కాని పూర్తిగా పట్టుబట్టలు వేసుకోరాదు.

(٤١٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ رَخَّصَ لِعَبْدِ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ وَالزُّبَيْرِ فِي قَمِيْصِ الْحَرِيْرِ، فِي سَفَرٍ، مِنْ حِكَّةٍ كَانَتْ بِهِمَا. مُتَّفَقٌ عَلَيْهِ.

418. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) మరియు జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) లకు పట్టు (సిల్కు) చొక్కా ధరించటానికి అనుమతి ఇచ్చారు. ఎందుకంటే వారిద్దరికీ దురద (ఎలర్జీ) లాంటిది ఉండేది."

(బుఖారీ, ముస్లిం)

**హదీసు ఉల్లేఖకులు**

జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) బిన్ ఖువైలిద్ బిన్ అసద్ ఖురైషీ అసదీ. ఈయన దైవప్రవక్త (స)కు చాలా సన్నిహితులు. దైవప్రవక్త (స) అత్తగారైన సఫియా కుమారులు. ఇహలోకంలోనే స్వర్గలోక శుభవార్త పొందిన పదిమందిలో ఒకరు. యుద్ధాలలో గొప్ప పరాక్రమశాలిగా ఖ్యాతి గడించారు. జమల్ యుద్ధం నుండి తిరిగి వచ్చాక హిజ్రీ 36లో శాశ్వతంగా కన్నుమూశారు.

(٤١٩) وَعَنْ عَلِيِّ بْنِ أَبِيْ طَالِبٍ

419. హజ్రత్ అలీ (రజి) కథనం : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَسَانِي النَّبِيُّ ﷺ حُلَّةً سِيَرَاءَ، فَخَرَجْتُ فِيهَا، فَرَأَيْتُ الْغَضَبَ فِي وَجْهِهِ، فَشَقَقْتُهَا بَيْنَ نِسَائِي. مُتَّفَقٌ عَلَيْهِ، وَهٰذَا لَفْظُ مُسْلِمٍ.

నాకు బంగారు జరీతో నేయబడిన ఒక పట్టుబట్టల జతను బహూకరించారు. నేను దాన్ని తొడిగి బయటికి రాగా దైవప్రవక్త (సఅసం) ముఖం ఆగ్రహంతో కందిపోయినట్టుగా కనిపించింది. అంతే, ఆ జతను విడిచి దాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కుటుంబ మహిళల్లో పంచి పెట్టేశాను." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

ఈ దుస్తులు దైవప్రవక్త (సఅసం)కు 'ఐలా' ప్రాంతపు రాజు నుండి కానుకగా అందాయి. వాటిని ఆయన (స) హ॥జత్ అలీ (రజి)కి ఇవ్వగా ఆయన ధరించి బయటికి వచ్చారు. ఇది చూడగానే దైవప్రవక్త (స) కు కోపం వచ్చింది. "ఇవి నీవు తొడగటానికి కాదు ఇచ్చింది, ఇంటి మహిళల కోసం ఇచ్చాను"అని ఆయన (స) వ్యాఖ్యానించినట్లు సహీహ్ ముస్లింలో ఉంది. హ॥జత్ అలీ ఆ వస్త్రాన్ని చించి తలో ముక్క పంపిణీ చేశారు. దీన్నిబట్టి తెలిసిందేమంటే కానుక మన ఉపయోగంలోకి వచ్చినా, రాకపోయినాసరే - కానుకను మనస్ఫూర్తిగా స్వీకరించవచ్చు.

(٤٢٠) وَعَنْ أَبِي مُوسَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**أُحِلَّ الذَّهَبُ وَالْحَرِيرُ لِإِنَاثِ أُمَّتِي. وَحُرِّمَ عَلَى ذُكُورِهِمْ**». رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ وَصَحَّحَهُ.

420. హ॥జత్ అబూ మూసా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "బంగారం, పట్టు (సిల్కు) నా అనుచర సమాజంలోని స్త్రీలకు ధర్మసమ్మతం గావించబడ్డాయి. అయితే ఇవి పురుషుల కోసం నిషేధించబడ్డాయి." (దీనిని అహ్మద్, నసాయి, తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

స్త్రీలు నగానట్రా రూపంలో బంగారం ధరించవచ్చు. అయితే వాటిని ప్రదర్శించే ఉద్దేశ్యంతో ధరించరాదు. అలాగే స్త్రీలు పట్టు వస్త్రాలు, సుతిమెత్తని దుస్తులు ఉపయోగించవచ్చు. కాని మగవారు వీటిని ధరించకూడదు.

(٤٢١) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**إِنَّ اللَّهَ**

421. హ॥జత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు -

يُحِبُّ إِذَا أَنْعَمَ عَلَى عَبْدِهِ نِعْمَةً، أَنْ يَرَى أَثَرَ نِعْمَتِهِ عَلَيْهِ». رَوَاهُ الْبَيْهَقِيُّ.

"అల్లాహ్ తన దాసుని కెవరికయినా ఏదన్నా అనుగ్రహిస్తే దాని ప్రభావం అతనిపై కనిపించటాన్ని అల్లాహ్ ఎంతో ఇష్టపడతాడు." (బైహఖీ)

**సారాంశం**

దైవప్రసాదిత వస్తువులను మనిషి క్రియాత్మకంగా అభివ్యక్తం చేయాలని ఈ హదీసు చెబుతోంది. అందుకే అతడు తన శక్తీ స్థోమతలకు తగ్గట్టుగా తినాలి, త్రాగాలి, ఉన్నంతలో మంచి దుస్తులను ధరించాలి. ఇలా వ్యక్తపరచటం భయభక్తులకు విరుద్ధాంశం ఏమీకాదు. కాకపోతే దైవానుగ్రహాలను దుర్వినియోగం చేయకూడదు, దుబారా ఖర్చులకు పాల్పడి షైతాన్ బాటలో నడవకూడదు. అలా అని మరీ పిసినిగొట్టులా కూడా మసలుకోరాదు. రెండు అతి వాదాలకు నడుమ మధ్యేమార్గాన్ని అవలంబించాలి.

(٤٢٢) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ نَهَى عَنْ لُبْسِ الْقَسِّيِّ وَالْمُعَصْفَرِ. رَوَاهُ مُسْلِمٌ.

422. హజ్రత్ అలీ (రజి) కథనం : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖస్ (ప్రాంతపు) సిల్కు వస్త్రాలు, కాషాయ రంగు బట్టలు ధరించటాన్ని వారించారు." (ముస్లిం)

(٤٢٣) وَعَنْ عَبْدِ اللّٰهِ بْنِ عَمْرٍو رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: رَأَى عَلَيَّ النَّبِيُّ ﷺ ثَوْبَيْنِ مُعَصْفَرَيْنِ، فَقَالَ: «أُمُّكَ أَمَرَتْكَ بِهٰذَا؟». رَوَاهُ مُسْلِمٌ.

423. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా ఒంటిపై కాషాయ రంగుతో కూడిన రెండు బట్టలుండటం గమనించి, "నీ తల్లి వీటిని తొడుక్కోమని చెప్పిందా?" అని సెలవిచ్చారు. (ముస్లిం)

**సారాంశం**

'ఈ బట్టలు తొడుక్కోమని మీ అమ్మచెప్పిందా?' అన్న దైవప్రవక్త (సఅసం) ప్రశ్నలో ఒకింత అయిష్టత, ఆగ్రహం కలగలసి ఉన్నాయి. ఈ ఆడవాళ్లు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? అన్న విసుగు కూడా ఆ మాటల్లో వ్యక్తమవుతున్నది. సహీహ్ ముస్లింలోని వేరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), 'మరయితే ఓ దైవప్రవక్తా! వీటిని కడిగివేయనా?' అని విన్నవించుకోగా, "లేదు. కాల్చి బూడిద చేసేయి" అని ఆయన (స) చెప్పారు.

(٤٢٤) وَعَنْ أَسْمَاءَ بِنْتِ أَبِي بَكْرٍ

424. హజ్రత్ అస్మా బిన్తె అబూబక్ర్ (ర.అన్హా) దైవప్రవక్త (సఅసం) గారి ఒక

رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهَا أَخْرَجَتْ جُبَّةَ رَسُولِ اللّٰهِ ﷺ، مَكْفُوفَةَ الْجَيْبِ وَالْكُمَّيْنِ وَالْفَرْجَيْنِ بِالدِّيبَاجِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ، وَزَادَ: كَانَتْ عِنْدَ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا حَتَّى قُبِضَتْ، فَقَبَضْتُهَا، وَكَانَ النَّبِيُّ ﷺ يَلْبَسُهَا، فَنَحْنُ نَغْسِلُهَا لِلْمَرْضَى، نَسْتَشْفِيْ بِهَا. وَزَادَ الْبُخَارِيُّ فِي الْأَدَبِ الْمُفْرَدِ: وَكَانَ يَلْبَسُهَا لِلْوَفْدِ وَالْجُمُعَةِ.

జుబ్బాను బయటికి తీశారు. దాని చేతులపై, ముందు వెనుక భాగాలపై (అంచులపై) పట్టువస్త్రం వుంది. (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. మూలం మాత్రం ముస్లింలో వుంది). ఆ జుబ్బా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అధీనంలో ఉండేదనీ, ఆమె మరణించిన తరువాత నేను దానిని నా స్వాధీనంలో తీసుకున్నానని ఆమె అన్నారు. దైవప్రవక్త (సఅసం) దీనిని తొడిగేవారు, దీనిని కడిగి రోగగ్రస్తులకు ఆ నీరు త్రాపేవారు. స్వస్థత చేకూర్చమని ప్రార్థించేవారు (ముస్లిం). బుఖారీ 'అదబుల్ ముఫ్రద్'లో ఇలా అన్నారు - 'దైవప్రవక్త (స) దీనిని ప్రతినిధి బృందాలు వచ్చిన సమయాలలో, జుమా నమాజులలో ధరించేవారు.'

**సారాంశం**

విదేశాల నుండి రాయబారులు, దౌత్యవేత్తలు వచ్చినప్పుడు, చక్రవర్తులు, అధికారులు విచ్చేసినపుడు, లేదా పండుగ దినాలలో, జుమా నమాజులలో పాల్గొనవలసి వచ్చినపుడు, సమావేశాలకు హాజరు కావలసి వచ్చినపుడు సాధారణ దుస్తులకన్నా కొంచెం మంచి దుస్తులు, ఖరీదైన దుస్తులు ధరించటంలో తప్పులేదు. అయితే ఈ ప్రత్యేక సమయాలలో సయితం షరీయత్ విధించిన హద్దులను అతిక్రమించకూడదు. దుస్తులు మనిషిలో గర్వాన్ని, అహంకారాన్ని పెంపొందించేవిగా గాకుండా సంస్కారానికీ, వినమ్రతకు, హుందాతనానికి ప్రతీకగా ఉండాలి.

# 3. అంత్యక్రియల పుస్తకం

## ٣ - كِتَابُ الْجَنَائِزِ

(٤٢٥) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَكْثِرُوا ذِكْرَ هَاذِمِ اللَّذَّاتِ: الْمَوْتِ». رَوَاهُ التِّرْمِذِيُّ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

425. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "రుచులను, రసాస్వాదనలను త్రెంచివేసే దానిని (మృత్యువును) అత్యధికంగా స్మరిస్తూ ఉండండి." (దీనిని తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

మరణం ఒక సత్యం. మరణం తథ్యం. ఆది నుండి అంతం వరకూ ఏ ఒక్కరూ దీన్ని కాదనలేదు. కాదనలేరు కూడా. అనుదినం ఇది మానవులకు కనిపిస్తూనే ఉంటుంది. ఆత్మీయులలో, బంధు మిత్రులలో, ఇరుగుపొరుగు వారిలో, మనం నివసించే గ్రామాలలో ఎవరో ఒకరు మృత్యువాతన పడుతూనే ఉంటారు. ఇటువంటి సందర్భాలలో సహజంగానే గుండెలు కరుగుతాయి. భావాలు, భావోద్రేకాలు ఉప్పొంగుతాయి. మనిషిలో దైవభీతి, పరలోక భీతి పెంపొందుతుంది. ఆత్మావలోకనం చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రళయదృశ్యం కనుల ముందు కదలాడుతుంది. ఇహలోక జీవిత వాస్తవం అర్థమవుతుంది. పరలోక సామగ్రిని సమకూర్చుకోవాలన్న తహతహ మొదలవుతుంది. పర్యవసానంగా మానవుడు సదాచరణ వైపునకు మొగ్గుతాడు. అందుకే మరణాన్ని వీలయినంత ఎక్కువగా జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలని ఉపదేశించబడింది.

(٤٢٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لا يَتَمَنَّيَنَّ أَحَدُكُمُ الْمَوْتَ لِضُرٍّ نَزَلَ بِهِ، فَإِنْ كَانَ لا بُدَّ مُتَمَنِّياً، فَلْيَقُلِ: اللَّهُمَّ أَحْيِنِي مَا كَانَتِ الْحَيَاةُ خَيْراً لِّي، وَتَوَفَّنِي مَا كَانَتِ الْوَفَاةُ خَيْراً لِّي». مُتَّفَقٌ عَلَيْهِ.

426. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు : "మీలో ఎవరయినా సరే వారిపై వచ్చి పడిన కష్టాలు, ఆపదల కారణంగా మృత్యువును ఎన్నడూ కోరుకోరాదు. ఒకవేళ ఆ కోరిక అవశ్యమయిపోతే ఈ విధంగా అనాలి - 'ఓ అల్లాహ్! ఎన్నాళ్ళపాటు నేను బ్రతికి ఉండటం నాకు శ్రేయస్కరమో అప్పటి వరకూ నాకు జీవితం ప్రసాదించు. మరణం నా పాలిట శ్రేయోదాయకమైనపుడు నాకు మృత్యువు నొసగు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఒక నిజమయిన, నికార్సయిన మోమిన్ (విశ్వాసి) కొరకు జీవితం గొప్ప వరం లాంటిది. సజ్జనుడు జీవితకాలంలో తన సదాచరణలను, సత్కార్యాలను వృద్ధి చేసుకుంటూనే పోతాడు. గతంలో తనవల్ల జరిగిన పాపాలపై సిగ్గుతో కుమిలిపోతూ పశ్చాత్తాపం చెందుతాడు అని దైవప్రవక్త (సఅసం) చెప్పారు. పాపాత్ముడు, దుష్టుడు, దుర్మార్గుడయినవాడికి కూడా ఈ జీవితం ఒక అవకాశం వంటిది. అతను గనక జీవిత సత్యాన్ని తెలుసుకోగలిగితే ఒక్కోక్షణం తన పాపాల ప్రక్షాళనకై ప్రయత్నించగలుగుతాడు. గతాన్ని మరచి భవిష్యత్తులో తనను కాపాడుకునే ఉపాయాలు ఆలోచిస్తాడు. చేసిన తప్పులపై సిగ్గు పడుతూ తన ప్రభువు వైపునకు మరలివస్తాడు. అందుకే కష్టాలకు, కడగండ్లకు, దారిద్ర్యానికి, లేమికీ, వ్యాధికీ విసుగెత్తిపోయి మరణాన్ని కాంక్షించరాదనీ, జీవించడానికి ఇహలోకంలో దొరికిన అవకాశాన్ని శాశ్వతమైన పరలోకం కోసం సద్వినియోగం చేసుకోవాలని దైవప్రవక్త (స) ఉపదేశించారు. అయితే సర్వలోక ప్రభువును వీలయినంత త్వరగా కలుసుకోవాలన్న ఆసక్తి ఉంటే అప్పుడు మరణాన్ని కాంక్షించవచ్చు. అలా కాంక్షించటం విశ్వాసపరిపూర్ణతకు ప్రబల నిదర్శనం కూడాను. ఒకవేళ ధర్మావలంబనలో కఠినపరీక్షలు ఎదురై, విశ్వాసం ప్రమాదంలో పడబోతుందని భావించినపుడు కూడా మృత్యువును కోరుకోవచ్చు. అంతేగాని ప్రాపంచిక కష్టాలతో కలతచెంది కాటికి కాళ్ళు చాపాలనుకోవటం ధీరత్వం కాదు. ఈ కష్టాల కొలిమిలో విశ్వాసి ఎంత కాలితే అంతే కుందనంలా, మేలిమి బంగారంలా మెరిసి పోతాడు.

(٤٢٧) وَعَنْ بُرَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «الْمُؤْمِنُ يَمُوتُ بِعرَقِ الْجَبِين». رَوَاهُ الثَّلَاثَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

427. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించినట్లు హజ్రత్ బురైద (రజి) తెలిపారు. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు - "విశ్వాసికి మరణ సమయం ఆసన్నమైనపుడు అతని నుదుటిపై చెమట ప్రస్ఫుటమవుతుంది." (ఈ ఉల్లేఖనాన్ని ముగ్గురు- తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

(٤٢٨) وَعَنْ أَبِي سَعِيدٍ وَأَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالاَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَقِّنُوا مَوْتَاكُمْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ». رَوَاهُ مُسْلِمٌ وَالْأَرْبَعَةُ.

428. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ సయీద్ (రజి) మరియు హజ్రత్ అబూ హురైర (రజి ) తెలిపారు: "మరణ ఘడియలు సమీపించిన మనిషికి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' గురించి ప్రోత్సహించండి." (దీనిని ముస్లింతో పాటు మరో నలుగురు - అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - కూడా ఉల్లేఖించారు)

## సారాంశం

కలిమా అంటే ఇక్కడ కేవలం 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని మాత్రమే కాదు, పూర్తి కలిమాను ఉపదేశించాలి. మరణ ఘడియలు దాపురించిన మనిషికి దగ్గర్లో కూర్చున్నవారు కూడా ఈ కలిమాను పఠిస్తూ ఉండవచ్చు. మరణించే వ్యక్తికి స్పృహ ఉంటే కలిమాను అతనిచేత చదివించే ప్రయత్నం చేయాలి. దైవప్రవక్త (సఅసం) ఖుద్దుగా, మరణించే ఒక వ్యక్తికి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' పఠించమని చెప్పినట్లు ఆధారముంది. (ముస్నద్ అహ్మద్)

(٤٢٩) وَعَنْ مَعْقِلِ بْنِ يَسَارٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «اقْرَءُوا عَلَى مَوْتَاكُمْ يس». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

429. హజ్రత్ మాఖిల్ బిన్ యసార్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మరణించే మీ ఆత్మీయుని ముందు యాసీన్ సూరా పఠించండి." (దీనిని అబూ దావూద్, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

## హదీసు ఉల్లేఖకులు

మాఖిల్ బిన్ యసార్ (రజి) ముజైనా తెగకు చెందిన సహాబి. హుదైబియా ఒడంబడికకు ముందు ఇస్లాం స్వీకరించారు. 'బైతె రిజ్వాన్'లో పాల్గొన్నారు. బస్రాలో ఈయన పేరుతో ఒక కాలువ ఉంది. హజ్రత్ ఉమర్ (రజి) ఆజ్ఞానుసారం ఈయన ఆ కాలువను త్రవ్వారు. అరబ్బుల్లో ఒక లోకోక్తి ఉంది- 'దేవుని కాలువ (వర్షపు నీరు) ముందు మాఖిల్ కాలువ ఏపాటిది?' అన్నది దాని భావం. ఈయన అమీర్ ముఆవియ (రజి) ఖిలాఫత్ ఆఖరికాలంలో - హిజ్రీ 60లో మరణించారు. యజీద్ కాలంలో మరణించారని మరికొందరి వాదన.

(٤٣٠) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ رَسُولُ اللهِ ﷺ عَلَى أَبِي سَلَمَةَ، وَقَدْ شُقَّ بَصَرُهُ، فَأَغْمَضَهُ، ثُمَّ قَالَ: «إِنَّ الرُّوحَ إِذَا قُبِضَ اتَّبَعَهُ الْبَصَرُ»، فَضَجَّ نَاسٌ مِنْ أَهْلِهِ، فَقَالَ: «لَا تَدْعُوا عَلَى أَنْفُسِكُمْ

430. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : అబూ సలమా (రజి) మరణ సమయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడికి ఏతెంచారు. ఆ సమయంలో ఆయన కనుగ్రుడ్లు తెరచుకుని ఉన్నాయి. ఆయన (స) వాటిని (కనురెప్పలను) మూసివేశారు. అనంతరం ఇలా ప్రవచించారు: "ఆత్మ శరీరాన్ని వీడిపోతున్నప్పుడు కళ్లు దానిని వెంబడిస్తాయి." అంతలో ఇంట్లోని

إِلاَّ بِخَيْرٍ، فَإِنَّ الْمَلاَئِكَةَ تُؤَمِّنُ عَلَى مَا تَقُولُونَ»، ثُمَّ قَالَ: «اللَّهُمَّ اغْفِرْ لِأَبِي سَلَمَةَ، وَارْفَعْ دَرَجَتَهُ فِي الْمَهْدِيِّينَ، وَافْسَحْ لَهُ فِي قَبْرِهِ، وَنَوِّرْ لَهُ فِيهِ، وَاخْلُفْهُ فِي عَقِبِهِ». رَوَاهُ مُسْلِمٌ.

వారంతా గొల్లుమన్నారు. బిగ్గరగా ఏడ్వసాగారు. ఆయన (స) వారందరినీ ఉద్దేశించి, "మీ కొరకు ఉత్తమమయిన వేడుకోలు చేయండి. ఎందుకంటే మీరు ఏది పలికినా దైవదూతలు 'తథాస్తు' అని అంటారు" తరువాత ఆయన (స) ఇలా ప్రార్థించారు-"దేవా! అబూ సలమా (రజి)ను మన్నించు. సన్మార్గం పొందిన వారిలో ఈయన అంతస్థును ఉన్నతం గావించు. ఈయన సమాధిని విశాలవంతంగా చెయ్యి. జ్యోతిర్మయం గావించు. ఈయన వెనుకనున్న వారిలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చెయ్యి."
(ముస్లిం)

## సారాంశం

మరణించేవాని ఆత్మ ఊర్ధ్వలోకాలకు పయనమవుతున్నప్పుడు సాధారణంగా అతని కళ్లు తెరచుకుని ఉంటాయని ఈ హదీసు చెబుతోంది. వాటిని తొందరగా మూసివేయాలి. శరీరం చల్లారిపోయిన తరువాత కనురెప్పలు మూతబడటం దుర్లభమవుతుంది. కళ్లు గనక తెరచుకునే వుంటే భౌతిక కాయం చూసేవారికి భయంకరంగా కనిపిస్తుంది. మరణ సమీపంలో మృతుని వారసులు, బంధువులు, ఆత్మీయులు దగ్గరుండటం మంచిదని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. మృతుని అంత్యక్రియలు జరగక ముందు కూడా అతని క్షమాపణకై దైవాన్ని ప్రార్థించవచ్చున్న సంగతి కూడా స్పష్టమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

అబూ సలమా (రజి). ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ అసద్ మఖ్జూమీ ఖురషీ. ఈయన దైవప్రవక్త (స)కు బంధువులు. వరుసకు మేనత్త కొడుకు. మహాప్రవక్త (స)కు, హజ్రత్ హమ్జా (రజి)కు పాల సోదరుడు కూడా అవుతారు. అబూ లహబ్‌చే స్వేచ్ఛ నొసగబడిన ఒక బానిసరాలు ఈ ముగ్గురికీ పాలు త్రాగించింది. ఈయన తన సతీమణితో కలసి హిజ్రత్ చేశారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. ఉహుద్ సంగ్రామంలో గాయపడ్డారు. గాయం మానిందిగాని తరువాత మళ్లీ తిరగబెట్టింది. హిజ్రీ 4వ సంవత్సరం జమాది వుల్ ఊలాలో మరణించారు. ఈయన మరణానంతరం ఈయన సతీమణి ఉమ్మె సలమా (ర.అన్హా)ను షవ్వాల్ నెలలో దైవప్రవక్త (స) తన దాంపత్య జీవితంలోకి తెచ్చుకున్నారు.

(٤٣١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ حِينَ تُوُفِّيَ، سُجِّيَ بِبُرْدٍ حِبَرَةٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

431. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణించినపుడు ఆయన్ని (సఅసం) ఒక చారలు గల దుప్పటితో కప్పటం జరిగింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మృతునికి స్నానం చేయించక ముందు చారలున్న దుప్పటితో కప్పవచ్చు. దైవప్రవక్తలు కూడా మానవ మాత్రులేననీ, ఏదో ఒకనాడు వారిని సయితం మృత్యువు కబళిస్తుందని, ఈ సత్యాన్ని ఎవరూ తృణీకరించలేరని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారి మరణం రుజువు చేస్తోంది. ఒక సాధారణ మానవునికి ఏవిధంగా అంత్యక్రియలు చేయబడతాయో అదేవిధంగా దైవప్రవక్త (స)లకు కూడా అంత్యక్రియలు చేయబడతాయి.

(٤٣٢) وَعَنْهَا أَنَّ أَبَا بَكْرٍ الصِّدِّيقَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَبَّلَ النَّبِيَّ ﷺ بَعْدَ مَوْتِهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

432. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "ఆయన (సఅసం) మరణించి నపుడు హజ్రత్ అబూబక్ర్ (రజి) ఆయన్ని (సఅసం) - అంటే ఆయన నుదుటిని - ముద్దాడారు. (బుఖారీ)

(٤٣٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **«نَفْسُ الْمُؤْمِنِ مُعَلَّقَةٌ بِدَيْنِهِ، حَتَّى يُقْضَى عَنْهُ»**. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

433. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "విశ్వాసి ఆత్మ అతడు చేసిన అప్పును (అంటిపెట్టుకుని ఉంటుంది); దాన్ని తీర్చేవరకూ ఎటూకాని స్థితిలో ఊగిస లాడుతూ ఉంటుంది." (అహ్మద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఇది 'హుఖూఖుల్ ఇబాద్' (దాసుల హక్కులు)కు సంబంధించిన విషయం. దాసుల హక్కులకు ఇస్లాంలో ఎంత ప్రాధాన్యం ఉందో, తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించటం ఎంత అవసరమో ఆలోచించాలి. దాసుల హక్కుల వ్యవహారంలో దేవుడు కూడా తలదూర్చడు. తనకు రావలసిన హక్కును రుణదాత క్షమించనంత వరకూ లేక ఆ రుణాన్ని మృతుని వారసులు

చెల్లించనంతవరకూ ఆ మృతుని ఆత్మ మధ్యలో ఊగిసలాడుతూనే ఉంటుంది. ఎందుకంటే రుణం తీసుకునేటప్పుడు, దాన్ని తిరిగి ఇచ్చే సంకల్పంతో తీసుకోబడింది. ఈ బాధ్యత మృతునిపై ఉంది. మృతుని వారసులు ఒకవేళ ఈ రుణభారాన్ని భరించలేని స్థితిలో ఉంటే సమాజంలోని శ్రేయోభిలాషులు దాన్ని తీర్చేందుకు కృషిచేయాలి. లేదా ఇస్లాం శ్రేయోరాజ్యం తన పౌరుని బాధ్యతను తనపై వేసుకుని అతన్ని రుణభారం నుంచి విముక్తి నొసగాలి.

దైవప్రవక్త (సఅసం) ఇలా ఉద్బోధించారు - "మృతుడు తన వెనుక ఏదన్నా ఆస్తి వదలివెళితే అది అతని వారసుల హక్కు అవుతుంది. ఒకవేళ అతడు అప్పులు చేసి వెళితే దాన్ని తీర్చవలసిన బాధ్యత నాపై, నా రాజ్యప్రతినిధులపై ఉంది. మేము దాన్ని చెల్లిస్తాము."

కేవలం ఒక రుణభారం విషయంలోనే ఇంత తీవ్రమయిన హెచ్చరిక చేయబడినపుడు మోసం, దగా, వంచనలతో సాటి మానవుల హక్కులను కాలరాచేవారి పరిణామం ఇంకెంత వికృతంగా ఉంటుందో కాస్త ఆలోచించండి!

(٤٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي الَّذِيْ سَقَطَ عَنْ رَاحِلَتِهِ، فَمَاتَ: اغْسِلُوهُ بِمَاءٍ وَسِدْرٍ، وَكَفِّنُوهُ فِي ثَوْبَيْنِ. مُتَّفَقٌ عَلَيْهِ.

434. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : వాహనంపై నుంచి క్రిందపడి ప్రాణం విడిచిన వ్యక్తి గురించి దైవప్రవక్త (సఅసం) "ఇతన్ని రేగు ఆకులతో, నీళ్లతో స్నానం చేయించి, అతనికే చెందిన రెండు దుప్పట్లతో కఫన్ ఏర్పాటు చేయండి" అని అన్నారు.

(బుఖారీ)

**సారాంశం**

ఇది హజ్ సందర్భంగా జరిగిన సంఘటన. చనిపోయిన వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సహచరులలో ఒకరు. ఇహ్రామ్ కట్టుకుని అరఫాత్ మైదానానికి వచ్చి ఉన్నారు. అకస్మాత్తుగా ఒంటె మీదినుంచి క్రిందపడి, మెడకు గాయమై చనిపోయారు.

ఈ హదీసు ద్వారా అనేక ముఖ్యాంశాలు వెలుగులోకి వస్తున్నాయి -

(1) అరఫాత్ మైదానానికి వాహనంపై వెళ్ళటం ధర్మసమ్మతమే.

(2) వాహనంగా ఒంటెను కూడా ఉపయోగించుకోవచ్చు.

(3) ఇహ్రామ్ స్థితిలో మరణించిన వ్యక్తికి కూడా రేగు ఆకులతో, నీళ్లతో స్నానం చేయించాలి.

(4) అతని కోసం కొత్తగా కఫన్ వస్త్రాన్ని తేవలసిన అవసరం లేదు, ఇహ్రామ్ వస్త్రంలోనే చుట్టి, దానినే కఫన్‌గా తలపోయాలి. ఈ మృతుని తలను కప్పటంగానీ, సువాసన పూయటం గానీ చేయరాదు. తల కప్పబడకుండా, సుగంధ ద్రవ్యం చల్లకుండా ఉండటంలోని పరమార్థం ఏమిటంటే, ఆ వ్యక్తి ప్రళయదినాన ఇహ్రామ్ స్థితిలోనే లేచి 'తల్బియా' (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్....) పఠిస్తూ దైవసమక్షంలోకి హాజరవుతాడు (ఇన్‌షా అల్లాహ్).

(٤٣٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمَّا أَرَادُوا غُسْلَ النَّبِيِّ ﷺ، قَالُوا: وَاللهِ مَا نَدْرِي نُجَرِّدُ رَسُولَ اللهِ ﷺ كَمَا نُجَرِّدُ مَوْتَانَا أَمْ لاَ؟ اَلْحَدِيْثَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ.

435. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ప్రవక్త ప్రియసహచరులు (ర.అన్హుం) దైవప్రవక్త (సఅసం) భౌతిక కాయానికి స్నానం చేయించ సంకల్పించినపుడు వాళ్ళు ఇలా అన్నారు: దైవసాక్షి! మేము మా మృతుల దుస్తులను తొలగించే విధంగా దైవప్రవక్త (సఅసం) దుస్తులను తొలగించాలో లేదో మాకు తెలీటం లేదు.'' తరువాత హదీసునంతటినీ వివరించారు. (అహ్మద్, అబూదావూద్)

**సారాంశం**

పూర్తి హదీసు సారాంశం ఏమిటంటే, ఈ డోలాయమాన స్థితిలోనే ప్రియసహచరులపై ఒక విధమైన మైకం ఆవరించింది. ఆ స్థితిలోనే వారు ఎవరో చెప్పగా విన్నారు - దైవప్రవక్త (స)కు దుస్తుల సమేతంగా స్నానం చేయించమని! అందుచేత సహచరులు ఆయన (స) ఒంటిపైనున్న దుస్తులను తీయకుండానే స్నానం చేయించారు. దైవప్రవక్త (సఅసం) ఇతర మనుషులకన్నా ఉత్తములు - మానవశ్రేష్ఠులవటం చేత ప్రియ సహచరులు ఆ సమయంలో సందిగ్ధావస్థకు లోను అయ్యారు. అంతేగాని మృతునికి స్నానం చేయించే సమయంలో శరీరంపైని దుస్తులను తొలగించటానికి సంకోచించ వలసిన పనిలేదు. అయితే శవస్నానం చేయించేటప్పుడు కూడా 'సతర్'పై ఆచ్ఛాదన కోసం ఒక గుడ్డను కప్పటం అవసరం.

(٤٣٦) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ عَلَيْنَا النَّبِيُّ ﷺ وَنَحْنُ نُغَسِّلُ ابْنَتَه، فَقَالَ: «اغْسِلْنَهَا ثَلاَثاً أَوْ خَمْساً أَوْ أَكْثَرَ مِنْ ذٰلِكَ، إِنْ رَأَيْتُنَّ ذٰلِكَ، بِمَاءٍ وَسِدْرٍ، وَاجْعَلْنَ فِي الْأَخِيْرَةِ كَافُوراً، أَوْ شَيْئاً مِنْ كَافُورٍ»، فَلَمَّا فَرَغْنَا آذَنَّاهُ، فَأَلْقَى إِلَيْنَا

436. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా వద్దకు వచ్చినపుడు మేము ఆయన (సఅసం) కుమార్తె భౌతిక కాయానికి స్నానం చేయిస్తు న్నాము. "మీరు అవసరమనుకుంటే ఈమెకు మూడుసార్లు, లేక ఐదుసార్లు, లేక అంతకన్నా ఎక్కువ సార్లు నీళ్లు పోయండి. నీళ్లతో, రేగు ఆకులతో స్నానం చేయించండి. ఆఖర్లో కర్పూరం ఉపయోగించండి'' అని అన్నారు. స్నానం చేయించటం పూర్తయ్యాక మేము ఆయన (స) కు కబురంపాము.

حِقْوَهُ، فَقَالَ: أَشْعِرْنَهَا إِيَّاهُ. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ: «ابْدَأْنَ بِمَيَامِنِهَا، وَمَوَاضِعِ الْوُضُوءِ مِنْهَا». وَفِي لَفْظٍ لِلْبُخَارِيِّ: فَضَفَّرْنَا شَعْرَهَا ثَلاَثَةَ قُرُونٍ، فَأَلْقَيْنَاهَا خَلْفَهَا.

ఆయన (స) తన లుంగీని మా వైపునకు విసిరి "దీన్ని మృతదేహంపై కప్పండి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

గుసుల్ (స్నానం) కుడి వైపు నుంచి, వుజూ భాగాల నుంచి మొదలెట్టాలని ఒక ఉల్లేఖనంలో వుంది. బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది - "మేము ఆమె శిరోజాలను మూడు పాయలుగా విభజించి వాటిని వీపు వైపునకు ఉంచాము."

**సారాంశం**

ఒక ప్రముఖ ఉల్లేఖనం ప్రకారం ఇది ఆయన (సఅసం) కుమార్తె, అబుల్ ఆస్ సతీమణి అయిన హజ్రత్ జైనబ్ (ర.అన్హా)కు సంబంధించిన వృత్తాంతం. ఈమె హిజ్రీ 8వ సంవత్సరంలో మరణించారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం మృతురాలు హజ్రత్ ఉస్మాన్ (రజి) సతీమణి అయిన ఉమ్మె కుల్సూమ్ (ర.అన్హా) అని కూడా తెలుస్తున్నది. ఆ కాలంలో ఉమ్మె అతియా (ర.అన్హా) మరణించిన మహిళలకు గుసుల్ (స్నానం) చేయించేవారు.

భౌతికకాయానికి కనీసం మూడు లేక ఐదుసార్లు లేక ఏడుసార్లు నీళ్లుపోయాలని ఈ సంఘటన ద్వారా తెలుస్తున్నది. అంటే బేసి సంఖ్యను దృష్టిలో పెట్టుకోవాలన్నమాట! స్నానం కుడివైపు నుంచి, అందునా వుజూలో ఏ శరీర భాగాల నుంచి కడగటం మొదలెడతారో ఆ శరీర భాగాల నుంచే ఆరంభించాలి. స్నానం చేయించిన తరువాత శుభసూచకంగా ఎవరయినా మహనీయుని అంగవస్త్రాన్ని మృతునికి తొడిగించటం ఆక్షేపణీయం కాదు. స్త్రీ తలవెంట్రుకలను మూడు పాయలుగా విభజించి వీపు వైపునకు ఉంచాలి. శిరోజాలను రెండు పాయలుగా చేసి రొమ్ముపై ఉంచటం సరైంది కాదు. రేగు ఆకులతో, నీళ్లతో మృతునికి స్నానం చేయించాలని కూడా ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. చివర్లో కర్పూరం కలిపిన నీరు పోయాలి. లేదా కర్పూరాన్ని శరీరంపై పులమాలి. కర్పూరమేగాక ఇతర సుగంధ ద్రవ్యాలను కూడా ఉపయోగించవచ్చు.

(٤٣٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُفِّنَ رَسُولُ اللّٰهِ ﷺ فِي ثَلاَثَةِ أَثْوَابٍ بِيضٍ سَحُولِيَّةٍ مِنْ كُرْسُفٍ، لَيْسَ فِيهَا قَمِيصٌ وَلاَ عِمَامَةٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

437. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సఅసం) భౌతిక కాయాన్ని, యమన్‌కు చెందిన 'సహూల్'లో నేయబడిన మూడు తెల్లని వస్త్రాలలో (కఫన్ రూపంలో) చుట్టడం జరిగింది - అందులో చొక్కా గానీ, తల పాగా గానీ లేదు." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

భౌతిక కాయం పురుషునిదైతే మూడు వస్త్రాలను కఫన్ కొరకు ఉపయోగించాలని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఈ వస్త్రాలలో చొక్కాగానీ, తలపాగా గానీ ఉండదు. అత్యధిక మంది పండితుల దృష్టిలో మూడు వస్త్రాలంటే మూడు పెద్ద దుప్పట్లని భావం. కొంతమంది విద్వాంసులు- దీనిని కఫన్‌గా, లుంగీతరహా వస్త్రంగా, పెద్ద దుప్పటిగా భావించారు.

(٤٣٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: لَمَّا تُوُفِّيَ عَبْدُ اللهِ بْنُ أُبَيٍّ جَاءَ ابْنُهُ إِلَى رَسُولِ اللهِ ﷺ فَقَالَ: أَعْطِنِيْ قَمِيْصَكَ أُكَفِّنْهُ فِيْهِ، فَأَعْطَاهُ إِيَّاهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

438. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: అబ్దుల్లా బిన్ ఉబై చనిపోయి నప్పుడు అతని కుమారుడు దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, తమరు తమ చొక్కాను ప్రదానం చేస్తే నేను దీన్ని అతని కొరకు 'కఫన్'గా ఉపయోగి స్తానని ప్రాధేయపడ్డాడు. ఆయన (స) తన చొక్కాను తీసి అతనికిచ్చేశారు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దైవప్రవక్త (సఅసం)కు తన ప్రియసహచరుల పట్ల గల ప్రేమానురాగాలకు, వాత్సల్యానికి ఈ సంఘటన ఒక మచ్చుతునక. వారి భావాలు, భావోద్రేకాలను ఆయన (స) పూర్తిగా పరిగణనలోకి తీసుకునేవారు. ఏ వ్యక్తి కొరకు ఆయన చొక్కా ప్రదానం చేశారో, అతడు కపటాగ్రేసరుడని తెలిసి కూడా ఎంతో ఉదారంగా వ్యవహరించటం గమనార్హం. ఇలాంటి సంఘటన నుంచి నేటి నాయకులు, సంస్కర్తలు, లీడర్లు స్ఫూర్తిని పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### హదీసులో ప్రముఖులు

1. అబ్దుల్లాహ్ బిన్ ఉబై : అజ్ఞానకాలంలో 'ఖజ్రజ్' తెగకు నాయకుడు. పైకి ఇస్లాం స్వీకరించి నప్పటికీ, అతని మనసులో ఇస్లాం చోటు చేసుకోలేదు. కపట చేష్టలతో ఇస్లాంకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించసాగాడు. కపటులకు (మునాఫిక్‌లకు) నేతృత్వం వహించి 'రయీసుల్ మునాఫిఖీన్'గా పేరుమోశాడు. ఉహుద్ యుద్ధ సమయంలో మూడోవంతు సైన్యాన్ని వెంటబెట్టుకుని మధ్యలో నుంచే తిరిగి వచ్చేశాడు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పై అపనింద మోపి, దైవప్రవక్త (సఅసం)ను మానసికంగా వేధించటంలో కీలక పాత్ర పోషించాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో సయితం అతని కపట చేష్టలు ప్రస్తావించబడ్డాయి. "మేము మదీనాకు తిరిగి వెళ్ళిన మీదట గౌరవనీయులు అల్పులను వెళ్ళగొడతారా"ని అన్యాపదేశంగా మహనీయ ముహమ్మద్ (స)ను అవమానపర్చిన కపటాగ్రేసరుడు ఇతడు. హిజ్రీ 9వ సంవత్సరం జీఖఅద నెలలో చనిపోయాడు.

2. అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్నె సలూల్ : ఈయన ఎవరో కాదు, అబ్దుల్లాహ్ బిన్ ఉబై కన్నకొడుకే. కపటి కడుపులో పుట్టి కీర్తి శిఖరాల అంబరాలను చుంబించిన ఇస్లాం ముద్దుబిడ్డ. తండ్రి దైవప్రవక్తను వేధిస్తూ ఉంటే, కుమారుడు మాత్రం దైవప్రవక్త (స)కు రక్షాకవచంగా నిలిచేవారు. గొప్ప సహచరులలో ఒకరు. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. 'యమామ' యుద్ధంలో అమరగతి నొందారు. తండ్రి కపట ప్రవర్తనకు ఎంతగానో బాధపడేవారు. 'మర్యాదస్తులు దైవప్రవక్త (స)ను మదీనా నుంచి వెళ్ళగొడతార'ని అతని తండ్రి కూసాడని తెలిసి, తండ్రి తలను నరికి వేసేందుకు తనను అనుమతించమని ఆయన భావోద్వేగంతో అన్నారు. అజ్ఞాన కాలంలో ఈయన పేరు హుబాబ్. దైవప్రవక్త (స) ఈ పేరు మార్చి అబ్దుల్లాహ్ అని నామకరణం చేశారు.

(٤٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «الْبَسُوا مِنْ ثِيَابِكُمُ الْبِيضَ فَإِنَّهَا مِنْ خَيْرِ ثِيَابِكُمْ، وَكَفِّنُوا فِيهَا مَوْتَاكُمْ». رَوَاهُ الْخَمْسَةُ إِلَّا النَّسَائِيَّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

439. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "తెల్లని దుస్తులు ధరించండి. మీ దుస్తులలో కెల్లా అత్యుత్తమమైనవి ఇవే. మీ మృతులకు కూడా ఈ (తెల్లని) వస్త్రాలతోనే కఫన్ ఏర్పాటు చేయండి" ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

అప్పుడప్పుడూ రంగుల దుస్తులు తొడిగినప్పటికీ సాధారణంగా దైవప్రవక్త (స) తెల్లనిదుస్తులను అమితంగా ఇష్టపడేవారని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. మృతులను కూడా తెల్లటి వస్త్రాలలోనే చుట్టాలి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రం ఇతర రంగుల వస్త్రాన్ని కూడా ఉపయోగించవచ్చు.

(٤٤٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «إِذَا كَفَّنَ أَحَدُكُمْ أَخَاهُ فَلْيُحْسِنْ كَفَنَهُ». رَوَاهُ مُسْلِمٌ.

440. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) తెలిపారు - "మీలో ఎవరయినా మీ సోదరునికి కఫన్ (వస్త్రం) ఇస్తే మంచి కఫన్‌ను ఇవ్వాలి." (ముస్లిం)

**సారాంశం**

ఒక ముస్లిం మరో ముస్లింకు సోదరుడని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. మంచి కఫన్‌ను ఇవ్వటమంటే అర్థం పరిశుభ్రమయిన వస్త్రం ఇవ్వాలి. ఇంకా అది మృతుని శరీరాన్ని పూర్తిగా

కప్పగలిగే విధంగా ఉండాలి. మంచి కఫన్ అంటే భావం ఖరీదైనదని కాదు. ఖరీదైన వస్త్రాన్ని కఫన్ కొరకు ఉపయోగించటం వాంఛనీయం కూడా కాదు.

(٤٤١) وَعَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَجْمَعُ بَيْنَ الرَّجُلَيْنِ مِنْ قَتْلَى أُحُدٍ فِيْ ثَوْبٍ وَاحِدٍ، ثُمَّ يَقُولُ: «أَيُّهُمْ أَكْثَرُ أَخْذاً لِلْقُرْآنِ»؟ فَيُقَدِّمُهُ فِي اللَّحْدِ، وَلَمْ يُغَسَّلُوا، وَلَمْ يُصَلَّ عَلَيْهِمْ. رَوَاهُ الْبُخَارِيُّ.

441. ఈయనగారి (హజ్రత్ జాబిర్ - రజి) చేతనే ఉల్లేఖించబడిన మరో హదీసు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉహుద్ సంగ్రామంలో అమర గతి నొందిన ఇద్దరేసి అమరవీరులను ఒక్కో వస్త్రంలో చుట్టేవారు. ఆయన (స), 'వీరిలో ఎవరికి ఖుర్ఆన్ ఎక్కువగా జ్ఞాపకముంది?' అని అడిగేవారు. ఎవరికి ఎక్కువ భాగం ఖుర్ఆన్ జ్ఞాపకముం టుందో వారిని మొదట గోరీలో దింపే వారు. ఆ అమరవీరులకు జనాజా నమాజ్ చేయటంగానీ, గుసుల్ (స్నానం) చేయించటం గానీ జరగలేదు. (బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా మన జ్ఞానపరిధిలోకి వచ్చే ముఖ్యాంశాలు ఇవి:

(1) అత్యవసరస్థితిలో ఒక్కో కఫన్‌ను ఇద్దరు వ్యక్తులకు కూడా ఉపయోగించవచ్చు.

(2) ఇద్దరేసి వ్యక్తులను (మృతులను) ఒక్కో సమాధిలో ఖననం చేయటం కూడా ధర్మసమ్మతమే. అయితే ఆ ఇరువురిలో ఖుర్ఆన్ అధికంగా కంఠస్థం అయివున్న వారిని మొదట సమాధిలో చేర్చాలి.

(3) దైవమార్గంలో అసువులు బాసిన వారికి గుసుల్ (స్నానం) చేయించవలసిన అవసరం లేదు. ఉహుద్ యుద్ధసందర్భంగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు : "వీరికి స్నానం చేయించకండి. వీరి శరీరాలకైన ఒక్కో గాయం ప్రళయదినాన 'ముష్క్' (కస్తూరి) లాంటి సువాసనను గుబాళిస్తుంటుంది.

(4) అమరగతి నొందిన వారి జనాజా నమాజ్ కూడా చేయనవసరం లేదు. ఉహుద్ సంగ్రామంలో అమరగతి నొందిన వారి జనాజా నమాజ్ గురించి, హజ్రత్ హమ్జా (రజి) జనాజా నమాజ్‌లో 70 తక్బీర్ల గురించి వచ్చిన ఉల్లేఖనం ప్రామాణికమైనది కాదని, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. సహీహ్ బుఖారీలో ఉఖబా బిన్ ఆమిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, ఆయన (స) ఎనిమిది సంవత్సరాల తరువాత ఉహుద్ వీరుల అంత్యక్రియల నమాజ్ చేశారని తెలుస్తున్నది. ఇది నిజంగా నమాజే కాదనీ, ఇది కేవలం క్షమాపణకై చేసిన వేడుకోలు అనీ ఇమామ్ షాఫయి వ్యాఖ్యానించారు.

442. "(చాలా) ఖరీదైన కఫన్‌ను ఇవ్వ కండి. ఎందుకంటే అది బహుతొందరగా పాడైపోయేదే" అని దైవప్రవక్త (సఅసం) చెప్పగా తాను విన్నానని హ॥జత్ అలీ (రజి) తెలిపారు. (అబూదావూద్)

(٤٤٢) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ النَّبِيَّ ﷺ يَقُولُ: «لاَ تَغَالُوا فِي الْكَفَنِ، فَإِنَّهُ يُسْلَبُ سَرِيعاً». رَوَاهُ أَبُو دَاوُدَ.

**సారాంశం**

విలువైన వస్త్రాన్ని కఫన్ కొరకు ఉపయోగించినంత మాత్రాన మృతునికి ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. మృతునికి అసలు ఉపయోగపడేవి అతను చేసుకున్న కర్మలే. కఫన్ కోసం సమకూర్చే వస్త్రం ఎంత విలువైనదయినా అది మట్టిలో కలసిపోయేదే. ఈ ప్రబోధనం యొక్క ప్రభావం ప్రవక్త సహచరులపై ఎంతగా పడిందంటే, హ॥జత్ అబూబక్ర్ (రజి) తాను మరణించినపుడు ప్రత్యేకంగా కొత్త వస్త్రం ఉపయోగించవలసిన అవసరం లేదనీ, తన దుప్పట్లనే ఉతికి వాటినే తన కఫన్‌గా ఉపయోగించాలని తాకీదు చేశారు. కొత్త బట్టలు ధరించే హక్కు మృతులకన్నా బ్రతికి ఉన్న వారికి ఎక్కువగా ఉందని ఆయన (రజి) అభిప్రాయపడ్డారు. (బుఖారీ)

443. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తనతో చెప్పారని హ॥జత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : "(ఆయిషా!) ఒకవేళ నీవు గనక నాకంటే ముందు చనిపోతే నేను నీకు స్నానం చేయిస్తాను." (దీనిని అహ్మద్, ఇబ్నె మాజ ఉల్లేఖిం చారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

(٤٤٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهَا: «لَوْ مُتِّ قَبْلِي لَغَسَّلْتُكِ»، اَلْحَدِيثُ. رَوَاهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّان.

**సారాంశం**

చనిపోయిన తన భార్యకు భర్త గుసుల్ ఇవ్వవచ్చునని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. అత్యధిక మంది ధర్మవేత్తలు ఈ అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దీంతో విభేదించారు. అయితే ప్రవక్త సహచరుల ఆచరణ ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి అభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతోంది. ఉదాహరణకు : హ॥జత్ అలీ (రజి) తన సతీమణి (దైవప్రవక్త పుత్రిక) అయిన ఫాతిమా (ర.అన్హా) చనిపోయినపుడు ఆమెకు అంత్యక్రియల స్నానం చేయించారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే భర్త భార్యకు, భార్య భర్తకు కడసారి స్నానం (గుసుల్) చేయించవచ్చు.

444. హ॥జత్ అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) కథనం : "హ॥జత్ అలీ (రజి) స్వయంగా తనకు (కడసారి) స్నానం

(٤٤٤) وَعَنْ أَسْمَاءَ بِنْتِ عُمَيْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ فَاطِمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى

عَنْهَا أَوْصَتْ أَنْ يُغَسِّلَهَا عَلِيٌّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ.

చేయించాలని హజ్రత్ ఫాతిమా - రజియల్లాహు అన్హా - వసీయతు చేశారు. (సునన్ దారె ఖుత్నీ)

**సారాంశం**

వసీయతు (వీలునామా)ను నెరవేర్చటం ఎంతో అవసరం. అందుకే ఆమె భర్త అయిన హజ్రత్ అలీ (రజి) ఖుద్దుగా ఫాతిమా (ర.అన్హా)కు కడసారి స్నానం చేయించారు. వసీయతు కూడా నెరవేరింది. భర్త తన భార్యకు స్నానం చేయించవచ్చునన్న ఒక విషయం కూడా ఉమ్మత్‌కు ఆధారంగా నిలిచింది.

**హదీసు ఉల్లేఖకులు**

ఫాతిమా బిన్తె నబీ (ర.అన్హా), దైవప్రవక్త (సఅసం)గారి కనిష్ట పుత్రిక, గారాలపట్టీ. ముస్లిం అనుచర సమాజ మహిళలందరికీ నాయకురాలు. హిజ్రీ 2వ సంవత్సరం, రమజాన్ నెలలో హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ (రజి) ఈమెను వివాహమాడారు. కాపురానికి పంపబడేనాటికి ఈమె వయస్సు 15 సంవత్సరాల, 5 నెలలు. హిజ్రీ 11వ సంవత్సరం - రమజాన్ నెలలో - దైవప్రవక్త (స) మరణించిన 6 నెలలకు ఈమె కూడా మరణించారు.

(٤٤٥) وَعَنْ بُرَيْدَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ – فِيْ : الْغَامِدِيَّةِ، الَّتِيْ أَمَرَ النَّبِيُّ ﷺ بِرَجْمِهَا فِي الزِّنَا – قَالَ: ثُمَّ أَمَرَ بِهَا، فَصُلِّيَ عَلَيْهَا وَدُفِنَتْ. رَوَاهُ مُسْلِمٌ.

445. హజ్రత్ బురైద (రజి) గారు, వ్యభిచార నేరానికి పాల్పడి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)చే రాళ్లు రువ్వబడే శిక్షను అనుభవించిన ఘామిదియ వృత్తాంతం వివరిస్తూ ఇలా అన్నారు : "ఆయన (స) ఆమె అంత్యక్రియల నమాజును స్థాపించమని ఆదేశించారు. మరి ఆయన (స) స్వయంగా ఆమె నమాజె జనాజాను చేశారు. తరువాత ఆమెను ఖననం చేశారు." (ముస్లిం)

**సారాంశం**

మహాప్రవక్త (సఅసం) స్వయంగా ఘామిదియ అంత్యక్రియల నమాజులో పాల్గొన్నారని సహీహ్ హదీసుల ద్వారా తెలుస్తోంది. ఘోర పాపాలకు పాల్పడే వారి - ఉదాహరణకు ఆత్మహత్యకు పాల్పడేవారి, వ్యభిచారానికి ఒడిగట్టేవారి - జనాజా నమాజ్‌లో పాల్గొనటం గురించి ఖాజీ అయాజ్ చెబుతూ, ఇస్లామీయ ధర్మవేత్తలు ఇందుకు అనుమతించారని పేర్కొన్నారు. అయితే ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) మాత్రం దీంతో ఏకీభవించలేదు. దుర్మార్గుడు, దుష్టుడు అయిన వ్యక్తి అంత్యక్రియలను బహిష్కరించాలనీ, తద్వారా సమాజంలో దుష్టశక్తులకు గుణపాఠం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

(٤٤٦) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، قَالَ: أُتِيَ النَّبِيُّ ﷺ بِرَجُلٍ قَتَلَ نَفْسَهُ بِمَشَاقِصَ، فَلَمْ يُصَلِّ عَلَيْهِ. رَوَاهُ مُسْلِمٌ.

446. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) కథనం : "బాణంతో ఆత్మహత్య చేసుకున్న ఒక వ్యక్తి శవం దైవప్రవక్త (సఅసం) వద్దకు తేబడింది. ఆయన (సఅసం) అతని నమాజ్ చేయలేదు." (ముస్లిం)

**సారాంశం**

ఆత్మహత్య చేసుకున్నవాని 'నమాజె జనాజా' చేయటం గురించి ద్వంద్వాభిప్రాయాలున్నాయి. చేయవచ్చని కొందరూ, చేయకూడదని మరికొందరూ చెబుతున్నారు. సమాజంలోని మేధావులు, విజ్ఞులు ఈ వ్యక్తి నమాజులో పాల్గొనకపోయినా కనీసం సామాన్య జనులైనా పాల్గొని అతని అంతిమ యాత్రకు వీడ్కోలు పలకాలని కొంతమంది అభిప్రాయపడ్డారు. ఎందుకంటే నసాయిలోని ఉల్లేఖనం ప్రకారం "నేను ఇతని జనాజా నమాజు చేయను" అని మాత్రమే దైవప్రవక్త (స) అన్నారు. అంటే ప్రవక్త సహచరులు బహుశా ఆ వ్యక్తి జనాజా నమాజ్ చేసి ఉంటారన్న ఆలోచనకు తావు కలుగుతోంది. మొదట్లో రుణగ్రస్తుడైన వ్యక్తి చనిపోయినపుడు కూడా ఆయన (స) అతని జనాజా నమాజులో పాల్గొనేవారు కాదు, అయితే మీరు ఇతని నమాజ్ చేయండి అని సహచరులకు సలహా ఇచ్చేవారు.

(٤٤٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ - فِي قِصَّةِ الْمَرْأَةِ الَّتِي كَانَتْ تَقُمُّ الْمَسْجِدَ - قَالَ: فَسَأَلَ عَنْهَا النَّبِيُّ ﷺ، فَقَالُوا: مَاتَتْ، فَقَالَ: «أَفَلَا كُنْتُمْ آذَنْتُمُونِي»؟ - فَكَأَنَّهُمْ صَغَّرُوا أَمْرَهَا - فَقَالَ: «دُلُّونِي عَلَى قَبْرِهَا»، فَدَلُّوهُ، فَصَلَّى عَلَيْهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

447. మస్జిద్‌లో చీపురుకట్టతో ఊడ్చే ఒక మహిళ గురించి హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : దైవప్రవక్త (సఅసం) ఆ మహిళ గురించి (ఆమె కనిపించటం లేదేమిటీ? అని) ఆరా తీయగా, 'ఆమె చనిపోయింది' అని సహచరులు (ర.అన్హుం) సమాధానమిచ్చారు. "మరి మీరు నాకు ఎందుకు చెప్పలేదు?" అని ఆయన (స) నొచ్చుకున్నారు. అంటే ఆమె మరణాన్ని అందరూ సర్వసామాన్యమయిన విషయంగా తలపోశారు. "ఆమె సమాధి ఎక్కడుందో చూపెట్టండి" అని ఆయన (స) సహచరులను కోరారు. అక్కడికి వెళ్ళి ఆమె 'నమాజె జనాజా' చేశారు.

(బుఖారీ, ముస్లిం)

وَزَادَ مُسْلِمٌ. ثُمَّ قَالَ: «إِنَّ هَذِهِ الْقُبُورَ مَمْلُوءَةٌ ظُلْمَةً عَلَى أَهْلِهَا. وَإِنَّ اللَّهَ يُنَوِّرُهَا لَهُمْ بِصَلَاتِي عَلَيْهِمْ».

ముస్లింలో ఈ వాక్యం అదనంగా ఉంది: "ఈ సమాధులు సమాధివాసుల కోసం చీకట్లతో నిండి ఉన్నాయి. నా నమాజు వల్ల వీరి సమాధులలో వెలుగు వస్తుంది."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక విషయాలు మన ముందుకు వస్తున్నాయి -

(1) ఖననం చేసిన తరువాత మృతుని సమాధి వద్ద కూడా నమాజె జనాజా చేయటం సమ్మతమే. ఖననానికి ముందు జనాజా నమాజ్ చేసివున్నప్పటికీ మలిసారి నమాజ్ చేయటంలో తప్పులేదు. హజ్రత్ బరా బిన్ మారూర్ (రజి) అంత్యక్రియల నమాజ్ కూడా దైవప్రవక్త (స) ఒక నెల రోజుల తరువాత - సమాధి దగ్గర - చేశారు. ఎందుకంటే ఈయన మరణించినప్పుడు దైవప్రవక్త (స) మక్కాలో వున్నారు.

(2) సమాధివాసులంటే సమాధుల్లో నిద్రిస్తున్నవారు. ఈ సమాధులలో చీకటి తప్ప వెలుగు లేదని ఆయన (స) ఆవేదన వ్యక్తం చేశారు.

(3) మస్జిద్‌ను వూడ్చే, పరిశుభ్రంగా ఉంచే వారి స్థానం ఎంతో గొప్పదని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

(4) ముస్లిం మహిళ సయితం మస్జిద్‌ను పరిశుభ్రపరచగలదు.

(5) మస్జిదును పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచటం అవసరం. పరిశుభ్రతకై పని చీపురుతోనూ చేయవచ్చు, గుడ్డతో తుడవటం ద్వారా కూడా చేయవచ్చు.

(6) కార్మికవర్గం పట్ల, పేదలపట్ల దైవప్రవక్త (సఅసం) కు గల ఆప్యాయతకు, ప్రేమానురాగాలకు, శ్రద్ధాసక్తికి ఈ సంఘటన అద్దం పడుతోంది.

(٤٤٨) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَنْهَى عَنِ النَّعْيِ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

448. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణం గురించి బహిరంగంగా (దండోరా వేయడాన్ని) ప్రకటనలు చేయడాన్ని వారించారు." (అహ్మద్ మరియు తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ ఈ హదీసును 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

మరణవార్త గురించి నలుగురికీ తెలియజేయరాదని దీని ఉద్దేశ్యం ఎంతమాత్రం కాదు. అసలు విషయమేమిటంటే అజ్ఞానకాలంలో అరబ్బులు మరణ సమాచారాన్ని ఒక తమాషాగా చేసుకున్నారు. హాహాకారాలు చేస్తూ, పెడబొబ్బలు పెడుతూ కబురు పంపేవారు. ఎంత ఎక్కువగా ఏడ్పులు, పెడబొబ్బలు పెడితే చనిపోయినవాడు అంత గొప్పవాడుగా పరిగణించబడేవాడు. దైవప్రవక్త (స) ఈ దురాచారాలను అరికట్టారు.

(٤٤٩) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَعَى النَّجَاشِيَّ فِي الْيَوْمِ الَّذِيْ مَاتَ فِيْهِ، وَخَرَجَ بِهِمْ إِلَى الْمُصَلَّى، فَصَفَّ بِهِمْ، وَكَبَّرَ عَلَيْهِ أَرْبَعاً. مُتَّفَقٌ عَلَيْهِ.

449. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నజ్జాషీ చక్రవర్తి మరణ సమాచారం అందిన వెంటనే అందరికీ తెలియ పర్చారు. ఆయన (స) సహచరులను వెంటబెట్టుకుని అంత్యక్రియల నమాజ్ చేసే స్థలం వద్దకు వెళ్ళారు. అందరూ వరుసలు తీరి నిలబడ్డారు. 4 తక్బీర్లు పలికారు (జనాజా నమాజ్ చేశారు). (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

తమకు అందిన మరణ సమాచారాన్ని పలువురికి అందించాలనీ, దూరప్రదేశాలలో వున్నవారు అంత్యక్రియలకు హాజరు కాలేక పోయినప్పటికీ, "నమాజె గాయిబానా" చేయవచ్చుననీ ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ దీనికి సుముఖంగానే ఉన్నారు. అయితే హనఫీ ఫికహ్ ననుసరించేవారు, మాలికీ ధర్మవేత్తలు ఇందుకు సుముఖంగా లేరు. ఈ వ్యవహారం ఒక్క ప్రవక్తకే ప్రత్యేకం (పరిమితం) అని వీళ్ళు వ్యాఖ్యానించారు.

## హదీసులోని ప్రముఖ వ్యక్తి

నజ్జాషీ (రజి) - ఈయన ఆనాటి అబిసీనియా (నేటి ఇథియోపియా) చక్రవర్తి. సత్యప్రియుడు. నజ్జాషీ అసలు పేరు కాదు. ఆ రాజ్యంలోని చక్రవర్తులకు గల బిరుదు అది. ఏ విధంగా రోము సామ్రాజ్యాధినేతను 'ఖైసర్'గా, ఈరాన్ చక్రవర్తిని 'కిస్రా'గా పిలిచేవారో అదేవిధంగా అబిసీనియా రాజును 'నజ్జాషీ' (నీగస్)గా వ్యవహరించేవారు. ఈయన అసలు పేరు అషమ బిన్ అబ్జర్ (రజి). మక్కాలోని అవిశ్వాసుల ఆగడాలనుండి తమ 'విశ్వాసాన్ని' కాపాడుకోవటానికి అలనాటి ముస్లింలు కొంతమంది అబిసీనియా వైపునకు వలస వెళ్ళారు. దైవప్రవక్త (సఅసం) హిజ్రీ 6వ సంవత్సరంలో అమ్ర్ బిన్ ఉమయ్యా జమరీ (రజి) ద్వారా ఇస్లాం స్వీకరించమని నజ్జాషీకి ఆహ్వానం పంపారు. ఆయన ఈ ఆహ్వాన లేఖను ముద్దుపెట్టుకున్నాడు. కళ్ళకద్దుకున్నాడు. సింహాసనం నుండి దిగివచ్చి హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించాడు. ఆయన ఈ వృత్తాంతమంతా లిఖించి దైవప్రవక్త (సఅసం) కు పంపారు. నజ్జాషీ చక్రవర్తి హిజ్రీ 9లో - తబూక్

యుద్ధానంతరం - మరణించారు. ఆ తరువాత దైవప్రవక్త (స) అతని వారసునికి కూడా ఇస్లాం స్వీకరించమని ఆహ్వానం పంపారు.

(٤٥٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَمِعْتُ النَّبِيَّ ﷺ يَقُولُ: «مَا مِنْ رَجُلٍ مُسْلِمٍ يَمُوتُ، فَيَقُومُ عَلَى جَنَازَتِهِ أَرْبَعُونَ رَجُلاً، لاَ يُشْرِكُونَ بِاللّٰهِ شَيْئاً، إِلاَّ شَفَّعَهُمُ اللّٰهُ فِيهِ». رَوَاهُ مُسْلِمٌ.

450. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "ఏ ముస్లిమైనా మరణించగా, దైవానికి సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టని నలభై మంది గనక అతని (జనాజా) నమాజ్‌లో పాల్గొంటే, అల్లాహ్ ఆ మృతుని పాలిట వాళ్ల వేడుకోలును ఆమోదిస్తాడు."

(ముస్లిం)

### సారాంశం

అంత్యక్రియల నమాజ్‌లో అత్యధికమంది పాల్గొని మృతుని క్షమాభిక్షకై వేడుకోవలసిన ఆవశ్యకతను ఈ హదీసు సూచిస్తోంది. అయితే ఆ నమాజులో పాల్గొనే వారు షిర్క్ చేయనివారు, నికార్సయిన ఏకేశ్వరోపాసకులై ఉండాలన్న విషయం కూడా హదీసు ద్వారా ప్రస్ఫుటమవుతోంది. ఏక దైవారాధకులను అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడన్న దానికి ఈ హదీసు ఒక ప్రబల నిదర్శనం.

(٤٥١) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، قَالَ: صَلَّيْتُ وَرَاءَ النَّبِيِّ ﷺ عَلَى امْرَأَةٍ مَاتَتْ فِي نِفَاسِهَا، فَقَامَ وَسْطَهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

451. హజ్రత్ సముర బిన్ జున్దుబ్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక ఒక స్త్రీ నమాజె జనాజా చేశాను. ఆ స్త్రీ పురిటి రక్త స్రావంతో మరణించింది. ఆయన (స) ఆ స్త్రీ భౌతికకాయానికి ఎదురుగా - మధ్య భాగంలో-నిలబడ్డారు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

చనిపోయిన ఆ మహిళ పేరు ఉమ్మె కాబ్ అన్సారియా (ర.అన్హా). ప్రసవ సమయంలో ఆమె మరణించింది.

చనిపోయిన వారు స్త్రీ అయినప్పుడు ఇమామ్ శవపేటికకు ఎదురుగా, మధ్య భాగంలో నిలబడి నమాజ్ చేయించాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. మృతుడు పురుషుడైనప్పుడు ఇమామ్ అతని తల భాగానికి ఎదురుగా నిలబడి నమాజ్ చేయించాలని హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ద్వారా విదితమవుతోంది. (ముస్నద్ అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ). ఇమామ్

షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల అభిమతం కూడా ఇదే. కాని దీనికి భిన్నంగా హనఫీ పండితులు సాధారణంగా మృతులైన స్త్రీ పురుషుల హృదయానికి ఎదురుగా నిలబడి నమాజ్ చేయిస్తున్నారు. దీనికి షరీఅత్ పరమయిన నిదర్శనమేదీ లేదు. వీళ్లు మూలాంశాన్ని ఉపేక్షించి అంచనాలపై అమలు జరుపుతున్నారు. విశ్వాసానికి మూలస్థానం హృదయం గనక హృదయానికి ఎదురుగా నిలబడాలన్నది వీళ్ల భావన. కాని ఇది హదీసుకు విరుద్ధాంశం.

(٤٥٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: وَاللّٰهِ لَقَدْ صَلَّى رَسُولُ اللّٰهِ ﷺ عَلَى ابْنَيْ بَيْضَاءَ فِي الْمَسْجِدِ. رَوَاهُ مُسْلِمٌ.

452. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా తెలిపారు : "దైవసాక్షి! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బైజా యొక్క ఇద్దరు కుమారుల నమాజె జనాజాను మస్జిదులోనే చేశారు."

(ముస్లిం)

## సారాంశం

మస్జిదులో 'నమాజె జనాజా' చేయటం దైవప్రవక్త (సఅసం) వారి (ఆచరణ) ద్వారా నిరూపితమయింది. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్‌లు ఇద్దరూ మస్జిద్‌లో నమాజె జనాజా చేయడాన్ని అయిష్టకరమైన విషయం (మక్రూహ్)గా భావిస్తున్నారు. మరి చూడబోతే దీనికి సంబంధించిన షరీఅత్ పరమైన ఆధారం ఏదీ లేదు. పైగా ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) నమాజె జనాజాను హజ్రత్ ఉమర్ (రజి) మస్జిదులోనే చేయించారు. (ఇబ్నె అబీ షైబ). ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) నమాజె జనాజాను కూడా మస్జిదులోనే హజ్రత్ సుహైబ్ (రజి) చేయించారు. (ముస్నద్ సయీద్ మన్సూర్). ఒకవేళ ఇలా చేయటం అధర్మం, లేక అవాంఛనీయ విషయం అయివుంటే ధర్మ ఖలీఫాలు సయితం ఆ మేరకు ఆచరించి ఉండేవారు కాదు. కాబట్టి దైవప్రవక్త (స) ఆచరణ ద్వారా, ఆయన ప్రియ సహచరుల (రజి) అనుసరణ ద్వారా మనకు బోధ పడేదేమంటే మస్జిదులో జనాజా నమాజ్‌ను నిస్సంకోచంగా చేయవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

బైజా (ర.అన్హా). ఈమె సహ్ల్ మరియు సుహైల్‌ల తల్లిగారు. 'బైజా' అనేది ఆమెకు లభించిన బిరుదు. అసలు పేరు దాద్ బిన్తె జుహ్‌దుమ్ ఫిహ్రీ. ఈమె భర్తపేరు వహబ్ బిన్ రబీయ ఖురషీ. బనూహాషిమ్‌ను, ముస్లిములను సంఘం నుంచి బహిష్కరించాలంటూ ఖురైషులు ఆమోదించిన తీర్మాన పత్రాన్ని సహ్ల్ చించి ముక్కలు ముక్కలు చేసేశాడు. ఒక కథనం ప్రకారం ఈయన మక్కాలోనే ఇస్లాం స్వీకార ప్రకటన చేశాడు. మరో కథనం ప్రకారం తన ఈమాన్‌ను (విశ్వాసాన్ని) హృదయంలో దాచిపెట్టుకున్నాడు. ఆ స్థితిలోనే అతడు బద్ర్ యుద్ధరంగానికి వచ్చాడు. ముస్లింలు ఇతన్ని కూడా యుద్ధ ఖైదీగా పట్టుకున్నారు. అయితే ఈయన మక్కాలో నమాజ్ చేయటం తాను కళ్ళారా చూశానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) చెప్పటంతో, ఆయన సాక్ష్యంపై సహ్ల్ విడుదల చేయబడ్డాడు. ఈయన మదీనాలో మరణించారు.

ఇక సుహైల్ గురించి, ఈయన తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. అబిసీనియా వైపుకు, మదీనా వైపుకు రెండు హిజ్రత్‌లు చేశారు. బద్ర్ యుద్ధంలోనూ, ఇతర యుద్ధాలలోనూ పాల్గొన్నారు. తబూక్ యుద్ధం తరువాత - హిజ్రీ 9లో మదీనాలో మరణించారు. బైజా (ర.అనహో) గారి ప్రఖ్యాత కుమారులిద్దరూ వీరు. మూడవ కుమారుడు సఫ్వాన్. బద్ర్ యుద్ధంలో అమరగతి నొందారు. దైవప్రవక్త (సఅసం) మరణించిన చాలా కాలం తరువాత ఈయన మరణించారని మరో వినికిడి ఉంది.

(٤٥٣) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ أَبِي لَيْلَى قَالَ: كَانَ زَيْدُ بْنُ أَرْقَمَ يُكَبِّرُ عَلَى جَنَائِزِنَا أَرْبَعاً، وَأَنَّهُ كَبَّرَ عَلَى جَنَازَةٍ خَمْساً، فَسَأَلْتُهُ، فَقَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُكَبِّرُهَا. رَوَاهُ مُسْلِمٌ. وَالْأَرْبَعَةُ.

453. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ లైలా కథనం: జైద్ బిన్ అర్ఖమ్ (రజి) మా వాళ్ల జనాజా నమాజులో 4 తక్బీర్లు పలికేవారు. ఒకసారి ఆయన (ఆనవాయితీకి విరుద్ధంగా) 5 తక్బీర్లు పలికారు. ఈ సంగతి గురించి నేనాయన్ని దర్యాప్తు చేయగా, 'దైవప్రవక్త (స) 5 తక్బీర్లు కూడా పలికేవార'ని ఆయన సమాధానమిచ్చారు. (దీనిని ముస్లింతో పాటు మరో నలుగురు (అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ) ఉల్లేఖించారు)

## సారాంశం

జనాజా నమాజులో 4 అదనపు తక్బీర్లు పలకటం కూడా ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. దైవ ప్రవక్త (స) 4 నుండి 8 తక్బీర్ల దాకా పలికినట్లు ఆధారాలున్నాయి. ప్రవక్త (స) సహచరులు కూడా ఈ విధానాన్ని అనుసరించారు. హజ్రత్ ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో సహాబీలందరినీ సంప్రదించిన మీదట 4 తక్బీర్ల రివాజును ప్రవేశపెట్టారని బైహఖీలో తెలుపబడింది. ఈ అంశంపై అందరూ ఏకీభవించారని కొంతమంది పేర్కొన్నారు. కాని ఇది సరైంది కాదు. హజ్రత్ అలీ (రజి) తదితరులు 4 కన్నా ఎక్కువ తక్బీర్లతో నమాజె జనాజా చేయించే వారని ఆధారాలున్నాయి. 4 తక్బీర్ల తరువాత మృతుని కోసం దుఆ చేసేవారు. జనాజా నమాజ్‌లో ప్రవక్త సహచరులు రఫెయదైన్ చేసేవారు. ఇమామ్ షాఫయి (రహ్మలై) ఇందుకు సుముఖంగా ఉన్నారు. హనఫీ ఫికహ్ననుసరించే వారిలో కూడా కొంతమంది ఈ పద్ధతిని అవలంబిస్తారు.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుర్రహ్మాన్ బిన్ అబూలైలా (రహ్మలై) ప్రముఖ తాబయీలలో ఒకరు. అన్సార్ వర్గానికి చెందిన వారు. మదీనా వాసులు. తరువాత కూఫాకు మకాం మార్చారు. అంచేత కూఫీగా కూడా వ్యవహరించబడ్డారు. ఈయన నామాంతరం అబూ ఈసా. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈయన జన్మించారు. హిజ్రీ 86లో జమాజిమ్ యుద్ధంలో మరణించారని ప్రతీతి. మరో కథనం ప్రకారం బస్రా కాలువలో మునిగి చనిపోయారని కూడా తెలుస్తోంది.

(٤٥٤) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَبَّرَ عَلَى سَهْلِ بْنِ حُنَيْفٍ سِتًّا، وَقَالَ: إِنَّهُ بَدْرِيٌّ. رَوَاهُ سَعِيدُ بْنُ مَنْصُورٍ. وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

454. సహ్ల్ బిన్ హునైఫ్ (రజి) నమాజె జనాజాలో తాను 6 తక్బీర్లు పలికాననీ, ఆయన ఒక బద్రీ సహాబీ అనీ హజ్రత్ అలీ (రజి) తెలియజేశారు. (సయీద్ బిన్ మన్సూర్ దీనిని ఉల్లేఖించారు. దీని మూలం బుఖారీలో ఉంది)

**సారాంశం**

బద్రీ సహాబీ అంటే బద్ర్ యుద్ధంలో ముస్లిం సేనల తరఫున పోరాడిన యోధుడు అని అర్థం. ఒక పెద్ద మనిషి యొక్క పెద్దరికాన్ని, అతని ఘన కార్యాలను దృష్టిలో పెట్టుకుని నమాజె జనాజా సందర్భంగా 4 కన్నా ఎక్కువ తక్బీర్లు పలకటంలో ఎలాంటి అతిశయోక్తి, అనౌచిత్యం లేదని ఈ హదీసు ద్వారా వ్యక్తమవుతోంది.

**హదీసు ఉల్లేఖకులు**

ఈ హదీసులో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చిన సహ్ల్ బిన్ హునైఫ్ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొని, దైవప్రవక్త (సఅసం)ను వెన్నంటి నిలిచిన సహాబీలలో ఒకరు. అన్సార్ సహాబీ. ఔస్ తెగకు చెందిన వారు. మదీనా వాస్తవ్యులు. బద్ర్‌తోపాటు ఇతర యుద్ధాలలో కూడా పాల్గొన్నారు. హిజ్రత్ చేసి మదీనాకు వచ్చిన హజ్రత్ అలీ (రజి)తో దైవప్రవక్త (స) ఈయనకు సోదర బాంధవ్యం కల్పించారు. ఈ సోదర బంధాన్ని ఆయన ఎంతో చక్కగా కొనసాగించారు. హజ్రత్ అలీ (రజి) ఈయన్ని బస్రా పర్యవేక్షకునిగా నియమించారు. సిఫ్ఫీన్ యుద్ధ సందర్భంగా కూడా ఈయన హజ్రత్ అలీ (రజి)కి మద్దతు తెలిపారు. హిజ్రీ 38లో మరణించారు.

(٤٥٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُكَبِّرُ عَلَى جَنَائِزِنَا أَرْبَعاً، وَيَقْرَأُ بِفَاتِحَةِ الْكِتَابِ فِي التَّكْبِيرَةِ الْأُولَى. رَوَاهُ الشَّافِعِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

455. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా జనాజా నమాజులలో 4 తక్బీర్లు పలికేవారు. మొదటి తక్బీర్‌లో ఫాతిహా సూరా పఠించేవారు." (షాఫయి దీనిని బలహీన - జయీఫ్ - ఆధారాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

జనాజా నమాజ్‌లో మొదటి తక్బీర్ పలికిన తరువాత ఫాతిహా సూరా పఠించ వచ్చునని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. నసాయిలోని వేరొక ఉల్లేఖనం ప్రకారం సూరతుల్ అస్ర్ కూడా పఠించవచ్చని తెలుస్తోంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్‌ల దృష్టిలో నమాజె జనాజాలో ఫాతిహా సూరా పఠించటం వాజిబ్ (అనివార్యం). అయితే మరి కొంతమంది దీంతో ఏకీభవించలేదు.

456. హజ్రత్ తల్హా బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఔఫ్ (రహ్మ.లై) కథనం : నేను ఇబ్నె అబ్బాస్ (రజి) వెనుక నమాజె జనాజా చేశాను. ఆయన సూరె ఫాతిహా పఠించారు. ఆయనిలా అన్నారు : ఇలా పఠించటం సున్నత్ అన్న సంగతి మీకు తెలియాలి (అన్న ఉద్దేశ్యంతోనే నేనీ సూరా పఠించాను). (బుఖారీ)

(٤٥٦) وَعَنْ طَلْحَةَ بْنِ عَبْدِاللهِ بْنِ عَوْفٍ، قَالَ: صَلَّيْتُ خَلْفَ ابْنِ عَبَّاسٍ عَلَى جَنَازَةٍ، فَقَرَأَ فَاتِحَةَ الْكِتَابِ، فَقَالَ لِتَعْلَمُوا أَنَّهَا سُنَّةٌ. رَوَاهُ الْبُخَارِيُّ.

**సారాంశం**

ఇబ్నె అబ్బాస్ (రజి) గారు ఫాతిహా సూరాను బిగ్గరగా పారాయణం చేశారు. ఇలా పారాయణం చేయటం దైవప్రవక్త (స) సంప్రదాయం అన్న విషయాన్ని అందరి దృష్టికి తీసుకురావటానికే తానిలా చేశానని ఆయన (రజి) వివరించారు కూడా. కాబట్టి నమాజె జనాజాలో ఫాతిహా సూరాను బిగ్గరగా పఠించటం ధర్మసమ్మతమే.

**హదీసు ఉల్లేఖకులు**

తల్హా బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఔఫ్ (రహ్మ.లై). ప్రఖ్యాత సహాబీ అయిన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గారి అన్న కుమారుడు. 'తల్హా నదా' అనే బిరుదు పొందారు. అత్యుత్తమ శ్రేణికి చెందిన ధర్మవేత్త. తాబయీలలో మధ్యతరానికి చెందినవారుగా పరిగణించబడ్డారు. హిజ్రీ 97లో - 72 సంవత్సరాల వయస్సులో మరణించారు.

457. హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక జనాజా నమాజ్ చేయించారు. నేను ఆయన (స) చేసిన దుఆలో జ్ఞాపకం చేసుకున్న భాగం ఇది: "ఓ అల్లాహ్! ఇతన్ని మన్నించు. ఇతనిపై కరుణించు. ఇతన్ని సుఖసౌఖ్యాలతో ఉంచు. ఇతని తప్పులను ఉపేక్షించు. ఇతనికి చక్కని అతిథి మర్యాద చెయ్యి. ఇతని సమాధిని విశాలవంతంగా చెయ్యి. ఇతన్ని నీళ్ళతో, మంచుతో, వడగళ్లతో కడిగివెయ్యి. తెల్లని వస్త్రం మలినం నుండి ఎలా పరిశుభ్రపరచ

(٤٥٧) وَعَنْ عَوْفِ بْنِ مَالِكٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى رَسُولُ اللهِ ﷺ عَلَى جَنَازَةٍ، فَحَفِظْتُ مِنْ دُعَائِهِ «اللّٰهُمَّ اغْفِرْ لَهُ، وَارْحَمْهُ، وَعَافِهِ، وَاعْفُ عَنْهُ، وَأَكْرِمْ نُزُلَهُ، وَوَسِّعْ مَدْخَلَهُ، وَاغْسِلْهُ بِالْمَاءِ، وَالثَّلْجِ، وَالْبَرَدِ. وَنَقِّهِ مِنَ الْخَطَايَا، كَمَا نَقَّيْتَ الثَّوْبَ

الْأَبْيَضَ مِنَ الدَّنَسِ، وَأَبْدِلْهُ دَاراً خَيْراً مِّنْ دَارِهِ، وَأَهْلاً خَيْراً مِنْ أَهْلِهِ، وَأَدْخِلْهُ الْجَنَّةَ، وَقِهِ فِتْنَةَ الْقَبْرِ، وَعَذَابَ النَّارِ». رَوَاهُ مُسْلِمٌ.

బడుతుందో అలాగే ఇతన్ని పరిశుభ్ర పరచు. ఇతనికి ప్రాపంచిక ఇల్లుకన్నా మంచి ఇల్లును, ప్రస్తుత ఆలుబిడ్డల కన్నా మంచి ఆలుబిడ్డలను ప్రసాదించు. ఇతన్ని స్వర్గంలో ప్రవేశింపజెయ్యి. ఇతన్ని సమాధి పరీక్ష నుండి, నరక యాతన నుండి సురక్షితంగా ఉంచు.''

(ముస్లిం)

## సారాంశం

ఈ 'దుఆ'ను సయితం దైవప్రవక్త (సఅసం) బిగ్గరగా పఠించారని హదీసు తీరును బట్టి అర్థమవుతున్నది. బిగ్గరగా చదవబట్టే హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ఈ దుఆను జ్ఞాపకం చేసుకోగలిగారు. లేదా ఈయన దైవప్రవక్త (స)ను అడిగి తెలుసుకుని, జ్ఞాపకం చేసుకుని ఉంటారన్న భావనకు కూడా ఆస్కారం లేకపోలేదు. ఇంతకీ ఈ దుఆను బిగ్గరగా చేయాలా లేక నెమ్మదిగా చేయాలా? అన్న విషయమై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. చాలామంది ధర్మవేత్తలు దుఆను నెమ్మదిగా చేయాలని భావించారు. కొద్దిమంది మాత్రం బిగ్గరగా పఠించాలని అభిప్రాయపడ్డారు. రాత్రిపూట అయితే బిగ్గరగానూ పగటివేళ అయితే నెమ్మదిగానూ దుఆ చేయాలని మరికొంత మంది తలపోశారు. 'దుఆ' నెమ్మదిగా చేయటం ఉత్తమం కాబట్టి ఈ దుఆను నెమ్మదిగా చేయటమే మంచిదని అత్యధిక మంది ధర్మవేత్తలు నిర్ధారణకు వచ్చారు. ఎందుకంటే ఎక్కువ హదీసులు దీనిని సమర్థిస్తున్నాయి. అయితే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) మాదిరిగా బిగ్గరగా చదివినా అందులో ఆక్షేపణీయం ఏమీలేదు.

## హదీసు ఉల్లేఖకులు

ఔఫ్ బిన్ మాలిక్ (రజి) దైవప్రవక్త సహచరులలో ఒకరు. అష్జా తెగకు చెందిన వారు. ఖైబర్ యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. మక్కా విజయం నాడు అష్జా తెగ వారి ధ్వజం ఈయన చేతిలో ఉంది. సిరియాలో స్థిరపడ్డారు. హిజ్రీ 73లో మరణించారు.

(٤٥٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا صَلَّى عَلَى جَنَازَةٍ، يَقُولُ: «اللّٰهُمَّ اغْفِرْ لِحَيِّنَا، وَمَيِّتِنَا، وَشَاهِدِنَا، وَغَائِبِنَا، وَصَغِيرِنَا، وَكَبِيرِنَا، وَذَكَرِنَا، وَأُنْثَانَا، اللّٰهُمَّ مَنْ أَحْيَيْتَهُ

458. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎవరి జనాజా నమాజ్ చేయించినా ఈ దుఆ పఠించేవారు: ''ఓ దేవా! మాలోని సజీవులను - మృతులను, ఇక్కడ ఉన్న వారినీ - లేనివారినీ, మాలోని చిన్నలనూ - పెద్దలనూ,

مِنَّا فَأَحْيِهِ عَلَى الْإِسْلَامِ، وَمَنْ تَوَفَّيْتَهُ مِنَّا فَتَوَفَّهُ عَلَى الْإِيمَانِ، اللَّهُمَّ لاَ تَحْرِمْنَا أَجْرَهُ، وَلاَ تَفْتِنَّا بَعْدَهُ». رَوَاهُ مُسْلِمٌ وَالْأَرْبَعَةُ.

మాలోని పురుషులనూ - స్త్రీలనూ క్షమించు. దేవా! మాలో నీవు ఎవరిని సజీవంగా ఉంచినా ఇస్లాంపై సజీవంగా ఉంచు. మరెవరికి మరణాన్ని ఇచ్చినా విశ్వాసస్థితిలో మరణాన్ని ఇవ్వు. ఓ దేవా! మమ్మల్ని ఇతనితో ముడిపడి ఉన్న పుణ్యఫలాన్నుండి దూరం చేయకు. ఇంకా మమ్మల్ని ఇతని తరువాత అపమార్గం పట్టించకు." (దీనిని ముస్లిం మరియు నలుగురు - అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఉల్లేఖించారు)

(٤٥٩) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «إِذَا صَلَّيْتُمْ عَلَى الْمَيِّتِ فَأَخْلِصُوا لَهُ الدُّعَاءَ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

459. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు - "మీరు ఎప్పుడు ఎవరి జనాజా నమాజ్ చేసినా మనస్ఫూర్తిగా అతని కోసం (మృతుని కొరకు) దుఆ చేయండి." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

నమాజె జనాజాలో పాల్గొనే ప్రతి ఒక్కరూ చనిపోయిన వారి మన్నింపు కోసం ప్రార్థించే ఉద్దేశ్యంతోనే వస్తారు. తాను చేసే దుఆ వల్ల మృతునికి ప్రయోజనం చేకూరాలన్న తలంపు ఉన్నప్పుడు, ఆ దుఆలో ఎలాంటి లోటు కనబరచకూడదు. ఎంతో వినమ్రతతో, ఆర్ద్రతతో మృతుని క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకోవాలి. చాలామంది అంత్యక్రియలలో పాల్గొంటారు కాని వారిలో ఈ వినమ్రత కానరాదు. ఏదో లాంఛనప్రాయంగా, తాము కూడా పాల్గొన్నామన్న విషయాన్ని సాటి సమాజానికి తెలియజేసేందుకు వస్తారు. చిత్తశుద్ధి లోపించిన వేడుకోళ్లు దైవ సన్నిధిలో ఆమోదయోగ్యమవుతాయన్నది సందేహాస్పదమే.

(٤٦٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «أَسْرِعُوا بِالْجَنَازَةِ، فَإِنْ تَكُ صَالِحَةً، فَخَيْرٌ تُقَدِّمُونَهَا إِلَيْهِ، وَإِنْ تَكُ سِوَى ذَلِكَ، فَشَرٌّ تَضَعُونَهُ عَنْ رِقَابِكُمْ». مُتَّفَقٌ عَلَيْهِ.

460. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - "జనాజా (శవపేటిక) మోసుకు వెళ్ళటంలో శీఘ్రతను కనబరచండి. ఎందుకంటే చనిపోయిన వ్యక్తి ఒకవేళ సద్వర్తనుడై ఉంటే అది అతని పాలిట శుభకరం అవుతుంది. కనుక అతన్ని మంచి స్థానం వైపునకు త్వరగా తీసుకెళ్లండి. ఒకవేళ మృతుడు వేరేవాడై ఉంటే (దుర్వర్తనుడై ఉంటే) మీరు మీ భుజాల నుండి బరువు తగ్గించుకున్న వారవుతారు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే మృతుని అంత్యక్రియలు జరపటంలో అనవసరంగా ఆలస్యం చేయకూడదు. ఇది సున్నత్‌కు విరుద్ధం. మరణించిన వారిని తొందరగా ఖననం చేయాలని దైవప్రవక్త (సఅసం) హజ్రత్ అలీ (రజి)కి తాకీదు చేశారు. తబ్రానీలో ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది: "మీలో ఎవరయినా మరణిస్తే అతన్ని (అనవసరంగా) ఆపి ఉంచకండి. వీలయినంత తొందరగా అతన్ని సమాధి వైపునకు తీసుకువెళ్ళండి" అని దైవప్రవక్త (స) ఉపదేశించారు.

(٤٦١) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ شَهِدَ الْجَنَازَةَ حَتَّى يُصَلِّيَ عَلَيْهَا فَلَهُ قِيرَاطٌ، وَمَنْ شَهِدَهَا حَتَّى تُدْفَنَ فَلَهُ قِيرَاطَانِ»، قِيلَ: وَمَا الْقِيرَاطَانِ؟ قَالَ: «مِثْلُ

461. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "ఎవరయితే జనాజా వెంట వెళతాడో, జనాజా నమాజ్ చేయించే వరకూ ఉంటాడో అతనికి ఒక 'ఖీరాత్'కు సమానంగా పుణ్యఫలం లభిస్తుంది. మరెవరయితే ఖననం చేసే వరకూ హాజరై ఉంటాడో అతనికి రెండు 'ఖీరాత్'ల పుణ్యం లభిస్తుంది." 'రెండు ఖీరాత్'లంటే ఎంత?' అని ప్రశ్నించగా

الْجَبَلَيْنِ الْعَظِيمَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: «حَتَّى تُوضَعَ فِي اللَّحْدِ».

"రెండు ఖీరాత్‌లంటే అవి రెండు పెద్ద పర్వతాలకు సమానం" అని దైవప్రవక్త (సఅసం) సమాధానమిచ్చారు.

"మృతుణ్ణి సమాధిలో దించేవరకూ హాజరై ఉంటాడో..." అన్న వాక్యం ముస్లిం ఉల్లేఖనంలో ఉంది.

وَلِلْبُخَارِيِّ: «مَنْ تَبِعَ جَنَازَةَ مُسْلِمٍ إِيمَاناً وَاحْتِسَاباً، وَكَانَ مَعَهَا حَتَّى يُصَلَّى عَلَيْهَا وَيُفْرَغَ مِنْ دَفْنِهَا، فَإِنَّهُ يَرْجِعُ بِقِيرَاطَيْنِ، كُلُّ قِيرَاطٍ مِثْلُ جَبَلِ أُحُدٍ».

బుఖారీలోని ఉల్లేఖనం ఈ విధంగా ఉంది-"ఎవరయితే ఒక ముస్లిం అంత్యక్రియల నమాజులో విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో పాల్గొంటాడో మరియు నమాజె జనాజా ముగిసే వరకూ తోడుగా ఉండి, ఖననం జరిగిన తరువాత వెను తిరిగి వస్తాడో అతడు రెండు ఖీరాత్‌లు పుచ్చుకుని వచ్చాడన్నమాట! ప్రతీ ఖీరాత్ ఉహుద్ పర్వతానికి సమానమైనది."

**సారాంశం**

అంత్యక్రియలలో పాల్గొన్న వారికి లభించే పుణ్యఫలాన్ని ఈ హదీసులో ఉపమానాల రూపంలో వివరించటం జరిగింది. మృతి చెందిన సాటి సోదరసోదరీమణుల అంతిమ వీడ్కోలుకై తప్పకుండా వెళ్ళండని ప్రోత్సహించటం ఈ హదీసు ప్రధాన ఉద్దేశ్యం.

(٤٦٢) وَعَنْ سَالِمٍ عَنْ أَبِيهِ، أَنَّهُ رَأَى النَّبِيَّ ﷺ وَأَبَا بَكْرٍ وَعُمَرَ، يَمْشُونَ أَمَامَ الْجَنَازَةِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَأَعَلَّهُ النَّسَائِيُّ وَطَائِفَةٌ بِالْإِرْسَالِ.

462. దైవప్రవక్త (స)ను, హజ్రత్ అబూబక్ర్ (రజి)ను, హజ్రత్ ఉమర్ (రజి)ను, జనాజాకు ముందు నడుస్తుండగా తాను చూశానని తన తండ్రిగారు తనకు చెప్పినట్లు హజ్రత్ సాలిమ్ వివరించారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా నిర్ధారించారు - నసాయి తదితరులు, దీనిని 'ముర్సల్'గా భావించారు)

**సారాంశం**

శవపేటిక వెంట నడచి వెళుతున్నప్పుడు ముందు ఉండాలా? వెనుక ఉండాలా? వివిధ ఉల్లేఖనాలను జోడించగా ఆయన (సఅసం) ముందు, వెనుక, కుడిప్రక్క, ఎడమ ప్రక్క - అన్ని విధాలుగా నడచినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. అయితే ఈ నాలుగు పొజిషన్లలో మెరుగైనదేది? అంటే ఇమాములు దీనిపై పలు రకాలుగా స్పందించారు. ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్‌లు ముందు నడవటాన్ని ఉత్తమంగా భావిస్తున్నారు. కాగా, ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ ఔజాయీలు వెనుక నడవటాన్ని ఉత్తమంగా తలపోస్తున్నారు. 'ఎలా నడచినా ఫరవాలేదు, ముందైనా వెనుకైనా దేనికీ దేనిపైనా ఆధిక్యత, ప్రత్యేకత లేదు' అని ఇమామ్ షౌకానీ అభిప్రాయపడ్డారు. నడచి వచ్చే వారు మునుముందు ఉండాలనీ, వాహనంపై ఉన్నవారు వెనుక ఉండాలనీ సుఫియాన్ సౌరీ ప్రభృతులు భావిస్తున్నారు. ఏ స్థితిలో నడచినా పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని మసలుకోవచ్చు. ఇదేమంత తీవ్రమయిన విషయం కాదు.

(٤٦٣) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: نُهِينَا عَنِ اتِّبَاعِ الْجَنَائِزِ، وَلَمْ يُعْزَمْ عَلَيْنَا. مُتَّفَقٌ عَلَيْهِ.

463. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : "మేము జనాజా (అంతిమ వీడ్కోలు) యాత్రలో పాల్గొనరాదని చెప్ప బడింది. అయితే ఈ వారింపు మాపై అనివార్యంగా ఖరారు చేయబడలేదు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మహిళలు జనాజా నమాజులో, జనాజా యాత్రలలో పాల్గొనరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఈ వారింపు బహుశా తొలి కాలానికి సంబంధించినదై ఉండవచ్చు. తదుపరి మహిళలలో ధర్మావగాహన పెంపొంది, ఇస్లామీయ చైతన్యం మేల్కొన్న తరువాత బహుశా జనాజా నమాజులో పాల్గొనే అనుమతి లభించి ఉండవచ్చు. నసాయి, ఇబ్నె మాజ, ఇబ్నె అబీ షైబాలలో వచ్చిన అబూ హురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం, ఒక జనాజాలో మహిళలు కూడా పాల్గొన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) వాళ్లను ఆపబోయారు. కాని "వారిని వెళ్లనివ్వండి" అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.

(٤٦٤) وَعَنْ أَبِي سَعِيدٍ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: «إِذَا رَأَيْتُمُ الْجَنَازَةَ فَقُومُوا، فَمَنْ تَبِعَهَا فَلاَ يَجْلِسْ حَتَّى تُوضَعَ». مُتَّفَقٌ عَلَيْهِ.

464. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ సయీద్ (రజి) తెలిపారు : "ఎవరి దయినా జనాజా (శవపేటిక) రావటం మీరు గమనిస్తే లేచి నిలబడండి. ఇంకా జనాజా వెంటనున్నవారు జనాజాను (శవపేటికను) నేలపై ఉంచే వరకూ కూర్చోకూడదు." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

మరణం తిరుగులేనిది. అది ఎక్కడ సంభవించినా, ఎవరిని కబళించినా పరిసరాల వారిని కలచివేస్తుంది. కించిత్ సమయానికి మనిషిలో గుండె దడ పెరుగుతుంది. మృతుణ్ని సమాధి వైపునకు తీసుకు వెళుతున్నప్పుడు అతని పట్ల గౌరవభావంతో, మానవతా దృక్పథంతో లేచి నిలబడటం కనీస మర్యాద అనిపించుకుంటుంది. అదీగాక ఆ సమయంలో దైవదూతలు మృతునికి తోడుగా ఉంటారు. ఇక జనాజా యాత్రలో పాల్గొన్న వారు నిర్ణీత మజిలీకి చేరేదాకా వెంట వెళ్ళి శవ పేటికను క్రిందికి దించిన మీదటే కూర్చోవాలి. శవపేటికను ఎత్తుకుని ఉండగా కూర్చోకూడదు. నసాయిలో అబూహురైర (రజి), అబూసయీద్ (రజి)లు ఇలా అంటున్నారు : "దైవప్రవక్త (స) వారు ఏ జనాజాలో పాల్గొన్నా దాన్ని క్రింద నేలపై ఉంచే వరకూ ఆయన (స) కూర్చోవటం మేమెన్నడూ చూడలేదు."

(٤٦٥) وَعَنْ أَبِي إِسْحَاقَ، أَنَّ عَبْدَ اللهِ ابْنَ يَزِيْدَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَدْخَلَ الْمَيِّتَ مِنْ قِبَلِ رِجْلَي الْقَبْرِ، وَقَالَ: هٰذَا مِنَ السُّنَّةِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ.

465 హజ్రత్ అబూ ఇస్‌హాఖ్ (రహ్మ.లై) కథనం : "అబ్దుల్లాహ్ బిన్ యజీద్ (రజి) మృతదేహాన్ని దాని కాళ్ల వైపు నుంచి సమాధిలో దించారు. ఇదే సాంప్రదాయిక పద్ధతి (సున్నత్) అని కూడా ఆయన అన్నారు." (అబూదావూద్)

### సారాంశం

కాళ్ల వైపు నుంచి మృత దేహాన్ని గోరీలోకి దించాలని ఈ హదీసు చెబుతోంది. హిజాజ్ ప్రాంతం వారు ఈ విధానాన్నే అనుసరించేవారు. ఇమామ్ షాఫయి, అహ్మద్‌లు కూడా దీనినే అనుసరించారు. ఇదే ఉత్తమమయిన పద్ధతి. దీనికి భిన్నంగా ప్రామాణికమైన ఉల్లేఖనం ఏదీ ఇంత వరకు లభ్యం కాలేదు.

## హదీసు ఉల్లేఖకులు

1. అబూ ఇస్‌హాఖ్ గారి అసలు పేరు అమ్ర్ బిన్ అబ్దుల్లాహ్ సబ్ యీ హమ్దానీ. కూఫా వాసులు. ప్రఖ్యాత తాబయీలలో ఒకరు. అనేక హదీసులు అందజేశారు. కాని వార్ధక్యంలో మతి భ్రమించింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనా కాలంలో జన్మించారు. హిజ్రీ 129లో కన్నుమూశారు.

2. అబ్దుల్లాహ్ బిన్ యజీద్ (రజి) అన్సార్ వర్గీయులు. ఔస్ తెగకు చెందిన వారు. హుదైబియా ఒప్పందంలో పాల్గొన్నప్పుడు ఈయన వయస్సు 17. జమల్ యుద్ధంలోనూ, సిఫ్ఫీన్ యుద్ధంలోనూ హజ్రత్ అలీ (రజి) పక్షాన ఉన్నారు. కూఫాకు మకాం మార్చారు. ఇబ్నె జుబైర్ (రజి) హయాంలో 'కూఫా' గవర్నర్‌గా కూడా నియమితులయ్యారు. ఆ కాలంలోనే కూఫాలో కన్ను మూశారు.

(٤٦٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «إِذَا وَضَعْتُمْ مَوْتَاكُمْ فِي الْقُبُورِ، فَقُولُوا: بِسْمِ اللهِ، وَعَلَى مِلَّةِ رَسُولِ اللهِ». أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَأَعَلَّهُ الدَّارَقُطْنِيُّ بِالْوَقْفِ.

466. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "మీ మృతులను సమాధులలోకి దించేటప్పుడు 'బిస్మిల్లాహి వ అలా మిల్లతి రసూలిల్లాహి' అని పలకండి." (దీనిని అహ్మద్, అబూ దావూద్, నసాయి వెలికితీశారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు - దారె ఖుత్నీ మాత్రం దీనిని 'మౌఖూఫ్'గా భావించారు)

**సారాంశం**

హదీసులో పేర్కొనబడిన దుఆ మస్నూన్ అనీ, దీనిని మృతులను సమాధిలో దించే సమయంలో పఠించాలనీ ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ దారె ఖుత్నీ (రహ్మలై) ఈ హదీసును నసాయి మాదిరిగా 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు గానీ ఇది సరయినది కాదు. ఎందుకంటే 'ముస్తద్రక్'లోని ఒక ఉల్లేఖనం కూడా ఈ హదీసు ప్రామాణికతను బలపరుస్తున్నది.

(٤٦٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «كَسْرُ عَظْمِ الْمَيِّتِ كَكَسْرِهِ حَيًّا». رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ عَلَى شَرْطِ مُسْلِمٍ، وَزَادَ ابْنُ مَاجَهْ مِنْ حَدِيثِ أُمِّ سَلَمَةَ: «فِي الْإِثْمِ».

467. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చెప్పారు - "ఒక బ్రతికి వున్న మనిషి ఎముకను విరగ్గొట్టడం ఎంతో (ఎంత పాపమో) ఒక మృతుని ఎముకను విరగ్గొట్టడం కూడా అంతే" (దీనిని అబూ దావూద్, 'ముస్లిం' పెట్టిన షరతు ఆధారంగా ఉల్లేఖించారు - ఇబ్నె మాజా ఈ సందర్భంగా ఉమ్మె సలమా-ర. అన్హా-చే ఉల్లేఖించబడిన దానిలో 'పాప కార్యంలో' అన్న పదాన్ని అదనంగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఒక ముస్లిం వ్యక్తి - అతడు చనిపోయినప్పటికీ - ఎంతో మర్యాదకరంగా అతని పట్ల మసలుకోవాలని ఈ హదీసు చెబుతోంది. గౌరవాదరణల విషయానికి వస్తే సజీవునికీ - మృతునికీ మధ్య పెద్దగా వ్యత్యాసం లేదు. అయితే ఆధునిక యుగంలో ఏర్పడిన కొన్ని అత్యవసర, అనివార్య పరిస్థితుల దృష్ట్యా, చట్టపరమైన అవసరాల మూలంగా ధర్మవేత్తలు సర్జరీకి, పోస్టుమార్టంకి అనుమతించారు.

(٤٦٨) وَعَنْ سَعْدِ بْنِ أَبِي وَقَّاصٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أَلْحِدُوا لِيَ لَحْداً وَانْصِبُوا عَلَيَّ اللَّبِنَ نَصْباً، كَمَا صُنِعَ بِرَسُولِ اللهِ ﷺ. رَوَاهُ مُسْلِمٌ.

468. హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) కథనం : ఆయన ఇలా అన్నారు- నా కోసం సమాధిలో చంక మాదిరిగా ప్రక్కనుంచి జాగా తీయండి. దైవ ప్రవక్త (స) సమాధి వలె నా పైన పచ్చి ఇటుకలు, సున్నం పేర్చండి (ముస్లిం)

وَلِلْبَيْهَقِيِّ عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ نَحْوُهُ، وَزَادَ: وَرُفِعَ قَبْرُهُ عَنِ الْأَرْضِ قَدْرَ شِبْرٍ. وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

బైహఖీ గారు కూడా హజ్రత్ జాబిర్ (రజి) సౌజన్యంతో ఈ విధంగానే ఉల్లేఖించారు. అయితే అదనంగా ఈ వాక్యాలను నకలు చేశారు -'ఆయన (సఅసం) సమాధి నేలకు కేవలం ఒక జానెడు ఎత్తు మాత్రమే ఉంచబడింది.' (ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారుచేశారు)

وَلِمُسْلِمٍ عَنْهُ: نَهَى رَسُولُ اللهِ ﷺ، أَنْ يُجَصَّصَ الْقَبْرُ، وَأَنْ يُقْعَدَ عَلَيْهِ، وَأَنْ يُبْنَى عَلَيْهِ.

'ముస్లిం'లో జాబిర్ (రజి) ఉల్లేఖనం ఇలా ఉంది - "సమాధిని పటిష్టవంతం చేయడాన్ని, దానిపై కూర్చోవటాన్ని, దానిపై కట్టడం నిర్మించడాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన దృష్టిలోకి వస్తున్నాయి. అవేమంటే 1) సమాధి ఒక జానెడు కన్నా ఎక్కువ ఎత్తుండరాదు. 2) సమాధి లోపల 'బగ్‌లీ' (డొక్క మాదిరిగా, చంక తరహాలో) చేయటం ఆయన (స)కు ఎంతో ఇష్టం. 3) సమాధిలో పచ్చి ఇటుకలు (లేక నాపరాళ్లు) వంకరగా పేర్చటం మంచిది. 4) సమాధిపై ఏదయినా కట్టడం నిర్మించటం, సమాధిని పటిష్టవంతంగా, అందంగా తీర్చిదిద్దటం నిషిద్ధం. 5) సమాధికి ఒక ప్రత్యేక రూపం ఇచ్చి, దానికొక ప్రత్యేకతను ఆపాదించటం కూడా సమంజసం కాదు. దైవప్రవక్త (సఅసం) గారి శాశ్విత విశ్రాంతి స్థలం కూడా ఒక జానెడు కన్నా ఎక్కువ ఎత్తు ఉండేది కాదు. హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)ల సమాధులు కూడా ఇలాగే ఉండేవి.

469. హజ్రత్ ఆమిర్ బిన్ రబీయ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) నమాజె జనాజాను చేశారు. ఆయన సమాధి వద్దకు విచ్చేసి, నిలబడే మూడు దోసిట్ల మన్ను సమాధిపై వేశారు.
(సునన్ దారె ఖుత్నీ)

(٤٦٩) وَعَنْ عَامِرِ بْنِ رَبِيْعَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى عَلَى عُثْمَانَ ابْنِ مَظْعُونٍ، وَأَتَى الْقَبْرَ، فَحَثَى عَلَيْهِ ثَلَاثَ حَثَيَاتٍ، وَهُوَ قَائِمٌ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ.

**సారాంశం**

అంత్యక్రియలలో పాల్గొన్నవారు, మృతదేహాన్ని సమాధిలో చేర్చిన మీదట తలో మూడు దోసిట్ల మన్ను వేయాలని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది.

**హదీసులోని ప్రముఖ వ్యక్తి**

ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ జుమాహి ఖురషీ (రజి) వృద్ధ సహాబీలలో ఒకరు. గొప్ప దైవభక్తి పరాయణులు, సాధు స్వభావి. అజ్ఞాన కాలంలోనే ఈయన మద్యపానాన్ని తనకోసం హరామ్ గావించుకున్నారు. 13 మంది తరువాత ఇస్లాం స్వీకరించారు. దైవ మార్గంలో రెండు హిజ్రత్‌లు చేశారు. బద్ర్ యుద్ధంలో హాజరయ్యారు. మదీనాలో హిజ్రీ 30వ మాసంలో - షాబాన్‌లో - మరణించారు. ముహాజిర్లలో మరణించిన తొలివ్యక్తి ఈయనే. 'జన్నతుల్ బఖీ'లో ఖననం చేయబడ్డారు. ఈయన మరణించినపుడు దైవప్రవక్త (సఅసం) ఈయన్ని ముద్దుపెట్టుకున్నారు. అంత్యక్రియలు ముగిసిన తరువాత ఆయన గురించి వ్యాఖ్యానిస్తూ దైవప్రవక్త (సఅసం), 'ఆయన మనందరికీ పెద్ద దిక్కు' అన్నారు.

470. హజ్రత్ ఉస్మాన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ మృతదేహాన్ని అయినా ఖననం చేసిన తరువాత సమాధి దగ్గర నిలబడి ఇలా అనేవారు: "మీ సోదరుని క్షమాపణకై అర్థించండి. స్థిరత్వాన్ని ప్రసాదించమని ప్రార్థించండి. ఎందుకంటే ఇప్పుడితను ప్రశ్నించబడతాడు" (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - హాకిమ్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٤٧٠) وَعَنْ عُثْمَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا فَرَغَ مِنْ دَفْنِ الْمَيِّتِ وَقَفَ عَلَيْهِ، وَقَالَ: **اَسْتَغْفِرُوا لِأَخِيْكُمْ، وَسَلُوا لَهُ التَّثْبِيْتَ، فَإِنَّهُ الْآنَ يُسْأَلُ**. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

**సారాంశం**

సమాధిలో మృతులు ప్రశ్నించబడతారన్న దానికి ఈ హదీసు ఒక నిదర్శనం. ఖననం చేసిన తరువాత మృతుని క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించటం సరైనదేనని కూడా ఈ హదీసు చెబుతున్నది. అయితే ఈనాటి ప్రజలు ఈ సంప్రదాయాన్ని విడిచిపెట్టేసి, లేనిపోని కొత్త ఆచారాలను మొదలెట్టారు. చూడబోతే షరీయత్‌లో వాటికి ఎలాంటి చోటులేదు.

(٤٧١) وَعَنْ ضَمْرَةَ بنِ حَبِيبٍ - أَحَدِ التَّابِعِينَ - قَالَ: كَانُوا يَسْتَحِبُّونَ إِذَا سُوِّيَ عَلَى الْمَيِّتِ قَبْرُهُ وَانْصَرَفَ النَّاسُ عَنْهُ، أَنْ يُقَالَ عِنْدَ قَبْرِهِ: يَا فُلاَنُ! قُلْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، ثَلاَثَ مَرَّاتٍ، يَا فُلاَنُ! قُلْ: رَبِّيَ اللَّهُ، وَدِينِي الإِسْلاَمُ، وَنَبِيِّ مُحَمَّدٌ ﷺ. رَوَاهُ سَعِيدُ بْنُ مَنْصُورٍ مَوْقُوفاً، وَلِلطَّبَرَانِيِّ نَحْوُهُ مِنْ حَدِيثِ أَبِي أُمَامَةَ مَرْفُوعاً مُطَوَّلاً.

471. తాబయీన్లలో ఒకరైన హజ్రత్ జమ్రా బిన్ హబీబ్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు - మృతుని సమాధి చదునుగా చేసిన తరువాత, జనులు వెళ్ళిపోతున్నప్పుడు సమాధి వద్ద నిలుచుని, మృతుని సంబోధిస్తూ ఇలా అనటం వాంఛనీయం అని ప్రజలు తలపోసేవారు: "ఓ ఫలానా.... లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరో దైవం లేడు) అని అను. ఇలా మూడు సార్లు చెప్పేవారు. "ఓ ఫలానా.... రబ్బి యల్లాహు (అల్లాహ్ నా ప్రభువు) అనీ, వ దీనీ అల్ ఇస్లాం (ఇస్లాం నా ధర్మం) అనీ, వ నబియ్యీ ముహమ్మద్ (స) (ముహమ్మద్ నా ప్రవక్త) అనీ పలుకు" అని కూడా చెప్పేవారు. (సయీద్ బిన్ మన్సూర్ దీనిని 'మౌఖూఫ్' గా పేర్కొన్నారు. తబ్రానీ దీనిని ఇదే విధంగా అబూ ఉమామ (రజి) నుండి 'మర్ఫూ' హదీసుగా వివరించారు)

**సారాంశం**

ఖననం చేసిన తరువాత, మృతుని సంబోధించి 'ఉపదేశించటం' ఏ సహీహ్ హదీసు ద్వారా కూడా రుజువు కాలేదు. దీని గురించి ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) గారిని ప్రశ్నించగా, ఒక్క సిరియా ప్రజలు తప్ప మరొకరు ఇలా చేయటం తాను చూడలేదని అన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు జమ్రా బిన్ హబీబ్. మారు పేరు అబూ ఉతబా. వంశపరంపర ఈ విధంగా ఉంది :-జమ్రా బిన్ హబీబ్ బిన్ సుహైబ్ జుబైదీ. హిమ్సుకు చెందిన వారవటం చేత హిమ్సీగా పిలువబడ్డారు. విశ్వసనీయులైన తాబయి. నాల్గో తరానికి చెందిన వారు.

(٤٧٢) وَعَنْ بُرَيْدَةَ بنِ الحُصَيْبِ الْأَسْلَمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «كُنْتُ نَهَيْتُكُمْ عَنْ زِيَارَةِ الْقُبُورِ، فَزُورُوهَا». رَوَاهُ مُسْلِمٌ. زَادَ التِّرْمِذِيُّ: «فَإِنَّهَا تُذَكِّرُ الْآخِرَةَ». زَادَ ابْنُ مَاجَهْ مِنْ حَدِيثِ ابْنِ مَسْعُودٍ: «وَتُزَهِّدُ فِي الدُّنْيَا».

472. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ బురైద బిన్ హుసైబ్ అస్లమీ (రజి) తెలిపారు: "నేను మీకు సమాధులను సందర్శించరాదని చెప్పి ఉన్నాను. కాని ఇక నుంచి మీరు వాటిని సందర్శించండి" (ముస్లిం). తిర్మిజీలో ఈ వాక్యం అదనంగా ఉంది : "సమాధుల సందర్శనం పరలోకాన్ని జ్ఞప్తికి తెస్తుంది." ఇబ్నె మాజ గారు ఇబ్నె మస్వూద్ (రజి) ఉల్లేఖనంలో అదనంగా ఈ వాక్యం చేర్చారు- "ఈ సందర్శన ప్రాపంచిక వ్యామోహాన్ని తగ్గిస్తుంది."

**సారాంశం**

సమాధుల సందర్శన ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ప్రారంభ కాలంలో ఆయన (స) సమాధుల సందర్శనను వారించారు. కాని తరువాత ఇందుకు అనుమతించారు. ప్రజాబాహుళ్యంలో పరలోక చింతనను కలిగించడానికి, చనిపోయిన వారి మన్నింపుకై ఇతోధికంగా వేడుకోవటానికి దైవప్రవక్త (స) ఈ అనుమతి ఇచ్చారు. అంతేగాని సమాధుల వద్ద ఉరుసుల పేరుతో తమాషా చేయటానికి, మొక్కుకోవటానికి కాదు. ఈ రకమయిన చేష్టలకు షరీఅత్‌లో ఏ మాత్రం చోటులేదు.

(٤٧٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ لَعَنَ زَائِرَاتِ الْقُبُورِ. أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

473. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధుల సందర్శన నిమిత్తం వెళ్ళే స్త్రీలను ధూత్కరించారు." (దీనిని తిర్మిజీ సేకరించగా ఇబ్నె హిబ్బాన్ ప్రామాణిక హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

స్త్రీలు సమాధుల సందర్శనకై వెళ్ళరాదని ఈ హదీసు చెబుతోంది. సాధారణంగా 'ధూత్కారం' అనేది అధర్మమయిన కార్యం చేసినప్పుడే ప్రయోగించబడుతుంది. మరి కొన్ని హదీసుల ప్రకారం స్త్రీలు సమాధుల్ని సందర్శించవచ్చునని ఉంది. పై హదీసులోని 'వారింపు' సమాధుల సందర్శనకు అనుమతిలేని కాలానికి సంబంధించినదనీ, సమాధుల సందర్శనకు అనుమతి లభించిన తరువాత స్త్రీలు, పురుషులు - అందరికీ ఇది వర్తిస్తుందనీ కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. స్త్రీలు సమాధుల్ని

సందర్శించరాదన్న ప్రవచనం శాశ్వత ప్రాతిపదికతో కూడుకున్నదని మరికొందరు గట్టిగా వాదిస్తున్నారు. దీనికి పండితులు చెప్పే కారణాలేమిటంటే; స్త్రీలలో సాధారణంగా ఈ విషయంలో మటుకు సహనం, సంయమనం చాలా తక్కువగా ఉంటుంది. వాళ్ళు దుఃఖాన్ని ఆపుకోలేరు. గుండెలు బాదుకుంటారు. హాహాకారాలు చేస్తారు. ధర్మానికీ, షరీఅత్‌కు వ్యతిరేకమయిన ఎన్నో పనులకు శ్రీకారం చుట్టేస్తారు. అజ్ఞానానికి, మూర్ఖత్వానికి ప్రతిబింబమైన పనులను మొదలెట్టి సమాధుల సందర్శనా పరమార్థాన్ని మంటగలుపుతారు. అందుకే స్త్రీలు సమాధులను సందర్శించటాన్ని ప్రవక్త (స) తీవ్రంగా వారించారు. గుణపాఠం గరపే, పరలోక భీతిని పెంపొందించుకునే ఉద్దేశ్యంతో సమాధులను సందర్శిస్తే తప్పులేదు. సహీహ్ హదీసులో 'జవ్వారాత్' అనే పదం వచ్చిందనీ, దీని అర్థం అత్యధికంగా స్త్రీలు ఖనన వాటికకు వెళ్ళటంపై ఆయన (స) ధూత్కరించారనీ, గుణపాఠం కొరకు వెళితే ఫరవాలేదనీ అల్లామా షౌకానీ (రహ్మ.లై) వ్యాఖ్యానించారు. అల్లామా అల్-బానీ కూడా దాదాపు ఈ విధంగానే అభిప్రాయపడ్డారు.

(٤٧٤) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ النَّائِحَةَ وَالْمُسْتَمِعَةَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ.

474. హ॥జత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "మరణించిన వారి పేరున అరుపులు కేకలతో ఏడ్చే వారినీ, అలాంటి వాటిని ఏర్పాటుచేసి మరీ వినే వారినీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధూత్కరించారు." (అబూదావూద్)

**సారాంశం**

అజ్ఞాన కాలంలో అరబ్బులు ప్రత్యేకంగా ప్రొఫెషనల్స్‌ని పిలిచి మరీ ఈ మేరకు ఏర్పాట్లు చేసేవారు. బుర్రకథ, సోది తరహాలో ఆడవాళ్లు మృతుని గుణగణాలను, ఘనకార్యాలను జ్ఞాపకం చేసి గొల్లున ఏడ్చేవారు. హాహాకారాలు చేసేవారు. మృతుని పేరు మీద ఎంత ఎక్కువగా రోదిస్తే అతని ఆత్మ శాంతికి అంతగా మంచిదని నమ్మేవారు. ఇలాంటి మూఢాచారాలను దైవప్రవక్త (స) నివారించటమే గాక, వీటికి పాల్పడే వారిని ధూత్కరించారు.

దుఃఖంతో కళ్ళు చెమర్చటం, కళ్లలోంచి ధారాపాతంగా నీరు ప్రవహించటంలో అభ్యంతరం ఏమీలేదు. కాని నోటి ద్వారా మాత్రం సభ్యతా సంస్కారాలకు విరుద్ధమైన మాటలు ఆ సమయంలో వ్యక్తం కారాదు. శ్రేష్ఠ సమాజం మర్యాదను మంటగలిపే చేష్టలు కూడా చేయరాదు.

(٤٧٥) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَخَذَ عَلَيْنَا رَسُولُ اللهِ ﷺ أَنْ لاَّ نَنُوحَ. مُتَّفَقٌ عَلَيْهِ.

475. హ॥జత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో బైత్ (ప్రమాణం లేక ప్రతిజ్ఞ) చేసిన సందర్భంగా - మృతుని పేర పెద్దపెట్టున అరుస్తూ ఏడవరాదని కూడా మా చేత వాగ్దానం చేయించుకున్నారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇంట్లో ఎవరయినా మరణిస్తే, ప్రళయాన్ని సృష్టించేలా గొడవచేయటం, పెడబొబ్బలు పెట్టడం, బట్టలు చించుకోవటం, రొమ్ములపై బాదుకోవటం, జడలు విప్పి తాండవమాడటం నిషిద్ధం. ఈ చేష్టలకు దూరంగా ఉండాలని మహాప్రవక్త (స) ఆడవారికి ప్రత్యేకంగా తాకీదు చేయటమే గాకుండా, ఆ మేరకు ప్రమాణం కూడా చేయించుకునేవారు.

(٤٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «الْمَيِّتُ يُعَذَّبُ فِي قَبْرِهِ بِمَا نِيحَ عَلَيْهِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلَهُمَا نَحْوُهُ عَنِ الْمُغِيرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ.

476. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "చనిపోయిన వానికి అతనిపై రోదించే వారి కారణంగా సమాధిలో యాతనకు గురిచేయటం జరుగుతుంది." (బుఖారీ, ముస్లిం - వీరిరువురూ ముగీరా బిన్ షూబ ఆధారంగా కూడా సరిగ్గా ఇదే విధంగా ఉల్లేఖనాన్ని విశదీకరించారు)

(٤٧٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ بِنْتاً لِلنَّبِيِّ ﷺ تُدْفَنُ، وَرَسُولُ اللّٰهِ ﷺ جَالِسٌ عِنْدَ الْقَبْرِ، فَرَأَيْتُ عَيْنَيْهِ تَدْمَعَانِ. رَوَاهُ الْبُخَارِيُّ.

477. హజ్రత్ అనస్ (రజి) కథనం : "నేను దైవప్రవక్త (సఅసం)వారి పుత్రిక ఒకామె అంత్యక్రియలకు అక్కడే (సమాధి వద్ద) ఉన్నాను. దైవప్రవక్త (సఅసం) సమాధి వద్ద కూర్చుని ఉన్నారు. ఆయన (స) రెండు కళ్ళనుంచీ కన్నీళ్లు ప్రవహించటం నేను చూశాను." (బుఖారీ)

**సారాంశం**

మృతుని ముందు ఏడుపు రావటం సహజం. కాని గొల్లున - బిగ్గరగా - ఏడవటం మాత్రం సమ్మతం కాదు. శోకంతో కళ్లగుండా కన్నీరు రావటం కూడా సహజమే. దైవప్రవక్త (సఅసం) కుమారుడు హజ్రత్ ఇబ్రాహీం (రజి) చనిపోయిన సందర్భంగా ఆయన (స) కళ్లల్లోనుంచి కన్నీరు ప్రవహించసాగింది. "దైవప్రవక్తా (స)! తమరు కూడా ఏడుస్తున్నారా?" అని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆశ్చర్యం వెలిబుచ్చగా, "ఇది అసహనంతో కూడిన ఏడుపు కాదు సుమా! అనురాగంతో, వాత్సల్యంతో ఉబికివస్తున్న కన్నీళ్లు మాత్రమే" అని ఆయన (స) సమాధానమిచ్చారు.

(٤٧٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لاَ تَدْفِنُوا مَوْتَاكُمْ بِاللَّيْلِ إِلاَّ أَنْ تُضْطَرُّوا إِلَيْهِ». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ، لَكِنْ قَالَ: زَجَرَ أَنْ يُقْبَرَ الرَّجُلُ فِي اللَّيْلِ حَتَّى يُصَلَّى عَلَيْهِ.

478. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా తాకీదు చేశారు: "మీ మృతులను గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడితేతప్ప రాత్రిపూట ఖననం చేయకండి" (ఇబ్నెమాజ). దీని మూలం 'ముస్లిం'లో ఉంది. జనాజా నమాజ్ చేయబడి ఉంటే తప్ప - రాత్రిపూట ఖననం చేయటంపై ఆయన (స) మంద లించారని అందులో ఉంది.

**సారాంశం**

రాత్రిపూట అంత్యక్రియలు జరిపే పక్షంలో క్రియలు సక్రమంగా జరగవేమో, కఫన్ సరిగ్గా చుట్టలేకపోతారేమోనన్న ఉద్దేశ్యంతో బహుశా వారించి ఉంటారు. అయితే మృతుని నమాజె జనాజా పగటిపూటే చేసివుంటే లేదా ఏదయినా తప్పనిసరి కారణంపై రాత్రిపూటే ఖననం చేయవలసి వుంటే అప్పుడు ఫరవాలేదు. గమనార్హమైన విషయం ఏమిటంటే దైవప్రవక్త (స) పుత్రిక అయిన ఫాతిమ (ర.అన్హా) అంత్యక్రియలు రాత్రివేళే జరిగాయి. హజ్రత్ అబూబక్ర్ (రజి) కూడా రాత్రిపూటే ఖననం చేయబడ్డారు. దైవప్రవక్త (స) ఖుద్దుగా ఒక సహచరుని అంత్యక్రియలు రాత్రివేళ జరిపారు - (తిర్మిజీ, ఇబ్నె మాజ). ఇలాంటివే మరికొన్ని హదీసుల వెలుగులో చూస్తే ఏదైనా ప్రత్యేక కారణం లేకపోయినప్పటికీ రాత్రివేళ ఖననం చేయవచ్చని బోధపడుతున్నది. అత్యధికమంది ధర్మవేత్తల దృక్పథం కూడా ఇదే. కాని ఇమామ్ హసన్ బస్రీ, సయీద్ బిన్ ముసయ్యిబ్, ఇబ్నె హజమ్ ప్రభృతులు మాత్రం అకారణంగా రాత్రిపూట అంత్యక్రియలు జరపటం అవాంఛనీయం (మక్రూహ్) అని అంటున్నారు.

(٤٧٩) وَعَنْ عَبْدِ اللهِ بْنِ جَعْفَرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: لَمَّا جَاءَ نَعْيُ جَعْفَرٍ، حِينَ قُتِلَ، قَالَ رَسُولُ اللهِ ﷺ، «اِصْنَعُوا لِآلِ

479. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ (రజి) కథనం: జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) అమరగతి నొందిన వార్త అంది నపుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు : "జాఫర్ (రజి) ఇంటివారల కోసం భోజనం తయారు చేయండి. వారికి అందిన వ్యధాభరిత

جَعْفَرٍ طَعَاماً، فَقَدْ أَتَاهُمْ مَا يَشْغَلُهُمْ». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

మయిన కబురు వాళ్లను (ఈ రోజు) వంట చేయనివ్వదు." (నసాయి తప్ప 'ఐదుగురి'లో మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు)

**సారాంశం**

బంధువుల్లో, ఇరుగుపొరుగువారిలో ఎవరయినా మరణిస్తే, మృతుని కుటుంబీకులకు భోజనం తయారుచేసి పంపటం మస్నూన్ (సంప్రదాయం). పొరుగువారు ఈ బాధ్యతను గుర్తెరగాలి. భోజనం ఆ కుటుంబీకులకు, మృతుని చూడటానికి దూరప్రాంతాలనుంచి వచ్చిన వారికి చేయిస్తే సరిపోతుంది. ఇరుగుపొరుగు వారికోసం అక్కరలేదు. వారు స్థానికులే గనక కేవలం అంత్య క్రియలలో పాల్గొంటారు.

మృతుని ఇంట ఆ రోజు అందరూ శోకంలో మునిగి ఉంటారు. ఆ విచారంలో వారికి అన్న పానీయాల ధ్యాస కూడా ఉండదు. అయితే వారిని వారి మానాన వదలిపెట్టడం మర్యాద అనిపించు కోదు. కష్టకాలంలో సాటి సోదరుని మంచీ చెబ్బరలను అడిగి తెలుసుకోవటం, వాళ్ల అక్కరలను తీర్చటం మానవ ధర్మం. అందునా బంధుమిత్రులపై, ఇరుగుపొరుగు వారిపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది.

**హదీసు ఉల్లేఖకులు**

జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి). ఈయన అబూ తాలిబ్ గారి కుమారులు. హజ్రత్ అలీ (రజి) సోదరుడు. అలీ (రజి) కన్నా పదేళ్ల పెద్దవారు. తొలుత అబిసీనియా వైపునకు వలసవెళ్లారు. అక్కడే స్థిరపడ్డారు. నజ్జాషీ చక్రవర్తి ఈయన చేతుల మీదుగానే ఇస్లాం స్వీకరించాడు. తరువాత ఈయన మదీనాకు వచ్చారు. ఖైబర్ విజయం వరించిన నాడు అక్కడికి (ఖైబర్‌కు) చేరుకున్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన రెండు కళ్ల మధ్యభాగంలో ముద్దుపెట్టుకుని, "ఈ రోజు నాకెంతో ఆనందంగా ఉంది, అది జాఫర్ రాక వల్లనో, ఖైబర్ విజయం వల్లనో మరి" అని వ్యాఖ్యానించారు. జాఫర్‌గారు గొప్ప దాతృగుణం కలవారు. హిజ్రీ 8లో 'మౌతా' యుద్ధంలో వీరమరణం పొందారు. ఈ యుద్ధంలో ఈయన ముస్లిం సేనలకు సారథ్య బాధ్యతలు వహించారు. రెండు భుజాలు తెగి శరీరం నుండి వేరైపోయాయి. "అల్లాహ్ ఈయన రెండు చేతులకు బదులుగా రెండు రెక్కలను తగిలించాడు. వీటితో ఆయన స్వర్గంలో తాను కోరుకున్నచోటికి ఎగిరిపోవచ్చు" అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.

(٤٨٠) وَعَنْ سُلَيْمَانَ بْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيهِ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَلِّمُهُمْ إِذَا خَرَجُوا إِلَى الْمَقَابِرِ، أَنْ يَقُولُوا: السَّلاَمُ عَلَى

480. హజ్రత్ సులైమాన్ బిన్ బురైద (రహ్మ.లై) తన తండ్రి ఆధారంగా ఇలా తెలిపారు - సహాబీలు ఖబరస్తాన్ (ఖనన వాటిక)కు వెళ్ళినపుడు ఈ విధంగా పలకమని దైవప్రవక్త (సఅసం) వారికి

أَهْلِ الدِّيَارِ مِنَ الْمُؤْمِنِيْنَ وَالْمُسْلِمِيْنَ، وَإِنَّا إِنْ شَاءَ اللّٰهُ بِكُمْ لَاحِقُونَ، نَسْأَلُ اللّٰهَ لَنَا وَلَكُمُ الْعَافِيَةَ. رَوَاهُ مُسْلِمٌ.

చెప్పేవారు - 'ఓ ఇంటివారలారా! (సమాధివారలారా!) మీపై శాంతికలుగు గాక! మీరు విశ్వాసులు మరియు ముస్లింల లోనివారు. దైవచిత్తమయితే మేము కూడా వచ్చి మీతో చేరిపోతాము. మేము మాకోసం, మీకోసం కూడా అల్లాహ్ నుండి సౌఖ్యాన్ని అర్థిస్తున్నాము.'' (ముస్లిం)

## సారాంశం

ఖబరస్తాన్‌కు వెళ్ళటం, సమాధులలో ఉన్న మృతులకోసం మరియు మన క్షమాపణ కోసం కూడా దైవాన్ని వేడుకోవటం సంప్రదాయం అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ వేడుకోలు కేవలం విశ్వాసుల, ముస్లింల కోసమే!

## హదీసు ఉల్లేఖకులు

సులైమాన్ బిన్ బురైద (రజి) ప్రఖ్యాత తాబయి. ఇబ్నె ముయీన్, అబూ హాతిమ్ ప్రభృతులు ఈయన్ని విశ్వసనీయులైన, ఎన్నదగిన వ్యక్తిగా పేర్కొన్నారు. 'ఈయన తన తండ్రి నుంచి హదీసు విన్నట్టు ఎక్కడా ప్రస్తావించబడలేద'ని ఇమామ్ హాకిమ్, ఇమామ్ బుఖారీ అంటున్నారు. అయితే ఈయన తన తండ్రి నుంచి సంగ్రహించిన హదీసులనేకం 'ముస్లిం'లో పొందుపరచబడి ఉన్నాయని ఖజ్రజీ చెప్పారు.

(٤٨١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَرَّ رَسُولُ اللّٰهِ ﷺ بِقُبُورِ الْمَدِيْنَةِ فَأَقْبَلَ عَلَيْهِمْ بِوَجْهِهِ، فَقَالَ: «السَّلَامُ عَلَيْكُمْ، يَا أَهْلَ الْقُبُورِ! يَغْفِرُ اللّٰهُ لَنَا وَلَكُمْ، أَنْتُمْ سَلَفُنَا، وَنَحْنُ بِالْأَثَرِ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَقَالَ: حَسَنٌ.

481. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాలోని ఖబరస్తాన్ వైపు నుంచి వెళుతూ అటువైపు తిరిగి ఇలా అన్నారు - ''ఓ సమాధివాసులారా! మీపై శాంతి వర్షించుగాక! అల్లాహ్ మమ్మల్నీ మరియు మిమ్మల్నీ మన్నించుగాక! మీరు మాకన్నా ముందు వెళ్ళిపోయారు. మేము మీ వెనుకేవస్తున్నాము.'' (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - ఈ హదీసును 'హసన్'గా ఖరారు చేశారు)

(٤٨٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «لَا تَسُبُّوا الْأَمْوَاتَ، فَإِنَّهُمْ قَدْ أَفْضَوْا إِلَى مَا قَدَّمُوا». رَوَاهُ الْبُخَارِيُّ، وَرَوَى التِّرْمِذِيُّ عَنِ الْمُغِيرَةِ نَحْوَهُ، لَكِنْ قَالَ: «فَتُؤْذُوا الْأَحْيَاءَ».

482. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు - "మృతులను దూషించకండి. ఎందుకంటే వాళ్లు (తమ కొరకు) ఏదయితే (ముందుగానే) పంపు కున్నారో దాన్ని వాళ్లు పొందారు." (బుఖారీ) తిర్మిజీ కూడా ముగీరా సౌజ న్యంతో ఈ విధంగానే ఉల్లేఖించారు. అయితే "దూషణల ద్వారా మీరు బ్రతికి ఉన్నవారికి బాధకలిగిస్తారు" అని అందులో ఉంది.

**సారాంశం**

చనిపోయిన వారిని తిట్టడం, వాళ్ల పనులను గుర్తుచేసి అవమానకరంగా మాట్లాడటం ఎంతమాత్రం సమంజసం కాదు, ఎందుకంటే ఎవరి కర్మలు వారివెంట ఉంటాయి. దైవవిరోధి అయిన అబూలహబ్ కుమార్తె దుర్ర ఇస్లాం స్వీకరించింది. 'దైవ తిరస్కారి కూతురు ముస్లిమా?!' అని కొంతమందిలో గుసగుసలు మొదలయ్యాయి. ఆమె ఈ విషయాన్ని దైవప్రవక్త (స) కు ఫిర్యాదు చేయగా ఆయన (స) "చనిపోయినవారిని తిట్టకండి. దీనివల్ల ఇస్లాం స్వీకరించినవారి సంతతి మనసు నొచ్చుకుంటుంది" అని అన్నారు. (ముస్నద్ అహ్మద్)

ముస్లింల సమక్షంలో అవిశ్వాసులైన వారి పూర్వీకులను దూషించటమే ఇంత తీవ్రమయిన విషయమైనపుడు, ముస్లింలలోని ప్రముఖులను, విద్వాంసులను దూషించటం ఇంకెంత తీవ్రమయిన విషయమో ఆలోచించండి!

# 4. జకాత్ పుస్తకం

## ٤ - كِتَابُ الزَّكَاةِ

(٤٨٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ مُعَاذاً رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ إِلَى الْيَمَنِ، فَذَكَرَ الْحَدِيثَ، وَفِيهِ: «**إِنَّ اللَّهَ قَدْ افْتَرَضَ عَلَيْهِمْ صَدَقَةً فِي أَمْوَالِهِمْ، تُؤْخَذُ مِنْ أَغْنِيَائِهِمْ، فَتُرَدُّ عَلَى فُقَرَائِهِمْ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

483. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ను యమన్ వైపునకు సాగనంపారు. తరువాత హదీసునంతటినీ వివరించారు. అందులో ఇలా వుంది: ''అల్లాహ్ తరఫున వారి సంపదలపై 'జకాత్' విధించబడింది. అది వారి స్థితిమంతుల నుండి వసూలు చేయబడి వారిలోని అగత్యపరులలో, పేదలలో పంచిపెట్టబడాలి.'' (బుఖారీ)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) కాలంలో ధనవంతులనుండి జకాత్‌ను వసూలుచేసి అధికార స్థాయిలో హక్కుదారులకు (అగత్యపరులకు) పంపిణీ చేసే వ్యవస్థ ఏర్పడిందని ఈ హదీసు ద్వారా తేటతెల్ల మవుతోంది. ఏ ప్రాంతంలో జకాత్ వసూలు చేయబడుతుందో ఆ ప్రాంతంలోని పేదలకు, నిరాధార జీవులకే అది పంచిపెట్టబడటం న్యాయం అన్న విషయం కూడా దీనిద్వారా అవగతమవుతున్నది. ఒకవేళ అక్కడ జకాత్ పంపిణీ అయ్యాక కూడా మిగిలి ఉంటే అప్పుడు ఇతర ప్రాంతాలలోని హక్కు దారులకు ఇవ్వవచ్చు. 'జకాత్' అనేది పేదల హక్కు. దాన్ని చెల్లించటం శ్రీమంతుల బాధ్యత. జకాత్‌ను చెల్లించి వారు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తున్నారే తప్ప ఒకరిపై ఉపకారం ఏమీ చేయటం లేదని గ్రహించాలి.

(٤٨٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أن أبا بكر رضي الله عنه كَتَبَ لَهُ: هٰذِهِ فَرِيضَةُ الصَّدَقَةِ، الَّتِي فَرَضَهَا رَسُولُ اللهِ ﷺ عَلَى الْمُسْلِمِينَ، وَالَّتِي أَمَرَ اللَّهُ بِهَا رَسُولَهُ: «فِي كُلِّ أَرْبَعٍ وَعِشْرِينَ مِنَ الإِبِلِ فَمَا دُونَهَا الْغَنَمُ: فِي كُلِّ خَمْسٍ شَاةٌ، فَإِذَا بَلَغَتْ خَمْساً

484. హజ్రత్ అనస్ (రజి) కథనం : హజ్రత్ అబూబక్ర్ (రజి) హజ్రత్ అనస్ (రజి)కు జకాత్ విధికి సంబంధించి (క్షుణ్ణంగా) ఒక పత్రం వ్రాసి ఇచ్చారు. వాస్తవానికి అది దైవప్రవక్త (సఅసం) ముస్లింలపై విధించిన పద్ధతి. ఆ మేరకు అల్లాహ్ తన ప్రవక్త (స)కు ఆజ్ఞాపించి ఉన్నాడు. (ఆ సూచనా పత్రంలో ఇలా

وَعِشْرِينَ إِلَى خَمْسٍ وَثَلاَثِينَ، فَفِيهَا بِنْتُ مَخَاضٍ أُنْثَى، فَإِنْ لَّمْ تَكُنْ فَابْنُ لَبُونٍ ذَكَرٌ. فَإِذَا بَلَغَتْ سِتًّا وَثَلاثِينَ، إِلَى خَمْسٍ وَأَرْبَعِينَ فَفِيهَا بِنْتُ لَبُونٍ أُنْثَى. فَإِذَا بَلَغَتْ سِتًّا وَأَرْبَعِينَ، إِلَى سِتِّينَ، فَفِيهَا حِقَّةٌ طَرُوقَةُ الْجَمَلِ. فَإِذَا بَلَغَتْ وَاحِدَةً وَسِتِّينَ، إِلَى خَمْسٍ وَسَبْعِينَ، فَفِيهَا جَذَعَةٌ. فَإِذَا بَلَغَتْ سِتًّا وَسَبْعِينَ، إِلَى تِسْعِينَ، فَفِيهَا بِنْتَا لَبُونٍ. فَإِذَا بَلَغَتْ إِحْدَى وَتِسْعِينَ، إِلَى عِشْرِينَ وَمِائَةٍ، فَفِيهَا حِقَّتَانِ طَرُوقَتَا الْجَمَلِ. فَإِذَا زَادَتْ عَلَى عِشْرِينَ وَمِائَةٍ، فَفِي كُلِّ أَرْبَعِينَ بِنْتُ لَبُونٍ، وَفِي كُلِّ خَمْسِينَ حِقَّةٌ. وَمَنْ لَّمْ يَكُنْ مَعَهُ إِلاَّ أَرْبَعٌ مِنَ الإِبِلِ، فَلَيْسَ فِيهَا صَدَقَةٌ، إِلاَّ أَنْ يَشَاءَ رَبُّهَا. وَفِي صَدَقَةِ الْغَنَمِ، فِي سَائِمَتِهَا: إِذَا كَانَتْ أَرْبَعِينَ، إِلَى عِشْرِينَ وَمِائَةٍ شَاةٍ، شَاةٌ. فَإِذَا زَادَتْ عَلَى عِشْرِينَ وَمِائَةٍ إِلَى مِائَتَيْنِ، فَفِيهَا شَاتَانِ. فَإِذَا زَادَتْ عَلَى

లిఖించబడింది) : ఒంటెలు 24 లేక అంతకన్నా తక్కువగా ఉంటే వాటిపై మేకలను (జకాత్‌గా) ఇవ్వవలసి ఉంటుంది. ప్రతి 5 ఒంటెలకు గాను ఒక మేక. ఒంటెల సంఖ్య 25కు మించి 35 వరకు ఉంటే వాటిపై ఏడాది వయసున్న ఒక ఆడ ఒంటెను ఇవ్వాలి. అది గనక లేకుంటే రెండేళ్ల మగ ఒంటెను ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 36 నుండి 45 వరకు ఉంటే రెండేళ్ల ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 46నుండి 60 వరకు ఉంటే మూడేళ్ల ఒంటెతో సంపర్కం చేయగల ఆడ ఒంటెను ఇవ్వాలి. ఈ సంఖ్య 61 నుండి 75 వరకు ఉంటే అందులో నుంచి నాలుగేళ్ల ఒంటెను సమర్పించుకోవాలి. ఒంటెల సంఖ్య 75కు మించి 90 వరకు చేరుకుంటే వాటిలో నుంచి రెండేళ్ల వయసున్న రెండు ఆడ ఒంటెలు ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 91 నుండి 120 వరకు ఉంటే అప్పుడు మూడేళ్ల వయస్సున్న, మగ ఒంటెతో జతకట్టగల రెండు పడుచు ఆడ ఒంటెల్ని ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 120 కి మించిపోతే అప్పుడు ప్రతి నలభై ఒంటెలపై రెండేళ్ల ఒక ఆడ ఒంటెను, ప్రతి 50 ఒంటెలపై మూడేళ్ల ఒక ఆడ ఒంటెను ఇచ్చుకోవాలి. కేవలం నాలుగు ఒంటెలు మాత్రమే కలిగి ఉన్నవారిపై ఎలాంటి జకాత్ లేదు. ఒకవేళ యజమాని ఇవ్వదలచుకుంటే అది అతని ఇష్టం.

مِائَتَيْنِ، إِلَى ثَلاَثِمَائَةٍ، فَفِيْهَا ثَلاَثُ شِيَاهٍ. فَإِذَا زَادَتْ عَلَى ثَلاَثِمَائَةٍ، فَفِيْ كُلِّ مِائَةٍ، شَاةٌ. فَإِذَا كَانَتْ سَائِمَةُ الرَّجُلِ نَاقِصَةً عن أَرْبَعِيْنَ شَاةً، شَاةً، وَّاحِدَةً، فَلَيْسَ فِيْهَا صَدَقَةٌ، إِلاَّ أَنْ يَّشَاءَ رَبُّهَا، وَلاَ يُجْمَعُ بَيْنَ مُتَفَرِّقٍ، وَلاَ يُفَرَّقُ بَيْنَ مُجْتَمِعٍ، خَشْيَةَ الصَّدَقَةِ. وَمَا كَانَ مِنَ خَلِيْطَيْنِ، فَإِنَّهُمَا يَتَرَاجَعَانِ بَيْنَهُمَا بِالسَّوِيَّةِ. وَلاَ يُخْرَجُ فِي الصَّدَقَةِ هَرِمَةٌ، وَلاَ ذَاتُ عَوَارٍ، وَلا تَيْسٌ، إِلاَّ أَنْ يَشَاءَ الْمُصدِّقُ. وَفِي الرِّقَةِ:

మేకల జకాత్ ఈ విధంగా ఉంది: బయట మేతమేసే మేకలు 40 నుండి 120 వరకు ఉంటే కేవలం ఒక మేక మాత్రమే జకాత్‌గా వసూలు చేయబడు తుంది. ఈ సంఖ్య 121 నుండి 200 వరకు ఉంటే రెండు మేకలు జకాత్‌గా వసూలు చేయబడతాయి. మేకల సంఖ్య 201 నుండి 300 వరకు పెరిగితే అప్పుడు మూడు మేకలు జకాత్ రూపేణా తీసుకోవటం జరుగుతుంది. ఈ సంఖ్య 300 దాటితే ప్రతి నూరు మేకలపై ఒక మేక జకాత్‌గా వసూలు చేయబడుతుంది. బహిరంగ స్థలాలలో మేతమేసే మేకల సంఖ్య 40 కన్నా కేవలం ఒకటి తక్కువవున్నా వాటి యజ మానిపై జకాత్ బాధ్యతలేదు. ఒకవేళ యజమాని తన ఇష్టపూర్వకంగా ఏదన్నా ఇచ్చుకుంటే అది వేరేవిషయం. జకాత్ భయంతో వేర్వేరుగా మేత మేసే పశువు లను ఒక చోట సమీకరించటం గానీ, ఒకే మందను అనేక మందలుగా విభజించటంగానీ చేయరాదు. ఇద్దరు వ్యక్తులు కలసి - ఉమ్మడిగా - మేకల్ని పోషిస్తున్నప్పుడు జకాత్ వారిరువురి నుండి చెరి సమానంగా వసూలు చేయాలి. జకాత్ పద్దులో ముసలి మేక లను గానీ, ఒంటికన్నుగల పశువులను గానీ, కేవలం పోతును గానీ తీసుకో రాదు. జకాత్ ఇచ్చే వ్యక్తి పరిస్థితిని అర్థం చేసుకుని వసూలు చేసే వ్యక్తి సడలిం పుల వైఖరిని అవలంబిస్తే అది వేరే విషయం.

فِي مِائَتَي دِرْهِمٍ، رُبْعُ الْعُشْرِ، فَإِنْ لَّمْ تَكُنْ إِلاَّ تِسْعِيْنَ وَمِائَةً، فَلَيْسَ فِيْهَا صَدَقَةٌ، إِلاَّ أَن يَشَاءَ رَبُّهَا. وَمَنْ بَلَغَتْ عِنْدَهُ مِنَ الْإِبِلِ صَدَقَةُ الْجَذَعَةِ، وَلَيْسَتْ عِنْدَهُ جَذَعَةٌ، وَعِنْدَهُ حِقَّةٌ، فَإِنَّهَا تُقْبَلُ مِنْهُ الْحِقَّةُ، وَيَجْعَلُ مَعَهَا شَاتَيْنِ إِنِ اسْتَيْسَرَتَا لَهُ، أَوْ عِشْرِيْنَ دِرْهَماً. وَمَنْ بَلَغَتْ عِنْدَهُ صَدَقَةُ الْحِقَّةِ، وَلَيْسَتْ عِنْدَهُ الْحِقَّةُ، وَعِنْدَهُ الْجَذَعَةُ. فَإِنَهَا تُقْبَلُ مِنْهُ الْجَذَعَةُ، وَيُعْطِيْهِ الْمُصَدِّقُ عِشْرِيْنَ دِرْهَماً أَوْ شَاتَيْنِ.
رَوَاهُ الْبُخَارِيُّ.

వెండి జకాత్ ఈ విధంగా ఉంది: 200 వెండి దిర్హమ్‌లుంటే వాటిపై 40వ వంతును జకాత్‌గా ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ ఎవరి వద్దయినా రెండు వందల దిర్హములకన్నా ఒక్క దిర్హమ్ తక్కువ వున్నా అతనిపై జకాత్ తప్పనిసరి (వాజిబ్) కాదు. ఒకవేళ ఇవ్వదలచుకుంటే అది అతని ఇష్టం.

ఎవరి వద్దనుంచి నాలుగేళ్ల వయస్సుగల ఒంటె జకాత్ రూపేణా వసూలు కావలసి ఉన్నదో, అతనివద్ద గనక నాలుగేళ్ల ఒంటె లేకపోయినట్లయితే అప్పుడతని నుండి మూడేళ్ల వయస్సున్న పడుచు ఆడ ఒంటె మరియు రెండు మేకలు తీసుకోబడతాయి. అయితే ఆ ఆడ ఒంటె మగ ఒంటెతో సంపర్కానికి యోగ్యంగా ఉండాలి. రెండు మేకలు కూడా సులభంగా లభ్యమైతేసరి, లేకుంటే 20 దిర్హమ్‌లు ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ మూడేళ్ల ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వవలసిన వానివద్ద ఆ వయస్సున్న ఆడ ఒంటె లేకపోయినట్లయితే - అతని దగ్గర నాలుగేళ్ల మగ ఒంటె ఉంటే - ఆ మగ ఒంటెనే తీసుకోవటం జరుగుతుంది. అట్టి పరిస్థితిలో జకాత్‌ను వసూలుచేసిన వ్యక్తి అతనికి 20 దిర్హములుగానీ, రెండు మేకలను గానీ వాపసు చేయవలసి ఉంటుంది.

(బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసులో ధనరూపంలో, పశువుల రూపంలో వసూలు చేయవలసిన జకాత్ తప్సీళ్లు వచ్చాయి. పశువుల వయస్సును, వాటి తరహాను క్షుణ్ణంగా పేర్కొనటంతోపాటు జకాత్ వ్యవస్థ యొక్క రూపురేఖలు స్థూలంగా తెలుపబడ్డాయి. ఈ సందర్భంగా యజమానికి అన్యాయం చేయటంగానీ, ప్రభుత్వాన్ని మోసగించటంగానీ జరగకూడదని చెప్పబడింది. అన్ని రకాల పశువులపై జకాత్ లేదు, కేవలం పొలాలలో, మైదానాలలో గడ్డిమేసే పశువులపై మాత్రమే జకాత్ విధించబడింది.

(٤٨٥) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَهُ إِلَى الْيَمَنِ، فَأَمَرَهُ أَنْ يَأْخُذَ مِنْ كُلِّ ثَلاَثِيْنَ بَقَرَةً تَبِيْعاً أَوْ تَبِيْعَةً، وَمِنْ كُلِّ أَرْبَعِيْنَ مُسِنَّةً، وَمِنْ كُلِّ حَالِمٍ دِيْنَاراً، أَوْ عَدْلَه مَعَافِرِيّاً. رَوَاهُ الْخَمْسَةُ، وَاللَّفْظُ لِأَحْمَدَ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَأَشَارَ إِلَى اخْتِلاَفٍ فِيْ وَصْلِهِ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

485. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తనను యమన్ ప్రాంతానికి (పర్యవేక్షకునిగా) పంపిస్తూ ఇలా ఆదేశించారు - “30 ఆవులపై ఒక ఏడాది వయసున్న ఆడ ఆవుదూడను లేదా మగ ఆవుదూడను (జకాత్‌గా) వసూలు చేయాలి. ప్రతి నలభై ఆవులపై రెండేళ్ల వయస్సున్న గిత్తను తీసుకోవాలి. ప్రతి యుక్త వయస్కుడైన వ్యక్తి నుంచి (అవిశ్వాసి నుంచి జిజ్‌యాగా) ఒక దీనార్‌గానీ, మాఫిరీ (యమన్‌లో తయారైన) దుప్పటిగానీ పుచ్చుకోవాలి.” (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం అహ్మద్‌లోనివి. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు. ఇది ‘మౌసూల్’ అన్న విషయంలో అభిప్రాయభేదం ఉంది - ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణికమైన హదీసుగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసులో ఆవులకు సంబంధించిన జకాత్‌తోపాటు, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల ‘జిజ్‌యా’కు సంబంధించిన వివరాలు కూడా ఉన్నాయి. గేదెల విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుందని ధర్మవేత్తలు నిర్ణయించారు.

(٤٨٦) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «تُؤْخَذُ صَدَقَاتُ الْمُسْلِمِينَ عَلَى مِيَاهِهِمْ». رَوَاهُ أَحْمَدُ. وَلِأَبِي دَاوُدَ: «وَلاَ تُؤْخَذُ صَدَقَاتُهُمْ إِلاَّ فِي دُورِهِمْ».

486. హ(జత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, మరి ఆయనేమో తన తాతగారి నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: "ముస్లింల నుంచి జకాత్ సొమ్ము వారు (పశువులను) నీరు త్రాగించే చోట వసూలు చేయబడుతుంది" (అహ్మద్). 'ముస్లింల సదఖాలు వారి ఇళ్లవద్దనే వసూలు చేయబడతాయ'ని అబూ దావూద్‌లోని ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

జకాత్ వసూళ్లకై నియమించబడిన అధికారులు స్వయంగా ప్రజల వద్దకు, వారి పశువుల కొట్టం వద్దకు వెళ్ళవలసి ఉంటుందని ఈ హదీసు చెబుతోంది. ఒకవైపు రైతులు ప్రభుత్వాన్ని ఏమార్చకుండా ఉండటానికీ, మరోవైపు ప్రభుత్వోద్యోగులు కార్యాలయాలలో కూర్చుని పెత్తనం చెలాయించకుండా ఉండటానికని ఈ విధంగా నిర్ణయించటం జరిగింది. ఉద్యోగులు ఈ వసూళ్లను తమ విధ్యుక్త ధర్మంగా భావించి ఇంటింటికీ తిరిగి మరీ వసూలు చేయాలి. జాబిర్ బిన్ అతీక్ కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు-"మీ వద్దకు జకాత్‌ను వసూలు చేసే ప్రభుత్వ ప్రతినిధులు వస్తారు. వారు మీ దగ్గరకు వచ్చినపుడు వారికి స్వాగతం పలకండి. వారు అడిగిన దాన్ని ఇవ్వండి. వారుగనక న్యాయంగా వ్యవహరిస్తే వారికి పుణ్యఫలం లభిస్తుంది. ఒకవేళ వారు అన్యాయానికి పాల్పడితే దాని ఖర్మను కూడా వారే అనుభవిస్తారు." ఒకవేళ ప్రభుత్వాధికారులు జకాత్ పరిమాణానికి మించిగనక డిమాండుచేస్తే ఎట్టి పరిస్థితిలోనూ వారికి అదనంగా ఇవ్వరాదని సహీహ్ బుఖారీలో ఉంది.

(٤٨٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيْسَ عَلَى الْمُسْلِمِ فِي عَبْدِهِ وَلاَ فِي فَرَسِهِ صَدَقَةٌ». رَوَاهُ الْبُخَارِيُّ. وَلِمُسْلِمٍ: لَيْسَ فِي الْعَبْدِ صَدَقَةٌ، إِلاَّ صَدَقَةَ الْفِطْرِ.

487. హ(జత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ముస్లింలపై వారి బానిసల విషయంలోగానీ, వారి గుఱ్ఱాల విషయంలోగానీ జకాత్ లేదు" (బుఖారీ). ముస్లింలోని ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది - "బానిసలపై జకాత్ లేదు. అయితే వారు ఫిత్రా దానాన్ని మాత్రం చెల్లించవలసి ఉంటుంది."

**సారాంశం**

తమ సేవకోసం ఉన్న బానిసలపై, గుఱ్ఱాలపై జకాత్ చెల్లించవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే గుఱ్ఱాల వ్యాపారం చేస్తే మాత్రం వాటిపై జకాత్ తప్పని సరవుతుంది.

(٤٨٨) وَعَنْ بَهْزِ بْنِ حَكِيمٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**فِي كُلِّ سَائِمَةِ إِبِلٍ: فِي أَرْبَعِينَ بِنْتُ لَبُونٍ، لاَ تُفَرَّقُ إِبِلٌ عَنْ حِسَابِهَا، مَنْ أَعْطَاهَا، مُؤْتَجِراً بِهَا، فَلَهُ أَجْرُهَا، وَمَنْ مَنَعَهَا، فَإِنَّا آخِذُوهَا وَشَطْرَ مَالِهِ، عَزْمَةٌ مِنْ عَزَمَاتِ رَبِّنَا، لاَ يَحِلُّ لآلِ مُحَمَّدٍ مِنْهَا شَيْءٌ**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَعَلَّقَ الشَّافِعِيُّ الْقَوْلَ بِهِ عَلَى ثُبُوتِهِ.

488. హజ్రత్ బహ్జ్ బిన్ హకీమ్ తన తండ్రినుండి, మరి ఆయన తన తాత గారి నుండి ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: మేతమేసే మొత్తం 40 ఒంటెలపై రెండేళ్ల వయసున్న ఒక ఆడ ఒంటెను (జకాత్)గా ఇవ్వాలి. ఒంటెలను ఈ లెక్కన వేరు చేయకూడదు. ఎవరయితే పుణ్యార్జనా సంకల్పంతో జకాత్‌ను ఇస్తాడో అతనికి దాని పుణ్య ఫలం కూడా లభిస్తుంది. మరెవరయినా జకాత్‌ను (ఇవ్వకుండా) ఆపుకుంటే మేము బలవంతంగా జకాత్ వసూలు చేస్తాము; అతన్నుండి కొంత సొమ్ము కూడా (రాబడతాము). మన ప్రభువు విధించిన వాటిలో ఇది అనివార్య మైనది. వీటిలోని ఏ వస్తువు కూడా ముహమ్మద్ (సఅసం) కుటుంబీకుల కోసం ధర్మసమ్మతం (హలాల్) కాదు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైన హదీసుగా ఖరారు చేశారు. షాఫయి మాత్రం దీని నిర్ధారణకు సంబంధించి తుది నిర్ణయానికి రాలేక పోయారు)

**సారాంశం**

బనూ హాషిమ్, బనూ అబ్దుల్ ముత్తలిబ్ వంశస్థులు - అంటే మహనీయ ముహమ్మద్ (సఅసం) కుటుంబీకులు - జకాత్ విధి దానాలు స్వీకరించరాదన్న సంగతి ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. బనూ హాషిమ్‌లో హజ్రత్ అలీ సంతానం, హజ్రత్ అబ్బాస్ సంతతివారు, అఖీల్

సంతానం, హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ సంతతివారు కూడా చేరి ఉన్నారు. వీరంతా జకాత్‌కు అర్హులు కారు. అయితే ఇమామ్ యూసుఫ్ ప్రకారం ఒక సయ్యదు మరో సయ్యదుకు జకాత్ ఇవ్వగలడు.

## హదీసు ఉల్లేఖకులు

(1) అసలు పేరు బహ్జ్ బిన్ హకీమ్. మారుపేరు అబూ అబ్దుల్ మలిక్. పూర్తి వంశపరం పరను చూస్తే ఆయన పేరు ఇలా ఉంటుంది-బహ్జ్ బిన్ హకీమ్ బిన్ ముఆవియ బిన్ హైదా. బస్రా వాస్తవ్యులు. ఆరవ కోవకు చెందిన తాబయి. ఈయన అందజేసిన హదీసు ప్రామాణికతపై భేదాభిప్రాయం వ్యక్తమయింది. ఈయన హదీసులు ప్రామాణికమైనవని అబూదావూద్ భావించారు. ఇబ్నె ముయీన్, ఇబ్నె మదీనీ, నసాయి కూడా వీటి ప్రామాణికతను ధృవీకరించారు. కాని ఈయనకు హదీసులపై పట్టులేదని అబూ హాతిమ్ వ్యాఖ్యానించారు. హదీసులను వివరించటంలో ఈయన వల్ల తప్పులు దొర్లాయని ఇబ్నె హిబ్బాన్ అభిప్రాయపడ్డారు. ఈయన హిజ్రీ 140 తరువాత మరణించారు.

(2) హకీమ్ బిన్ ముఆవియ. అంటే బహ్జ్ తండ్రి. ఈయన తాబయి. ఇబ్నె హిబ్బాన్ ఈయన్ని నమ్మకస్థులైన హదీసు ఉల్లేఖకులలో ఒకరుగా పరిగణించారు.

(3) ముఆవియ బిన్ హైదా. ఈయన బస్రాలో స్థిరపడ్డారు. ఈయన గారి ద్వారా కూడా ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(٤٨٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَانَتْ لَكَ مائَتَا دِرْهَمٍ، وَحَالَ عَلَيْهَا الْحَوْلُ، فَفِيهَا خَمْسَةُ دَرَاهِمَ، وَلَيْسَ عَلَيْكَ شَيْءٌ، حَتَّى يَكُونَ لَكَ عِشْرُونَ دِينَاراً، وَحَالَ عَلَيْهَا الْحَوْلُ، فَفِيهَا نِصْفُ دِينَارٍ، فَمَا زَادَ، فَبِحِسَابِ ذَلِكَ، وَلَيْسَ فِي مَالٍ زَكَاةٌ، حَتَّى يَحُولَ عَلَيْهِ الْحَوْلُ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَهُوَ حَسَنٌ، وَقَدِ اخْتَلَفُوا فِي رَفْعِهِ.

489. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉద్బోధించారు - "నీవద్ద రెండు వందల దిర్హములు ఉండి వాటిపై ఒక ఏడాది కాలం గడచిపోతే దానిపై ఐదు దిర్హమ్‌ల జకాత్ చెల్లించవలసి ఉంటుంది. నీవద్ద 20 దీనార్లు ఉండి వాటిపై ఒక సంవత్సరం పూర్తి కానంతవరకూ నీవు ఏమీ చెల్లించ నవసరం లేదు. 20 దీనార్లపై సంవత్సర కాలం పూర్తయితే మాత్రం దీనిపై సగం దీనారు జకాత్‌గా ఇవ్వాలి. అంతకు మించి (డబ్బు) ఉంటే ఈ లెక్కన జకాత్ చెల్లించవలసి ఉంటుంది. ఏ సంపదపై కూడా - ఏడాది కాలం పూర్తికానిదే జకాత్ ఉండదు." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఈ హదీసు 'హసన్' కోవకు చెందినది. ఇది 'మర్ఫూ' అన్న

وَلِلتِّرْمِذِيِّ عَنِ ابْنِ عُمَرَ: مَنِ اسْتَفَادَ مَالاً، فَلاَ زَكَاةَ عَلَيْهِ، حَتَّى يَحُولَ عَلَيْهِ الْحَوْلُ. وَالرَّاجِحُ وَقْفُهُ.

విషయంపై భేదాభిప్రాయం ఉంది) తిర్మిజీలో ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనంలో ఉంది - "ఆర్థిక సంవత్సరం మధ్యలో ప్రాప్తమయిన సంపదపై కూడా ఏడాది కాలం గడిచే వరకూ ఎలాంటి జకాత్ లేదు." ఈ హదీసు 'మౌఖూఫ్'గా పరిగణించబడింది.

**సారాంశం**

ఈ హదీసులో వెండి బంగారాల జకాత్ ప్రస్తావన వచ్చింది. వెండి రెండు వందల దిర్హముల కన్నా తక్కువ ఉంటే దానిపై జకాత్ లేదు. నేటి ఆధునిక పరిభాషలో ధర్మవేత్తలు 52 1/2 తులాల బరువుకు సమానంగా ఉంటే దానిపై రెండున్నర శాతం జకాత్ ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే బంగారం విషయానికి వస్తే; ఏడున్నర తులాల బంగారం ఉంటే, మార్కెట్టులో దాని వెలనుబట్టి మొత్తం వెలకట్టి, దానిపై రెండున్నర శాతం జకాత్ ఇవ్వాలి.

(٤٩٠) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَيْسَ فِي الْبَقَرِ الْعَوَامِلِ صَدَقَةٌ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالدَّارَقُطْنِيُّ، وَالرَّاجِحُ وَقْفُهُ أَيْضاً.

490. (వ్యవసాయ) పనులకు ఉపయోగపడే ఎద్దులపై జకాత్ చెల్లించటం తప్పనిసరి కాదని హజ్రత్ అలీ (రజి) వివరించారు. (దీనిని దారె ఖుత్నీ, అబూ దావూద్ ఉల్లేఖించారు - ఈ హదీసు కూడా 'మౌఖూఫ్'గానే భావించబడుతున్నది)

**సారాంశం**

వ్యవసాయోత్పత్తులకై ఉపయోగపడే పశువులపై జకాత్ చెల్లించనవసరం లేదని ఈ హదీసు చెబుతున్నది. అలాగే కర్మాగారాలలో వస్తువుల ఉత్పాదనకై ఉద్దేశించిన యంత్రాలపై కూడా జకాత్ లేదు. ఎందుకంటే అవి కూడా వ్యవసాయ పనిముట్ల, సాధనాల మాదిరిగానే ఉత్పత్తుల కొరకు పెట్టుకున్న పరికరాల క్రిందికి వస్తాయి.

(٤٩١) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ وَلِيَ يَتِيماً لَهُ مَالٌ، فَلْيَتَّجِرْ لَهُ، وَلاَ يَتْرُكْهُ حَتَّى تَأْكُلَهُ الصَّدَقَةُ». رَوَاهُ

491. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, మరి ఆయన తన తాత గారైన అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరయితే ఒక అనాధకు సంరక్షకునిగా ఉంటాడో

التِّرْمِذِيُّ وَالدَّارَقُطْنِيُّ، وَإِسْنَادُهُ ضَعِيفٌ، وَلَهُ شَاهِدٌ مُرْسَلٌ عِنْدَ الشَّافِعِيِّ.

అతను ఆ అనాధ సొమ్మును వాణిజ్యం లో పెట్టుబడిగా పెట్టాలి. దాన్ని అలాగే-యధాతథంగా - వదలివేస్తే (క్రమ క్రమంగా) జకాత్ సొమ్ము దాన్ని హరించి వేయవచ్చు." (దీనిని తిర్మిజీ, దారె ఖుత్నీ ఉల్లేఖించారు - హదీసు అందిన పరంపర బలహీనంగా ఉంది - అయితే ఇమామ్ షాఫయి వద్దగల ఒక 'ముర్సల్' ఉల్లేఖనం దీనికి సాక్షిగా ఉంది)

**సారాంశం**

అనాధలకు సంరక్షకుడైన వాడు, అనాధల ఆస్తిపాస్తుల్ని కాపాడటమే గాకుండా వాటిని పెట్టుబడిగా పెట్టి, తద్వారా వచ్చిన లాభాలతో అనాధల సంపదను సమృద్ధిచేయడానికి కృషి చేయాలని పై హదీసు సూచిస్తోంది. అనాధ సొమ్ముపై కూడా జకాత్ ఉంటుంది.

(٤٩٢) وَعَنْ عَبْدِ اللهِ بْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا أَتَاهُ قَوْمٌ بِصَدَقَتِهِمْ قَالَ: **اَللّٰهُمَّ صَلِّ عَلَيْهِمْ**. مُتَّفَقٌ عَلَيْهِ.

492. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూ ఔఫా(రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ప్రజలు జకాత్ సొమ్మును తీసుకుని వచ్చినప్పుడు, 'దేవా! వీళ్లని కరుణించు. వీళ్లను చల్లగా చూడు' అని ఆయన (స) వారికోసం ప్రార్థించేవారు.
(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

నసాయిలోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సమక్షంలో జకాత్‌ను తీసుకుని రాగా, ఆయన (స) అతని కొరకు ఇలా ప్రార్థించారు : "అల్లాహుమ్మ బారిక్ ఫీహి వ అహ్లిహీ" (ఓ అల్లాహ్! ఈ వ్యక్తిలో, ఇతని ఇంటివారిలో శుభాన్ని సమృద్ధిని వొసగు). సహచరులు స్వయంగా వచ్చి జకాత్ సొమ్మును చెల్లించే వారని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది.

(٤٩٣) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ الْعَبَّاسَ سَأَلَ النَّبِيَّ ﷺ فِي تَعْجِيلِ صَدَقَتِهِ قَبْلَ أَن تَحِلَّ، فَرَخَّصَ لَهُ فِي ذٰلِكَ. رَوَاهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ.

493. హజ్రత్ అలీ (రజి) కథనం : "జకాత్ నిర్ణీత సమయంకన్నా ముందుగానే చెల్లించవచ్చునా?" అని హజ్రత్ అబ్బాస్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను దర్యాప్తు చేయగా, ఆయన (స) అందుకు అనుమతి ఇచ్చారు.
(తిర్మిజీ, ముస్తద్రక్ హాకిమ్)

### సారాంశం

ఒక సంవత్సర కాలం నిండిన తరువాతే జకాత్ ఫర్జ్ (విధి) అవుతుంది. అయితే అడ్వాన్సుగా చెల్లించడానికి కూడా దైవప్రవక్త (స) అనుమతి ఇచ్చారు. ఈ అంశంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఏ విధంగానయితే నమాజ్, రోజా, హజ్ వంటి ఆరాధనలు నిర్ణీత సమయానికి ముందు నెరవేర్చబడవో అదేవిధంగా జకాత్ కూడా నిర్ణీతసమయం పూర్తికానిదే చెల్లించరాదనీ, ఎందుకంటే జకాత్ కూడా ఒక ఆరాధనేనని ఒక వర్గం వాదిస్తున్నది. సుఫియాన్ సౌరి అభిప్రాయం కూడా ఇదే. ఈ వాదనలో అంతగా బలం లేదు. ఎందుకంటే 'జకాత్' అనే విధిగా చెల్లించవలసిన దానానికి ఇతర ఆరాధనల మాదిరిగా ఒక నిర్ణీత సమయం అంటూ ఏమీ లేదు. ఏడాది గడువు నిండిన తరువాత కొన్ని రోజులు అటూ ఇటూగా జకాత్ చెల్లించినా ఫరవాలేదు. అత్యధిక ధర్మవేత్తల దృక్పథం కూడా ఇదే.

(٤٩٤) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ، قَالَ: «لَيْسَ فِيمَا دُونَ خَمْسِ أَوَاقٍ مِنَ الْوَرِقِ صَدَقَةٌ، وَلَيْسَ فِيمَا دُونَ خَمْسِ ذَوْدٍ مِنَ الإِبِلِ صَدَقَةٌ، وَلَيْسَ فِيمَا دُونَ خَمْسَةِ أَوْسُقٍ مِنَ التَّمْرِ صَدَقَةٌ». رَوَاهُ مُسْلِمٌ.

494. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు- "ఐదు 'ఊఖియా'లకన్నా తక్కువ వెండి ఉంటే దానిపై జకాత్ లేదు. అలాగే ఐదు కన్నా తక్కువ సంఖ్యలో ఒంటెలుంటే వాటిపై కూడా జకాత్ లేదు. ఐదు 'వసఖ్'లకన్నా తక్కువ ఖర్జూరంపై కూడా జకాత్ లేదు." (ముస్లిం)

وَلَهُ مِنْ حَدِيثِ أَبِي سَعِيدٍ: لَيْسَ فِيمَا دُونَ خَمْسَةِ أَوْسَاقٍ مِنْ تَمْرٍ وَلاَ حَبٍّ صَدَقَةٌ. وَأَصْلُ حَدِيثِ أَبِي سَعِيدٍ مُتَّفَقٌ عَلَيْهِ.

'ముస్లిం'లో అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనంలో ఉంది: "ఐదు వసఖ్‌లకన్నా తక్కువ ఖర్జూరంపైగానీ, ధాన్యంపైగానీ జకాత్ లేదు." (అబూ సయీద్ ఖుదరీ(రజి) ఉల్లేఖనం యొక్క మూలం బుఖారీ, ముస్లింలలో ఉంది)

### సారాంశం

ఈ హదీసులో వెండి పరిమాణం ఐదు ఊఖియాలని చెప్పబడింది. ఇంతకు ముందు వచ్చిన హదీసులో రెండు వందల దిర్హములు అని ఉంది. ఈ రెండు హదీసులలో పైకి వైరుధ్యం కనిపిస్తున్నప్పటికీ వాస్తవానికి అలాంటి వైరుధ్యం ఏమీలేదు. ఎందుకంటే ఒక ఊఖియాలో నలభైదిర్హములు ఉంటాయి. 5 ఊఖియాలు 200 దిర్హములకు సమానం. కనుక ఈ వైరుధ్యం, వ్యాఘాతం సమసిపోయినట్లే.

అలాగే 300 హిజాజీ 'సా' మనదేశంలో అమలులో వున్న ఇంగ్లీషు తూకం ప్రకారం 20 మణుగులకు సమానం. ఒక 'వసఖ్'లో 60 'సా'లు ఉంటాయి. అంటే నాలుగు మణుగులకు

సమానం. ఐదు వసఖ్‌లంటే 20 మణుగులన్నమాట. ఈ లెక్కన మనదేశంలో 20 మణుగులకన్నా (ఇంచు మించు 10 క్వింటాళ్లకన్నా) తక్కువ ధాన్యం పండితే అందులోంచి జకాత్ ఇవ్వనక్కర లేదు. కాని హనఫీ ఫిఖహ్ ననుసరించే పండితులు దైవగ్రంథాన్నీ, హదీసుల సర్వసాధారణ ఉపదేశాలను దృష్టియందుంచుకుని; ధాన్యం లేక ఖర్జూరం ఒక మణుగుకన్నా తక్కువ పరిమాణంలో ఉన్నప్పటికీ దానిపై జకాత్ ఉందని 'ఫత్వా' (తీర్పు) ఇచ్చారు.

అయితే దీనికన్నా మొదటి దృక్పథమే సరైనది. ఎందుకంటే మహాప్రవక్త (సఅసం) స్వయంగా 'బరువు'ను నిర్ణయించినప్పుడు మనం దాన్ని అవలంబించి తీరాలి. మన తరఫున మనం అందులో హెచ్చుతగ్గులు చేయటం భావ్యం అనిపించుకోదు. ఒక ఏడాది కాలంపాటు నిలువ ఉంచగలిగే ఆహారధాన్యాలన్నింటికీ ఈ జకాత్ వర్తిస్తుంది. ఉదాహరణకు: వరి, గోధుమ, జొన్న, రాగి, మొక్కజొన్న, పప్పు దినుసులు మొదలగునవి.

(٤٩٥) وَعَنْ سَالِمِ بْنِ عَبْدِ اللهِ، عَنْ أَبِيهِ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: فِيمَا سَقَتِ السَّمَاءُ وَالْعُيُونُ، أَوْ كَانَ عَثَرِيًّا، اَلْعُشْرُ، وَفِيمَا سُقِيَ بِالنَّضْحِ نِصْفُ الْعُشْرِ. رَوَاهُ الْبُخَارِيُّ. وِلأَبِيْ دَاوُدَ: أَوْ كَانَ بَعْلاً اَلْعُشْرُ، وَفِيمَا سُقِيَ بِالسَّوَانِي أَوِ النَّضْحِ نِصْفُ الْعُشْرِ.

495. హజ్రత్ సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ (రహ్మ.లై) తన తండ్రి చెప్పినట్లుగా తెలియజేశారు. ఈయన తండ్రిగారి కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ఉద్బోధించారు: "ఏ భూమి అయితే వర్షపు నీటితో, సెలయేళ్లతో (కాలువల ద్వారా), లేక నేలలోని తేమతో పండుతుందో అందులో 10వ భాగాన్ని జకాత్ (ఉష్ర్)గా ఇవ్వాలి. మరే భూమి అయితే నీళ్లు తోడటం ద్వారా (లేక పంపుసెట్ల ద్వారా) పండుతుందో ఆ పంటలో 20వ వంతును (ఉష్ర్‌గా) ఇవ్వాలి" (బుఖారీ). అబూ దావూద్ ఉల్లేఖనంలో - "ఒకవేళ పశువుల ద్వారా లేదా నీరు చేదటం ద్వారా నీటి సరఫరా చేసినట్లయితే 20వ వంతు (సగం ఉష్ర్) ఇవ్వాలి" అని ఉంది.

## సారాంశం

నేల స్వభావాన్ని, పండించే తీరునుబట్టి జకాత్ (ఉష్ర్) నిష్పత్తిలో వ్యత్యాసముంటుందని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ఉదాహరణకు, ఏ భూమి అయితే అతి కష్టమ్మీద సాగు అవుతుందో, ఏ ఏ ప్రాంతాలలో నీటి సరఫరా కనాకష్టంగా ఉంటుందో అక్కడి రైతుల సాధక బాధకాలను దృష్టిలో పెట్టుకుని వారిపట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించటం జరిగింది. అంటే వాళ్లు 20వ వంతు పంటను జకాత్ (ఉష్ర్)గా ఇస్తే సరిపోతుందని చెప్పబడింది.

(٤٩٦) وَعَنْ أَبِيْ مُوسَى الْأَشْعَرِيِّ وَمُعَاذٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهُمَا: **لَا تَأْخُذَا فِي الصَّدَقَةِ إِلَّا مِنْ هٰذِهِ الْأَصْنَافِ الْأَرْبَعَةِ: الشَّعِيْرِ، وَالْحِنْطَةِ، وَالزَّبِيْبِ، وَالتَّمْرِ**. رَوَاهُ الطَّبَرَانِيُّ وَالْحَاكِمُ.

وَلِلدَّارَقُطْنِيِّ عَنْ مُعَاذٍ قَالَ: **فَأَمَّا الْقِثَّاءُ وَالبِطِّيْخُ وَالرُّمَّانُ وَالْقَصَبُ، فَقَدْ عَفَا عَنْهُ** رَسُولُ اللّٰهِ ﷺ. وَإِسْنَادُهُ ضَعِيفٌ.

496. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తమతో చెప్పారని హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) లిరువురూ వివరించారు: "బార్లీ, గోధుమలు, ఎండుద్రాక్ష, ఖర్జూరం - ఈ నాలుగు రకాల ఆహారోత్పత్తులపై తప్ప మరే ఆహారధాన్యాల పైనా జకాత్‌ను వసూలు చేయరాదు" (తబ్రానీ, హాకిమ్ దీనిని ఉల్లేఖించారు - దారె ఖుత్నీ ముఆజ్ (రజి) ఆధారంగా పొందుపరచిన ఉల్లేఖనంలో ఇలా ఉంది - "దోసకాయ, పుచ్చకాయ, దానిమ్మపండ్లు, చెరకు వంటి పంటలను దైవప్రవక్త (స) జకాత్ నుండి మినహాయించారు. అయితే ఈ ఉల్లేఖనం అందిన తీరు బలహీనం (జయీఫ్) గా ఉంది)

**సారాంశం**

దారె ఖుత్నీలోని హజ్రత్ ముఆజ్ (రజి) ఉల్లేఖనం 'బలహీనం'గా ఉందని ఎందుకు అనబడిందంటే అందులోని ఒక ఉల్లేఖకుడు ఎన్నదగినవాడు కాదు. హదీసు పరంపరలో కూడా లింకు తెగింది.

(٤٩٧) وَعَنْ سَهْلِ بْنِ أَبِيْ حَثْمَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنَا رَسُولُ اللّٰهِ ﷺ: «**إِذَا خَرَصْتُمْ فَخُذُوا، وَدَعُوا الثُّلُثَ فَإِنْ لَمْ تَدَعُوا الثُّلُثَ، فَدَعُوا الرُّبُعَ**». رَوَاهُ الْخَمْسَةُ إِلَّا ابْنَ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

497. హజ్రత్ సహ్ల్ బిన్ అబూ హస్మ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ఈ విధంగా ఆజ్ఞాపించారు: - "మీరు ధాన్యాన్ని (లేక పండ్లను) అంచనావేసి అందులో మూడో వంతును వదిలేయండి. ఒకవేళ మూడో వంతును వదలలేకపోతే నాల్గవ వంతును వదలండి." ('ఐదుగురి'లో ఇబ్నెమాజా తప్ప మిగతావారు దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసు ఇస్లామీయ షరీయత్‌లోని విలువలను, సుగుణాలను వ్యక్తపరుస్తోంది. జకాత్ అనేది విధిగా ఇవ్వవలసిన దానం. అయితే ఇదిగాక 'సదఖా' అనే సర్వసాధారణమయిన దానం కూడా ఉంది. అంతేగాక, ఒక కొత్త పంట పండినపుడు ఆ రైతు కుటుంబీకులు ఎలాగూ దాన్ని తింటారు. అయితే ఆ ఊరిలోని పేదసాదలకు, బంధుమిత్రులకు, ఇరుగుపొరుగు వారికి కూడా ఎంతో కొంత ఇవ్వటం అభిలషణీయం. రైతులు పండించే పంటలలో కొన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండజాలవు. ఉదాహరణకు చెట్లకు కాసే కాయలు, కాయగూరలు, ఆకుకూరలు నశ్వర వస్తువుల కోవకు చెందుతాయి. ఇలాంటి పంటలు చేతికి వచ్చినపుడు తామూ తినాలి, ఎల్లరికీ తినిపించాలి. ఇందులో ఎన్నో మేళ్లు ఇమిడి ఉన్నాయి.

### హదీసు ఉల్లేఖకులు

సహ్లా బిన్ అబూ హస్మ (రజి). ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్ లేక ఆమిర్ బిన్ సైద బిన్ ఆమిర్ అన్సారీ ఖజ్రజీ, మదనీ. పిన్న వయస్కులైన సహాబీలలో ఒకరు. హిజ్రీ 3వ సంవత్సరంలో జన్మించారు. కూఫాలో స్థిరపడ్డారు. అయితే ఈయన మదీనా సహచరులలో ఒకరుగానే పరిగణించబడ్డారు. ముసైబ్ బిన్ జుబైర్ (రజి) పరిపాలనా కాలంలో మదీనాలో మరణించారు.

(٤٩٨) وَعَنْ عَتَّابِ بْنِ أَسِيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنَا رَسُولُ اللهِ ﷺ أَنْ يُخْرَصَ الْعِنَبُ، كَمَا يُخْرَصُ النَّخْلُ، وَتُؤْخَذُ زَكَاتُه زَبِيْباً. رَوَاهُ الْخَمْسَةُ، وَفِيْهِ انْقِطَاعٌ.

498. హజ్రత్ అత్తాబ్ బిన్ అసీద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఈ విధంగా ఆదేశించారు- "ఖర్జూరపు పండ్లను ఎలా అంచనావేస్తారో ద్రాక్షపండ్లను కూడా మీరు అలాగే అంచనా వేయండి. వాటి 'జకాత్'గా ఎండుద్రాక్షను (కిస్మిస్‌ను) వసూలు చేయాలి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - అయితే హదీసును వివరించిన వారి మధ్య లింకు తెగింది)

### హదీసు ఉల్లేఖకులు

అత్తాబ్ బిన్ అసీద్ (రజి). ప్రముఖ సహాబీలలో ఒకరు. మక్కా విజయం తరువాత దైవప్రవక్త (సఅసం) హునైన్ వైపునకు సాగిపోతూ ఈయన్ని మక్కా పర్యవేక్షకునిగా నియమించారు. ఈయన ఈ పదవిపై హజ్రత్ అబూబక్ర్ పరిపాలనా కాలం వరకూ ఉన్నారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) మరణించిననాడే ఈయన కూడా మరణించారని ప్రతీతి. మరొక కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ ఆఖరి దశ వరకూ జీవించి ఉన్నారు.

(٤٩٩) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، أَنَّ امْرَأَةً أَتَتِ النَّبِيَّ ﷺ

499. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మలై) తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుండి ఉటంకించారు:

وَمَعَها ابْنَةٌ لَّهَا، وَفِي يَدِ ابْنَتِهَا مَسْكَتَانِ مِنْ ذَهَبٍ، فَقَالَ لَهَا: «أَتُعْطِيْنَ زَكَاةَ هٰذَا»؟ قَالَتْ: لاَ، قَالَ: «أَيَسُرُّكِ أَنْ يُسَوِّرَكِ اللّٰهُ بِهِمَا يَوْمَ الْقِيَامَةِ سِوَارَيْنِ مِنْ نَارٍ»؟ فَأَلْقَتْهُمَا. رَوَاهُ الثَّلاَثَةُ، وَإِسْنَادُهُ قَوِيٌّ، وَصَحَّحَهُ الْحَاكِمُ مِنْ حَدِيْثِ عَائِشَةَ.

ఒక మహిళ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలోకి వచ్చింది. ఆమె వెంట ఆమె కూతురు కూడా ఉంది. ఆమె చేతికి రెండు బంగారు గాజులున్నాయి. ఆయన (స) ఆమెనుద్దేశ్యించి, "నీవు వీటి జకాత్‌ను చెల్లిస్తున్నావా?" అని అడిగారు. 'లేదు' అని ఆమె బదులిచ్చింది. "మరయితే ప్రళయ దినాన అల్లాహ్ నీకు రెండు అగ్ని గాజులు తొడిగించటం నీకు ఇష్టమేనా?" అని ఆయన (స) అన్నారు. ఇది విని ఆ మహిళ రెండు గాజులను తీసి పారవేసింది. (దీనిని ముగ్గురు ఉల్లేఖించారు - దీని ఆధారం దృఢమైనది. హాకిమ్ గారు దీనిని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఆధారంగా ఉల్లేఖించి, ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

బంగారు నగలపై కూడా జకాత్ ఉందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. అయితే ఈ విషయంపై కూడా ఫుకహా (ధర్మవేత్తల) మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. నగలపై జకాత్ వాజిబ్ (తప్పనిసరి) అని మొదటి వర్గం భావించింది. నగలపై జకాత్ ఫర్జ్ (విధి) కాదని రెండవ వర్గం అభిప్రాయపడింది. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి ఈ రెండో వాదనకే అనుకూలంగా ఉన్నారు. నగలపై జకాత్ ఒకసారి ఇస్తే సరిపోతుందన్నది మరో వాదన. వీటన్నింటినీ జోడించిన మీదట తుది నిర్ణయానికి రావలసినదేమిటంటే, నగలపై జకాత్ ఫర్జ్ (విధి) గావించబడింది. సహీహ్ హదీసు దీనికి బహిరంగ నిదర్శనం. కేవలం అంచనాల, ఊహల ఆధారంగా నగలపై జకాత్ లేదని అనటం సమంజసం కాదు.

(٥٠٠) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّهَا كَانَتْ تَلْبَسُ أَوْضَاحاً مِنْ ذَهَبٍ، فَقَالَتْ: يَا رَسُولَ اللّٰهِ! أَكَنْزٌ هُوَ؟ فَقَالَ: «إِذَا

500. హజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్హా) కథనం : తాను బంగారు నగ తొడిగి ఉన్నప్పుడు దైవప్రవక్త (స)ను ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా

أَدَّيْتِ زَكَاتَهُ فَلَيْسَ بِكَنْزٍ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

(సఅసం)! ఇది నిలువచేసిన నిధిగా భావించబడుతుందా?" దానికి ఆయన (స), "నీవు దీని జకాత్‌ను చెల్లిస్తే మటుకు ప్రోగుచేసిపెట్టిన నిధి క్రిందికి రాదు" అని అన్నారు. (ఈ హదీసును అబూ దావూద్, దారె ఖుత్నీ లిరువురూ ఉల్లేఖించగా, హాకిమ్ దీనిని ప్రమాణ బద్ధమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

"ఎవరయితే బంగారం, వెండిని ప్రోగుచేసి పెట్టారో, మరియు అందులో నుంచి దైవమార్గంలో ఖర్చుపెట్టరో వారికి వ్యధాభరితమయిన యాతన యొక్క శుభవార్తను అందజెయ్యండి.... " (9:34,35) అన్న దివ్య ఖుర్‌ఆన్ వాక్యంలో దీని వివరాలు వచ్చాయి.

వేరొక హదీసు ప్రకారం దైవప్రవక్త (సఅసం) తన ధర్మపత్ని అగు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చేతిలో వెండి నగలు చూశారు. 'ఆయిషా! నీవు వీటి జకాత్‌ను చెల్లిస్తున్నావా?' అని అడిగారు. 'లేదు' అని ఆమె బదులివ్వగా 'అయితే నరకాగ్నిలో కాలడానికి నీవు వహించిన ఈ మాత్రం అశ్రద్ధ సరిపోతుంది' అని ఆయన (సఅసం) హెచ్చరించారు. (హాకిమ్)

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే బంగారు, వెండి నగలపై (అవి నిర్ణీత పరిమాణానికి మించి ఉన్నప్పుడు) జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

(٥٠١) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَأْمُرُنَا أَنْ نُخْرِجَ الصَّدَقَةَ مِنَ الَّذِي نَعُدُّهُ لِلْبَيْعِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَإِسْنَادُهُ لَيِّنٌ.

501. హజ్రత్ సమురబిన్ జున్దుబ్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు వర్తక సామగ్రి నుంచి జకాత్‌ను తీయవలసిందిగా ఆదేశించారు." (ఈ హదీసును అబూదావూద్ బలహీన ఆధారంతో ఉల్లేఖించారు).

**సారాంశం**

వర్తక సామగ్రిపై కూడా జకాత్ వుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. దీనికి ఆధారంగా ముజాహిద్ దివ్య ఖుర్‌ఆన్‌లోని, అన్‌ఫిఖూ మిన్ తయ్యిబాతి మా కసబ్‌తుమ్ అనే వచనాన్ని ఉదాహరించారు. ఇది విధిగా చెల్లించాలన్న విషయంలో ఎలాంటి సంశయానికి తావు లేదని ఇబ్నె ముంజిర్ పేర్కొన్నారు. ధర్మవేత్తలు, నలుగురు ఇమాములు కూడా వర్తక సామగ్రిపై జకాత్ చెల్లించటం విధి అన్న విషయంపై ఏకీభవించారు.

(٥٠٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «وَفِي الرِّكَازِ الْخُمُسُ». مُتَّفَقٌ عَلَيْهِ.

502. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : "ఖనిజ సంపద లో (లేక గుప్తనిధిలో) 5వ వంతు (జకాత్‌గా ఇవ్వవలసి) ఉంది."
(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఖనిజ సంపద (గుప్తనిధి)పై చెల్లించవలసిన ఐదవ వంతును జకాత్ అనటంకన్నా దాన్ని ప్రభుత్వ వాటాగా పరిగణించటం సముచితం. భూగర్భంలో ఎక్కడ ఈ ఖనిజాలు లభించినా అందులోనుంచి ఇరవై శాతం సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చెయ్యాలి. మిగతా సొమ్ము యజమాని స్వంతమవుతుంది.

(٥٠٣) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ فِي كَنْزٍ وَجَدَهُ رَجُلٌ فِي خَرِبَةٍ: «إِنْ وَجَدْتَهُ فِي قَرْيَةٍ مَسْكُونَةٍ فَعَرِّفْهُ، وَإِنْ وَجَدْتَهُ فِي قَرْيَةٍ غَيْرِ مَسْكُونَةٍ فَفِيهِ وَفِي الرِّكَازِ الْخُمُسُ». أَخْرَجَهُ ابْنُ مَاجَه بِإِسْنَادٍ حَسَنٍ.

503. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ.లై) తన తండ్రి నుంచి, మరి ఆయన తన తాతగారి నుంచి గ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం), భూమి నుంచి ఖజానా లభించిన వ్యక్తి గురించి చెబుతూ; "నీవు ఈ ఖజానాను జనవాసాలున్న ప్రదేశంలో పొందివుంటే అది ఎవరిదో తెలుసుకునే ఉద్దేశ్యంతో అక్కడ ప్రకటన గావించు. ఒకవేళ ఏదయినా నిర్జన ప్రదేశంలో ఇది నీకు లభించి ఉంటే అది ఖనిజ సంపద (గుప్తనిధి) క్రిందికి వస్తుంది. దానిపై ఐదవ వంతును చెల్లించవలసి ఉంటుంది." (ఇబ్నె మాజా దీనిని విశ్వసనీయ ఆధారాల ద్వారా వివరించారు)

(٥٠٤) وَعَنْ بِلَالِ بْنِ الْحَارِثِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَخَذَ مِنَ الْمَعَادِنِ الْقَبَلِيَّةِ الصَّدَقَةَ. رَوَاهُ أَبُو دَاوُدَ.

504. హజ్రత్ బిలాల్ బిన్ హారిస్ (రజి) ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఖబాలియ' అనే ప్రదేశంలో వున్న గనుల నుంచి జకాత్‌ను వసూలు చేశారు. (అబూదావూద్)

**హదీసు ఉల్లేఖకులు**

బిలాల్ బిన్ హారిస్ (రజి) 'ముజైనియా' తెగకు చెందినవారు. అందుచేత ఈయన ముజైనీగా కూడా పిలువబడ్డారు. ఆయన హిజ్రీ 5లో దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ప్రతినిధిగా హాజరయ్యారు. మదీనాలో స్థిరపడ్డారు. తరువాత బస్రాకు బదిలీ అయ్యారు. మక్కా విజయం సందర్భంగా ఈయన ముజైనియా తెగవారి ధ్వజం చేబూని నిలబడ్డారు. 80 సంవత్సరాల వయస్సులో - హిజ్రీ 60లో - మరణించారు.

**1వ అధ్యాయం**

## సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రా దానం)

## ١ - بَابُ صَدَقَةِ الْفِطْرِ

(٥٠٥) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: فَرَضَ رَسُولُ اللّٰهِ ﷺ زَكَاةَ الْفِطْرِ صَاعاً مِنْ تَمْرٍ، أَوْ صَاعاً مِنْ شَعِيْرٍ، عَلَى الْعَبْدِ وَالْحُرِّ وَالذَّكَرِ وَالْأُنْثَى وَالصَّغِيْرِ وَالْكَبِيْرِ، مِنَ الْمُسْلِمِيْنَ، وَأَمَرَ بِهَا أَن تُؤَدَّى قَبْلَ خُرُوجِ النَّاسِ إِلَى الصَّلَاةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

505. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు - "ముస్లింల బానిసలు, స్వేచ్ఛాజీవులు, పురుషులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు - అందరిపై సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రాదానం) తప్పనిసరి గావించబడింది. ఒక 'సా' ఖర్జూరంగానీ, ఒక 'సా' బార్లీగానీ (ఫిత్రా రూపేణా) ఇవ్వాలి. ఈ ఫిత్రా (పండుగ) నమాజ్‌కు బయలుదేరక ముందే ఇచ్చేయాలి."

(బుఖారీ, ముస్లిం)

وَلِابْنِ عَدِيٍّ وَالدَّارَقُطْنِيِّ بِإِسْنَادٍ ضَعِيْفٍ: أَغْنُوهُمْ عَنِ الطَّوَافِ فِي هٰذَا الْيَوْمِ.

ఇబ్నె అదీ, దారె ఖుత్నీలో 'జయీఫ్' ఆధారంతో ఇలా అనబడింది : "ఆ రోజు పేదవాళ్లు ముష్టెత్తుకునే స్థితి ఏర్పడకుండా చూడండి."

**సారాంశం**

ముస్లింలయిన ప్రతి ఒక్కరిపై ఫిత్రాదానం తప్పనిసరి గావించబడిందని ఈ హదీసు చెబుతోంది. అదీ పండుగకు ముందే చెల్లించాలని తాకీదు చెయ్యబడటం గమనార్హం. సమాజంలోని అభాగ్యజీవులు, అగత్యపరులు, బీదవాళ్లు కూడా ఆ రోజు అడుక్కు తినవలసిన నికృష్టస్థితి రాకూడదనీ, వాళ్లు సయితం పండుగ సంతోషాలను అందరిలా పొందాలన్న ఉద్దేశ్యంతో ఈ విధంగా ఆజ్ఞాపించబడింది. తలసరి ఫిత్రా ఒక 'సా' చొప్పున ఇవ్వాలని చెప్పబడింది. తమ వద్ద ముస్లిమేతర సేవకులు ఉంటే వారి పేరున ఫిత్రా ఇవ్వనవసరం లేదు. ముస్లిం సేవకుల పేరున మాత్రం ఫిత్రా తప్పక ఇవ్వాలి.

(٥٠٦) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُعْطِيْهَا فِي زَمَنِ النَّبِيِّ ﷺ صَاعاً مِنْ طَعَامٍ، أَوْ صَاعاً مِنْ تَمْرٍ، أَوْ صَاعاً مِنْ شَعِيْرٍ، أَوْ صَاعاً مِنْ زَبِيْبٍ. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِيْ رِوَايَةٍ: «أَوْ صَاعاً مِنْ أَقِطٍ». قَالَ أَبُو سَعِيْدٍ: أَمَّا أَنَا فَلاَ أَزَالُ أُخْرِجُهُ، كَمَا كُنْتُ أُخْرِجُهُ فِي زَمَنِ رَسُولِ اللهِ ﷺ. وَلِأَبِيْ دَاوُدَ: «لاَ أُخْرِجُ أَبَداً إِلاَّ صَاعاً».

506. హజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) కథనం : మేము దైవప్రవక్త (సఅసం) హయాంలో ఒక 'సా' గోధుమలు, (లేక) ఒక 'సా' ఖర్జూరం (లేక) ఒక 'సా' బార్లీ, (లేక) ఒక 'సా' ఎండు ద్రాక్షను 'ఫిత్రా'గా ఇచ్చేవారము (బుఖారీ, ముస్లిం). మీగడ (లేక జున్ను) లో నుంచి కూడా ఒక 'సా'ను ఫిత్రాగా చెల్లించేవారమని వేరొక ఉల్లేఖనంలో ఉంది. దైవప్రవక్త (సఅసం) కాలంలో ఏ పరిమాణంలో ఇచ్చేవారమో ఆ పరిమాణంలోనే తాను ఎల్లప్పుడూ ఫిత్రా ఇస్తానని అబూ సయీద్ ఖుదరీ (రజి) అన్నారు. అబూదావూద్‌లోని ఉల్లేఖనం లో ఇలా వుంది - 'నేను ఎల్లకాలం ఒక 'సా' మాత్రమే ఇస్తాను.'

**సారాంశం**

ఫిత్రాగా ఏ ఆహారధాన్యాన్ని ఇచ్చినా ఒక 'సా' ఇవ్వటం మస్నూన్ (సంప్రదాయం) అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఈ వ్యవహారంలో ఎంతో ఖచ్చితంగా అమలు జరిపారు. ఆయన ఎల్లకాలం ఒక 'సా' మాత్రమే ఇస్తానని కరాకండీగా చెప్పవలసిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందంటే, అమీర్ ముఆవియ (రజి) తన ఖిలాఫత్ కాలంలో అర్ధ 'సా' గోధుమలను, ఒక 'సా' బార్లీకి సమానంగా నిర్ధారించారు. ఇది అబూసయీద్ ఖుదరీ (రజి) గార్కి నచ్చలేదు. తాము తినే ఆహారధాన్యాలు ఏవయినా, వాటి ధరలో వ్యత్యాసమున్నా సరే - పూర్తిగా ఒక 'సా'ను ఇవ్వటమే న్యాయమన్నది ఆయన ఉద్దేశ్యం. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) కాలంలో ఈ విధంగానే అమలుపరచేవారు. అమీర్ ముఆవియా (రజి) తన వివేచన కనుగుణంగా ఇలా నిర్ధారించగా, అబూ సయీద్ ఖుదరీగారు దైవప్రవక్త (స) మరియు ప్రవక్త సహచరుల ఆచరణను ప్రమాణంగా పేర్కొని తన అభిమతాన్ని వెల్లడించారు. ఇక్కడ అమీర్ ముఆవియ 'ఇజ్తిహాద్' (షరీయత్ సూత్ర అన్వయింపు) కన్నా అబూ సయీద్ ఖుదరీ 'అనుసరణా తీరు' బలవత్తరమైనది.

(٥٠٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: فَرَضَ رَسُولُ اللهِ ﷺ زَكَاةَ

507. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాసి వల్ల జరిగిన తప్పుల

الْفِطْرِ طُهْرَةً لِلصَّائِمِ مِنَ اللَّغْوِ وَالرَّفَثِ، وَطُعْمَةً لِلْمَسَاكِينِ، فَمَنْ أَدَّاهَا قَبْلَ الصَّلاَةِ فَهِيَ زَكَاةٌ مَّقْبُولَةٌ، وَمَنْ أَدَّاهَا بَعْدَ الصَّلاَةِ فَهِيَ صَدَقَةٌ مِنَ الصَّدَقَاتِ. رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

నుండి అతని ఉపవాసాన్ని పవిత్రం గావించే ఉద్దేశ్యంతో, నిరాధార జీవులకు అన్నంపెట్టే సంకల్పంతో ఫిత్రా దానాన్ని విధించారు. అది పండుగ నమాజ్‌కు ముందే చెల్లిస్తే (ఫిత్రాగా) స్వీకారయోగ్య మవుతుంది. నమాజ్ తరువాత చెల్లిస్తే సాధారణ దానాలలోని ఒక దానంగా పరిగణించబడుతుంది." (ఈ హదీసును అబూదావూద్, ఇబ్నెమాజా ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

**సారాంశం**

ఫిత్రాదానం సొసైటీలోని పేదప్రజల, అగత్యపరుల హక్కు అనీ, పండుగ నమాజుకు ముందే దాన్ని అవశ్యంగా ఇచ్చివేయాలని ఈ హదీసు చెబుతోంది. పండుగ నమాజ్ చేసిన తరువాత ఫిత్రా ఇస్తే అది ఫిత్రాగా ఆమోదముద్ర పొందదు. అదొక సాధారణ దానంగా మాత్రమే భావించబడుతుంది.

**2వ అధ్యాయం**

## స్వచ్ఛంద దానధర్మాలు

## ٢ - بَابُ صَدَقَةِ التَّطَوُّعِ

(٥٠٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**سَبْعَةٌ يُظِلُّهُمُ اللَّهُ فِي ظِلِّهِ يَوْمَ لاَ ظِلَّ إِلاَّ ظِلُّهُ**» - فَذَكَرَ الْحَدِيثَ - وَفِيهِ: «**وَرَجُلٌ تَصَدَّقَ بِصَدَقَةٍ فَأَخْفَاهَا، حَتَّى لاَ تَعْلَمَ شِمَالُهُ مَا تُنْفِقُ يَمِينُهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

508. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "ఏడు రకాల మనుషులున్నారు. ఏ రోజున అల్లాహ్ నీడ తప్ప మరొకరి ఆశ్రయం ఉండదో ఆ రోజున అల్లాహ్ వారికి ఆశ్రయం ఇస్తాడు." తరువాత హదీసు నంతటినీ వివరించారు. అందులో ఒక వాక్యం ఇలా వుంది - "ఆ ఏడుగురిలో- కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి కూడా తెలియనంత రహస్యంగా దానం చేసేవాడు కూడా ఉన్నాడు."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఏడు రకాల మనుషుల్లో మిగిలిన ఆరుగురు ఎవరు? అన్న ప్రశ్న ఇక్కడ జనించవచ్చు. ఆ ఆరుగురు వీరు - (1) న్యాయశీలుడైన నాయకుడు. (2) దైవారాధనలో కాలం గడిపిన యువకుడు. (3) ఎల్లప్పుడూ మస్జిద్‌లో మనసు లగ్నమై ఉండే వ్యక్తి. (4) కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో పరస్పరం ప్రేమించుకునే, కేవలం అల్లాహ్ ప్రసన్నతను బడసే సంకల్పంతోనే ఒండొకరి నుంచి వేర్పడిపోయే ఇద్దరు వ్యక్తులు. (5) అందగత్తె, కులీనురాలైన ఒక పడుచు స్త్రీ పొందు కోసం పిలువగా, తాను దైవానికి భయపడే వాడినని చెప్పి, ఆమె పిలుపును తిరస్కరించిన వ్యక్తి. (6) ఏకాంతంలో దైవధ్యానంలో నిమగ్నుడై ఉండగా దేవునిపట్ల భక్తి పారవశ్యంతో - నయనాల నుండి అశ్రుధారలు ప్రవహించే వ్యక్తి. (7) ఇక ఏడవవ్యక్తి గోప్యంగా దానధర్మాలు చేసేవాడు. ప్రదర్శనాబుద్ధికి తావీయకుండా - కేవలం దైవాన్ని సంతోషపరచే ఉద్దేశ్యంతో - సాటి మానవుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసే ధన్యుడు.

ఈ హదీసు సదఖయె వాజిబా (తప్పనిసరి దానం), సదఖయె నాఫిలా (స్వచ్ఛంద దానం) - రెంటినీ పరివేష్ఠించి ఉంది.

ప్రళయం ఒకనాడు తథ్యమనీ, ఆనాడు దైవ సింహాసనం తప్ప మరొక నీడ, మరో ఆశ్రయం ఉండబోదని కూడా ఈ హదీసు చాటిచెబుతోంది. ఆ సింహాసనం ఎటువంటిది? దాని నీడ ఎలా ఉంటుంది? ఆ స్థితి వర్ణనాతీతం. దాని జ్ఞానం అల్లాహ్‌కే పరిమితం.

ఈ హదీసు కేవలం పురుషులకే ప్రత్యేకమా? స్త్రీలకు ఈ అదృష్టం లేదా? అన్న ప్రశ్న కూడా ఇక్కడ ఉత్పన్నమవటం సహజం. యదార్థమేమిటంటే ఇటువంటి సుగుణాలు గల మహిళలకు కూడా ఈ హదీసు యథాతథంగా వర్తిస్తుంది.

ఫర్జ్ మరియు వాజిబ్ సదకాలు ఇస్తున్నప్పుడు వాటిని బహిరంగంగా ఇవ్వాలి. ఎందుకంటే దీనివల్ల ఇతరులను కూడా సదాచరణ వైపునకు పురికొల్పినట్లవుతుంది. అయితే స్వచ్ఛంద లేక సాధారణ దానాలను మాత్రం గోప్యంగా ఇవ్వటం మంచిదని చెప్పబడింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో స్వచ్ఛంద దాన ధర్మాలు కూడా గోప్యంగా ఇవ్వటానికి వీలుపడదు. ఎంత కాదనుకున్నా అవి బహిర్గతమవుతాయి. దాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. అయితే అటువంటి సందర్భాలలో దాత సంకల్పం బావుండాలి. నలుగురిలో పేరు ప్రఖ్యాతులను ఆర్జించే ఉద్దేశ్యంతో గాకుండా కేవలం తన ప్రభువును మెప్పించే ఉద్దేశ్యంతో దానం చేయాలి. 'చిత్తశుద్ధి' అంటే ఇదే మరి.

(٥٠٩) وَعنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَقُوْلُ: **كُلُّ امْرِىءٍ فِي ظِلِّ صَدَقَتِهِ حَتَّى يُفْصَلَ بَيْنَ النَّاسِ**». رَوَاهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

509. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) చెప్పారు : "ప్రతి వ్యక్తీ తన దానాల నీడలో నిలబడి ఉంటాడు. కడకు ప్రజల తీర్పు జరిగిపోతుంది."

(ఇబ్నె హిబ్బాన్, ముస్తద్రక్ హాకిమ్)

### సారాంశం

దానధర్మాలలో ముందంజ వేసేవారి వైశిష్ట్యం ఈ హదీసులో తెలుపబడింది. ఎంత విస్తారంగా దానాలు చేసివుంటే వారి నీడ అంతగానే విస్తృతమయి ఉంటుంది. ప్రళయ దిన దృశ్యాన్ని ఓసారి ఊహించుకోండి - ఆ రోజు ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటారు. ఆనాడు ఎవరికి కాస్తంత నీడ దొరికినా అది వారి భాగ్యమే అనాలి. అతను చేసుకున్న దాన ధర్మాల నీడ ఆనాడు అతని మన్నింపు కొరకు దైవసమక్షంలో సిఫారసు చేస్తూ ఉంటుంది. స్వచ్ఛంద దానంలో వున్న మరో శుభకరమయిన కోణం ఏమిటంటే, 'సదఖయె వాజిబా'ను చెల్లించటంలో మనిషివల్ల ఏదయినా లోటు జరిగి ఉంటే ఆ లోటును ఇది పూరిస్తుంది.

(٥١٠) وَعَنْ أَبِيْ سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **أَيُّمَا مُسْلِمٍ كَسَا مُسْلِماً ثَوْباً عَلَى عُرْيٍ كَسَاهُ اللّٰهُ مِنْ خُضْرِ الْجَنَّةِ، وَأَيُّمَا مُسْلِمٍ أَطْعَمَ مُسْلِماً عَلَى جُوعٍ أَطْعَمَهُ اللّٰهُ مِنْ ثِمَارِ الْجَنَّةِ، وَأَيُّمَا مُسْلِمٍ سَقَى مُسْلِماً عَلَى ظَمَأٍ سَقَاهُ اللّٰهُ مِنَ الرَّحِيقِ الْمَخْتُومِ**». رَوَاهُ أَبُو دَاوُدَ، وَفِيْ إِسْنَادِهِ لِينٌ.

510. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించినట్లు హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలియజేశారు: ఆయన (స) ఇలా ప్రబోధించారు - "ఏ ముస్లిం అయినా దుస్తులు లేని తన సోదరునికి దుస్తులు తొడిగిస్తే అల్లాహ్ అతనికి స్వర్గంలో పచ్చని పట్టు వస్త్రాలు తొడిగిస్తాడు. మరే ముస్లిం అయినా ఆకలితో అలమటించే తన సోదరునికి అన్నం పెడితే అల్లాహ్ అతనికి స్వర్గం లోని ఫలాలు తినిపిస్తాడు. ఇంకా ఏ ముస్లిమయినా దాహంతో బాధపడే తన సోదరునికి మంచినీరు (లేక పానీయం) త్రాగిస్తే అల్లాహ్ అతనికి స్వర్గలోకంలోని సీలు వేయబడివున్న స్వచ్ఛమయిన మద్యం త్రాపుతాడు." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. దీని పరంపర లో బలహీనత ఉంది)

### సారాంశం

పరలోకంలో అల్లాహ్ తన దాసులకు ప్రసాదించే ప్రతిఫలం ఇహలోకంలో వారు చేసిన పనులతో సమన్వయం చెందేదిగా ఉంటుందని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే స్వర్గంలోని దుస్తులు ప్రపంచంలోని దుస్తులకన్నా ఎంతో నాణ్యంగా, అందంగా, సుతిమెత్తగా ఉంటాయి. అతడు చేసిన సత్కార్యం దైవసన్నిధిలో ఆమోదయోగ్యమయినపుడే అతనికి ఈ ప్రతిఫలం లభిస్తుంది. సదాచరణ స్వీకారయోగ్యమవటానికి రెండు షరతులున్నాయి. ఒకటి:

అది షరీయత్ కనుగుణంగా ఉండాలి. దైవప్రవక్త (స) విధానానికి విరుద్ధంగా ఉండకూడదు. రెండు: సదాచరణ వెనుక చిత్తశుద్ధి ఉండాలి. అంటే దైవప్రసన్నత పొందే సంకల్పంతో సత్కార్యం చేయాలి. దాని వెనుక ప్రదర్శనా మనస్తత్వం ఉండకూడదు.

హదీసులో ఆకలిగొన్నవారు, దుస్తులు లేనివారు, దాహంతో బాధపడేవారి ప్రస్తావన వచ్చింది. యాచించే వారి నిజ స్థితి వారి వాలకాన్ని బట్టి అర్థమైపోతుంది. అటువంటి అగత్యపరులకు, నిరాధారులకు దానాలివ్వటం మంచిదే. కాని శారీరకంగా, మానసికంగా మంచి స్థితిలో ఉండి కూడా కష్టపడకుండా సోమరుల్లా తిరిగేవారికి, వృత్తిపరమయిన (ప్రొఫెషనల్స్) ఫకీర్లకు దానం ఇవ్వకూడదు. సిసలయిన అభాగ్య జీవులకు ఇవ్వటం వల్ల సమాజంలో వారి సమస్యలు పరిష్కృత మవుతాయి. వారి అక్కరలు తీర్తాయి. ఈ ఆచరణను అల్లాహ్ ఎంతగానో మెచ్చుకుంటాడు. ప్రతిఫలంగా వారికి శాశ్వితమయిన - అనుగ్రహభరితమయిన - స్వర్గవనాలలో ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారికి సమర్పించబడే మద్యం ప్రపంచంలోని మద్యం లాంటిది కాదు. అది సీలువేయ బడిన షరాబు. పవిత్రమైన, స్వచ్ఛమయిన షరాబు. మత్తునివ్వని మద్యం. దేవుడు సమ్మతించి ఆమోదించిన (హలాల్) మద్యం.

(٥١١) وَعَنْ حَكِيمِ بْنِ حِزَامٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: اَلْيَدُ الْعُلْيَا خَيْرٌ مِنَ الْيَدِ السُّفْلَى، وَابْدَأْ بِمَنْ تَعُولُ، وَخَيْرُ الصَّدَقَةِ مَا كَانَ عَنْ ظَهْرِ غِنىً، وَمَنْ يَسْتَعْفِفْ يُعِفَّهُ اللَّهُ، وَمَنْ يَسْتَغْنِ يُغْنِهِ اللَّهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ؛

511. హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "పై చేయి క్రింది చేయికన్నా ఉత్తమ మైనది. మీపై ఆధారపడివున్న వారితో (దానధర్మాలు) మొదలెట్టండి. మీ అవస రాలు, అక్కరలు తీరగా ఇచ్చేదే అత్యుత్త మమయిన సదఖా. ఎవరయితే ఒకరి ముందు చేయి చాచకుండా ఉంటాడో అతన్ని (అతని గౌరవమర్యాదలను) అల్లాహ్ కాపాడతాడు. ఎవరయితే పరువుగా బ్రతుకుతాడో అతనికి అల్లాహ్ స్వయం సమృద్ధి నొసగుతాడు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి)

**సారాంశం**

కుటుంబీకులు అధఃస్థితిలో వున్నప్పుడు వారి కష్టాలు తీర్చటం, వారి సమస్యలను పరిష్క రించటం కూడా సత్కార్యం క్రిందికే వస్తుంది. ఇంటి అక్కరలు తీరకుండానే బయటివారికి దాన ధర్మాలు చేయటం మంచి పద్ధతికాదు. 'ముస్లిం'లో హజ్రత్ సౌబాన్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, మనిషి తన ఆలుబిడ్డలు మరియు కుటుంబీకులపై వెచ్చించే సంపదే అత్యుత్తమ సంపద. లేదా అతను దైవమార్గంలో ఖర్చు చేయాలి లేదా తన ఆప్తులపై, బంధుమిత్రులపై ఖర్చుపెట్టాలి.

ఈ హదీసులో సదఖా (దానం) ఇవ్వటంలోని మహత్తును గురించి చెప్పటంతోపాటు అక్కర లేకపోయినా అర్థించేవారిని సున్నితంగా మందలించటం కూడా జరిగింది. చీటికీమాటికీ తమ హీనస్థితిని ఇతరుల ముందు చాటుకోకుండా - అభిమానధనులుగా జీవించే వారి కోసం అల్లాహ్ ఉపాధి ద్వారాలను తెరుస్తాడు. ఎవరిపైనా ఆధారపడకుండా నిరపేక్షాపరులుగా జీవించే స్థితిని కల్పిస్తాడు.

(٥١٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قِيلَ: يَا رَسُولَ اللّٰهِ! أَيُّ الصَّدَقَةِ أَفْضَلُ؟ قَالَ: **جُهْدُ الْمُقِلِّ، وَابْدَأْ بِمَنْ تَعُولُ.** أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

512. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: 'ఏ దానం శ్రేష్ఠమైనది?' అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఎవరో ప్రశ్నించగా, "తక్కువ ధనం ఉన్నవాడు చేసే దానం. నీపై ఆధారపడి ఉన్నవారి నుంచి దానాన్ని మొదలెట్టు" అని దైవ ప్రవక్త (స) సమాధానమిచ్చారు. (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా రెండు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఒకటి: ధనికుని దానానికీ, సామాన్యుని దానానికీ మధ్య స్పష్టమయిన వ్యత్యాసం ఉంది. రెండు : ఆలుబిడ్డల, కుటుంబ సభ్యుల కనీసావసరాలు తీర్చిన మీదట దానధర్మాలు చేయాలి. తాను పరులకు దానధర్మాలు చేస్తుండగా తన ఇంటివారలు అన్యుల ముందు చేయి చాచవలసిన నికృష్టస్థితి ఏర్పడకూడదు. అందుకే ముందు తన ఇంటివారి (షరీయత్‌పరంగా) ధర్మసమ్మతమయిన అక్కరలపై శ్రద్ధ చూపాలి.

(٥١٣) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**تَصَدَّقُوا**»، فَقَالَ رَجُلٌ: يَا رَسُولَ اللّٰهِ! عِنْدِيْ دِيْنَارٌ، قَالَ: «**تَصَدَّقْ بِهِ عَلَى نَفْسِكَ**»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ: «**تَصَدَّقْ بِهِ عَلَى وَلَدِكَ**»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ:

513. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : "దానధర్మాలు చేయండి" అని దైవప్రవక్త (సఅసం) ఉపదేశించారు. 'దైవప్రవక్తా! నా దగ్గర ఒక్క దీనార్ మాత్రమే ఉంది'అని ఒక వ్యక్తి అన్నాడు. "దాన్ని నీ స్వయం కోసమే ఖర్చుపెట్టు" అని దైవప్రవక్త (స) అన్నారు. 'మరో దీనార్ కూడా ఉంది' అని అన్నాడావ్యక్తి. "దాన్ని నీ సంతానంపై సదఖాగా వెచ్చించు" అని ఆయన (స) సలహా

«تَصَدَّقْ بِهِ عَلَى زَوْجَتِكَ»، قَالَ: عِنْدِي آخرُ، قَالَ: «تَصَدَّقْ بِهِ عَلَى خَادِمِكَ»، قَالَ: عِنْدِيْ آخرُ، قَالَ: «أَنْتَ أَبْصَرُ بِهِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

ఇచ్చారు. 'నా దగ్గర ఇంకొకటి కూడా ఉంది' అన్నాడా వ్యక్తి. "దాన్ని నీ భార్య కొరకు ఖర్చుపెట్టు' అని సూచించా రాయన (స). 'నావద్ద ఇంకొకటి కూడా ఉంది' అని అతడు చెప్పగా "దాన్ని నీ సేవకుని కోసం ఖర్చుపెట్టు" అని ఉప దేశించారు ఆయన (స). 'దైవప్రవక్తా! నా వద్ద మరొకటి కూడా ఉందికదా!' అని అతడు సందేహపడగా, "దీన్ని ఖర్చు పెట్టే అవగాహన నీకు ఎక్కువగానే ఉంది" అని ఆయన (సఅసం) అన్నారు. (ఈ హదీసును అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు- ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారిం చారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే మానవుడు షరీయత్ పరిమితుల్లో ఉంటూ తొలుత తన వాళ్ల అవసరాలను తీర్చాలి. ధర్మసమ్మతమైన రీతిలో ఆలుబిడ్డల అవసరాలను తీర్చటం కూడా పుణ్యప్రదమయిన విషయమే. ఆ క్రమపద్ధతి ఇలా వుంది: ముందు తన స్వయానికై ఖర్చుపెట్టాలి. తరువాత సంతానం, భార్య, సేవకులూ వస్తారు. ఆ తరువాత తన ఇష్టమొచ్చిన వారిపై ఖర్చుపెట్టవచ్చు. లేదా భవిష్యత్తు కొరకు పొదుపు చేయవచ్చు. ఏది ఖర్చుచేసినా అతడు ఈ క్రమపద్ధతిని దృష్టిలో పెట్టుకోవాలి.

(٥١٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ النَّبِيُّ ﷺ: «إِذَا أَنْفَقَتِ الْمَرْأَةُ مِنْ طَعَامِ بَيْتِهَا، غَيْرَ مُفْسِدَةٍ، كَانَ لَهَا أَجْرُهَا بِمَا أَنْفَقَتْ، وَلِزَوْجِهَا أَجْرُهُ بِمَا اكْتَسَبَ، وَلِلْخَازِنِ مِثْلُ ذَلِكَ، لاَ يَنْقُصُ بَعْضُهُمْ مِنْ أَجْرِ بَعْضٍ شَيْئاً». مُتَّفَقٌ عَلَيْهِ.

514. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (రజి) వివరించారు - "స్త్రీ తన ఇంటి సొమ్మును దుబారాగా ఖర్చుపెట్టకుండా పొదుపును పాటిస్తే ఈ పొదుపరితనానికి బదులుగా ఆమెకు పుణ్యం లభిస్తుంది. ఆమె భర్తకు సంపాదించిన పుణ్యం లభిస్తుంది. అలాగే కోశాధికారికి కూడా పుణ్యం లభిస్తుంది. ఎవరి పుణ్యం కూడా ఇంకొకరి పుణ్యాన్ని తగ్గించదు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒక ఉత్తమ ఇల్లాలి బాధ్యత ఏమిటో ఈ హదీసులో స్పష్టపరచబడింది. ఆమె ఎల్లప్పుడూ భర్త సంపాదనను బేరీజువేస్తూ, ఇంటి ఖర్చులను దానికనుగుణంగా సర్దుబాటు చేసుకోవాలి. దుబారా ఖర్చులు చేసి, భర్త అనుమతి లేకుండా దానధర్మాలు చేసి ఇంటి ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేయకూడదు. ఇల్లాలు ఒక్కో పద్దులో పాటించే పొదుపరితనం ఆ ఇంటిల్లిపాదికీ వరంగా పరిణమిస్తుంది. భర్తను అప్పులపాలు కాకుండా కాపాడుతుంది. అతడు నిశ్చింతగా ఉంటే బయటి వ్యవహారాలు, బాధ్యతలు సజావుగా నెరవేరుస్తాడు. ఈ విధంగా ఒక ఇల్లాలి యొక్క జాగరూకత మొత్తం వ్యవస్థ పాలిట శుభదాయకంగా పరిణమిస్తుంది. అలాగే ఒక ఇల్లాలి యొక్క అలక్ష్యం, అజాగ్రత్త మొత్తం వ్యవస్థనే అస్తవ్యస్తం చేసివేస్తుంది.

(٥١٥) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَتْ زَيْنَبُ امْرَأَةُ ابْنِ مَسْعُودٍ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّكَ أَمَرْتَ الْيَومَ بِالصَّدَقَةِ، وَكَانَ عِنْدِي حُلِيٌّ لِّي، فَأَرَدْتُ أَنْ أَتَصَدَّقَ بِهِ، فَزَعَمَ ابْنُ مَسْعُودٍ أَنَّهُ وَوَلَدَهُ أَحَقُّ مَنْ تَصَدَّقْتُ بِهِ عَلَيْهِمْ، فَقَالَ النَّبِيُّ ﷺ: «صَدَقَ ابْنُ مَسْعُودٍ، زَوْجُكِ وَوَلَدُكِ أَحَقُّ مَنْ تَصَدَّقْتِ بِهِ عَلَيْهِمْ». رَوَاهُ الْبُخَارِيُّ.

515. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) గారి శ్రీమతి జైనబ్ (ర.అన్హా) వచ్చి ఇలా విన్నవించుకున్నది - "ఓ దైవప్రవక్తా (సఅసం)! ఈ రోజు మీరు దానధర్మాలు చేయమని ఆజ్ఞాపించారు. నా దగ్గర నా స్వంత నగ ఉంది. దాన్ని నేను దానంగా ఇవ్వాలనుకుంటున్నాను. నా ఈ దానానికి (సదఖాకు) తాను, తన పిల్లలు ఎక్కువ హక్కుదారులని అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) భావిస్తున్నారు (నిజమేనా?)" దానికి ఆయన (స) "ఇబ్నె మస్‌వూద్ చెప్పింది నిజమే. నీ భర్త, నీ పిల్లలు నీవిచ్చే సదఖాకు ఎక్కువ హక్కుదారులు" అని అన్నారు. (బుఖారీ)

**సారాంశం**

'సదఖా' అనే అరబీ పదం చాలా విస్తృతమయింది. అది సాధారణ దానధర్మాలతోపాటు, జకాత్ నేపథ్యంలో కూడా ఉపయోగించబడుతుంది. పై హదీసులో ఇబ్నె మస్‌వూద్ (రజి) భార్య ఇవ్వదలచిన సదఖా స్వచ్ఛందమయిన సదఖా? లేక వాజిబ్ సదఖా? లేక జకాత్ మొత్తమా? అన్నది ఇక్కడ ప్రశ్న. సాధారణ సదఖా అయితే ఆమె దానికి సంబంధించి అడిగి తెలుసుకోవలసిన అవసరం లేదు. బహుశా ఇది జకాత్‌కి సంబంధించిన సదఖా (ఫర్జ్ సదఖా) అయి ఉండవచ్చు. అధిక సంఖ్యాకులైన విద్వాంసుల, ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం భార్య తన భర్తకు జకాత్ ఇవ్వవచ్చు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయంలో భార్య తన భర్తకు జకాత్ ఇవ్వజాలదు.

**హదీసు ఉల్లేఖకులు**

ఈ హదీసులో దైవప్రవక్త (స) ముందు ధర్మసందేహం వెలిబుచ్చిన జైనబ్ (ర.అన్‌హా) అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్(రజి) సతీమణి. ఈమె బనూ సఖీఫ్ తెగకు చెందినవారు. ఈమె తండ్రి పేరు ముఆవియ లేక అబ్దుల్లా బిన్ ముఆవియ లేక అబూ ముఆవియ. ఈమె దైవప్రవక్త(స), హజ్రత్ ఉమర్, మరియు తన భర్త ఆధారంగా హదీసులను ఉల్లేఖించారు.

(٥١٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**لَا يَزَالُ الرَّجُلُ يَسْأَلُ النَّاسَ، حَتَّى يَأْتِيَ يَوْمَ الْقِيَامَةِ، وَلَيْسَ فِي وَجْهِهِ مُزْعَةُ لَحْمٍ**». مُتَّفَقٌ عَلَيْهِ.

516. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: "ఎవరయితే భిక్షాటనను, యాచించటాన్ని వృత్తిగా చేసుకుంటారో వారు ప్రళయదినాన తమ ముఖాలపై మాంసం లేని స్థితిలో లేచివస్తారు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా భిక్షాటనం ఖండించబడింది. కేవలం మూడు రకాల మనుషులు మాత్రమే యాచించటం సమ్మతం. ఒకటి : ప్రకృతి వైపరీత్యాల, అవాంఛనీయ సంఘటనల వాతనపడి సర్వస్వాన్నీ కోల్పోయినవారు. తిండి తిప్పల కోసం కూడా ఏమీ మిగలనివారు. వారు తమ తాత్కాలిక అవసరాల కోసం, పునరావాసం కోసం అడగవచ్చు. అలాంటి వారి అవసరాలను అర్థం చేసుకుని ఉదారంగా ఆదుకోవాలి కూడా. రెండు: అన్యాయంగా జరిమానాకు గురైనవారు, అప్పుల ఊబిలో కూరుకుపోయినవారు. ఇలాంటి వారు ఇతరుల నుంచి అడిగి తమ దుస్థితి నుంచి బయటపడాలి. మూడు: పగలల్లా కష్టపడి పనిచేసినా కడుపునింపుకునేంత వేతనం లభించనివాడు, లేదా ఎంతగా అన్వేషించినా పని దొరకనివాడు, పరిమితమైన ఆదాయం వల్ల కుటుంబ అవసరాలు తీరనివాడు, ఆకలిదప్పులతో అలమటించేవాడు- ఇట్టి పరిస్థితిలో వారు సమాజంలోని స్థితిమంతుల నుంచి అడిగి తమ అవసరాలు తీర్చుకోవచ్చు. వీరు గాక భిక్షాటనను వృత్తిగా చేసుకున్నవారు, కష్టపడి పనిచేయగల శక్తి ఉండి కూడా ముష్టెత్తుకోవటాన్నే అలవాటుగా చేసుకున్నవారు ప్రళయదినాన అత్యంత అవమానకరమైన స్థితిలో లేపబడతారు.

(٥١٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**مَنْ سَأَلَ النَّاسَ أَمْوَالَهُمْ تَكَثُّراً، فَإِنَّمَا يَسْأَلُ**

517. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "ఎవరయితే తన సంపదను పెంచుకునే, వృద్ధిచేసుకునే ఉద్దేశ్యంతో జనుల నుండి యాచిస్తాడో అతడు తన కోసం

جَمْراً، فَلْيَسْتَقِلَّ أَوْ لِيَسْتَكْثِرْ». رَوَاهُ مُسْلِمٌ.

నిప్పులను తప్ప మరే వస్తువునూ యాచించటం లేదు. ఇప్పుడు వాటిని పెంచుకుంటాడో, తగ్గించుకుంటాడో ఇక అతని ఇష్టం." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా భిక్షాటనం అధర్మంగా ఖరారు చేయబడింది. ఆరోగ్యవంతుడు, కష్టపడి పని చేయగలవాడు, ఆర్థిక స్థోమత ఉన్నవాడు కూడా జనులవద్ద యాచిస్తే అతడు సమాజంలో తనను తాను కించపరచుకున్నట్లే. అటువంటి వారికి 'ధర్మం' చేయటం కూడా ధర్మం కాదు.

(٥١٨) وَعَنِ الزُّبَيْرِ بْنِ الْعَوَّامِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: لأَنْ يَأْخُذَ أَحَدُكُمْ حَبْلَهُ، فَيَأْتِيَ بِحُزْمَةِ الْحَطَبِ عَلَى ظَهْرِهِ، فَيَبِيعَهَا، فَيَكُفَّ بِهَا وَجْهَهُ، خَيْرٌ لَهُ مِنْ أَنْ يَسْأَلَ النَّاسَ، أَعْطَوْهُ أَوْ مَنَعُوهُ. رَوَاهُ الْبُخَارِيُّ.

518. హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీలో ఎవ రయినా త్రాడుతో కట్టెల మోపుకట్టి, వీపుపై మోసుకువచ్చి, దాన్ని అమ్ము కుంటే, తద్వారా అల్లాహ్ అతని మొహాన్ని ముష్టెత్తుకోవటం నుంచి ఆపితే, అది అతని కొరకు - ఇచ్చినా ఇవ్వకపోయినా -జనుల నుంచి యాచిం చటం కన్నా ఎంతో ఉత్తమం." (బుఖారీ)

**సారాంశం**

కష్టపడి సంపాదించటం, కలో గంజో చెమటోడ్చిన దానితో కడుపునింపుకోవటం, యాచించి తినే స్వాదిష్టమైన ఆహారంకన్నా ఎంతో మిన్న అని ఈ హదీసు సారాంశం. యాచించే వానికి ఎంతమంచి అన్నం దొరికినా యాచించే సమయంలో అతడు పొందిన అవమానం, నలుగురిచేతా అతడు అనిపించుకున్న మాటలు సాధారణమైనవి కావు. అడుక్కోవటం వల్ల పరువు ప్రతిష్ఠలుండవు. సమాజంలో అందరూ అల్పదృష్టితో చూస్తారు. తేరగా వచ్చిపడుతున్న అన్నంవల్ల అతనిలో సోమరితనం, బద్ధకం పెంపొందుతుంది. ఇలాంటి జనం పెరిగిపోతే సమాజంలో అభివృద్ధి కూడా కుంటుపడుతుంది. భిక్షాటనం ఒక్కోసారి మనిషిలోని పౌరుషాన్ని, స్వాభిమానాన్ని చంపేసి అతన్ని దొంగతనం, దోపిడీ వంటి చెడులకు కూడా పురికొల్పుతుంది.

(٥١٩) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْمَسْأَلَةُ كَدٌّ يَكُدُّ بِهَا الرَّجُلُ وَجْهَهُ، إِلاَّ أَنْ

519. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ సముర బిన్ జున్దుబ్ (రజి) తెలిపారు: "భిక్షా టనం ఒక గాయం వంటిది. దాంతో మనిషి తన ముఖాన్ని గాయపరచుకుం

يَسْأَلَ الرَّجُلُ سُلْطَاناً أَوْ فِي أَمْرٍ لاَ بُدَّ مِنْهُ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

టాడు. అయితే గత్యంతరంలేక ఎవరయినా యాచిస్తే లేక రాజ్యపాలకునికి నివేదించుకుంటే అందులో తప్పు లేదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - ప్రామాణికమైన హదీసుగా కూడా ఖరారు చేశారు)

**సారాంశం**

అక్కరలేకపోయినా ఇతరుల ముందు చేయి చాపటం సమ్మతం కాదని ఈ హదీసు తాత్పర్యం. అవసరం ఉన్నవాడు కూడా రాజ్యపాలకుడ్ని, తన పై అధికారిని నివేదించుకోవాలి. అటువంటివారికి బైతుల్‌మాల్ (కోశాగారం) లో హక్కు ఉంటుంది. బైతుల్‌మాల్ నుండి అగత్యపరునికి ఏదన్నా ఇస్తే అతని హక్కు అతనికి ఇచ్చినట్లవుతుంది. అంతేగాని ఎవరూ అతనిపై ఉపకారం చేసినట్టుకాదు.

**3వ అధ్యాయం**

## ٣ - بَابُ قِسْمِ الصَّدَقَاتِ

## దానధర్మాల పంపిణీ

(٥٢٠) عَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَحِلُّ الصَّدَقَةُ لِغَنِيٍّ إِلاَّ لِخَمْسَةٍ: لِعَامِلٍ عَلَيْهَا، أَوْ رَجُلٍ اشْتَرَاهَا بِمَالِهِ، أَوْ غَارِمٍ، أَوْ غَازٍ فِي سَبِيلِ اللهِ، أَوْ مِسْكِينٍ تُصُدِّقَ عَلَيْهِ مِنْهَا فَأَهْدَى مِنْهَا لِغَنِيٍّ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَأُعِلَّ بِالإِرْسَالِ.

520. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఐదు ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప స్థితిమంతుని కొరకు 'సదఖా' హలాల్ (ధర్మసమ్మతం) కాదు. (1) జకాత్ సొమ్మును సమీకరించినపుడు. (2) తన సొమ్ముతో దానధర్మాలకు సంబంధించిన ఏదయినా వస్తువును కొనుగోలు చేసినపుడు. (3) రుణగ్రస్తుడు. (4) దైవమార్గంలో పోరాడే వ్యక్తి. (5) దానంగా పొందిన దానిలో నుంచి ఒక నిరుపేద ఏదన్నా శ్రీమంతునికి కానుకగా ఇచ్చినపుడు." (దీనిని అహ్మద్, అబూదావూద్, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు - అయితే ఇది 'ముర్సల్' అని కూడా అభిప్రాయపడ్డారు)

## సారాంశం

శ్రీమంతుడు జకాత్ పుచ్చుకోరాదని ఈ హదీసు ద్వారా రూఢీ అయింది. అయితే జకాత్ వసూళ్ల నిమిత్తం నియమితులైన తహసీల్దార్లు, అకౌంటెంట్లు, గుమాస్తాలు - వారు ధనవంతులైనప్పటికీ - జీతంగా జకాత్ పద్దులో నుంచి తీసుకోవచ్చు.

(٥٢١) وَعَنْ عُبَيْدِ اللهِ بْنِ عَدِيِّ بْنِ الْخِيَارِ، أَنَّ رَجُلَيْنِ حَدَّثَاهُ: أَنَّهُمَا أَتَيَا رَسُولَ اللهِ ﷺ يَسْأَلَانِهِ مِنَ الصَّدَقَةِ، فَقَلَّبَ فِيهِمَا الْبَصَرَ، فَرَآهُمَا جَلْدَيْنِ، فَقَالَ: إِنْ شِئْتُمَا أَعْطَيْتُكُمَا، وَلاَ حَظَّ فِيهَا لِغَنِيٍّ، وَلاَ لِقَوِيٍّ مُكْتَسِبٍ. رَوَاهُ أَحْمَدُ، وَقَوَّاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

521. హజ్రత్ ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ (రహ్మ.లై) కథనం : ఇరువురు వ్యక్తులు నాకు తమ వృత్తాంతం వినిపించారు. వారిద్దరూ దైవప్రవక్త (సఅసం) సమక్షంలోకి వచ్చి, ఆయన్నుంచి 'సదఖా' కోరారు. ఆయన (సఅసం) వారిద్దరినీ నఖశిఖ పర్యంతం చూశారు. ఇరువురూ బలిష్టులుగానే కనిపించారు. ఆయన (సఅసం) ఇలా అన్నారు: "మీరు గనక కోరితే మీకు సదఖా ఇస్తాను. కాని శ్రీమంతునికీ, ఆరోగ్యవంతునికీ ఇందులో ఎలాంటి భాగం లేదు." (ఈ హదీసును అహ్మద్ ఉల్లేఖించగా, అబూదావూద్ మరియు నసాయి దీనిని 'దృఢమైనది'గా నిర్ధారించారు)

## సారాంశం

దృఢకాయులు, ధనవంతులు జకాత్‌కు, దానధర్మాలకు అర్హులు కారని ఈ హదీసును బట్టి అర్థమవుతోంది. దానం చేసేవారు కూడా యాచించేవారిని నిశితంగా చూచి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకుని ఇవ్వటం సమంజసం. హక్కుదారులు కాని వారిని అడుక్కుతినరాదని గట్టిగా చెప్పాలి కూడా.

## హదీసు ఉల్లేఖకులు

ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ (రహ్మ.లై). ఈయన ఖురైష్ వంశస్థులు. దైవప్రవక్త (సఅసం) కాలంలోనే జన్మించారని ఒక వాదన ఉంది. అందుచేత ఈయన తాబయీలలో ఒకరుగా పరిగణించబడ్డారు. ఈయన ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి)ల నుంచి హదీసులను సంగ్రహించారు. ఒక కథనం ప్రకారం ఈయన తండ్రి అవిశ్వాస స్థితిలోనే - బద్ర్‌యుద్ధంలో - తుదముట్టించబడ్డాడు. కాగా; ఈయన మక్కా విజయం నాటికి ప్రాజ్ఞ వయస్సుకు చేరుకున్నారు. ఈ రకంగా ఈయన్ని సహాబీగా కూడా పరిగణించవచ్చు. ఖురైష్‌కు చెందిన గొప్ప పండితులలో ఒకరుగా ఎంచబడతారు. హిజ్రీ 90లో - ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ హయాంలో - మరణించారు.

(٥٢٢) وَعَنْ قَبِيْصَةَ بْنِ مُخَارِقٍ الْهِلاَلِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ الْمَسْأَلَةَ لاَ تَحِلُّ إِلاَّ لأَحَدِ ثَلاَثَةٍ: رَجُلٌ تَحَمَّلَ حَمَالَةً، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ حَتَّى يُصِيبَهَا، ثُمَّ يُمْسِكُ، وَرَجُلٌ أَصَابَتْهُ جَائِحَةٌ اجْتَاحَتْ مَالَهُ، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ حَتَّى يُصِيبَ قِوَاماً مِنْ عَيْشٍ، وَرَجُلٌ أَصَابَتْهُ فَاقَةٌ، حَتَّى يَقُومَ ثَلاَثَةٌ مِنْ ذَوِي الْحِجَى مِنْ قَوْمِهِ: لَقَدْ أَصَابَتْ فُلاَناً فَاقَةٌ، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ حَتَّى يُصِيبَ قِوَاماً مِنْ عَيْشٍ، فَمَا سِوَاهُنَّ مِنَ الْمَسْأَلَةِ يَا قَبِيصَةُ سُحْتٌ، يَأْكُلُهُ صَاحِبُهُ سُحْتاً». رَوَاهُ مُسْلِمٌ وَأَبُو دَاوُدَ وابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

522. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనతో చెప్పారని హజ్రత్ ఖబీస బిన్ ముఖారిఖ్ హిలాలీ తెలియజేశారు: "యాచించటం కేవలం ముగ్గురు వ్యక్తుల కొరకే ధర్మసమ్మతం." ఒకడు: ఒకరి బరువు బాధ్యతలను తనపై వేసు కున్న వ్యక్తి. కడకు తన అప్పులు తీరిన తరువాత అతడు యాచించటం మాను కోవాలి. రెండవవాడు : ఏదైనా అనుకోని విపత్తుకు గురై ఆస్తిపాస్తులను కోల్పోయి నవాడు. అతడు తన కనీసావసరా లకై మాత్రమే ప్రశ్నించగలడు. మూడవ వాడు : పస్తులకు గురవుతున్నవాడు. నిజంగానే అతడు పస్తులుండవలసి వస్తోందని తన జాతికి చెందిన ముగ్గురు విజ్ఞులు ఆ మేరకు సాక్ష్యమివ్వాలి. అట్టి పరిస్థితిలో అతడు జరుగుబాటుకు సంబంధించినంతవరకు అడగటం ధర్మసమ్మతం. వీరుగాక.... ఓ ఖబీసా ! ప్రశ్నించటం (యాచించటం) హరామ్. ప్రశ్నించేవాడు (యాచించేవాడు) హరామ్‌తో తన పొట్ట నింపుకుంటు న్నాడు సుమా! (ముస్లిం, అబూదావూద్, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్)

### సారాంశం

యాచించేవాని నిజస్థితిని ధృవీకరించే ఒక పద్ధతి (సిస్టమ్) ఈ హదీసులో ప్రతిపాదించ బడింది. సమాజంలోని విజ్ఞులు, బాధ్యతాయుత వ్యక్తులు ముగ్గురు ఒక వ్యక్తి లేక ఒక కుటుంబం గురించి, వారు నిజంగానే అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారని, సమయానికి తిండిలేక పస్తులుండవలసి వస్తోందని సాక్ష్యపత్రం వ్రాసి ఇస్తే అప్పుడు వారు యాచించేందుకు అర్హులవుతారు. అడుక్కునే వారి స్థితిని వాకబు చేయమని కూడా చెప్పబడింది. దీన్నిబట్టి ఇస్లాం భిక్షాటనను ఎంతగా నిరుత్సాహ పరచిందో, శ్రమ జీవనాన్ని ఎంతగా ప్రోత్సహించిందో అర్థమవు తోంది.

**హదీసు ఉల్లేఖకులు**

ఖబీస బిన్ ముఖారిఖ్ హిలాలీ (రజి). ఈయన నామాంతరం అబూ బిష్ర్. దైవప్రవక్త ప్రియ సహచరులలో ఒకరు. బస్రాలో స్థిరపడ్డారు. ఒక ప్రతినిధి వర్గంతో కలసి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చారు. ఆయన (స) వద్ద హదీసులు విన్నారు. ఆరు హదీసులను ఉల్లేఖించారు.

(٥٢٣) وَعَنْ عَبْدِ الْمُطَّلِبِ ابْنِ رَبِيعَةَ ابْنِ الْحَارِثِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِنَّ الصَّدَقَةَ لاَ تَنْبَغِي لآلِ مُحَمَّدٍ، إِنَّمَا هِيَ أَوْسَاخُ النَّاسِ». وَفِي رِوَايَةٍ: «وَإِنَّهَا لاَ تَحِلُّ لِمُحَمَّدٍ وَلاَ لآلِ مُحَمَّدٍ». رَوَاهُ مُسْلِمٌ.

523. హజ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయ బిన్ హారిస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ముహమ్మద్ (స) కుటుంబీకులకు సదఖా పుచ్చుకోవటం ఎంతమాత్రం సమంజసం కాదు. ఇది ప్రజల ధన సంపదల కాలుష్యం." వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది : "సదఖా ముహమ్మద్ (స) కొరకూ, ముహమ్మద్ (స) కుటుంబీకుల కొరకూ ధర్మసమ్మతం కాదు." (ముస్లిం)

**హదీసు ఉల్లేఖకులు**

అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయ బిన్ హారిస్ (రజి). ఈయన వంశపరంపర ఈ విధంగా ఉంది: అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ ఖురషీ. ఈయన మదీనాలో స్థిరపడ్డారు. తరువాత డెమాస్కస్‌కు వెళ్ళారు. హిజ్రీ 62లో అక్కడే మరణించారు.

(٥٢٤) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: مَشَيْتُ أَنَا وَعُثْمَانَ بْنُ عَفَّانَ إِلَى النَّبِيِّ ﷺ، فَقُلْنَا: يَا رَسُولَ اللّٰهِ! أَعْطَيْتَ بَنِي الْمُطَّلِبِ مِنْ خُمُسِ خَيْبَرَ وَتَرَكْتَنَا، وَنَحْنُ وَهُمْ بِمَنْزِلَةٍ وَاحِدَةٍ، فَقَالَ

524. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం : నేను మరియు ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) ఇద్దరం కలసి దైవ ప్రవక్త (సఅసం) దగ్గరకెళ్ళి ఇలా విన్నవించుకున్నాము - "తమరు బనూ అబ్దుల్ ముత్తలిబ్ (అబ్దుల్ ముత్తలిబ్ సంతతి)కి ఖైబర్ నుంచి (విజయ ప్రాప్తిగా)లభించిన ఐదు ఆస్తులలో వాటా ఇచ్చారు. కాని మమ్మల్ని మాత్రం ఉపేక్షించటం జరిగింది. తమరితో గల సంబంధాల రీత్యా, సామీప్యం దృష్ట్యా

رَسُولُ اللهِ ﷺ: «إِنَّمَا بَنُو الْمُطَّلِبِ وَبَنُو هَاشِمٍ شَيْءٌ وَّاحِدٌ». رَوَاهُ الْبُخَارِيُّ.

ఇరువురూ సమానులే కదా!" ఇది విని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), "బనూ అబ్దుల్ ముత్తలిబ్, బనూ హాషిమ్ రెండూ ఒక్కటే" అని వ్యాఖ్యానించారు. (బుఖారీ)

**సారాంశం**

'మేము మరియు బనూ ముత్తలిబ్ సమానులమే కదా!' అని ఫిర్యాదు చేయటంలో గల ఆంతర్యం ఏమిటీ? రెండు ఉద్దేశ్యాలు కావచ్చు. ఒకటి : విశ్వసనీయతలో, వినయ విధేయతలలో అబ్దుల్ ముత్తలిబ్ సంతతి ఎంతగా రాణించిందో అంతగానే మేమూ రాణించాము. మీ మాటను ఎన్నడూ జవదాటలేదు. ఇక బంధుత్వ రీత్యా అంటారా? అందులోనూ మాకూ - ముత్తలిబ్ సంతతికి మధ్య పెద్దగా అంతరం లేదు. వాళ్లకి ఎంతగా మీతో దగ్గరి బంధుత్వముందో అంతగానే మాకూ మీతో బంధుత్వముంది. హజ్రత్ ఉస్మాన్ (రజి) బనూ ఉమయ్య వంశస్థులు. పైగా దైవప్రవక్త (స)కు అల్లుడు కూడాను. బనూ ఉమయ్య, బనూ హాషిమ్ వంశస్థులు ఖురైష్ వర్గంతో సరిసమానులుగా పరిగణించబడేవారు. మరోవిధంగా చెప్పాలంటే హజ్రత్ ఉస్మాన్ (రజి) బనూ అబ్దుషమ్స్‌లోని వారు. హజ్రత్ జుబైర్ (రజి) గారు నౌఫిల్ సంతానంలోని వారు. దైవప్రవక్త (సఅసం), అబ్బాస్ (రజి), హజ్రత్ అలీ (రజి) హాషిమ్ సంతతికి చెందినవారు. ఈ విధంగా వీరంతా ముత్తలిబ్ వంశస్థులే. హాషిమ్, ముత్తలిబ్, నౌఫిల్, అబ్దుషమ్స్ - ఈ నలుగురూ అబ్దె మునాఫ్ కుమారులే. ఈ విధంగా దైవప్రవక్త (స)తో ఉస్మాన్, జుబైర్, అలీకి సంబంధం ఒకే స్థాయికి చెందినది. ఉస్మాన్, జుబైర్‌లు దైవప్రవక్త (స)ను ప్రశ్నించటంలోని ఆంతర్యం కూడా ఇదే.

ఇక దైవప్రవక్త (సఅసం) సమాధానంలోని పరమార్థం ఏమై ఉంటుంది? అన్నది ప్రశ్న. ప్రాచీన కాలం నుంచీ బనూ హాషిమ్, బనూ ఉమయ్య సమాన స్థాయిలో చెలామణీ అవుతూ వస్తున్న సంగతి నిజమే. ఈ రకంగా ఆయన (స) ఎలాంటి తేడా చూపలేదు. కాకపోతే బనూ ఉమయ్యా కన్నా, బనూ హాషిమ్ దైవప్రవక్త (స)కు మరింత దగ్గరగా ఉంది. అందుకే ఆయన (స) బనూ హాషిమ్‌కి జకాత్ సొమ్మును నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేశారు. బనూ ఉమయ్య కొరకు జకాత్ సొమ్ము నిషిద్ధం కాదు. అందుకే బనూ హాషిమ్‌కి ఖైబర్‌కి చెందిన 'ఐదు ఆస్తులలో' వాటా ఇవ్వబడింది. బనూ ఉమయ్యాకు మాత్రం షేర్ లభించలేదు. ఈ కారణంగానే హజ్రత్ ఉస్మాన్ మరియు జుబైర్‌లకు ఖైబర్ విజయప్రాప్తిలో భాగం దక్కలేదు. జకాత్ సొమ్ము ధర్మసమ్మతం గావించబడిన సంతతికి 'ఐదు ఆస్తులలో' వాటా లభించలేదు. 'ఐదు ఆస్తులలో' వాటా పొందిన సంతతికై జకాత్ సొమ్ము శాశ్వతంగా నిషేధించబడింది. ఒక కోణం నుంచి ఒకరు లబ్ధిపొందగా, మరో కోణం నుంచి మరొకరికి న్యాయం జరిగిందన్నమాట!

(٥٢٥) وَعَنْ أَبِي رَافِعٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ رَجُلاً عَلَى

525. హజ్రత్ అబూ రాఫె (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మఖ్జూమ్ తెగకు చెందిన ఒక వ్యక్తిని జకాత్ వసూళ్లకై నియమించారు. ఆ

الصَّدَقَةِ مِنْ بَنِيْ مَخْزُومٍ، فَقَالَ لِأَبِيْ رَافِعٍ: اصْحَبْنِيْ، فَإِنَّكَ تُصِيْبُ مِنْهَا: فَقَالَ: لَا، حَتَّى آتِيَ النَّبِيَّ ﷺ، فَأَسْأَلَهُ، فَأَتَاهُ، فَسَأَلَهُ، فَقَالَ: «مَوْلَى الْقَوْمِ مِنْ أَنْفُسِهِمْ، وَإِنَّهَا لَا تَحِلُّ لَنَا الصَّدَقَةُ». رَوَاهُ أَحْمَدُ وَالثَّلَاثَةُ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

వ్యక్తి అబూ రాఫేనుద్దేశించి, 'నువ్వు కూడా నాతో రా. నీకూ ఇందులో ఎంతో కొంత భాగం లభిస్తుంది' అని అన్నాడు. 'దైవప్రవక్త (స) ను సంప్రతించి అందలి ఉచితానుచితాల గురించి తెలుసుకునే వరకూ నేను రాలేను' అని ఆయన బదులిచ్చారు. కనుక ఆయన (స) వద్దకు వెళ్ళి ఈ సంగతి గురించి ఆరా తీయగా, ఆయన (స) ఇలా అన్నారు : "ఒక జాతి దగ్గర వున్న బానిస కూడా ఆ జాతికి చెందిన వాడే అవుతాడు. మన కోసం సదఖా (జకాత్) ధర్మసమ్మతం కాదు." (దీనిని అహ్మద్, మరి ముగ్గురు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్ కూడా)

### సారాంశం

ఏ వ్యక్తికై జకాత్ సొమ్ము నిషిద్ధం గావించబడిందో అతని వద్ద ఉన్న బానిసకై కూడా అది హరామ్ (నిషిద్ధం) అయిపోతుంది. అబూ రాఫె (రజి) దైవప్రవక్త (స) బానిస అవటం వల్ల ఆయన కోసం కూడా జకాత్ నిషేధించబడింది.

### హదీసు ఉల్లేఖకులు

అబూ రాఫె (రజి). ఈయన అసలు పేరుపై భిన్నాభిప్రాయాలున్నాయి. అస్లం అనీ, హుర్‌ముజ్ అనీ, సాబిత్ అనీ, ఇబ్రాహీం అనీ రకరకాలుగా చెప్పబడింది. వాస్తవానికి ఈయన హజ్రత్ అబ్బాస్ బానిస. ఆయన ఈయన్ని దైవప్రవక్తకు కానుకగా సమర్పించుకున్నారు. ఈయన బద్ర్ యుద్ధానికి మునుపు ఇస్లాం స్వీకరించారు. కాని బద్ర్‌లో పాల్గొనలేదు. ఆ తరువాత జరిగిన యుద్ధాలలో పాల్గొన్నారు. హజ్రత్ అబ్బాస్ ఇస్లాం స్వీకరించిన శుభవార్తను ఈయన దైవప్రవక్త (స)కు వినిపించగా, ఈ ఆనందంలో దైవప్రవక్త (స) ఈయనకు స్వేచ్ఛనొసగారు. హిజ్రీ 36లో - హజ్రత్ అలీ పరిపాలనా కాలంలో - మదీనాలో మరణించారు.

(٥٢٦) وَعَنْ سَالِمِ بْنِ عَبْدِ اللهِ بْنِ عُمَرَ، عَنْ أَبِيْهِ، أَنَّ رَسُولَ اللهِ ﷺ كَانَ يُعْطِي عُمَرَ الْعَطَاءَ، فَيَقُوْلُ: أَعْطِهِ أَفْقَرَ مِنِّيْ، فَيَقُولُ:

526. హజ్రత్ సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ (రహ్మ.లై) బిన్ ఉమర్ (రజి) తన తండ్రి ఆధారంగా ఉల్లేఖించారు - దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఉమర్ (రజి) కు ఏదన్నా వస్తువును ఇవ్వబోతే, 'నాకన్నా

خُذْهُ، فَتَمَوَّلْهُ، أَوْ تَصَدَّقْ بِهِ، وَمَا جَاءَكَ مِنْ هٰذَا الْمَالِ، وَأَنْتَ غَيْرُ مُشْرِفٍ وَلاَ سَائِلٍ، فَخُذْهُ، وَمالاَ فَلاَ تُتْبِعْهُ نَفْسَكَ. رَوَاهُ مُسْلِمٌ.

పేదవారైన వారికి ఇవ్వండి' అని హజ్రత్ ఉమర్ (రజి) అనేవారు. దానికి సమాధానంగా ఆయన (స), "దీన్ని తీసుకోండి. దీనిద్వారా స్థితిమంతులవండి లేదా దీన్ని ఇతరులకు దానం చేయండి. అత్యాశకు, ప్రలోభానికి పోకుండా ఏదైనా వస్తువు దానంతట అదే మీ వద్దకు వస్తే దాన్ని స్వీకరించండి. అందని దానికోసం మాత్రం ఆరాటపడకండి" అని ఉపదేశించారు. (ముస్లిం)

**సారాంశం**

ఏదేని వ్యవస్థలో పనిచేసే వ్యక్తి -తన జరుగుబాటు నిమిత్తం - వేతనం లేక ప్రతిఫలం తీసుకోవటంలో తప్పులేదని ఈ హదీసు చెబుతోంది. ఈ సంఘటన హజ్రత్ ఉమర్ (రజి) వసూలు చేసిన జకాత్ సొమ్ముపై ప్రతిఫలానికి సంబంధించినదని 'ముస్లిం'లోని ఒక హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. కాకపోతే మనిషిలో అత్యాశ ఉండకూడదు. పై అధికారులు అతని సేవలను గుర్తించి, అతనికేదైనా ప్రతిఫలం ఇస్తే అది అతని పాలిట ఒక 'పురస్కారం' అవుతుంది. అంతేగాని అతడు ధనానికి, కమీషన్‌కు ఆశపడి జకాత్ సొమ్మును వసూలు చేయకూడదు. అలాగే తనకు లభించదనుకున్న దానికోసం అనవసరంగా ప్రాకులాడకూడదు. పేరాశ కూడా 'హరాం' క్రిందికే వస్తుంది.

# 5. ఉపవాసాల పుస్తకం

## ٥ - كِتَابُ الصِّيَامِ

### ఉపవాస నియమాలు

(٥٢٧) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «لاَ تَقَدَّمُوا رَمَضَانَ بِصَوْمِ يَوْمٍ وَلاَ يَوْمَيْنِ، إِلاَّ رَجُلٌ كَانَ يَصُومُ صَوْماً فَلْيَصُمْهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

527. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీలో ఎవ్వరూ రమజాన్‌కు ముందు ఒకటి లేక రెండు ఉపవాసాలు ఉండకండి. అయితే ఎవరన్నా అంతకు ముందు నుంచి ఉపవాసవ్రతాలు పాటిస్తూ వస్తున్నట్లయితే ఆ రోజు ఉపవాసాన్ని పూర్తిచేసుకోవచ్చు." (బుఖారీ, ముస్లిం)

(٥٢٨) وَعَنْ عَمَّارِ بْنِ يَاسِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَنْ صَامَ الْيَوْمَ الَّذِيْ يُشَكُّ فِيْهِ، فَقَدْ عَصَى أَبَا الْقَاسِمِ ﷺ. ذَكَرَهُ الْبُخَارِيُّ تَعْلِيْقاً، وَوَصَلَهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

528. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కథనం : "ఎవరయితే సందేహాస్పదమయిన రోజున ఉపవాసం (రోజా) పాటించాడో అతడు అబుల్ ఖాసిం (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అవిధేయత చూపాడు." (బుఖారీ దీనిని 'ముఅల్లఖ్'గా పేర్కొన్నారు. ఐదుగురూ దీనిని 'మౌసూల్'గా పరిగణించారు. కాగా; ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఇస్లామీయ షరీయత్ ప్రకారం ఉపవాసాలు మొదలెట్టినా (రమజాన్) నెలవంకను చూసి మొదలెట్టాలి. ఉపవాసాలు విరమించినా (షవ్వాల్) నెలవంకను చూసి మరీ విరమించాలి. ఒకవేళ షాబాన్ నెల 29వ తేదీన నెలవంక కనిపించకపోతే ఆ మరుసటి రోజు షరీయత్‌పరంగా సందేహాస్పదమయిన రోజుగా భావించబడుతుంది. ఆ దినాన ఉపవాసం ఉండటం భావ్యం కాదు. ఈ సందర్భంగా ఖగోళ శాస్త్రజ్ఞుల లెక్కలపై ఆధారపడటం కూడా షరీయత్ స్ఫూర్తికి విరుద్ధం. ఖగోళ శాస్త్రవేత్తలు వేసిన లెక్కలు కూడా అనేకసార్లు నిజం కాలేదు.

(٥٢٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِذَا رَأَيْتُمُوهُ فَصُومُوا، وَإِذَا رَأَيْتُمُوهُ فَأَفْطِرُوا، فَإِنْ غُمَّ عَلَيْكُمْ فَاقْدُرُوا لَهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: فَإِنْ أُغْمِيَ عَلَيْكُمْ فَاقْدُرُوا لَهُ ثَلَاثِينَ. وَلِلْبُخَارِيِّ: فَأَكْمِلُوا الْعِدَّةَ ثَلَاثِينَ. وَلَهُ فِي حَدِيثِ أَبِي هُرَيْرَةَ: فَأَكْمِلُوا عِدَّةَ شَعْبَانَ ثَلَاثِينَ.

529. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "నెలవంకను చూసిన మీదట మీరు ఉపవాసాలుండండి. (పండుగ కోసం) నెలవంకను చూసిన మీదట ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయండి. ఒకవేళ ఆకాశం మేఘావృతమయివుంటే లెక్క వేసుకోండి." (ముత్తఫఖున్ అలైహ్). 'ముస్లిం'లోని వాక్యం ఇలా వుంది: "ఒకవేళ ఆకాశం మేఘావృతమై ఉంటే 30 రోజుల లెక్క కట్టండి." బుఖారీలో ఈ విధంగా ఉంది - "మరి 30 రోజాల లెక్కను పూర్తిచేయండి." బుఖారీలోనే హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖనం ఇలా వుంది: "మరి మీరు షాబాన్ నెలలోని 30 రోజులను గణించండి."

(٥٣٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: تَرَاءَى النَّاسُ الْهِلَالَ، فَأَخْبَرْتُ النَّبِيَّ ﷺ أَنِّي رَأَيْتُهُ، فَصَامَ، وَأَمَرَ النَّاسَ بِصِيَامِهِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ وَابْنُ حِبَّانَ.

530. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : "ప్రజలు నెలవంకను దర్శించసాగారు. నేను కూడా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు నెలవంకను చూశానని సమాచారం అందజేశాను. ఆయన (స) స్వయంగా ఉపవాసం ఉండటమే గాక, ఉపవాసాలుండమని జనులను ఆజ్ఞాపించారు." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - హాకిమ్, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులన్నింటి ద్వారా అవగతమయ్యేదేమిటంటే నెలవంకను చూసి ఉపవాసాలు మొదలెట్టాలి. నెలవంకను చూసిన మీదట ఉపవాసాలు విరమించాలి. ఒకవేళ షాబాన్ నెల

29వ తేదీన నెలవంక కనబడకపోతే ఆ నెలను 30 రోజుల నెలగా పరిగణించాలి. అలాగే రమజాన్ నెల 29వ తేదీన నెలవంక దర్శనమివ్వకపోతే 30 రోజుల ఉపవాసాలు పూర్తిచేయాలి. ఒకవేళ ఆకాశం మేఘావృతమై ఉన్న కారణంగా నెలవంక కనబడక, ఆకాశం నిర్మలంగా ఉన్నచోట నెలవంక కనబడితే దీని ఆధారంగా ఆ ప్రాంతంలోని పట్టణాలు, గ్రామాలన్నింటిలో ఉపవాస వ్రతాలు ప్రారంభించాలి. పండుగ జరుపుకునే విషయంలో కూడా ఈ విధానాన్నే అనుసరించాలి. ఒకవేళ చంద్రుడు దర్శనమిచ్చిన ప్రాంతం భౌగోళికంగా పూర్తిగా భిన్నమైనదైనపుడు దాన్ని లెక్కలోకి తీసుకోవలసిన అవసరం లేదు. ఉపవాసం ఉండటానికి నమ్మకస్థుడైన ఒక వ్యక్తి నెలవంకను చూసినట్లు సాక్ష్యమిస్తే సరిపోతుంది. కాని పండుగ జరుపుకోవటానికి మాత్రం ఇద్దరు వ్యక్తులు సాక్ష్యం ఇవ్వాలి.

(٥٣١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ أَعْرَابِيًّا جَاءَ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: إِنِّي رَأَيْتُ الْهِلَالَ، فَقَالَ: أَتَشْهَدُ أَن لاَّ إِلٰهَ إِلاَّ اللَّهُ؟ قَالَ: نَعَمْ. قَالَ: أَتَشْهَدُ أَنَّ مُحَمَّداً رَّسُولُ اللهِ؟ قَالَ نَعَمْ، قَالَ: فَأَذِّنْ فِي النَّاسِ يَا بِلَالُ أَنْ يَصُومُوا غَداً. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ، وَرَجَّحَ النَّسَائِيُّ إِرْسَالَهُ.

531. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి తాను నెలవంకను చూచి నట్టు విన్నవించుకున్నాడు. "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడని నీవు సాక్ష్యమిస్తున్నావా?" అని దైవప్రవక్త (స) ఆ వ్యక్తిని ప్రశ్నించారు. 'అవున'న్నాడా వ్యక్తి. "ముహమ్మద్ దేవుని ప్రవక్త అని నీవు సాక్ష్యమిస్తున్నావా?" అని నిల దీశారు ఆ వ్యక్తిని. దానికతను 'అవును' అన్నాడు. అప్పుడాయన (స) ఇలా అన్నారు : "బిలాల్! లేవండి. రేపు ప్రజల్ని ఉపవాసాలుండమని ప్రకటించండి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు - నసాయి మాత్రం దీనిని 'ముర్సల్'గా భావించారు)

(٥٣٢) وَعَنْ حَفْصَةَ أُمِّ الْمُؤْمِنِينَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «مَنْ لَمْ

532. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా (ర.అన్హా)

يُبَيِّتِ الصِّيَامَ قَبْلَ الْفَجْرِ فَلاَ صِيَامَ لَهُ». رَوَاهُ الْخَمْسَةُ، وَمَالَ التِّرْمِذِيُّ وَالنَّسَائِيُّ إِلَى تَرْجِيحِ وَقْفِهِ، وَصَحَّحَهُ مَرْفُوعاً ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

తెలిపారు : ''ఎవరయితే ఉషోదయానికి ముందే ఉపవాస సంకల్పం చేసుకోలేదో వారి ఉపవాసం ఉపవాసమే కాదు.'' (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఈ హదీసు 'మౌఖూఫ్' అయి ఉంటుందని తిర్మిజీ, నసాయి తలపోశారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్‌లు మాత్రం 'మర్ఫూ'గా పరిగణించారు)

وَلِلدَّارَقُطْنِيِّ: «لاَ صِيَامَ لِمَنْ لَمْ يَفْرِضْهُ مِنَ اللَّيْلِ».

దారెఖుత్నీ లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: ''ఎవరయితే రాత్రిపూట ఉపవాసాన్ని తన కొరకు తప్పనిసరిగా చేసుకోలేదో అతని ఉపవాసం నెరవేరదు.''

### సారాంశం

తెల్లవారకముందే ఫర్జ్ రోజాల సంకల్పం చేసుకోవటం అవసరమని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. సంకల్పం (నియ్యత్) సూర్యాస్తమయం మొదలుకుని ఫజ్ర్ నమాజ్ వేళ వరకూ ఎప్పుడయినా చేసుకోవచ్చు. ఉపవాసం ఒక ఆచరణ. ఆచరణలు సంకల్పంపై ఆధారపడి ఉంటాయి గనక రోజా (ఉపవాసం) అనే ఆచరణ కోసం కూడా సంకల్పం అనివార్యం. ప్రతిరోజూ ఉపవాసానికి ముందు సంకల్పం అవసరమవుతుంది. అయితే సంకల్పం కోసం ప్రత్యేకంగా నోటితో పలకవలసిన అవసరం లేదు. మనసులో దీక్ష బూనితే సరిపోతుంది. దైవప్రవక్త (స)గానీ, ప్రియ సహచరులు (రజి)గానీ సంకల్ప వచనాలు నోటితో పలికిన దాఖలాలేమీ లేవు.

### హదీసు ఉల్లేఖకులు

హఫ్సా బిన్తె ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర.అన్హా). మొదట ఈమె ఖునైస్ బిన్ హుజాఫా సహ్మీ నికాహ్‌లో ఉన్నారు. బద్ర్ యుద్ధ సందర్భంగా ఈయన మరణించారు. తరువాత దైవప్రవక్త (సఅసం) ఆమెను నికాహ్ చేసుకుని తన దాంపత్య జీవితంలోనికి తెచ్చుకున్నారు. ఇది హిజ్రీ 3వ సంవత్సరంలో జరిగిన సంఘటన. ఈమె 60 ఏళ్ల వయస్సులో - హిజ్రీ 45వ సంవత్సరంలో- మరణించారు.

(٥٣٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: دَخَلَ عَلَيْنَا النَّبِيُّ ﷺ ذَاتَ يَوْمٍ فَقَالَ: هَلْ عِنْدَكُمْ شَيْءٌ؟ قُلْنَا: لاَ، قَالَ: فَإِنِّي إِذاً صَائِمٌ، ثُمَّ أَتَانَا يَوْماً آخَرَ، فَقُلْنَا: أُهْدِيَ لَنَا

533. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ఒకనాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా వద్దకు వచ్చి, ''మీ దగ్గర (తినడానికి) ఏ వస్తువు అయినా ఉందా?'' అని అడిగారు. 'లేదు' అని మేము సమాధానమిచ్చాము. ''అలాగైతే నేను (ఈ రోజు) ఉపవాసం ఉంటాను''

حَيْسٌ، فَقَالَ: أَرِينِيهِ فَلَقَدْ أَصْبَحْتُ صَائِماً، فَأَكَلَ. رَوَاهُ مُسْلِمٌ.

అన్నారు. అలాగే మరో రోజు ఆయన వచ్చినపుడు '(ఎక్కడినుంచో) పాయసం కానుకగా పంపబడింది' అని మేము చెప్పాము. దానికి ఆయన (స), "ఏదీ నాకు చూపెట్టండి, పొద్దున్నుంచి నేను ఉపవాసం ఉన్నాను" అని అన్నారు. తరువాత ఆయన (స) పాయసం ఆరగించారు. (ముస్లిం)

**సారాంశం**

ఇది నఫిల్ ఉపవాసాలకు సంబంధించినదేగాని, రమజాన్ మాసంలో పాటించే ఫర్జ్ ఉపవాసాల వ్యవహారం కాదు. నఫిల్ ఉపవాసాల సంకల్పం తెల్లవారకమునుపే చేసుకోవలసిన అవసరం లేదు. సూర్యోదయం తరువాత కూడా ఈ సంకల్పం చేయవచ్చు. నలుగురు ఇమాములలో ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) గారు, నఫిల్ ఉపవాసం కోసం కూడా తెల్లవారక ముందే సంకల్పం అవశ్యమని భావిస్తున్నారు. కాని హదీసులో ఈ మేరకు ఎలాంటి ఆంక్ష లేదు.

నఫిల్ ఉపవాసాలు అకారణంగా కూడా - మధ్యాంతరంలో - విరమించవచ్చని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ముగ్గురు ఇమాముల (ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్)తో పాటు పెక్కుమంది ధర్మవేత్తలు దీంతో ఏకీభవించారు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో అకారణంగా రోజాను మధ్యలో విరమించటం ధర్మసమ్మతం కాదు. ఎవరయినా విందుకు ఆహ్వానిస్తేనే నఫిల్ ఉపవాసాన్ని విరమించవచ్చనీ, వేరితర కారణాలపై విరమించరాదని ఆయన అభిప్రాయపడ్డారు.

(٥٣٤) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: «لاَ يَزَالُ النَّاسُ بِخَيْرٍ مَا عَجَّلُوا الْفِطْرَ» مُتَّفَقٌ عَلَيْهِ.

534. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ప్రజలు ఉపవాసాన్ని విరమించటం (ఇఫ్తార్ చేయటం)లో శీఘ్రత కనబరచినంత కాలం క్షేమంగా ఉంటారు." (ముస్లిం)

وَلِلتِّرْمِذِيِّ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: قَالَ اللّٰهُ عَزَّ وَجَلَّ: «أَحَبُّ عِبَادِي إِلَيَّ، أَعْجَلُهُمْ فِطْراً».

తిర్మిజీలో హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం ఈ విధంగా ఉంది : ఆయన (సఅసం) ఇలా అన్నారు - "నా దాసులలో ఇఫ్తార్ కొరకు త్వరపడేవారే నాకు అత్యంత ప్రియతములు" అని అల్లాహ్ సెలవిచ్చాడు.

**సారాంశం**

సూర్యాస్తమయం అయిందని ఖచ్చితంగా నిర్ధారణ అయిపోయిన తరువాత అనవసరంగా కాలయాపన చేయకుండా - తొందరగా-ఇఫ్తార్ చేసుకోవాలి. ఆలస్యంగా ఇఫ్తార్ చేయటం యూదుల, క్రైస్తవుల పద్ధతి. కనుక మనం దైవప్రవక్త (స) ప్రబోధనానుసారం ఇఫ్తార్ కొరకు వేగిరపడాలి. కాస్త ఆలస్యంగా ఇఫ్తార్ చేస్తే ఎక్కువ పుణ్యం దక్కుతుందనుకొని-ఉద్దేశ్యపూర్వకంగా - ఆలస్యం చేయటం బిద్అత్ క్రిందికి వస్తుంది.

(٥٣٥) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «تَسَحَّرُوا، فَإِنَّ فِي السُّحُورِ بَرَكَةً». مُتَّفَقٌ عَلَيْهِ.

535. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హ్జ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖించారు- "సహ్రీని భుజించండి. ఎందుకంటే అందులో ఎంతో శుభం ఉంది."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

సహ్రీ తినవలసిన ఆవశ్యకతను ఈ హదీసు సూచిస్తోంది. ఎందుకంటే యూదులు, క్రైస్తవులు సహ్రీ ఏర్పాట్లు చేసుకోరు. వారికీ - మనకూ మధ్య ఉన్న వ్యత్యాసం ఇదే. సహ్రీ భుజించటం వల్ల ఉపవాసి నిస్సత్తువకు, నీరసానికి గురికాకుండా ఉంటాడు.

(٥٣٦) وَعَنْ سَلْمَانَ بْنِ عَامِرٍ الضَّبِّيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا أَفْطَرَ أَحَدُكُمْ فَلْيُفْطِرْ عَلَى تَمْرٍ، فَإِنْ لَمْ يَجِدْ فَلْيُفْطِرْ عَلَى مَاءٍ، فَإِنَّهُ طَهُورٌ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

536. హ్జ్రత్ సల్మాన్ బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరయినా ఉపవాసాన్ని విరమించేటప్పుడు ఖర్జూరంతో ఇఫ్తార్ చేయాలి. ఖర్జూరం గనక లభ్యం కాక పోతే మంచి నీరుతో ఇఫ్తార్ చేయండి. ఎందుకంటే అది పరిశుద్ధమైనది." (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

వీలయినంతవరకు ఖర్జూర పండ్లతో ఇఫ్తార్ చేసేందుకు ప్రయత్నించాలి. ఎందుకంటే ఖర్జూరం జీర్ణకోశానికి శక్తినీ, పుష్టినీ సమకూరుస్తుంది. పగలల్లా ఉపవాసం ఉండటం వలన కలిగిన బలహీనతను అది చాలా వరకు దూరం చేస్తుంది. ఒకవేళ ఖర్జూరం గనక దొరక్కపోతే మంచినీళ్ళతోనే ఉపవాసాన్ని విరమించాలి. పండ్లు దొరక్కపోతే ఎండు ఖర్జూరంతోనే ఇఫ్తార్ చేయాలి. అదీ లభ్యం కాని పరిస్థితిలో మంచినీరు త్రాగాలి.

**హదీసు ఉల్లేఖకులు**

సల్మాన్ బిన్ ఆమిర్ (రజి). పూర్తి వంశపరంపర ఇలా ఉంది: సల్మాన్ బిన్ ఆమిర్ బిన్ ఔస్ బిన్ హుజ్ర్ బిన్ అమ్ర్ బిన్ హారిస్ జబ్బి. ప్రఖ్యాత సహచరులు. బస్రాలో స్థిరపడ్డారు. దైవప్రవక్త(స) కాలంలోనే వృద్ధ సహాబీలలో ఒకరుగా పేరుపడ్డారు. ముఆవియ పరిపాలనా కాలం వరకూ బ్రతికి ఉన్నారని ప్రతీతి. మరో కథనం ప్రకారం జమల్ యుద్ధంలో అమరగతి నొందారు. అప్పటికి ఆయనకు నూరేళ్ళు నిండాయి.

(٥٣٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الوِصَالِ، فَقَالَ رَجُلٌ مِّنَ الْمُسْلِمِينَ: فَإِنَّكَ تَوَاصِلُ يَا رَسُولَ اللهِ؟ قَالَ: **«وَأَيُّكُمْ مِثْلِيْ؟ إِنِّي أَبِيتُ يُطْعِمُنِيْ رَبِّيْ وَيَسْقِيْنِيْ»**، فَلَمَّا أَبَوْا أَنْ يَنْتَهُوا عَنِ الْوِصَالِ وَاصَلَ بِهِمْ يَوْماً، ثُمَّ يَوْماً، ثُمَّ رَأَوُا الْهِلاَلَ، فَقَالَ: **«لَوْ تَأَخَّرَ الْهِلاَلَ لَزِدْتُكُمْ»**، كَالْمُنَكِّلِ لَهُمْ حِيْنَ أَبَوا أَن يَنْتَهُوا. مُتَّفَقٌ عَلَيْهِ.

537. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'విసాల్'ను (నిరంతరం - ఎడతెగకుండా - ఉపవాసముండటాన్ని) వారించారు. 'దైవప్రవక్తా! మరి తమరు ఎడతెగకుండా ఉపవాసాలుంటున్నారు కదా!' అని ముస్లింలలోని ఒక వ్యక్తి ప్రశ్నించగా; "మీలో నా లాంటి వారెవరున్నారు? నేను రాత్రి నా ప్రభువు సమక్షంలో గడుపుతాను. ఆయన నాకు తిని పిస్తాడు, త్రాగిస్తాడు" అని ఆయన (స) సెలవిచ్చారు. ఎంతకీ ప్రజలు వినకపోవటంతో ఆయన (సఅసం) వారితో కలసి ఒక రోజు, రెండవ రోజు కూడా ఎడతెగని ఉపవాసం (విసాల్) మొదలెట్టారు. ఆనాడు నెలవంక కనిపించటంతో ఆయన (స) తన సహచరుల నుద్దేశ్యించి, "ఈ రోజు నెలవంక దర్శనమివ్వబట్టి సరిపోయింది. లేకుంటే మీ కోసం మరిన్ని రోజులు 'విసాల్' చేసేవాణ్ణి" అని అన్నారు. అంటే ఆయన (స) తన ప్రియసహచరులు తన మాటను లెక్క చేయనందుకు వారిని శిక్షించదలిచారన్న మాట! (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'విసాల్' అవాంఛనీయం అని హదీసులో చెప్పబడింది. విసాల్ అంటే ఏమీ తినకుండా, త్రాగకుండా నిరంతరం ఉపవాసాలుండటం అని అర్థం. ఇలాంటి అతివాదాన్ని ఇస్లాం ఇష్టపడదు. దేవుడు తన దాసులను కష్టాల్లో పడవేయదలచుకోడు. అయితే దైవప్రవక్త (సఅసం) వ్యవహారం ప్రత్యేకమైనది. దైవసన్నిధిలో ఆయన (స) చేసే ధ్యానం వల్ల ఇతోధిక శక్తి ఆయనకు లభించేది. ప్రవక్త (స) వారి ఉపవాసాలను గమనించిన సహచరులు, తాము కూడా ఆధ్యాత్మికంగా ఉన్నత స్థానానికి చేరుకోవాలన్న తపనతో నిరంతర ఉపవాసాలు ఆరంభించారు. కాని దైవప్రవక్త (స) తన సహచరులను గట్టిగా వారించారు. అప్పటికీ వారు వెనుకాడకపోవటంతో, వారిని దండించే ఉద్దేశ్యంతో దైవప్రవక్త (స) కూడా వారితో పాటే ఉపవాస దీక్ష మొదలెట్టారు. అంతలోనే నెలవంక దర్శనమిచ్చింది. "చంద్రుడు కనిపించకుండా ఉంటే ఈ దీక్షను మరింత సుదీర్ఘం చేసి ఉండేవాడిని. అప్పటికిగాని మీకు బోధపడేది కాదు" అని చురక అంటించారు.

538. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రబోధించారు: "ఎవరయితే అబద్ధం చెప్పటం, అబద్ధంపై ఆచరించటం విడనాడలేదో, మూర్ఖత్వపు ధోరణిని వదలలేదో అతడు అన్నపానీయాలను పరిత్యజించటంపట్ల అల్లాహ్‌కు ఏ మాత్రం ఆసక్తి లేదు." (బుఖారీ, అబూదావూద్ - హదీసు వాక్యాలు మాత్రం అబూదావూద్‌లోనివి)

(٥٣٨) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ لَمْ يَدَعْ قَوْلَ الزُّورِ، وَالْعَمَلَ بِهِ، والْجَهْلَ، فَلَيْسَ لِلَّهِ حَاجَةٌ فِي أَنْ يَدَعَ طَعَامَهُ وَشَرَابَهُ». رَوَاهُ البخاريُّ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ.

**సారాంశం**

ఉపవాసి అనేవాడు అబద్ధాన్ని, బూటకపు ప్రేలాపనలను, మూర్ఖత్వపు చేష్టలను పూర్తిగా విడనాడాలని ఈ హదీసు చెబుతోంది. అసత్య ప్రకటనలవల్ల, వ్యర్థ ప్రేలాపనలవల్ల ఉపవాసంలోని ఆధ్యాత్మికత హరించుకుపోతుంది. అందుకే ఉపవాస దీక్షకు పూనుకున్న వ్యక్తి నీతిబాహ్యమైన విధానాలకు, అనర్థదాయకమైన పోకడలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే ఉపవాసం ద్వారా దేవుడు తన దాసులలో దైవభీతిని, సాత్వికతను, ఆత్మ నిగ్రహాన్ని పెంపొందించగోర్తున్నాడు. అబద్ధం, దగా, మోసం, అవినీతి, అరాచకం వంటి చెడుల నుంచి కాపాడదలుస్తున్నాడు. ఈ లక్ష్యాలే గనక ఉపవాస వ్రతం ద్వారా అతనికి ప్రాప్తించకపోతే పొద్దస్తమానం అతడు ఆకలి దప్పులతో బాధపడి ప్రయోజనం ఏమీలేదు.

539. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాస స్థితిలో తన భార్యను

(٥٣٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُقَبِّلُ وَهُوَ

صَائِمٌ، وَيُبَاشِرُ وَهُوَ صَائِمٌ، وَلٰكِنَّهُ كَانَ أَمْلَكَكُمْ لِإِرْبِهِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ، وَزَادَ فِيْ رِوَايَةٍ: «فِيْ رَمَضَانَ».

ముద్దుపెట్టుకునేవారు, కౌగిలించుకునేవారు. అయితే ఆయన (స‌అసం)కు మీకన్నా అధికంగా తనపై పూర్తి అదుపు, నిగ్రహం ఉండేవి. (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం ముస్లింలోనివి) 'ఆయన (స) ఈ రెండు పనులనూ రమజాన్ నెలలో చేసేవార'ని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

(٥٤٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ احْتَجَمَ وَهُوَ مُحْرِمٌ، وَاحْتَجَمَ وَهُوَ صَائِمٌ. رَوَاهُ الْبُخَارِيُّ.

540. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఇహ్రామ్' కట్టుకుని ఉన్నప్పుడు, ఉపవాసస్థితిలో ఉన్నప్పుడు (కూడా) శరీరానికి సూది గుచ్చుకున్నారు (అంటే చెడు రక్తాన్ని తీశారు). (బుఖారీ)

**సారాంశం**

సూది గుచ్చటంవల్ల (శస్త్ర చికిత్స వల్ల, శరీరంలో ఎక్కడైనా పేరుకుని ఉన్న చెడు రక్తాన్ని, చీము నెత్తురును తొలగించటం వల్ల) ఉపవాసానికిగానీ, ఇహ్రామ్ దీక్షకు గానీ ఎలాంటి నష్టం వాటిల్లదని ఈ హదీసు వల్ల స్పష్టమవుతున్నది. అయితే ఈ సాహసానికి పూనుకునే ముందు ఉపవాసులు తమలో గల శక్తినీ, ఓపికను సరిగ్గా బేరీజు వేసుకోవాలి. నీరసంవల్ల ఉపవాసం భంగమయ్యే ప్రమాదముంటే దాని జోలికి పోకూడదు.

(٥٤١) وَعَنْ شَدَّادِ بْنِ أَوْسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أَتَى عَلَى رَجُلٍ بِالْبَقِيْعِ، وَهُوَ يَحْتَجِمُ فِيْ رَمَضَانَ، فَقَالَ: «أَفْطَرَ الْحَاجِمُ وَالْمَحْجُومُ». رَوَاهُ الْخَمْسَةُ إِلَّا التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ أَحْمَدُ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

541. హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'బఖీ'లో ఒక వ్యక్తిని సమీపించారు. అతడు రమజాన్ (నెల)లో శరీరం నుంచి రక్తం తీస్తున్నాడు. ఆయన (స) అతణ్ణి చూచి, 'శరీరానికి సూదులు పొడిచే, పొడిపించుకునే వారిద్దరి ఉపవాసం భంగమైనట్లే' అని అన్నారు. ('ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలినవారు దీనిని ఉల్లేఖించారు. అహ్మద్, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసు రద్దయిపోయిందని ఒక ఉల్లేఖనం ఆధారంగా తెలుస్తోంది. రాబోయే హదీసులలో ఏమనబడిందో గమనించండి.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు షద్దాద్ బిన్ ఔస్ (రజి). మారు పేరు అబూ యాల. అన్సార్ వర్గానికి చెందిన వారు. మదీనా వాస్తవ్యులు. హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ (రజి)కు భ్రాతృజులు. జ్ఞాన సంపన్నులు. మృదు స్వభావులు. హిజ్రీ 58లో సిరియాలో మరణించారు. అప్పటికి ఆయనకు 75 ఏండ్లు.

(٥٤٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أَوَّلُ مَا كُرِهَتِ الْحِجَامَةُ لِلصَّائِمِ، أَنَّ جَعْفَرَ بْنَ أَبِيْ طَالِبٍ احْتَجَمَ وَهُوَ صَائِمٌ، فَمَرَّ بِهِ النَّبِيُّ ﷺ فَقَالَ: أَفْطَرَ هٰذَانِ. ثُمَّ رَخَّصَ النَّبِيُّ ﷺ بَعْدُ فِي الْحِجَامَةِ لِلصَّائِمِ، وَكَانَ أَنَسٌ يَحْتَجِمُ وَهُوَ صَائِمٌ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَقَوَّاهُ.

542. హజ్రత్ అనస్ (రజి) కథనం : అన్నిటికన్నా ముందు ఉపవాసికి - శరీరానికి సూది పొడుచుకోవటం ఎందుకు అయిష్టకరంగా భావించబడిందంటే జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) ఉపవాసస్థితిలో సూది పొడిపించుకున్నారు. దైవప్రవక్త (సఅసం) ఆయన వైపునుంచి వెళుతూ, "వీరిరువురి ఉపవాసం భంగమైపోయింది" అని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సఅసం), ఉపవాసి సూది పొడిపించుకు నేందుకు అనుమతినిచ్చారు. ఉపవాస స్థితిలో అనస్(రజి) కూడా సూది పొడిపించుకునేవారు. (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించడంతోపాటు దృఢమైన హదీసుగా నిర్ధారించారు)

### సారాంశం

సూది గుచ్చటంవల్ల ఉపవాసం భంగమైపోతుందన్న హదీసు రద్దయిపోయిందనటానికి ఈ హదీసు ప్రబలనిదర్శనం.

(٥٤٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ اكْتَحَلَ فِيْ رَمَضَانَ وَهُوَ

543. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ నెలలో - ఉపవాస స్థితిలో-'సుర్మా' పెట్టుకున్నారు. (దీనిని ఇబ్నెమాజ వివరించారు. ఈ విషయం

صَائِمٌ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَقَالَ التِّرْمِذِيُّ: لاَ يَصِحُّ فِيهِ شَيْءٌ.

లో ఏ ఒక్క హదీసు కూడా ప్రామాణిక మైనది లేదని ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) అన్నారు)

**సారాంశం**

కళ్లకు సుర్మా పెట్టుకునే విషయంలో భేదాభిప్రాయం ఉంది. ఇమామ్ అహ్మద్, ఇస్‌హాఖ్, ఇబ్నె ముబారక్, సుఫియాన్ సౌరీ ప్రభృతులు ఉపవాస స్థితిలో సుర్మా పెట్టుకోవటాన్ని అయిష్ట కరం (మక్రూహ్)గా భావించారని ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ప్రస్తావించారు. అయితే ఇమామ్ షాఫయి ఇందుకు అనుమతించారు. అత్యధికమంది ధర్మవేత్తలు కూడా దీన్ని సమర్థించారు.

(٥٤٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنْ نَسِيَ وَهُوَ صَائِمٌ، فَأَكَلَ أَوْ شَرِبَ، فَلْيُتِمَّ صَوْمَهُ، فَإِنَّمَا أَطْعَمَهُ اللّٰهُ، وَسَقَاهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

544. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - "ఏ ఉపవాసి అయినా మరచిపోయి ఏదన్నా తిన్నా, త్రాగినా (ఫరవాలేదు) - అతడు తన ఉపవాసాన్ని కొనసాగించాలి. ఎందు కంటే అతనికి అల్లాహ్ తినిపించాడు, త్రాపాడు." (బుఖారీ, ముస్లిం)

وَلِلْحَاكِمِ: مَنْ أَفْطَرَ فِي رَمَضَانَ نَاسِياً فَلاَ قَضَاءَ عَلَيْهِ وَلاَ كَفَّارَةَ. وَهُوَ صَحِيحٌ.

"ఒకవేళ ఎవరయినా మరచిపోయి రమజాన్‌లో ఉపవాసాన్ని విరమిస్తే అతనిపై 'ఖజా'గానీ, కఫ్ఫారా (పరిహారం) గానీ లేదు" అని ఇమామ్ హాకిమ్ ద్వారా ఉల్లేఖించబడింది. (ఈ హదీసు ప్రామాణికమైనది)

(٥٤٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنْ ذَرَعَهُ الْقَيْءُ فَلاَ قَضَاءَ عَلَيْهِ، وَمَنِ اسْتَقَاءَ

545. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు - "అప్రయత్నంగా వాంతి అయిన వ్యక్తి ఉపవాసాన్ని తిరిగి పాటించనవసరం లేదు. అయితే ఉద్దేశ్య పూర్వకంగా వాంతి చేసినవాడు ఉప వాసాన్ని 'ఖజా' చేయాలి (అంటే తిరిగి ఉపవాసం పాటించాలి)." (దీనిని

فَعَلَيْهِ الْقَضَاءُ». رَوَاهُ الْخَمْسَةُ، وَأَعَلَّهُ أَحْمَدُ، وَقَوَّاهُ الدَّارَقُطْنِيُّ.

ఐదుగురు ఉల్లేఖించారు - ఇమామ్ అహ్మద్ దీనిని 'మాలూల్'గా ఖరారు చేశారు. ఇమామ్ దారె ఖుత్నీ మాత్రం ఈ హదీసును 'దృఢమైనది'గా వ్యాఖ్యానించారు)

**సారాంశం**

ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) తదితరులు ఈ హదీసును 'మాలూల్'గా అంటే, లోపభూయిష్టమైనదిగా పేర్కొన్నారు. అయితే ఇమామ్ దారె ఖుత్నీ, ఇమామ్ ఇబ్నె హిబ్బాన్, ఇమామ్ హాకిమ్‌లు దీనిని 'సహీహ్ హదీసు'గా ఖరారు చేశారు. హజ్రత్ అలీ (రజి), ఇబ్నె ఉమర్ (రజి), జైద్ బిన్ అర్ఖమ్ (రజి), మరియు పలువురు ఇస్లామీయ విద్వాంసులు కూడా ఈ ఉల్లేఖనానికి అనుకూలంగా స్పందించారు. అంటే - ఉద్దేశ్యపూర్వకంగా వాంతిచేస్తేనే ఉపవాసం భంగమవుతుందని అభిప్రాయపడ్డారు. పైగా ఈ అంశంపై ధర్మవేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉండేదని ఇమామ్ ఇబ్నె ముంజిర్ దావా చేశారు.

(٥٤٦) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ خَرَجَ عَامَ الْفَتْحِ إِلَى مَكَّةَ، فِيْ رَمَضَانَ، فَصَامَ، حَتَّى بَلَغَ كُرَاعَ الْغَمِيْمِ، فَصَامَ النَّاسُ، ثُمَّ دَعَا بِقَدَحٍ مِّنْ مَّاءٍ فَرَفَعَهُ، حَتَّى نَظَرَ النَّاسُ إِلَيْهِ، ثُمَّ شَرِبَ، فَقِيْلَ لَهُ بَعْدَ ذَلِكَ: إِنَّ بَعْضَ النَّاسِ قَدْ صَامَ، فَقَالَ: «**أُوْلَئِكَ الْعُصَاةُ، أُوْلَئِكَ الْعُصَاةُ**».

546. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : మక్కాను జయించిన సంవత్సరం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా వైపునకు రమజాన్ మాసంలో బయలుదేరారు. ఆయన (సఅసం) ఉపవాసం కూడా పాటిస్తున్నారు. కడకు ఆయన 'కురా అల్ - ఘమీమ్' స్థలానికి చేరుకున్నారు. ఆ రోజు సహచరులు కూడా ఉపవాసం ఉన్నారు. ఆయన(స) మంచినీళ్ల చెంబు తెప్పించారు. ఆ చెంబు అందరికీ కనబడేలా పైకి ఎత్తారు. తరువాత ఆయన (స) మంచినీరు త్రాగారు. కొంత మంది ఇప్పటికీ ఉపవాసం ఉన్నారని ఆయన (స)కు తెలియజేయగా; "అవిధేయులు వీరే, అవిధేయులు వీరే" అని ఆయన (సఅసం) అన్నారు.

వేరొక హదీసు ఇలా వుంది : "నిశ్చయంగా జనులను ఉపవాసం బాధపెడు

وَفِي لَفْظٍ: «فَقِيْلَ لَهُ: إِنَّ النَّاسَ قَدْ شَقَّ عَلَيْهِمُ الصِّيَامُ، وَإِنَّمَا يَنْتَظِرُوْنَ فِيْمَا فَعَلْتَ، فَدَعَا بِقَدَحٍ مِّن مَّاءٍ بَعْدَ الْعَصْرِ فَشَرِبَ». رَوَاهُ مُسْلِمٌ.

తోంది. మీరేం చేస్తారోనని ఎదురు చూస్తుండటం తప్ప వాళ్లు చేయగలిగిందేమీ లేదు" అని ఆయన (స)తో విన్నవించుకోగా ఆయన (సఅసం) అస్ర్ (నమాజ్) అనంతరం మంచినీళ్ల చెంబు తెప్పించి త్రాగారు. (ముస్లిమ్)

(٥٤٧) وَعَنْ حَمْزَةَ بْنِ عَمْرٍو الْأَسْلَمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللهِ! إِنِّي أَجِدُ بِيْ قُوَّةً عَلَى الصِّيَامِ فِي السَّفَرِ، فَهَلْ عَلَيَّ جُنَاحٌ؟ فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «هِيَ رُخْصَةٌ مِّنَ اللهِ، فَمَنْ أَخَذَ بِهَا فَحَسَنٌ، وَمَنْ أَحَبَّ أَنْ يَصُومَ فَلاَ جُنَاحَ عَلَيْهِ». رَوَاهُ مُسْلِمٌ، وَأَصْلُهُ فِي الْمُتَّفَقِ عَلَيْهِ مِنْ حَدِيْثِ عَائِشَةَ، أَنَّ حَمْزَةَ بْنَ عَمْرٍو سَأَلَ.

547. హజ్రత్ హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి) కథనం : ఆయన దైవప్రవక్త (సఅసం)తో ఇలా అన్నారు - "నాకు ప్రయాణంలో సయితం ఉపవాసం పాటించగల శక్తి ఉంది. (ఒకవేళ నేను 'రోజా' ఉంటే) ఇది అభ్యంతరకరమా?" దానికి దైవప్రవక్త (సఅసం), "ఇది వాస్తవానికి అల్లాహ్ తరపున ఇవ్వబడిన రాయితీ. ఎవరైనా దాన్ని వినియోగించుకుంటే అది వారికే మేలు. ఒకవేళ ఎవరయినా ఉపవాసమే ఉండదలిస్తే అందులో ఆక్షేపణీయం ఏమీ లేదు." అని అన్నారు. (ముస్లిం - హదీసు మూలం మాత్రం హజ్రత్ ఆయిషా - ర.అన్హా - గారి ముత్తఫకున్ అలైహ్ హదీసులో ఇలా ఉంది: 'హమ్జా బిన్ అమ్ర్ ప్రశ్నించారు.')

**హదీసు ఉల్లేఖకులు**

హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి). హిజాజ్ ప్రాంతానికి చెందిన సహాబీ. మారుపేరు అబూ సాలిహ్ లేక అబూ ముహమ్మద్. ఈయన కుమారుడు మరియు ఉమ్ముల్ మోమినీన్ ఆయిషా సిద్దీఖా (ర.అన్హా) ఈయన గారినుంచి హదీసులను ఉల్లేఖించేవారు. హిజ్రీ 61లో ఈయన - 80 ఏళ్ల వయస్సులో- కన్ను మూశారు.

(٥٤٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: رُخِّصَ لِلشَّيْخِ الْكَبِيْرِ أَنْ

548. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : "వృద్ధాప్యంలో ఉన్న వారికి ఇఫ్తార్ చేసేందుకు అనుమతి ఇవ్వబడింది. (అయితే) వారు ఒక్కో

يُفْطِرَ وَيُطْعِمَ عَنْ كُلِّ يَوْمٍ مِّسْكِينًا، وَلاَ قَضَاءَ عَلَيْهِ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ، وَصَحَّحَاهُ.

ఉపవాసానికి బదులుగా ఒక్కో పేద వానికి అన్నం పెట్టాలి. ఇంకా వారు ఉపవాసాన్ని 'ఖజా' చేయవలసిన అవసరం కూడా లేదు. (దారె ఖుత్నీ, హాకిమ్ ఈ హదీసును ఉల్లేఖించటమేగాక, ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

**సారాంశం**

వార్థక్యానికి చేరి, శరీరంలోని జవసత్వాలు ఉడిగిపోయినవారు, ఉపవాసం పాటించటంవల్ల కోలుకోలేమన్న భయం ఉంటే వారు ఉపవాసాలు పాటించనవసరం లేదు. అలాగే సుదీర్ఘ వ్యాధికి గురై స్వస్థత చేకూరే ఆశను వదలుకున్నవారు కూడా 'రోజా' పాటించనక్కరలేదు. అయితే ఇలాంటి వారు - తమకు దైవం తరపునుండి లభించిన ఈ మినహాయింపుకు బదులుగా - ఒక పేదవానికి 'ఫిదియా' గా భోజనం చేయించాలి. 30 మంది పేదలకు ఒకేసారి అన్నంపెట్టినా సరిపోతుంది. హజ్రత్ అనస్ (రజి) ముసలివారైపోయినపుడు భోజనం తయారుచేయించి 30 మంది బీదవారికి తినిపించారు. ఒక ఉపవాసానికి బదులుగా కనీసం అర్థ 'సా' గోధుమలు కూడా ఇవ్వవచ్చని ఒక ఉల్లేఖనం ప్రకారం తెలుస్తున్నది.

గర్భవతి మరియు బాలింత కూడా ఉపవాసం పాటించగలిగే స్థితిలో లేకుంటే ఇలాగే ఫిదియా చెల్లించాలని హజ్రత్ ఇబ్నె అబ్బాస్, ఇబ్నె ఉమర్ పేర్కొన్నారు.

పేదవారికి అన్నంపెట్టే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మెజారిటీ విద్వాంసులు ఇది తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇమామ్ మాలిక్ గారు దీనిని వాంఛనీయంగా ఖరారు చేశారు. అన్నం పెట్టవలసిన అవసరం లేదనీ, దానం చేస్తే సరిపోతుందని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు.

(٥٤٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: هَلَكْتُ يَا رَسُولَ اللهِ! قَالَ: «وَمَا أَهْلَكَكَ»؟ قَالَ: وَقَعْتُ عَلَى امْرَأَتِي فِي رَمَضَانَ، فَقَالَ: «هَلْ تَجِدُ مَا تُعْتِقُ رَقَبَةً»؟ قَالَ: لاَ، قَالَ: «فَهَلْ تَسْتَطِيعُ أَنْ تَصُومَ

549. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలోకి వచ్చి, 'దైవ ప్రవక్తా (స)! 'నేను నాశనమైపోయాను' అని మొత్తుకున్నాడు. "ఎలా నాశనమయ్యావో చెప్పావు కాదు" అని దైవ ప్రవక్త (సఅసం) అన్నారు. 'ఏం చెప్పమంటారు? నేను రమజాన్‌లో (ఉపవాస స్థితిలో) ఇల్లాలితో సంభోగించాను' అన్నాడు. దానికి ఆయన (సఅసం), "ఒక మెడను (బానిసను) విడిపించే

شَهْرَيْنِ مُتَتَابِعَيْنِ»؟ قَالَ: لاَ، قَالَ: «فَهَلْ تَجِدُ مَا تُطْعِمُ سِتِّينَ مِسْكِيناً»؟ قَالَ: لاَ، ثُمَّ جَلَسَ، فَأُتِيَ النَّبِيُّ ﷺ بِعَرَقٍ فِيهِ تَمْرٌ، فَقَالَ: «تَصَدَّقْ بِهٰذَا»، فَقَالَ: أَعَلَى أَفْقَرَ مِنَّا؟ فَمَا بَيْنَ لاَبَتَيْهَا أَهْلُ بَيْتٍ أَحْوَجُ إِلَيْهِ مِنَّا، فَضَحِكَ النَّبِيُّ ﷺ حَتَّى بَدَتْ أَنْيَابُهُ، ثُمَّ قَالَ: «اذْهَبْ فَأَطْعِمْهُ أَهْلَكَ». رَوَاهُ السَّبْعَةُ وَاللَّفْظُ لِمُسْلِمٍ.

తాహతు నీకుందా?'' అని అడిగారు. 'లేదు' అన్నాడా వ్యక్తి. ''పోనీ నువ్వు రెండు మాసాలు నిరంతరం ఉపవాసాలు పాటించగలవా?'' అని అడిగారాయన (స). 'ఇదీ నావల్ల కాదు' అన్నాడతను. ''పోనీ 60 మంది అభాగ్యులకు అన్నంపెట్టే స్థోమత నీకుందా?' అని ప్రశ్నించారాయన (స). 'లేదు' అన్నాడతను. మరి అతను అలాగే కూర్చుని ఉన్నాడు. అంతలో దైవప్రవక్త (సఅసం) వద్దకు ఒక తట్ట తేబడింది. అందులో ఖర్జూర పండ్లు ఉన్నాయి. ''సరే. వీటిని దానంగా ఇవ్వు'' అని చెప్పారు ఆయన (స). 'ఏమిటి, నాకన్నా అభాగ్యునికి దానం చేయమంటారా? ఈ పురము (మదీనా)లోని రెండు పర్వత లోయల మధ్య నన్ను మించిన దరిద్రుడు ఎవడూ లేడు' అని విన్నవించుకున్నాడా వ్యక్తి. ఇది విని దైవప్రవక్త (సఅసం) పెద్దగా నవ్వేశారు. ఆ సమయంలో ఆయన (స) దంతాలు కూడా కనిపించసాగాయి. తరువాత ఆయన (స) ఇలా అన్నారు : ''వెళ్లు, వెళ్లి వీటిని నీ ఇంటివారలకు తినిపించు.'' (దీనిని ఏడుగురూ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు 'ముస్లిం' లోనివి)

**సారాంశం**

లేమికి గురై ఉన్న వ్యక్తి కఫ్ఫారా (పరిహారం) చెల్లించనవసరం లేదని ఇమామ్ ఔజాయి, ఇమామ్ అహ్మద్ ఈ హదీసు ఆధారంగా వ్యాఖ్యానించారు. కాని ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ సౌరి, ఇమామ్ అబూ సౌర్ ఈ తర్కంతో ఏకీభవించలేదు. పరిహారం పరిహారమేననీ, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లించాల్సిందేనని వీరు అభిప్రాయపడ్డారు. దైవప్రవక్త

(స) ఆ వ్యక్తికి, పేదవాడైన కారణంగా ఖర్జూర పండ్లు దానం చేశారేతప్ప పరిహారంగా ఇవ్వలేదని వీరు వ్యాఖ్యానించారు.

అదీగాక, ఈ హదీసులో 'ఖజా రోజా' గురించిన ప్రస్తావన లేదు. ఇతర హదీసులలో ఖజా రోజా గురించి కూడా చెప్పబడింది. దీని ఆధారంగా నలుగురు ఇమాములు మరియు మెజారిటీ పండితులు ఏమంటారంటే; ఇలాంటి స్థితిలో స్త్రీ పురుషులిరువురూ ఖజా రోజా ఉండాలి. ఆ సమయంలో స్త్రీ ఒకవేళ ఉపవాసవ్రతం బూని ఉండకపోతే, ఆమెపై 'ఖజా' బాధ్యత లేదు. ఈ హదీసుపై కొందరు ధర్మవేత్తలు కొనసాగించిన చర్చ రెండు సంపుటాలలో వచ్చిందని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) 'ఫత్హుల్ బారీ'లో పేర్కొన్నారు.

(٥٥٠) وَعَنْ عَائِشَةَ وَأُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يُصْبِحُ جُنُبًا مِنْ جِمَاعٍ، ثُمَّ يَغْتَسِلُ وَيَصُومُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ فِي حَدِيثِ أُمِّ سَلَمَةَ «وَلَا يَقْضِي».

550. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) లిరువురూ ఇలా వివరించారు : "దైవ ప్రవక్త (సఅసం) లైంగిక అశుద్ధతకు లోనై ఉన్నస్థితిలో తెల్లవారిపోతే (సహ్రీ వేళ దాటిపోతే) అప్పుడు స్నానం చేసి ఉపవాసాన్ని మాత్రం కొనసాగించేవారు." (బుఖారీ, ముస్లిం) 'ఖజా మాత్రం చేసేవారు కాదు' అని ఉమ్మె సలమా (ర.అన్హా) పలికినట్లు 'ముస్లిం'లో ఉంది.

**సారాంశం**

'జనాబత్'లో వున్న మనిషికి ఫజ్ర్ సమయానికి ముందే మెలకువ రాకపోతే అతడు తెల్లవారాక కూడా స్నానం చేసి-ఉపవాసాన్ని కొనసాగించవచ్చునీ, ఉపవాసాన్ని కేవలం ఈ కారణంగా విడనాడ వలసిన అవసరం లేదనీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. ధర్మవేత్తలలో అధిక సంఖ్యాకులు దీంతో ఏకీభవించారు.

(٥٥١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ مَاتَ وَعَلَيْهِ صِيَامٌ، صَامَ عَنْهُ وَلِيُّهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

551. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఏ వ్యక్తయినా చనిపోతే, అతనిపై ఉపవాసాలు విధిగా పాటించవలసిన (ఖజా చేయవలసిన) బాధ్యత ఉండివుంటే అతని తరపున అతని వారసుడు వాటిని పాటించాలి." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'హజ్' మాదిరిగా 'రోజా' విషయంలో కూడా వారసులు మృతుని తరఫున వసీయతును నెరవేర్చవచ్చని హదీసువేత్తలు ఈ హదీసు ఆధారంగా అభిప్రాయపడ్డారు. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్‌ల ఆలోచనా సరళి తద్భిన్నంగా ఉంది. వారసులు మృతుని తరఫున ఉపవాసాన్ని పాటించనక్కర లేదనీ, పేదవానికి అన్నం పెడితే సరిపోతుందని వీరు అన్నారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి)ల తీర్పు కూడా ఇదే. అయితే మృతుని తరఫున ఉపవాసం ఉండటం ధర్మసమ్మతం అని హదీసులో స్పష్టంగా ఉంది. కాబట్టి మృతునిపై ఉన్న బాధ్యతను వారసులు నెరవేరిస్తే అందులో ఆక్షేపణీయం ఏమీ లేదు. పైగా ఇదే అభిలషణీయం.

**1వ అధ్యాయం**

## ١ - بَابُ صَوْمِ التَّطَوُّعِ، وَمَا نُهِيَ عَنْ صَوْمِهِ

## నఫిల్ ఉపవాసాలు మరియు నిషిద్ధ ఉపవాసాలు

(٥٥٢) عَنْ أَبِي قَتَادَةَ الْأَنْصَارِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ سُئِلَ عَنْ صَوْمِ يَوْمِ عَرَفَةَ، قَالَ: «**يُكَفِّرُ السَّنَةَ الْمَاضِيَةَ وَالْبَاقِيَةَ**»، وَسُئِلَ عَنْ صَوْمِ يَوْمِ عَاشُورَاءَ فَقَالَ: «**يُكَفِّرُ السَّنَةَ الْمَاضِيَةَ**»، وَسُئِلَ عَنْ صَوْمِ يَوْمِ الْاِثْنَيْنِ، فَقَالَ:«**ذٰلِكَ يَوْمٌ وُلِدْتُ فِيهِ، وَبُعِثْتُ فِيهِ، وَأُنْزِلَ عَلَيَّ فِيهِ**». رَوَاهُ مُسْلِمٌ.

552. హజ్రత్ అబూ ఖతాదా (రజి) అన్సారీ కథనం : అరఫా దినాన (జిల్ హజ్జ్) ఉపవాసం ఉండటం గురించి దైవప్రవక్త (సఅసం)ను ప్రశ్నించగా, "ఇది గడచిన సంవత్సరం పాపాలనూ, వచ్చే సంవత్సరపు పాపాలనూ ప్రక్షాళనం చేస్తుంది" అని ఆయన (స) అన్నారు. ఆషూరా దినపు (ముహర్రం) ఉపవాసం గురించి ఆయన్ని (స) అడగ్గా, "ఇది గడచిన సంవత్సరపు పాపాలను దూరం చేసివేస్తుంది" అని సెలవిచ్చారు. సోమ వారంనాటి ఉపవాసం గురించి ఆయన్ని ప్రశ్నించగా, "ఆ రోజునే నేను పుట్టాను. ఆ రోజునే నాకు దైవదౌత్యం లభించింది. ఆ రోజునే నాపై ఖుర్ఆన్ అవతరింప జేయబడింది"అని తెలిపారు. (ముస్లిం)

(٥٥٣) وَعَنْ أَبِي أَيُّوبَ الْأَنْصَارِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ:

553. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) తెలిపారు - "ఎవరయినా రమజాన్ ఉపవాసాలు

«مَنْ صَامَ رَمَضَانَ، ثُمَّ أَتْبَعَهُ سِتًّا مِنْ شَوَّال، كَانَ كَصِيَامِ الدَّهْرِ». رَوَاهُ مُسْلِمٌ.

పాటించి, ఆ తరువాత షవ్వాల్ (నెల)లో కూడా 6 ఉపవాసాలు పాటిస్తే, ఈ ఆచరణ ఒక సంవత్సరకాలం (రోజావ్రతం బూనటం)లాంటిది." (ముస్లిం)

(٥٥٤) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا مِنْ عَبْدٍ يَصُومُ يَوْماً فِي سَبِيلِ اللهِ إِلاَّ بَاعَدَ اللَّهُ بِذَلِكَ الْيَوْمِ عَنْ وَجْهِهِ النَّارَ سَبْعِينَ خَرِيفاً». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

554. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) వివరించారు - "ఏ వ్యక్తయినా అల్లాహ్ మార్గంలో ఒక రోజు ఉపవాసం పాటిస్తే, అల్లాహ్ అతని ముఖాన్ని డెబ్బయి సంవత్సరాలపాటు నరకాగ్నికి దూరంగా ఉంచకపోవటం అన్నది అసంభవం." (బుఖారీ, ముస్లిం- ఈ వాక్యాలు ముస్లింలోనివి)

(٥٥٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَصُومُ حَتَّى نَقُولَ لاَ يُفْطِرُ، وَيُفْطِرُ حَتَّى نَقُولَ لاَ يَصُومُ، وَمَا رَأَيْتُ رَسُولَ اللهِ اسْتَكْمَلَ صِيَامَ شَهْرٍ قَطُّ إِلاَّ رَمَضَانَ، وَمَا رَأَيْتُهُ فِي شَهْرٍ أَكْثَرَ مِنْهُ صِيَاماً فِي شَعْبَانَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

555. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాసాలు పాటిస్తూనే ఉండేవారు. ఆయన (స) తీరును గమనించి, "ఇక తమరు (స) ఉపవాసాలను బహుశా విరమించరు!" అని మేము అనేవాళ్లం. అలాగే ఆయన (స) ఉపవాసాలను అనేక రోజులపాటు విడనాడేవారు. "బహుశా ఇంక మీరు ఉపవాసాలు ఉండరు" అని మేము అభిప్రాయపడేవారము. ఒక్క రమజాన్ మాసంలో తప్ప మరే మాసంలో కూడా ఆయన (స) పూర్తిగా ఉపవాసాలుండటం నేను చూడలేదు. షాబాన్ నెలకన్నా ఎక్కువగా మరే నెలలో కూడా ఆయన (స) ఉపవాసాలు (నఫిల్ ఉపవాసాలు) ఉండటం కూడా నేను గమనించలేదు." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ఇంచుమించు ప్రతి నెలలో నఫిల్ ఉపవాసాలు ఉండేవారని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతుంది. ఒక్కోసారి అనేక ఉపవాసాలు నిరంతరం పాటించారు. ఒక్కోసారి అనివార్య కారణాల దృష్ట్యా అనేక రోజుల పాటు ఉపవాస దీక్షకు పూనుకునేవారు కాదు. ఇక రమజాన్ నెల రమజాన్ నెలే. అందులో ఉపవాసాలను విడనాడే ప్రసక్తే ఉండదు. ఇతర మాసాల విషయానికివస్తే షాబాన్ నెలలో మాత్రం ఆయన చాలా రోజులు ఉపవాసం ఉండేవారు.

(٥٥٦) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنَا رَسُولُ اللهِ ﷺ أَن نَصُومَ مِنَ الشَّهْرِ ثَلاَثَةَ أَيَّامٍ، ثَلاَثَ عَشْرَةَ، وَأَرْبَعَ عَشْرَةَ، وَخَمْسَ عَشْرَةَ. رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

556. హజ్రత్ అబూజర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ప్రతి నెలా మూడు రోజులు - అంటే పదమూడు, పధ్నాలుగు, పది హేనవ తేదీలలో - ఉపవాసాలుండమని ఆదేశించారు." (నసాయి, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని 'సహీహ్'గా ధృవీకరించారు)

(٥٥٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ يَحِلُّ لِلْمَرْأَةِ أَنْ تَصُومَ، وَزَوْجُهَا شَاهِدٌ، إِلاَّ بِإِذْنِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ، زَادَ أَبُو دَاوُدَ: «**غَيْرَ رَمَضَانَ**».

557. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) చెప్పారు - "తన భర్త ఇంట్లో ఉండగా అతని అనుమతి లేకుండా ఉపవాస వ్రతం పాటించటం ఏ ఇల్లాలికీ ధర్మసమ్మతం కాదు. ఆ మేరకు భర్త ఆమెకు అనుమతి ఇస్తే ఫరవాలేదు." (బుఖారీ, ముస్లిం- ఈ వాక్యాలు మాత్రం బుఖారీలోనివి). "ఒక్క రమజాన్ తప్ప" అనే వాక్యం అబూదావూద్‌లో అదనంగా ఉంది.

**సారాంశం**

భర్త హక్కులు భార్యపాలిట నఫిల్ ఉపవాసాల కన్నా ముఖ్యమైనవన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. భర్త అనుమతి పొందకుండా భార్య నఫిల్ ఉపవాసాలుండటం హరామ్ (నిషిద్ధం). అయితే ఫర్జ్ రోజాలు దీని పరిధిలోకి రావు. ఫర్జ్ రోజాలు ఎట్టి పరిస్థితిలోనూ పాటించ వలసిందే. వాటికోసం భర్తను అడగవలసిన అవసరం లేదు.

(٥٥٨) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ نَهَى عَنْ صِيَامِ يَوْمَيْنِ: يَوْمِ الْفِطْرِ، وَيَوْمِ النَّحْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

558. హజ్రత్ అబూ సయీద్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు ప్రత్యేక దినాలలో ఉపవాసముండటాన్ని నిషేధించారు. ఒకటి: ఈదుల్ ఫిత్ర్, రెండు : ఈదుల్ అజ్హా." (బుఖారీ, ముస్లిం)

(٥٥٩) وَعَنْ نُبَيْشَةَ الْهُذَلِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «أَيَّامُ التَّشْرِيقِ أَيَّامُ أَكْلٍ وَشُرْبٍ وَذِكْرِ اللّٰهِ عَزَّ وَجَلَّ». رَوَاهُ مُسْلِمٌ.

559. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ నుబైష హుజ్‌లీ (రజి) తెలిపారు : "తష్రీఖ్ దినాలు తినే, త్రాగే, దైవనామస్మరణ చేసే దినాలు." (ముస్లిం)

**సారాంశం**

'తష్రీఖ్ దినాలు' అంటే బక్రీద్ పండుగ తరువాత నిరంతరం మూడు రోజులు అని భావం. ఈ దినాలలో ఉపవాసం ఉండటం నిషిద్ధం.

**హదీసు ఉల్లేఖకులు**

నుబైష (రజి). ప్రముఖ సహాబీ. ఈయన చేత 11 హదీసులు ఉల్లేఖించబడ్డాయి. బస్రాలో స్థిరపడ్డారు. మనసున్న మనిషిగా పేరు పొందారు.

(٥٦٠) وَعَنْ عَائِشَةَ وَابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمْ قَالَا: لَمْ يُرَخَّصْ فِي أَيَّامِ التَّشْرِيْقِ أَن يُصَمْنَ إِلاَّ لِمَنْ لَمْ يَجِدِ الْهَدْيَ. رَوَاهُ الْبُخَارِيُّ.

560. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు : "ఖుర్బానీ పశువు లభించని వ్యక్తికి తప్ప-తష్రీఖ్ దినాలలో ఉపవాసం ఉండే అనుమతి ఇవ్వబడలేదు." (బుఖారీ)

**సారాంశం**

తష్రీఖ్ దినాలలో ఉపవాసం ఉండరాదని చెప్పే హదీసులు అసంఖ్యాకంగా ఉన్నాయి. దీని గురించి పండితులలో భిన్నాభిప్రాయం వ్యక్తమయింది. కొంతమంది విద్వాంసులు ఈ దినాలలో ఉపవాసం ఉండటాన్ని అవాంఛనీయం(మక్రూహ్)గా ఖరారు చేశారు. ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల దృక్పథం కూడా ఇదే.

(٥٦١) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لاَ تَخُصُّوا

561. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "కేవలం శుక్రవారం రాత్రిని జాగారం కొరకు ప్రత్యేకిం

لَيْلَةَ الْجُمُعَةِ بِقِيَامٍ، مِنْ بَيْنِ اللَّيَالِي، وَلاَ تَخُصُّوا يَوْمَ الْجُمُعَةِ بِصِيَامٍ، مِنْ بَيْنِ الأَيَّامِ، إِلاَّ أَنْ يَكُونَ فِي صَوْمٍ يَصُومُهُ أَحَدُكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

చుకోకండి. అలాగే కేవలం శుక్రవారం పగలును ఉపవాసం కోసం ప్రత్యేకించుకోకండి. ఉపవాసం ఉండవలసిన రోజు - కాకతాళీయంగా-శుక్రవారంనాడై ఉంటే అది వేరే విషయం." (ముస్లిం)

(٥٦٢) وَعَنْهُ أَيْضاً قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَصُومَنَّ أَحَدُكُمْ يَوْمَ الْجُمُعَةِ، إِلاَّ أَنْ يَصُومَ يَوْماً قَبْلَهُ، أَوْ يَوْماً بَعْدَهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

562. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరూ శుక్రవారం నాడు ఉపవాసం ఉండకండి - దానికి ఒక రోజు ముందు లేక ఒకరోజు తరువాత ఉపవాస వ్రతానికి పూనుకుంటే తప్ప." (బుఖారీ, ముస్లిం)

(٥٦٣) وَعَنْهُ أَيْضاً أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا انْتَصَفَ شَعْبَانُ فَلاَ تَصُومُوا». رَوَاهُ الْخَمْسَةُ، وَاسْتَنْكَرَهُ أَحْمَدُ.

563. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "సగం షాబాన్ తరువాత ఉపవాసాలుండకండి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) దీనిని 'మున్కర్'గా భావించారు)

## సారాంశం

రమజాన్‌లోని ఉపవాసాలు విధిగా నిర్ణయించబడిన సంగతి అందరికీ విదితమే. రమజాన్ నెలలో పాటించబోయే నిరంతర ఉపవాసాల కోసం మనిషి శారీరకంగా, మానసికంగా సంసిద్ధం కావాలి. దానికోసం శక్తిని కూడగట్టుకోవాలి. షాబాన్ నెలలో ఎక్కువగా నఫిల్ ఉపవాసాలు పాటిస్తే మనిషి బలహీనుడైపోవచ్చు. ఈ బలహీనత రమజాన్ నెలలో పాటించబోయే ఫర్జ్ ఉపవాసాలకు అవరోధంగా పరిణమించవచ్చు. అందుకే దైవప్రవక్త (స) తన సహచరులకు ఈ విధంగా తాకీదు చేశారు. ఇది ఒక తాకీదు మాత్రమే. ఒకవేళ షాబాన్ నెల చివర్లో ఎవరయినా నఫిల్ ఉపవాసం పాటిస్తే అది నిషిద్ధం మాత్రం కాబోదు.

(٥٦٤) وَعَنِ الصَّمَّاءِ بِنْتِ بُسْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ تَصُومُوا يَوْمَ السَّبْتِ إِلاَّ فِيمَا افْتُرِضَ عَلَيْكُمْ، فَإِنْ لَمْ يَجِدْ أَحَدُكُمْ إِلاَّ لِحَاءَ عِنَبٍ، أَوْ عُودَ شَجَرَةٍ، فَلْيَمْضُغْهَا**». رَوَاهُ الْخَمْسَةُ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ مُضْطَرِبٌ، وَقَدْ أَنْكَرَهُ مَالِكٌ، وَقَالَ أَبُو دَاوُدَ: هُوَ مَنْسُوخٌ.

564. హజ్రత్ సమ్మా బిన్తె బుస్ర్ (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు- "శనివారంనాడు ఉపవాసం ఉండకండి- ఆ రోజు ఉపవాసం మీపై విధిగా (ఫర్జ్‌గా) చేయబడివుంటే తప్ప. కనుక మీలో ఎవరయినాసరే (ఆ రోజు) ద్రాక్ష తొక్క, ఏదైనా వృక్షపు బెరడు దొరికినా దాన్ని తినండి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు. హదీసును అందజేసినవారు నమ్మకస్థులే గాని ఇందులో కొంత సందిగ్ధం ఉంది. ఇమామ్ మాలిక్ దీనిని తిరస్కరించారు. ఈ హదీసు రద్దుపరచబడిందని . అబూదావూద్ వ్యాఖ్యానించారు)

**హదీసు ఉల్లేఖకులు**

సమ్మా బిన్తె బుస్ర్ (ర.అన్హా). వేరొక ఉల్లేఖనం ప్రకారం ఈమె పేరు బుహైమా బిన్తె బుస్ర్ అని కూడా తెలుస్తోంది. సహాబియాగా పరిగణించబడ్డారు. ఈమె అబ్దుల్లాహ్ బిన్ బుస్ర్‌కు తోబుట్టువు అనీ, అత్తగారనీ భిన్నాభిప్రాయాలున్నాయి.

(٥٦٥) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَكْثَرَ مَا كَانَ يَصُومُ مِنَ الأَيَّامِ، يَوْمُ السَّبْتِ، وَيَوْمُ الأَحَدِ، وَكَانَ يَقُولُ: «**إِنَّهُمَا يَوْمَا عِيدٍ لِلْمُشْرِكِينَ، وَأَنَا أُرِيدُ أَنْ أُخَالِفَهُمْ**». أَخْرَجَهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ، وَهٰذَا لَفْظُهُ.

565. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శనివారం, ఆదివారం చాలా సార్లు ఉపవాసం పాటించేవారు. "ఈ రెండు రోజులూ ముష్రికుల పండుగ రోజులు. నేను వీటిని వ్యతిరేకించదలుస్తున్నాను" అని ఆయన (స) అంటూ ఉండేవారు. (దీనిని ఇమామ్ నసాయి (రహ్మ.లై) ఉల్లేఖించారు. ఇమామ్ ఇబ్నె ఖుజైమ (రహ్మ.లై) ఈ హదీసును ప్రామాణికంగా నిర్ధారించారు. హదీసు వాక్యాలు మాత్రం ఇబ్నె ఖుజైమావి)

**సారాంశం**

ఇంతకు ముందు వచ్చిన హదీసులో దైవప్రవక్త (స) శనివారం నాడు ఉపవాసం పాటించడాన్ని వారించినట్టుంది. కాని ఆ ఉల్లేఖనం రద్దుపరచబడింది. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) గారి పై హదీసు ప్రకారం ఈ హదీసు రద్దయిపోయింది. యూదులు శనివారాన్ని, క్రైస్తవులు ఆదివారాన్ని పర్వదినంగా భావించేవారు. అందుచేత ఆయన ఈ రెండు దినాలలో ఉపవాసాలు పాటించి అవి పండుగ రోజులుగానీ, పవిత్ర రోజులుగానీ కావని స్పష్టం చేశారు.

(٥٦٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ صَوْمِ يَوْمِ عَرَفَةَ بِعَرَفَةَ. رَوَاهُ الْخَمْسَةُ غَيْرَ التِّرْمِذِيِّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَالْحَاكِمُ، وَاسْتَنْكَرَهُ الْعُقَيْلِيُّ.

566. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరఫాత్ మైదానంలో, అరఫా దినాన ఉపవాసం ఉండటాన్ని వారించారు. ('ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలినవారు దీనిని ఉల్లేఖించారు - ఇమామ్ ఇబ్నె ఖుజైమ, ఇమామ్ హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు. ఇమామ్ ఉఖైలీ దీనిని ఆమోదించలేదు)

**సారాంశం**

అరఫాత్ మైదానంలో హజ్ యాత్రికులు అరఫా ఉపవాసం పాటించటం నిషిద్ధం (హరామ్) అన్నదానికి ఈ హదీసు ప్రబల నిదర్శనం. ఇమామ్ యహ్యా బిన్ సయీద్ అన్సారీ కూడా దీన్ని సమర్థించారు. సునన్ నసాయి, తిర్మిజీలలో "అరఫా దినం మా పండుగ దినం" అన్న హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) హదీసు కూడా దీన్ని సమర్థిస్తోంది. అంటే అరఫాత్‌లో ఉండేవారి కొరకు ఆ రోజు పండుగ రోజు. అందువల్ల వారు ఆ రోజున ఉపవాసం పాటించటం సమ్మతం కాదు. అయితే అధిక సంఖ్యాక పండితులు ఆ రోజు ఉపవాసం ఉండకపోవటం 'ముస్తహబ్' (అభిలషణీయం) అని మాత్రం అభిప్రాయపడ్డారు. దైవప్రవక్త (సఅసం) సయితం అంతిమ హజ్ యాత్ర సందర్భంగా అరఫా దినాన ఉపవాసం ఉండలేదు.

(٥٦٧) وَعَنْ عَبْدِ اللّٰهِ بْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: **«لاَ صَامَ مَنْ صَامَ الْأَبَدَ»**. مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ عَنْ أَبِي قَتَادَةَ بِلَفْظِ: **«لاَ صَامَ وَلاَ أَفْطَرَ»**.

567. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: "ఎల్లప్పుడూ ఉపవాసం ఉండేవాడు (అసలు) ఉపవాసమే ఉండలేదు." (బుఖారీ, ముస్లిం) ముస్లింలో అబూ ఖతాద (రజి) ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఉపవాసమూ ఉండలేదు, ఇఫ్తార్ కూడా చేయలేదు."

## 2వ అధ్యాయం

## ఏతెకాఫ్ - ఖియామె రమజాన్

## ٢ - بَابُ ألاعْتِكَافِ وَقِيَامِ رَمَضَانَ

568. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరయితే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో రమజాన్ మాసంలో ఖియామ్ చేస్తాడో (రాత్రిళ్లు దైవారాధనలో గడుపుతాడో) అతని గత పాపాలు మన్నించబడతాయి." (బుఖారీ, ముస్లిం)

(٥٦٨) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ قَامَ رَمَضَانَ إِيمَاناً وَاحْتِسَاباً غُفِرَ لَهُ مَا تَقَدَّمَ مِنْ ذَنْبِهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

**సారాంశం**

రమజాన్ మాసంలో - రాత్రిపూట మేల్కొని దైవారాధనలో గడపటం ఎంత పుణ్యప్రదమైన విషయమో ఈ హదీసు చెబుతోంది. హదీసులో 'ఖియామ్' అనే పదం వచ్చింది. ఖియామ్‌లో నఫిల్ నమాజ్‌తోపాటు, దైవగ్రంథ పారాయణం, దైవనామస్మరణ, అపరాధాల మన్నింపుకై దైవాన్ని వేడుకోవటం మొదలగువన్నీ చేరి ఉన్నాయి. ఈ ఖియామ్ నెరవేర్పుకు అత్యుత్తమ సాధనం తరావీహ్ నమాజ్.

569. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "(రమజాన్ నెల) చివరి దశకం మొదలైందంటే చాలు, దైవప్రవక్త (సఅసం) రాత్రి జాగారం కోసం ఉపక్రమించేవారు. తన సతీమణులను కూడా మేల్కొనమనేవారు." (బుఖారీ, ముస్లిం)

(٥٦٩) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا دَخَلَ الْعَشْرُ، - أَيِ الْعَشْرُ الأَخِيْرَةُ مِنْ رَمَضَانَ، - شَدَّ مِئْزَرَهُ، وَأَحْيَا لَيْلَهُ، وَأَيْقَظَ أَهْلَهُ مُتَّفَقٌ عَلَيْهِ.

570. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఏతెకాఫ్' కొరకు సంకల్పించుకుంటే ఫజ్ర్ నమాజ్ చేయగానే 'ఏతెకాఫ్' స్థానంలోకి వెళ్ళిపోయేవారు." (బుఖారీ, ముస్లిం)

(٥٧٠) وَعَنْهَا رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا أَرَادَ أَنْ يَعْتَكِفَ، صَلَّى الْفَجْرَ ثُمَّ دَخَلَ مُعْتَكَفَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

571. ఆమె గారే (హజ్రత్ ఆయిషా - ర.అన్హా) ఉల్లేఖించిన మరో హదీసు : దైవప్రవక్త (సఅసం) - జీవితాంతం - రమజాన్ చివరి దశకంలో ఏతెకాఫ్ (ప్రత్యేక వ్రతం) పూనేవారు. ఆయన (స) మరణించిన తరువాత ఆయన (స) సతీ మణులు ఏతెకాఫ్ పాటించసాగారు.
(బుఖారీ, ముస్లిం)

(٥٧١) وَعَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَعْتَكِفُ الْعَشْرَ الْأَوَاخِرَ مِنْ رَمَضَانَ، حَتَّى تَوَفَّاهُ اللَّهُ عَزَّ وَجَلَّ، ثُمَّ اعْتَكَفَ أَزْوَاجُهُ مِنْ بَعْدِهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

**సారాంశం**

ఏతెకాఫ్ సున్నత్ అన్న దానికి ఈ హదీసు తార్కాణం. దైవప్రవక్త (స) తన జీవితకాలంలో దీనిని ఏటేటా పాటించగా, ఆయన (స) తదనంతరం ఆయన (స) సతీమణులు దీనిని అనుసరించారు.

572. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్‌లో (ఏతెకాఫ్ స్థితిలో) నుండగా తన తలను నా వైపునకు జరిపే వారు. నేను ఆయన (స) తల దువ్వే దానిని. ఆయన (స) ఏతెకాఫ్‌లో ఉన్నప్పుడు - కాలకృత్యాలు తీర్చుకోవటానికి తప్ప - ఇంటికి వచ్చేవారు కాదు. (బుఖారీ, ముస్లిం-ఈ వాక్యాలు బుఖారీ లోనివి)

(٥٧٢) وَعَنْهَا قَالَتْ: إِنْ كَانَ رَسُولُ اللهِ ﷺ لَيُدْخِلُ عَلَيَّ رَأْسَهُ، – وَهُوَ فِي الْمَسْجِدِ، – فَأُرَجِّلُهُ، وَكَانَ لاَ يَدْخُلُ الْبَيْتَ إِلاَّ لِحَاجَةٍ، إِذَا كَانَ مُعْتَكِفاً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

573. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా వివరించారు : "ఏతెకాఫ్ వ్రతానికి పూను కున్నవారు వ్యాధిగ్రస్తులను పరామర్శిం చరాదు, అంత్యక్రియల నమాజులో పాల్గొనరాదు, భార్యను ముట్టుకోవటం గానీ, సంభోగించటం గానీ చేయరాదు. కాలకృత్యాలు తీర్చుకోవటానికి తప్ప మస్జిద్ బయటికి వెళ్లరాదు. జామా

(٥٧٣) وَعَنْهَا قَالَتْ: السُّنَّةُ عَلَى الْمُعْتَكِفِ أَنْ لاَّ يَعُودَ مَرِيضاً، وَلاَ يَشْهَدَ جَنَازَةً، وَلاَ يَمَسَّ امْرَأَةً، وَلاَ يُبَاشِرَهَا، وَلاَ يَخْرُجَ لِحَاجَةٍ إِلاَّ لِمَا لاَ بُدَّ لَهُ مِنْهُ، وَلاَ

اعْتِكَافَ إِلاَّ بِصَوْمٍ. وَلاَ اعْتِكَافَ إِلاَّ فِي مَسْجِدٍ جَامِعٍ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَلاَ بَأْسَ بِرِجَالِهِ، إِلاَّ أَنَّ الرَّاجِحَ وَقْفُ آخِرِهِ.

మస్జిద్‌లో తప్ప ఏతెకాఫ్ పాటించరాదు. ఇది సున్నత్ (ప్రవక్త సంప్రదాయం)." (అబూ దావూద్, దీని ఉల్లేఖకులలో ఎలాంటి అంతరాయం లేకపోయి నప్పటికీ - దీని చివరి వాక్యాలను 'మౌఖూఫ్'గా తలపోయటం జరిగింది)

**సారాంశం**

ఈ హదీసు 'మౌఖూఫ్' కోవకు చెందినది. ఏతెకాఫ్ మొత్తానికి మస్జిద్‌లోనే పాటించాలి. అది ఎలాంటి మస్జిద్ అయి ఉండాలి? జామా మస్జిద్ అంటే ఇక్కడ భావం ఏమిటీ? ఏ మస్జిద్‌లో సామూహిక నమాజ్ జరుగుతుందో ఆ మస్జిద్‌లో నిస్సంకోచంగా 'ఏతెకాఫ్' వ్రతం పాటించ వచ్చునని ఇమామ్ అహ్మద్, ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయపడ్డారు.

(٥٧٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**لَيْسَ عَلَى الْمُعْتَكِفِ صِيَامٌ، إِلاَّ أَنْ يَجْعَلَهُ عَلَى نَفْسِهِ**». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ، وَالرَّاجِحُ وَقْفُهُ أَيْضاً.

574. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ఏతెకాఫ్ వ్రతంలో ఉన్న వారికై ఉప వాసం అనివార్యం కాదు. ఒకవేళ వారు దాన్ని తమపై విధించుకుంటే విధించు కోవచ్చు." (దీనిని దారెఖుత్నీ, హాకిమ్ ఉల్లేఖించారు - ఈ హదీసు కూడా 'మౌఖూఫ్'గానే భావించబడింది)

**సారాంశం**

'ఏతెకాఫ్' పాటించేవారు ఉపవాసాన్ని విధిగా పాటించాలా? పాటించకపోయినా ఫరవాలేదా? ఈ విషయమై విద్వాంసుల మధ్య భేదాభిప్రాయముంది. ఉపవాసం పాటించాల్సిందేనని అత్యధిక మంది భావించారు. అయితే దీనికి సంబంధించి స్పష్టమయిన మూలాధారం ఏదీ లేదు. దైవప్రవక్త (స) ఉపవాసం పాటించకుండా 'ఏతెకాఫ్'లో కూర్చున్నట్టు కూడా ఎలాంటి ఆధారం లేదు. ఉపవాసం పాటించగలిగిన పక్షంలోనే 'ఏతెకాఫ్'కు పూనుకోవాలన్న నిబంధన కూడా ఏదీ లేదు.

(٥٧٥) وَعَنْ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رِجَالاً مِنْ أَصْحَابِ النَّبِيِّ ﷺ

575. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులలో కొంతమందికి (రమజాన్ నెల) చివరి వారంలో

أُرُوا لَيْلَةَ الْقَدْرِ فِي الْمَنَامِ، فِي السَّبْعِ الْأَوَاخِرِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**أَرَى رُؤْيَاكُمْ قَدْ تَوَاطَأَتْ فِي السَّبْعِ الْأَوَاخِرِ، فَمَنْ كَانَ مُتَحَرِّيَهَا، فَلْيَتَحَرَّهَا فِي السَّبْعِ الْأَوَاخِرِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

షబేఖద్ర్ (ఘన మయిన రాత్రి) ఉన్నట్టు కనబడింది. దీనిపై దైవప్రవక్త (సఅసం), "చివరి వారంలో ఉన్నట్టు మీకు వచ్చిన కలను నేను చూస్తున్నాను. మీలో ఎవరు దాన్ని అన్వేషించగలుగుతారో చివరి వారంలో అన్వేషించండి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

(٥٧٦) وَعَنْ مُعَاوِيَةَ بْنِ أَبِيْ سُفْيَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ فِي لَيْلَةِ الْقَدْرِ: «**لَيْلَةُ سَبْعٍ وَعِشْرِينَ**». رَوَاهُ أَبُو دَاوُدَ، وَالرَّاجِحُ وَقْفُهُ.

وَقَدِ اخْتُلِفَ فِيْ تَعْيِيْنِهَا عَلَى أَرْبَعِيْنَ قَوْلاً، أَوْرَدْتُها فِي فَتْحِ الْبَارِي.

576. హజ్రత్ ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఘనమయిన రాత్రి' గురించి చెబుతూ, "అది ఇరవై ఏడో రాత్రి ఉంది" అని అన్నారు (అబూ దావూద్). ఈ హదీసు మౌఖూఫ్‌గా పరిగణించబడింది. (హాఫిజ్ ఇబ్నె హజర్- రహ్మ.లై - ఇలా అన్నారు) ఘన మయిన రాత్రి నిర్ధారణలో భేదాభిప్రాయం ఉంది. దీనికి సంబంధించి నలభై కథనాలు ఉన్నాయి. వాటిని నేను 'ఫత్‌హుల్ బారీ'లో నకలు చేశాను.

(٥٧٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! أَرَأَيْتَ إِنْ عَلِمْتُ أَيُّ لَيْلَةٍ لَيْلَةُ الْقَدْرِ، ما أقول فيها؟ قَالَ: «**قُولِي اللّٰهُمَّ إِنَّكَ عَفُوٌّ، تُحِبُّ الْعَفْوَ، فَاعْفُ**

577. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "దైవప్రవక్తా (సఅసం)! 'లైలతుల్ ఖద్ర్' ను గనక నేను పొందితే అందులో నేనేం చేయాలి?" అని ప్రశ్నించగా, ఆయన (స) ఇలా ఉపదేశించారు - నువ్వీవిధంగా వేడుకో: "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ. (దేవా! నిశ్చయంగా నువ్వు క్షమిం చేవాడవు. క్షమించడాన్ని నీవు ఎంతగానో ఇష్టపడతావు. కనుక నన్ను క్షమించు).

عَنِّي». رَوَاهُ الْخَمْسَةُ غَيْرَ أَبِي دَاوُدَ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ.

('ఐదుగురి'లో అబూదావూద్ మినహా మిగిలినవారు దీనిని ఉల్లేఖించారు- తిర్మిజీ, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٥٧٨) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَشُدُّوا الرِّحَالَ إِلاَّ إِلى ثَلاَثَةِ مَسَاجِدَ، الْمَسْجِدِ الْحَرَامِ، وَمَسْجِدِي هَذَا، وَالْمَسْجِدِ الأَقْصَى». مُتَّفَقٌ عَلَيْهِ.

578. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు : "మూడు మస్జిదులు తప్ప మరో చోటకు ప్రయాణాలు చేయకండి. (1) మస్జిదుల్ హరామ్. (2) నా ఈ మస్జిద్ (మస్జిదె నబవీ). (3) మస్జిదె అఖ్సా."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

పై హదీసులో పేర్కొనబడిన మూడు మస్జిదులు మినహా మరో చోటికి - పుణ్యక్షేత్రాలుగా భావించి - శుభం కోసం ప్రయాణాలు చేయటం, అక్కడ కొంత కాలం మకాం వేయటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా స్పష్టం అవుతున్నది. అయితే ఇతరత్రా అవసరాల కోసం ప్రయాణాలు చేయటంలో ఎలాంటి దోషం లేదు. పైగా ప్రయాణాలు చేయవలసిన అవసరం ఉంటుంది కూడా. మస్జిదుల్ హరాం (మక్కా), మస్జిదె నబవీ (మదీనా), మస్జిదె అఖ్సా (జెరూసలేం)లలో ఆగటం, అక్కడ దైవారాధన చేయటం, దైవగ్రంథ పారాయణం చేయటం, దైవనామస్మరణ చేయటం ఎంతో పుణ్యప్రదం.

# 6. హజ్జ్ పుస్తకం

# ٦ - كِتَابُ الحَجِّ

## 1వ అధ్యాయం

## హజ్జ్ మహత్తు

## (١) بَابُ فَضْلِهِ وَبَيَانُ مَنْ فُرِضَ عَلَيْهِ

579. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "ఒక ఉమ్రాకు-మరో ఉమ్రాకు మధ్య గల వ్యవధి పాప పరిహారంతో కూడుకున్నది. ఒక 'హజ్జె మబ్రూర్' (నిష్కల్మషమయిన సంకల్పం తో చేసిన హజ్, స్వీకృతిపొందిన హజ్) కు ప్రతిఫలం స్వర్గం తప్ప మరేమీ కాదు." (బుఖారీ, ముస్లిం)

(٥٧٩) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «الْعُمْرَةُ إِلَى الْعُمْرَةِ كَفَّارَةٌ لِمَا بَيْنَهُمَا، وَالْحَجُّ الْمَبْرُورُ لَيْسَ لَهُ جَزَاءٌ إِلاَّ الْجَنَّةُ». مُتَّفَقٌ عَلَيْهِ.

580. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : 'దైవప్రవక్తా (సఅసం)! స్త్రీల కొరకు 'జిహాద్' ఉందా?' అని నేను ప్రశ్నించగా, "ఉంది. వారు చేసే 'జిహాద్' లో పోరాటం ఉండదు. అదేమంటే (అది)హజ్ మరియు ఉమ్రా." (అహ్మద్, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - హదీసు వాక్యాలు మాత్రం ఇబ్నె మాజాలోనివి. దీని ఆధారం ప్రామాణికమైనది. మూలం బుఖారీలో ఉంది).

(٥٨٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! عَلَى النِّسَاءِ جِهَادٌ؟ قَالَ: «نَعَمْ، عَلَيْهِنَّ جِهَادٌ لاَ قِتَالَ فِيهِ؛ الْحَجُّ وَالْعُمْرَةُ». رَوَاهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَاللَّفْظُ لَهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ، وَأَصْلُهُ فِي الصَّحِيحِ.

581. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో ఒక పల్లెటూరి వ్యక్తి వచ్చి, 'ఓ దైవప్రవక్తా (స)! నాకు ఉమ్రా గురించి కాస్త వివరిం

(٥٨١) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَتَى النَّبِيَّ ﷺ أَعْرَابِيٌّ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! أَخْبِرْنِي عَنِ الْعُمْرَةِ،

أَوَاجِبَةٌ هِيَ؟ فَقَالَ: «لاَ، وَأَنْ تَعْتَمِرَ خَيْرٌ لَكَ». رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَالرَّاجِحُ وَقْفُهُ.

చండి - ఉమ్రా చేయటం తప్పనిసరా?' అని సందేహపడ్డాడు. దానికి ఆయన (స) "తప్పనిసరి మాత్రం కాదు. అయితే నువ్వు ఉమ్రా చేయగలిగితే అది నీకు ఎంతో శ్రేయస్కరం" అని సమాధాన మిచ్చారు. (దీనిని అహ్మద్, తిర్మిజీ ఉల్లే ఖించారు - ఇది 'మౌఖూఫ్'గా పరిగణిం చబడింది)

وَأَخْرَجَهُ ابْنُ عَدِيٍّ مِنْ وَجْهٍ آخَرَ ضَعِيْفٍ وعَنْ جَابِرٍ مَرْفُوعاً: «الْحَجُّ وَالْعُمْرَةُ فَرِيْضَتَانِ».

ఇమామ్ ఇబ్నె అదీ వేరొక బలహీన ఆధారంతో హజ్రత్ జాబిర్ (రజి) చే ఉల్లేఖించబడిన హదీసును ఉదాహరించారు: అందులో ఇలా వుంది - "హజ్ మరియు ఉమ్రా రెండూ ఫర్జ్ (విధి)గా నిర్ణయించబడ్డాయి."

(٥٨٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قِيلَ يَا رَسُولَ اللهِ! مَا السَّبِيْلُ؟ قَالَ: «الزَّادُ وَالرَّاحِلَةُ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَالرَّاجِحُ إِرْسَالُهُ، أَخْرَجَهُ التِّرْمِذِيُّ مِنْ حَدِيْثِ ابْنِ عُمَرَ أَيْضاً، وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

582. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్తా! 'సబీల్' అంటే అర్థం ఏమిటీ?" అని ప్రశ్నించబడగా ఆయన (సఅసం) ఇలా సమాధానమిచ్చారు - "దారి ఖర్చు మరియు వాహనం" (దీనిని దారెఖుత్నీ ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీక రించారు. అయితే ఇది 'ముర్సల్'గా చెలామణీ అవుతోంది. తిర్మిజీగారు దీనిని ఇబ్నె ఉమర్ (రజి) హదీసు ఆధారంగా ఉటంకించారు. దీని పరం పర బలహీనంగా ఉంది)

(٥٨٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ لَقِيَ رَكْباً بِالرَّوْحَاءِ، فَقَالَ: «مَنِ الْقَوْمُ»؟ قَالُوا:

583. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం)కు 'రౌహా' స్థలంలో కొంతమంది యాత్రీకులు తారసపడ్డారు. 'మీరెవరు?' అని ఆయన (సఅసం) అడిగారు. 'మేము ముస్లిం

ٱلْمُسْلِمُونَ، فَقَالُوْا: مَنْ أَنْتَ؟ قَالَ: «رَسُولُ اللهِ»، فَرَفَعَتْ إِلَيْهِ ٱمْرَأَةٌ صَبِيًّا، فَقَالَتْ: أَلِهٰذَا حَجٌّ؟ قَالَ: «نَعَمْ، وَلَكِ أَجْرٌ». رَوَاهُ مُسْلِمٌ.

లము' అని వారు బదులిచ్చారు. 'మీరెవరు?' అని వాళ్లు అడగ్గా, 'నేను దైవ ప్రవక్తను' అని ఆయన (స) సమాధానమిచ్చారు. తరువాత ఒక స్త్రీ ఆయన (స) సమక్షంలో ఒక శిశువును తెచ్చి 'ఈ పసికందు హజ్జ్ కూడా నెరవేరుతుందా?' అని ప్రశ్నించింది. 'అవును. ఈ పుణ్యం నీకు దక్కుతుంది' అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (ముస్లిం)

(٥٨٤) وَعَنْهُ قَالَ: كَانَ الْفَضْلُ بْنُ عَبَّاسٍ رَدِيْفَ رَسُولِ اللهِ ﷺ، فَجَاءَتِ ٱمْرَأَةٌ مِنْ خَثْعَمَ، فَجَعَلَ الْفَضْلُ يَنْظُرُ إِلَيْهَا، وَتَنْظُرُ إِلَيْهِ، وَجَعَلَ النَّبِيُّ ﷺ يَصْرِفُ وَجْهَ الْفَضْلِ إِلَى الشِّقِّ الآخَرِ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ فَرِيْضَةَ اللهِ عَلَى عِبَادِهِ فِي الْحَجِّ أَدْرَكَتْ أَبِيْ شَيْخاً كَبِيْراً، لاَ يَثْبُتُ عَلَى الرَّاحِلَةِ، أَفَأَحُجُّ عَنْهُ؟ قَالَ: «نَعَمْ»، وَذَلِكَ فِي حَجَّةِ الْوَدَاعِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

584. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఫజ్ల్ బిన్ అబ్బాస్ (రజి) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక వాహనంపై కూర్చుని ఉన్నారు. అంతలో ఖస్అమ్ తెగకు చెందిన ఒక స్త్రీ అక్కడికి రాగా ఫజ్ల్ (రజి) ఆమె వైపు చూడసాగారు. ఆమె ఆయన వంక చూడసాగింది. దైవప్రవక్త (స) ఫజ్ల్ ముఖాన్ని మరోవైపునకు త్రిప్పసాగారు. తరువాత ఆ స్త్రీ 'దైవప్రవక్తా! నిశ్చయంగా హజ్ దేవుని తరపున ఆయన దాసులపై విధిగా నిర్ణయించబడింది. అయితే నా తండ్రి ముసలివాడు. ఆయన వాహనంపై కూర్చోలేడు. నేను ఆయన తరపున హజ్ చేయగలనా?' అని ప్రశ్నించింది. ''అవును. చేయవచ్చు'' అని ఆయన (స) బదులిచ్చారు. ఈ సంఘటన హజ్జతుల్ విదాకు సంబంధించినది. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

తనపై హజ్ ఫర్జ్ గావించబడిన వ్యక్తి (హజ్ చేయగల ఆర్థిక స్థోమత ఉన్న వ్యక్తి) వృద్ధాప్యానికి లేక వ్యాధికి లోనై ఉంటే అతని తరపున వేరొకరు హజ్ చేయటం ధర్మసమ్మతమే. త్వరగా కోలుకునే అవకాశం ఉంటే మాత్రం వేరొకరి ద్వారా హజ్ చేయించకూడదు.

### హదీసు ఉల్లేఖకులు

ఫజ్ల్ బిన్ అబ్బాస్ (రజి). ఈయన దైవప్రవక్త (స)కు బంధువు. పినతండ్రి కుమారుడవుతాడు. ఈయన తల్లిపేరు ఉమ్ముల్ ఫజల్ లుబాబ కుబ్రా బిన్తె హారిస్ హిలాలియ. ఫజ్ల్ చాలా అందంగా ఉండేవారు. హునైన్ యుద్ధంలో దైవప్రవక్త (స) వెంట స్థిరంగా ఉన్నారు - ఆయన (స) కు అంత్యక్రియల స్నానం చేయిస్తున్నప్పుడు కూడా దగ్గరే ఉన్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) కుమారులలో పెద్దవారు. జిహాద్ కొరకు సిరియా వెళ్ళారు. ప్లేగు వ్యాధి వచ్చిన సంవత్సరం (హిజ్రీ 18లో) మరణించారని ప్రతీతి. యర్మూక్ యుద్ధంలో అమరగతి నొందారని మరో కథనం. ఈయన ఒంటిపై దైవప్రవక్త (స) గారి దుప్పటి ఉండేది.

(٥٨٥) وَعَنْهُ أَنَّ امْرَأَةً مِنْ جُهَيْنَةَ جَاءَتْ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَتْ: إِنَّ أُمِّي نَذَرَتْ أَنْ تَحُجَّ، فَلَمْ تَحُجَّ، حَتَّى مَاتَتْ، أَفَأَحُجُّ عَنْهَا؟ قَالَ: «نَعَمْ، حُجِّي عَنْهَا، أَرَأَيْتِ لَوْ كَانَ عَلَى أُمِّكِ دَيْنٌ أَكُنْتِ قَاضِيَتَهُ؟ اقْضُوا اللَّهَ، فَاللَّهُ أَحَقُّ بِالْوَفَاءِ». رَوَاهُ الْبُخَارِيُّ.

585. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: జుహైనా తెగకు చెందిన ఒక స్త్రీ దైవ ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, "నిశ్చయంగా మా అమ్మ హజ్ చేస్తానని మొక్కుకుంది. కాని ఆమె హజ్ చేయకుండానే చనిపోయింది. నేనామె తరపున హజ్ చేయగలనా?" అని విన్నవించుకున్నది. దానికి ఆయన (స) ఇలా బదులిచ్చారు - "అవును. ఆమె తరపున హజ్ చేయి. నీ తల్లిపై రుణభారం ఉంటే నువ్వు దాన్ని తీర్చేదానివి కాదా? అలాగే అల్లాహ్ హక్కును కూడా తీర్చాలి. దాన్ని తీర్చగలందులకు అల్లాహ్ హక్కు దారుడు." (బుఖారీ)

(٥٨٦) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَيُّمَا صَبِيٍّ حَجَّ، ثُمَّ بَلَغَ الْحِنْثَ، فَعَلَيْهِ أَنْ يَحُجَّ حَجَّةً أُخْرَى، وَأَيُّمَا عَبْدٍ حَجَّ، ثُمَّ أُعْتِقَ فَعَلَيْهِ أَنْ يَحُجَّ حَجَّةً أُخْرَى». رَوَاهُ ابْنُ

586. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "పసితనంలో హజ్ చేసి యుక్త వయస్సుకు చేరిన వ్యక్తి మళ్లీ హజ్ చేయాలి. బానిసత్వంలో హజ్ చేసి తరువాత స్వతంత్రుడైన వ్యక్తి కూడా తిరిగి హజ్ చేయటం అవసరం." (దీనిని ఇబ్నె అబీ షైబ, బైహఖీ ఉల్లేఖించారు-

أَبِي شَيْبَةَ وَالْبَيْهَقِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ اخْتُلِفَ فِي رَفْعِهِ، وَالْمَحْفُوظُ أَنَّهُ مَوقُوفٌ.

దీనిని అందజేసిన వారు నమ్మకస్థులే గాని ఇది 'మర్ఫూ' అవటంపై భేదాభిప్రాయముంది. దీనిని 'మౌఖూఫ్'గా భావించటం సమంజసం.

(٥٨٧) وَعَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَخْطُبُ يَقُولُ: «**لاَ يَخْلُوَنَّ رَجُلٌ بِامْرَأَةٍ إِلاَّ وَمَعَهَا ذُو مَحْرَمٍ، وَلاَ تُسَافِرُ الْمَرْأَةُ إِلاَّ مَعَ ذِي مَحْرَمٍ**»، فَقَامَ رَجُلٌ فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنَّ امْرَأَتِي خَرَجَتْ حَاجَّةً، وَإِنِّي اكْتُتِبْتُ فِي غَزْوَةِ كَذَا وَكَذَا، قَالَ: «**انْطَلِقْ فَحُجَّ مَعَ امْرَأَتِكَ**». مُتَّفَقٌ عَلَيْهِ، واللَّفْظُ لِمُسْلِمٍ.

587. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సఅసం) ఒక ప్రసంగంలో ఇలా అంటుండగా విన్నాను - "ఏ పురుషుడూ ఒక స్త్రీతో కలసి ఒంటరిగా ఉండరాదు - ఒకవేళ ఆ స్త్రీ తరపున 'మహ్రమ్' వ్యక్తి తోడుంటే ఫరవాలేదు. ఏ స్త్రీ కూడా 'మహ్రమ్' లేకుండా (ఒంటరిగా) ప్రయాణం చేయ కూడదు." అంతలో ఒక వ్యక్తి లేచి నిలబడి, "దైవప్రవక్తా (సఅసం)! నా భార్య హజ్ కొరకు బయలుదేరింది. మరి నా పేరు ఫలానా ఫలానా యుద్ధాలలో పాల్గొనే నిమిత్తం వ్రాసుకోబడింది కదా!" అని సందేహపడ్డాడు. దానికి ఆయన (స), "నువ్వు నీ సతీమణితో హజ్ చేసేందుకు వెళ్ళొచ్చు" అని చెప్పారు. (ముత్తఫఖున్ అలైహ్). ఈ వాక్యాలు 'ముస్లిం'లోనివి)

**సారాంశం**

పరాయి పురుషుని వెంట ఏకాంతంలో ఉండటం, ఒంటరిగా అతనితో కలసి పయనించటం హరామ్ (నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. వారిరువురూ ఎప్పుడు ఏకాంతంలో వున్నా వారి వెంట మూడో వ్యక్తిగా షైతాన్ ఉంటాడు. కాబట్టి పరాయి స్త్రీతో -ఆమె తరపు 'మహ్రమ్' బంధువు లేకుండా -ప్రయాణం చేయకూడదు. కొంతమంది ధర్మవేత్తలు వృద్ధ మహిళల విషయంలో సడలింపుల వైఖరిని అవలంబించారు. కాని ఇది హదీసుకు విరుద్ధమైన వైఖరి. అలాగే ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యే మరో విషయం ఏమిటంటే మహిళలకు నమాజ్

మాదిరిగా హజ్ కూడా విధి (ఫర్జ్)గా చేయబడింది. కాబట్టి వారు మొదటిసారి హజ్ యాత్ర నిమిత్తం తమ భర్తల అనుమతి పొందటం అవశ్యం కాదు. అయితే మలిసారి హజ్ కొరకు మాత్రం భార్య భర్త అనుమతిని తప్పక పొందవలసినదే.

(٥٨٨) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ سَمِعَ رَجُلاً يَقُولُ: لَبَّيْكَ عَنْ شُبْرُمَةَ، قَالَ: «مَنْ شُبْرُمَةُ»؟ قَالَ: أَخٌ لِي، أَوْ قَرِيبٌ لِي، قَالَ: «حَجَجْتَ عَنْ نَفْسِكَ»؟ قَالَ: لاَ، قَالَ: «حُجَّ عَنْ نَفْسِكَ، ثُمَّ حُجَّ عَنْ شُبْرُمَةَ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَالرَّاجِحُ عِنْدَ أَحْمَدَ وَقْفُهُ.

588. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "షుబ్రుమా తరఫున లబ్బైక్" అని ఒక వ్యక్తి పలుకుతుండగా దైవ ప్రవక్త (సఅసం) విన్నారు. "ఎవరీ షుబ్రుమా?" అని ఆయన (స) అడగ్గా, "ఆయన నా సోదరుడు లేక నా ఆప్తుడు" అని అతను జవాబిచ్చాడు. "నువ్వు నీ తరఫున హజ్ చేశావా?" అని ఆయన (సఅసం) అడిగారు. "లేద"న్నాడావ్యక్తి. "ముందు నీ తరఫున హజ్ నెరవేర్చు. తరువాత షుబ్రుమా తరఫున చేయ వచ్చు" అని ఆయన (స) ఉపదేశించారు. (అబూదావూద్, ఇబ్నె మాజా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఇమామ్ అహ్మద్ దృష్టిలో ఇది 'మౌఖూఫ్'గా చెల్లుతున్నది)

**సారాంశం**

ఈ హదీసు ప్రామాణికమైనదా? బలహీనమైనదా? అన్న విషయమై అభిప్రాయభేదముంది. ఇమామ్ అహ్మద్, ఇమామ్ ఇబ్నె ముంజిర్‌లు ఈ హదీసు 'మర్ఫూ' కావటాన్ని అంగీకరించలేదు. ఇమామ్ బైహఖీ, ఇబ్నె హిబ్బాన్ తదితరులు దీనిని 'సహీహ్'గా ఖరారు చేశారు. ఇమామ్ దారె ఖుత్నీ మాత్రం దీనిని 'ముర్సల్'గా భావించారు. మొత్తానికి ఈ హదీసును 'మౌఖూఫ్'గా పరిగణించినప్పటికీ ఈ హదీసు ఒక ప్రబల నిదర్శనమే అవుతుంది. ఎందుకంటే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనాలతో ప్రవక్త సహచరులలో ఎవరూ విభేదించటంగానీ, వ్యతిరేకించటం గానీ చేయలేదు. అందుకే 'హజ్జె బదల్' చేస్తున్నప్పుడు ఈ బాధ్యత తీసుకున్న వ్యక్తి మొదట తన హజ్‌ను చేసి తరువాత హజ్జె బదల్ చేయాలి. 'లేక నా ఆప్తుడు' అనేది ఉల్లేఖకునికి వచ్చిన సందేహమే. ఉల్లేఖకులు హదీసును అందజేయటంలో కించిత్ తడబాటుకు లోనయ్యారు.

(٥٨٩) وَعَنْهُ قَالَ: خَطَبَنَا رَسُولُ اللهِ ﷺ فَقَالَ: «إِنَّ اللَّهَ كَتَبَ عَلَيْكُمْ الْحَجَّ»، فَقَامَ الْأَقْرَعُ بْنُ حَابِسٍ، فَقَالَ: أَفِي كُلِّ عَامٍ يَا رَسُولَ اللهِ!؟ قَالَ: «لَوْ قُلْتُهَا لَوَجَبَتْ. الْحَجُّ مَرَّةً، فَمَا زَادَ فَهُوَ تَطَوُّعٌ». رَوَاهُ الْخَمْسَةُ غَيْرَ التِّرْمِذِيِّ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ.

589. హ(జత్ ఇబ్నె అబ్బాస్ (రజి)గారే ఇలా తెలిపారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు : "నిశ్చయం గా అల్లాహ్ మీపై హజ్‌ను విధి (ఫర్జ్)గా నిర్ణయించాడు." అప్పుడు అఖ్రా బిన్ హాబిస్(రజి) లేచి, 'దైవప్రవక్తా (సఅసం)! ఏటేటా ఇది ఫర్జ్ గావించబడిందా?' అని ప్రశ్నించారు. "ఒకవేళ నేను అవునంటే ఇది (ఏటేటా) ఫర్జ్ అయిపోతుంది. హజ్ ఒకసారి మాత్రమే. అంతకు మించి చేసిన హజ్‌లు 'నఫిల్'గా పరిగణించబడ తాయి" అని ఆయన (సఅసం) వివరించారు. (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - దీని మూలం 'ముస్లిం'లో హ(జత్ అబూ హురైర -రజి- ఉల్లేఖనంలో ఉంది)

**సారాంశం**

మనిషి జీవితంలో ఒకసారి హజ్ చేస్తే అతని విధి నెరవేరుతుందన్న దానికి ఈ హదీసు ఒక నిదర్శనం. అంతకుమించి చేసిన హజ్‌లు అదనపు హజ్‌లు (నఫిల్ హజ్‌లు) గా భావించబడతాయి.

దైవప్రవక్త (స)కు తన అనుచర సమాజం సాధకబాధకాలు తెలుసు. ఏటేటా దీనిని వారిపై విధిగా నిర్ణయిస్తే వారెన్నో ఇక్కట్లకు లోనుకావలసివస్తుంది. అందుకే ఒకసారి హజ్‌ను మాత్రమే 'ఫర్జ్'గా నిర్ణయించారు.

"నేను 'అవును' అని అంటే ఇది ఏటేటా విధి అయిపోతుంది" అని దైవప్రవక్త (స) చెప్ప టాన్ని బట్టి, షరీయత్ ఆదేశాలను ప్రవేశపెట్టడంలో దైవప్రవక్త (స) తన ఇచ్ఛప్రకారం వ్యవహ రించగలరా? అన్న ఒక సందేహం ఇక్కడ జనించవచ్చు. అత్యధికమంది విద్వాంసులు "లేదు" అనే తలంచారు. ఈ తలంపు సరైనది కూడా. ఎందుకంటే దైవప్రవక్త (స) ఏ ఆజ్ఞను ఇచ్చినా అది దేవుని అభిమతంపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశంపై చర్చను సాగదీస్తే వివరాల్లోకి పోవలసి ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

అఖ్రా బిన్ హాబిస్ (రజి). ఈయన తమీమ్ తెగకు చెందినవారు. మక్కా విజయం తరువాత దైవప్రవక్త (స) సమక్షంలోకి వచ్చిన బనూ తమీమ్ ప్రతినిధి బృందంలో ఈయన సభ్యులు. "ముఅల్లఫతుల్ ఖులూబ్" లో - అంటే హృదయాలను జయించే ఉద్దేశ్యంతో సద్వ్యవహారం చేయబడిన వారిలో - ఒకరుగా పరిగణించబడతారు. ఇస్లాంకు పూర్వం, ఇస్లాం స్వీకారం తరువాత కూడా తన తెగకు సర్దార్‌గా ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈయన మరణించారు.

### 2వ అధ్యాయం

## ٢ - بَابُ الْمَوَاقِيْتِ

## మీఖాత్

## (ఇహ్రామ్ పూనవలసిన ప్రదేశాలు)

(٥٩٠) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْمَدِيْنَةِ ذَا الْحُلَيْفَةِ، وَلِأَهْلِ الشَّامِ الْجُحْفَةَ، وَلِأَهْلِ نَجْدٍ قَرْنَ الْمَنَازِلِ، وَلِأَهْلِ الْيَمَنِ يَلَمْلَمَ، هُنَّ لَهُنَّ، وَلِمَنْ أَتَى عَلَيْهِنَّ مِنْ غَيْرِهِنَّ، مِمَّنْ أَرَادَ الْحَجَّ وَالْعُمْرَةَ، وَمَنْ كَانَ دُوْنَ ذٰلِكَ فَمِنْ حَيْثُ أَنْشَأَ، حَتَّى أَهْلُ مَكَّةَ مِنْ مَكَّةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

590. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనావాసుల కోసం 'జుల్ హులైఫా'ను, సిరియావాసుల కోసం 'జుహ్ఫా'ను, నజ్ద్ ప్రాంతం వారి కొరకు 'ఖర్నె మనాజిల్'ను, యమన్‌వారి కొరకు 'యలమ్‌లమ్'ను ఇహ్రామ్ కట్టుకునే సంకల్పం చేసుకునే స్థలాలు (మీఖాత్‌లు)గా నిర్ధారించారు. ఇతర పట్టణాలనుంచి, ఇతర ప్రదేశాలనుంచి హజ్ మరియు ఉమ్రాల కొరకు వచ్చే వారి కొరకు కూడా ఇవి 'మీఖాత్'గా ఉంటాయి. ఇక ఈ (మీఖాత్) పరిధి లోపల ఉండేవారు, తాము బయలు దేరిన చోటునుంచే ఇహ్రామ్ కట్టుకోవాలి. మక్కావాసులు మక్కానుండే ఇహ్రామ్ కట్టుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ప్రపంచం నలుమూలల నుంచి హజ్ మరియు ఉమ్రాల కోసం వచ్చేవారికై కొన్ని స్థలాలు 'మీఖాత్'లుగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆ స్థలాలు చేరుకోకముందే 'ఇహ్రామ్' దీక్షబూనినా తప్పు లేదు గాని ఆ స్థలాలు దాటి లోపల ప్రవేశిస్తే మాత్రం హజ్‌గానీ, ఉమ్రాగానీ నెరవేరదు. ఎందుకంటే హజ్ లేక ఉమ్రాల కొరకు 'ఇహ్రామ్' కట్టుకోవటం అవసరం.

(٥٩١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْعِرَاقِ ذَاتَ عِرْقٍ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَأَصْلُهُ عِنْدَ مُسْلِمٍ مِنْ حَدِيْثِ جَابِرٍ، إِلاَّ أَنَّ رَاوِيَهُ شَكَّ فِيْ رَفْعِهِ.

591. హ్రజత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇరాక్ వాసుల కోసం 'జాతె ఇర్ఖ్'ను మీఖాత్‌గా నిర్ధారించారు. (అబూ దావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. దీని మూలం 'ముస్లిం'లో హ్రజత్ జాబిర్ ఉల్లేఖనం ఆధారంగా ఉంది. అయితే దీన్ని అందజేసిన వారు ఇది 'మర్ఫూ' అనే విషయంపై అనుమానాన్ని వ్యక్తం చేశారు)

وَفِيْ صَحِيْحِ الْبُخَارِيِّ: أَنَّ عُمَرَ هُوَ الَّذِيْ وَقَّتَ ذَاتَ عِرْقٍ.

'జాతె ఇర్ఖ్'ను మీఖాత్‌గా నిర్ధారించింది హ్రజత్ ఉమర్ (రజి) అని సహీహ్ బుఖారీలో ఉంది.

وَعِنْدَ أَحْمَدَ وَأَبِيْ دَاوُدَ وَالتِّرْمِذِيِّ عَنِ ابْنِ عَبَّاسٍ، أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْمَشْرِقِ الْعَقِيْقَ.

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీలలో పొందుపరచబడిన హ్రజత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది - "దైవప్రవక్త (సఅసం) తూర్పు ప్రాంతాల వారికై 'అఖీఖ్'ను మీఖాత్‌గా నిర్ణయించారు."

**సారాంశం**

'వాదియె ఫాతిమా'గా నేడు ప్రసిద్ధిచెందిన 'మ్రరుజ్జహ్రాన్' లోయ వాస్తవానికి తాయఫ్ పట్టణానికి ముందు - మక్కాకు తూర్పు - నుంచి మొదలై దక్షిణ జెద్దాకు సమీపంలో అహ్మర్ సముద్రం పశ్చిమం వైపునకు సమాప్తమవుతుంది - ఈ లోయకు రెండు అంచులున్నాయి. దీని దక్షిణ అంచు తాయఫ్ మార్గంలో గల పెద్ద లోయ దగ్గర 'నఖ్లె యమానియా' కన్నా ముందు ఉంది. దీనినే 'ఖర్నె మనాజిల్' అని అంటారు. ఇక రెండవ ఉత్తర అంచు జరీబాకు చేరువలో 'జాతె ఇర్ఖ్' వద్ద ఉంది. ఇరాక్ ప్రజలు, నజ్ద్ ప్రాంతం వారు ఇటువైపునుంచే వెళతారు. ఈ రెండు అంచుల మధ్య చాలా అంతరం ఉంది. అయితే ఈ రెండు స్థలాలనుంచి పవిత్ర మక్కా నగరం సమాన దూరంలో ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని హ్రజత్ ఉమర్ (రజి) 'ఇజ్తిహాద్' చేశారు.

ఇక్కడ ఒక విషయం గమనార్హం. కాబా గృహానికి చేరుకోవటానికి ముందు నిర్ధారిత ఐదు మీఖాత్‌లలో ఏ ఒక్క మీఖాత్ మీదుగా కూడా పోలేని వ్యక్తి - కనీసం ఆ మీఖాత్‌ల నుంచి కాబా గృహం ఎంత దూరం ఉంటుందో లెక్కకట్టి అంతదూరం నుంచే ఇహ్రామ్ కట్టుకోవటం అవసరం. ఈ దూరాన్ని అంచనావేసిన మీదటే హ్రజత్ ఉమర్ (రజి) గారు 'జాతె ఇర్ఖ్'ను ఇరాక్ ప్రజల కోసం 'మీఖాత్'గా నిర్ణయించారు. ధర్మవేత్తలంతా ఈ 'ఇజ్తిహాద్'తో ఏకీభవించారు. కాబా

గృహానికి ఐదువైపులా మీఖాత్‌లుగా నిర్ధారించబడిన ఐదు స్థలాలను కలుపుతూ రేఖ గీస్తే అది పవిత్ర మక్కాను అన్ని వైపులనుంచి దిగ్బంధం చేసిన వలయాకారం ఏర్పడుతుంది. కనుక ప్రపంచం ఏమూల నుంచి వచ్చినా యాత్రికులు ఈ వలయాకారాన్ని దాటి లోపలకు వెళ్ళవలసిందే. అదీగాక ఈ వలయాకారం సముద్ర స్థలంలో గాకుండా భూభాగంపైననే ఉంది. కాబట్టి ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి తూర్పు దేశాలనుంచి హజ్ లేక ఉమ్రా కొరకు సముద్ర ప్రయాణం చేసి వెళ్ళేవారు జెద్దా వరకూ ఇహ్రామ్ దీక్షబూనవలసిన అవసరం లేదు. ఎందుకంటే వారు పయనించే ఓడ 'యలమ్‌లమ్' అనే మీఖాత్‌ను ఇంకా సమీపించనే లేదు.

## ٣ - بَابُ وُجُوهِ الإِحْرَامِ وَصِفَتُهُ

### 3వ అధ్యాయం

## ఇహ్రామ్ రకాలు - వాటి గుణాలు

(٥٩٢) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: خَرَجْنَا مَعَ رَسُولِ اللّٰهِ ﷺ عَامَ حَجَّةِ الْوَدَاعِ، فَمِنَّا مَنْ أَهَلَّ بِعُمْرَةٍ، وَمِنَّا مَنْ أَهَلَّ بِحَجٍّ وعُمْرَةٍ، وَمِنَّا مَنْ أَهَلَّ بِحَجٍّ، وَأَهَلَّ رَسُولُ اللّٰهِ ﷺ بِالْحَجِّ، فَأَمَّا مَنْ أَهَلَّ بِعُمْرَةٍ فَحَلَّ عِنْدَ قُدُوْمِهِ، وَأَمَّا مَنْ أَهَلَّ بِحَجٍّ، أَوْ جَمَعَ بَيْنَ الْحَجِّ وَالْعُمْرَةِ، فَلَمْ يَحِلُّوْا حَتَّى كَانَ يَوْمُ النَّحْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

592. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి హజ్జతుల్ విదా (అంతిమ హజ్‌యాత్ర)కై బయలు దేరాము. మాలో కొంతమంది ఉమ్రా కొరకు 'తల్బియా' చెప్పారు. కొంతమంది హజ్ మరియు ఉమ్రాల కోసం 'తల్బియా' పలికారు. మరికొంతమంది హజ్ కొరకు 'లబ్బైక్' చెప్పారు. దైవప్రవక్త (సఅసం) కేవలం హజ్ కొరకు 'తల్బియా' పలికారు. ఉమ్రా కోసం 'తల్బియా' పలికిన వారు 'ఇహ్రామ్' నిబంధనల నుంచి విముక్తులైపోయారు. హజ్ కోసం లబ్బైక్ నినాదాలు చేసినవారు, హజ్ మరియు ఉమ్రాల కోసం లబ్బైక్ పలికినవారు ఖుర్బానీ దినం వచ్చే వరకూ 'ఇహ్రామ్' కు కట్టుబడే ఉన్నారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

హజ్ మూడు రకాలని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది: (1) హజ్జె ఖిరాన్ (2) హజ్జె తమత్తు (3) హజ్జె ఇఫ్రాద్. ఈ మూడింటిలో శ్రేష్ఠమైన హజ్ ఏది? సాధారణంగా హజ్జె ఖిరాన్‌ను హనఫీలు, అహ్లె హదీసువారు శ్రేష్ఠమైన హజ్‌గా భావిస్తారు. ఎందుకంటే పవిత్రుడైన అల్లాహ్

తన ప్రియప్రవక్త (స)కై ఈ హజ్‌నే ఇష్టపడ్డాడు. ఈ హజ్ కాస్త శ్రమతో కూడుకున్నది కూడా అల్లామా ఇబ్నె ఖయ్యూమ్ (రహ్మలై) 'జాదుల్ మఆద్'లో దీనిపై ఉత్తమమయిన చర్చ జరిపారు. అయితే ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్‌లు హజ్జె తమత్తును అత్యుత్తమమయిన హజ్‌గా భావిస్తున్నారు. ఈ హజ్ సౌలభ్యంతో కూడుకున్నది. ఒకానొక సందర్భంలో దైవప్రవక్త (స) 'ఈ హజ్‌కై సంకల్పించుకుంటే బావుండేదే'! అని చెప్పారు కూడా. అల్లామా షౌకానీ దృక్పథం కూడా ఇదే. మరికొంతమంది హజ్జె ఇఫ్రాద్‌ను శ్రేష్ఠ మయినదిగా పేర్కొన్నారు. అయితే ప్రబల నిదర్శనాల దృష్ట్యా చూస్తే ఈ మూడింటిలో మొదటిదే అత్యుత్తమ మయినదిగా చెలామణీ అవుతోంది.

## ٤ - بَابُ الْإِحْرَامِ وَمَا يَتَعَلَّقُ بِهِ.

**4వ అధ్యాయం**

## ఇహ్రామ్ తత్సంబంధిత విషయాలు

(٥٩٣) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَا أَهَلَّ رَسُولُ اللّٰهِ ﷺ إِلاَّ مِنْ عِنْدِ الْمَسْجِدِ. مُتَّفَقٌ عَلَيْهِ.

593. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్ సమీపంలో తప్ప 'లబ్బైక్' నినాదం చేయలేదు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇక్కడ మస్జిద్ అంటే 'జుల్ హులైఫా' స్థానం అని భావం. దైవప్రవక్త (స) 'బైదా' అనే స్థలంలో ఇహ్రామ్ కట్టుకున్నారని కొంతమందికి కలిగిన అపోహను దూరం చేయడానికి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఈ విధంగా అన్నారు. ఆయన (స) మూడుసార్లు 'లబ్బైక్' నినాదం చేసినట్టు హదీసులలో వచ్చింది. ఆయన (స) మస్జిద్‌లో ఉండగానే - రెండు రకతుల నమాజ్ చేసి - లబ్బైక్ పలికారని కొన్ని ఉల్లేఖనాలలో ఉండగా, 'బైదా' శిఖరానికి చేరుకుని అక్కడినుంచి లబ్బైక్ అని ఎలుగెత్తి చాటారని మరికొన్ని ఉల్లేఖనాలలో ఉంది. హదీసులలో పరస్పర వ్యాఘాతం పైకి కనిపిస్తున్నప్పటికీ వాటి మధ్య ఈ విధంగా సమన్వయం చేయబడింది - ఆయన (స) మస్జిద్‌లోనే ఇహ్రామ్ కట్టుకున్నారు. ఆ దృశ్యాన్ని చూచినవారు ఆ స్థితిని మాత్రమే వర్ణించారు. అయితే ఆయన (స) బయటికి వచ్చి ఒంటెపై కూర్చుని బిగ్గరగా లబ్బైక్ నినాదం చేసినపుడు ఆ దృశ్యాన్ని చూచినవారు, దైవప్రవక్త (స) ఇప్పుడే ఇహ్రామ్ దీక్షబూనారని తలపోశారు. ఇక కాస్త ముందుకు వెళ్ళాక - 'బైదా' స్థలంలో ఆయన (స) లబ్బైక్ పలకటం విన్న ప్రజలు, బహుశా దైవప్రవక్త (స) ఇక్కడే ఇహ్రామ్ దీక్షబూని ఉంటారని భావించారు. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఈ దృశ్యాన్ని చూచారో వారు ఆ స్థితిని యథాతథంగా చిత్రీకరించారు. అందువల్ల ఈ హదీసులలో వైరుధ్యం కనబడుతోంది.

(٥٩٤) وَعَنْ خَلَّادِ بْنِ السَّائِبِ، عَنْ أَبِيهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ

594. ఖల్లాద్ బిన్ సాయిబ్ తన తండ్రి నుంచి గ్రహించిన హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

قَالَ: «أَتَانِي جِبْرِيلُ، فَأَمَرَنِي أَنْ آمُرَ أَصْحَابِي، أَنْ يَرْفَعُوا أَصْوَاتَهُمْ بِالإِهْلاَلِ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

ఇలా అన్నారు - "జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా దగ్గరకు వచ్చి 'లబ్బైక్'ను బిగ్గరగా పలకమని మీ సహచరులను ఆదేశించండి' అని నన్ను సూచించారు." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఇమామ్ తిర్మిజీ, ఇమామ్ ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీకరించారు)

**సారాంశం**

'లబ్బైక్'ను బిగ్గరగా పలకాలన్న దానికి ఈ హదీసు బహిరంగ నిదర్శనం. దైవప్రవక్త (స) సహచరులు ఎంత బిగ్గరగా ఈ 'తల్బియా' పలికేవారంటే, ఒక్కోసారి వారి గొంతు బొంగురు పోయేది. మెజారిటీ ధర్మవేత్తలు కూడా దీంతో ఏకీభవించారు. అయితే 'తల్బియా' కేవలం మినా మరియు మస్జిదె హరామ్ వద్దనే బిగ్గరగా పలకాలని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అంటారు.

**హదీసు ఉల్లేఖకులు**

(1) ఖల్లాద్ : ఖల్లాద్ బిన్ సాయిబ్ అన్సార్ వర్గానికి చెందినవారు. ఖజ్రజ్ తెగతో ఈయనకు సంబంధం ఉంది. ప్రముఖ తాబయి. నమ్మదగ్గ ఉల్లేఖకులు. ఈయన సహాబీ అని తలపోసిన వారు పొరబడ్డారు.

(2) సాయిబ్ (రజి). ఖల్లాద్ తండ్రిగారు. ప్రముఖ సహాబీలలో ఒకరు. మారుపేరు అబూ సలమా. బద్ర్ యుద్ధ మైదానంలో వీరమరణం పొందారు.

(٥٩٥) وَعَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ تَجَرَّدَ لإِهْلاَلِهِ، وَاغْتَسَلَ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

595. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహ్రామ్ కట్టిన సందర్భంలో బట్టలు విడిచి స్నానం చేశారు. (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - 'హసన్'గా నిర్ధారించారు)

**సారాంశం**

ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ఈ హదీసును 'హసన్'గా నిర్ధారించగా ఇమామ్ ఉఖైలీ (రహ్మ.లై) దీనిని 'జయీఫ్'గా ఖరారు చేశారు. అయితే ఈ విషయమై అసంఖ్యాకంగా హదీసులు వచ్చాయి. కనుక ఇహ్రామ్ సందర్భంగా స్నానం చేయటం 'మస్నూన్' అనటంలో సందేహానికి తావులేదు.

(٥٩٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ سُئِلَ مَا يَلْبَسُ الْمُحْرِمُ مِنَ الثِّيَابِ؟ قَالَ: «**لاَ يَلْبَسُ الْقَمِيصَ، وَلاَ الْعَمَائِمَ، وَلاَ السَّرَاوِيلاَتِ، وَلاَ الْبَرَانِسَ، وَلاَ الْخِفَافَ، إِلاَّ أَحَدٌ لاَ يَجِدُ نَعْلَيْنِ فَلْيَلْبَسِ الْخُفَّيْنِ، وَلْيَقْطَعْهُمَا أَسْفَلَ مِنَ الْكَعْبَيْنِ، وَلاَ تَلْبَسُوا شَيْئاً مِنَ الثِّيَابِ مَسَّهُ الزَّعْفَرَانُ، وَلاَ الْوَرْسُ**». مُتَّفَقٌ عَلَيْهِ، واللَّفْظُ لِمُسْلِمٍ.

596. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "ఇహ్రామ్ కట్టుకునేవారు ఏం ధరించాలి?" అని దైవప్రవక్త (సఅసం) ను ప్రశ్నించటం జరిగింది. దానికి ఆయన (సఅసం) ఇలా వివరించారు: "చొక్కా, తలపాగా, జుబ్బా, పాజమా, టౌజర్, తోలు మేజోళ్లు తొడగరాదు. ఒకవేళ చెప్పులు లేని పక్షంలో మేజోళ్లు ధరించ వచ్చుగాని మోకాళ్ళ క్రిందినుంచీ వాటిని కత్తిరించాలి. కాషాయరంగు బట్టలు గానీ, పసుపు రంగరించిన వస్త్రాలుగానీ ధరించరాదు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

**సారాంశం**

'ఇహ్రామ్' కొరకు చొక్కా, పాజమా, జుబ్బా, టోపీ వంటివి ఉపయోగించరాదనీ, ఎవరి వద్దయినా చెప్పులు లేకపోయినట్లయితే వారు తమ తోలు మేజోళ్లను మోకాళ్ల క్రింది భాగం వరకు కత్తిరించి - పాదం కనిపించేలా - తొడుక్కోవాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ వ్యవహారంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి.

(٥٩٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أُطَيِّبُ رَسُولَ اللهِ ﷺ لإِحْرَامِهِ قَبْلَ أَنْ يُحْرِمَ، وَلِحِلِّهِ قَبْلَ أَن يَطُوفَ بِالْبَيْتِ. مُتَّفَقٌ عَلَيْهِ.

597. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఇహ్రామ్ కట్టక పూర్వం, ఇహ్రామ్ సమయంలో, ఇహ్రామ్ ను విడిచిన సమయంలో సువాసన పూసే దానిని. ఆయన (స) దైవగృహ ప్రదక్షిణ చేయకమునుపు కూడా."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇహ్రామ్ కట్టకపూర్వం సువాసన పూసుకోవటం మంచిది. ఇహ్రామ్ స్థితిలో ఆ సువాసన వస్తూ ఉంటుంది. కాని ఇహ్రామ్ దీక్షబూనిన తరువాత దాన్ని విరమించేవరకూ సుగంధ ద్రవ్యాలను ఉపయోగించకూడదు.

'కాబా గృహ ప్రదక్షిణ చేయకమునుపు' అని హదీసులో వచ్చింది. 'తవాఫె జియారత్' నేపథ్యంలో ఇలా అనబడింది. ఈ తవాఫ్ జిల్‌హజ్ 10వ తేదీన ఖుర్బానీ ఇచ్చి, (హల్ఖ్) క్షవరం చేసుకున్న మీదట చేయబడుతుంది.

(٥٩٨) وَعَنْ عُثْمَانَ بْنِ عَفَّانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: «**لَا يَنْكِحُ الْمُحْرِمُ، وَلَا يُنْكِحُ، وَلَا يَخْطُبُ**». رَوَاهُ مُسْلِمٌ.

598. హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు- "ఇహ్రామ్ స్థితిలో వివాహం చేసుకోరాదు, వివాహం చేయించరాదు, సంబంధం నిశ్చయించరాదు." (ముస్లిం)

**సారాంశం**

అంటే 'ఇహ్రామ్' దీక్షబూనిన తరువాత ఆ స్థితిలో తన నికాహ్ చేసుకోవటంగానీ, ఇంకొకరి నికాహ్ జరిపించటంగానీ, ఎవరికయినా వివాహ సందేశం పంపి పెళ్లి ఖాయం చేసుకోవటంగానీ నిషిద్ధం (హరామ్). దైవప్రవక్త (స) ఇహ్రామ్ స్థితిలో హజ్రత్ మైమూనా (ర.అన్‌హా)ను నికాహ్ చేసుకున్నారన్న ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ఒక భ్రమ మాత్రమే. హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) 'జాదుల్ మఆద్'లో దీనిపై క్షుణ్ణంగా చర్చించారు.

(٥٩٩) وَعَنْ أَبِي قَتَادَةَ الْأَنْصَارِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ - فِي قِصَّةِ صَيْدِهِ الْحِمَارَ الْوَحْشِيَّ وَهُوَ غَيْرُ مُحْرِمٍ - قَالَ: فَقَالَ رَسُولُ اللّٰهِ ﷺ لِأَصْحَابِهِ - وَكَانُوا مُحْرِمِينَ -: **هَلْ مِنْكُمْ أَحَدٌ أَمَرَهُ، أَوْ أَشَارَ إِلَيْهِ بِشَيْءٍ؟** قَالُوا: لَا، قَالَ: «**فَكُلُوا مَا بَقِيَ مِنْ لَحْمِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

599. హజ్రత్ అబూ ఖతాదా అన్సారీ (రజి), తానింకా ఇహ్రామ్ దీక్షబూనని సమయంలో అడవి గాడిద (జిబ్రా)ను వేటాడిన వృత్తాంతానికి సంబంధించి ఇలా అన్నారు : దైవప్రవక్త (సఅసం) ఇహ్రామ్ స్థితిలోవున్న తన సహచరుల నుద్దేశ్యించి "మీలో ఎవరయినా ఇతనికి ఈ మేరకు ఆజ్ఞాపించారా? లేక ఇతని వైపునకు ఎవరయినా ఈ మేరకు సంజ్ఞ చేశారా?" అని అడిగారు. 'లేదు' అని వాళ్లంతా సమాధానమిచ్చారు. "అయితే మిగిలివున్న దాని మాంసాన్ని తినండి" అని ఆయన (స) సెలవిచ్చారు.

(బుఖారీ, ముస్లిం)

## పూర్వరంగం

ఈ వృత్తాంతం యొక్క పూర్వరంగం ఇలా వుంది : హజ్రత్ అబూ ఖతాదా (రజి) దైవప్రవక్త (సఅసం)తో కలసి బయలుదేరారు. కాని ఈయన తన కొంతమంది సహచరులతోపాటు వెనుక ఉండిపోయారు. హజ్రత్ అబూ ఖతాద (రజి) అప్పటికింకా ఇహ్రామ్ కట్టుకోలేదు. కాని ఆయన వెంటనున్నవారు మాత్రం ఇహ్రామ్ కట్టుకున్నారు. వాళ్లంతా అడవి గాడిద (జిబ్రా)ను చూచీ చూడనట్లుగా వదిలేశారు. కాని అబూ ఖతాద (రజి) దృష్టి దానిపై పడగానే గుఱ్ఱమెక్కి దాన్ని వెంబడించసాగారు. తనకు తన కఱ్ఱ నివ్వమని ఆయన సహచరులను కోరారు. కాని వాళ్లంతా అందుకు నిరాకరించారు. అయినాసరే అబూ ఖతాద (రజి) అడవిగాడిదను వెంబడించి, గాయ పరిచారు. తరువాత దాన్ని జిబహ్ చేసి అబూ ఖతాద (రజి) కొంత మాంసం తిన్నారు. సహచరులు కూడా తిన్నారు. కాని తరువాత వాళ్లంతా సందిగ్ధంలో పడిపోయారు.

దైవప్రవక్త (స) ను సమీపించిన తరువాత జరిగినదంతా చెప్పారు. దాని సమాధానం హదీసు రూపంలో వచ్చింది.

ఇహ్రామ్ కట్టుకోని వ్యక్తి గనక అడవి జంతువును వేటాడితే, ఆ వేటలో ఇహ్రామ్ కట్టుకున్న వ్యక్తులు ఏవిధంగానూ సహకరించకుండా ఉంటే - అట్టి పరిస్థితిలో ఆ మాంసాన్ని వాళ్లంతా తినవచ్చు. అయితే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు రాబోయే హదీసులో ఉన్నాయి.

(٦٠٠) وَعَنِ الصَّعْبِ بْنِ جَثَّامَةَ اللَّيْثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ أَهْدَى لِرَسُولِ اللهِ ﷺ حِمَاراً وَحْشِيًّا، وَهُوَ بِالأَبْوَاءِ أَوْ بِوَدَّانَ، فَرَدَّهُ عَلَيْهِ، وَقَالَ: «إِنَّا لَمْ نَرُدَّهُ عَلَيْكَ إِلاَّ أَنَّا حُرُمٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

600. హజ్రత్ సాబ్ బిన్ జస్సామ లైసీ (రజి) కథనం ప్రకారం, ఆయన ఒక అడవి గాడిద (జిబ్రా)ను కానుకగా దైవప్రవక్త (సఅసం) వద్దకు పంపించారు. ఆ సమయంలో ఆయన (స) 'అబ్వా' లేక 'వద్దాన్' అనే స్థలంలో వున్నారు. ఆయన (స) దాన్ని తిరిగి పంపిస్తూ, "మేము ఇహ్రామ్ స్థితిలో ఉండటం వల్ల దీన్ని వాపసు చేస్తున్నాము" అని సెల విచ్చారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ఇంతకు ముందు వచ్చిన హదీసుకు భిన్నంగా కనిపిస్తుంది. ముహ్రిమ్ కొరకు (ఇహ్రామ్ కట్టుకున్నవారి కొరకు) వేటాడిన జంతుమాంసం నిషిద్ధం. ఆ వేటలో ఇహ్రామ్ కట్టు కున్నవారు పాల్గొన్నా పాల్గొనకపోయినాసరే ఆ మాంసాన్ని వారు తినకూడదు. కాని మొదటి హదీసులో తినవచ్చని ఉంది. ఈ రెండు హదీసులను ఈ విధంగా క్రమబద్ధం చేయవచ్చు -

వేట ఇహ్రామ్ స్థితిలో వున్న వారి కోసమే చేయబడితే అట్టి జంతువుల మాంసం ముమ్మాటికీ నిషిద్ధమే. ముస్నద్ అహ్మద్, ఇబ్నె మాజాలోని ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అబూ ఖతాద (రజి)

దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, 'అయ్యా! మీ కోసమే నేను ఈ జంతువును వేటాడాను' అని అంటారు. కాని ఆయన (సఅసం) ఆ జంతుమాంసాన్ని ముట్టుకోనయినా లేదు.

ఇక తిర్మిజీలోని వేరొక హదీసును గమనించండి - హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు: "ఇహ్రామ్ స్థితిలో నేలపై చేయబడిన వేట మీ కొరకు ధర్మసమ్మతమే. అయితే మీరు దాన్ని వేటాడటంగానీ, మీ కోసమని ప్రత్యేకంగా వేటాడి ఉండటంగాని జరగరాదు."

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే వేటలో ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ ఇహ్రామ్ కట్టుకున్నవారి ప్రమేయం ఉంటే, లేదా వాళ్ల విందుకోసం ఆ జంతువు వేటాడబడి ఉంటే దాని మాంసం తినటం అధర్మం. ఇట్టి పరిస్థితి గనక లేకుంటే 'ముహ్రిమ్' వ్యక్తి వేటాడిన జంతు మాంసాన్ని తినవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

సాబ్ బిన్ జస్సామ (రజి). లైస్ తెగకు చెందినవారు. అందువల్ల లైసీగా పిలువబడ్డారు. 'వద్దాన్' మరియు 'అల్ అబ్వా'లలో ఉండేవారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు. ఖిలాఫతె ఉస్మాన్ (రజి) వరకూ జీవించి ఉన్నారని ఇంకొక కథనం ఉంది.

(٦٠١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: **خَمْسٌ مِنَ الدَّوَابِّ كُلُّهُنَّ فَوَاسِقُ، يُقْتَلْنَ فِي الْحِلِّ وَالْحَرَمِ: الْعَقْرَبُ، وَالْحِدَأَةُ، وَالْغُرَابُ، وَالْفَأْرَةُ، وَالْكَلْبُ الْعَقُورُ**. مُتَّفَقٌ عَلَيْهِ.

601. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "ఐదు రకాల జంతువులు హానికరమైనవి. వాటిని ఇహ్రామ్ స్థితిలో ఉన్నా లేకున్నా (కన బడిన చోటల్లా) చంపివేయాలి. అవేమంటే: (1) తేలు (2) గ్రద్ద (3) కాకి (4) ఎలుక (5) కరిచే (పిచ్చి) కుక్క.

(బుఖారీ, ముస్లిం)

(٦٠٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ احْتَجَمَ وَهُوَ مُحْرِمٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

602. నిశ్చయంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహ్రామ్ స్థితిలో నుండగా శరీరానికి సూది గ్రుచ్చి రక్తం తీశారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు. (బుఖారీ, ముస్లిం)

(٦٠٣) وَعَنْ كَعْبِ بْنِ عُجْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: حُمِلْتُ إِلَى رَسُولِ اللّٰهِ

603. హజ్రత్ కాబ్ బిన్ ఉజ్రా (రజి) కథనం : (ఇహ్రామ్ స్థితిలో వున్న) నన్ను దైవప్రవక్త (సఅసం) సమక్షంలోకి ఎత్తుకు

ﷺ وَالْقَمْلُ يَتَنَاثَرُ عَلَى وَجْهِي، فَقَالَ: «مَا كُنْتُ أُرَى الْوَجَعَ بَلَغَ بِكَ مَا أَرَى، أَتَجِدُ شَاةً؟» قُلْتُ: لَا، قَالَ: «فَصُمْ ثَلَاثَةَ أَيَّامٍ، أَوْ أَطْعِمْ سِتَّةَ مَسَاكِينَ، لِكُلِّ مِسْكِينٍ نِصْفُ صَاعٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

రావటం జరిగింది. పేలు నా ముఖంపై పడుతున్నాయి. ఆయన (స) నా పరిస్థితిని చూచి, "వ్యాధి నిన్ను నేను చూస్తున్న ఈ స్థితికి చేరుస్తుందని అనుకోలేదు. నీ దగ్గర మేక ఉందా?" అని అడిగారు. 'లేదు' అని నేను జవాబిచ్చాను. "మూడు రోజులు ఉపవాసం పాటించు లేదా ఆరుగురు పేదవాళ్లకు తలో అర్థ 'సా' చొప్పున అన్నంపెట్టు" అని ఆయన (స) బోధించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఉపవాసం ఉండటం లేదా పేదవాళ్లకు అన్నం పెట్టడం అన్నది 'పరిహారం' గా అన్నమాట! ఇహ్రామ్ స్థితిలో ఉండటం మూలంగా కాబ్ బిన్ ఉజ్రా తలలోని పేలను కూడా చంపలేదు. దైవప్రవక్త (స) ఈయనకు శిరోముండనం చేయించుకోమని కూడా సలహా ఇచ్చారు.

### హదీసు ఉల్లేఖకులు

కాబ్ బిన్ ఉజ్రా (రజి) గొప్ప సహాబీలలో ఒకరు. అల్ బాలీ తెగకు చెందినవారు. అన్సార్ వర్గానికి మద్దతుదారులు. కొంతకాలం 'కూఫా'లో గడిపారు. ఎట్టకేలకు మదీనాలోనే హిజ్రీ 51లో మరణించారు.

(٦٠٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: لَمَّا فَتَحَ اللّٰهُ عَلَى رَسُولِهِ مَكَّةَ، قَامَ رَسُولُ اللّٰهِ ﷺ فِي النَّاسِ، فَحَمِدَ اللّٰهَ، وَأَثْنَى عَلَيْهِ، ثُمَّ قَالَ: «إِنَّ اللّٰهَ تَعَالَى حَبَسَ عَنْ مَكَّةَ الْفِيلَ، وَسَلَّطَ عَلَيْهَا رَسُولَهُ

604. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : అల్లాహ్ తన సందేశహరుని (సల్లల్లాహు అలైహి వ సల్లం) కి మక్కా విజయం ప్రసాదించగా దైవప్రవక్త (సఅసం) ప్రజలమధ్య నిలబడి దైవ స్తోత్రం చేశారు. అనంతరం ఆయన (స) ఇలా అన్నారు : "నిశ్చయంగా అల్లాహ్ ఏనుగుల (బారి) నుండి మక్కాను కాపాడాడు. అయితే తన సందేశహరుని (సఅసం)కి, విశ్వాసులకు దీనిపై ఆధిక్యతను వొసగాడు. నిస్సందేహంగా నాకు పూర్వం మక్కా ఎవరికొరకు కూడా హలాల్ (ధర్మసమ్మతం) గావించబడ

وَالمُؤْمِنِينَ، وَإِنَّهَا لَمْ تَحِلَّ لِأَحَدٍ كَانَ قَبْلِي، وَإِنَّمَا أُحِلَّتْ لِي سَاعَةً مِنْ نَهَارٍ، وَإِنَّهَا لَنْ تَحِلَّ لِأَحَدٍ بَعْدِي، فَلاَ يُنَفَّرُ صَيْدُهَا، وَلاَ يُخْتَلَى شَوْكُهَا، وَلاَ يَحِلُّ سَاقِطَتُهَا إِلاَّ لِمُنْشِدٍ. وَمَنْ قُتِلَ لَهُ قَتِيلٌ فَهُوَ بِخَيْرِ النَّظَرَيْنِ»، فَقَالَ الْعَبَّاسُ: إِلاَّ الْإِذْخِرَ، يَا رَسُولَ اللهِ! فَإِنَّا نَجْعَلُهُ فِي قُبُورِنَا وَبُيُوتِنَا، فَقَالَ: «إِلاَّ الْإِذْخِرَ». مُتَّفَقٌ عَلَيْهِ.

లేదు. కాని నా కోసం ఒక దినములో ఒక ఘడియ 'హలాల్' గావించబడింది. నిశ్చయంగా నా తదనంతరం ఇది ఎవరి కొరకూ హలాల్ అయి ఉండదు. అంటే ఇక్కడ దేనినయినా వేటాడటంగానీ, ఇక్కడి ముళ్ల వృక్షాలను నరకటంగానీ, క్రిందపడిన వస్తువును - దాన్ని పోగొట్టుకున్నవాడు గుర్తుపడితే తప్ప - ఎత్తుకోవటం గానీ ధర్మసమ్మతం కాదు. తమ మనిషి ఎవరైనా చంపబడితే వారు తమ ముందున్న రెండు మార్గాలలో ఏదో ఒకదానిని ఎన్నుకునే స్వేచ్ఛాధికారం కలిగి ఉంటారు." హ్రజత్ అబ్బాస్ (రజి) ఇలా విన్నవించుకున్నారు : 'దైవ ప్రవక్తా (స)! ఇజ్ఖిర్ (గడ్డి) తప్ప! ఎందుకంటే దాన్ని మేము సమాధులలో, ఇండ్లలో ఉపయోగిస్తాము' అని అన్నారు. అప్పుడాయన (స), "సరే. ఇజ్ఖిర్ తప్ప (అంటే దాన్ని కోసుకునేందుకు అనుమతి ఇవ్వబడుతోంది)!" అన్నారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

తమ ముందున్న రెండు మార్గాలలో ఏదో ఒక దానిని ఎన్నుకోవటమంటే అర్థం వారు నేరస్థుడ్ని శిక్షించడానికయినా అంగీకరించాలి, లేదా రక్తపరిహారమన్నా వసూలు చేయాలి. రెండూ నెరవేరాలంటే అది కుదిరేపని కాదు. పైగా ఇది కూడా మరో అన్యాయం అవుతుంది.

'ఇజ్ఖిర్' అనేది ఒక రకమయిన సువాసనతో కూడుకున్న గడ్డి. దాన్ని అరబ్బులు ఇండ్ల పైకప్పు లపై వేసుకునేవారు. సమాధులను పూడ్చిపెట్టడానికి కూడా ఈ గడ్డిని ఉపయోగించేవారు.

పవిత్ర మక్కా ఇతరులకు హరాం (నిషిద్ధం) గావించబడటంలోని మర్మం ఏమిటంటే ఈ నగరంలో హత్య చేయటం, రక్తపాతం సృష్టించటం హరామ్. ఈ నగరంలో ప్రవేశించిన వ్యక్తికి ఒక విధంగా అభయం లభించినట్లే. అక్కడ జంతువులను వేటాడటం, వృక్షాలను నరకటం సయితం నిషిద్ధం. ఆఖరికి ఏదైనా వస్తువు నేలపై పడి వున్నా దాని యజమాని వచ్చే వరకూ ముట్టుకోరాదు. ఇన్ని విధాలుగా మక్కా నగరం ప్రజల కొరకు హరామ్ గావించబడింది.

(٦٠٥) وَعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدِ بْنِ عَاصِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِنَّ إِبْرَاهِيمَ حَرَّمَ مَكَّةَ، وَدَعَا لِأَهْلِهَا، وَإِنِّي حَرَّمْتُ الْمَدِينَةَ، كَمَا حَرَّمَ إِبْرَاهِيمُ مَكَّةَ؛ وَإِنِّي دَعَوْتُ فِي صَاعِهَا وَمُدِّهَا بِمِثْلِ مَا دَعَا بِهِ إِبْرَاهِيمُ لِأَهْلِ مَكَّةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

605. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నిశ్చయంగా ఇబ్రాహీం (అలైహిస్సలాం) మక్కాకు పవిత్రతను కల్పించారు. ఇక్కడ నివసించే వారికై ప్రార్థించారు. ఏ విధంగానయితే ఇబ్రాహీం (అలైహిస్సలాం) మక్కాను పవిత్రంగా ఖరారు చేశారో నిస్సందేహంగా (అదేవిధంగా) నేనూ మదీనాకు పవిత్రతను ఒసగాను. మక్కాలో నివసించే వారికొరకు ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఏ విధంగా ప్రార్థించారో అదే విధంగా నేనునూ మదీనా (కొలతలు, తూనికలైన) 'సా' మరియు 'ముద్'ల గురించి ప్రార్థించాను." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మక్కా ముకర్రమా మాదిరిగా మదీనా తయ్యిబా కూడా పవిత్రమైనదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అంటే మదీనా నగరంలో కూడా జంతువులవేట, నరమేధం నిషేధించబడ్డాయి. అక్కడి చెట్లు నరకటం, దురాచారాలను సృష్టించటం కూడా నిషిద్ధమే.

(٦٠٦) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْمَدِينَةُ حَرَامٌ مَا بَيْنَ عَيْرٍ إِلَى ثَوْرٍ». رَوَاهُ مُسْلِمٌ.

606. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ఐర్ నుండి సౌర్ వరకు గల మదీనా ప్రదేశమంతా పవిత్రమైనది (నిషిద్ధమైనది)." (ముస్లిం)

**సారాంశం**

'ఐర్' ఒక పర్వతం పేరు. ఇది మదీనా నగరానికి దక్షిణాన ఉంది. 'సౌర్' అనేది ఒక చిన్న పర్వత గుట్ట. ఇది మదీనాకు ఉత్తరాన ఉహుద్ పర్వతం వెనుక ఉంది. సూర్ పర్వతం ఒకటి మక్కాలో కూడా ఉంది. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ఆ 'సూర్' వేరు. ఈ 'సౌర్' వేరు. మక్కాలో ఉన్న సూర్ గుహలో దైవప్రవక్త (స) హిజ్రత్ సందర్భంగా తలదాచుకున్న సంగతి విదితమే.

ఈ హదీసు ప్రకారం ఐర్ - సౌర్‌ల మధ్య గల మదీనా ప్రాంతం అంతా పవిత్రమైనదనీ, అక్కడ నరమేధం, వేట, చెట్లు నరకటం వంటివన్నీ నిషేధించబడ్డాయనీ తెలుస్తోంది.

**5వ అధ్యాయం**

## హజ్ తీరు - మక్కాలో ప్రవేశించే విధము

## ٥ - بَابُ صِفَةِ الْحَجِّ وَدُخُولِ مَكَّةَ

607. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్‌కు సన్నద్ధమవగా మేము కూడా ఆయన (స) వెంట బయలుదేరాము. మేమంతా 'జుల్ హులైఫా' వద్దకు చేరుకునేసరికి అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) ప్రసవించింది. "స్నానం చేసి ఏదైనా గుడ్డతో లోవుడుపు కట్టుకో. దానిపైన ఇహ్రామ్ ధరించు" అని ఆయన (స) ఆమెకు సలహా ఇచ్చారు. దైవప్రవక్త (సఅసం) మస్జిద్‌లో నమాజ్‌చేసి, (తన ఒంటె అయిన) 'ఖస్వా'పై స్వారీ అయ్యారు. 'బైదా' స్థలానికి చేరుకున్న తర్వాత ఆయన (స) ఈ విధంగా 'తల్బియా' పలికారు : "హాజరయ్యాను ప్రభూ! నేను హాజరయ్యాను. సాటిలేని స్వామీ! నేను (నీ సేవకై) హాజరయ్యాను. నిస్సందేహంగా స్తోత్రం నీకే తగును. అనుగ్రహాలన్నీ నీ ప్రసాదితాలే. సార్వభౌమత్వం కూడా నీదే. నీకు సహవర్తులెవరూ లేరు." కడకు మేము కాబా గృహ ప్రాంగణంలోకి ప్రవేశించాము. (నల్లరాయి గల) మూలస్థలాన్ని ఆయన (స) ముద్దాడారు. మూడుసార్లు (కాబా చుట్టూ) భుజాలు ఎగరవేస్తూ

(٦٠٧) عَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ حَجَّ، فَخَرَجْنَا مَعَهُ، حَتَّى إِذَا أَتَيْنَا ذَا الْحُلَيْفَةِ فَوَلَدَتْ أَسْمَاءُ بِنْتُ عُمَيْسٍ، فَقَالَ: «**اغْتَسِلِي، وَاسْتَثْفِرِي بِثَوْبٍ، وَأَحْرِمِي**»، وَصَلَّى رَسُولُ اللهِ ﷺ فِي الْمَسْجِدِ، ثُمَّ رَكِبَ الْقَصْوَاءَ، حَتَّى إِذَا اسْتَوَتْ بِهِ عَلَى الْبَيْدَاءِ، أَهَلَّ بِالتَّوْحِيدِ: «**لَبَّيْكَ اللَّهُمَّ لَبَّيْكَ، لاَ شَرِيكَ لَكَ، لَبَّيْكَ، إِنَّ الْحَمْدَ وَالنِّعْمَةَ لَكَ وَالْمُلْكَ،**

لاَ شَرِيكَ لَكَ»، حَتَّى إِذَا أَتَيْنَا الْبَيْتَ اسْتَلَمَ الرُّكْنَ، فَرَمَلَ ثَلاَثاً، وَمَشَى أَرْبَعاً، ثُمَّ أَتَى مَقَامَ إِبْرَاهِيمَ فَصَلَّى، ثُمَّ رَجَعَ إِلَى الرُّكْنِ، فَاسْتَلَمَهُ، ثُمَّ خَرَجَ مِنَ الْبَابِ إِلَى الصَّفَا، فَلَمَّا دَنَا مِنَ الصَّفَا، قَرَأَ ﴿إِنَّ الصَّفَا وَالْمَرْوَةَ مِنْ شَعَائِرِ اللَّهِ﴾ «أَبْدَأُ بِمَا بَدَأَ اللَّهُ بِهِ»، فَرَقِيَ الصَّفَا حَتَّى رَأَى الْبَيْتَ، فَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَوَحَّدَ اللَّهَ، وَكَبَّرَهُ، وَقَالَ: «لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ، لاَ شَرِيكَ لَهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ، لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، أَنْجَزَ وَعْدَهُ، وَنَصَرَ عَبْدَهُ، وَهَزَمَ الأَحْزَابَ وَحْدَهُ»، ثُمَّ دَعَا بَيْنَ ذٰلِكَ قَالَ مِثْلَ هٰذَا ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ

వేగంగా తిరిగారు. నాలుగుసార్లు మామూలుగానే తిరిగారు. తరువాత ఆయన (స) 'మఖామె ఇబ్రాహీం' వద్దకు వచ్చారు. అక్కడ నమాజ్ చేశారు. మళ్లీ హజ్రె అస్వద్ (నల్లరాయి) ఉన్న మూలకు వచ్చి దాన్ని ముద్దుపెట్టుకున్నారు. అనంతరం మస్జిదె హరామ్ ద్వారం గుండా 'సఫా' వైపునకు నడిచారు. సఫా దగ్గరకు చేరుకున్న తర్వాత ఈ ఆయత్‌ను పఠించారు : "ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ షఆయిరిల్లాహ్" (నిస్సందేహంగా సఫా - మర్వా పర్వతాలు దైవచిహ్నాలలోనివి). తర్వాత ఇలా అన్నారు: "అల్లాహ్ ప్రారంభించిన చోటు నుంచే నేను ('సయీ'ని) ప్రారంభిస్తున్నాను." అప్పుడు సఫా పర్వతమెక్కారు. అక్కడినుంచి కాబా గృహాన్ని చూచారు. ఖిబ్లా వైపునకు తిరిగి దేవుని ఏకత్వాన్ని, ఘనతను కీర్తించారు. ఆయన (స) ఇలా అన్నారు : "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయన ఏకేశ్వరుడు. ఆయన సహవర్తులెవరూ లేనివాడు. రాజ్యాధికారం ఆయనదే. శుభాలన్నీ ఆయనవే. ఆయన ప్రతిదానినీ చేయగల సమర్థుడు. అల్లాహ్ తప్ప మరో దేవుడు లేనేలేడు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసునికి తోడ్పడ్డాడు. అవిశ్వాసుల సమూహాన్ని తానొక్కడే ఓడించాడు." తరువాత వాటి మధ్య మూడుసార్లు దుఆ చేశారు. తరువాత సఫా పర్వతం నుంచి దిగి మర్వా వైపు

نَزَلَ مِنَ الصَّفَا إِلَى الْمَرْوَةِ، حَتَّى إِذَا انْصَبَّتْ قَدَمَاهُ فِيْ بَطْنِ الْوَادِيْ سَعَى، حَتَّى إِذَا صَعِدَ مَشَى إِلَى الْمَرْوَةِ، فَفَعَلَ عَلَى الْمَرْوَةِ كَمَا فَعَلَ عَلَى الصَّفَا، فَذَكَرَ الْحَدِيْثَ، وَفِيْهِ: فَلَمَّا كَانَ يَوْمُ التَّرْوِيَةِ تَوَجَّهُوا إِلَى مِنًى، وَرَكِبَ النَّبِيُّ ﷺ، فَصَلَّى بِهَا الظُّهْرَ وَالْعَصْرَ وَالْمَغْرِبَ وَالعِشَاءَ وَالْفَجْرَ، ثُمَّ مَكَثَ قَلِيْلاً حَتَّى طَلَعَتِ الشَّمْسُ، فَأَجَازَ حَتَّى أَتَى عَرَفَةَ، فَوَجَدَ الْقُبَّةَ قَدْ ضُرِبَتْ لَهُ بِنَمِرَة، فَنَزَلَ بِهَا، حَتَّى إِذَا زَالَتِ الشَّمْسُ أَمَرَ بِالْقَصْوَاءِ فَرُحِلَتْ لَهُ، فَأَتَى بَطْنَ الْوَادِيْ، فَخَطَبَ النَّاسَ، ثُمَّ أَذَّنَ، ثُمَّ أَقَامَ،

నకు వెళ్లారు. లోయలోకి అడుగులు పడగానే పరుగెత్తసాగారు. మెరక ప్రాంతం వరకూ పరుగెత్తారు. తరువాత మర్వాపైకి ఎక్కారు. సఫా పర్వతంపై చేసినదే మర్వా పర్వతంపై కూడా చేశారు. మరి జాబిర్ (రజి) హదీసు నంతటినీ వివరించారు - (ఆయన ప్రకారం) తర్వియ రోజు (జిల్ హజ్జ్ 8వ తేదీ) రాగానే అందరూ 'మినా' వైపునకు మళ్లారు. దైవప్రవక్త (సఅసం) ఒంటెపైనే ఉన్నారు. అక్కడ జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా మరియు ఫజ్ర్ నమాజులు చేశారు. తరువాత కొద్దిసేపు అక్కడ ఆగారు. సూర్యోదయం అయిన తరువాత అక్కడి నుంచి బయలుదేరి 'ముజ్దలిఫా' మీదుగా 'అరఫాత్' చేరుకున్నారు. అక్కడ 'నమిరా' అనే స్థలంలో వేయ బడిన శిబిరంలో ఆయన (స) విడిది చేశారు. పొద్దువాలిన తరువాత 'ఖస్వా' (ప్రవక్త ఒంటె)ను సిద్ధం చేయవల సిందిగా ఆదేశించారు. వాహనం సమ కూర్చబడింది. ఆయన (స) వాహనంపై లోయ మధ్య భాగంలోకి వచ్చారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తరువాత అజాన్ ఇప్పించారు. ఇఖామత్ చెప్పించారు. జుహ్ర్ నమాజ్ చేశారు. మళ్ళీ ఇఖామత్ చెప్పమని ఆదేశం చారు. అనంతరం అస్ర్ నమాజ్ చేశారు. ఈ రెండు నమాజుల మధ్య మరే నమాజునూ చేయలేదు. తరువాత వాహనమెక్కి ఆగవలసిన చోటికి చేరు

فَصَلَّى الظُّهْرَ، ثُمَّ أَقَامَ فَصَلَّى الْعَصْرَ، وَلَمْ يُصَلِّ بَيْنَهُمَا شَيْئاً، ثُمَّ رَكِبَ حَتَّى أَتَى الْمَوقِفَ، فَجعَلَ بَطْنَ نَاقَتِهِ الْقَصْوَاءِ إِلَى الصَّخَرَاتِ، وَجَعَلَ جَبَلَ الْمُشَاةِ بَيْنَ يَدَيْهِ، وَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَلَمْ يَزَلْ وَاقِفاً حَتَّى غَرَبَتِ الشَّمْسُ، وَذَهَبَتِ الصُّفْرَةُ قَلِيْلاً، حَتَّى إِذَا غَابَ الْقُرْصُ دَفَعَ، وَقَدْ شَنَقَ لِلْقَصْوَاءِ الزِّمَامَ، حَتَّى إِنَّ رَأْسَهَا لَيُصِيْبُ مَورِكَ رَحْلِهِ، وَيقُولُ بِيَدِهِ الْيُمْنَى: «**يَا أَيُّهَا النَّاسُ! اَلسَّكِيْنَةَ، اَلسَّكِيْنَةَ**»، وَكُلَّمَا أَتَى جَبَلاً أَرْخَى لَهَا قَلِيْلاً حَتَّى تَصْعَدَ، حَتَّى أَتَى الْمُزْدَلِفَةَ، فَصَلَّى بِهَا المَغْرِبَ وَالعِشَاءَ، بِأَذَانٍ وَّاحِدٍ وَإِقَامَتَيْنِ، وَلَمْ يُسَبِّحْ بَيْنَهُمَا شَيْئاً، ثُمَّ اضْطَجَعَ حَتَّى طَلَعَ الْفَجْرُ، فَصَلَّى الْفَجْرَ حِيْنَ تَبَيَّنَ لَهُ الصُّبْحُ، بِأَذَانٍ وَإِقَامَةٍ، ثُمَّ رَكِبَ حَتَّى أَتَى الْمَشْعَرَ الْحَرَامَ، فَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَدَعَا، وَكَبَّرَ، وَهَلَّلَ، فَلَمْ يَزَلْ وَاقِفاً حَتَّى أَسْفَرَ جِدًّا، فَدَفَعَ قَبْلَ أَنْ

కున్నారు. తన ఒంటె ఖస్వా డొక్కను రాళ్ల వైపునకు ఉండేలా తిప్పి, దారిలో నడిచేవారు తనకు ఎదురుగా ఉండేలా ఆగారు. ఆ సమయంలో ఆయన (స) తన ముఖాన్ని 'ఖిబ్లా' వైపునకు తిప్పి ఉంచారు. సూర్యాస్తమయమై, ఆకాశపు టంచున ఉండే పసుపుదనం మటు మాయమయ్యే వరకూ - అంటే సూర్యాస్తమయం పూర్తిగా జరిగేవరకూ - అక్కడే ఉండి, ఆ స్థితిలోనే అక్కడి నుంచి తిరోన్ముఖులయ్యారు. ఆ సమ యంలో ఆయన (స) ఒంటె పగ్గాలను బాగా లాగి పట్టుకోవటం వల్ల దాని తల ఒక్కోసారి ఆయన (స) కూర్చున్న బల్లకు తగల సాగింది. ఆ సమయంలో ఆయన (స) తన కుడిచేత్తో సైగ చేస్తూ, "ప్రజలారా! నెమ్మదిగా, నెమ్మదిగా పదండి" అని అనే వారు. కొత్తగా ఎక్కడ గుట్ట ఎదురు వచ్చినా అక్కడ ఒంటె పగ్గాలను కాస్త వదులుగా ఉంచేవారు. తద్వారా ఒంటె సులభంగా గుట్టను అధిగమిం చేది. ఆ విధంగా ఆయన (స) 'ముజ్దలిఫా'కు చేరుకున్నారు. అక్కడ ఒక అజాన్ మరియు రెండు ఇఖామత్‌లతో మ(గిబ్, ఇషా నమాజులు చేశారు. ఆ రెండు నమాజులకు మధ్య మరే నఫిల్ నమాజు కూడా చేయలేదు. తరువాత పడు కున్నారు. తెల్లవారుతుండగా లేచి అజాన్ మరియు ఇఖామత్‌ల ద్వారా ఫజ్ర్ నమాజ్ చేశారు. అక్కడి నుంచి వాహన మెక్కి 'మష్అరుల్ హరామ్' చేరుకు

تَطْلُعَ الشَّمْسُ، حَتَّى أَتَى بَطْنَ مُحَسِّرٍ، فَحَرَّكَ قَلِيْلاً، ثُمَّ سَلَكَ الطَّرِيْقَ الْوُسْطَى الَّتِيْ تَخْرُجُ عَلَى الْجَمْرَةِ الْكُبْرَى، حَتَّى أَتَى الْجَمْرَةَ الَّتِيْ عِنْدَ الشَّجَرَةِ، فَرَمَاهَا بِسَبْعِ حَصَيَاتٍ، يُكَبِّرُ مَعَ كُلِّ حَصَاةٍ مِّنْهَا، كُلُّ حَصَاةٍ مِثْلِ حَصَى الْخَذْفِ، رَمَى مِن بَطْنِ الْوَادِيْ، ثُمَّ انْصَرَفَ إِلَى الْمَنْحَرِ، فَنَحَرَ، ثُمَّ رَكِبَ رَسُوْلُ اللهِ ﷺ فَأَفَاضَ إِلَى الْبَيْتِ، فَصَلَّى بِمَكَّةَ الظُّهْرَ. رَوَاهُ مُسْلِمٌ مُطَوَّلاً.

న్నారు. అక్కడ ఖిబ్లావైపునకు అభిముఖులై దుఆ చేశారు, దేవుని ఘనతను, ఆయన ఏకత్వాన్ని చాటారు. అక్కడ ఆయన బాగా తెల్లవారే వరకూ ఉండి, సూర్యోదయం కాకముందే తిరోన్ముఖులై 'ముహస్సర్' లోయలోకి వచ్చేశారు. అక్కడినుంచి ఒంటెను వేగంగా పోనిచ్చారు. 'పెద్ద జమ్రా' (పెద్ద షైతాన్) వరకూ చేర్చే మధ్య మార్గం గుండా పోసాగారు. తరువాత ఆయన (స) వృక్షం ప్రక్కనున్న జమ్రా వద్దకు చేరుకున్నారు. లోతట్టు స్థలంలో నుంచి ఏడు కంకరరాళ్లు దానిపై రువ్వారు. కంకర రువ్వే ప్రతిసారీ 'అల్లాహు అక్బర్' అని అనేవారు. ఆ కంకరరాళ్లలో ప్రతిదీ ఖర్జూరపు టెంకంత ఉంది. అక్కడి నుంచి ఆయన (స) ఖుర్బానీ స్థలం వద్దకు వెళ్లి, ఖుర్బానీ ఇచ్చి, బైతుల్లాహ్ (కాబా గృహం) వైపునకు పయనమయ్యారు. మక్కాలో జుహ్ర్ నమాజ్ చేశారు. (ఈ హదీసు 'ముస్లిం' లో సవివరంగా వచ్చింది)

(٦٠٨) وَعَنْ خُزَيْمَةَ بْنِ ثَابِتٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا فَرَغَ مِنْ تَلْبِيَتِهِ فِي حَجٍّ أَوْ عُمْرَةٍ سَأَلَ اللّٰهَ رِضْوَانَهُ وَالْجَنَّةَ، وَاسْتَعَاذَ بِرَحْمَتِهِ مِنَ النَّارِ. رَوَاهُ الشَّافِعِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

608. హజ్రత్ ఖుజైమ బిన్ సాబిత్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ లేదా ఉమ్రాలో 'తల్బియా' (లబ్బైక్) చెప్పటం పూర్తవగానే దైవప్రసన్నతను, స్వర్గాన్ని ఆశిస్తూ ప్రార్థించేవారు. దైవకారుణ్యాన్ని కోరుకోవటంతోపాటు, అగ్ని నుండి శరణు వేడేవారు." (ఇమామ్ షాఫయి - రహ్మలై- దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ ఖుజైమ బిన్ సాబిత్ బిన్ ఫాకిహ్ (రజి). అన్సార్ సహాబీ. ఔస్ తెగ యొక్క ఉప తెగ ఖతమీకి చెందినవారు. మారుపేరు అబూ ఇమారత. మక్కా విజయం సందర్భంగా ఖతమీ ఉపతెగ ధ్వజం ఈయన చేతిలోనే ఉంది. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) పక్షాన ఉన్నారు. ఆ సందర్భంగానే అమరగతినొందారు.

(٦٠٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «نَحَرْتُ هٰهُنَا، وَمِنًى كُلُّهَا مَنْحَرٌ، فَانْحَرُوا فِي رِحَالِكُمْ، وَوَقَفْتُ هٰهُنَا، وَعَرَفَةُ كُلُّهَا مَوْقِفٌ، وَوَقَفْتُ هٰهُنَا، وَجَمْعٌ كُلُّهَا مَوْقِفٌ». رَوَاهُ مُسْلِمٌ.

609. హజ్రత్ జాబిర్ కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నేను ఈ స్థలంలో ఖుర్బానీ ఇచ్చాను. అయితే 'మినా' ప్రదేశమంతా ఖుర్బానీ ఇచ్చే స్థలమే. కనుక మీరు ఇక్కడ ఆగిన చోటల్లా ఖుర్బానీ ఇవ్వవచ్చు. నేను ఇక్కడ ఆగి ఉన్నాను. కాని అరఫాత్ మైదానమంతా ఆగే స్థలమే -నేను ఇక్కడ ఆగి ఉన్నాను. కాని 'జమా' (ముజ్దలిఫా) అంతా ఆగే స్థలమే." (ముస్లిం)

### సారాంశం

హదీసులో 'ముజ్దలిఫా' అనే ప్రదేశాన్ని 'జమా' అనే పేరుతో ప్రస్తావించటం జరిగింది. దీని వెనుక ఒక కథనం ఉంది - హజ్రత్ ఆదం, హవ్వాలు స్వర్గం నుండి భువిమీద వేర్వేరు స్థలాలలో దింపబడగా వారిరువురూ ఈ స్థలంలో కలుసుకున్నారనీ, అందుచేత ఈ స్థలానికి 'జమా' అనే పేరు వచ్చిందనీ చెప్పుకుంటారు. హజ్ సందర్భంగా ప్రజలు ఇక్కడ జమ అవటం మూలంగానూ, మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ఇక్కడ కలిపి చేయటం వల్లనూ దీనికి 'జమా' అనే పేరు పడిందని మరో కథనం.

(٦١٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ لَمَّا جَاءَ إِلَى مَكَّةَ دَخَلَهَا مِنْ أَعْلاَهَا، وَخَرَجَ مِنْ أَسْفَلِهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

610. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సఅసం) హజ్ కొరకు మక్కాలో ప్రవేశించినపుడు మక్కా ఎగువ భాగం నుండి ప్రవేశించారు. అక్కడి నుంచి తిరిగివెళ్ళినపుడు మక్కా దిగువ భాగం నుండి బయలు దేరారు." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) మక్కాలో ప్రవేశించిన, మక్కానుండి వెడలిపోయిన

ప్రదేశాల ప్రస్తావన వచ్చింది. ఆయన ప్రవేశించిన ఎగువ భాగం పేరు "తస్నియతుల్ ఉల్‌యా." వెడలివెళ్ళిన లోతట్టు ప్రదేశం పేరు "తస్నియతుల్ సుఫ్‌లా." ఈ మార్గం గుండా హజ్ కొరకు మక్కాలో ప్రవేశించడం మస్నూన్ అని కొంతమంది ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు. అయితే సౌలభ్యం ఉంటేనే ఇది అందరికీ సాధ్యపడుతుంది.

(٦١١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ كَانَ لاَ يَقْدَمُ مَكَّةَ إِلاَّ بَاتَ بِذِيْ طُوًى، حَتَّى يُصْبِحَ، وَيَغْتَسِلَ، وَيَذْكُرُ ذٰلِكَ عَنِ النَّبِيِّ ﷺ. مُتَّفَقٌ عَلَيْهِ.

611. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: ఆయన (ఇబ్నె ఉమర్) ఎప్పుడు మక్కా వచ్చినా 'జీ తువా' స్థలంలో రాత్రంతా ఆగి తెల్లవారాక స్నానం చేసేవారు. దైవ ప్రవక్త (సఅసం) ఈ విధంగానే చేసే వారని ఆయన అనేవారు. (బుఖారీ, ముస్లిం)

(٦١٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ كَانَ يُقَبِّلُ الْحَجَرَ الْأَسْوَدَ، وَيَسْجُدُ عَلَيْهِ. رَوَاهُ الْحَاكِمُ مَرْفُوعاً، وَالْبَيْهَقِيُّ مَوْقُوفاً.

612. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రె అస్వద్ (నల్లనిరాయి)ని ముద్దాడేవారు. దాని ముందు భాగంలో 'సజ్దా' చేసేవారు." (దీనిని హాకిమ్ 'మర్ఫూ' హదీసుగానూ, బైహఖీ 'మౌఖూఫ్'గానూ ఉల్లేఖించారు)

**సారాంశం**

హజ్రె అస్వద్‌ను ముద్దాడటం, అక్కడ సజ్దా చేయటం అవసరమన్నట్టు ఈ హదీసు వెల్లడిస్తోంది. అత్యధిక ఉలమాల అభిప్రాయం కూడా ఇదే. ఈ హదీసు కొంత ఆందోళనకరంగా ఉంది. హజ్రె అస్వద్ వద్ద సజ్దా చేయటం 'బిద్అత్' అని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అన్నారు. బహుశా దానికి నుదురు ఆనించేవారేమో! ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ తదితరులు అక్కడ సజ్దా చేయటాన్ని ధర్మసమ్మతంగానే భావిస్తున్నారు. కాని ఇమామ్ మాలిక్ ఒక్కరే దీనిని బిద్అత్‌గా ఖరారు చేశారు.

(٦١٣) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَهُمُ النَّبِيُّ ﷺ أَنْ يَرْمُلُوا ثَلاَثَةَ أَشْوَاطٍ وَيَمْشُوا أَرْبَعاً، وَأَن يَمْشُوا بَيْنَ الرُّكْنَيْنِ. مُتَّفَقٌ عَلَيْهِ.

613. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : (కాబా ప్రదక్షిణ చేసే సమయంలో) మూడుసార్లు వేగంగా నడవాలనీ, రెండు 'రుకున్'ల మధ్య నాలుగుసార్లు సాధారణంగా నడవాలనీ దైవప్రవక్త (సఅసం) తన సహచరులను ఆజ్ఞాపించారు. (బుఖారీ, ముస్లిం)

(٦١٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّهُ عَنْهُمَا: (أَنَّهُ كَانَ إِذَا طَافَ بِالْبَيْتِ الطَّوَافَ الْأَوَّلَ خَبَّ ثَلاَثاً وَمَشَى أَرْبَعاً. وَفِي رِوَايَةٍ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ إِذَا طَافَ فِي الْحَجِّ أَوِ الْعُمْرَةِ أَوَّلَ مَا يَقْدَمُ فَإِنَّهُ يَسْعَى ثَلاَثَةَ أَطْوَافٍ بِالْبَيْتِ وَيَمْشِي أَرْبَعَةً) مُتَّفَقٌ عَلَيْهِ.

614. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఎప్పుడు కాబా గృహంవద్ద మొదటి సారి తవాఫ్ చేసినా - మొదటి మూడు రౌండ్లు పహిల్వాన్ల మాదిరిగా నడిచే వారు. తరువాతి నాలుగు రౌండ్లు నెమ్మదిగా నడిచేవారు. వేరొక ఉల్లేఖనంలో ఉంది : (హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్- రజి - దైవప్రవక్త - సఅసం - గారి ఆచరణను వివరిస్తూ ఇలా అన్నారు) "నేను దైవప్రవక్త (స)ను చూచాను. ఆయన హజ్ చేసినా, ఉమ్రా చేసినా ప్రదక్షిణ సమయంలో మొదటి మూడు రౌండ్లు దాదాపు పరుగెత్తుతున్నట్లుగా తిరిగేవారు. మిగిలిన నాలుగు చుట్లు నెమ్మదిగా చుట్టివచ్చేవారు."

(ముత్తఫఖున్ అలైహ్)

(٦١٥) وَعَنْهُ رَضِيَ اللّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَمْ أَرَ رَسُولَ اللهِ ﷺ يَسْتَلِمُ مِنَ الْبَيْتِ غَيْرَ الرُّكْنَيْنِ الْيَمَانِيَيْنِ. رَوَاهُ مُسْلِمٌ.

615. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గారిచే ఇంకొక ఉల్లేఖనం : "నేను దైవప్రవక్త (సఅసం)ను, 'రెండు యమానీ రుకున్లు' తప్ప బైతుల్లాహ్‌లోని మరో 'రుకున్'ను ముట్టుకోవటం చూడ లేదు." (ముస్లిం)

(٦١٦) وَعَنْ عُمَرَ رَضِيَ اللّهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَبَّلَ الْحَجَرَ الْأَسْوَدَ، وَقَالَ: إِنِّي أَعْلَمُ أَنَّكَ حَجَرٌ، لاَ تَضُرُّ وَلاَ تَنْفَعُ، وَلَوْلاَ أَنِّي رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُقَبِّلُكَ مَا قَبَّلْتُكَ. مُتَّفَقٌ عَلَيْهِ.

616. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : ఆయన (ఉమర్ - రజి) హజ్రె అస్వద్‌ను ముద్దాడిన పిదప ఇలా అన్నారు : "నువ్వు ఒక రాయివన్న సంగతి నాకు బాగా తెలుసు. లాభనష్టాలకు నీవు యజమానివి కావు. దైవప్రవక్త (సఅసం) నిన్ను ముద్దాడుతుండగా నేను చూచి ఉండకపోతే, నిన్నెప్పుడూ ముద్దుపెట్టుకునే వాణ్ణికాను." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

'హజ్రె అస్వద్' అంటే అదేదో మహిమతో కూడుకున్నదనీ, లాభనష్టాలు చేకూర్చగల శక్తి దానికుందని తలచి ముద్దుపెట్టుకోవటం సరైనది కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమైపోయింది. కేవలం దైవప్రవక్త (స) ను అనుసరించే ఉద్దేశ్యంతో మాత్రమే ఆ రాయిని ముద్దుపెట్టుకోవటం జరుగుతుంది. రాళ్ళ రప్పలను దైవాలుగా కొలిచే బహుదైవారాధకుల సిద్ధాంతాన్ని ఖండించే ఉద్దేశ్యంతో హజ్రత్ ఉమర్ (రజి) ఇలా ప్రకటించారు.

(٦١٧) وَعَنْ أَبِي الطُّفَيْلِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَطُوفُ بِالْبَيْتِ، وَيَسْتَلِمُ الرُّكْنَ بِمِحْجَنٍ مَعَهُ، وَيُقَبِّلُ الْمِحْجَنَ. رَوَاهُ مُسْلِمٌ.

617. హజ్రత్ అబూ తుఫైల్ (రజి) ఉల్లేఖనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను బైతుల్లాహ్ ప్రదక్షిణ చేస్తుండగాచూచాను. ఆయన (సఅసం) తన వద్దగల పొన్ను కర్రతో హజ్రె అస్వద్ ను తాకుతూ, ఆ కర్రను ముద్దాడేవారు." (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యేదేమిటంటే; జన సమూహం ఎక్కువగా ఉండి హజ్రె అస్వద్‌ను ముద్దుపెట్టుకోవటం కష్టసాధ్యం లేక అసంభవం అయినట్లయితే బెత్తంతో తాకి ఆ బెత్తాన్ని ముద్దు పెట్టుకోవచ్చు. ముస్నద్ అహ్మద్‌లోని ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఉమర్ నుద్దేశ్యించి ఇలా అన్నారు: "నీవు బలశాలివి. హజ్రె అస్వద్‌ను సమీపించటం నీకు ఏ మాత్రం కష్టతరం కాదు. కాని తోసుకుంటూ వెళ్లటం వల్ల బలహీనులకు బాధ కలుగుతుంది. కనుక నీకు వీలు దొరికినప్పుడు చేత్తో తాకు. లేదా హజ్రె అస్వద్‌కు ఎదురుగా నిలబడి 'లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్' అని పలుకు. చాలు."

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే హజ్ క్రియలను నెరవేరుస్తున్నప్పుడు సాటి హజ్ యాత్రికులను బాధించటం, వారికి ఆటంకాలు సృష్టించటం ధర్మసమ్మతం కాదు. చేత్తో హజ్రె అస్వద్‌ను సంజ్ఞ చేసినపుడు ఆ చేతిని ముద్దాడకూడదు. చేత్తో లేదా బెత్తంతో హజ్రె అస్వద్‌ను తాకినప్పుడే వాటిని ముద్దుపెట్టుకోవాలి.

## హదీసు ఉల్లేఖకులు

అబూ తుఫైల్ (రజి). పూర్తి వంశపరంపర ఇలా ఉంది: ఆమిర్ బిన్ వాసిలా లైసీ కినానీ (రజి). దైవప్రవక్త (సఅసం) మరణ సమయానికి ఈయన వయసు 8 సంవత్సరాలు. హిజ్రీ శకం 100లో మక్కాలో మరణించారు. మరో కథనం ప్రకారం హిజ్రీ 102లో మరణించారు. అందరికన్నా ఆఖరిలో మరణించిన ప్రవక్త ప్రియసహచరులు (సహాబీ) ఈయనే.

(٦١٨) وَعَنْ يَعْلَى بْنِ أُمَيَّةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: طَافَ رَسُولُ اللّٰهِ ﷺ مُضْطَبِعاً

618. హజ్రత్ యాల బిన్ ఉమయ్య (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక ఆకుపచ్చని దుప్పటితో 'తవాఫ్' చేశారు. దాన్ని

بِبُرْدٍ أَخْضَرَ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

ఆయన (స) కుడి చంక క్రిందనుంచి తీసుకుని ఎడమవైపు భుజంపై వేసుకు న్నారు.'' (దీనిని 'ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

దుప్పటి కప్పుకున్న తీరు ప్రకారం కుడివైపు భుజం నగ్నంగా ఉంటుంది. మొదటిసారి ఉమ్రాలో దైవప్రవక్త (స) ఈ విధంగా దుప్పటి కప్పుకుని, మొదటి మూడు రౌండ్లు వేగంగా నడచి ముస్లింలు శారీరకంగాగానీ, మానసికంగాగానీ ఏమాత్రం బలహీనులుగా లేరని అక్కడి అవిశ్వాసులకు చాటి చెప్పదలిచారు. ఇబ్నె అబ్బాస్ కథనం ప్రకారం ; తరువాత ఈ పద్ధతే మస్నూన్ (సంప్రదాయం)గా ఖరారయింది.

**హదీసు ఉల్లేఖకులు**

యాల బిన్ ఉమయ్యా (రజి). మారుపేరు అబూ సఫ్వాన్ తమీమి. మక్కావాసులు. ఖురైషు తెగకు మద్దతుదారులు. ప్రఖ్యాత సహచరులలో ఒకరు. హునైన్, తాయఫ్, తబూక్ యుద్ధాలలో పాల్గొని తన శౌర్యాన్ని ప్రదర్శించారు. హజ్రత్ అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి)ల తరపున అధికారిగా నియమించబడేవారు. సుమారు 50 సంవత్సరాల వరకూ జీవించి ఉన్నారు.

(٦١٩) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ يُهِلُّ مِنَّا الْمُهِلُّ فَلاَ يُنْكَرُ عَلَيْهِ، وَيُكَبِّرُ مِنَّا الْمُكَبِّرُ فَلاَ يُنْكَرُ عَلَيْهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

619. హజ్రత్ అనస్ (రజి) కథనం : ''మాలో కొంతమంది (కేవలం) 'లా ఇలాహ ఇల్లల్లాహ్'' అని పలికేవారు. దీన్ని తప్పుగా భావించటం జరగలేదు. మాలో మరికొందరు 'తక్బీర్లు' పలికే వారు. దీన్ని కూడా తప్పుగా పరిగణించలేదు.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో 'మినా' నుండి 'అరఫాత్' వెళ్ళే దారిలో హాజీల పరిస్థితి వివరించబడింది. వాళ్లు 'తల్బియా' పలకవలసిన సందర్భంలో తక్బీర్లు పలికినా దాన్ని దైవప్రవక్త (స) తప్పుగా తలంచలేదు.

(٦٢٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: بَعَثَنِي النَّبِيُّ ﷺ فِي الثَّقَلِ، أَوْ قَالَ: فِي الضَّعَفَةِ، مِنْ جَمْعٍ، بِلَيْلٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

620. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ''దైవప్రవక్త (సఅసం) నన్ను సామాను వెంట లేక బలహీనుల వెంట రాత్రిపూటే 'ముజ్దలిఫా'నుండి (మినా ప్రదేశానికి) పంపేశారు.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

హజ్ సందర్భంగా జనం విపరీతంగా ఉంటారు. తొక్కిసలాటలో వృద్ధులు, చిన్నపిల్లలకు హానికలిగే అవకాశముంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలోపెట్టుకుని, 'ముజ్దలిఫా'లో యాత్రీకులంతా రాత్రిపూట విశ్రమిస్తుండగా వృద్ధులను, చిన్న పిల్లలను, మహిళలను 'మినా' ప్రాంతానికి తరలించవచ్చు. సామాన్య జనులకు మాత్రం ఫజ్ర్ నమాజ్‌కు ముందు ప్రయాణమయ్యే అనుమతి లేదు.

(٦٢١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: اَسْتَأْذَنَتْ سَوْدَةُ رَسُولَ اللهِ ﷺ لَيْلَةَ الْمُزْدَلِفَةِ أَنْ تَدْفَعَ قَبْلَهُ، وَكَانَتْ ثَبْطَةً، يَعْنِي ثَقِيْلَةً، فَأَذِنَ لَهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

621. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : హజ్రత్ సౌదా (ర.అన్హా) 'ముజ్దలిఫా'లో విడిది చేసినరాత్రి తాను తొందరగా బయలుదేరగలందులకు ఆయన (స) అనుమతి కోరారు. ఆమె లావుగా బొద్దుగా ఉండేవారు (అందు వల్ల కొద్ది దూరం నడచిన తరువాత ఆయాసంతో ఆగిపోయేవారు). అందు చేత ఆయన (సఅసం) ఆమెకు అనుమతినిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

వ్యాధి, వృద్ధాప్యం, నీరసంతో పాటు స్థూలకాయం కూడా షరీయత్‌పరమయిన ఒక కారణంగా పరిగణించబడుతుంది. ఇటువంటి వైకల్యం గలవారు 'ముజ్దలిఫా'లో రాత్రంతా విడిదిచేయకుండానే 'మినా' వైపునకు సాగిపోవచ్చు.

**హదీసు ఉల్లేఖకులు**

హజ్రత్ సౌదా (ర.అన్హా). పూర్తి వంశపరంపర ఇలా వుంది - సౌదా బిన్తె జమా బిన్ అబ్దె షమ్స్ ఖురషియా ఆమిరియా. ఉమ్మహాతుల్ మోమినీన్ (విశ్వాసుల మాతలు)లో ఒకరు. మక్కాలోనే ఈమె ఇస్లాం స్వీకరించారు. తన భర్తతో కలసి రెండవసారి అబిసీనియాకు వలస వెళ్ళారు. ఆమె భర్త అక్కడే చనిపోయారు. హజ్రత్ ఖదీజా (ర.అన్హా) మరణానంతరం దైవప్రవక్త (సఅసం) ఈమెను వివాహమాడారు. హి.శ. 55లో ఈమె మరణించారు.

(٦٢٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ لَنَا رَسُولُ اللهِ ﷺ:

622. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "సూర్యోదయానికి ముందు కంకరరాళ్లు రువ్వరాదని దైవప్రవక్త

«لاَ تَرْمُوا الْجَمْرَةَ حَتَّى تَطْلُعَ الشَّمْسُ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَفِيهِ انْقِطَاعٌ.

(సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఆదేశించారు.'' (దీనిని 'ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు ఉల్లేఖిం చారు - దీని పరంపరలో ఎక్కడో అంతరాయం ఏర్పడినట్లుంది)

**సారాంశం**

రాత్రిపూట 'రమీ' చేయటం ధర్మసమ్మతం కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. మెజారిటీ ఉలమాల దృష్టిలో సూర్యోదయం అయిన మీదట 'రమీ' ధర్మసమ్మతమవుతుంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్‌ల దృష్టిలో అర్ధరాత్రి తరువాత రమీ చేయవచ్చు. ఇమామ్ అబూ హనీఫా కూడా సూర్యోదయం అయిన తరువాతే 'రమీ' చేయాలంటారు.

(٦٢٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَرْسَلَ النَّبِيُّ ﷺ بِأُمِّ سَلَمَةَ لَيْلَةَ النَّحْرِ، فَرَمَتِ الْجَمْرَةَ قَبْلَ الْفَجْرِ، ثُمَّ مَضَتْ، فَأَفَاضَتْ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَإِسْنَادُهُ عَلَى شَرْطِ مُسْلِمٍ.

623. హజ్రత్ అయిషా (ర.అన్హా) కథనం : ''దైవప్రవక్త (సఅసం) ఉమ్మె సలమా (ర.అన్హా)ను ఖుర్బానీ రాత్రి ముందే పంపేశారు. ఆమె తెల్లవారక ముందే కంకరరాళ్లు రువ్వి (మక్కా) వెళ్ళి తవాఫ్ చేశారు.'' (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - దీని ప్రామాణికత 'ముస్లిం' షరతుపై ఆధారపడి ఉంది)

(٦٢٤) وَعَنْ عُرْوَةَ بْنِ مُضَرِّسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ شَهِدَ صَلاَتَنَا هَذِهِ، يَعْنِي بِالْمُزْدَلِفَةِ، فَوَقَفَ مَعَنَا حَتَّى نَدْفَعَ، وَقَدْ وَقَفَ بِعَرَفَةَ قَبْلَ ذَلِكَ

624. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఉర్వ బిన్ ముజర్రిస్ (రజి) వివరించారు - ఎవరయితే ముజ్దలిఫాలో మా నమాజ్ లో పాల్గొన్నాడో మరియు మేమిక్కడి నుంచి బయలుదేరేవరకూ మా వెంట నిలిచి ఉన్నాడో అంతకుముందు అరఫాత్‌లో రాత్రి లేక పగటిపూట నిరీక్షిం చాడో అతని హజ్ పరిపూర్ణమయి పోయింది. అతడు తన మలినాన్ని పారద్రోలినట్లే.'' (దీనిని ఐదుగురు ఉల్లే

لَيْلاً أَوْ نَهَاراً، فَقَدْ تَمَّ حَجُّهُ، وَقَضَى تَفَثَهُ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

ఖించారు - తిర్మిజీ, ఇబ్నె ఖుజైమ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**హదీసు ఉల్లేఖకులు**

ఉర్వ బిన్ ముజర్రిస్ (రజి). పూర్తి వంశపరంపరను చూస్తే ఇలా వుంది : ఉర్వ బిన్ ముజర్రిస్ బిన్ ఔస్ బిన్ హారిస బిన్ లామ్ అత్తాయి. అంతిమ హజ్ యాత్రలో పాల్గొన్న సహాబి. కూఫాలో స్థిరపడ్డారు. ఈయన గారి తరఫున 10 హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(٦٢٥) وَعَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّ الْمُشْرِكِيْنَ كَانُوا لاَ يُفِيْضُوْنَ حَتَّى تَطْلُعَ الشَّمْسُ، وَيَقُوْلُوْنَ: أَشْرِقْ ثَبِيْرُ! وَإِنَّ النَّبِيَّ ﷺ خَالَفَهُمْ، فَأَفَاضَ قَبْلَ أَنْ تَطْلُعَ الشَّمْسُ. رَوَاهُ الْبُخَارِيُّ.

625. హజ్రత్ ఉమర్ (రజి) ఇలా వివరించారు - "బహు దైవారాధకులు సూర్యోదయం అయిన తరువాత (ముజ్దలిఫా నుండి) వాపసు అయ్యే వారు. సబీర్ (అదొక పర్వతం పేరు) మెరిసిపోతుంది అని చెప్పుకునేవారు. దైవప్రవక్త (సఅసం) వాళ్ల అలవాటుకు భిన్నంగా - సూర్యోదయం కాక మునుపే (ముజ్దలిఫా) నుండి తిరిగి వచ్చారు." (బుఖారీ)

(٦٢٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ وَأُسَامَةَ بْنِ زَيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُم، قَالاَ: لَمْ يَزَلِ النَّبِيُّ ﷺ يُلَبِّي حَتَّى رَمَى جَمْرَةَ الْعَقَبَةِ. رَوَاهُ الْبُخَارِيُّ.

626. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), ఉసామ బిన్ జైద్ (రజి)ల కథనం : "దైవప్రవక్త (సఅసం) జమ్రతుల్ అఖబా (చిన్న షైతాన్)పై కంకర రాళ్లు రువ్వే వరకూ 'తల్బియా' నినాదం చేస్తూనే ఉన్నారు." (బుఖారీ)

**హదీసు ఉల్లేఖకులు**

ఉసామా బిన్ జైద్ (రజి). ఈయనకు గల మరోపేరు అబూ ముహమ్మద్ లేక అబూ జైద్. పూర్తి వంశపరంపరను చూస్తే ఇలా ఉంది - ఉసామా బిన్ జైద్ బిన్ హారిస బిన్ షరాహిల్ కల్బీ. దైవప్రవక్త (స) కు అత్యంత ప్రియతములైన స్వతంత్ర బానిస. తన మరణానికి ముందు దైవప్రవక్త (సఅసం) ఒక కీలకమయిన సైనిక పటాలానికి ఈయన్ని కమాండర్‌గా నియమించారు. ఆ సైనిక సమూహంలో హజ్రత్ అబూబక్ర్, హజ్రత్ ఉమర్ లాంటి ప్రముఖ సహాబీలు ఉన్నారు. మరి చూడబోతే అప్పటికి ఉసామా వయస్సు 18 మాత్రమే. ఈ సైన్యం దైవప్రవక్త (స) మరణం

కారణంగా పయనం కాలేకపోయింది. తరువాత హజ్రత్ అబూబక్ర్ (రజి) దీనిని పంపారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి నొందిన తరువాత హిజ్రీ 54లో ఈయన మరణించారు.

(٦٢٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ جَعَلَ الْبَيْتَ عَن يَسَارِهِ، وَمِنًى عَنْ يَمِيْنِهِ، وَرَمَى الْجَمْرَةَ بِسَبْعِ حَصِيَاتٍ، وَقَالَ: هَٰذَا مَقَامُ الَّذِي أُنْزِلَتْ عَلَيْهِ سُوْرَةُ الْبَقَرَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

627. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) వివరించారు: తాను, బైతుల్లాహ్ తన ఎడమ ప్రక్కకు, మినా కుడి ప్రక్కకు ఉండేటట్లు నిలబడి 'జమ్రా'పై ఏడు సార్లు రాళ్లు రువ్వారు. ఆయనిలా అన్నారు: ఆయన (స) ఇక్కడ నిలబడి ఉండగా ఆయన (స) పై బఖరా సూరా అవతరించింది . (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అంటే; బఖరా సూరాలోని హజ్ క్రియలకు సంబంధించిన ఆదేశాలు చాలా వరకు ఈ స్థలంలోనే అవతరించాయని భావం. హజ్ క్రియలు శాశ్వత ప్రాతిపదికగలవనీ, వాటిలో మార్పులు చేర్పులకు ఆస్కారం ఎంతమాత్రం లేదని ఈ హదీసు అంతరార్థం.

(٦٢٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَمَى رَسُولُ اللهِ ﷺ الْجَمْرَةَ يَوْمَ النَّحْرِ ضُحًى، وَأَمَّا بَعْدَ ذٰلِكَ، فَإِذَا زَالَتِ الشَّمْسُ. رَوَاهُ مُسْلِمٌ.

628. హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ రోజు చాష్త్ సమయాన జమ్రాపై కంకర రాళ్లు రువ్వారు. మరునాడు పొద్దువాలిన మీదట రువ్వారు." (ముస్లిం)

**సారాంశం**

మొదటిరోజు పొద్దు వాలకముందే రాళ్లు రువ్వాలి. మిగిలిన దినాలలో పొద్దు వాలిన తరువాతే రువ్వాలి. ఒకవేళ 10వ తేదీన పొద్దువాలక ముందు రాళ్లు రువ్వలేకపోతే, ఆ రోజే పొద్దువాలిన తరువాత రువ్వాలి.

(٦٢٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ كَانَ يَرْمِيْ الْجَمْرَةَ الدُّنْيَا بِسَبْعِ حَصَيَاتٍ، يُكَبِّرُ عَلَى إِثْرِ كُلِّ حَصَاةٍ، ثُمَّ يَتَقَدَّمُ، ثُمَّ يُسْهِلُ، فَيَقُومُ، فَيَسْتَقْبِلُ الْقِبْلَةَ،

629. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం ఆయన అన్నిటికన్నా ముందు దగ్గరలో వున్న జమ్రాపై ఏడు రాళ్లు రువ్వే వారు. ప్రతిసారీ రాయి రువ్వేటప్పుడు తక్బీర్ పలికేవారు. తరువాత ముందుకు పోయి మైదానంలో నిలబడేవారు. ఖిబ్లా వైపునకు అభిముఖమై సుదీర్ఘ సమయం ఖియామ్ చేసేవారు. చేతు

فَيَقُومُ طَوِيلاً، وَيَدْعُو، فَيَرْفَعُ يَدَيْهِ، ثُمَّ يَرْمِي الْوُسْطَى، ثُمَّ يَأْخُذُ ذَاتَ الشِّمَالِ، فَيُسْهِلُ، وَيَقُومُ مُسْتَقْبِلَ الْقِبْلَةِ، ثُمَّ يَدْعُو، فَيَرْفَعُ يَدَيْهِ، وَيَقُومُ طَوِيلاً، ثُمَّ يَرْمِي جَمْرَةَ ذَاتِ الْعَقَبَةِ، مِنْ بَطْنِ الْوَادِي، وَلاَ يَقِفُ عِنْدَهَا، ثُمَّ يَنْصَرِفُ، فَيَقُولُ: هٰكَذَا رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَفْعَلُهُ. رَوَاهُ الْبُخَارِيُّ.

లెత్తి దుఆ చేసేవారు. తరువాత మధ్య లో వున్న జ(మ్రా)పై రాళ్లు రువ్వేవారు. తరువాత ఎడమవైపునకు వెళ్లేవారు. ఆ తరువాత మైదానంలోకి వచ్చి, ఖిబ్లా వైపునకు తిరిగి నిలబడేవారు. ఆ పైన చేతులెత్తి ప్రార్థించేవారు. అలా చాలా సేపు నిలబడి ఉండేవారు. ఆ తరువాత లోయ దిగువ వైపునుంచి జమ్రా అఖబాపై కంకరరాళ్లు రువ్వేవారు. అక్కడ మాత్రం నిలబడి ఉండక తిరిగి వచ్చేసేవారు. తాను దైవప్రవక్త (సఅసం) ఈ విధంగానే ఆచరించగా చూశానని ఇబ్నె ఉమర్ (రజి) చెప్పారు. (బుఖారీ)

**సారాంశం.**

జమ్రాపై రాళ్లు రువ్వే సమయంలో దైవప్రవక్త (సఅసం) అక్కడే నిలబడి ఉండేవారు కాదనీ, అక్కడినుంచి మైదాన ప్రాంతంలోనికి నడచివచ్చి, ఖిబ్లా వైపునకు తిరిగి ఎంతో నింపాదిగా దుఆ చేసేవారని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. కాబట్టి హజ్ యాత్రికులు రాళ్లు రువ్వే సమయంలో అందరూ ఒకేచోట గుమికూడక విశాలమైన మైదానంలోకి తిరిగి రావాలి. ప్రశాంతంగా చేతులెత్తి దైవాన్ని వేడుకోవాలి. ఇలా చేయటం వల్ల తొక్కిసలాట నుండి తమను రక్షించుకున్నట్లూ అవుతుంది.

(٦٣٠) وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**اللّٰهُمَّ ارْحَمِ الْمُحَلِّقِينَ**»، قَالُوا: وَالْمُقَصِّرِينَ، يَا رَسُولَ اللهِ! قَالَ فِي الثَّالِثَةِ: «**وَالْمُقَصِّرِينَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

630. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రార్థించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "దేవా! శిరో ముండనం చేయించుకున్న హాజీలపై దయజూపు." సహచరులు ఇది విని, 'ఓ దైవప్రవక్తా (సఅసం)! జుత్తు కత్తిరించుకునే వారిపై కూడానా?' అని సందేహపడగా, "జుత్తు కత్తిరించుకునేవారిపై కూడా" అని దైవప్రవక్త (స) మూడోసారి అన్నారు. (బుఖారీ, ముస్లిం)

631. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఒకచోట నిలుచున్నారు. సహచరులు ఆయన ఎదుట ధర్మసందేహాలు వెలిబుచ్చుతున్నారు. నాకు తెలీక ఖుర్బానీ ఇవ్వక ముందే శిరోముండనం చేయించుకున్నానని ఎవరో అన్నారు. "ఫరవాలేదు. ఇప్పుడు ఖుర్బానీ ఇవ్వు" అని ఆయన (స) సమాధానమిచ్చారు. తాను తెలీక కంకరరాళ్లు రువ్వకముందే ఖుర్బానీ ఇచ్చానని మరో వ్యక్తి విన్నవించుకోగా, "ఫరవాలేదు. ఇప్పుడు రాళ్లు రువ్వవచ్చు" అని ఆయన (స) సందేహ నివృత్తి చేశారు. ఆ రోజు ఆయన (స) ముందు పలువురు, ముందు చేయవలసింది వెనుక, వెనుక చేయవలసింది ముందు చేసినట్టు తమ పొరపాట్లను వెలిబుచ్చసాగారు. అందరికీ ఆయన (స) "ఏమీ ఫరవాలేదు. ఇప్పుడు వెళ్ళి సరిదిద్దుకోండి" అని చెప్పసాగారు.

(బుఖారీ, ముస్లిం)

(٦٣١) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ وَقَفَ فِي حَجَّةِ الْوَدَاعِ، فَجَعَلُوا يَسْأَلُونَهُ، فَقَالَ رَجُلٌ: لَمْ أَشْعُرْ، فَحَلَقْتُ قَبْلَ أَنْ أَذْبَحَ، قَالَ: «**اذْبَحْ وَلاَ حَرَجَ**»، وَجَاءَ آخَرُ فَقَالَ: لَمْ أَشْعُرْ، فَنَحَرْتُ قَبْلَ أَنْ أَرْمِيَ، قَالَ: «**ارْمِ وَلاَ حَرَجَ**»، فَمَا سُئِلَ يَوْمَئِذٍ عَنْ شَيْءٍ قُدِّمَ وَلاَ أُخِّرَ إِلاَّ قَالَ: «**افْعَلْ وَلاَ حَرَجَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

632. హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్రమ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా క్షవరం చేయించుకోకముందే ఖుర్బానీ ఇచ్చారు. తన సహచరులకు కూడా ఈ మేరకు ఆజ్ఞాపించారు. (బుఖారీ)

(٦٣٢) وَعَنِ الْمِسْوَرِ بْنِ مَخْرَمَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَحَرَ قَبْلَ أَنْ يَحْلِقَ، وَأَمَرَ أَصْحَابَهُ بِذٰلِكَ. رَوَاهُ الْبُخَارِيُّ.

**హదీసు ఉల్లేఖకులు**

మిస్వర్ బిన్ మఖ్రమ (రజి). శ్రీమంతులు. హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యోదంతం తరువాత మక్కాకు మకాం మార్చారు. యజీద్ బిన్ముఆవియ హిజ్రీ 64లో మక్కాను ముట్టడించినపుడు ఆయన నమాజ్ చేస్తూ ఉండగా అగ్ని గోళం లాంటి ఒక ఆయుధం వచ్చి తగిలింది. ఈ గాయం తోనే ఆయన మరణించారు.

(٦٣٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا رَمَيْتُمْ وَحَلَقْتُمْ، فَقَدْ حَلَّ لَكُمُ الطِّيبُ، وَكُلُّ شَيْءٍ، إِلاَّ النِّسَاءَ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَفِيْ إِسْنَادِهِ ضَعْفٌ.

633. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు : "కంకరరాళ్లు రువ్వి, క్షవరం చేయించుకున్న తరువాత ఒక్క భార్యలు తప్ప - సువాసన మరియు ప్రతిదీ మీ కొరకు ధర్మ సమ్మతం అయిపోయాయి." (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు- దీని పరంపర కొంత బలహీనంగా ఉంది)

(٦٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لَيْسَ عَلَى النِّسَاءِ حَلْقٌ، وَإِنَّمَا عَلَى النِّسَاءِ التَّقْصِيرُ». رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

634. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "స్త్రీలు శిరో ముండనం చేయరాదు. వారు (కొన్ని) శిరోజాలు కత్తిరించుకుంటే సరిపో తుంది." (అబూ దావూద్ దీనిని ప్రమాణ బద్ధమైన ఆధారాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

స్త్రీలు తలను పూర్తిగా గొరిగించుకోవలసిన అవసరం లేదని, వారు శిరోజాలు (కొన్ని) కత్తిరిస్తే సరిపోతుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ధర్మవేత్తలంతా ఈ విషయమై ఏకీభవించారు.

(٦٣٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ الْعَبَّاسَ بْنَ عَبْدِ الْمُطَّلِبِ

635. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : 'మినా'లో గడపవలసిన రాత్రు లను మక్కాలో గడుపుతాననీ, తద్వారా

اسْتَأْذَنَ رَسُولَ اللهِ ﷺ أَن يَبِيْتَ بِمَكَّةَ لَيَالِيَ مِنًى، مِنْ أَجْلِ سِقَايَتِهِ، فَأَذِنَ لَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

(హాజీలకు) జమ్ జమ్ జలం త్రాపేందుకు వీలుకలుగుతుందని అబ్బాస్ బిన్ ముత్తలిబ్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను విన్నవించుకోగా, అందుకు ఆయన (స) అనుమతిని ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం)

(٦٣٦) وَعَنْ عَاصِمِ بْنِ عَدِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَرْخَصَ لِرُعَاةِ الْإِبِلِ فِي الْبَيْتُوتَةِ عَنْ مِنًى، يَرْمُونَ يَوْمَ النَّحْرِ، ثُمَّ يَرْمُونَ الْغَدَ وَمِنْ بَعْدِ الْغَدِ لِيَوْمَيْنِ، ثُمَّ يَرْمُونَ يَومَ النَّفْرِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

636. హజ్రత్ ఆసిమ్ బిన్ అదీ (రజి) కథనం : ఒంటె కాపరులకు 'మినా' పరిధి వెలుపల రాత్రి గడపటానికి దైవ ప్రవక్త (సఅసం) అనుమతినిచ్చారు. ఖుర్బానీ ఇచ్చే రోజున కంకరరాళ్లు రువ్వటానికి, రెండో రోజు, మూడో రోజు కూడా రువ్వడానికి, అక్కడినుంచి వెళ్ళి పోయే రోజున కూడా రాళ్లు రువ్వడానికి వారికి (ప్రత్యేక) అనుమతి నొసగారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**హదీసు ఉల్లేఖకులు**

ఆసిమ్ బిన్ అదీ (రజి). ఈయన మారుపేరు అబూ ఉబైద్ లేక అబూ అమ్ర్. బనూ ఉబైద్ బిన్ జైద్‌కు మద్దతుదారులు. బద్ర్ యుద్ధంలో, ఆ తర్వాతి యుద్ధాలలో కూడా పాల్గొన్నారు. బద్ర్ యుద్ధ సందర్భంగా ఈయన ఆలియా తెగలకు 'అమీర్'గా వ్యవహరించారని కూడా చెప్పబడుతోంది. హిజ్రీ 45లో మరణించారు. యమామ యుద్ధంలో వీర మరణం పొందారనీ, అప్పటికి ఆయన వయస్సు 120 సంవత్సరాలనీ మరో కథనం.

(٦٣٧) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: خَطَبَنَا رَسُولُ اللهِ ﷺ يَوْمَ النَّحْرِ، اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

637. హజ్రత్ అబూబక్రా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ ఇచ్చే రోజు ప్రసంగించారు. మరి హదీసునంతటినీ ఆయన వివరించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

హజ్ జరుగుతున్న రోజుల్లో దైవప్రవక్త (స) అనేక ఉపన్యాసాలిచ్చారు. మాలికీ, హనఫీ ధర్మవేత్తల ప్రకారం జిల్ హజ్ 7వ తేదీన ఒక ప్రసంగం, అరఫాత్ మైదానంలో రెండవ ప్రసంగం, 11వ తేదీన మూడవ ప్రసంగం ఉంది. ఖుర్బానీ రోజున చేసిన ప్రసంగాన్ని హనఫీలు, మాలికీలు ప్రసంగంగా పరిగణించరు. దాన్ని కేవలం హితోపదేశంగా మాత్రమే భావిస్తారు. మరి కొంతమంది ధర్మవేత్తలు దీనిని సయితం ప్రసంగంగా తలంచారు. ఈ విధంగా వారి లెక్క ప్రకారం నాలుగు ప్రసంగాలవుతాయి.

(٦٣٨) وَعَنْ سَرَّاءَ بِنْتِ نَبْهَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: خَطَبَنَا رَسُولُ اللّٰهِ ﷺ يَوْمَ الرُّءُوسِ فَقَالَ: «أَلَيْسَ هَذَا أَوْسَطَ أَيَّامِ التَّشْرِيقِ؟» الْحَدِيثَ. رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

638. హజ్రత్ సర్రా బిన్తె నబ్హాన్ (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సఅసం) త్యాగోత్సవం నాడు మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగించారు. "ఏమిటీ? ఈ రోజు తష్రీఖ్ దినాలలోని మధ్య దినం కాదా?" అని ఆయన ఆ సందర్భంగా ప్రశ్నించారు. (దీనిని అబూదావూద్ ప్రమాణబద్ధమైన ఆధారాలతో ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

సర్రా బిన్తె నబ్హాన్ (ర.అన్హా). ఘనావియా తెగకు చెందిన మహిళ. దైవప్రవక్త (స) ప్రత్యక్ష సహచరురాలు (సహాబియా). రబీయ బిన్ అబ్దుర్రహ్మాన్ ఈమె నుండి హదీసును గ్రహించారు.

(٦٣٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهَا: «طَوَافُكِ بِالْبَيْتِ، وَسَعْيُكِ بَيْنَ الصَّفَا وَالْمَرْوَةِ، يَكْفِيكِ لِحَجِّكِ وَعُمْرَتِكِ». رَوَاهُ مُسْلِمٌ.

639. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఆమెనుద్దేశ్యించి ఇలా అన్నారు - "నీవు కాబా గృహ ప్రదక్షిణ చేసి, సఫా - మర్వాల మధ్య సయీ చేస్తే చాలు, నీ హజ్ మరియు ఉమ్రాలు నెరవేరుతాయి." (ముస్లిం)

### సారాంశం

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉమ్రా నిమిత్తం 'తల్బియా' పలికారు. కాని కాబా గృహాన్ని సమీపించకముందే బహిష్టు అయ్యారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆమెనుద్దేశ్యించి, "ఉమ్రాను వదలిపెట్టు. హజ్ కోసం (తరువాత) ఇహ్రామ్ దీక్షబూను" అని సలహా ఇచ్చారు. ఆ సందర్భంగా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) సహజంగానే కించిత్ నిరాశకు గురయ్యారు. దైవప్రవక్త (స) ఆమెను ఓదార్చే ధోరణిలో పై హదీసులోని మాటలన్నారు.

(٦٤٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ لَمْ يَرْمُلْ فِي السَّبْعِ الَّذِيْ أَفَاضَ فِيْهِ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

640. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తిరుగు ప్రయాణం సందర్భం గా కడసారి చేసిన తవాఫ్ (ప్రదక్షిణ)లో ఏడు రౌండ్లు తిరిగారు. కాని ఏ ఒక్క రౌండులో కూడా 'రమల్' చేయలేదు. (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమయిన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

'రమల్' అంటే వేగంగా నడవటం అని అర్థం. తొలిసారి 'తవాఫ్'లో మాత్రమే 'రమల్' ఉంటుంది. 'తవాఫె విదా'లోగానీ, 'తవాఫె ఇఫాజా'లోగానీ 'రమల్' ఉండదు.

'రమల్' కేవలం పురుషులకు మాత్రమే ప్రత్యేకం. ఇది స్త్రీలకు వర్తించదు. ఒకవేళ ఎవరయినా తొలిసారి తవాఫ్‌లో రమల్ చేయటం మరచిపోతే, మలిసారి తవాఫ్‌లో దాన్ని నెరవేర్చ వచ్చు.

(٦٤١) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ وَالْمَغْرِبَ وَالْعِشَاءَ، ثُمَّ رَقَدَ رَقْدَةً بِالْمُحَصَّبِ، ثُمَّ رَكِبَ إِلَى الْبَيْتِ، فَطَافَ بِهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

641. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం) నిర్ణీత సమయాలలో (క్రమం ప్రకారం) జుహ్ర్ మరియు అస్ర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజులు చేశారు. 'ముహస్సబ్' స్థలంలో కాస్సేపు నిద్రపోయారు. తరువాత స్వారీ అయి బైతుల్లాహ్ వైపునకు వెళ్ళారు. తవాఫ్ చేశారు." (బుఖారీ)

**సారాంశం**

హజ్ ముగించుకుని తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్నప్పుడు చేసిన తవాఫ్ (తవాఫె విదా)ఇది. 'ముహస్సబ్' అనే స్థలం రెండు పర్వతాల మధ్య ఉంది. ఇది మక్కానుండి మినాకు గల దూరం కన్నా తక్కువే.

(٦٤٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّهَا لَمْ تَكُنْ تَفْعَلُ ذٰلِكَ - أَيِ النُّزُوْلَ

642. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) 'అబ్తహ్'లోయలో ఆగేవారు కాదు. దైవప్రవక్త (సఅసం) ఇక్కడ విడిది చేయ

بالأَبْطحِ - وَتَقُولُ: إِنَّمَا نَزَلَهُ رَسُولُ اللهِ ﷺ لِأَنَّهُ كَانَ مَنْزِلاً أَسْمَحَ لِخُرُوجِهِ. رَوَاهُ مُسْلِمٌ.

టానికి కారణం తిరుగు ప్రయాణంలో సౌలభ్యం చేకూరాలన్నది తప్ప మరేమీ కాదని ఆమె (ర.అన్హా) అంటూ ఉండే వారు. (ముస్లిం)

(٦٤٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أُمِرَ النَّاسُ أَن يَكُونَ آخِرُ عَهْدِهِمْ بِالْبَيْتِ، إِلاَّ أَنَّهُ خُفِّفَ عَنِ الْحَائِضِ. مُتَّفَقٌ عَلَيْهِ.

643. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ప్రజలకు ఇలా ఆజ్ఞాపించారు - "అన్నింటికన్నా ఆఖరిలో మీరు చేయవలసిన పని కాబా గృహ ప్రదక్షిణ. అయితే రుతుస్రావానికి గురై వున్న స్త్రీల కొరకు ఇది మినహాయించబడింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇది తవాఫె విదా (వీడ్కోలు ప్రదక్షిణ) కు సంబంధించిన ఆజ్ఞ. హజ్ క్రియలన్నింటినీ నెరవేర్చి తిరిగి వచ్చే సమయంలో ఈ ప్రదక్షిణ చేయబడుతుంది. ఒక్క ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) తప్ప మిగిలిన ఇమాములందరి దృష్టిలో ఇది వాజిబ్ (తప్పనిసరి). ఒకవేళ ఏ కారణంగానయినా దీన్ని నెరవేర్చలేకపోతే పరిహారం (దమ్)గా ఒక మేకను ఇవ్వవలసి ఉంటుంది. అయితే బహిష్టు స్త్రీలకు ఇది వర్తించదు.

(٦٤٤) وَعَنِ ابْنِ الزُّبَيْرِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «صَلاَةٌ فِي مَسْجِدِي هَذَا، أَفْضَلُ مِنْ أَلْفِ صَلاَةٍ فِيمَا سِوَاهُ، إِلاَّ الْمَسْجِدَ الْحَرَامَ، وَصَلاَةٌ فِي الْمَسْجِدِ الْحَرَامِ، أَفْضَلُ مِنْ صَلاَةٍ فِي مَسْجِدِي هَذَا بِمِائَةِ صَلاَةٍ». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

644. హజ్రత్ ఇబ్నె జుబైర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "నా ఈ మస్జిదులో చేసిన ఒక నమాజ్‌కు లభించే పుణ్యం ఇతర మస్జిదులలో చేసే నమాజ్‌కు లభించే పుణ్యంకన్నా వెయ్యిరెట్లు అధికం. ఇక మస్జిదె హరామ్ మాటే వేరు. మస్జిదె హరామ్‌లో చేసిన ఒక నమాజ్ నా ఈ మస్జిదులో చేసిన నూరు నమాజులకన్నా శ్రేష్ఠమయినది." (అహ్మద్ దీనిని ఉల్లేఖించారు- ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసులో మస్జిదె నబవీ మరియు బైతుల్లాహ్‌లలో చేసే నమాజ్ యొక్క మహత్తు గురించి చెప్పబడింది. 'నా ఈ మస్జిద్' అని దైవప్రవక్త (స) అన్నారు. అంటే 'మస్జిదె నబవీ' అని దీని భావం.

'మస్జిదె అఖ్సా'లో చేసే ఒక నమాజ్ ఇతర మస్జిదులలో చేసే 500 నమాజులకు సమానమని 'తబ్రానీ'లోని ఒక ఉల్లేఖనంలో ఉంది. మస్జిదె నబవీలో చేసే ఒక నమాజ్‌కు ప్రాప్తమయ్యే పుణ్యఫలం వెయ్యి సాధారణ నమాజులకు సమానం. అలాగే మస్జిదె హరామ్‌లో చేసే ఒక నమాజ్ ఇతర మస్జిదులలో చేసే లక్ష నమాజులకు సమానం.

### హదీసు ఉల్లేఖకులు

ఇబ్నె జుబైర్ (రజి). అసలు పేరు అబ్దుల్లాహ్. మారుపేరు అబూబకర్. పూర్తి వంశపరంపర ఇలా వుంది - అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ బిన్ అవ్వామ్. ఖురైష్‌తో అనుబంధమున్న అసద్ తెగకు చెందినవారు. ఈయన తల్లి అస్మా బిన్తె అబూబకర్ (ర.అన్‌హా) హిజ్రత్ సమయంలో గర్భవతిగా ఉన్నారు. 'ఖుబా' వద్దకు చేరుకునేసరికి ఇబ్నె జుబైర్ (రజి) జన్మించారు. హిజ్రత్ తరువాత ముస్లిం సమాజంలో జన్మించిన తొలి శిశువు ఈయనే. ఈయన అత్యధికంగా ఉపవాసాలు పాటించేవారు. ఎక్కువ సమయం దైవారాధనలో గడిపేవారు. మంచి శరీర సౌష్ఠవం కలవారు. వాక్చాతుర్యం గలవారు. సత్యప్రేమికులు. ఆత్మీయుల అగత్య స్థితిని అర్థం చేసుకునేవారు. హిజ్రీ 64లో యజీద్ బిన్ ముఆవియ మరణానంతరం ఈయన చేతిపై ప్రమాణం (బైత్) చేయటం జరిగింది. హిజాజ్, ఇరాక్, యమన్, ఈజిప్టు, సిరియాలోని అధికాంశ భాగంపై ఈయన పట్టు సంపాదించారు. హజ్జాజ్ బిన్ యూసుఫ్ సఖఫీ మక్కాలో ఈయన్ని దిగ్బంధం చేసి హిజ్రీ 73లో నిర్దాక్షిణ్యంగా ఉరివేసి చంపాడు.

### 6వ అధ్యాయం

## హజ్‌ను కోల్పోయినవారు, ఆపబడినవారు

## ٦ - بَابُ الفَوَاتِ وَالإِحْصَارِ

645. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను కాబాగృహం వరకూ చేర కుండా ఆపటం జరిగింది. ఆయన (స) శిరోముండనం చేయించుకున్నారు. తన సతీమణులతో లైంగిక సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఖుర్బానీ (జంతు

(٦٤٥) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُما قَال: قَدْ أُحْصِرَ رَسُولُ اللّٰهِ ﷺ، فَحَلَقَ رَأْسَهُ، وَجَامَعَ نِسَاءَهُ، وَنَحَرَ هَدْيَهُ،

حَتَّى اعْتَمَرَ عَاماً قَابِلاً. رَوَاهُ الْبُخَارِيُّ.

వును బలి)ఇచ్చారు. మళ్లీ వచ్చే సంవత్సరం ఆయన (స) ఉమ్రా చేశారు.

(బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసు హుదైబియా ఒప్పందాన్ని సూచిస్తోంది. హిజ్రీ 6వ సంవత్సరంలో దైవప్రవక్త (సఅసం) ఇహ్రామ్ కట్టుకుని తన సహచరుల వెంట హజ్ కోసం బయలుదేరారు. హుదైబియా వద్ద ముష్రిక్కులు అడ్డుకుని, ముందుకు వెళ్లనివ్వలేదు. ఆయన (స) అక్కడే 'ఇహ్రామ్' ను విడువవలసివచ్చింది. హుదైబియాలోనే ఖుర్బానీ ఇచ్చి క్షవరం చేయించుకున్నారు. ప్రవక్త సహచరులు కాస్సేపు తటపటాయించి, ఆ తరువాత ఇహ్రామ్ దీక్షను విరమించారు. తమ వద్ద వున్న జంతువులను ఖుర్బానీ ఇచ్చారు.

దీనినే 'ఇహ్సార్' అంటారు. ఇహ్సార్ అంటే అడ్డురావటం, నిలువరించటం, ముట్టడించటం, ఆటంకం సృష్టించటం అన్న అర్థాలు వస్తాయి. హజ్ యాత్రకు బయలుదేరిన వారిని దారిలో శత్రువులు అటకాయించి, హజ్ చేయకుండా అవరోధాలు సృష్టిస్తే అప్పుడేం చేయాలి? నిలువరించబడిన చోటే వారు తమ 'ఇహ్రామ్'ను విడువాలి. అయితే 'ఖుర్బానీ' ఎక్కడ ఇవ్వాలన్న విషయంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇహ్రామ్‌ను విడిచిన చోటే ఖుర్బానీ ఇవ్వాలని అధికసంఖ్యాక పండితులు అభిప్రాయపడ్డారు. కాని హనఫీ ధర్మవేత్తల దృష్టిలో హరమ్ పరిధిలోనే ఖుర్బానీ ఇవ్వాలి. ఎవరిద్వారానయినా ఖుర్బానీ జంతువును హరమ్‌కు పంపించాలి. అలా వీలుపడకపోతే మాత్రం ఆపబడిన చోటే ఖుర్బానీ ఇవ్వవచ్చు.

ఇక హజ్ నుండి ఆపబడిన వ్యక్తిపై ఖుర్బానీ వాజిబ్ (తప్పనిసరి) అవుతుందా? లేదా? అన్నది మరో ప్రశ్న. చాలామంది ధర్మవేత్తలు 'అవున'ంటారు. ఇమామ్ మాలిక్ మాత్రం తప్పనిసరి (వాజిబ్) కాదని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, హుదైబియాలో నిలువరించబడినపుడు ప్రవక్త సహచరులందరివద్దా ఖుర్బానీ జంతువులు లేవనీ, ఒకవేళ ఖుర్బానీ వాజిబ్ అయివుంటే అందరికోసం వాజిబ్ అయివుండేదికదా! అని ఆయన వాదించారు.

(٦٤٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ النَّبِيُّ ﷺ عَلَى ضُبَاعَةَ بِنْتِ الزُّبَيْرِ بْنِ عَبْدِ الْمُطَّلِبِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، فَقَالَتْ: يَا رَسُولَ اللّٰهِ! إِنِّي أُرِيدُ الْحَجَّ، وَأَنَا شَاكِيَةٌ، فَقَالَ النَّبِيُّ ﷺ: «حُجِّي وَاشْتَرِطِي أَنَّ مَحِلِّي حَيْثُ حَبَسْتَنِي». مُتَّفَقٌ عَلَيْهِ.

646. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుబాఅ బిన్తె జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర.అన్హా) ఇంటికి వెళ్ళగా, 'దైవప్రవక్తా (స)! నాకు హజ్ చేయాలని వుంది. కాని నేను వ్యాధిగ్రస్తురాలిని' అని ఆమె విన్నవించుకున్నది. దానికి ఆయన (స) ఇలా సలహా ఇచ్చారు - "హజ్ చెయ్యి. అయితే దేవా! నీవు నన్ను ఆపిన చోటే నేను 'ఇహ్రామ్' దీక్షను విరమిస్తాను అని షరతుపెట్టుకో."

(ముస్లిం)

### హదీసు ఉల్లేఖకులు

జుబాఅ బిన్తె జుబైర్ (ర.అన్హా). మారుపేరు ఉమ్మె హకీమ్! వంశపరంపర ఈ విధంగా ఉంది: జుబాఅ బిన్తె జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ బిన్ అబ్దె మునాఫ్. ఈమె దైవప్రవక్త (సఅసం) బాబాయి కూతురు. మిఖ్దాద్ బిన్ అస్వద్ భార్య. ఈమెకు అబ్దుల్లాహ్, కరీమా అనే ఇద్దరు పిల్లలున్నారు. హజ్రత్ అలీ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈమె మరణించారు.

(٦٤٧) وَعَنْ عِكْرِمَةَ عَنِ الْحَجَّاجِ ابْنِ عَمْرٍو الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ كُسِرَ أَوْ عَرِجَ فَقَدْ حَلَّ، وَعَلَيْهِ الْحَجُّ مِنْ قَابِلٍ»، قَالَ عِكْرِمَةُ: فَسَأَلْتُ ابْنَ عَبَّاسٍ وَأَبَا هُرَيْرَةَ عَنْ ذٰلِكَ، فَقَالَا: صَدَقَ. رَوَاهُ الْخَمْسَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ.

647. హజ్రత్ ఇక్రిమ (రహ్మ.లై) హజ్జాజ్ బిన్ అమ్ర్ అన్సారీ (రజి) ఆధారంగా చేసిన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "కాలు విరగ్గొట్టబడిన వాడు లేదా కుంటివాడైపోయినవాడు 'ఇహ్రామ్' స్థితినుండి బయటపడి పోయాడు. వచ్చే సంవత్సరం అతడు హజ్ చేయటం అనివార్యం." - ఇక్రిమ ఇలా తెలిపారు: దీనిగురించి నేను హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి)ను, అబూ హురైర (రజి)ను దర్యాప్తు చేయగా, "హజ్జాజ్ బిన్ అమ్ర్ నిజం చెప్పాడు" అని వారన్నారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు- తిర్మిజీ దీనిని ప్రమాణబద్ధమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

గత మూడు హదీసుల ద్వారా బోధపడేదేమిటంటే హజ్ కొరకు ఇహ్రామ్ దీక్షబూనిన వ్యక్తి మూడు కారణాల దృష్ట్యా ఇహ్రామ్‌ను విరమించగలడు. (1) ముట్టడించబడినందువల్ల లేదా నిలువరించబడినందువల్ల - ఈ ముట్టడి ఏ కారణంతో జరిగినాసరే. (2) ఫలానా పరిస్థితి ఎదురైతే నేను ఇహ్రామ్‌ను పరిత్యజిస్తానని ముందునుంచే సంకల్పం చేసుకుని (షరతు పెట్టుకుని) ఉండటం వల్ల. (3) ఏదైనా ప్రమాదానికి గురై కాలికి గాయమవటం వల్ల.

### హదీసు ఉల్లేఖకులు

(1) ఇక్రిమ (రహ్మ.లై). మారుపేరు అబూ అబ్దుల్లాహ్. ఈయన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) గారి బానిస. బర్బర్ తెగకు చెందినవారు. పెద్ద పండితుల కోవకు చెందినవారు. మక్కాకు

చెందిన 'ఫుకహా' (ధర్మవేత్తల)లో ఒకరుగా పరిగణించబడేవారు. తాబయీల మధ్యతరానికి చెందిన వారు. హిజ్రీ 107లో సరిగ్గా 80 సంవత్సరాల వయస్సులో మరణించారు.

(2) హజ్జాజ్ బిన్ అమ్ర్ అన్సారీ (రజి) : పూర్తి పరంపర ఇలా వుంది - హజ్జాజ్ బిన్ అమ్ర్ బిన్ గజియ అన్సారీ మాజినీ మదనీ. ప్రవక్త సహచరులలో ఒకరు. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) వెంట ఉన్నారు. ఈయన రెండు హదీసులను ఉల్లేఖించారు. వాటిలో ఈ హదీసు ఒకటి.

## తుది పలుకులు

"బులూగుల్ మరామ్" మొదటి భాగం దీంతో సమాప్తమయిందని రచయిత హాఫిజుల్ అస్ర్, ఖాజియుల్ ఖుజాత్ (ఛీఫ్ జస్టిస్) అబుల్ ఫజల్ అహ్మద్ బిన్ అలీ బిన్ హజర్ అల్ కినానీ అల్ అస్ఖలానీ మిస్రీ తెలిపారు. కారుణ్యప్రభువైన అల్లాహ్ ఆయన మేళ్లను కలకాలం సజీవంగా ఉంచుగాక! హిజ్రీ 827 రబీవుల్ అవ్వల్ 12వ తేదీన ఈ పనిని ముగించాననీ, రెండవ భాగం 'వాణిజ్య పుస్తకం' నుండి మొదలవుతుందనీ ఆయన తెలియజేశారు. అల్లాహ్ ఈ రచయితను, ఆయన తల్లిదండ్రులనూ, సమస్త ముస్లిములనూ తన కారుణ్య ఛాయలోకి తీసుకోవాలని ప్రార్థన. మనకు అల్లాహ్‌యే చాలు. ఆయనే అత్యుత్తమ కార్యసాధకుడు!